ఎమెస్కో

# భారతీయ వ్యక్తిత్వ వికాసము

కస్తూరి మురళీకృష్ణ



# భారతీయ వ్యక్తిత్వవికాసం

కస్తూరి మురళీకృష్ణ

ఎమెస్కో

**భారతీయ వ్యక్తిత్వవికాసం**
కస్తూరి మురళీకృష్ణ

సంపాదకులు
**డా॥ డి.చంద్రశేఖరరెడ్డి**

సహాయ సంపాదకులు
**డా॥ తిరుమల నీరజ**

ముద్రణ
**జూన్, 2010**

మూల్యం : **రూ 150/-**

కవర్ పేజి
**జి.పి. కుమార్**

ప్రింటర్స్
**సాయి లిఖిత ప్రింటర్స్**
హైదరాబాద్.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500 029.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

పంపిణీదారులు
**సాహితి ప్రచురణలు**
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ - 2.
ఫోన్ : 0866-2436643
0866-6460633

# పరిచయం

*కిమస్థిమాలాం కిము కౌస్తుభం వా*
*పరిష్క్రియాయాం బహుమన్యసే త్వం?*
*కిం కాలకూటః కిము వా యశోదా*
*స్తన్యం తవ స్వాదు వద ప్రభో మే!*

భక్తుడు, భగవంతుడిని వినమ్రంగా అడుగుతున్న సందేహమిది. భారతీయ జీవనవిధానంలో వ్యక్తిత్వప్రాధాన్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పే పద్యమిది. భారతరచనారంభంలో తిక్కన బుద్ధిపూర్వకంగా చేసిన చమత్కారం ఇది.

భగవంతుడికి ఎముకల దండ అంటే ఇష్టమా? కౌస్తుభమణి అంటే ఇష్టమా? కాలకూటవిషం రుచా? లేక యశోదా చనుబాలు తీపా? ఇదీ ప్రశ్న.

ఇది అడగవలసిన ప్రశ్న అనిపిస్తుంది. ఈ ప్రశ్నలోనే సమాధానం దాగుంది. ఆ సమాధానంలోనే సమాజాత్మను ప్రతిబింబించే ధర్మం దాగుంది. భగవంతుడు ఒక్కడే. కానీ పలువురికి పలురూపాల్లో కనిపిస్తాడు. నిజం ఒకటే. కానీ పలువురు దాన్ని పలు రకాలుగా దర్శిస్తారు.

ఈ నిజాన్ని నిరూపించేందుకు ఐదుగురు గుడ్డివాళ్ళు – ఏనుగు కథ ఉండనే ఉంది. ఐదుగురు గుడ్డివాళ్ళు చూసిందీ నిజం, చెప్పిందీ నిజమే. కానీ అదే సంపూర్ణసత్యం కాదు. కానీ సంపూర్ణసత్యం తెలియాలంటే ఆ అయిదుగురు గుడ్డివాళ్ళు చెప్పినదంతా కలిపి, వాటి ఆధారంగా మరింత ముందుకు చూడగలిగే దృష్టి ఉండాలి. కానీ ఎవరికి వారు తాము చూసిందే నిజం అన్న పట్టుదల ప్రదర్శిస్తారు. తాను గ్రహించిందే సంపూర్ణసత్యం అన్న అహంకారం చూపుతారు. దాంతో పాక్షికసత్యాలను సమన్వయం చేసి సంపూర్ణసత్యాన్ని ఆవిష్కరించే సమ్యక్‌దృష్టి. సమగ్రాలోచనలు మరుగునపడతాయి. ఈ సత్యాన్ని నిరూపిస్తుందీ పద్యం.

ఇక్కడ భగవత్స్వరూపంలోని రెండు విభిన్నపార్శ్వాల ప్రస్తావన ఉంది. ఒకరు ఆడంబరప్రియులు. మరొకరు ఆడంబరమే తెలియనివారు. ఒకరు కౌస్తుభమణి ధరిస్తే, మరొకరు ఎముకల దండను ధరిస్తారు. ఒకరు యశోద చనుబాలను ప్రీతితో ఆరగిస్తే, మరొకరు గళాన కాలకూట విషం నిలిపి లోకకల్యాణానికి నడుం కడతారు.

కౌస్తుభమణితో ఎంత ఆనందంగా ఉన్నారో, ఎముకల మాలతోనూ అంత సంతృప్తిగా ఉండగలరని నిరూపిస్తున్నారిద్దరూ. అంటే తరచి చూస్తే కౌస్తుభమణికీ, ఎముకల దండకూ తేడా లేదన్నమాట. ఆలోచించి చూస్తే కాలకూటవిషం, తల్లి చనుబాల రుచీ ఒకటేనన్న మాట.

ఇక్కడ తేడాలున్నది వస్తువులలో కాదు, వస్తువులను చూసే దృష్టిలో. ఒక వ్యక్తి తలచుకుంటే, మణిమరకతమాణిక్యాల వంటి ఐశ్వర్యం నడుమ ఎంత ఆనందంగా ఉండగలడో, స్మశానంలో, బూడిద పూసుకుని ఎముకల దండలు ధరించి కూడా అంత సంతృప్తిగా ఉండగలడు. ఎందుకంటే ఐశ్వర్యంతో తుల తూగుతున్నదీ దేవుడే. ఎముకల దండను ధరించిందీ భగవంతుడే. ఒకే భగవంతుడు ఈ తేడాలను మానవుని మనస్సుకు గ్రహింపులోకి తెచ్చేందుకు రెండు పరస్పరవిభిన్నమైన రూపాల్లో దర్శన మిస్తున్నాడు.

ఇక్కడ కౌస్తుభమణి, ఎముకల దండ కేవలం ప్రతీకలే. జీవితం ఒడిదొడుకులమయం. ఏ జీవితమూ కూడా తుఫాను తాకిళ్ళకు గురి కాకుండా ఉండదు. వడగాడ్పుల బారిన పడకుండా ఉండదు. కరకు కత్తుల వంటి చలిగాడ్పుల నుండి తప్పించుకోలేదు. అంటే, ప్రతి వ్యక్తీ తన జీవితంలో పెను తుఫానులను, భూకంపాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నమాట. అలాగని, జీవితమంతా ఒడిదొడుకులమయం కాదు. జీవనప్రయాణంలో అందమైన పూలతోటలు విరుస్తాయి. వసంతం జీవితాన్ని శోభాయమానం చేస్తుంది. తొలకరి జల్లులు జీవితాన్ని సుందరమయం చేస్తాయి. పండు వెన్నెల ప్రసరింపచేసే వెలుగులు జీవితాన్ని నందనవనం చేస్తాయి.

అంటే, జీవితం సుఖదుఃఖాల సంగమం అన్నమాట. సుఖం వచ్చినప్పుడు ఎంతగా ఆనందిస్తామో, దుఃఖం ఎదురైనప్పుడు అంత ఆనందంగా స్వీకరించాలన్న మాట. ఈ సత్యాన్ని సూచిస్తాయి కౌస్తుభమణి, ఎముకల దండ. సుఖం వచ్చినప్పుడు పొంగిపోక, దుఃఖం వచ్చినపుడు క్రుంగిపోక సమదృష్టి కలిగి ఉండాలని బోధిస్తుంది భగవద్గీత.

ప్రపంచం ఒక ఆభాస. ఇది నిజమని సుఖదుఃఖ భావనలు అనుభవించటం అజ్ఞానం. ప్రపంచం భ్రాంతి అన్న జ్ఞానంతో సుఖదుఃఖాలకు అతీతంగా ఎదిగిన వ్యక్తి జీవన్ముక్తుడౌతాడంటుంది వేదాంతం. అంటే, సత్యం ఒకటే, పలువురు దాన్ని పలురకాలుగా దర్శిస్తారన్నా, ఒకే దేవుడు పలు రూపాల్లో కనిపిస్తాడన్నా పరమార్థం ఒకటే. ఈ పరమార్థాన్ని పౌరాణికప్రతీకల ద్వారా ప్రదర్శిస్తూ, మానవుని మనస్సు లోతులలో ఆలోచనలు కలిగిస్తూ, సామాజికస్వాస్థ్యానికి మతం, ధర్మం మానవస్వభావాల మధ్య సమన్వయసాధన ఆవశ్యకతను స్పష్టం చేస్తుంది. తిక్కన రచించిన 'కి మస్థిమాలాం' అన్న పై శ్లోకం. అంటే, ఎలాగైతే, కేవలం ఒకరి దృష్టితో సంపూర్ణసత్యం అవగతం కాదో, అలాగే ఒక వ్యక్తి వ్యక్తిత్వం సంపూర్ణంగా ఎదగటానికి ఏదో ఒక అంశం మాత్రమే దోహదపడదు. అది పలు అంశాల కలయిక వల్లనే సాధ్యమౌతుంది. ఈ నిజం మరుగున పడటంతో ఆధునికసమాజంలో వ్యక్తిత్వవికాసం విషయంలో పలు అపోహలు ఏర్పడ్డాయి. పలురకాల అసత్యప్రచారాలు అమలులో ఉన్నాయి. ఒక పుస్తకం చదవటం వల్లనో, ఒక పాఠం వినటం వల్లనో, కొన్ని కౌన్సెలింగ్ క్లాసులకు హాజరు కావటం వల్లనో, వ్యక్తి సంపూర్ణమానవుడుగా ఎదిగే వీలుంటుందన్న అపోహ ప్రచారంలో ఉంది.

కానీ వ్యక్తి నిర్మాణం ఒక రోజులో, కొన్ని క్లాసుల్లో జరిగే పని కాదు. వ్యక్తిత్వనిర్మాణం నిరంతరం అవిశ్రాంతంగా సాగే ఒక తపస్సు. వ్యక్తిత్వ నిర్మాణం అనంతంగా ప్రవహిస్తూ ఉపనదులను తనలో మిళితం చేసుకుంటూ సాగిపోయే ఒక మహానది ప్రయాణం. ఈ తపస్సును, ఈ మహానది ప్రయాణాన్ని అర్థం చేసుకున్న భారతీయమనస్తత్త్వశాస్త్రవేత్తలు ఋషుల రూపంలో వ్యక్తిత్వవికాసానికి అమోఘమైన ఔషధాల్లాంటి సూత్రాలను అందించారు. ఆ సూత్రాలను వివరిస్తూ, భారతీయజీవన విధానంలో వ్యక్తిత్వవికాసానికి సూచించిన మార్గాలను అన్వేషిస్తూ, ఆ అన్వేషణ ఫలితాలను వివరించటమే ఈ పుస్తకలక్ష్యం.

సహనావవతు.... సహనౌభునక్తు... అన్నట్టు కలసి అన్వేషిద్దాం... కలసి ఎదుగుదాం.... నూతనతీరాల వైపు కలసి సాగుదాం... ఆలోచిద్దాం... అర్థం చేసుకుందాం... విజయం సాధిద్దాం.

✣ ✣ ✣

# నాంది

*చేసిన దుష్టచేష్ట నది చెప్పక నేర్పున గప్పిపుచ్చి తా*
*మూసిన యంతటన్ బయలు ముట్టక యుండ దదెట్లు? రాగిపై*
*బూసిన బంగరున్ జెదరిపోవగడంగిన నాడు నాటికిన్*
*దాసిన రాగి గానబడదా జనులెల్ల రెఱుంగ, భాస్కరా!*

మారద వెంకయ్య రచించిన భాస్కరశతకంలోని పద్యం ఇది. ఒకప్పుడు ఈ పద్యాలు పాఠశాలల్లో పిల్లలు నేర్చేవారు. అంతకు ముందే, ఇంట్లో తల్లులు నీతిశతకాలు నేర్పించేవారు. దాంతో అనేకజీవితసత్యాలు పిల్లలకు, ఈ పోటీ ప్రపంచంలో అడుగిడే ముందే తెలిసిఉండేవి. మానవ మనస్తత్త్వం, సామాజిక మనస్తత్త్వాల పట్ల అవగాహన కలిగేది. వీటికి తోడుగా, వారు వినే పురాణకథలు, జానపద కథలు వారి ఊహాశక్తిని పెంచి, వారికి ఉత్తమాదర్శాలను అందించేవి. 'సత్య హరిశ్చంద్ర' కథ ఇచ్చిన స్ఫూర్తి, మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీని మహాత్మాగాంధీగా మార్చటం మనకందరికీ తెలుసు.

ఇక్కడ భాస్కరశతకంలోని ఈ పద్యం మనందరికీ తెలిసిన సత్యాన్నే, మరింత సరళంగా వివరిస్తోంది. రాగి మీద బంగారు పూత పూసి దాన్ని మొత్తం బంగారం అని చలామణి చేస్తే, పై పూత తొలగిపోగానే అసలు బండారం బయటపడుతుంది. కాబట్టి నీచుడు ఒక దుర్మార్గం చేసి చెప్పకుండా దాచినా, కొన్నాళ్ళకది ప్రజలకు తెలుస్తుంది అన్నది ఈ పద్యతాత్పర్యం.

మనకున్న సామెత 'నిజం నిలకడ మీద తెలుస్తుం'దన్న దాన్ని ఈ పద్యం విపులీకరిస్తోందన్నమాట. తాత్కాలికంగా ఎదుటివాడిని మోసపుచ్చ గలిగినా, ఎవరినీ ఎల్లప్పుడూ మోసపుచ్చటం జరగని పని అని అర్థం. మోసం చేసి తప్పించుకోలేనప్పుడు, ఎదుటివాడిని మోసం చేయాలని ప్రయత్నించటం వల్ల లాభమేమిటి? మోసం చేసి సాధించేదేమిటి?

అయినా సరే, తెలివైనవాడు, తెలివి లేనివాడిని మోసం చేస్తాడు. అదీ, ఎంత వరకూ, ఈ తెలివి లేనివాడికి తెలివి వచ్చేవరకూ. ఉదాహరణకు 'విజయం' అన్న పదం తీసుకుందాం. ప్రస్తుతం సమాజంలో ఒక వ్యక్తి 'విజయం సాధించా'డంటే అర్థం, ఆ వ్యక్తి బాగా డబ్బు సంపాదించాడని. ఒక వ్యక్తి 'పైకి వచ్చాడు, బాగు పడ్డాడు' అంటే అర్థం వాడు పెద్ద పదవిని సంపాదించాడనో, పెద్ద ఉద్యోగం చేస్తున్నాడనో అర్థం. ఇప్పుడు సమాజంలో 'వ్యక్తిత్వవికాసం', 'విజయం సాధించటం' పర్యాయపదాలుగా చలామణి అవుతున్నాయి.

ఒకప్పుడు అర్జునుడు స్వర్గానికి మెట్లు నిర్మించినట్టు, ఇప్పుడు మన వ్యక్తిత్వ వికాసకారులు విజయానికి మెట్లు నిర్మిస్తున్నారు. కానీ వీళ్ళు సాధించాలను కుంటున్న విషయం 'ధన సంపాదన'తో ముడిపడి ఉంది.

ఒక్కసారి మనం చరిత్రను పరిశీలించి, మనం ఎంతో గౌరవించే వ్యక్తులు, వాళ్ళు సంపాదించిన డబ్బు గురించి ఆలోచిస్తే వాళ్ళెవ్వరూ 'విజేత'లు కారని స్పష్టంగా తెలుస్తుంది.

'జాతి పిత' అని కొలిచే మహాత్మాగాంధీ ఎంత సంపాదించాడో అందరికీ తెలుసు. ఆయనకు ఎన్ని బంగళాలుండేవో ఎవరికీ చెప్పనవసరం లేదు. అలాగే మనం 'జాతి స్ఫూర్తి'గా భావించే వివేకానందుడు 'డబ్బు' విషయంలో విజయానికి ఎన్ని మెట్లు ఎక్కాడో లెక్కించటం హాస్యాస్పదమైన విషయం.

రమణమహర్షి, అరవిందో, రామకృష్ణ పరమహంస వంటి వాళ్ళను ఆధునిక 'విజయ' నిర్వచనంతో పోలిస్తే చిత్తుగా పరాజితుల జాబితాలోకి వచ్చేస్తారు. విజయం విషయంలో మెట్టెక్కటం అటుంచి ఆ వైపుగా కూడా రారు వీరు. అలాగే, మనం గౌరవించే కాళిదాసు, బాణుడు, కల్హణుడు వంటివారు ఎన్నెన్ని మేడలు కట్టారో, ఎంత ఐశ్వర్యంతో తులతూగారో మనకు తెలుసు. వారు కూడా మన 'విజయం' ఛాయల్లోకి రానే రారు.

ఇంకో రకంగా చూస్తే ఐశ్వర్యంతో తులతూగిన మన రాజులను సైతం, మనం వాళ్ళు ఎంత బాగా సంపాదించారన్న అంశం ఆధారంగా గౌరవించటం లేదు. హరిశ్చంద్రుడు, అశోకుడు, చంద్రగుప్తుడు, శివాజీ,

రాణా ప్రతాప్.... వీళ్ళెవరినీ మనం జీవితంలో ఎంత పైకి వచ్చారన్న విషయం ఆధారంగా గౌరవించటం లేదు. మనం వారిని గౌరవిస్తున్న కారణాలు మన 'విజయాల మెట్ల' పరిసరప్రాంతాలకు కూడా రావు.

మనం అత్యంతమూ గౌరవించి పూజించే శంకరాచార్యులవారు, గౌతమ బుద్ధుడు, రామానుజాచార్యుల వంటి మహాచార్యులెవరినీ డబ్బు లెక్కలు చూసి పూజించం. వాల్మీకి, వ్యాసుడు, విశ్వామిత్రుడు, అగస్త్యుడు, పరశురాముడు వంటి ఆదర్శమూర్తుల విజయం డబ్బు త్రాసులో తూగదు.

మనం శ్రీనాథుడిని గౌరవిస్తాం. కానీ పోతనను ఆరాధిస్తాం. ఇద్దరూ గొప్ప కవులే అయినా శ్రీనాథుడిని గౌరవించటం, పోతనను గౌరవించటంలో బోలెడంత తేడా ఉంది. చూస్తే, పోతన కన్నా శ్రీనాథుడు ఎక్కువ భోగాలు అనుభవించాడు. ఐశ్వర్యంతో తులతూగాడు. అలాగే, మనం గౌరవించే కవులెవరూ, 'ధనసంపాదన' ప్రమాణంతో మన గౌరవాన్ని పొందటం లేదు. కవులే కాదు, రాజులు, ఆచార్యులు, ప్రవక్తలు, నాయకులు.... ఎవరూ కూడా 'డబ్బు' ఆధారంగా మన మన్నన లందుకోవటం లేదు.

మనం గౌరవించి, ఆరాధించి, మన్నించేవారు 'విజేతల' జాబితాలోకి రానప్పుడు, మనం 'విజయం' అనుకుంటున్నది నిజంగా విజయమేనా? అన్న ప్రశ్న రాకమానదు.

ఒక్కసారి మనం ఇంకాస్త లోతుకు వెళ్ళి మనం ఎటువంటివారిని గౌరవిస్తామో, మరో కోణంలో పరిశీలిద్దాం. మనకు ఉపనిషత్తుల్లో ఒక కథ ఉంది. ఒక రాజుకు తాను ఎంతో విజ్ఞానినని నమ్మకం. కానీ తన కన్నా విజ్ఞాని తన రాజ్యంలోనే ఉన్నాడని తెలిసి రాజు, అతడిని వెతుక్కుంటూ వెళ్తాడు. తీరా చూస్తే ఆ విజ్ఞాని మాంసం  కొట్టేవాడు. అతని విజ్ఞానం 'నిష్కామకర్మ'? రాజు అతడి కాళ్ళ మీద పడతాడు. ధనవంతుడు, అధికారం ఉన్నవాడు, ఐశ్వర్యం ఉన్నవాడు... ఒక మాంసం కొట్టేవాడి కాళ్ళ మీద పడాల్సిన అవసరం ఏముంది?

అలాగే, ఓ మహాకోపిష్ఠి ముని ఉన్నాడు. ఆయనకు కోపం వస్తే ఎటువంటి వాడినైనా, కోపంగా చూసి బూడిద చేసేయగలడు. అటువంటి

వాడు ఓ మామూలు గృహిణిని ఏమీ చేయలేక, ఆమె కాళ్ళ మీద పడాల్సి వచ్చింది. కేవలం 'కర్తవ్యపరాయణత' అన్న లక్షణం ముందు, ఎంతో తపశ్శక్తి ఉండి, రాజులు సైతం సాష్టాంగపడే ఆ ఋషి తల ఎందుకు వంచాడు?

మనుషులందరి ప్రాణాలనూ హరించగలిగే యముడు, ఓ పిల్లవాడి పట్టుదల ముందు ఎందుకు లొంగిపోయాడు? ఓ స్త్రీ పాతివ్రత్యానికి ఎందుకు తల వంచాడు?

ఇది చూస్తే మనం అనుకుంటున్న 'విజయం' ఏ రకంగానూ విజయం కాదని స్పష్టమౌతోంది. ఎందుకంటే మన ఆదర్శమూర్తులెవరూ మన విజయం పరిధిలోకి రావటం లేదు. మహామహుల గౌరవం పొందిన వారెవరూ 'విజయం' నిర్వచనంలోకి ఒదగటం లేదు. కాబట్టి మనం విజయం అనుకుంటున్నది విజయం కాక మరేదో అయి ఉండాలి. లేక, మనం విజయం నిర్వచనం మార్చుకుని, మన అభిప్రాయాలను పునః సమీక్షించుకోవాలి. ఈ పని చేసే ముందు మనం ప్రస్తుతం 'విజయం' పరిధిలోకి ఒదిగేవారి నో సారి టూకీగా పరామర్శించి చూద్దాం.

'ఇయాకోక్కా' అనే అతడు తన 'విజయం' గురించి రాసిన పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలియన్ కాపీలు అమ్ముడు పోయింది. అతగాడు సాధించిన విజయం ఏమిటంటే ఫోర్డ్ కంపెనీ వారు ఉద్యోగం నుంచి తొలగిస్తే, ఓ మూసేసే స్థితిలో ఉన్న కంపెనీలో చేరి, ఆ కంపెనీని ఉన్నతస్థాయికి తీసుకువచ్చాడు. నిజంగా అతడు సాధించింది విజయమే. మానవుడి పట్టుదలకు ఆయన నిలువెత్తు ప్రతీకే. కానీ ఈ విజయం సాధించినందుకు మనం ఆయన ముందు మోకరిల్లుతామా? ఆయన ఫోటో పెట్టుకుని పూజిస్తామా?

అతడి జీవితం చదువుతాం. ఓ నిట్టూర్పు విడిచి పుస్తకం పడేస్తాం. ఎందుకంటే 'ఇయాకోక్కా' సాధించింది వ్యక్తిగతవిజయం. అతడు డబ్బు సంపాదించాడు. ఒక కంపెనీని నిలబెట్టాడు. అతనికన్నా కష్టాలను ఎదుర్కొంటూ ధనపరంగా విజయం సాధించిన వారనేకులు ఉన్నారు. బిచ్చం ఎత్తుకునే స్థాయి నుండి ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు 'చార్లీ

చాప్లిన్'. చెత్త ఏరుకునే స్థితి నుంచి హాలీవుడ్ దిశను నిర్దేశించే స్థాయికి ఎదిగాడు 'కిర్క్ డగ్లస్'. ఇళ్ళకు వార్తాపత్రికలు పంచే దశ నుంచి భారత రాష్ట్రపతిగా ఎదిగాడు అబ్దుల్ కలామ్.

వీరందరిదీ విశిష్టమైన వ్యక్తిత్వమే. జీవితంలో ఎంతో కష్టపడి, ఎన్నో ప్రతికూలపరిస్థితులను దాటి వారు ఒక స్థాయికి చేరుకున్నారు.

కానీ వీరి విజయాలన్నీ భౌతికశక్తుల మీద విజయాలు. ఈ విజయాలు అశాశ్వతమైన విజయాలు. వీళ్ళను కూడా మనం వారి పట్టుదలకు, దీక్షకూ, వారు కనబరచిన సృజనాత్మకతకూ ఆదర్శంగా తీసుకుంటాం తప్ప, వారు సంపాదించిన డబ్బు ఆధారంగా కాదు.

కానీ వీరెవరూ మనకు నిత్యస్మరణీయులు కారు. అలాగే పెద్ద కంపెనీలు స్థాపించటం, మంచి మార్కులు సాధించటం, ఓ పోటీలో నెగ్గటం – ఇవేవీ నిజమైన విజయాలు కావు. ఇవన్నీ భౌతిక శక్తులపై మానవుడి పట్టుదల సాధించిన విజయాలు. కోరుకున్న అమ్మాయిని పొందటం, కోరుకున్న ఉద్యోగం పొందటం, అనుకున్నది సాధించటం ఇవన్నీ విజయాలే. కానీ ఇవేవీ నిజమైన విజయాలు కావు. ఎందుకంటే, ఈ విజయాల వెనుక 'తరువాత ఏమిటి?' అన్న ప్రశ్న వస్తుంది. ఈ విజయాలు అసంపూర్ణమైన విజయాలు.

ఓ కంపెనీని ఉన్నతస్థాయికి తీసుకువెళ్ళాడు. తరువాత?

ఓ అమ్మాయిని పొందాడు. తరువాత?

ఓ పరీక్షలో ఉత్తమస్థాయి మార్కులు పొందాడు. తరువాత?

బోలెడంత డబ్బు సంపాదించాడు. తరువాత?

ఈ విజయాలన్ని అశాశ్వతమైన విజయాలే. వీటిని సాధించిన తరువాత కూడా ఇంకా ఏదో సాధించవలసింది ఉందన్నమాట. ఏ విజయం సాధించిన తరువాత 'తరువాత ఏమిటి?' అన్న ప్రశ్న ఉండదో అది అసలైన విజయం అని, ఈ ఉదాహరణలు చూసి, మనల్ని మనం ప్రశ్నించుకున్న తరువాత, మనసుకు తడుతుంది.

అంటే ఎలాగైతే రాగికి బంగారు పూత పూసి, బంగారంగా కొంత కాలం చలామణి చేసినా, బంగారు పూత చెరిగిపోగానే అసలు రాగి వెలికి వస్తుందో, అలాగే తాత్కాలిక, అసంపూర్ణవిజయాలను, నిజమైన విజయాలుగా ప్రచారం చేసినా, మనం పైపూత తొలగించి చూస్తే విజయం అనే ఆలోచనలోని డొల్లతనం తెలుస్తుంది.

విజయానికి అసలైన నిర్వచనం ఏమిటంటే, మనకు ప్రాతః స్మరణీయులు, ఆదర్శమూర్తులు, శాశ్వతసత్యాన్ని సాధించినవారు సాధించిన విజయమే నిజమైన విజయం. ఏ విజయం సాధించిన తరువాత ఇక మరో ప్రశ్న మొలకెత్తదో అది అసలైన శాశ్వతవిజయం అని అర్థం. ఈ 'విజయాన్ని' నిర్వచించుకున్న తరువాత మనం వ్యక్తి – వ్యక్తిత్వం వంటి అంశాలపై పొరలు కూడా తొలగించి చూడాల్సి ఉంటుంది. శాశ్వతవిజయసూత్రాలను విశ్లేషించాల్సి ఉంటుంది.

✣ ✣ ✣

## ఇందులో...


| | | |
|---|---|---|
| 1. | వ్యక్తిత్వం – విజయం | 13 |
| 2. | వ్యక్తిత్వం – మనస్సు | 25 |
| 3. | వ్యక్తిత్వం – దైవభావన | 39 |
| 4. | వ్యక్తిత్వం – ఆదర్శం | 54 |
| 5. | వ్యక్తిత్వం – మాట | 79 |
| 6. | వ్యక్తిత్వం – భయం | 103 |
| 7. | వ్యక్తిత్వం – ఆలోచనలు | 130 |
| 8. | వ్యక్తిత్వం – బ్రహ్మచర్యం | 147 |
| 9. | వ్యక్తిత్వం – శాంతం | 202 |
| 10. | వ్యక్తిత్వం – ధనం | 252 |
| 11. | వ్యక్తిత్వం – అధికారం | 290 |
| 12. | ఉపసంహారం | 344 |

# వ్యక్తిత్వం - విజయం

## తాత్కాలికవిజయం - శాశ్వతవిజయం

మన ఆదర్శమూర్తులు సాధించిన 'విజయాల'ను దృష్టిలో ఉంచుకుంటే, ప్రస్తుతం 'విజయం'గా చలామణి అవుతున్న 'విజయం', 'విజయం' కాదన్న భావన కలుగుతుంది. ఎందుకంటే, ఇప్పుడు చలామణిలో ఉన్న 'విజయం' సాధించిన తరువాత కూడా 'తరువాత ఏమిటి?' అన్న ప్రశ్న ఉత్పన్నమౌతుంది. శిఖరారోహణ పూర్తయిన తరువాత ఇంకా 'ఎక్కవలసిందేమిటి?' అన్న ప్రశ్న ఎక్కడైనా జనిస్తుందా? అలాంటి ప్రశ్న జనించిందంటే అర్థం, అత్యున్నతశిఖరారోహణ చేయలేదనే కదా! అలాగే, విజయసాధన సంపూర్ణ మైందంటే అర్థం మరి ఇక సాధించవలసిందేమీ లేదనే కదా!

కాబట్టి ప్రస్తుతం 'విజయం' నిర్వచనం అసంపూర్ణమే కాదు, అనృతం కూడా అని అర్థమౌతుంది. అసలు 'విజయం' గురించి చర్చించే కన్నా ముందు 'విజయం' విషయంలో ఏర్పడ్డ అయోమయానికి కారణాలను విశ్లేషించాల్సి ఉంటుంది.

పాశ్చాత్యతత్త్వానికి, భారతీయ ఆలోచనా విధానానికి ఒక మౌలికమైన తేడా ఉంది. ఈ తేడా ఎంత ప్రధానమైనదంటే, ఈ రెండు ఆలోచనా విధానాల నడుమ అది అనంతమైన అగాధాన్ని సృష్టించింది. పాశ్చాత్యుల దృష్టిలో సృష్టి నాలుగు మూలకాల కలయిక వల్ల ఏర్పడింది. వారు మట్టి, నీరు, అగ్ని, వాయువులను గుర్తించారు. వారి దృష్టికి ఆకాశం అందలేదు. భారతీయతత్త్వవేత్తల దృష్టిలో ప్రపంచం పాంచభౌతికం. పృథ్వి, అప్, తేజస్, వాయువులకు వారు ఆకాశాన్ని జోడించారు. దీంతో భారతీయ దృక్కోణం, పాశ్చాత్య దృక్కోణం నుంచి పూర్తిగా వేరుపడింది. ఈ ఐదవ మూలకం భారతీయదృక్కోణానికి లోతునిచ్చింది. ఇది ఆధ్యాత్మికతకు దారి తీసింది. కాగా పాశ్చాత్యవిజ్ఞానమంతా – కనబడి, అనుభవించగలిగే భౌతికానికి మాత్రమే పరిమితమైంది.

పాశ్చాత్యులు సృష్టించిన విజ్ఞానం కూడా భౌతికాలకే పరిమితమైంది. కనబడేదే ప్రపంచమని, భౌతికంగా అనుభవించగలిగేదే విజ్ఞానమని వారు నమ్మారు. దాంతో భౌతికపరిమితులకు లొంగని అనంతమైన ఆకాశం వారికి గగనకుసుమమైపోయింది. వారి సిద్ధాంతాలు సర్వం భౌతికత ప్రాతిపదికగానే ఎదిగాయి. వారి ఆశలు, ఆకాంక్షలు, ఆదర్శాలు, అన్నీ భౌతికాలకు మాత్రమే ప్రాధాన్యాన్నిచ్చాయి. దాంతో, భౌతికసుఖలాలస, భౌతికశక్తులపై విజయం, పాశ్చాత్యజీవనవిధానానికి పట్టుకొమ్మలయ్యాయి. ఈ భౌతికత వల్ల పాశ్చాత్యుల విజ్ఞానం, జీవనవిధానం కూడా ఆకాశం వైపు ఎదగలేక, నేల పైనే చతికిలపడింది. ఫలితంగా పాశ్చాత్యుల విజయసిద్ధాంతం కూడా భౌతికాలలో ఒదిగింది.

'కనబడేదే ప్రపంచం, కనబడనిది లేనేలేదు' అన్న నమ్మకం వల్ల పాశ్చాత్యులు 'మనస్సు'కు ప్రాధాన్యం ఇవ్వలేదు. అందుకే వారి విజయాలలో 'మనస్సు' నిర్దిష్టస్థానాన్ని పొందలేదు. తన పాపాల పరిహారానికి భౌతికంగా తనని తాను శిక్షించుకున్నవాడు గొప్ప ఆదర్శమూర్తి అయ్యాడు. వెయ్యేనుగుల బలం కలవాడు ఆరాధ్యదైవం అయ్యాడు. వాడికి బుర్ర ఉందా? లేదా? అన్న విషయం ఎవరికీ పట్టలేదు. అలాగే అందరి కన్నా వేగంగా పరుగెత్తగలవాడు, దూరం దూకగలవాడు, ఎత్తులు ఎక్కగలవాడు, డబ్బులు సంపాదించగలవాడు... ఇలా తాత్కాలికంగా ఇతరుల కన్నా ఓ మెట్టు పైనున్న ప్రతివాడూ ఆదర్శం అయ్యాడు. కానీ 'విజయాలు' అన్నీ అశాశ్వతం అని పాశ్చాత్యులకు తెలుసు. అందుకే వారు 'రికార్డు'లు రాయటం ఆరంభించారు. ఒకడు వంద మీటర్లు పదిహేను సెకన్లలో పరుగెత్తి ఆదర్శమై పూజలు అందుకుంటాడు. కానీ మరో రోజున ఇంకొకడు అదే దూరం పద్నాలుగు సెకన్లలో పరుగెత్తి 'కొత్త దేవుడు'గా ఎదిగేవాడు. ఒక శాస్త్రవేత్త ఓ గొప్ప నిజం కనుక్కొని 'పూజ'లు అందుకునేలోగా, మరో శాస్త్రవేత్త అతనికన్నా గొప్ప నిజం కనుక్కుని మరిన్ని పూజలు అందుకునేవాడు. ఇలా పాశ్చాత్యుల దృష్టిలో 'విజయం' అన్నదాని అర్థం స్థిరపడింది. పది మందినీ ఆకర్షించగలిగేవాడు, లేక మరో పదిమందిని తన్నేవాడు, అందరినీ మోసం చేసి డబ్బు సంపాదించేవాడు... ఇలా వారి దృష్టిలో అశాశ్వత విజయాలే అసలైన విజయాలుగా స్థిరపడ్డాయి. ప్రపంచంపై మానసికంగా, భౌతికంగా పాశ్చాత్యులు అధికారం సాధించగలగటంతో, ప్రపంచమంతా పాశ్చాత్యుల విజయమే నిజమైన విజయం అన్న అభిప్రాయం వేళ్లూనుకోసాగింది. మన దేశంలో కూడా ఇదే జరిగింది.

భారతీయుల దృష్టిలో కంటికి కనబడే భౌతికప్రపంచానికి ఎంత ప్రాముఖ్యం ఉందో, కంటికి కనబడని మానసిక - ఆధ్యాత్మికప్రపంచానికి కూడా అంత ప్రాధాన్యం ఉంది.

తెరిచిన కళ్ళ ముందున్న విశాలవిశ్వం ఎంత నిజమో, మూసిన కళ్ళ వెనక దాగిన మహాద్భుతమైన మరో ప్రపంచం కూడా అంతే సత్యం. అంటే భారతీయుల దృష్టిలో మనిషి జీవితంలో ప్రతి వ్యక్తీ రెండు విభిన్నసంఘర్షణలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఒకటి భౌతికం, మరొకటి ఆధ్యాత్మికం. వీటిలో భౌతికపరమైన శక్తులపై విజయం ఒక దశ వరకే సాధ్యమని భారతీయులు గ్రహించారు. ఎందుకంటే మనిషి శరీరం కొన్ని భౌతిక పరిమితులకు లోబడి ఉంటుంది. కన్ను కొంత దూరం వరకే చూడగలదు. చెవి కొన్ని శబ్దాలే వినగలదు. శరీరం అనుభవించే స్పర్శకూ పరిమితులున్నాయి. కానీ పరిమితులు లేనిది మనస్సుకే. అవధులు, అడ్డూ అదుపూ లేనిది మనస్సే. మనస్సు కూడా మనిషి అనుభవాల పరిధిలో ఒదిగే అవకాశం ఉన్నా, ప్రయత్నిస్తే, మనిషి ఈ భౌతికానుభవాల పరిమితులను మించి, మనోవిహంగానికి అనంతమైన రెక్కలనిచ్చి అనంత ఆకాశవీథిలో అప్రతిహతంగా విహరింపచేయగలడు. ఇది గ్రహించిన భారతీయ తత్త్వవేత్తలు తమ దృష్టిని మనోవిహంగానికి ప్రేరణనివ్వటంపై కేంద్రీకరించారు. వారి భౌతికత కూడా ఈ మనస్సుకు రెక్కలనిచ్చేందుకు అవసరమైన అంశాల పైనే కేంద్రీకృతమైంది. భౌతికపరికరాలతో భౌతిక ఇంద్రియాల శక్తిని పెంచాలని పాశ్చాత్యులు తపన పడుతూంటే, భౌతికాంశాలను మించి ఆధ్యాత్మికశిఖరాలను అధిరోహించాలని భారతీయులు ఆరాటపడ్డారు. అందుకే పాశ్చాత్యుల అభివృద్ధి యాంత్రిక పరిజ్ఞానంపై ఆధారపడి ఉంది. భారతీయప్రగతి మానసికవికాసంపై నిలిచి ఉంది. భౌతికంగా ఎన్ని విజయాలు సాధించినా అవి అశాశ్వతమే. కానీ మానసికవిజయం శాశ్వతం. ఇదీ భారతీయుల 'విజయా'నికీ, పాశ్చాత్యుల విజయానికీ నడుమ ఉన్న అంతరం. ఇది భౌతికవాదానికీ, ఆధ్యాత్మికానికీ నడుమ ఉన్న తేడా.

భౌతికవిజయానికి కొలబద్దలున్నాయి. వాటిని కళ్ళతో చూడవచ్చు. కానీ మానసిక విజయానికి కొలబద్దలను నిర్వచించటం కష్టం. ప్రమాణాలను ఏర్పరచినా, ఇతమిత్థంగా వాటిని నిర్ణయించటం కష్టం. ఒక నదిపై పెద్ద వంతెనను కట్టి గొప్పతనాన్ని నిరూపించు కోవచ్చు. వరదలో ఆ వంతెన కొట్టుకుపోతుందన్నది వేరే విషయం. కానీ ఇది కంటికి కనబడే విజయం. ఆధునికసమాజంలో, సాంకేతికప్రగతి, వైజ్ఞానిక పురోభివృద్ధులు అగ్రతాంబూలాన్ని అందుకోసాగాయి. ప్రపంచవ్యాప్తంగా జరుగుతూ వస్తూన్న ఈ పరిణామం భారతీయసమాజాన్ని కూడా తాకింది. భారతీయుల దృష్టిలో కూడా పాశ్చాత్యుల విజయభావన స్థిరపడింది.

కానీ.... ఎంత కాదన్నా ప్రతి వ్యక్తిలో ఆధ్యాత్మికజ్యోతి మినుకుమినుకు మంటూంటుంది. ఎన్ని తుఫానులొచ్చినా, ఎన్ని వడగాడ్పులు వీచినా ఈ జ్యోతి ఆరదు.

ఆరని ఈ జ్యోతి మనిషిని నిశ్చింతగా ఉండనివ్వదు. అతడు ఎంతగా భౌతికాల వైపు పరుగిడి, తనని తాను మరచిపోవాలని తపన పడుతున్నా, ఏదో ఓ క్షణంలో మెరపులా అతడికి తనలోని ఆధ్యాత్మికతను గుర్తుచేస్తూనే ఉంటుంది. దాంతో, భౌతికంగా ఎన్ని విజయాలు సాధించినా, ఎంత గొప్ప ఉద్యోగం సంపాదించినా, ఎంత డబ్బు సంపాదించి, ఎన్ని మేడలు కట్టినా, కార్లు కొన్నా, మనిషికి సంతృప్తి ఉండదు. అసంతృప్తి అతడిని అణచేస్తూంటుంది. ఈ అసంతృప్తి స్వరూపాన్ని గ్రహించలేక, మనిషి మరింతగా భౌతికాల వెంబడి పరుగెడతాడు. మరింతగా అసంతృప్తిని మూట కట్టుకుంటాడు. ప్రపంచంలో అశాంతి పెరుగుతూ ఉంటుంది. అసంతృప్తితో మనుషులు అరాచకం వైపు పరుగెడతారు.

ఇటువంటి పరిస్థితులలోనే భారతీయతత్త్వం ప్రకారం అసలు విజయాన్ని నిర్వచించుకుని, ఆ విజయసాధనకు మన పూర్వికులు విధించిన నియమాలను అనుసరిస్తే, అసలు వ్యక్తిత్వవికాసం సాధ్యమౌతుంది. ఏది సాధిస్తే, తరువాత ఇక సాధించ వలసిందేదీ ఉండదో, ఆ అసలు విజయసాధనమార్గం బోధపడుతుంది.

## ధర్మపాలనే కర్తవ్యం

'ఏ విజయం సాధిస్తే ఇక సాధించవలసింది ఉండదో అదే అసలు విజయం' అని నిర్వచించుకున్న తరువాత అసలు సమస్య ఎదురు నిలుస్తుంది. ఈ 'అసలు' విజయాన్ని గుర్తించటం ఎలా? సాధించటం ఎలా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమౌతాయి.

మాట్లాడటం సులభం. ఏదైనా అంశం గురించి గొప్పగా చెప్పేయటం సులువు. తీర్మానాలు చేసేయటం, ఎదుటివాడికి నీతులు చెప్పటం పెద్ద సమస్యలు కానే కావు. కానీ చెప్పిన ఆదర్శాలను ఆచరించటంలో వ్యక్తి అసలు వ్యక్తిత్వం బయటపడుతుంది. సూచించిన గమ్యానికి మార్గాన్ని వెతుక్కోవటంలో, గమ్యం చేరే మార్గం సాటివారికి చూపటంలో అసలు నిగ్గుతేలుతుంది.

భారతీయధర్మంలో ఉన్న గొప్పతనం ఇక్కడే ప్రస్ఫుటమౌతుంది. భారతీయధర్మవేత్తలు గమ్యం సూచించి సంతృప్తి పడలేదు. నీతులు చెప్పి మిన్నకుండలేదు. జీవితలక్ష్యాన్ని నిర్వచించి పనైపోయిందని చేతులు దులుపుకోలేదు. వారు ప్రతి వ్యక్తి జీవితంలో, ప్రతిక్షణం అనుసరించవలసిన విధులను, కర్తవ్యాలను క్షుణ్ణంగా, విపులంగా వివరించారు. మానవ జీవితంలో ఎదురయ్యే అయోమయాలను, జరిగే సంఘర్షణలను వారు నిశితంగా పరిశీలించారు. అలా పరిశీలించి ఆ అయోమయాల, సంఘర్షణల అసలు స్వరూపాన్ని అర్థం చేసుకున్నారు. ఆపై అయోమయాలను ఎదుర్కొనేందుకు మార్గాలను విశ్లేషించారు. సంఘర్షణల నుంచి బయట పడేందుకు మార్గాలను శోధించారు. ఫలితంగా భారతీయ

ధర్మం ఒక నిర్దిష్టస్వరూపాన్ని సంతరించుకుంది. ఇతరమతాలకూ, భారతీయధర్మానికీ తేడా ఇక్కడే కనిపిస్తుంది.

భారతీయధర్మం ఒక జీవనవిధానం. మాతృ గర్భంలో పిండదశలో ఎదుగుతున్నప్పటి నుంచి మొదలై, జనించిన ఘడియ నుండి, తుది శ్వాస పీల్చి పంచభూతాలలో విలీనమయ్యేంతవరకూ వ్యక్తి జీవితంలో ప్రతి క్షణాన్నీ పరిగణనలోకి తీసుకుంటుంది భారతీయధర్మం. అతని ఊపిరిలో ఊపిరై రుధిరప్రవాహంలో వేగమై, హృదయస్పందనలకు భావనై, దృష్టికి దృశ్యమై, అణువణువునా తానే అయి వ్యక్తి తన లక్ష్యం వైపు ప్రయాణించేట్టు జాగ్రత్తపడుతుంది భారతీయధర్మం.

ఇప్పుడు మనం అనుకుంటున్న 'విజయ' సాధన, వ్యక్తి పరిపూర్ణమానవుడుగా ఎదిగితే కానీ సాధ్యం కాదు. వ్యక్తి పరిపూర్ణమానవుడుగా ఎదగాలంటే అతని వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించి ఉండాలి. వ్యక్తిత్వవికాసం పరిపూర్ణం అయ్యేందుకు అడుగడుగునా తోడ్పడుతుంది భారతీయధర్మం. అంటే, భారతీయధర్మపాలన 'వ్యక్తిత్వవికాసానికి' పర్యాయపదం అన్నమాట. వ్యక్తిత్వం సంపూర్ణంగా వికసించిన పరిపూర్ణ మానవుడిని తయారుచేయటం భారతీయధర్మంలోని ఉత్కృష్టలక్షణం అన్నమాట.

ఈ సంపూర్ణంగా వ్యక్తిత్వవికాసం సాధించిన పరిపూర్ణమానవుడు గమ్యం చేరటమే మనం నిర్వచించుకున్న అసలైన 'విజయం.' అంటే, భారతీయులకు ప్రత్యేకంగా వ్యక్తిత్వవికాసం అంటూ బోధించాల్సిన అవసరం లేదు. ధర్మపాలన వ్యక్తిత్వవికాసానికి రాజమార్గం అన్నమాట. అందుకే, భారతీయధర్మంలో గమనిస్తే దైవం కన్నా ధర్మానికే పెద్ద పీట వేయటం స్పష్టంగా కనిపిస్తుంది.

భారతంలో శ్రీకృష్ణుడిని ఎందరో దూషిస్తారు. విమర్శిస్తారు. పరుషవాక్యాలు ప్రయోగిస్తారు. శ్రీకృష్ణుడు భగవంతుడికి ప్రతిరూపం. ఆ దూషణలు, విమర్శలు అన్నీ భగవంతుడికే అన్నమాట. అయినా, అలా దూషించినవారిని శ్రీకృష్ణుడు ద్వేషించడు. వారి విమర్శలను తిప్పి కొట్టడు. వారితో వాదాలకు దిగడు. 'వారి అభిప్రాయం వారిది' అన్న రీతిలో వదిలేస్తాడు. అన్ని దూషణలనూ చిరునవ్వుతో భరిస్తాడు. 'వీరు నన్ను విమర్శించారు. వీరి పని పట్టాలి' అన్నట్టు ప్రతీకారభావనను ప్రదర్శించడు.

కానీ.... ఎప్పుడైతే ధర్మచ్యుతి జరిగిందో, ఎప్పుడైతే వ్యక్తి ధర్మాన్ని కాదని ప్రవర్తించాడో అప్పుడు శ్రీకృష్ణుడు నిర్ణయాత్మకంగా, నిర్దాక్షిణ్యంగా, నిక్కచ్చిగా వ్యవహరించాడు.

దేవుడని చూడకుండా గోవర్ధనగిరి ఎత్తి ఇంద్రుడికి శృంగభంగం చేశాడు. నూరు తప్పులు చేసి, ధర్మభంగం పొరపాటు వల్ల కాదు అలవాటు వల్ల అని నిరూపించు కొన్న తరువాతనే శిశుపాలుడికి శిరచ్ఛేదం చేశాడు. అలాగే, అర్జునుడు, భీముడు వంటి వీరుల ద్వారా ధర్మరక్షణ కావించాడు.

భారతీయజీవనవిధానానికి అత్యుత్తమప్రామాణిక మనదగిన భగవద్గీతను బోధిస్తూ,

*యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత*
*అభ్యుత్థానమధర్మస్య తదాఽ త్మానం సృజామ్యహం॥*

అని స్పష్టంగా చెప్తాడు. అంటే భగవంతుడి కన్నా ధర్మం గొప్పది అన్నమాట.

భగవంతుడిని నమ్మటం, నమ్మకపోవటం అన్నది వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలకు సంబంధించింది. వ్యక్తి భగవంతుడిని నమ్మినా, నమ్మకున్నా నష్టం లేదు. కానీ వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కోల్పోతే ప్రమాదం. అది వ్యక్తికే కాదు సమాజానికే ప్రమాదం. వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కోల్పోవటం అంటే ధర్మాన్ని పాటించకపోవటమే. ధర్మభంగం చేయటమే.

ధర్మభంగం వల్ల సామాజిక ఆత్మకు నష్టం వాటిల్లుతుంది. కాబట్టి భగవంతుడు తనపై వ్యక్తిగతదూషణలను చేసేవారిని పట్టించుకోడు. కానీ ధర్మభంగం చేసినవారిని క్షమించడు.

దేవుడిని నమ్మనివారిని విస్మరిస్తాడు. కానీ ధర్మానికి హాని కలిగించినవారిని శిక్షించకమానడు. దీన్ని బట్టి చూస్తే, భారతీయధర్మంలో వ్యక్తిత్వవికాసానికి, ధర్మపాలన రాజమార్గం అని స్పష్టమౌతుంది. ధర్మపాలన వ్యక్తిత్వవికాసానికి పర్యాయపదం అని తేలుతుంది. ధర్మపాలన సక్రమంగా చేసే వ్యక్తి సంపూర్ణవ్యక్తిత్వంతో అలరారుతూ పురుషోత్తముడు అవుతాడని అర్థమవుతుంది.

అందుకే 'పురుషులలో నేను ఉత్తముడి'ని అని శ్రీకృష్ణుడు ప్రకటిస్తే, తన ప్రవర్తన ద్వారా ఆ భావనను ప్రపంచానికి ప్రదర్శించాడు పురుషోత్తముడు శ్రీరామచంద్రుడు. అందుకే, భారతీయధర్మానికి శ్రీకృష్ణుడు మార్గదర్శి. శ్రీరాముడు ఆదర్శం. ఈ మార్గదర్శి మార్గదర్శనంలో, ఆ ఆదర్శపాలన అంతిమవిజయానికి దారి తీస్తుంది. ఇదీ భారతీయ ధర్మంలో వ్యక్తిత్వవికాసస్వరూపం.

ఇక్కడ ఒక ప్రశ్న వస్తుంది. భారతీయధర్మంలో ధర్మానికి ఇంత పెద్ద పీట వేయటం ఎందుకు? ధర్మపాలన చేయకుండా ధర్మభంగం చేస్తే కలిగే నష్టం ఏమిటి? అన్న ఆలోచన వస్తుంది.

ఈ ప్రశ్న కూడా ఎవరూ వేయకముందే భగవద్గీతలో సమాధానం దొరుకుతుంది. వ్యక్తులలో దౌష్ట్యం వల్ల కుటుంబవ్యవస్థ ధ్వంసం అవుతుంది. అందువల్ల సంప్రదాయం విచ్ఛిన్నమౌతుంది. దాంతో స్వార్థం, ద్వేషం, క్రోధం, లోభం వ్యక్తులను ముంచెత్తుతాయి. ఇందువల్ల మహిళలు ప్రభావితలవుతారు. పురుషుడు దుష్టుడైనా, మహిళలు దిగజారనంత వరకూ సమాజానికి ప్రమాదం లేదు. కానీ మహిళలు దిగజారటం ఆరంభిస్తే సమాజ పతనం మొదలౌతుంది. ఇదీ ధర్మభంగం వల్ల జరగబోయే హాని.

ఇప్పుడు మనం మన చుట్టూ చూస్తున్న అనేకసంఘటనలు, అనుభవిస్తున్న విషయాలు ధర్మభంగం వల్ల కలిగే పరిణామాలను స్పష్టం చేస్తాయి.

వ్యక్తిత్వవికాసం అంటే వస్తువులను అమ్మే తెలివి ప్రదర్శించటం, ఎదుటివాడిని ప్రభావితం చేసి అనుకున్నది సాధించటం అన్న అపోహలలో చిక్కుకున్న సమాజం వ్యక్తిత్వం కోల్పోయి, పరాయి భావదాస్యపు బురదలో గొంతుక వరకూ కూరుకుపోవటం మనం చూస్తూనే ఉన్నాం. వ్యక్తిత్వవికాసానికి రాజమార్గమైన ధర్మపాలనను మరచి, వ్యక్తిత్వవికాసానికి వికృతరూపమైన తాత్కాలిక పద్ధతుల వెంటపడుతూ వ్యక్తిత్వమూ లేక వికాసం దరిచేరక, పాశ్చాత్య అనుకరణ పరమోత్కృష్టధర్మమన్న రీతిలో సమాజం ప్రవర్తించటం మనం అనుభవిస్తూనే ఉన్నాం. ఇటువంటి పరిస్థితులలోనే మనల్ని మనం తెలుసుకోవాల్సిన ప్రయత్నాలు చేయటం అత్యంత ఆవశ్యకం. మన ధర్మాన్ని విశ్లేషించి, ధర్మపాలనకు మార్గాన్ని సుగమం చేసుకుని వ్యక్తిత్వవికాసానికి కృషి చేయటం తప్పనిసరి.

వ్యక్తిత్వవికాసానికి పర్యాయపదమైన ధర్మపాలన ద్వారా వ్యక్తి సంపూర్ణవ్యక్తిత్వ వికాసం సాధించి, పురుషోత్తముడుగా ఎదిగి, శాశ్వత విజయం సాధిం చేందుకు మన పూర్వికులు కొన్ని సూత్రాలను నిర్వచించారు. మార్గనిర్దేశనం చేశారు. దారి దివ్వెల నుంచారు. గమ్యం చేరేందుకు మార్గంలో సూచికల నుంచారు. మనం చేయవలసిందల్లా కళ్ళు తెరిచి, మెదడు తలుపులు తెరచి, మనోనేత్రంతో పూర్వికులు ఏర్పరచిన మార్గాన్ని అనుసరించటమే. దాంతో వారు మన కోసం నిర్మించిన మానసికవికాసమనే మహోన్నత భవంతికి మార్గం దొరుకుతుంది.

## ఆధ్యాత్మికత అసలు రూపు

మన పూర్వులు మన కోసం నిర్మించిన మానసికవికాసమనే మహోన్నతభవంతికి, భారతీయధర్మం ఆధారంగా ప్రయాణం ఆరంభించేందుకు ముందు ఒక విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఈ అంశం ఆధారంగానే భారతీయ

ధర్మంపై, జీవనవిధానంపై అనేకవిమర్శలు చెలరేగుతాయి. ఈ అంశం ఆధారంగానే భారతీయధర్మంపై అనేక అపోహలు నెలకొన్నాయి. ఈ అంశాన్ని సరిగ్గా అర్థం చేసుకోలేకపోవటం వల్లనే ఒక రకంగా మనం కూడా మన ధర్మాన్ని చిన్న చూపు చూస్తున్నాం. అది మన ధర్మానికి పట్టుగొమ్మ వంటి ఆధ్యాత్మికభావన! 'ఆధ్యాత్మికం' అనగానే అన్నీ వదిలేసి ముక్కు మూసుకుని తపస్సు చేయడం కాదు. వైరాగ్యం అనగానే పనులన్నీ మానేసి, అన్నింటినీ త్యజించి ఓ మూల కూర్చోవటం కాదు. 'విజయం' సాధించటం అంటే మానసికప్రపంచంపై నియంత్రణ సాధించేందుకు బాహ్యప్రపంచాన్ని విస్మరించటం కాదు.

భారతీయధర్మకర్తలు ప్రపంచస్వరూపాన్ని, మానవనైజాన్ని ఎంతో లోతుగా విశ్లేషించారు. నిజం చెప్పాలంటే, మానవ స్వభావాన్ని, విశ్వప్రకృతిని ఇంత సంపూర్ణంగా, సమగ్రంగా అర్థం చేసుకొని, విశ్లేషించి, వివరించటం, ప్రపంచంలో ఏ ఇతర తత్త్వంలోనూ, ఏ మతంలోనూ కనబడదు. దీనికి ప్రధానకారణం మన ఋషులు అహాన్ని జయించినవారు, వ్యక్తిగతస్వార్థాన్ని విసర్జించినవారు, ఖ్యాతి కోసం ఆరాటపడినవారుగా తమ పేరు చరిత్రలో శాశ్వతంగా ఉండాలని ఆశించినవారు కాదు. వారు కోరింది మానవాభ్యుదయం. వారు ఆశించింది మానవుడు సుఖశాంతులతో, ఉన్నతమైన ఆలోచనలతో, విశిష్టమైన వ్యక్తిత్వంతో జీవనం సాగించటం. ఇందుకోసం వారు మార్గాలు అన్వేషించారు. సూత్రాలు నిర్దేశించారు. అందుకే, వేదాలు ఏ ఒక్క వ్యక్తి కర్తృత్వానికీ లొంగవు. అవి అపౌరుషేయాలు. దాంతో ఏ మానవుడూ వేదజ్ఞానానికి 'క్రెడిట్' తీసుకునే అవకాశం లేదు. ఎందరో ఋషులు వేదవిజ్ఞానాన్ని క్రోడీకరించి అందించారు. కానీ వారంతా విజ్ఞానాన్ని దర్శించిన 'ద్రష్ట'లు తప్ప స్వయంగా సృష్టించి, ఆలోచించి అందించినవామని 'గొప్ప'లు చెప్పుకోలేదు. అలాగే, 'వ్యాసుడు' ఒక వ్యక్తో, ఒక సామూహిక శక్తో తెలియక, ఈ నాటికీ వాదవివాదాలు చెలరేగుతున్నాయి. 'అంటే నేనింత పని చేశాను. అందరూ నన్ను గుర్తించి పొగడాలి' అన్న ఆలోచన మన పూర్వికులకు అసలే లేదు. కానీ వారు, సమాజాభ్యున్నతి కోసం తాము చేయవలసింది నిష్కామంగా చేశారు. ఇదీ భారతీయధర్మంలో ఆధ్యాత్మికం అసలు రూపు.

వ్యక్తి 'విజయం' సాధించటమంటే అన్నీ వదిలేసి అడవుల్లోకి వెళ్లి ముక్కు మూసుకుని తపస్సు చేసుకోవటం కాదు. వ్యక్తి తనకు అందుబాటులో ఉన్న భౌతికశక్తులకూ, ఆధ్యాత్మికశక్తికీ నడుమ సమన్వయం సాధించటమే. వ్యక్తి సాధించగల 'అంతిమ విజయం'. ఈ విషయం భారతీయధర్మశాస్త్రాలలో అడుగడుగునా, అణువణువునా ప్రస్ఫుటంగా ద్యోతకమౌతూ ఉంటుంది. అందుకే భగవద్గీతలో

*నమే పార్థాఽస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన।*
*నాఽనవాప్త మవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి॥*

అంటాడు శ్రీకృష్ణుడు. అంటే 'పార్థా! నాకీ మూడు లోకాల్లో పొందవలసింది కాని, పొందలేనిది కానీ లేదు. కాబట్టి నాకు కర్తవ్యమన్నది లేనే లేదు. అయినా సరే నేను కూడా మీలాగే లోకవ్యవహారాలను నిర్వర్తిస్తున్నాను'.

ఎందుకంటే,

*ఉత్సీదేయురిమే లోకాః న కుర్యాం కర్మ చేదహమ్।*
*సంకరస్య చ కర్తా స్యాం ఉపహన్యామిమాః ప్రజాః॥*

'నేను కర్మాచరణ చేయకపోతే లోకులంతా నన్ను అనుసరించి కర్మభ్రష్టులవుతారు. ఈ ప్రజల నాశనానికి నేను కారకుడనవుతాను. కాబట్టి నేను కర్మలలో పాల్గొంటున్నాను' అని వివరిస్తాడు.

అంతే కాదు

*సక్తాః కర్మణ్య విద్వాంసో యథా కుర్వంతి భారత।*
*కుర్యాద్విద్వాం స్తథాఽసక్తః చికీర్షు ర్లోకసంగ్రహమ్॥*

అజ్ఞానులు కర్మఫలాసక్తితో వ్యవహరిస్తారు. జ్ఞాని లోకసంగ్రహం కోసం, ఆసక్తి లేక కర్మలు ఆచరించాలి అని స్పష్టంగా వివరిస్తాడు.

ఇంకా ఈ విషయంలో ఎవరికైనా ఎటువంటి సందేహాలుంటే వాటినీ పటాపంచలు చేస్తాడు.

*న బుద్ధిభేదం జనయేత్ అజ్ఞానాం కర్మ సంగినామ్।*
*జోషయేత్ సర్వకర్మాణి విద్వాన్ యుక్తస్సమాచరన్॥*

కర్మలపై ఆసక్తి గల అజ్ఞానులకు చిత్తచాంచల్యం కలగకుండా జ్ఞాని తాను విధ్యుక్తకర్మలు ఆచరిస్తూ, వారికి ఆదర్శంగా నిలవాలి. తాను కర్మలు ఆచరించకపోతే జ్ఞాని అజ్ఞానులకు తప్పు త్రోవ చూపించినవాడవుతాడు.

ఇదీ భారతీయధర్మంలో ఆధ్యాత్మికత! భారతీయుడు సాధించవలసిన విజయ స్వరూపం!! మనిషికి అత్యవసరమైన ప్రాణవాయువును పీల్చమని ఎవరూ నేర్పనక్కర్లేదు. భూమి మీద కళ్లు విప్పటం తోటే, అది స్వాభావికంగా అలవడుతుంది. ఆ పీల్చే గాలి

కోసం మనిషి ప్రయత్నించనక్కరలేదు. అది వాతావరణంలో స్వతస్సిద్ధంగా ఉంది. కానీ మనిషి జీవించాలంటే, జీవితం కొనసాగించాలంటే గాలి ఒక్కటే సరిపోదు. ఆహారం కావాలి.

ఆహారం ప్రకృతిలో ఉంది. అది ప్రాకృతికంగా లభిస్తుంది. కానీ అది మనిషిని వెతుక్కుంటూ రాదు. మనిషి ఆహారాన్ని సంపాదించాలి. అయితే ఆహారంతో పాటు జీవికి మరో ప్రధానలక్షణం ఉంది. అది తనవంటి జీవులనే ఉత్పత్తి చేయటం. కాబట్టి 'మైథునం' మానవజీవితంలో మనిషి నిర్వర్తించవలసిన మరో ప్రముఖకర్తవ్యం.

ఆపై తన వల్ల జన్మించిన జీవి ఎదుగుదలకు, ఆ జీవి సక్రమంగా జీవించేందుకు తగిన వాతావరణం కల్పించాల్సి ఉంటుంది.

ఈ రకంగా వ్యక్తి జన్మించినప్పటి నుంచి, మరణించేవరకూ ఒక వైపు అంతః బాహిరప్రకృతుల మధ్య సమన్వయం సాధించటంతో పాటు, తనపై ప్రకృతి విధించిన నిర్దిష్టకర్తవ్యాలను నిర్వహించాల్సి ఉంటుంది.

కాబట్టి కర్మాచరణ ప్రకృతి మానవుడిపై విధించిన నిబంధన. మానవుడే కాదు ఏ జీవి అయినా సరే, ఆహారం కోసం వెతకటం, సంభోగించి సంతానాన్ని సృజించటం, తన ఆత్మరక్షణతో పాటు తన వారి రక్షణ చేయటం వంటి కర్మలు చేయక తప్పదు. మనిషి కూడా అంతే. అయితే మనిషికీ, ఇతరజీవులకు తేడా అల్లా, ఇతరజీవులు సహజాతాలపై ఆధారపడి పనులు చేస్తాయి.

ఒక పాము పగ బట్టి మనిషిని వేటాడి చంపటం అంటూ ఉండదు. దాని దారిలోకి మనిషి వచ్చి దానికి హాని కలగజేస్తాడన్న భయం కలిగితే, అప్పుడది కాటు వేస్తుంది. అదీ ఆత్మరక్షణభావంతో తప్ప, మనిషిపై ద్వేషభావంతో కాదు. పాము, ఒక ఎలుకనో, మరో జీవినో ఆహారంగా మింగటంలో కూడా ఆకలి తీర్చుకోవటమన్న సహజలక్షణం తప్ప తాను తింటున్న జీవిపై క్రోధం, ద్వేషం వంటి భావనలతో కాదు. అలాగే ఒక మగ జంతువు, ఆడ జంతువు వెంటపడి సంభోగించటంలో కూడా సుఖలాలస, వాంఛ ఉండవు. ఆయా సమయాల్లో, ఆయా ఋతువుల్లో సంభోగించటం ఆ జీవి లక్షణం. సంతానాన్ని పుట్టించటం వాటి ధర్మం. అంతే తప్ప మరో ఆలోచన ఉండదు వాటికి.

ఇక్కడే మనిషి ఇతర ప్రాణులతో విభేదిస్తాడు. మనిషికి ఆలోచనలున్నాయి. భావనలున్నాయి. ఆనంద విషాదాలున్నాయి. కామక్రోధాలున్నాయి. ద్వేషాలున్నాయి. ప్రేమలున్నాయి. కాబట్టి మనిషి ఏ పనీ లేకుండా ఉట్టిగా ఉండటం కుదరని పని.

*నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠ త్యకర్మకృత్।*
*కార్యతే హ్యావశః కర్మ సర్వః ప్రకృతిజైర్గుణైః॥*

ఎవరు కూడా ఏ విధమైన కర్మాచరణా లేకుండా ఉండటం కుదరదు. ప్రకృతి నియమాలను అనుసరించి ప్రతి జీవీ ఏదో కర్మ చేయక తప్పదు అంటుంది భారతీయ – ధర్మం.

కాబట్టి నిర్వ్యాపారంగా కూచుని, అన్నీ వదిలేయటం, 'ఆధ్యాత్మికం' కాదు. అన్ని పనులు సక్రమంగా నిర్వహిస్తూ, సుళ్లు తిరిగే ప్రవాహంలో కూడా తన ప్రత్యేక అస్తిత్వాన్ని నిలుపుకోవటం ఆధ్యాత్మికతలో ఉచ్ఛస్థితి. ఇది మానవుడు సాధించవలసిన విజయం.

ఇది అర్థం అయ్యేందుకే, ఈ విషయంలో ఎటువంటి అపోహలు లేకుండా ఉండేందుకే మన ధర్మంలో గృహస్థాశ్రమం అన్ని ఆశ్రమాలలోకీ ఉత్తమమైందని నిర్ణయించారు. బాల్యదశలో వ్యక్తికి రక్షణ కావాలి. ఆ రక్షణను సన్న్యాసులు, సర్వాన్ని త్యజించినవారు ఇవ్వరు. ఆ రక్షణను ఇచ్చేది గృహస్థు మాత్రమే.

యౌవనంలో వ్యక్తికి మార్గదర్శనం కావాలి. తన కాళ్ల మీద తాను నిలబడేందుకు ఆసరా కావాలి. అది గృహస్థు మాత్రమే ఇవ్వగలడు.

సమాజం నడవటానికి మానవజాతి అభివృద్ధి చెందేందుకు సంతానాన్ని కనాలి. అదీ గృహస్థు బాధ్యతనే.

ఇక సన్న్యాసులకు భిక్ష ఇవ్వటం దగ్గర నుంచి, వారి బాగోగులు చూడటం, వారి అవసరాలను గుర్తించి, తీర్చటం గృహస్థు మాత్రమే చేయగలడు.

వార్ధక్యంలో కూడా వ్యక్తికి నీడనివ్వగలిగింది గృహస్థే.

దీన్ని బట్టి చూస్తేనే అర్థమౌతుంది సమాజానికి వెన్నెముక వంటివాడు గృహస్థు అని.

సన్న్యాసి లేకున్నా సమాజం నడుస్తుంది. కానీ గృహస్థు లేకపోతే సమాజం లేదని స్పష్టమౌతుంది. అయితే ఇన్ని కార్యాలూ సాధించి, కర్తవ్యం నిర్వహించాలంటే గృహస్థుడికి డబ్బు సంపాదించటం తప్పనిసరి. కాబట్టి తన సంసారం గడవటానికి, పదిమందికి దానం చేసేందుకు, ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సరిపడ ధనం సంపాదించటం కూడా వ్యక్తి నిర్దిష్టకర్తవ్యాలలో ఒకటి. అయితే ఈ ధనసంపాదన వెర్రిలా, వ్యామోహంలా, స్వార్థభావనతో కూడింది కాకూడదు. అందులో కూడా ఒక రకమైన సంయమనం ఉండాలి.

ఈ భావననే

'కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ సమాః।
ఏవం త్వయి నాన్యధేతో అస్తిన కర్మలిప్యత్ సరే॥'

అంటూ వ్యక్తపరిచారు మన పూర్వికులు. (శాస్త్ర విహితములైన కర్మలు చేస్తూ మాత్రమే వందేళ్లు జీవించకోరాలి. జీవితంపై ప్రీతి ఉన్నంత కాలం దుష్కర్మ కాలుష్యాన్ని దూరం చేసుకోవాలి).

దీన్ని బట్టి చూస్తే మన భారతీయధర్మంలోని విజయభావన సంపూర్ణస్వరూపం అర్థమౌతుంది. మనం పరీక్షలు ప్యాసు కావాలి. ఇంటర్వ్యూలలో గెలవాలి. మంచి ఉద్యోగాలు సంపాదించాలి. బాగా డబ్బు సంపాదించాలి. పెద్ద పెద్ద వ్యాపారాలు నిర్వహించాలి. బిల్ గేట్స్ తలదన్నేట్టు ఎదగాలి. కానీ, ఇదే అంతిమలక్ష్యం కారాదు. ఇదే మన విజయానికి సంపూర్ణస్వరూపం కాకూడదు! ఈ కోరికల వెనుక, వాంఛల వెనుక కర్తవ్యపరాయణభావన ఉండాలి. ఆధ్యాత్మికభావన అంతర్లీనంగా ఉండాలి. వ్యక్తి తన సామాజికబాధ్యతను గుర్తించి, వ్యక్తిగతబాధ్యతలను అర్థం చేసుకొని వీటి మధ్య సమన్వయం సాధించాలి. ఇది అసలు విజయం.

# వ్యక్తిత్వం - మనస్సు

## మనస్సు గుఱ్ఱం - వేయాలి కళ్ళెం

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యం సరిహద్దు వద్ద ఓ చెట్టు కింద ఓ ముసలాయన కూర్చుని ఉన్నాడు. ఇంతలో మరో ముసలాయన ఆ దారిన పోతూ చెట్టు దగ్గరకు వచ్చి ఆగి, కూచున్న ముసలాయనను చూసి నవ్వాడు. 'నువ్వెన్ని వేషాలు వేసినా నేను గుర్తు పట్టేశానులే. సాధువు వేషంలో ఉన్న గూఢచారివని నేను గ్రహించాను. గూఢచారిని గూఢచారే పసిగట్టగలడు' అని నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

కాస్సేపటికి గుర్రం మీద ఓ వ్యక్తి వచ్చాడు. 'దొంగతనం చేసేందుకు మంచి వేషమే వేశావు. నేనూ దొంగనే. పొరుగు రాజ్యంలో దొంగతనం చేసి ఈ రాజ్యంలో తల దాచుకుంటున్నాను. నాతో వస్తావా? ఇద్దరం కలిసి దొంగతనాలు చేయవచ్చు' అని అడిగాడు. కాని ముసలాయన ఏమీ మాట్లాడకపోవటంతో, తన దారిన తాను వెళ్ళిపోయాడు. ఇంకాస్సేపటికి ఊగుతూ, తూగుతూ ఓ వ్యక్తి వచ్చి చెట్టు కింది ముసలాయన వైపు చూశాడు.

'నువ్వు నాలాగే హద్దు దాటి తాగావా? మంచిది. నీ కన్నా ఎక్కువ తాగినా నేను చూడు. ఎంత నిశ్చలంగా ఉన్నానో, నువ్వు చూడు. తాగి పడిపోయావు' అని పెద్దగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు. సాయంత్రమవుతుండగా ఓ యువకుడు ఆ దారిన వచ్చాడు. ఆ సాధువు ముందు మోకరిల్లి 'స్వామీ... ఇది అడవి. రాత్రి ఇక్కడ ఉండటం ప్రమాదకరం. కాబట్టి ఈ రాత్రికి నా ఇంట్లో ఆతిథ్యం స్వీకరించండి' అని బ్రతిమిలాడాడు. ఆ సాధువు చిరునవ్వుతో అంగీకరించాడు.

ప్రపంచరీతిని, ప్రపంచం మనిషికి కనిపించే విధానాన్ని ఈ కథ ఎంతో సున్నితంగా ప్రదర్శిస్తుంది. అక్కడ కూచున్నది ఒకే మనిషి. కానీ దొంగకు దొంగలాగా, తాగుబోతుకు తాగినవాడిలాగా, గూఢచారికి గూఢచారిలాగా, ఇంకొకరికి సాధువులాగా కనిపించాడు.

ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు? ఈ విషయం ఆ వ్యక్తికే తెలుస్తుంది. అందుకే అంటారు పెద్దలు 'మన దృష్టి ఎలాగుంటే ప్రపంచం అలా కనిపిస్తుం'దని. మనం చూసే దృష్టిని మన మనస్సు నిర్దేశిస్తుంది. మనసులో ఉన్న భావం మెదడును ప్రభావితం చేస్తుంది. కంటి ద్వారా మెదడు ప్రపంచాన్ని మనసుకు నచ్చిన రంగులతో చూస్తుంది. చూపిస్తుంది.

మనం మనకు పరిచయమైన అనేకులలో ఒక విషయం గమనిస్తాం. అదేమిటంటే, మనకు సాధారణంగా కనిపించే విషయాలు, ఎదుటివారికి జీవన్మరణసమస్యలా అనిపిస్తూంటాయి. పరీక్షలు వస్తున్నాయంటే, తల్లిదండ్రులు ఉద్యోగాలకు సెలవులు పెట్టి మరీ పిల్లల్ని చదివిస్తుంటారు. ఎంతో ఉద్విగ్నతకు గురవుతుంటారు. పిల్లవాడిని కదలనీయరు, మెదలనీయరు. ఇరవై నాలుగు గంటలూ చదవమని ఒత్తిడి చేస్తుంటారు. ఇదంతా చూసేవారికి హాస్యాస్పదంగా ఉంటుంది. 'ఎల్కేజీ పరీక్షకు ఇంత హైరానా పడతారా?' అని హేళన చేస్తాం. కానీ అదే పరిస్థితిలో మనం ఉంటే అంత కన్నా ఎక్కువగా ఆందోళన చెందుతాం. ఇది పిల్లల పరీక్షలకే కాదు, నిత్యజీవితంలో ప్రతి అంశంలోనూ మనం చూడవచ్చు.

రైలు ఎక్కటానికి వెళ్తూంటే, గంట ముందు బయలుదేరినా, సమయానికి రైల్వే స్టేషన్ చేరగలమా, లేదా అని కంగారు పడతాం. తీరా రైలెక్కగానే ఇంటికి తాళం వేశామా, లేదా అని బాధపడతాం. ఎదుటివాడేదైనా ఓ మాట అనగానే 'వాడెందుకు ఇలా అన్నాడు?' అని తెగ ఆలోచించి, మనకు తోచిన నిర్ధారణకు వచ్చేస్తాం. లేకపోతే ఎదుటివాడు అసూయతో అలా అన్నాడని కోపం తెచ్చుకుంటాం. ఒకోసారి ఎదుటివాడి మనసులో లేని ఊహలను ఊహించేసుకుని ద్వేషాన్ని పెంచుకుంటాం. బంధాలను తెంచుకుంటాం.

ఇద్దరు ప్రాణస్నేహితులుండేవారు. ఒకరిని వదిలి ఒకరు ఉండేవారు కారు. రెండేళ్ళు ఎదిగిన వాళ్ళ స్నేహం క్షణంలో చెదిరిపోయింది. అరుణ్ తన గురించి ఏదో అన్నాడని కిరణ్‌కు తెలిసింది. అంతే, అరుణ్‌తో మాట్లాడటం మానేశాడు. అరుణ్‌కి తానంటే అసూయ, తనని చులకన చేశాడు అని బాధపడుతూ అరుణ్‌కి దూరమైపోయాడు. ఇరవై ఏళ్ళ తరువాత, ఎవరి దారుల్లో వారెదిగిన తరువాత, అనుకోకుండా మళ్ళీ కలిశారు. ఇంకా అరుణ్ అన్న మాటలు తలచుకుని కిరణ్ కుములుతూనే ఉన్నాడు. అరుణ్‌కి ఆ విషయమే గుర్తు లేదు. కానీ ఆ కారణంగా కిరణ్ తనతో మాట్లాడటం మానేశాడన్న విషయం గుర్తుంది. కిరణ్ ద్వారా విన్న అరుణ్ నవ్వేశాడు. 'ఒక్కసారి నన్ను అడగవచ్చుగా. నిజమేంటో తెలిసేది?' అనేశాడు.

ఇది విన్న కిరణ్‌కు తన తప్పు గ్రహింపులోకి వచ్చింది. ఇన్నాళ్ళూ తాను విషయాన్ని తన దృష్టితోనే చూస్తూ కుములుతూ వచ్చాడు. ఒక మంచి మిత్రుడితో సంబంధాన్ని తెంచుకున్నాడు. ఇదే తాను ఆగి ఒక్క క్షణం ఎదుటివాడి దృష్టితో ఆలోచించి ఉంటే? మనసు విప్పి మాట్లాడి ఉంటే? అలా జరగలేదు. ఎందుకంటే అతడి మనసులోని భావనలు మెదడుని ప్రభావితం చేశాయి. మెదడు దృష్టిని నిర్దేశించింది. నిత్యజీవితంలో అనుక్షణం మన ప్రవర్తనని, మన ఆలోచనలను, మన ఊహలను నిర్దేశించి, ప్రభావం చూపిస్తుంది మనసు. అందుకే మన పూర్వీకులు వ్యక్తి మనస్సును నియంత్రించటం వ్యక్తిత్వవికాసంలో ప్రధానపాత్ర వహిస్తుందని నిర్ణయించారు.

'మనసు గుఱ్ఱము రోరి మనిషీ మనసు కళ్ళెము లాగు మనిషీ' అని బోధించారు. అంతే కాదు, శిశువు వ్యక్తిత్వవికాసం పుట్టిన పదేళ్ళలో, యౌవ్వనంలోనో కాదు, మాతృగర్భంలో పిండదశలో ఉన్నప్పటి నుంచీ ఆరంభమౌతుందని గ్రహించారు. ఆ సమయం నుండీ శిశువు ఉత్తమవ్యక్తిత్వాన్ని పెంపొందించేందుకు సూత్రాలను రూపొందించారు.

గర్భవతి ఐన స్త్రీ సుఖంగా, సంతోషంగా ఉండాలి. మంచి మాటలు వినాలి. మంచి ఆలోచనలు చేయాలి. భర్త, ఇతరబంధువులు ఆమెకు కష్టం కలగకుండా చూడాలి. ఆమె కోరికలు తీర్చాలి. ఆమె ఎటువంటి ఒత్తిడికీ గురి కాకూడదు. ఎటువంటి ఆందోళనలు చెందకూడదు. ఇందుకోసం రకరకాల పద్ధతులను ఏర్పరచారు.

శిశువు జననం తరువాత ప్రథమగురువు 'తల్లి' అని నిర్దేశించారు. తల్లి పాడే లాలిపాటలు, జోలపాటలు, బుజ్జగింపులు, ప్రేమచర్యలు సర్వం పిల్లవాడి వ్యక్తిత్వ వికాసంలో ప్రథమపాఠాలు. ఆపై తండ్రి ప్రేమ, బంధువుల అనురాగం, పెద్దల మార్గనిర్దేశనం పిల్లవాడిని వేలు పట్టుకుని ఉత్తమవ్యక్తిత్వ సాధనమార్గంలో నడిపించే అంశాలు.

బాల్యంలో ఇంట్లో, నేర్చుకున్న అంశాల నిగ్గు తేల్చుకుని, స్వీయవ్యక్తిత్వాభివృద్ధికి రాచబాట నిర్మించుకోవటం పాఠశాలకు వెళ్ళటంతో ఆరంభమౌతుంది. అంత వరకూ తానే కేంద్రబిందువుగా ప్రపంచం నడుస్తుందనుకున్న పిల్లవాడు సమాజంలో అడుగిడతాడు. పాఠశాలలో తనలాంటి అనేకకేంద్రబిందువులను చూస్తాడు. వారికీ, తనకూ భేదాన్ని గుర్తిస్తాడు.

ప్రతి వ్యక్తీ ఎవరికి వారు ప్రత్యేకమైనా, ఎలాగైతే ఏ నీటి బిందువుకు ఆ నీటి బిందువు ప్రత్యేకం అయినా, జలప్రవాహంలో మిళితమై ప్రవహిస్తుందో, అలా తానూ సామాజిక స్రవంతిలో ఒక భాగం అని గ్రహిస్తాడు. అతడికి ఈ గ్రహింపునిచ్చేది అధ్యాపకులు, తోటి విద్యార్థులు, సామాజికవాతావరణం, పాఠ్యాంశాల వంటివి. అంతవరకూ తాను నేర్చుకున్నవాటికీ, ఇప్పుడు నేర్చుకుంటున్న వాటికీ నడుమ తేడాలు గుర్తిస్తాడు. తాను నమ్ముతున్నవాటిని, ఎదురుగా కనబడుతున్నవాటితో పోలుస్తాడు. అతడి అంతరంగంలో సంఘర్షణ చెలరేగుతుంది. ఈ సంఘర్షణ ఫలితంగా అతడి వ్యక్తిత్వం రూపు దిద్దుకుంటుంది. ఇక్కడ మనసు ప్రాధాన్యం స్పష్టంగా తెలుస్తుంది. ఆ మనసుపై శిశువు జననం నుంచీ పడిన ప్రభావాలు ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటాయి. అందుకే మన పూర్వీకులు శిశువు మనసుపై మంచి ముద్రలు వేసేందుకు అనేక విధాలైన నియమాలను, సూత్రాలను ఏర్పాటు చేశారు.

ప్రతి పాఠ్యాంశం ముందూ ప్రార్థన ఉంటుంది. ఆ ప్రార్థనలో విశాల భావాలుంటాయి. ఉన్నతమైన ఆలోచనలుంటాయి. పరస్పరసహకారంతో సుఖశాంతిమయజీవనం సాధించాలన్న ఆశయం ఉంటుంది. ప్రతి వ్యక్తిలో భగవంతుడుంటాడని, ప్రపంచమంతా భగవంతుడేనన్న భావనలుంటాయి. దాంతో వ్యక్తి తనకూ, సాటి మనిషికీ నడుమ ఉన్న సంబంధాన్ని గ్రహించగలుగుతాడు. ప్రకృతికీ, తనకూ నడుమ ఉన్న అనుబంధాన్ని గుర్తిస్తాడు. తాను ఎంత ప్రత్యేకమైనా, విశ్వప్రణాళికలో తన సామూహికబాధ్యతను అర్థం చేసుకుంటాడు. విశిష్టవ్యక్తిత్వాన్ని సాధిస్తాడు. తన మనసు తనతో ఆడే ఆటను గుర్తిస్తాడు. మనసు, బుద్ధిల నడుమ సమన్వయం సాధించి, ప్రపంచాన్ని అంతర్నేత్రంతో చూడటం ఆరంభిస్తాడు. ఉత్తమవ్యక్తిత్వవికాసానికి పూర్వీకులు ఏర్పరచిన రాచబాటలో ప్రయాణం ఆరంభిస్తాడు. ఐతే కాలం మారింది. ప్రాచీనకాలానికీ, ఇప్పటికీ ఎంతో తేడా ఉంది. జీవితంలో వేగం పెరిగింది. అప్పటిలా ఇప్పుడు తీరికగా ఆలోచించి పనులు చేసే సమయం లేదు. వ్యక్తికి అద్దంలో తన ముఖం చూసుకునే సమయమే లేదు ఇక అంతరంగంలోకి తొంగిచూడాలన్న ఆలోచన వచ్చే ప్రసక్తే లేదు.

తల్లిదండ్రులకు తమ స్వీయవ్యక్తిత్వసంఘర్షణలతో సమన్వయం సాధించే ఓపిక ఉండటం లేదు. సమాజంలో సాటి మనిషి గురించి ఆలోచించే భావం ఉండటం లేదు. గుఱ్ఱం వంటి మనసుకు కళ్ళెం వేసే ఆలోచన అటుంచి, మనసు గుఱ్ఱం అన్న భావనను తెలుసుకునే తీరిక కూడా లేదు. మరి ఇటువంటి పరిస్థితులలో ప్రాచీనులు నిర్దేశించిన సూత్రాలూ, నియమాలూ పనికి వస్తాయా? వాటి ఆదరణ కుదురుతుందా? వాటి ద్వారా

వ్యక్తిత్వవికాససాధన జరుగుతుందా? జరిగితే అది ఎటువంటి వ్యక్తిత్వవికాసం? అన్న సందేహాలు జనించటం స్వాభావికం. ఇటువంటి సందేహాలను నివృత్తి చేసుకుంటూ, ప్రాచీనులు నిర్దేశించిన సూత్రాలను సమకాలీన సామాజికపరిస్థితులకు అన్వయించు కుంటూ ముంచుకు వస్తున్న ఆధునిక పాశ్చాత్యనాగరికప్రళయం నడుమ స్థిరంగా నిలిచి, మనసును నియంత్రించి వ్యక్తిత్వవికాసం సాధించే పద్ధతులను చర్చిద్దాం.

## అందమైన రంగుల వల

ఓ సారి కొందరు సాధువులు తీర్థయాత్రలకు బయలుదేరారు. వారందరి దగ్గరా కంబళ్ళున్నాయి. ఒక సాధువు దగ్గర మాత్రం కంబళి లేదు. ఇంతలో పొంగి ప్రవహిస్తున్న నది వారి దారికి అడ్డం వచ్చింది. నది దాటే ఆలోచన చేస్తూండగా, నదిలో కొట్టుకు పోతున్న కంబళి ఒకటి సాధువు కంటపడింది. అంతే, ఎవరెంత వారించినా వినకుండా ఆ సాధువు నదిలో దూకాడు. కంబళిని పట్టుకున్నాడు. కానీ నీటిలో కొట్టుకుపోతున్నాడు. మిగిలినవారు అతడిని పిలిచారు. కంబళిని వదిలి ఒడ్డుకి వచ్చేయమన్నారు. కానీ ఆ సాధువు వదలినా కంబళి అతడిని వదలటం లేదు. ఎందుకంటే, అది కంబళి కాదు, ఎలుగుబంటి.

ప్రస్తుతం సమాజం మొత్తం కంబళి అనుకుని ఎలుగు బారిన పడుతోంది. ఉన్నదాంతో సంతృప్తి లేక సుళ్ళు తిరిగే ప్రవాహంలో పడి, కంబళి అనుకొని భల్లూకపు పట్టుకు చిక్కుతుంది. మనమంతా ఈ భ్రమ ప్రలోభంలో పడి ఉన్నవారమే. ప్రస్తుతం, డబ్బు సంపాదన కంబళిలా మనపై భల్లూకపు పట్టు బిగించింది. ఇది ఒక తరం నుంచి మరో తరానికి మరింతగా బిగుస్తూవస్తోంది. ఈ పట్టులో పెరిగి పిల్లలు పెద్దవాళ్ళవు తున్నారు. తల్లిదండ్రులవుతున్నారు. ఇదే పట్టును తమ సంతానానికి అందజేస్తున్నారు. వారు పెరిగి పెద్దవారై తమ సంతానానికి వారసత్వంగా ఈ భల్లూకపు పట్టును అందిస్తున్నారు.

అనగనగా ఓ వ్యక్తి. అతనికి ఎదురుగా చేయి చాస్తే అందేంత దూరంలో రంగుల డబ్బు వల కనిపించింది. చేయి సాచి అందుకోబోయాడు. అది కాస్త ముందుకు జరిగింది. దాన్ని అందుకోవాలని దాని వెంట పరుగెత్తాడు. అదీ అంతే వేగంగా ముందుకు జరిగింది. ఇలా జీవితమంతా అందని డబ్బు వల వెంట పరుగిడుతూ గడిపాడు. చివరికి విసుగొచ్చి వెనక్కి తిరిగి చూశాడు. డబ్బుల వల ఎలాగూ అందలేదు, కానీ వెనుతిరిగి చూస్తే కనిపించింది చేజారిపోయిన జీవితం. అంటే, ఎంతకూ అందని, అందినా సంతృప్తి

నివ్వని 'డబ్బు' వెంట పడటం వల్ల మనం అమూల్యమైనది, కరిగిపోతే తిరిగి రానిది ఐన జీవితాన్ని విస్మరిస్తున్నామన్నమాట. ఐతే వ్యక్తికి ఈ గ్రహింపు వచ్చేసరికి జీవితం చేజారిపోయి ఉంటుంది. తాను గ్రహించిన ఈ సత్యం తన సంతానానికి వివరించాలను కుంటే, వినే ఓపిక వారికి ఉండదు. ఎందుకంటే, వారూ ఈ రంగుల వలలో చిక్కుకున్నవారే! ప్రస్తుతం ప్రపంచీకరణనేపథ్యంలో, వాణిజ్యం అగ్రతాంబూలం అందుకుంటున్న సమాజంలో ప్రతి మనిషీ ఒక డబ్బు మూటగా భావింపబడుతున్నాడు. ప్రతీ వ్యక్తీ ప్రపంచపు బజారులో ఒక 'శాల్తీ'గా మాత్రమే పరిగణింపబడుతున్నాడు. తెలిసో తెలియకో, మన ప్రమేయం లేకుండా మనమంతా ఈ విపణిలో శాల్తీల మౌతున్నాం. మన తరువాత తరాలనూ శాల్తీలుగానే పెంచుతున్నాం.

పిల్లవాడు పుట్టినప్పటి నుంచీ 'టీవీ' ఆట వస్తువు అవుతోంది. టీవీలో వచ్చే శబ్దాలకు పిల్లవాడు స్పందిస్తున్నాడు. ఒకప్పుడు చందమామను చూపి అన్నం తినిపించేవారు. ఇప్పుడు టీవీలో ప్రకటనలను చూపి, సీరియల్ పాటను వినిపించి ఆడిస్తున్నాం. ఆ పాటలు పిల్లవాడితో పాడించుకుని ఆనందిస్తున్నాం. మరి కాస్త ఊహ వచ్చేసరికి కార్టూన్ల ప్రపంచం పిల్లవాడిని అలరిస్తుంది. ఆపై రీ మిక్స్ పాటలు, సినిమాలు ఆకర్షిస్తాయి. సినిమాల్లో హీరోల ఆవేశాలు, లైంగికనృత్యాలు, పోరాటాలు అద్భుతం అనిపిస్తాయి. పిల్లలు వాటిని అనుకరిస్తూంటే చూసి మనం మురిసిపోతూంటాం.

ఈ మధ్యకాలంలో పాఠశాలల సంవత్సరాంతపు సంబరాలలో సినిమా పాటలు, డిస్కోలు, వాటికి పిల్లలు నృత్యాలు చేయటం, అవి చూసి అందరూ ఆనందించటం సర్వసాధారణమైపోయింది. పాఠశాలల్లో కూడా పాఠాలు బట్టీ పట్టటం, హోమ్ వర్క్ చేయించటం, ఫీజులు వసూలు చేయటం తప్ప మరో అంశంపై దృష్టి ఉండటం లేదు. చదువుతున్నంత కాలం తల్లిదండ్రుల దృష్టి పిల్లవాడు సాధించే మార్కుల మీద ఉంటుంది. ట్యూషన్లు, కోచింగ్‌లు, ఆపై ఇంజినీరింగ్, మెడిసిన్... ఎంట్రెన్సు పరీక్షలు... వాటికి ఫీజులు జమచేయటాలు.... ఇలా తల్లిదండ్రుల ప్రపంచం ఒక వైపు డబ్బు సంపాదనలో, మరో వైపు పిల్లల భవిష్యత్తు గురించిన ఆందోళనలో గడిచిపోతోంది.

ఇక పిల్లల ప్రపంచం చూస్తే.... బాల్యంలోనే వారి దృష్టిని ఎన్నిరకాల ఆకర్షణలు ఆకర్షిస్తాయో, అన్ని ఆకర్షణలతో పరిచయం అవుతోంది. చాక్లెట్లు, కూల్ డ్రింక్‌లు, పిజ్జాలు, బర్గర్లు, సోడాలు, మాదక ద్రవ్యాలు, మద్యపానీయాలు అన్నీ తెలుస్తున్నాయి. హీరో హీరోయిన్ల గంతులు, టీవీల్లో కనబడే లైంగికనృత్యాలు, దృశ్యాలు, కండోమ్‌లు,

– ఒకటేమిటి బాల్యదశను అనుభవించకుండానే పిల్లల్లో యౌవనం అంకురిస్తోంది. విరగబూస్తోంది. పైగా, ప్రేమ అనేదేదో అద్భుతం అని, ఉత్తమకార్యం అనీ జరిగే ప్రచారం ఎంత ప్రతిభావంతంగా ఉంటోందంటే, అయిదు ఆరు తరగతుల పిల్లలు కూడా ప్రేమ వలలో చిక్కుతున్నారు. పార్కుల్లో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. తల్లిదండ్రులను ఎదిరించి అదే హీరోయిజం అనుకుంటున్నారు. కొన్నాళ్ళకి నిజానిజాలు తెలిసేసరికి మానసికరోగులవుతున్నారు. 'పిల్లల పెంపకంలో ఎక్కడ లోపం జరిగిందో' అర్థం కాక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. ఈ రకంగా సమాజం మొత్తం ఒక దిశ, ఆదర్శం అంటూ లేక వ్యాపారసంస్కృతి సృజించిన ప్రచారప్రవాహవేగంలో కొట్టుకుపోతూ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. భయంకర భల్లూకపుపట్టులో చిక్కుకుని దిక్కు తోచక అల్లల్లాడుతోంది. విషం తినటం అలవాటైన ప్రాణి విషం తింటూ, విషంలోనే బ్రతికే చందాన సమాజం మొత్తం వ్యాపారప్రచారవిషం తింటూ ఎదుగుతోంది. ఆ విషాన్నే సర్వస్వంగా భావిస్తోంది.

ఈ పరిస్థితి నుంచి మనం స్వయంగా తప్పించుకోవాలన్నా, మన సంతానాన్ని, తరువాత తరాలను తప్పించి వారి వ్యక్తిత్వం వికసించేట్టు చేయాలన్నా ఈ వేగవంతమైన యాంత్రికజీవనం నుంచి, ప్రచారప్రభావం పరచిన రంగుల వలలు, ఏర్పరచిన రంగుల కలలను దాటి ఒక్క క్షణం భారతీయధర్మచింతన వైపు దృష్టి సారించాలి. భారతీయ ధర్మంపై ఉన్న అపోహలను పక్కన పెట్టి, ఒక్క క్షణం మన ధర్మం విధించిన విధుల గురించి ఆలోచించాలి.

ప్రస్తుతజీవనవిధానాన్ని గమనిస్తే కాలాన్ని వెనక్కు తిప్పటం కుదరని పని అని అర్థమౌతుంది. 'కన్స్యూమరిజం కల్చర్'ను విస్మరించటం అసాధ్యం అని స్పష్టమౌతుంది. కానీ సుళ్ళు తిరిగే ప్రచండప్రవాహం మధ్యలో ఉంటూ కూడా నిశ్చలంగా, శాంతంగా ఉండే వీలు భారతీయ ధర్మం కల్పిస్తుంది. తన నిత్యజీవితకర్మలను పాటిస్తూ కూడా ఎటువంటి వికారాలకూ లోనుకాకుండా, నిర్మలంగా తన జీవికను కొనసాగించే శక్తిని భారతీయజీవనవిధానం అందిస్తుంది.

*ఓం భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః*
*భద్రం పశ్యేమాక్షభిర్య జత్రాః॥*
*స్థిరైరంగై స్తుష్టు వాగ్ం సస్తనూ భిర్*
*వ్యశేమ దేవహితం యదాయుః॥*

సాధారణంగా ప్రతి ఉపనిషత్తుకూ ముందు శాంతిపాఠం ఉంటుంది. ఇప్పుడు పాఠశాలల్లో ముందు ప్రతిజ్ఞ, ప్రార్థనల వంటివి చేసే అలవాటుకు మూలం ఇది. ఉదయం లేవగానే, పాఠం ప్రారంభించే ముందు ప్రతి విద్యార్థి ఈ శాంతిపాఠం వల్లె వేస్తాడు. ఇది కాకపోతే,

'సహనావవతు సహనౌభునక్తు
సహవీర్యం కరవావహై
తేజస్వినావధీత మస్తు మా విద్విషావహై
*ఓం శాంతిః శాంతిః శాంతిః'*

అన్న శాంతిపాఠం ఉంటుంది. ఇలా రోజూ ఉదయం పాఠాలు ఆరంభించే ముందు శాంతిపాఠం చదవటాన్ని మనం విమర్శిస్తాం. హేళన చేస్తాం. ఉదయం లేవగానే భగవద్ధ్యానం చేయటం, భగవంతుడి పేరు స్మరించటాన్ని ఎద్దేవా చేస్తాం. కాని దీని వెనుక ఓ గొప్ప మానసికశాస్త్రవిషయం ఉంది.

'యద్భావం తద్భవతి' అన్న వాక్యం అర్థం అందరికీ తెలుసు. ఎలా భావిస్తే అలా జరుగుతుంది. మనం ఎటువంటి భావన చేస్తే అలా జరుగుతుంది అన్నదీ వాక్యం అర్థం. అందుకే 'పాటిజివ్ థింకింగ్' నేర్పేవారు, పరీక్షలకు వెళ్ళే ముందు విద్యార్థులు 'నే నీ పరీక్ష బాగా రాస్తాను. ప్యాసవుతాను' అనుకుంటూ వెళ్ళాలని బోధిస్తారు. ఇంటర్వ్యూల్లో గెలవాలని అనుకునేవారు 'నేను ఇంటర్వ్యూ బాగా చేస్తాను. వారడిగే ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇస్తాను. ఇంటర్వ్యూలో నెగ్గుతాను' అనుకోవాలని సూచిస్తారు. ఏదైనా కఠినమైన కార్యం ఆరంభించే ముందు, వీలైతే ఆ పనిని మనం విజయవంతంగా నిర్వహించినట్టు, అందరూ మనల్ని అభినందిస్తున్నట్టు ఊహించాలని నేర్పుతారు. ఇలా ఊహించటం వల్ల వ్యక్తిలో ఉద్విగ్నత తగ్గి తాను విజయం సాధించగలడన్న భావన కలుగుతుంది. తనపై తనకు విశ్వాసం పెరుగుతుంది. విజయం సాధ్యమౌతుంది. దీన్ని మానసికశాస్త్రం కూడా సమర్థిస్తుంది – ఇటువంటి ఊహలను, ఆలోచనలను దీన్ని 'సెల్ఫ్ హిప్నాసిస్ టెక్నిక్' అంటారు.

ఈ సూత్రాన్ని భారతీయజీవనవిధానం పిల్లవాడికి ఊహ తెలిసినప్పటి నుంచీ అమలుపరుస్తుంది. పిల్లవాడేదైనా దురూహ చేస్తే పెద్దలు వెంటనే 'అలా అనకూడదు – పైన తథాస్తు దేవతలుంటారు' అని అంటారు. వారు 'తథాస్తు తథాస్తు' అంటూనే ఉంటారు. మనం ఏదైనా చెడు మాట్లాడే సమయానికి వారు 'తథాస్తు' అన్నారా, ఆ

చెడు జరిగి తీరుతుంది. కాబట్టి మనం చెడు అనకూడదు. చెడు ఆలోచన చేయకూడదు. ఎందుకంటే మనసులో మాటలూ దేవతలకు తెలుస్తాయి కదా! ఈ రకంగా దుష్టాలోచనలను చేయకపోవటాన్ని, చెడు జరుగుతుందన్న ఊహను కూడా దరిదాపులకు రానీయకపోవటాన్ని మనం బాల్యం నుంచే అలవాటు చేస్తామన్నమాట. అయితే 'తథాస్తు దేవతలు' పుక్కిటి పురాణాలు, మూఢ నమ్మకాలు అనటంతో ఆలోచనలపై అదుపు తప్పింది. దేవతలు 'తథాస్తు' అంటూనే ఉన్నారు.

అందుకే, బాల్యం నుంచీ 'మనం శుభాన్నే వినాలి. శుభాన్నే చూడాలి. దేవతల స్తోత్రం గానం చేసేందుకు మనం పూర్తి ఆరోగ్యం, బలాలతో నియమిత ఆయుఃకాలం గడపాలి' అన్న శాంతిపాఠం పిల్లలతో వల్లెవేయిస్తాం. అంటే చెప్పకుండానే వారికి మంచి వినాలి, మంచి ఆలోచనలు చేయాలి. మంచి చేస్తూ నిండు నూరేళ్ళు బ్రతకాలి అన్నది నేర్పుతున్నామన్నమాట.

బాల్యంలో వ్యక్తి మెదడుపై పడిన ముద్రలు అతడితో జీవితాంతం ఉంటూ, అతడి ఆలోచననూ, ప్రవర్తననూ, వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేస్తాయని ఆధునికమానసికశాస్త్రం చెప్తుంది. చిన్నప్పటి నుంచీ, నయానో, భయానో మంచి ఆలోచనలు వ్యక్తికి అలవాటైన తరువాత ఆ భయం తొలగినా, వ్యక్తి కావాలన్నా చెడు ఆలోచనలు చేయలేడు. చెడు పనులు తలపెట్టడు. చిన్నప్పటి నుంచీ 'కలసి జీవించాలి, కలసి భుజించాలి, కలసి జ్ఞానం సంపాదించాలి' అన్న ఆలోచనలతో ఎదిగిన వ్యక్తిని ఏ శక్తీ కూడా విధ్వంసాలోచనల వైపు మళ్లించలేదు. బాల్యంలో తథాస్తు దేవతల భయం వల్ల మంచిగానే ఆలోచించటం అలవాటై, ఎదిగిన తరువాత తథాస్తు దేవతలు వట్టి కట్టుకథ అని తెలిసినా దుష్టాలోచనలను చేయలేడు. ఎందుకంటే మంచి ఆలోచనలు చేయటం అలవాటైపోతుంది. అంటే ఒక వయసు వచ్చి, కొన్ని అనుభవాల తరువాత మంచి ఆలోచనలు చేయమని బలవంతంగా బోధించే కన్నా, పసివయసులో, మెదడుపై ఎటువంటి దుష్ప్రభావాలూ పడకముందే నేర్పించటం వ్యక్తిత్వవికాసానికి బలమైన పునాది అవుతుంది. భారతీయజీవనవిధానంలో వ్యక్తిత్వవికాసదిశలో ఇది తొలి అడుగు.

## సెల్ఫ్ హిప్నాసిస్ - సెల్ఫ్ హెల్ప్

అనగనగా ఓ గురువుకు ఇద్దరు శిష్యులుండే వారు. మరణసమయం ఆసన్నమైందని గ్రహించిన గురువు తన ఇద్దరు శిష్యులలో ఒకడిని పిలిచి 'ఒక మంత్రం గోప్యంగా ఉపదేశించాడు'. ఇది మహామంత్రం. నా గురువు ఈ మంత్రాన్ని నేర్చుకున్నాడు. కానీ

ఉపయోగించలేదు. నాకు ఉపదేశించాడు. నేను నీకు అందిస్తున్నాను. ఎంతో శక్తిమంతమైన మంత్రం ఇది. ఈ మంత్రసాధన తరువాత మూడు కోరికలు తీరతాయి. కానీ ఎంతో విచక్షణతో జాగ్రత్తగా కోరికలు కోరాలి' అని ఆదేశించాడు. గురువు మరణించాడు. శిష్యుడు ఆ మంత్రాన్ని ఉపయోగించలేదు. ఇది చూసిన రెండో శిష్యుడు, తనకా మంత్రం ఉపదేశించమన్నాడు. ప్రయోగించని మంత్రం వల్ల లాభమేమిటని వాదించాడు. ఆ మంత్రాన్ని సరిగ్గా ఉపయోగించే విచక్షణ తనకు ఉందని నమ్మించాడు. చివరికి మంత్రాన్ని నేర్చుకున్నాడు, ఉపయోగించాడు. మంత్రదేవత ప్రత్యక్షమై కోరికలు కోరమంది. అతడు సంతోషిస్తూ మూడు వరాలు కోరాడు. 'నేనెప్పటికీ ముసలివాడిని కాకూడదు. నాకు బోలెడంత ధనం రావాలి. నేను రాజు కన్నా ఎక్కువ శక్తిమంతుడ నవ్వాలి.' ఆ మూడు వరాలూ పొందిన శిష్యుడు గర్వంతో, మొదటి శిష్యుడి దగ్గరకు వెళ్ళి తన గొప్పలు చెప్పుకుని, వెక్కిరించాడు. దానికి మొదటి శిష్యుడు జాలిగా నవ్వి అన్నాడు : 'విచక్షణ లేని విజ్ఞానం అనర్థదాయకం. ఒక మహామంత్రాన్ని ఉపయోగించి సాధారణమైన కోరికలు కోరావు. అందువల్ల మంత్రశక్తి వ్యర్థమైంది. నీ జీవితం వ్యర్థమైంది' అన్నాడు. 'అదేమిటి, రాజు కన్నా శక్తిమంతుడిని, ధనవంతుడిని అయ్యాను. నిత్యయౌవనుడిని. ఇంకేం కావాలి?' ప్రశ్నించాడు, శిష్యుడు గర్వంగా. 'నువ్వు ఎన్నటికీ ముసలి వాడివి కాలేవు. ఎందుకంటే మరో నిముషంలో నీ జీవితం సమాప్తమవబోతోంది. ఇక ధనధాన్యాలు, రాజును మించిన శక్తిని ఎలా అనుభవిస్తావో నీ ఇష్టం' అన్నాడు. అతడి మాటలు పూర్తి కాక ముందే వరాలు పొందిన శిష్యుడు కిందపడ్డాడు. మరణించాడు. అతడు ఇక ఎన్నటికీ ముసలివాడు కాలేదు.

విజ్ఞానానికీ విచక్షణకూ నడుమ ఉన్న సంబంధాన్ని ఎంతో సున్నితంగా ప్రదర్శిస్తుందీ కథ. వ్యక్తికి ఆత్మవిశ్వాసం పెరిగి తాను తలపెట్టిన పనులలో విజయవంతుడు కావాలంటే విజ్ఞానానికి విచక్షణ తోడవ్వాలి.

'సెల్ఫ్ హిప్నాసిస్' పద్ధతిలో వ్యక్తి తన ఊహాశక్తిని సకారాత్మకంగా వాడటం చూడవచ్చు. తన బలాబలాలను అంచనా వేసుకుని, తన బలహీనతలను విశ్లేషిస్తూ, ఊహాప్రపంచంలో వాటికనుగుణమైన రీతిలో దృశ్యాలను ఊహించాలి. అయితే ఆ ఊహలను అల్లటంలో విచక్షణను విస్మరించకూడదు.

ఇంటర్వ్యూకి వెళ్ళే సమయంలో ఏమీ ప్రయత్నం చేయకుండా, తాను ఇంటర్వ్యూలో అద్భుతంగా సమాధానాలు ఇచ్చినట్టు ఊహించటం వల్ల ఫలితం ఉండదు. ఏమీ

చదవకుండా పరీక్షలు పరమాద్భుతంగా రాసి, పాసైపోయినట్టు ఊహించటం పగటికలలు తప్ప మరేమీ కాదు. 'సెల్ఫ్ హిప్నాసిస్' అభాసు పాలవటం తప్ప ఎటువంటి ఫలితమూ ఉండదు. కళ్ళు మూసుకుని రోడ్డు దాటుతూ, ఎటువంటి వాహనాలూ లేనట్టు ఊహించటం అనర్థదాయకం. కాబట్టి సకారాత్మకమైన ఊహాపద్ధతిని విచక్షణతో వాడాలి. ఆ పద్ధతిలో పరిమితులు అధికం.

'సెల్ఫ్ హిప్నాసిస్' పద్ధతి ఎటువంటివారికి ఉపయోగపడుతుందంటే, ఎంత బాగా పరీక్షలకు తయారైనా, ఉద్విగ్నత వల్ల సరిగ్గా పరీక్షలు రాయటంలో విఫలమయ్యేవారి ఉద్విగ్నతను తగ్గిస్తుందీ పద్ధతి. అంటే ఒక వ్యక్తి ఎంత తెలివి కలవాడైనా 'ఉద్విగ్నత' (టెన్షన్) ఆ వ్యక్తి జయాపజయాలపై ప్రభావం చూపిస్తుందన్నమాట.

ఐతే భారతీయ వ్యక్తిత్వవికాసవిధానంలో వ్యక్తిలో ఉద్విగ్నత కలిగే అవకాశాన్ని బాల్యం నుంచీ తొలగించే ప్రయత్నాలు జరుగుతాయి. 'సెల్ఫ్ హిప్నాసిస్' పద్ధతి ఒక వయసు వచ్చిన తరువాతనే ఉపయోగించే వీలుంటుంది. కానీ అప్పటికే వ్యక్తి అనుభవాలు, అతని స్వభావాన్ని ప్రభావితం చేసి ఉంటాయి. తద్వారా అతని ఆలోచనవిధానదిశ నిర్దేశితమైపోయి ఉంటుంది. కాబట్టి ఆ పద్ధతిని ఉపయోగించే ముందు, ముందుగా వ్యక్తి మానసిక స్థితిని అంచనా వేయాల్సి ఉంటుంది. అతని ఆలోచన ధోరణిని విశ్లేషించాల్సి ఉంటుంది. ఆ తరువాతనే సెల్ఫ్ హిప్నాసిస్ పద్ధతిని ఒక నిర్దిష్టమైన ప్రణాళిక ప్రకారం ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. అయినా, ఫలితం సరిగ్గా ఉంటుందన్న ఆశలేదు. అందుకే వ్యక్తిత్వవికాసపుస్తకాలు, డాక్టర్లు కుప్పతెప్పలుగా వస్తున్నా వ్యక్తిత్వ రాహిత్యంతో సమాజం బాధపడుతోంది.

మానవమనస్తత్వం, ఎదుగుదల విధానాన్ని, ఆలోచనపద్ధతులను ఆకళింపు చేసుకున్న పద్ధతిలో బాల్యం నుంచీ వ్యక్తిత్వవికాసం వైపు దృష్టి ఉంటుంది. 'మొక్కగా వంగనిది మానై వంగుతుందా?' అని ఓ సామెత ఉంది. 'పందిరి ఉన్న తీగ సక్రమంగా పెరుగుతుం'దని మరో సూత్రం ఉంది. వ్యక్తిత్వవికాసంలో ఈ రెండూ ఎంతో ఉపయోగ పడతాయి.

ఇక్కడ మొక్కని వంచటం అంటే అణగదొక్కటం కాదు. పిల్లవాడిని శిక్షించి, బెదిరించి మనం చెప్పినట్టు వినేట్టు చేసుకోవటం కాదు. అలాగే తీగకు పందిరి అల్లటం అంటే ఎదుగుదల కొరకు సక్రమమైన దిశను కల్పించటం మాత్రమే. ఆపై ఎదగటం తీగ బాధ్యత. దాంతో పందిరికి సంబంధం లేదు.

'మొక్క స్థాయిలోనే వంచటం' అంటే శిశువుకు ఊహలు తెలిసే స్థాయి నుంచి మంచి నేర్పటం. మంచిచెడులను గుర్తించే విచక్షణ నేర్పటం. దానికి తథాస్తు దేవతలు కానీ, శాంతిపాఠాలు కానీ ఒక దిశను ఇస్తాయి. పెద్దలను గౌరవించటం, సాటిమనిషితో సక్రమంగా ప్రవర్తించటం వంటివన్నీ బాల్యం నుంచీ నేర్పవలసిన అంశాలు.

ప్రతి మనిషిలో బాల్యం నుంచీ 'అహంకారం' అన్నది అంతర్గతంగా ఉంటుంది. ఊపిరిలో ఊపిరై, రక్తంలో రక్తమై, శరీరం అణువణువునా ఈ అహంకారం నెలకొని ఉంటుంది. దాంతో ఏమీ తెలియకున్నా అన్నీ తనకే తెలుసన్న భావన కలుగుతుంది. తాను సాధించలేనిదేదీ లేదన్న అభిప్రాయం ఉంటుంది. అందరూ తనని అపురూపంగా, గొప్పవాడిలా చూస్తారన్న నమ్మకం ఉంటుంది. ఈ భావనలు పిల్లల్లోనే కాదు, పెద్దల్లోనూ ఉంటాయి. బాల్యం నుండి పిల్లవాడితో సహా ఎదిగి పెద్దవవుతాయి. ఇటువంటి భావనలకు బాల్యంలోనే కళ్ళెం వేసి నియంత్రించకుంటే, పెరిగి పెద్దయిన తరువాత వ్యక్తి జీవితాన్ని ఛిన్నాభిన్నం చేయగలుగుతాయి. వ్యక్తినే కాదు, సమాజంపై కూడా అత్యంత ప్రభావం చూపిస్తాయా భావనలు.

అహంకారాన్ని సంపూర్ణంగా అణిచేయటం అంతిమలక్ష్యం. కానీ ఇది ఒక్క రోజులో సాధ్యమయ్యేది కాదు. ఒక్క రోజులో తగ్గించేయటమూ కుదరదు. కాబట్టి ఆరంభం నుంచీ నియంత్రణలో ఉంచే ప్రయత్నాలు చేస్తూండాలి. వ్యక్తిపై భారతీయ ధర్మం విధించే విధ్యుక్తధర్మాలు, బోధించే అంశాలు ఆరంభం నుంచీ అహంకారాన్ని అదుపులో ఉంచుతాయి. తద్వారా ఉద్విగ్నతపై పట్టు సాధించే వీలు కల్పిస్తాయి.

'ఆప్యాయన్తు మమాంగాణి వాక్ప్రాణచక్షుః శ్రోత్రమథో బలమింద్రియాణి చ సర్వాణి సర్వం బ్రహ్మోపనిషదం మాహం బ్రహ్మ నిరాకుర్యాం మామా బ్రహ్మ నిరాకలోద నిరాకరణ మస్త్వనిరాకరణం మే అస్తు తదాత్మాని నిరతే య ఉపనిషత్ ధర్మాస్తే మయి సన్తు తే మయి సన్తు'

ఇది విద్యార్థులు వల్లె వేసే శాంతిపాఠం. 'నా అవయవాలు, సర్వేంద్రియాలు శక్తిమంతమవ్వాలి. ఈ సృష్టిసర్వం బ్రహ్మమయం. నేను బ్రహ్మాన్ని ఎన్నడూ నిరాకరించ కూడదు. బ్రహ్మ నన్నెడూ నిరాకరించకూడదు. అసలు నిరాకరణా అన్న ఆలోచనే ఉండకూడదు. కనీసం నా వైపు నుంచి ఎటువంటి నిరాకరణ ఉండకూడదు. ఉపనిషత్తు ప్రకారం వ్యక్తికి ఉండవలసిన సద్గుణాలన్నీ నాలో ఉండాలి. నేను ఆత్మ పైనే ధ్యానమగ్నుణ్ని కావాలి.'

ఇక్కడ భారతీయతత్త్వచింతనలో భౌతిక, ఆధ్యాత్మికాల మధ్య సమన్వయసాధన ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తుంది.

వ్యక్తి బలంగా ఎదగాలి. అవయవాలు, ఇంద్రియాలు శక్తిమయం కావాలి. ఈ ఆలోచన పసితనం నుంచే కలిగిస్తున్నామన్నమాట. ప్రస్తుతం మనం బాల్యంలో శారీరక పరిశ్రమపై దృష్టి పెట్టం. వ్యాయామానికి ప్రాధాన్యాన్నివ్వం. చదువు, మార్కుల పైనే దృష్టి. ఆటలాడి పిల్లవాడు డబ్బు సంపాదించేయాలన్న ఆశ ఉన్నా, హోమ్ వర్క్, పాఠాలు బట్టీ పట్టటమే ప్రధానాంశం. దానికి తోడు జీవితంలోని ఉద్విగ్నత, రకరకాల అనారోగ్యకరమైన తిండి పదార్థాలు బాల్యంలోనే వ్యక్తిని శారీరకంగా బలహీనం చేస్తున్నాయి. అంటే ఏదైతే 'అవయవాలు, ఇంద్రియాలు బలంగా, శక్తిమంతమవ్వాలి' అన్న ఆలోచన ఉందో, ఆ ఆలోచన మనం ఇవ్వకముందే బలహీనం అయిపోతున్నా మన్నమాట.

ఇందుకు భిన్నంగా ఊహ తెలిసినప్పటి నుంచీ శక్తిమంతుడుగా ఎదగాలన్న ఆలోచన కల్పించాలి. రోజూ ఉదయం లేవగానే తాను శారీరకంగా దృఢంగా ఎదగాలి అన్న ఆలోచన పసితనం నుంచీ వ్యక్తిలో స్థిరపడిందంటే, అతడి దృష్టి ఆ వైపు మళ్ళుతుంది. ఒకవేళ ప్రకృతి అతనిపై ఎటువంటి పరిమితులు విధించినా వాటిని మించాలన్న పట్టుదల కలుగుతుంది. ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే, ఆరంభం నుంచీ శారీరకస్వస్థతను సాధించాలన్న ఆలోచన బీజాన్ని వ్యక్తిలో నాటటం.

మానవజీవితంలో ఒక వైచిత్రి ఉంది. బాల్యంలో ఒక ఆలోచనబీజం వ్యక్తిలో నాటటం జరుగుతుంది. కానీ అనేకకారణాల వల్ల ఆ బీజం నిద్రాణస్థితిలో ఉండిపోతుంది. కానీ కొన్నాళ్ళకు హఠాత్తుగా తనకు తెలియకుండానే వ్యక్తిలో ఆ బీజం ఎదుగుతుంది. వృక్షమౌతుంది. అతడి జీవనగమ్యాన్ని నిర్దేశిస్తుంది.

ఇందుకు గురూజీ గోల్వాల్కర్ జీవితం ప్రధాన ఉదాహరణ. బాల్యంలోనే ఆయనలో ఆధ్యాత్మిక భావనలు కలిగాయి. వాటితో పాటుగా కర్తవ్యపరాయణత ఆలోచన స్థిరపడింది. దాంతో ఆయన వ్యక్తిగా ఎదుగుతూ తన గమ్యాన్ని నిశ్చయించుకుని సన్న్యాసించాలను కున్నా, ఆయనలో పసితనంలోనే నాటిన కర్తవ్యపరాయణత, గురువు వాక్పరిపాలన వంటి బీజాలు వృక్షాలై, సమాజనిర్మాణానికి ఆయన జీవితాన్ని అంకితం చేసేందుకు తోడ్పడ్డాయి.

మహాత్మా గాంధీ బాల్యంలో చూసిన సత్యహరిశ్చంద్రుడు నాటకం ఆయనలో కలిగించిన భావనలు, గాంధీ భవిష్యత్తును ప్రభావితం చేసి 'సత్యసంధతతో ప్రయోగాలు' చేయటమే ఆయన జీవితలక్ష్యంగా ఎదిగేందుకు తోడ్పడ్డాయి. శివాజీలో అతని తల్లి, బాల్యంలో నాటిన దేశభక్తి బీజం, సాహసగాథల ఊపిరితో, గురువు ప్రోద్బలంతో ఎదిగి వృక్షమై భారతీయధర్మరక్షణకు జీవితాన్ని అంకితం చేసేట్టు చేసింది. ఇది బాల్యంలోనే మంచి భావనల బీజం నాటటం వల్ల కలిగే ఫలితం. ఒకవేళ బాల్యంలో వ్యక్తిపై దుష్ప్రభావాలు పడితే... ఇందుకూ భారతీయవ్యక్తిత్వవికాసంలో మార్గం ఉంది.

✣ ✣ ✣

# వ్యక్తిత్వం - దైవభావన

## విచక్షణతో బ్రహ్మజ్ఞానం

అనగనగా ఓ ఊరికి ఓ సాధువు వచ్చాడు. ఆయన చేతిలో కర్ర తప్ప మరేమీ ఉండదు. 'నాకు ఎటువంటి బంధనాలూ లేవు. నాదంటూ ఏమీ లేదు. నా వెంట ఏమీ తీసుకువెళ్లను. నాకు కావలసిందంతా భగవంతుడే సమకూరుస్తాడు' అంటూ ఎవరేమిచ్చినా తిరస్కరిస్తుండేవాడు. ఆ ఊరు వదిలి వెళ్తూంటే అడవిలో ప్రయాణించేటప్పుడు దారిలో ఏమీ దొరకదు కాబట్టి తిండి మూట కట్టిస్తే కూడా పై మాటలంటూ తిరస్కరించాడు. ఇదంతా చూస్తున్న ఓ యువకుడికి ఆ సాధువును పరీక్షించాలనిపించింది. ఏమీ దొరకని అడవిలో భగవంతుడు ఆ సాధువుకి తిండినెలా అందిస్తాడో చూడాలనిపించింది. అందుకే ఆ సాధువుకు తోడుగా అడవి దాటేంతవరకూ వెంట నడుస్తానని పట్టుబట్టాడు. ఆ సాధువు ముందు ఒప్పుకోలేదు. చివరికి 'సరే రా' అన్నాడు. అడవిలో ఇద్దరూ నడవటం ఆరంభించారు. కాలం గడుస్తోంది. ఆ యువకుడికి ఆకలి వేస్తోంది. సాధువు నడుస్తూనే ఉన్నాడు. తిండి మాట ఎత్తటం లేదు. చివరికి ఆ యువకుడే తిండి ప్రసక్తి తెచ్చాడు. 'ఇక్కడేమీ దొరికేట్టు లేదు. ఇప్పుడెలా?' అన్నాడు. దానికి సాధువు నవ్వి 'భగవంతుడి ఇచ్ఛ' అన్నాడు. కాస్సేపటికి యువకుడు భరించలేకపోయాడు. 'ఏదీ నీ భగవంతుడు తిండి ఇవ్వటం లేదేం?' అని నిలదీశాడు. 'ఇస్తే తింటాం. లేకపోతే దొరికినప్పుడు తింటాం' అంటూ ఆ సాధువు నిర్వికారంగా నడవసాగాడు. ఇక ఉండబట్టలేక 'నీ దేవుడు నీకేమీ ఇవ్వడు. వాడిని నమ్ముకుని లాభం లేదని నాకు తెలుసు. అందుకే వెంట రొట్టెలు తెచ్చాను' అంటూ రహస్యంగా తెచ్చిన రొట్టెల మూట బయటికి తీశాడు. ఇద్దరూ తిన్న తరువాత 'ఇపుడైనా ఒప్పుకో, అన్నీ భగవంతుడు సమకూర్చటం అబద్ధం అని' అంటూ నిలదీశాడా యువకుడు. దానికి సమాధానంగా ఆ సాధువు నవ్వి 'నువ్వు నా వెంట రావటం, రొట్టెలు ఇవ్వటం, నీ ద్వారానే భగవంతుడు పంపాడేమో' అన్నాడు.

## మరో కథ

ఓ ఊరికి వచ్చిన యోగి ప్రపంచమంతా బ్రహ్మమయం అని బోధించాడు. నీలో, నాలో చరాచరజగత్తు అణువణువులో ఇమిడి ఉన్నది బ్రహ్మమేనని వివరించాడు. అది విన్న ఓ మూర్ఖుడికి తనకు అంతా అర్థమై పోయిందనిపించింది. ప్రపంచమంతా బ్రహ్మమే ఐనపుడు ఇక ఈ బ్రహ్మ ఎదుటి వ్యక్తిలోని బ్రహ్మకు భయపడాల్సిన అవసరం ఏముందని అనుకున్నాడు. దారిలో అడ్డదిడ్డంగా నడవటం ఆరంభించాడు. 'ఎద్దు బ్రహ్మకు భయపడటం అనవసరం. గుర్రం బ్రహ్మ నన్నేం చేయదు' అనుకుంటూ ఎవరెంత చెప్పినా వినకుండా వాటి దారిలో  అడ్డంగా వెళ్ళేవాడు. వాటిని నడిపేవారు తిట్టుకుంటూ వాటిని పక్కకు తప్పించేవారు. దాంతో ఆ మూర్ఖుడి విశ్వాసం మరింత పెరిగిపోయింది. ఒక రోజు ఓ ఏనుగు వస్తుంటే దానికి అడ్డంగా నడవటం ఆరంభించాడు. మావటివాడు అడ్డు జరగమని హెచ్చరించాడు. ఆ మూర్ఖుడు నవ్వాడు. 'చెట్టు, పుట్ట, గుట్ట, ఏనుగు, ఈగ, దోమ అన్నీ బ్రహ్మమే. నేనూ బ్రహ్మమే. బ్రహ్మానికి బ్రహ్మం భయపడటంలో అర్థం లేదు' అంటూ అలాగే నుంచున్నాడు. ఏనుగు తొండంతో ఎత్తి అతడిని పక్కకు విసిరేసింది. అందరూ నవ్వారు. పెద్దగా గాయాలు కాకున్నా మూర్ఖుడికి కోపం వచ్చింది. తిన్నగా యోగి దగ్గరకు వెళ్లాడు. 'మీరు చెప్పిందంతా అబద్ధం. ఏనుగు బ్రహ్మను చూసి నేను – మానవబ్రహ్మ ఎందుకు భయపడాలి?' అని గద్దించాడు. దానికి ఆ యోగి నవ్వి 'ఏనుగు బ్రహ్మకు మనిషి బ్రహ్మ భయపడాల్సిన అవసరం లేదు. బాగానే ఉంది. మరి మనిషి బ్రహ్మ, మావటి బ్రహ్మ మాటెందుకు వినలేదు?' అనడిగాడు. దానికి ఆ మూర్ఖుడి వద్ద సమాధానం లేదు.

బ్రహ్మజ్ఞానానికి సంబంధించి అనేకుల పరిజ్ఞానాన్ని ఈ రెండు కథలూ మనసు హత్తుకునే రీతిలో ప్రదర్శిస్తాయి. ఈ సృష్టి సర్వం బ్రహ్మమయమని బోధించటం వేరు, సృష్టి బ్రహ్మమయమని వల్లె వేయటం వేరు, సృష్టిసర్వం బ్రహ్మభావనను అనుభవించటం వేరు.

సిద్ధాంతాలు వల్లె వేయటం, వాగ్వివాదాలు చేయటం, పెద్ద పెద్ద ఉదాహరణలు ఇవ్వటంతో సరిపోదు. ఆచరించి చూపటంలోనే అసలు నిజం దాగుంటుంది.

బాల్యం నుంచీ పిల్లలకు సృష్టికర్తకు సంబంధించిన ఆలోచనలివ్వటం ఆవశ్యకం. అయితే అవి గుడ్డి నమ్మకాలుగానో, బలవంతాన రుద్దే భావాలుగానో కాదు. మనిషి మనసులో ఉత్పన్నమయ్యే ఆలోచనస్వరూపంలా ఉండాలి. అంటే, వ్యక్తిలో స్వతహాగా నమ్మకమనేది కలగాలి.

భగవంతుడనే భావనను ఎటువంటి సంకుచిత తత్త్వాలు, అపోహలు లేకుండా కలిగించాలి.

భారతీయధర్మంలో 'ఇది తప్పనిసరిగా ఆచరించాలి. దీన్ని ఎదిరించకూడదు. ప్రశ్నించకూడదు' అన్న ఆలోచన లేదు. ప్రతి విషయాన్నీ ప్రశ్నించాలి. పరీక్షించాలి. నిగ్గు తేల్చుకోవాలి అంటుంది భారతీయధర్మం.

కానీ పెద్దలను గౌరవించటం, సృష్టికర్తపై అచంచలవిశ్వాసాన్ని కలిగి ఉండటం, వేదాన్ని విశ్వసించటం అన్న విషయాల్లో మాత్రం ఎటువంటి రాజీ పడటం లేదు.

భగవంతుడి నిర్దిష్టస్వరూపాన్ని విశ్వసించనక్కర్లేదు. కానీ భగవద్భావనను గౌరవించాలి. అందుకే శాంతిపాఠంలో విద్యార్థి 'బ్రహ్మాన్ని నేను నిరాకరించకుందు గాక' అంటాడు. ఎందుకంటే 'సృష్టికర్త'ను నిరాకరించటమంటే, సృష్టిని నిరాకరించటం. సృష్టిని నిరాకరించడం అంటే, వ్యక్తి తన అస్తిత్వాన్ని తానే ఒప్పుకోక పోవటం. దీన్ని మించి అర్థవిహీనమైంది ఇంకొకటి లేదు. కాబట్టి వ్యక్తి బ్రహ్మను నిరాకరించటమన్నది అర్థవిహీనం.

ఎప్పుడైతే ఈ భావన బాల్యంలోనే వ్యక్తులకు అర్థమౌతుందో, అప్పుడే వారి జీవితాల్లోంచి ఉద్విగ్నతలు, ఆరాటాలు అదృశ్యమైపోతాయి.

బ్రహ్మభావనను వల్లె వేయటం సులభం. కానీ నిత్యజీవితంలో అనుభవించి ఆచరించటం చాలా కష్టం. ఈ నిజాన్ని పైరెండు కథలూ నిరూపిస్తాయి. సర్వం బ్రహ్మమయమని గ్రహించిన సాధువు నిర్మోహంగా, నిబ్బరంగా, ఏ విషయంపై ఆరాటం లేకుండా జీవనం సాగిస్తున్నాడు. అదే బ్రహ్మభావనను అపార్థం చేసుకున్న మూర్ఖుడు భంగపడ్డా జ్ఞానం రాలేదు. మన మేధావులు అనేకులు రెండో కథలో మూర్ఖుడి వంటివారు. 'మాయంటావూ? మిథ్య అంటావూ?' అని సిద్ధాంతాలను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఎద్దేవా చేస్తారు. ఏమీ తెలియనివారు, ధర్మం లోతు అర్థం కానివారు ఇటువంటి వాదాలను అభ్యుదయభావాలుగా పనికట్టుకుని ప్రచారం చేయటంతో, వ్యక్తికి మార్గదర్శనం చేసి జీవితాన్ని తీర్చిదిద్దగల ఒక శక్తిమంతమైన ఆలోచన అపహాస్యం పాలయింది.

బ్రహ్మభావనను ఎన్ని రకాలుగా విమర్శించవచ్చో, ఎన్ని రకాలుగా నిరాకరించవచ్చో ఊహించి ఆ సందేహాలన్నిటికీ ముందే సమాధానాలు, కథల రూపంలో అందించారు. ఉదాహరణకు భగవంతుడు సృష్టించిన ఈ ప్రపంచంలోకి చెడు ఎలా వచ్చిందని ప్రశ్నించి భగవద్భావనను విమర్శిస్తారు. ఈ వాదంతో వ్యక్తులకు భగవద్భావనపై విశ్వాసాన్ని సడలించే ప్రయత్నం చేస్తారు.

ప్రపంచంలో మంచి, చెడు ఎందుకు ఉన్నాయో ఛాందోగ్యోపనిషత్తు వివరిస్తుంది.

సురలు, అసురులు ప్రజాపతి సంతానం. అంటే మంచి, చెడు ఏకగర్భజనితం అన్నమాట.

మానవసృష్టి భౌతికమైంది. ఈ భౌతికశరీరంలోకి అనంతమైన ఆత్మ వచ్చి ఒదుగుతుంది. ఈ ఆత్మ ఇప్పుడు ఇంద్రియాల ద్వారా జ్ఞానం గ్రహిస్తుంది. శరీరం ద్వారా ప్రపంచాన్ని అనుభవిస్తుంది.

దాంతో ఇక్కడ రెండు అంశాలను గ్రహించాల్సి ఉంటుంది. ఒకటి శరీరంలో ఒదిగిన ఆత్మ. రెండవది ఆ ఆత్మకు దృష్టి నిచ్చే భౌతికాంశాలు. అనుక్షణం ఈ రెంటి మధ్య ఒక విధమైన ఘర్షణ జరుగుతూంటుంది. ఆత్మ తన అనంతత్వాన్ని పరిమితమైన భౌతికాంశాల ద్వారా గ్రహించాలని తపన పడుతూంటుంది. శరీరం తన భౌతికతతో తనలో ఒదిగిన ఆత్మను పరిమితం చేయాలని ప్రయత్నిస్తూంటుంది. ఈ భౌతిక శరీరం, ఆధ్యాత్మిక ఆత్మలను అసుర, సురశక్తులు ప్రతిబింబిస్తాయి.

అంటే ఈ ప్రపంచాన్ని సృష్టికర్త సృష్టిస్తూనే రెండు శక్తులు రంగప్రవేశం చేశాయన్నమాట. ఒకటి వెలుతురు లాంటి దైవశక్తి. రెండవది చీకటి లాంటి అసురశక్తి. ఈ రెండు శక్తుల నడుమ జరిగే సంగ్రామం వ్యక్తి జీవితకథ.

'దేవాసు రాహవై యాత్ర సంయేతిర్ ఉభయే ప్రజాపత్యా స్తద్ధ దేవా ఉద్గీథమా జుహు రనేనైనానభిభవిష్యామ ఇతి'

దేవాసురుల నడుమ యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో దేవతలు యుద్ధం చేశారు. దీంతో మనం అసురులపై విజయం సాధిస్తాం అని నిశ్చయించారు. ఇది చూస్తూనే మనకు అర్థమౌతుంది. బాహ్యప్రపంచాన్ని చూపే ఇంద్రియాలు, అంతఃప్రపంచాన్ని తప్పు దారి పట్టిస్తాయని, బాహ్యప్రపంచాన్ని చూపే ఇంద్రియాలను నియంత్రించి నిజం చూపాలని అంతఃప్రపంచం ప్రయత్నిస్తుందని, ఈ రెంటి నడుమ సంగ్రామమే మానవ 'మనస్సంఘర్షణ'కు మూలం అని. 'మానవజీవితమే ఒక మహాభారతం. అది మంచి చెడుల రెంటి నడుమ నిత్యఘర్షణం' అంటాడు శ్రీశ్రీ.

యుద్ధం ఆరంభమైన తరువాత దేవతలు నాసికలో నివసించిన దేవతను ధ్యానించారు. ఇంతలో అసురులు దుష్టశక్తితో నాసికలో ప్రవేశించారు. దాంతో నాసిక సువాసనను అనుభవిస్తుంది. దుర్వాసనను పీల్చుకుంటుంది. ఇలా, దేవతలు, వాక్కును,

దృష్టిని, శ్రవణేంద్రియాన్ని, మనస్సును ధ్యానించారు. వీటన్నిటిలోనూ అసురులు ప్రవేశించారు. అందుకే మనం మంచి మాట్లాడుతాం. చెడు మాట్లాడుతాం. మంచిని వింటాం. చెడును వింటాం. మనస్సుతో మంచి ఆలోచనలు చేస్తాం. చెడు ఆలోచనలు చేస్తాం. ప్రపంచంలో మంచి, చెడు ఉండేందుకు ఇదీ కారణం. ఈ మంచిచెడుల నడుమ ఘర్షణ వ్యక్తి జీవితాన్ని నిర్దేశిస్తుంది. వ్యక్తి వ్యక్తిత్వస్వరూపాన్ని నిర్దేశిస్తుంది. సురులు, అసురులపై విజయం సాధించటంలో యజ్ఞం ప్రధానబాధ్యత వహిస్తుంది. అందుకే బాల్యం నుంచీ 'మంచి' నేర్పటం, మంచి ఆలోచనలు ఇవ్వటం, మంచి ఆదర్శాలు నిలపటం వంటివి అలవాటు చేయాల్సి ఉంటుంది. ఎదుగుతున్న కొద్దీ బాహ్యేంద్రియాల ప్రభావం పెరుగుతుంది. అవి అందించే ఆకర్షణల శక్తి పెరుగుతుంది. ఆ ఆకర్షణల అసలు స్వరూపం గ్రహించే శక్తికి పునాది బాల్యంలో బలంగా పడాల్సి ఉంటుంది.

## వ్యక్తిత్వవికాసానికి ఇది మొదటి మెట్టు

ఇంతసేపూ మనం చర్చించినవన్నీ ఆదర్శపరిస్థితులు. 'ఇలా ఉంటే బాగుంటుంది. ఇలా ఉండాలి' అని అనుకున్నాం. కానీ నిజజీవితం ఎప్పుడూ ఊహకు అనుగుణంగా ఉండదు. ఇటువంటి సమయంలోనే వ్యక్తికి విశ్వాసం అత్యంత అవసరం. ఎప్పుడైతే వ్యక్తికి ఈ ప్రపంచాన్నంతటినీ నడిపించే ఆ దివ్యశక్తిపై విశ్వాసం ఉంటుందో, ఆ విశ్వాసం అతని ఆత్మశక్తికి ఊపునిస్తుంది.

అంత మహాద్భుతమైన శక్తి ఈ విశాలవిశ్వంలో దేన్నీ వ్యర్థంగా సృష్టించదు. అదృశ్యంగా ఉండే సూక్ష్మజీవి నుంచి అనంతమైన బ్రహ్మాండం వరకూ విశ్వప్రణాళికలో ఓ ప్రత్యేకమైన పాత్ర ఉండి తీరుతుంది. అటువంటప్పుడు చరాచరసృష్టిలోని జీవులన్నిటిలోకీ అత్యుత్తమమైన విచక్షణ, నిర్ణయస్వేచ్ఛ ఉన్న ఏకైకప్రాణి అయిన మానవుడి జీవితం ఏ కోణం లోంచి చూసినా, ఏ రకంగా చూసినా వ్యర్థం కాదు. అర్థం లేనిది కాదు. మానవజీవితానికి అర్థాన్ని అన్వేషించి, లక్ష్యం సాధించటం తప్ప దివ్యశక్తిపై విశ్వాసం ఉన్న వ్యక్తికి మరో ఆలోచన రాదు. పైగా శరీరం అణువణువునా దైవం విభిన్నాంశాలలో, విభిన్న రూపాలతో నెలకొని ఉందని నమ్మిన వ్యక్తి తన సంఘర్షణలు, ఉద్విగ్నతలలో కూడా ఈశ్వరుని తలపును చూస్తాడు తప్ప వేదనలను, బాధలను చూడడు. అంటే దైవంపై వ్యక్తి విశ్వాసం ఆత్మవిశ్వాసాన్నిస్తుంది. ఆత్మవిశ్వాసం వ్యక్తిత్వవికాసానికి ఆవశ్యకం. కాబట్టి దైవాన్ని నమ్మటం, విధాతను నిరాకరించకపోవటం ఎంత తప్పనిసరో ఊహించవచ్చు.

## దైవంపై విశ్వాసం

ఒరిస్సా రాష్ట్రానికి చెందిన జానపదకథ ఇది.

అనగనగా ఓ రాజ్యం. ఆ రాజ్యానికి ఓ రాజున్నాడు. రాణి ఉంది. ఆ రాజ్యంలో ఓ సన్న్యాసి కూడా ఉన్నాడు. ఆ సన్న్యాసి ప్రత్యేకత ఏమిటంటే, అతడు అబద్ధం వినలేడు. అబద్ధం ఆయన చెవిన పడిన వెంటనే తల మీదున్న ఓ వెంట్రుకని లాగి పడేస్తాడు. ఇది గమనించిన రాజు పట్టణం పొలిమేరల్లో ఉన్న వనంలో ఓ ఆశ్రమం కట్టించి ఇచ్చాడు. అయినా సరే, ఏవో అబద్ధాలు ఆయన చెవిన పడుతూనే ఉన్నాయి. ఆయన వెంట్రుకలు పీక్కుంటూనే ఉన్నాడు. చివరికి ఆయన తలపై ఒకే వెంట్రుక మిగిలింది. దాంతో ఆ సన్న్యాసి పరిసరప్రాంతాలలో ఎవరూ మాట్లాడకూడదని ఆజ్ఞాపించాడు రాజు.

ఓ రోజు రాజు, రాణి తోటలో విహరిస్తున్నారు. శృంగారసరససల్లాపాలు ఆడుతున్నారు. రాణి మీదకు ఓ పువ్వు విసిరాడు రాజు, ఆ దెబ్బకు తట్టుకోలేక పడి పోయినట్టు నటించింది రాణి. వెంటనే రాజు ఆమెకు ఉపశమనాలు చేయటం ఆరంభించాడు. ఇంతలో రాజుకు 'హుం'కారం వినిపించింది. 'అంతా అబద్ధం నటన!' అంటూ అరుస్తూ వచ్చాడు సన్న్యాసి అక్కడకు. 'నాకు తెలుసు. రాణికి దెబ్బ తగలలేదు. అంత సుకుమారి కాదామె!' అని అరచి, ఆ ఒక్క వెంట్రుకా పీకేసుకుని అక్కడే పడి మరణించాడు సన్న్యాసి. జరిగిందానికి రాజు విచారించాడు. ముఖ్యంగా సన్న్యాసి విచక్షణరాహిత్యానికి మరింత విచారించాడు. ఎందుకంటే, రాణిది నటనే అయినా శృంగారసమయంలో అది చెల్లుతుంది. ఇది అర్థం కాని సన్న్యాసి మాటల అర్థం వెంట పడ్డాడు కానీ సందర్భాన్ని పట్టించుకోలేదు.

పిల్లలకు బ్రహ్మభావన వివరించేటప్పుడు ఈ విషయం దృష్టిలో ఉంచుకోవాలి. 'ప్రపంచమంతా బ్రహ్మమయం' అన్న భావనను అపార్థం చేసుకున్న మూర్ఖుడి కథను ఇక్కడ మనం గుర్తు చేసుకోవాలి. ప్రపంచమంతా బ్రహ్మమయమై, అంతా ఆయన ఇష్టప్రకారం జరిగితే మనం చేసేదేం లేదు. అంతా కర్మప్రకారం జరుగుతుందని చేతులు ముడుచుకుని కూర్చునే ప్రయత్నాలు చేస్తారు కొందరు. 'అబద్ధాల' విషయంలో సన్న్యాసి ప్రదర్శించిన మూర్ఖత్వం లాంటిది ఇది.

కాబట్టి సృష్టికర్తపై విశ్వాసం వ్యక్తి శక్తిలా ఎదగాలి తప్ప, బలహీనతలా మారకూడదు. బలహీనతలా ఎలా మారుతుందో మనకు తెలుసు. మనం అనుభవిస్తూనే ఉన్నాం. దాన్ని శక్తిగా ఎలా మార్చుకోవాలో చూద్దాం. భగవద్భావనను వ్యక్తి ఆత్మవిశ్వాసంగా

ఎలా మార్చుకోవచ్చో చూద్దాం. ముఖ్యంగా భగవద్భావన వల్ల ఉద్విగ్నతలనెలా తగ్గించుకోవచ్చో చూద్దాం.

ఈ నాడు ప్రతి పిల్లవాడికీ పరీక్షలు ఒక సమస్య. పరీక్షకు తయారవటం దగ్గర నుంచి సమస్య మొదలవుతుంది. ఏయే ప్రశ్నలు బట్టీ పట్టాలి? ఏయే ప్రశ్నలు వస్తాయో తెలియదు. ఏది ఇంపార్టెంటో, ఏది కాదో తెలియదు. ఓ పది సంవత్సరాల క్రితం నుంచీ ప్రశ్నపత్రాలు సేకరిస్తారు. ఏ ప్రశ్నలు మాటిమాటికీ అడుగుతున్నారో చూస్తారు. వాటిపై దృష్టిని కేంద్రీకరిస్తారు. రాత్రింబవళ్లు చదువుతారు. విద్యార్థులు ఇలా తమ తంటాలు తాము పడుతూంటే, మరోవంక తల్లిదండ్రులు తమ వంతు టెన్షన్ అనుభవిస్తుంటారు. పిల్లవాడు చదువుతున్నాడో, లేదో అని బాధపడి పోతుంటారు. చదివితే పరీక్షలెలా రాస్తాడోనని బెంగ. చదవకపోతే భవిష్యత్తులో ఏమైపోతాడోనని బెంగ.

తల్లిదండ్రులు తమ గురించి ఎంత బెంగపడితే పిల్లలకు వారంత చులకన అవుతూంటారు. 'ఎందుకంత ఆరాటపడుతున్నారు వీళ్ళు?' అనుకుంటారు పిల్లలు. తాము చదువుతూనే ఉన్నారు. ఐనా ఎందుకింత హైరానా పడుతున్నారో పిల్లలకు అర్థం కాలేదు. 'వీళ్ళెప్పుడూ ఇంతే!' అనుకుని, వాళ్ళ మాటను లెక్క చేయటం మానేస్తారు. తల్లిదండ్రుల మాటలను ఖాతరు చేయకుండా వారిని మరింతగా ఏడిపిస్తుంటారు. ఇది తల్లిదండ్రుల ఉద్విగ్నతను మరింత ఎక్కువ చేస్తుంది. పిల్లలతో వారి ఘర్షణ అవకాశాలను పెంచుతుంది. సహనం కోల్పోయి తల్లిదండ్రులు పిల్లలపై విరుచుకుపడతారు. ఇది పెద్దల పైనే కాదు, చదువు పట్ల కూడా పిల్లవాడిలో విముఖతను పెంచుతుంది.

ప్రస్తుతం సమాజంలో జరుగుతున్నది ఇదే. ఎంత చదివినా పెద్దలకు సంతృప్తి లేదని పిల్లలు ఆవేశపడుతూంటే, ఎంత చెప్పినా భవిష్యత్తు గురించి ఇసుమంతైనా ఆలోచన లేదు పిల్లలకని పెద్దలు వాపోతూంటారు. ఎల్‌కెజీ పరీక్షలు రాస్తూంటే ఇంజినీరింగ్ ఎంట్రన్స్ వరకూ ఆలోచించి భయపడుతూంటారు. రేపు ఏం జరుగుతుందో తెలియని ప్రపంచంలో పది సంవత్సరాల తరువాత జరిగేదాన్ని గురించి ఇవాళ్టి నుంచే బాధ పడుతూంటారు. ఈ పరిస్థితి మార్చాలంటే పిల్లలూ, పెద్దలూ తమ తమ ఉద్విగ్నతలను తగ్గించుకోవాలి. ఇందుకు భగవద్భావన దివ్యౌషధంలా పనిచేస్తుంది.

తల్లిదండ్రుల ఉద్విగ్నతకు కారణం పిల్లవాడి భవిష్యత్తు పట్ల ఆందోళన. పిల్లవాడి ఉద్విగ్నతలకు కారణాలు పరీక్షల భయం దగ్గర నుంచి తల్లిదండ్రుల ఒత్తిడి వరకూ

అనేకం. ఈ ఒత్తిళ్ళ నుంచి విముక్తి కలిగించి, శాంతినిచ్చే ఆలోచన మన శాస్త్రాలలో పొందుపరచి ఉంది.

*కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన।*
*మా కర్మఫల హేతుర్భూః మా తే సంగోऽస్త్వ కర్మణి*

కర్మలాచరించే స్వాతంత్ర్యం మనిషికి ఉన్నా, ఫలంపై ఎటువంటి జోక్యం లేదు. కాబట్టి కర్మఫలాన్ని ఆశించకూడదు. అలాగని కర్మలు చేయటం మానకూడదు. కర్మఫలాలు ఈశ్వరసంకల్పాధీనాలు. ప్రకృతి నియమానుసారం ఎప్పుడు ఏ కర్మకు ఏ ఫలితం లభించాలో, అది లభించి తీరుతుంది.

ఈ ఆలోచనను మెట్ట వేదాంతం అని ఈసడించి కొట్టేస్తారు ఆధునిక అభ్యుదయ, వాదులు. కానీ తరచి చూస్తే ప్రపంచంలో పలునాగరికతల్లో, పలు సంస్కృతులలో సుఖమయజీవితానికి ఈ ఆలోచననే ఏదో ఓ రూపంలో ప్రదర్శించటం చూడవచ్చు.

'జయాపజయాలు దైవాధీనాలు' అనటం మనకు తెలుసు. గెలుపుఓటములు భగవంతుడి అధీనాలు కాబట్టి, మనం ఆట ఆడటం మానేసి భగవంతుడినే ఎవరు గెలుస్తారో, ఓడతారో, అడిగేస్తే పోలా? అని ఎవరైనా అంటారా? ఆట ఆడిన తరువాత తమకి తాము సర్దిచెప్పుకునేందుకు ఈ భావనను ఉపయోగిస్తారు.

ఆట ఓడిన తరువాత కాదు, ఆట ఆడే ముందు నుంచే ఈ భావనను అర్థం చేసుకుంటే పరోక్షంగా ఫలితాన్ని మనం నిర్దేశించవచ్చు.

సర్వసృష్టి భగవంతుడిమయం అయితే సృష్టిలో జరిగే ప్రతి విషయానికీ ఏదో స్పష్టమైన అర్థం ఉంటుంది. ప్రతి ప్రాణికీ స్పష్టమైన లక్ష్యం ఉంటుంది. ఈ భావన పిల్లవాడిలో బలంగా నాటుకుంటే, ఎవరూ నేర్పకుండానే ఫలితంపై ఆసక్తి నశిస్తుంది.

మంచి పనికి మంచి ఫలితం ఉంటుంది. చెడు పనికి చెడు ఫలితం ఉంటుంది. కాబట్టి తన పనిని తాను సక్రమంగా నిర్వహిస్తే ఫలితం తప్పని సరిగా మంచి ఫలితమే అవుతుంది. ఈ విశ్వాసం పిల్లవాడిలో, తల్లిదండ్రులలో కలగాలి. అప్పుడు ఉద్విగ్నతలు అవే అదృశ్యం అవుతాయి. పరీక్షకు అవసరమైన సమాధానాలు క్షుణ్ణంగా నేర్చుకుని, రాసి చూసుకుంటూంటే పిల్లవాడికి తాను చేసే తప్పులు అర్థమౌతాయి. దాంతో ఆ తప్పులను సరిదిద్దుకుంటూ మళ్ళీ రాసుకుంటే తప్పులను తొలగించే అవకాశం హెచ్చవుతుంది. అలా కాక, తాను పరీక్షలో నెగ్గుతానో, లేదో, అన్న భయంతో ఎంత చదివినా ఫలితం ఉండదు. ఎందుకంటే హృదయంలోని ఉద్విగ్నత మెదడుపై ప్రభావం

చూపిస్తుంది. కళ్లు అక్షరాల వెంట పరుగిడుతూంటాయి కాని మెదడుకేమీ సంకేతాలు అందవు. దాంతో ఎప్పుడూ చదువుతున్నట్టే ఉంటుంది. ఫలితం మాత్రం ఉండదు. తల్లిదండ్రులు సైతం పిల్లవాడిని కూచోబెట్టి 'ఎంత సేపు చదివితే అంత మంచిది' అన్నట్టు ప్రవర్తిస్తారు. దాంతో 'తప్పనిసరి తద్దినం' లా చదువుతాడు పిల్లవాడు. తల్లిదండ్రుల సంతృప్తి కోసం చదివినట్టు చదువుతాడు పిల్లవాడు. ఫలితం కూడా అలాగే ఉంటుంది.

కాబట్టి పరీక్షాఫలితం మీద దృష్టి ఉండకుండా, ఎదురుగా ఉన్న ఒక్క ప్రశ్న సమాధానం క్షుణ్ణంగా నేర్చుకోవాలి. ఈ ప్రశ్న పరీక్షలో 'అడుగుతాడో, అడగడో' అన్న భావన వదిలేయాలి. 'పరీక్షలో వచ్చినా, రాకున్నా ఈ సమాధానం క్షుణ్ణంగా నేర్చుకోవాలి' అనుకుంటూ ఒక్కో సమాధానం నేర్చుకుంటూ ముందుకు సాగాలి. తల్లిదండ్రులు సైతం ఈ విషయంలో పిల్లవాడికి సహకరించాలి. ఫలితం ప్రసక్తి తేకుండా 'నీ కర్తవ్యం చిత్తశుద్ధితో నిర్వహించు. ఫలితం భగవంతుడికే వదిలేయి' అన్నట్టు ప్రవర్తించాలి.

ఇందువల్ల పిల్లవాడిలో 'ఫేలైతే?' అన్న భావన భూతంలా ఎదగదు. అసలు ఆ ఆలోచనే రాదు. 'భగవంతుడి సృష్టిలో పనికి తగ్గ ఫలితం తప్పకుండా లభిస్తుంది. కాబట్టి, తాను తన పని నిజాయితీగా, చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఫలితం దానంతట అదే వచ్చి తీరుతుంది' అన్న విశ్వాసం పెరుగుతుంది. ఉద్విగ్నత స్థానాన్ని విశ్వాసం ఆక్రమిస్తుంది. పనికి తగ్గ ఫలితం ఉంటుందన్న విశ్వాసం ఉండటంతో పని చేయాలన్న ఉత్సాహం పెరుగుతుంది. అప్పుడు చదువు 'తప్పనిసరి తద్దినం'లా కాక ఆందోళన లేని ఆనందకరచర్యగా మారుతుంది.

ఈ సందర్భంలో మనం ఒక్కసారి భారత క్రికెట్ జట్టులో వచ్చిన మార్పుని గమనించాలి. ఒకప్పుడు చిన్న స్కోరును సాధించటం కూడా అతికఠినమైన పనిలా చేసేవారు. గెలవాల్సిన ఆటలు ఓడి అభాసు పాలయ్యేవారు. దీనికి ప్రధానకారణం ఆడినా ఆడకున్నా తమ స్థానాలకు ఢోకా లేదన్న విశ్వాసం సీనియర్ ఆటగాళ్ళలో ఉంటే, ఎంత ఆడినా ఫలితం లేదన్న నిరాశ యువ ఆటగాళ్ళలో ఉండేది. దాంతో ప్రేక్షకుల సహనం నశించే వరకూ ఓడి, తప్పనిసరి అయినప్పుడు గెలవాలన్న పట్టుదలతో ఆడేవారు. వ్యక్తిగతప్రతిభాప్రదర్శనతో సంతృప్తి పడేవారు.

ఇప్పుడు పరిస్థితి మారి, ప్రతిభకు పెద్ద పీట వేయటం జరిగింది. మంచి ఆట ప్రదర్శిస్తే, మంచి ఫలితం ఉంటుందన్న నమ్మకం కలిగింది. 'గెలుపు కన్నా' ఉత్తమ క్రీడా ప్రదర్శన ముఖ్యం అని నేర్పటం జరిగింది. గెలుపుపై ఉద్విగ్నత తగ్గటంతో ఆటగాళ్ళకొక ఊపు వచ్చింది. ముఖ్యంగా బాగా ఆడితే గుర్తింపు ఉంటుంది. జట్టులో

స్థానం ఉంటుంది అన్న నమ్మకం కలగటంతో ఆటగాళ్ళ ఆట తీరు మారింది. వారి దృష్టి 'ఫలితం'పై కాక నిజాయితీగా ఆడటం, ప్రతిభను ప్రదర్శించటంపైనే కేంద్రీకృతమైంది. ఫలితం మనం చూస్తూనే ఉన్నాం. అంటే ఫలితంపై దృష్టి లేకుండా కర్తవ్యం నిజాయితీగా నిర్వహించటంతో ఉద్విగ్నత అదృశ్య మౌతుంది. ఫలితం కోరిందే లభిస్తుంది అన్నమాట. అందుకే, గమనిస్తే 'మీడియా ఎంతగా వరల్డ్ కప్ గురించి అడుగుతున్నా భారత కెప్టెన్ రాహుల్ ద్రవిడ్, వరల్డ్‌కప్ గెలవటానికి ప్రాధాన్యం లేదు. అదో సంఘటన మాత్రమే. పటిష్ఠమైన జట్టును తయారుచేయటమే మా లక్ష్యం' అని అవకాశం దొరికినప్పుడల్లా చెప్తూనే ఉన్నాడు. ఫలితం మీద నుంచి దృష్టిని కర్తవ్యంవైపు మళ్ళించటం అన్నమాట. 'గెలవాలి. గెలవాలి' అనుకున్నా 'గెలుస్తాం, గెలుస్తాం' అనుకున్నా ఉద్విగ్నతలు పెరుగుతాయి. అలా కాక మన కర్తవ్యం మనం సక్రమంగా నిర్వహించాలి అన్న భావన కలిగితే, ఫలితం భగవంతుడే చూసుకుంటాడు అన్న విశ్వాసం కలిగితే ఉద్విగ్నతలు అదృశ్యం అవుతాయి.

వ్యక్తిలో ఈ విశ్వాసాన్ని సమాజం కలిగించాలి. వ్యవస్థ కలిగించాలి. చట్టాలు కలిగించాలి. అందుకు పునాది బాల్యంలో భగవద్భావనతో ఆరంభమవాలి. ఎప్పుడైతే వ్యక్తికి భగవంతుడిపై విశ్వాసం కలుగుతుందో, తనపై తనకు విశ్వాసం కలుగుతుంది. తన మీద తనకు విశ్వాసం కలిగిన వ్యక్తిలో కర్తవ్యపరాయణత పెరుగుతుంది. చిత్తశుద్ధితో నిర్వహించిన కర్తవ్యఫలితం సఫలమే అవుతుంది. ఇదీ భగవంతుడిపై విశ్వాసం ఉంచటంవల్ల ఉద్విగ్నతలు తొలగి, నిజాయితీగా కర్తవ్యనిర్వహణ చేస్తూ సత్ఫలితాలను సాధించే మార్గం. ఇది పరీక్షలకే కాదు, ఇంటర్వ్యూలకు, ఉద్యోగాల సాధనకు, ఉద్యోగంలో విధినిర్వహణకూ ... నిత్యజీవితంలోని ప్రతి పనికీ వర్తిస్తుంది.

## కర్తవ్యనిర్వహణ

ఓ రోజు నారదుడు, విష్ణువు కలసి భూమి మీద సంచారానికి వచ్చారు. ఇద్దరూ బాటసారుల వేషంలో నగరవీథుల్లో తిరగసాగారు. అలా నడుస్తూన్నవాళ్ళు ఓ దుకాణం ముందు నుంచి వెళ్తూండగా, విష్ణువు ఆ యజమానికి నమస్కారం చేశాడు. ఆ దుకాణం యజమాని అది గమనించలేదు. తన పని తాను చేసుకుంటూ పోతున్నాడు. కానీ నారదుడికి కోపం వచ్చింది. 'నువ్వు ఓ సామాన్యుడికి దండం పెట్టటం ఏమి'టని వాపోయాడు. 'నా భక్తులంటే నాకు ప్రీతి' అన్నాడు విష్ణువు. తీరా చూస్తే ఆ యజమాని శరీరం మీద విష్ణుభక్తుడన్న సూచనలేవీ లేవు. కనీసం దుకాణంలో దేవుడి పటం కూడా లేదు. దాంతో అతడు విష్ణుభక్తుడెట్లా అయ్యాడో తెలుసుకోవాలనిపించింది నారదుడికి.

‘అతడిని గమనించా’లన్న కోరికను నారదుడు వ్యక్తపరచాడు. ‘సరే’ నన్నాడు విష్ణువు. ఇద్దరూ అతడిని గమనించటం ఆరంభించారు. సాయంత్రం అయింది. దుకాణం కట్టేస్తూ ఆ వ్యాపారి, ఈ ఇద్దరు బాటసారులనూ చూశాడు. ‘అయ్యా తమరు అలసిపోయి నట్టున్నారు. ఈ రాత్రికి నా ఇంట్లో విశ్రమించండి’ అని అభ్యర్థించాడు. ఇద్దరూ అతడి ఇంటికి వెళ్ళారు. అతడి దినచర్యను నారదుడు స్వస్థానానికి తిరిగి వచ్చిన తర్వాత గమనించసాగాడు. ఉదయం లేవగానే, రాత్రి పడుకునే ముందు తప్ప భగవంతుడి పేరు కూడా ఎత్తడు ఆ వ్యాపారి. రోజంతా నిజాయితీగా వ్యాపారం చేస్తాడు. భార్యాపిల్లలను ప్రేమగా చూస్తాడు. ఇదంతా గమనించిన నారదుడు విష్ణువును నిలదీశాడు. ‘నీ పేరే తలవడు. అతడు నీ భక్తుడు ఎలా అయ్యాడు?’ అని ప్రశ్నించాడు. దానికి విష్ణువు నవ్వి, ‘ఓ గిన్నె నిండుగా నూనె పోసి నూనె చిందకుండా రోజంతా నడువు. అప్పుడు చెప్తా’నన్నాడు. నారదుడు ‘సరే’నని నూనెను తలకెత్తుకున్నాడు. జాగ్రత్తగా నడిచాడు. అప్పుడప్పుడు దాదాపుగా నూనె ఒలికే పరిస్థితి వస్తే ఒడుపుగా, నూనె పడకుండా కాపాడాడు. సాయంత్రం కాగానే సంతోషంగా నిట్టూర్చి నూనె గిన్నె దించి ‘ఇప్పుడు చెప్పు’ అనడిగాడు విష్ణువును. అంతలోనే నారదుడికి సమాధానం స్ఫురించింది. పొద్దుటి నుంచీ తన దృష్టి గిన్నెలోంచి నూనె ఒలకకుండా చూడటం పైనే ఉంది తప్ప ఒక్కసారి కూడా విష్ణునామస్మరణ చేయలేదు. అదే ఆ వ్యాపారి సంసారంలో ఉంటూ, తన కర్తవ్యం చిత్తశుద్ధితో నిర్వహిస్తూ, కనీసం రోజుకు రెండు మార్లయినా భగవంతుడిని స్మరిస్తున్నాడు. అది అర్థమైన తరువాత, నారదుడు కూడా ఆ వ్యాపారికి నమస్కరించాడు.

కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహించండి. ఫలితం గురించి ఆలోచించకండి అని చెప్పటం సులభం. ఆచరించటం కష్టం. వెంటనే ఓ సందేహం వస్తుంది. ఫలితం గురించి ఆసక్తి, ఆశ లేనప్పుడు కర్మలు చేయటం ఎందుకని ప్రశ్నించవచ్చు. పరీక్షల్లో పాసయితే, మంచి మార్కులు వస్తే పై చదువులు చదవచ్చు. మంచి ఉద్యోగం సంపాదించవచ్చు. ఇటువంటి ఆశలు, కోరికలు లేనప్పుడు చదవటం ఎందుకు? పరీక్షలు రాయటం ఎందుకు? అని అడగ వచ్చు. పెద్దలను సైతం వేధించే ఈ సందేహాన్ని సరైన రీతిలో వివరించకపోతే పిల్లలకు ఆరంభం నుంచీ మన శాస్త్రాలు సిద్ధాంతాల పట్ల చులకన భావం కలగవచ్చు. ప్రస్తుతం జరుగుతోందీ ఇదే. ‘కర్మలు చిత్తశుద్ధితో నిర్వహించండి. ఫలితం గురించి ఆలోచించకండి’ అంటే ఏ పనీ చేయకుండా కూర్చుని, ‘నేనేమీ ఆశించటం లేదు’ అనటం కాదు. లేక ఫలితం గురించి ఆశ లేనప్పుడు ఇక పని చేయటం ఎందుకని వాదించటం కాదు. ఇటువంటి సందర్భంలోనే విష్ణుభక్తుడి కథను మనం జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉంటుంది.

ప్రస్తుతసమాజాన్ని వ్యాపారసంస్కృతి నిర్దేశిస్తున్నది. వ్యాపారంలో ప్రచారం అత్యంతప్రాధాన్యాన్ని వహిస్తుంది. ఆధునిక సాంకేతికపరిజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందిందంటే ప్రస్తుతం వ్యాపారప్రచారం ఇరవై నాలుగు గంటలూ ప్రతి నట్టింటా వికృతరూపంలో నర్తనమాడుతోంది. పుట్టినప్పటి నుంచీ జీవితంలో అనుభవించగల సౌఖ్యాలు ప్రతివాడికీ ప్రతి వయసు నుంచీ తెలుస్తున్నాయి. ఆ సౌఖ్యాల సాధనకు ఏకైక మార్గం డబ్బు సంపాదన. దాంతో వ్యక్తి అభివృద్ధిని డబ్బు సంపాదనతో కొలవటం తప్పనిసరి అయింది. తమ పిల్లవాడు  డబ్బు సంపాదించకపోతే పనికి రానివాడన్న అభిప్రాయం స్థిరపడిపోయింది. దాంతో ప్రతివాడి జీవితలక్ష్యం ఎలాగోలాగ, వీలైన రీతిలో డబ్బు సంపాదించటమేనన్నది స్థిరమైపోయింది. సమాజం అవినీతిమయమై విలువలు తరగటంలో ప్రధానంగా తోడ్పడిన అంశం ఇది. డబ్బు మీద ఆశను కల్పించి, పెంచటంలో పాశ్చాత్యప్రచారసంస్థలు గణనీయమైన విజయాన్ని సాధించాయని చెప్పవచ్చు.

ప్రేమప్రచారం సమర్థంగా జరిగింది. యువతీయువకులు కలిస్తే ప్రేమించి తీరాలన్న అభిప్రాయం ఏర్పడింది. కాలేజీలకు వెళ్ళేది ప్రేమించటం కోసమేనన్న అభిప్రాయం విస్తృతంగా ప్రచారమైంది. టూత్ పేస్టుతో పళ్ళు తోముకుంటే అమ్మాయి వచ్చి ఒళ్ళో వాలుతుంది. ఓ మోటర్ సైకిల్ కొంటే, ఇతరుడితో ఉన్న అమ్మాయి, వాడిని వదిలి వీడి దగ్గరకు వచ్చేస్తుంది. ఓ షేవింగ్ లోషన్ వాడగానే అమ్మాయి ప్రత్యక్షమైపోతుంది. ఇంకో మౌత్ ఫ్రెష్నర్ ఉపయోగిస్తే అమ్మాయిలు ఎగురుకుంటూ వచ్చి పడిపోతారు. ఇంకేదో సువాసన ద్రవ్యం వాడితే అమ్మాయిలు వెర్రెక్కి వెంటపడతారు. మరింకేదో కంపెనీ కళ్ళద్దాలు పెట్టుకుంటే, అమ్మాయిలు నిజంగానే పడిపోతుంటారు. ఈ ప్రచారం వల్ల, అబ్బాయిలకు అమ్మాయిలంటే ఎంతగా చులకన అభిప్రాయం కలుగుతుందో ఆలోచిస్తే, ఈ తరానికి మనం చేస్తున్న అన్యాయం అర్థమౌతుంది.

అలాగే, ఓ అమ్మాయి 'మిస్ యూనివర్స్'గా ఎన్నికై, సినిమాల్లోకి వెళ్ళి డబ్బు సంపాదించింది. ఆమె మిగతావారందరికీ ఆదర్శమైంది. ప్రతి వారూ అందంగా ఉండాలని పోటీలు మొదలుపెట్టారు. విదేశీ కాస్మెటిక్ కంపెనీలకు లాభం. విదేశీ ఎక్సర్‌సైజ్ పరికరాల తయారీదారులకు లాభాలు. ఇక అమ్మాయిలున్నది అబ్బాయిలను ఆకర్షించేందుకే అన్న ప్రచారం పుట్టినప్పటి నుంచీ ఉగ్గు పాలతో అబ్బాయిలు నేర్చుకుంటున్నారు. ఓ అమ్మాయి ఓ క్రీమ్ వాడగానే అబ్బాయిలు వెంటపడతారు. ఓ హెయిర్ షాంపూ వాడితే ముగ్ధులైపోతారు. కంపెనీ ఐస్ క్రీమ్ అసభ్యంగా తింటూంటే

కుర్రాళ్ళు సర్వం మరచిపోతారు. ముఖం మీద మొటిమలు ఉంటే అబ్బాయిలు మెచ్చరు. కాబట్టి ఓ కంపెనీ మొటిమల మందు వాడితే ఇక అబ్బాయిలు క్యూలు కడతారు. ఇంకేదో పౌడరు, మరింకేదో అందాన్ని పెంచే వస్తువు.... కానీ అన్నీ అబ్బాయిలను ఆకర్షించేందుకే. ఐతే వీటన్నిటికీ డబ్బు కావాలి. డబ్బు కావాలంటే పరీక్షల్లో పాసవాలి. మార్కులు రావాలి. అప్పుడు కార్లు కొనవచ్చు, అమ్మాయిల్ని వెంట తిప్పుకోవచ్చు. ఇదీ ప్రస్తుతసమాజం ఆలోచిస్తున్న దిశ.

కర్మ చేయాలి కానీ ఫలితం గురించి ఆలోచించవద్దన్నది ఇప్పుడు స్పష్టంగా అర్థమౌతుంది. మనం పరీక్షలు పాసవాలని చదవాలి. పాసయి జీవితంలో మనిషిగా ఎదిగేందుకు సక్రమమైన మార్గం ఏర్పరచుకోవాలన్న ఉద్దేశ్యంతో చదవాలి. విజ్ఞాన తృష్ణతో చదవాలి. విచక్షణ సంపాదించటం కోసం చదవాలి.

బాల్యంలో చదవటం, యౌవనంలో ఉద్యోగం చేయటం ఆపై గృహస్థధర్మం నెరవేర్చటం – ఇవన్నీ మన కర్తవ్యాలు. ఈ కర్తవ్యాలను నిష్ఠతో, చిత్తశుద్ధిగా నిర్వహించాలి. పరీక్షలో పాసవటమన్నది ఒక చర్య మాత్రమే, అదే జీవితం కాదు. డబ్బు సంపాదన జీవించటం కోసం తప్ప, జీవించటం డబ్బు సంపాదన కోసం కాదు. ఈ నిజం అర్థం చేసుకుంటే ఫలితం పట్ల ఆశ లేకుండా కర్మ చేయటం అర్థమౌతుంది.

విష్ణుభక్తుడంటే సర్వం త్యజించి రాత్రింబవళ్ళు విష్ణుచింతనలో గడపటం కాదు. జన్మించినందుకు శరీరాన్ని పోషించాలి. అందుకు తగ్గ ధనం సంపాదించాలి. అదీ మంచి మార్గంలో, ఆపై వీలైతే పొరుగువాడికి సాయపడాలి. ఆ సాయపడటం గొప్పలు చెప్పుకోవటం కోసం కాదు. నేనంత నిస్వార్థసేవ చేశానని ప్రచారం చేసుకోవటం కోసం కాదు. కేవలం సాటి మానవుడికి వీలైనంత సహాయం చేయటం తన కర్తవ్యం అన్న భావనతో సహాయపడాలి. ఇలా నిత్యజీవితంలో నిర్దిష్టకర్మలు నిర్వహించటం ఒక రకమైన భగవదారాధనమే. ఈ ఆరాధన నడుమ సమయం దొరికినప్పుడు ఈశ్వరుడిని అర్చిస్తూ, తన కర్మలు నిర్వహించేవాడు నిజమైన భక్తుడు. ఎప్పుడైతే ఈ నిజాన్ని పిల్లవాడు గ్రహిస్తాడో అప్పుడు అతడిలో ఉద్విగ్నత అదృశ్యమౌతుంది.

ఏ రోజు పాఠం ఆ రోజు చదవటం విద్యార్థిగా అతడి కర్తవ్యం. కాబట్టి చిత్తశుద్ధిగా ఏ రోజు పాఠం ఆ రోజు చదువుతాడు. ఏ రోజు పాఠం ఆ రోజు చదివితే ఇక పరీక్షల సమయంలో ఉద్విగ్నత అన్నదే ఉండదు. ఎందుకంటే సంవత్సరం ఆరంభం నుంచీ చదువుతూ వస్తుంటే హడావిడిగా చివరలో బట్టీ పట్టి కక్కేసే ఉద్విగ్నతల అవసరం ఉండదు. ఇందుకు బాల్యం నుంచీ వ్యక్తికి క్రమశిక్షణ నేర్పాల్సిన ఆవశ్యకత ఉంది.

మన జీవనవిధానంలో శారీరకవ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వటం ఇందుకోసమే. యోగాభ్యాస రూపంలో బాల్యం నుంచీ శారీరకదార్ఢ్యాన్ని పెంచే యోగవిద్య వ్యక్తికి క్రమశిక్షణ ఇవ్వటమే కాకుండా మానసికస్వాస్థ్యానిస్తుంది. అది అతడి బుద్ధివికాసానికి, ఏకాగ్రత పెరిగేందుకు దోహదపడుతుంది. కానీ మన చుట్టూ జరుగుతున్న వ్యాపార ప్రచారప్రభావం వల్ల 'యోగ' అన్నది అపోహలకు గురి అవుతోంది. పాఠశాలల్లో యోగ నేర్పటం వెనకబడినతనం అవుతోంది. ధ్యానం చేయటం హాస్యాస్పదం అయింది. కానీ ఎదిగిన తరువాత నడివయసులో శారీరకసమస్యలు రాగానే యోగ సెంటర్లకు పరుగిడటం, ధ్యానకేంద్రాలకు వెళ్ళి 'మెడిటేషన్ నేర్చుకు'ని ఏదో సాధించినట్టు భావించటం ఇప్పుడు ఫేషన్ అయింది. అంటే జబ్బు వచ్చిన తరువాత చికిత్స చేయటం పట్ల మనం చూపుతున్న మోజు, జబ్బు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవటం పట్ల చూపటం లేదన్నమాట.

'వ్యక్తిత్వవికాసం'లో బాల్యం నుంచీ నేర్పే మంచి ఆలోచనలు, మంచి మాటలతో పాటు శారీరకవ్యాయామం కూడా ప్రధానపాత్ర వహిస్తుంది. ఇది విస్మరించి పుట్టినప్పటి నుంచీ పరీక్షలు, భవిష్యత్తు ఉద్విగ్నతలకు పిల్లవాడిని గురి చేస్తూ డబ్బు సంపాదన వెంట పరుగిడుతూంటే వ్యక్తి అస్తిత్వం కోల్పోయి యంత్రమైపోతాడు. వ్యక్తే లేనప్పుడు ఇక వ్యక్తిత్వవికాసం ప్రసక్తి ఏముంది?

ఈ పరిస్థితిని వివరిస్తుందీ కథ.

ఓ గ్రామంలో ఓ బ్రాహ్మణుడికి అనూహ్యంగా యజ్ఞకుండంలో బంగారు ముద్ద దొరికింది. అతడు ఈ వింత చూసి ఆశ్చర్యపోతూంటే, అతడి భార్య నిజం చెప్పింది. అంతకు ముందు రోజు పొరపాటున ఆమె తాంబూలాన్ని యజ్ఞకుండంలో ఉమ్మేసింది. ఆ మాటలో నిజం పరీక్షించేందుకు మరుసటి రోజు మళ్ళీ ఉమ్మింది. మళ్ళీ బంగారు ముద్ద దొరికింది. ఇలా రోజుకో బంగారు ముద్దతో ఆ బ్రాహ్మణుడు ధనవంతుడై పోతున్నాడు. ఆ బ్రాహ్మణుడు ధనవంతుడవటంలో రహస్యం కనుగొన్న ఊళ్ళోవాళ్ళు ఒకరొకరుగా అదే పనిచేయటం ఆరంభించారు. అందరికీ బంగారు ముద్దలు లభిస్తున్నాయి. అందరూ ధనవంతులైపోతున్నారు. అయితే ఆ ఊళ్ళో ఒక బ్రాహ్మణుడు మాత్రం భార్య ఎంత పోరినా ఆమె యజ్ఞకుండంలో ఉమ్మి బంగారం అందుకునేందుకు ఇష్టపడటం లేదు. అందరూ ధనవంతులవుతుంటే, తాము మాత్రం పేదవారుగానే ఉండటం ఆమెకు నచ్చలేదు. చివరికి భర్త ఎంతకీ మాట వినకపోవటంతో ఆమె పుట్టింటికి బైలుదేరింది. చేసేది లేక భర్త ఆమెను అనుసరించాడు. వారు ఊరి పొలిమేర దాటగానే ఊళ్ళో గొడవలు ప్రారంభమై ఇళ్ళు తగలబడిపోసాగాయి. అప్పుడు ఆ బ్రాహ్మణుడు

భార్యకు వివరించాడు – 'ధర్మానుసారం సంపాదించిన ధనం శాంతినిస్తుంది. అలా కాక ధర్మచ్యుతి చేస్తూ ఇష్టం వచ్చిన రీతిలో సంపాదన అనర్థానికి దారి తీస్తుంది. ఇన్నాళ్ళూ మనం ధర్మం పాటించటం ఈ ఊరిని కాపాడింది. మనం ఊరిని వదిలాం, అసూయా, ద్వేషాలతో ఊరు నాశనమైంది.' అది విన్న భార్యకు విషయం అర్థమైంది. ప్రస్తుతం మన సమాజం ఆ ఊళ్ళోవారున్న స్థితిలో ఉంది. ధనసంపాదన కోసం యజ్ఞకుండంలో సైతం ఉమ్మేసేందుకు సిద్ధపడ్డ ఆ ఊరివాళ్ళలాగా, ప్రస్తుతసమాజం డబ్బు సంపాదన కోసం అడ్డమైన గడ్డీ మేసేందుకు సిద్ధమౌతోంది. ఎంత ధనం సంపాదిస్తే, అంత అశాంతి పాలవుతోంది. నైతికవిలువలు వదిలి సమాజం మానవత్వాన్ని కోల్పోతోంది. మన తరువాతి తరాలైనా ఉత్తమవ్యక్తిత్వంతో ప్రశాంతంగా జీవించాలంటే వ్యక్తిత్వ వికాసంలో మరో ప్రధానాంశమైన 'ఉత్తమ ఆదర్శం' ఎంతో అవసరం.

✣ ✣ ✣

# వ్యక్తిత్వం - ఆదర్శం

## ఉత్తమ ఆదర్శం

అనగనగా ఒక ఊళ్ళో 'హరిదాసు' అనే అనాథ ఉండేవాడు. 'నా' అనేవాళ్ళు ఎవరూ లేకపోవటంతో చదువుసంధ్యలు లేవు. ఒక గమ్యం లేకుండా ఎదిగాడు. అందరూ ఏదో ఓ లక్ష్యంతో జీవితం గడపటం చూశాడు. తన జీవితానికి ఓ లక్ష్యం, గమ్యం లేకపోవటం అతడిని బాధించింది. దాంతో అడవిలో ఉన్న సాధువు దగ్గరకు వెళ్ళి ఆయన శుశ్రూష చేయటం ఆరంభించాడు. ఓ రోజు సాధువు ధ్యానం అయిన తరువాత 'నాకూ మీలాగ శాంతంగా జీవితం గడపాలని ఉంది. ఏం చేయాలి?' అని అడిగాడు. 'ముందుకు సాగిపో' అన్నాడు సాధువు. హరిదాసుకు అర్థం కాలేదు. మళ్ళీ రెట్టించి ఎన్నిమార్లు అడిగినా సాధువు పలకలేదు. దాంతో చేసేదేమీ లేక, హరిదాసు సాధువును వదిలి ముందుకు సాగాడు. అలా అడవిలో నడుస్తూ పోతూంటే అతడికి బంగారం దొరికింది. ఇంకా ముందుకు పోతే ఓ గ్రామం వచ్చింది. ఆ బంగారంతో గ్రామంలో వ్యాపారం ప్రారంభించాడు. ధనవంతుడయ్యాడు. కానీ సుఖంగా ఉండలేకపోయాడు. సాధువు 'ముందుకు సాగిపో' అన్నాడు. తాను ఆగిపోయాడు. దాంతో గ్రామం వదిలి మళ్ళీ ముందుకు నడిచాడు. ఎంత ముందుకు నడిచినా ఏం చేయాలో అర్థం కాలేదు. చివరికి అతడు అలసి ఆగిపోయే సమయానికి అడవిలో ఓ గుడిసె కనిపించింది. దాంట్లో సాధువు ఉన్నాడు. హరిదాసును చూసి 'ఏం కావాలి?' అనడిగాడు సాధువు. 'నాకు మీలాగా సంతృప్తిగా బతకాలని ఉంది' అన్నాడు హరి దాసు. 'మరి ఆగావేం? ముందుకు సాగిపో?' అన్నాడు సాధువు. హరిదాసు ముందుకు సాగిపోయాడు.

ఈ కథ జీవితంలో ఆదర్శరాహిత్యం కలిగించే సమస్యని స్పష్టంగా సూచిస్తుంది. ఆదర్శం లేని వ్యక్తి చుక్కాని లేని నావ వంటివాడు. తెగిన గాలి పటం లాంటివాడు. ఇటువంటి వారిని సూచించేందుకు ఇంగ్లీషులో 'రాడికల్' అనే పదం సరిగ్గా సరిపోతుంది. రసాయనశాస్త్రంలో వాడే పదం ఇది. అణువులో ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు ఉంటాయి. ఎప్పుడైతే ఇవి సరైన సంఖ్యలో ఉంటాయో, అప్పుడు ఆ అణువు స్థిరంగా

ఉంటుంది. దాని మీద ఎంత ఒత్తిడి తెచ్చినా అది ఎటువంటి స్పందనా పొందదు. మరో అణువులనెన్నిటిని పరిసరప్రాంతాలకు తెచ్చి, ఎటువంటి ప్రోత్సాహాన్ని ఇచ్చినా అది రసాయనచర్యలకు ఉపక్రమించదు. అలా కాక ఎలక్ట్రాన్, ప్రోటాన్ల సంఖ్యలో సమతౌల్యం లేకపోతే అది తన ఎలక్ట్రాన్లు ఇచ్చేయటం వల్లనో, లేక ఎలక్ట్రాన్లను మరో అణువు నుంచి గ్రహించటం వల్లనో స్థిరత్వం సాధించాలని తపన పడుతుంది. రకరకాల చర్యలకు సిద్ధంగా ఉంటుంది. అది ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో ఎవరూ చెప్పలేరు. దాన్ని 'రాడికల్' అంటారు. ఈ రాడికల్ అతిప్రమాదకరమైందన్నమాట.

ఒక ఆదర్శం అంటూ లేనివాడు కూడా 'రాడికల్' వంటివాడు. అటువంటివాడు ఇతరుల ప్రలోభాలకు త్వరగా లొంగిపోతాడు. ఇతరుల ప్రభావంలో పడి స్వీయవ్యక్తిత్వాన్ని మరచిపోతాడు. ఇతరుల మాయమాటలకు లొంగి సులభంగా తన అస్తిత్వాన్ని కోల్పోతాడు. అందుకే బాల్యంలోనే ఒక సరైన 'ఆదర్శం' అంటూ ఏర్పడటం వ్యక్తిత్వ వికాస మార్గంలో అత్యంతప్రాధాన్యాన్ని వహిస్తుంది.

పిల్లవాడికి పెద్దల పట్ల గౌరవభావం కలిగి ఉండటం, పెద్దలను గౌరవించటం, శాస్త్రాలను విశ్వసించటం, యోగ ద్వారా శరీరంపై, మనసుపై పట్టు సాధించటం వంటివన్నీ వ్యక్తిత్వవికాససాధనలో మెట్లవంటివి. ఇవేవీ లేకపోయినా వ్యక్తిత్వవికాస దిశలో వ్యక్తిని ప్రోత్సహించి, నడిపిస్తుంది ఆదర్శం.

'ఆదర్శం' అనేది వ్యక్తి ఎదుగుదలలో అత్యంతప్రాధాన్యాన్ని వహిస్తుంది. ఎందుకంటే బాల్యం నుంచీ వ్యక్తి జ్ఞానాన్ని గ్రహించటంలో అనుకరణ, పరిశీలనలు ప్రధానపాత్ర వహిస్తాయి. పిల్లవాడు పెద్దలను అనుకరిస్తాడు. పెద్దల ప్రవర్తనను, మాట తీరును పరిశీలిస్తాడు. వారి పద్ధతులను పరిశీలించి, అనుకరిస్తాడు. సాధారణంగా పిల్లవాడికి తల్లిదండ్రులు ఆత్మవిశ్వాసాన్నిస్తారు. పిల్లవాడి జీవితంలో వారిద్దరూ అత్యద్భుతమైన వ్యక్తులు. పెద్ద అయిన తరువాత 'తండ్రి'లా అవ్వాలని ప్రతి పిల్లవాడు ఆశపడతాడు. తండ్రి బస్సు డ్రయివర్ ఐతే తాను డ్రయివర్ అవ్వాలనుకుంటాడు. అతడు ఆడే ఆటలు కూడా బస్సుల చుట్టే తిరుగుతాయి. తల్లి టీచర్ అయితే పిల్లవాడూ టీచర్ అవ్వాలనుకుంటాడు. తండ్రి రిక్షా తొక్కేవాడైతే పిల్లవాడు ఎదిగి రిక్షా తొక్కేయాలని తహతహలాడతాడు. తండ్రి లాయరైతే పిల్లవాడి ఊహలు 'న్యాయవాదం' చుట్టూ తిరుగుతూంటాయి. ఇది బాల్యదశలో అతడి ఊహలను ప్రభావితం చేస్తూన్న అంశం.

ఎదుగుతున్న కొద్దీ పిల్లవాడి ప్రపంచం కూడా మారుతూంటుంది. తాను ఓ 'అద్భుతం' అన్న భావనతో పాటు తల్లిదండ్రులూ 'ప్రత్యేకం' అన్న భావన తగ్గుతుంది.

ఎందరో తనలాంటి వారున్నట్టు తెలుసుకుంటాడు. బయటి ప్రపంచాన్ని చూస్తాడు. దాంతో అతడి ఆదర్శాల స్వరూపం మారిపోతుంది. సచిన్‌లా క్రికెట్ ఆడాలనుకుంటాడు. మరెవరో సినీనటుడిని అనుకరిస్తాడు. ఇంకెవరో శాస్త్రవేత్తలా పరిశోధించేయాలను కుంటాడు. ఇది ఒక రకంగా పిల్లవాడి ఎదుగుదలలో నిర్ణయాత్మకమైన దశ. ఈ దశలో అనేక రకాలైన ఆకర్షణలు పిల్లవాడి ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తాయి. రకరకాల ఆకర్షణీయమైన సిద్ధాంతాలు తమ వైపు లాగుతుంటాయి. బోలెడన్ని రంగుల వలలు తమ మాయాజాలాన్ని విసుర్తూంటాయి. రకరకాల ఆవేశాలు అత్యంత ఆకర్షణీయమైన రూపాల్లో గొంతెత్తి పిలుస్తూంటాయి. ఆకర్షణల నాలుగు రోడ్ల కూడలిలో నిలుచున్న పిల్లవాడు ఏ వైపు వెళ్ళాలో తెలియక అయోమయంలో పడతాడు. సరైన ఆలోచన లేక ఏదో ఒక నిర్ణయం తీసుకుంటాడు. అది అతడి భవిష్యత్తును నిర్ణయించేస్తుంది. సరైన మార్గదర్శనం లేకపోతే జీవితాంతం 'ముందుకు పో' అంటూ తరుముతూనే ఉంటుంది. ఆ 'ముందు'కు అంతం ఉండదు. జీవితానికి శాంతి ఉండదు.

ఇందుకు భిన్నంగా పిల్లవాడికి ఆరంభం నుంచీ క్రమశిక్షణ అలవడిందనుకుందాం. అతడికి సృష్టికర్తపై విశ్వాసం, తన శక్తిపై తనకు నమ్మకం ఉన్నాయనుకుందాం. పెద్దలపై గౌరవం, శాస్త్రాలపై గౌరవం ఉన్నాయనుకుందాం. ఇవి ఉన్న మరు క్షణం అతడి దృష్టి ఉన్నతాదర్శంపై ఉండితీరుతుంది. దాంతో 'రాడికల్'లా ఏ వైపు పడితే ఆ వైపు ఆకర్షితుడై, ఎవరు పడితే వారి ప్రలోభంలో పడటం జరగదు. అతడికి తన కర్తవ్యం తెలుస్తుంది. జీవితానికి ఒక లక్ష్యం ఉంటుంది. తాను ఈ క్షణం పుట్టి, మరో క్షణం చచ్చే వ్యర్థ జీవితం గడపకూడదని అతడికి తెలుస్తుంది. సృష్టి ప్రణాళికలో తన నిర్దిష్ట బాధ్యత అతడికి గ్రహింపులోకి వస్తుంది. దాంతో ఎవరేమన్నా, అతడి దృష్టి తాను సాధించవలసిన 'ఆదర్శం' పైనే ఉంటుంది. జనుల నడుమ ఉంటూ తనదైన ప్రత్యేకతను నిలుపుకో గలుగుతాడు. అన్నిటినీ తనతో పాటు లాక్కుపోయే ప్రవాహంలో ఉంటూ కూడా స్థిరంగా నిలబడతాడు. తన విశిష్టవ్యక్తిత్వంతో ప్రవాహగతిని నిర్దేశిస్తాడు.

ఒక్కసారి మనం మన గతాన్ని స్మరిస్తే ఆరంభం నుంచీ ఇటువంటి ఆదర్శంతో, సామాన్యజీవితంపై తమదంటూ చెరగని ముద్ర వేసిన విశిష్టవ్యక్తులు అనేకులు కనిపిస్తారు. ఒక ఆదర్శం అంటూ ఏర్పడనంత కాలం వారి జీవితాలలోని నిశ్చింత, ఆదర్శం పట్ల అవగాహన రావటం తోటే వారు జీవితాలలో సాధించిన శాంతి, సమాజానికి పంచిన వెలుగులు మనం స్పష్టంగా గమనించవచ్చు.

నరేంద్రకు బాల్యం నుంచీ తల్లిదండ్రులు ఇచ్చిన సంస్కారం అతడిలో అన్వేషణాసక్తి రగిల్చింది. కానీ రామకృష్ణ పరమహంస పరిచయమయ్యేంత వరకూ అతడికి తన జీవితాదర్శంపై స్పష్టమైన అవగాహన రాలేదు. దాన్ని గ్రహించిన మరు క్షణం నరేంద్ర వివేకానంద అయ్యాడు. భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఎంతో మంది ఆయనను వెనుకకు లాగాలని ప్రయత్నించారు. నిరుత్సాహపరచారు. హేళన చేశారు. విమర్శించారు. కానీ వివేకానంద తన ఆదర్శపథంలో సాగిపోయాడు.

మహాత్మా గాంధీకి ఆరంభం నుంచీ మంచి సంస్కారాలు లభించాయి. అందుకే తల్లికి ఇచ్చిన మాట ప్రకారం విదేశాల్లో ఉంటూ కూడా మద్యం, మాంసం ముట్టలేదు. కానీ అతనికి ఒక ఆదర్శం లభించిన తరువాత ఆయన మహాత్ముడయ్యాడు.

అరబిందో ఆదర్శం మాతృదేశ దాస్యశృంఖలాలను ఛేదించటం. అందుకోసం ఆయన విప్లవకారుడయ్యాడు. అనేకులకు ఆదర్శమయ్యాడు. కానీ భారతీయధర్మం ఆయన జీవితాదర్శానికి మార్గదర్శనం చేసింది. ఆయన మహర్షి అయ్యాడు. తన జీవితం ద్వారా సర్వసంగపరిత్యాగానికి సరైన మార్గదర్శనం చేశాడు.

ఇక శ్రీ గురూజీ జీవితాన్ని పరిశీలిస్తే కూడా మనకు ఇదే కనిపిస్తుంది. ఆరంభం నుంచీ ఆధ్యాత్మికచింతన ఆయనకు ప్రాణవాయువు అయింది. అన్నీ వదిలి తపస్సులో జీవితం గడపాలని అనుకున్నారు. కానీ గురువు ఆయనకు జీవితలక్ష్యాన్ని నిర్దేశించారు. సర్వసంగపరిత్యాగి అయి కూడా సమాజ అభ్యున్నతి కోసం, సమాజంలో ఉంటూ పాటుపడమన్నారు. గుర్వాజ్ఞను ఆయన శిరసా వహించారు.

పురాణాలలో పరిశీలిస్తే కొట్టొచ్చినట్టు కనబడేది సావిత్రి గాథ. తాను నమ్మిన సంప్రదాయాల కోసం, సంస్కారాల కోసం 'యముడి'తో సైతం పోరాటానికి సిద్ధమైంది సావిత్రి. పట్టుదలకు, ఆత్మవిశ్వాసానికి పెద్ద ఆదర్శంగా నిలచింది.

కృష్ణభక్తిలో సర్వస్వాన్ని త్యజించింది మీరాబాయి. భగవదారాధనను 'పిచ్చితనం'గా భావించినవారు చేసిన దూషణలన్నీ ఆమె చిరునవ్వుతో స్వీకరించింది. సృష్టికర్తపై ప్రేమ కోసం విషాన్ని అమృతతుల్యంగా భావించి సేవించింది.

ఇంకా మనం ప్రాతఃస్మరణలో స్మరించే ప్రతి ఒక్క వ్యక్తీ విశిష్టమైన వ్యక్తిత్వంతో సమాజానికి మార్గదర్శనం చేసినవారే. చేస్తున్నవారే. ఇప్పుడు మనం పైపైన స్పృశించిన కొన్ని ఆదర్శజీవితాలు, వ్యక్తికి 'ఆదర్శం' ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తాయి.

ప్రస్తుతసమాజాన్ని గమనిస్తే, నేటి వ్యక్తిత్వరాహిత్యపరిస్థితికి ప్రధానకారణం 'ఆదర్శరాహిత్యం' అని స్పష్టంగా కనిపిస్తుంది. మన కథలో 'హరిదాసు' అనాథ అయ్యాడు కాబట్టి అతనికి సంస్కారాలు లేవు. ఆదర్శం లభించలేదు. కానీ ఆద్యంతాలు లేని విశిష్టమైన పరంపర వారసత్వంగా గల హైందవసమాజం సైతం, అనాథలా, ఆదర్శరాహిత్యంతో వ్యక్తిత్వరహితంగా నిలబడటం, వ్యక్తిత్వవికాసం కోసం పాశ్చాత్య కృత్రిమశ్వాస కోసం తపించటం మన సామాజికదుఃస్థితికి దర్పణం పడుతుంది. ఈ ఆదర్శరాహిత్యం వల్లనే ఈ నాడు మనం సమాజంలో అనేకవికృతులు చూడాల్సి వస్తోంది. ఒక హీరో సినిమా మొదటి రోజు చూడటం కోసం ప్రాణాలు త్యాగం చేస్తున్నారు. హీరోయిన్ అంగాంగ ప్రదర్శన కోసం ప్రాణాలు పణంగా పెడుతున్నారు. ఓ నాయకుడి వల్ల కలిగే తాత్కాలిక, లాభాల ఆశలో తమ జీవితాలనే కాదు, సమాజంలో ఇతరుల జీవితాలనూ తృణప్రాయంగా భావిస్తున్నారు. ఒక ఆటగాడు ఓ ఆట బాగా ఆడగానే అతడు ఆరాధ్యదైవం అవుతున్నాడు. అతడిలాగా జుట్టు పెంచుకుని, అతడి గొప్పతనాన్ని ఆపాదించుకుంటున్నారు. సినీ హీరో హీరోయిన్లని ఆదర్శంగా తీసుకుని, దుస్తుల దగ్గర నుంచి ప్రేమల వరకూ వారిని అనుసరిస్తూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. శాశ్వతమైన సత్యాలను వదలి తాత్కాలికానందాలే ఆదర్శం అనుకుంటున్నారు. ఇవాళ్ళ ధోనీ, నిన్న టెండూల్కర్, మధ్యలో సెహవాగ్ .... ఒక రోజు సల్మాన్ ఖాన్, మరో రోజు హృతిక్ రోషన్, అప్పుడపుడు ఐశ్వర్యారాయ్...ఇలా ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలో తెలియక, ఎవరిని అనుసరించాలో తెలియక, గుడ్డివాడు గుడ్డివాడికి తోవ చూపిస్తే కలిగే ఫలితాలను సమాజంలో ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నారు.

## సరైన ఆదర్శం

అనగనగా ఓ యాత్రికుడు ప్రయాణాలు చేస్తూ చేస్తూ దారి తప్పి, ఓ అడవి చేరుకున్నాడు. అక్కడ అతడికి ఓ సాధువు కనిపించాడు. సాధువు ఆశ్రమంలో విశ్రాంతి తీసుకున్న యాత్రికుడికి, అటువంటి అడవిలో సాధువు అడిగినవన్నీ లభించటం చూసి ఆశ్చర్యపోయాడు. 'నా దగ్గర కోరికలు తీర్చే వృక్షం ఉం'దని చెప్పాడు సాధువు. అప్పటి నుంచీ ఆ యాత్రికుడికి ఆ వృక్షం దగ్గరకు వెళ్ళి కోరికలు తీర్చుకోవాలన్న ఆలోచన భూతంలా పట్టుకుంది. సాధువు ఎంత వారించినా వినలేదు. 'ఆలోచనల మీద పట్టు, ఆచరణలో నియంత్రణ, హృదయంలో నిర్మలత్వం ఉన్నవారే ఆ వృక్షాన్ని సరిగ్గా ఉపయోగించుకోగలరు. లేకపోతే అనవసరంగా ప్రమాదం కొని తెచ్చుకున్నట్టవుతుంది' అని హెచ్చరించాడు. కానీ పెద్దల హెచ్చరికలను గ్రహించేంత వ్యక్తిత్వం లేదా యాత్రికుడికి.

మొండిపట్టుపట్టాడు. చివరికి ఆ కోరికలు తీర్చే వృక్షం వద్దకు వెళ్ళాడు. 'ఆహా, ఇక్కడ ఎంత బాగుంది! ఓ పట్టుపరుపు లభిస్తే ఎంత బాగుండు' అనుకున్నాడు. వెంటనే మంచం, పట్టుపరుపులు వచ్చాయి. 'రుచికరమైన తినుబండారాలుంటేనా!' అన్నాడు. తినుబండారాలు దొరికాయి. 'ఓ అందమైన అమ్మాయి' అనుకోగానే ఆమె ప్రత్యక్షమైంది. సేవలందించింది. అతడు హాయిగా నిద్రించి లేచేసరికి సాయంత్రమైంది. అలముకుంటున్న చీకటిని చూడగానే అతడికి భయం వేసింది. 'పులి ఏ మూల నుంచో వచ్చి మీద పడితే?' అనుకున్నాడు. అతడు మరో ఆలోచన చేసే లోగా పులి వచ్చింది, మీద పడి లాక్కుపోయింది.

మన ఆలోచనలు మన కర్మలను నిర్దేశిస్తాయి. మన కోరికలు మన వ్యక్తిత్వానికి దర్పణం పడతాయి. ఒక వ్యక్తి కలలను విశ్లేషిస్తే అతని మనసులో దాగున్న అసలు మనిషిని అర్థం చేసుకునే వీలుంటుంది. కాబట్టి సముద్రంలో అలల్లా అలుపు లేకుండా నిరంతరం ఎగసిపడే ఆలోచనలను నియంత్రించటం వ్యక్తిత్వవికాసంలో ప్రధానపాత్ర వహిస్తుందన్న విషయంలో ఎటువంటి సందేహమూలేదు. సరైన ఆదర్శాన్ని, ఆదర్శమూర్తిని ఎంచుకోవటం ఆలోచనల నియంత్రణలో అత్యంతప్రభావాన్ని చూపిస్తుంది.

ఆలోచనలకు అంతు లేదు. అవి నిరంతరం తీరాన్ని తాకే అలల వంటివి. ఎలాగైతే అలలు తీరాన్ని తాకుతూ, రాళ్ళను ముక్కలు ముక్కలు చేసి మట్టిగా మారుస్తాయో, అలాగే నిరంతరం ఉద్భవించే కోరికలు, వ్యక్తి వ్యక్తిత్వాన్ని కూడా మట్టిలా మార్చ గలుగుతాయి. కోరికలపై నియంత్రణ సాధించని వ్యక్తి మట్టి అయిపోతాడు. అందుకే భారతీయవ్యక్తిత్వవికాసపథంలో కోరికలపై నియంత్రణ సాధించటానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వటం జరిగింది. కోరికలను మించటంలో 'ఆదర్శం' అత్యంత శక్తిమంతమైన ఆయుధం. ఇది గ్రహించిన భారతీయ మానసిక శాస్త్రవేత్తలు, మన జీవన విధానంలో కోరికలపై పట్టు సాధించేందుకు అనేకమార్గాలను సూచించారు. కోరికలను నియంత్రించేందుకు ఆదర్శానికి సంబంధం ఏమిటన్న ప్రశ్న ముందుగా కలుగుతుంది. మనిషి మనసు గాలి పటం లాంటిది. దాన్ని దారం నియంత్రించినంత కాలం గాలిలో స్థిరంగా ఎగురుతూ ఉంటుంది. ఆ దారం తెగిపోతే దాని కొక దిశ అంటూ ఉండదు. గాలి ఎటు తీసుకువెళ్తే అటు కొట్టుకుపోతుంది. అలా దిశ లేకుండా ఎటు పడితే అటు కొట్టుకుపోయే గాలి పటం లాంటి మనసును నియంత్రిస్తుంది ఆదర్శం.

సాధారణంగా మన అందరికీ అనుభవంలోకి వచ్చే విషయమే, మనం సినిమాకు వెళ్తాం. సినిమా ఆరంభమయ్యేముందు అనేకప్రకటనలు చూస్తూ, ఆ తరువాత సినిమా

చూస్తాం. మనకు సినిమా గుర్తుంటుంది. కానీ అంతకు ముందు చూసిన ప్రకటనలు గుర్తుండవు. అలాగే మనం ఓ సభకు ఓ వ్యక్తి ఉపన్యాసం వినేందుకు వెళ్తాం. అతని కన్నా ముందు ఉపన్యాసాలు విన్నా వారి ఉపన్యాసాలు నచ్చవు. మనం ఎదురుచూసే వ్యక్తి ఉపన్యాసం వింటాం. అందులో కూడా మనకు ప్రతి వాక్యం గుర్తుండదు. కొన్ని కొన్ని వాక్యాల భావాలే గుర్తొస్తాయి. అవీ కొద్ది కాలానికి  మరచిపోతాం. కానీ కొన్ని భావాలు జీవితాంతం గుర్తుంటాయి.

మనం టీవీలో ఏదో కార్యక్రమం ఆసక్తిగా చూస్తుంటాం. ఎవరో పలకరిస్తారు. దృష్టి టీవీ మీద ఉంచి అన్యమనస్కంగా వారి మాటలు వింటుంటాం. పైకి ఊ కొడుతుంటాం. కానీ వారి మాటలు నిజంగా వినం. లేక వారి మాటలు వింటే, టీవీలో చూసింది సరిగా గమనించలేం. అలాగే, ఓ పుస్తకం చదువుతుంటాం. పూర్తిగా లీనమైపోతాం. పక్కన ఏం జరుగుతుందో పట్టించుకోం.

పై చిన్న చిన్న ఉదాహరణలు ఓ విషయాన్ని స్పష్టం చేస్తాయి. అదేమిటంటే, మనకు ఇష్టమైన పని చేస్తున్నప్పుడు, ఏదైనా విషయం ఆసక్తిగా వింటున్నపుడు ఏకాగ్రత ఎంతగా కుదురుతుందంటే, మిగతా ప్రపంచం అదృశ్యమైపోతుంది. మనం జీవనప్రవాహంలో ఉంటాం. కానీ, ప్రవాహవేగం మనని తాకదు. కోసుకుపోయే ఉరకల పరుగుల ప్రవాహంలో కూడా నిశ్చలమైన బండ రాయిలా స్థిరంగా నిలబడతాం. అందుకే, అలరించే అందాలు, ఊహించే ఆకర్షణలు, తోసేసే తుపాను గాలులు, కోసుకుంటూ ప్రవహించే వరదలన్నిటి నడుమా కూడా నిశ్చలంగా ప్రశాంతంగా మనసు నిలిచేట్టు చేయగలుగుతుంది మన మనసుకు నచ్చిన ఆదర్శం. ఒక సినిమా, ఓ టీవీకార్యక్రమం, ఓ పుస్తకం మనల్ను సర్వం మరిచేట్టు చేయగలిగితే ఒక మహోన్నతాదర్శం మనసుపై పట్టు సాధించటంలో ఎంత ప్రధానపాత్ర వహిస్తుందో ఊహించటం కష్టం కాదు.

ఒకోసారి ఆలోచిస్తే నిండు యౌవనంలో ప్రపంచాన్ని తృణీకరించి దేశమాత దాస్య శృంఖలాలను తెంచటం కోసం చిరునవ్వుతో ఉరి కంబాన్ని కౌగలించుకోవటంలో యువకుల ఆదర్శం ప్రస్ఫుటమౌతుంది. తమ ఆదర్శసాధనలో వారు జీవితాన్ని సైతం కాలదన్ని మృత్యువును సంతోషంగా స్వీకరించారు.

దేశమాతను పరాయి పాలన నుంచి విముక్తను చేయాలన్న ఆదర్శం ఒక సామాన్య, సంస్థానాధీశుడిని మొఘలు సామ్రాజ్యాన్ని పునాదులతో సైతం కదిలించగల శక్తిమంతుడిని చేసింది. ఛత్రపతిగా నిలిపింది. సమాజం ముందు ఒక సముచితమైన ఆదర్శాన్ని సమున్నతమైన రీతిలో నిలపాలన్న ఆదర్శం, ఒక బోయవాడిని ఆదికవిగా నిలిపింది.

ప్రపంచమానవాళికి భారతీయ ధర్మ ఔన్నత్యం వివరించి మార్గదర్శనం చేయాలన్న ఆదర్శం ఒక మామూలు యువకుడిని 'వివేకానందు'డిని చేసింది.

ఆదర్శం వ్యక్తి కోరికలన్నిటినీ అణచివేసి అతడి దృష్టిని కేంద్రీకృతం చేయటం వీర సావర్కర్ జీవితంలో స్పష్టంగా చూడవచ్చు. అత్యంతప్రతిభాశాలి, ప్రజలకు నాయకత్వం చేయగల శక్తి, కవితాపటిమ అమితంగా ఉన్న వ్యక్తి, అత్యంత తెలివైన వాడు ఒంటరిగా జైలులో రోజూ గానుగెద్దులా పని చేస్తూ కూడా సంయమనం కోల్పోకుండా ఉండటం సామాన్యమైన విషయం కాదు. ఒక పరీక్షలో పాసు కాకపోతే ఆత్మహత్యలు చేసుకునేవారున్నారు. అనుకున్న ఉద్యోగం దొరకకపోతే నిరాశలో మగ్గి జీవితాలు పాడుచేసుకునేవారున్నారు. ప్రేమించిన అమ్మాయి దొరకకపోతే తాగుబోతులై తమ జీవితాన్నే కాక తమను నమ్ముకున్నవారి జీవితాలనూ నరక ప్రాయం చేసే బలహీన మనస్కులున్నారు. ఇటువంటి మనుషులు కోకొల్లలు. ఇటువంటి బలహీనమనస్కులు అడుగడుగునా దర్శనమిస్తారు.

బుద్ధి ఉండి, మనుషులకు మార్గదర్శకత్వం చేయగల శక్తి ఉండి, ఉత్తేజంతో రగులుతూ, విశాలవిహాయసంలో రివ్వున ఎగిసేందుకు సిద్ధంగా ఉన్న పక్షి వంటి వ్యక్తిని గానుగెద్దులా నాలుగు గోడల నడుమ బంధించి ఉంచితే ఆ వ్యక్తి మనసులో చెలరేగే సంఘర్షణను ఊహించటానికి కూడా భయం వేస్తుంది. ఇక జీవితాంతం తనకు విముక్తి లేదని, ఇలా పశువు కన్నా దుర్భరమైన జీవితం గడపటం తప్ప మరో గత్యంతరం లేదన్న ఆలోచన ఎటువంటి వాడినైనా నిరాశ పాతాళానికి నెట్టుతుంది. ముక్కలు ముక్కలు చేస్తుంది. అండమాన్ జైలులో ఇలాంటి పరిస్థితులలో పిచ్చివాళ్ళయిపోయినవారున్నారు. ఆత్మహత్యలు చేసుకున్నవారున్నారు. ఎందుకూ పనికిరాకుండా పోయినవారున్నారు. కానీ అన్ని అడ్డంకులనూ మించి, అన్ని శిక్షలనూ చిరునవ్వుతో అనుభవించి, తన మానసికసమతౌల్యాన్ని కాపాడుకుంటూ, తనలో రగిలే జ్యోతిని మరింత జాజ్వల్య మానం చేసుకుంటూ ఉత్తమవ్యక్తిగా నిలిచాడు వీర సావర్కర్.

చదివేందుకు పుస్తకాలు లేకపోతే గోడలపై పుస్తకాలు రాశాడు. కరచరణాలకు సంకెళ్ళు విధిస్తే, మనసుకు రెక్కలనిచ్చి విశాలవిహాయసంలో స్వేచ్ఛగా విహరింపచేశాడు. తనపై విధించిన పరిమితులను ఎదుర్కున్నాడు. ఈ రకంగా సావర్కర్ అన్ని భౌతిక పరమైన ఒత్తిళ్ళనూ తట్టుకుని, మానసిక శృంఖలాల ఛేదించుకుని మనిషిలా నిలబడ గలగటంలో ప్రధానపాత్ర పోషించింది ఆదర్శం. ఒక వంక ఆదర్శం మనసును రగిలిస్తూంటే, మిగతా ఇబ్బందులన్నీ ఇబ్బందులుగా అనిపించవు. సత్యహరిశ్చంద్రుడు

సత్యం కోసం అనేక కష్టాలు పడ్డాడు. రాజ్యం కోల్పోయాడు. భార్యబిడ్డలను అమ్ముకున్నాడు. అత్యంత శక్తిమంతుడైన రాజు అయి ఉండి కూడా కాటి కాపరిగా పని చేశాడు. దుర్భరమైన వేదనలను అనుభవించాడు. వాటన్నిటినీ చిరునవ్వుతో భరించగల శక్తిని హరిశ్చంద్రుడికి ఇచ్చింది 'సత్యసంధత' అనే ఆదర్శం.

అటు సావర్కర్‌కి గానీ, ఇటు హరిశ్చంద్రుడికి కానీ తమ కష్టాలను చిరునవ్వుతో భరించగలిగే శక్తిని ఇవ్వటంలో ఆదర్శం ప్రధానపాత్ర వహిస్తుంది. సావర్కర్ లాంటి దేశభక్తులు అనేకులు తమ సర్వస్వాన్ని త్యజించి దేశం నలుమూలలా సామాజిక అభ్యున్నతి కోసం ఈ నాటికీ పాటుపడుతున్నారు. హరిశ్చంద్రుడిలా అనేకులు చిరునవ్వుతో తాము నమ్మిన సత్యం కోసం జీవితాలను ఆహుతి చేస్తున్నారు.

'ఆదర్శం' ఒక జ్యోతి వంటిది. వ్యక్తి హృదయంలో నిరంతరం జ్వలిస్తూ అతడికి మార్గదర్శనం చేస్తుంది. చీకటి వేళల దారి దివ్వెలా నిలుస్తుంది. దారి చూపిస్తుంది. ఇతరులకు భరించరాని కష్టాలుగా తోచే అంశాలను చిరునవ్వుతో భరించగలిగే ధీరులుగా చేస్తుంది. ఆ ఆదర్శం వెలుతురులో ప్రపంచంలోని ఇతరాకర్షణలన్నీ సూర్యుడి ముందు దివిటీల్లా వెల వెలబోతాయి. ఆదర్శం ఓ బాలుడిని ధ్రువతారలా ఆకాశంలో నిలుపుతుంది. 'ఆదర్శం' ఓ రాజును శ్రీరామచంద్రుడిని చేస్తుంది. ఆదర్శం సామాన్యవ్యక్తిని అసామాన్యుడిని చేస్తుంది. అనూహ్యమైన అద్భుతాలు సాధించేందుకు ఉద్యుక్తుడిని చేస్తుంది. ఆదర్శం లేని వ్యక్తి తనలో ఉన్న కల్పవృక్షం లాంటి శక్తిని ఎలా ఉపయోగించుకోవాలో తెలియక దుర్వినియోగం చేస్తాడు. తనకే కాదు, సమాజానికీ ప్రమాదం కొనితెస్తాడు. ఆదర్శం కల వ్యక్తి తనలో ఉన్న కోరిన కోరికలిచ్చే వృక్షాన్ని సద్వినియోగపరుస్తాడు. ఇతరులకూ ఆ శక్తిని సద్వినియోగ పరచటంలో మార్గదర్శకత్వం వహిస్తాడు.

ఈ పై కొన్ని ఉదాహరణలు ఆదర్శప్రాధాన్యాన్ని వివరిస్తాయి. సరైన ఆదర్శం ఏర్పాటు చేసుకుని ప్రపంచంలో వ్యక్తిని దిగజార్చే ఆకర్షణలను మించి ఉత్తమ వ్యక్తిత్వం సాధించటంలో భారతీయజీవనమార్గంలో అనేకసూత్రాలు ఉన్నాయి.

## వ్యక్తిత్వవికాససూత్రాలు

అనగనగా ఓ రాజ్యం, ఆ రాజ్యానికి ఓ రాజు ఉన్నాడు. ఆ రాజ్యం పొలిమేరల్లో ఉన్న అడవిలో ఓ గొప్ప తపస్వి ఆశ్రమం కట్టుకున్నాడని రాజుకు తెలిసింది. ఓ రాత్రి ఆ తపస్వి ఆశ్రమంలో గడపాలన్న కోరిక రాజుకు కలిగింది. తపస్వి అనుమతి కోసం

రాజు, తన మంత్రిని ఆ తపస్వి ఆశ్రమానికి పంపాడు. రాజు కోరిక విని తపస్వి నవ్వి అనుమతినిచ్చాడు. అంత దూరం నుంచి వచ్చిన మంత్రి బడలిక తీరేందుకు పాలు ఇచ్చాడు తాగమని. పాల రుచి మంత్రిని ఆశ్చర్యపరిచింది. తపస్వి ప్రత్యక్షంగా ప్రేమతో పెంచుతున్న ఆవు నుండి తీసిన పాలు అవి అని తెలుసుకున్నాడు మంత్రి. మరుసటి రోజు రాజు ఆశ్రమానికి వచ్చినప్పుడు ఆ ఆవు పాలు రాజుకు ఇమ్మని ఆ తపస్వి శిష్యులకు ప్రత్యక్షంగా పురమాయించాడు మంత్రి. కానీ ఆ రోజు పాల రుచి అద్భుతంగా అనిపించలేదు సరికదా, మామూలుగా ఉన్నాయి పాలు. 'నిన్న ఈ పాలు తాగి ఆవును కొనేద్దామనుకున్నాను. ధర ఎంతైనా పరవాలేదనుకున్నాను. కానీ ఇప్పుడు పాలు తాగిన తరువాత తొందరపడనందుకు సంతోషిస్తున్నాను' అన్నాడు మంత్రి, రాజుతో సమయం చిక్కగానే. దానికి రాజు నవ్వి సమాధానం ఇచ్చాడు. 'పాల రుచి నిన్న, ఇవాళ ఒకటే. తేడా నీ అనుభూతిలో ఉంది. నిన్న అలసిపోయి వచ్చావు. పాల రుచి అద్భుతంగా ఉంది. ఇవాళ్ళ అద్భుతమైన రుచిని ఊహిస్తూ వచ్చావు. పాల రుచి మామూలుగా ఉంది. ప్రపంచరీతి ఇది. అందుకే నువ్వు దృష్టిని, అనుభూతిని, మనస్సు స్థితిని బట్టి మారే పాల రుచిపై కాదు, ఎన్నటికీ మారని శాశ్వతసత్యాలను తెలిపే తపస్వి మాటలపై ఉంచాలి.'

మానవజీవితంలో అనుక్షణం విభిన్నమైన అనుభవాలు కలుగుతాయి. విభిన్నమైన అనుభూతులు అనుభవానికి వస్తాయి. అనుభవాలు గురువులు. ఒకో అనుభవం నేర్పే పాఠాన్ని అనుసరించి వ్యక్తి ఆలోచన విధానం ప్రభావితమౌతూంటుంది. అతని ఆలోచనల రూపురేఖలను మనస్సనే శిలపై అనుభవం చెక్కటం వల్ల వ్యక్తిత్వశిల్పం రూపు దిద్దుకుంటుంది. ఇక్కడ గమనించాల్సిందేమిటంటే ఒకే రకమైన అనుభవం వేర్వేరు వ్యక్తులలో వేర్వేరు అనుభూతులను కలిగిస్తుంది. వేర్వేరు స్పందనలకు కారణమౌతుంది. అనుభవాలకు వ్యక్తి స్పందన ఆరంభం నుంచీ అతనికి అందిన సంస్కారాలు, నేర్పిన లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. అందుకే భారతీయ జీవనవిధానంలో ఆరంభం నుంచీ, అంటే శిశుజననం జరిగినప్పటి నుంచే కాదు, వీలైతే శిశువు గర్భంలో ఉన్నప్పటి నుంచీ ఉత్తమాదర్శాలను అందించే ప్రయత్నం జరుగుతుంది. ఆరంభం నుంచీ మంచి మాటలు నేర్పటం, మంచి గుణాలను ఆకళింపు చేయటం వంటి పద్ధతులను పాటించటం జరుగుతుంది. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలే కాదు' మన సాహిత్యం సర్వం ఈ దిశలో ప్రయత్నించటం స్పష్టంగా కనిపిస్తుంది.

పిల్లవాడికి ఇంకా ఊహ తెలియక ముందు నుంచే లాలిపాటలు పాడటం ఆనవాయితీ. ఆ లాలిపాటలు కూడా 'స్లీప్ లిటిల్ డార్లింగ్' అంటూ ఉండవు. 'జో

అచ్యుతానంద జోజో ముకుందా' అంటూ పిల్లవాడిని నిద్రపుచ్చుతాయి ఆ పాటలు. వాటి వల్ల ఉత్తమసంగీత జ్ఞానం ఊహ తెలియక ముందు నుంచే అలవడుతుంది. పిల్లవాడిని భగవంతుడి పేర్లతో పిలవటంవల్ల పిల్లవాడికి తనెంత ఉన్నతుడో, ఎంత అపురూపమో అర్థమవుతుంది. పాశ్చాత్యుల మానసికశాస్త్రసిద్ధాంతాలు కూడా ఈ విషయాన్ని సమర్థిస్తాయి.

ప్రతి వ్యక్తిలో మూడు రకాల శక్తుల నడుమ సంఘర్షణ ఆ వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తాయని అనేకపరిశోధనల తరువాత శాస్త్రవేత్తలు కనుక్కున్నారు. ఆ మూడు శక్తులనూ పేరెంట్ (తల్లిదండ్రుల ఆజ్ఞలు), చైల్డ్ (బాలుడు), అడల్ట్ (విచక్షణ) అని వర్గీకరించారు. ఇందులో 'పేరెంట్' అనేది పిల్లవాడు జన్మించినప్పటి నుంచి ఒకటో సంవత్సరం వయసు వచ్చేవరకు అతడి మెదడులో జరిగిన రికార్డింగ్ అన్న మాట. ఇందులో తల్లిదండ్రులు నేర్పిన అంశాలు, అదుపాజ్ఞలు, నీతులు, నియమాలు అన్నీ నిక్షిప్తమై ఉంటాయి. ఒకటి నుంచి అయిదు సంవత్సరాల వయసు వచ్చేవరకు 'చైల్డ్' రికార్డింగ్‌లు జరుగుతాయి. దీంట్లో పిల్లవాడు స్వయంగా నేర్చున్న అంశాలుంటాయి. తల్లిదండ్రులు నేర్పిన అంశాలను నిత్యజీవితానుభవాలతో పోల్చి నిగ్గు తేల్చుకోవటం ఉంటుంది. పిల్లవాడి భయాలు, అపోహలు, ఆందోళనలు అన్నీ రికార్డయి ఉంటాయి. చిన్నప్పుడు పిల్లల దగ్గర నుంచి వాళ్ళ ఆటవస్తువులు లాక్కుంటాం. కాస్త ఏడ్పించి ఇచ్చేస్తాం. అది మనకు ఆట. కానీ పిల్లవాడికి అది నిజం. ఎవరో తన వస్తువు లాక్కుంటున్నారన్న భయం అతడికి కలుగుతుంది అంటారు శాస్త్రవేత్తలు. అయితే ఎదుగుతున్న కొద్దీ అతడికి జ్ఞానం వస్తుంది. తనలోని అపోహలను విశ్లేషించే విచక్షణ వస్తుంది. దీన్ని 'అడల్ట్' అంటారు. ఒక వ్యక్తి ఒక అనుభవానికి స్పందించటం ఈ పేరెంట్, అడల్ట్, చైల్డ్‌ల నడుమ జరిగే సంఘర్షణను బట్టి ఉంటుంది.

ఉదాహరణకు ఓ అబ్బాయి కాలేజీలో చేరాడు. అతడి మిత్రులంతా కలసి సినిమాకు వెళ్ళాలని పథకం వేశారు. అయితే క్లాసులు ఎగ్గొట్టి, పెద్దల అనుమతి లేకుండా సినిమా చూడటం తప్పు అని తల్లిదండ్రులు నేర్పారు ఆ పిల్లవాడికి. కానీ సినిమా చూసినంత మాత్రాన ఏమీ కాదని మిత్రులు ప్రోత్సహిస్తూంటారు. ఎందరో సినిమాలు చూస్తున్నారు. అందరూ పాడైపోతున్నారా? అని వాదిస్తారు. ఇటువంటి పరిస్థితిలో పిల్లవాడు విచక్షణను ఉపయోగించి నిర్ణయం తీసుకోవాలి. 'సినిమాకు వెళ్ళకపోవటం' అంటే పేరెంట్ గెలిచినట్టు. 'వాళ్ళొద్దంటే మానెయ్యాలా?' అనో 'వెళ్ళకపోతే మిత్రులు హేళన చేస్తా'రనో సినిమాకు వెళ్తే 'చైల్డ్' గెలిచినట్టు. అలా కాక 'ఇప్పుడు ఆ సినిమా చూడాల్సిన అవసరం

అంతగా లేదు. సినిమా కన్న క్లాసు ప్రాముఖ్యం అధికం' అని విశ్లేషించి నిర్ణయం తీసుకున్నా, 'క్లాసులో చెప్పేది చదువుకోవచ్చు, నష్టం కూడదీసుకోగలిగిందే కాబట్టి ఇప్పుడు సినిమా చూసినంత మాత్రాన పెద్దగా నష్టం లేదు' అని తర్కించి నిర్ణయం తీసుకున్నా, 'అడల్ట్' పని చేస్తున్నట్టు. ఇలా మానవమనస్తత్వం పని తీరును ఆధునిక మానసికశాస్త్రవేత్తలు వివరిస్తారు. అంటే, ఊహ తెలియని దశ నుంచీ ప్రతీదీ పిల్లవాడిపై ప్రభావం చూపిస్తాయన్నమాట.

అటువంటప్పుడు ఉయ్యాలలో నిద్రిస్తున్న పిల్లవాడి కోసం పాడే పాటల ప్రభావం అతడిపై చూపటంలో ఆశ్చర్యం ఉందా! అది అబద్ధం అవుతుందా?

పాకే వయసు రాగానే 'చేత వెన్న ముద్ద, చెంగల్వ పూదండ' అంటూ నేర్పేవి పనికి రాకుండా పోతాయా? ఆ తరువాత చెప్పే పురాణకథలు, ప్రభావరహితం అవుతాయా?

బాల్యంలో కృష్ణుడి అల్లరి చేష్టలు పిల్లవాడి ఊహాప్రపంచానికి రెక్కలనిస్తాయి. తానూ కృష్ణుడిలా సాహసకార్యాలు, అవీ లోకకల్యాణకారకాలైన సాహసకార్యాలు చేయాలన్న తపన పిల్లవాడిలో కలుగుతుంది. ఆ వెంటనే చెప్పే ధ్రువుడి కథ, అష్టావక్రుడి కథ, సత్యహరిశ్చంద్రుడు, హనుమంతుడు, రాముడు, లవకుశుల కథలు పిల్లలకు స్ఫూర్తినిస్తాయి. ముఖ్యంగా హనుమంతుడి కథలు, సాహసాలు సూపర్ మేన్, బ్యాట్ మేన్ లను మరపిస్తాయి. వాటి కన్నా ఆరోగ్యకరమైన వినోదాన్నిచ్చి, ఉన్నతమైన ఆదర్శాన్ని నిలుపుతాయి. పిల్లలను అమితంగా ఆకర్షించే అనేకాంశాలు హనుమంతుడి కథల్లో ఉన్నాయి.

అంటే నీతులు చెప్పకుండా, ఉపన్యాసాలివ్వకుండా కేవలం కథలు చెప్పటం ద్వారా పిల్లల వ్యక్తిత్వవికాసానికి బీజాలు వేసే వ్యవస్థ అన్నమాట మనది. ఇళ్ళల్లో తల్లికి సమయం లేకపోతే, తాతయ్యానో, నాయనమ్మనో, బాబాయిలో, అత్తయ్యలో, ఎవరో ఒకరు సాయంత్రం కాగానే పిల్లలను పోగేసి కథలు చెప్పేవారు. పురాణకథలతో పాటు జానపదకథలూ వినిపించేవారు. చారిత్రకగాథలు చెప్పేవారు ఆయా కథలు పిల్లలను ఎంతగా ఆకట్టుకునేవంటే మళ్ళీ సాయంత్రం కోసం పిల్లలు ఎదురుచూసేవారు.

నెమ్మదిగా ఈ కథలు దేశభక్తుల కథలుగా రూపాంతరం చెందేవి. రాణా ప్రతాప్ త్యాగం, శివాజీ సాహసం, భగత్‌సింగ్ బలిదానం, ఝాన్సీలక్ష్మి వీరత్వం..... ఇలా ఆరంభం నుంచీ పిల్లల ముందు ఉత్తమాలోచనలు, ఉత్తమాదర్శాలు నిలపటం జరిగేది.

పిల్లలు పాఠశాలలకు వెళ్ళి కొత్త ప్రపంచద్వారాలు తెరుచుకునేసరికి, ఆ ప్రపంచపు తాకిడిని తట్టుకుని విచక్షణతో నిర్ణయాలు తీసుకునే విజ్ఞానం వారికి అందేది. దాంతో ప్రలోభాలను తట్టుకుని సరైన మార్గం ఎంచుకోగలుగుతాడు పిల్లవాడు.

ఇక ప్రపంచరీతిని, మానవసమాజమనస్తత్వాన్ని శతకాలు వివరించేవి. పంచతంత్ర కథలు మానవమనస్తత్వాన్ని సులువుగా బోధించేవి. ఈ రకంగా ఇంట్లో వాతావరణం పిల్లవాడి వ్యక్తిత్వం సరైన దిశలో ప్రయాణించేందుకు తనవంతు బాధ్యతను నిర్వహించేవి.

కృష్ణుడిలా అల్లరి చేయాలని, రాముడిలా పితృవాక్యపరిపాలన చేస్తూ ధర్మం నిలపాలని, హనుమంతుడిలా లంకకు లంఘించి రాక్షసుల మదమణచాలని, అర్జునుడిలా వీరుడవ్వాలని, పరశురాముడిలా దుష్టశిక్షణ చేయాలని, ధ్రువుడిలా దీక్షను ప్రదర్శించాలని, ఇలాంటి ఉత్తములను ఆదర్శంగా తీసుకొని ఎదుగుతాడు పిల్లవాడు. ఉత్తమ ఆలోచనలు అతడికి మార్గదర్శనం చేస్తాయి. ఇందుకు సాహిత్యం కూడా తనవంతు తోడ్పడేది.

ప్రాచీనసాహిత్యం ఉత్తముల జీవితాలను మాత్రమే ప్రతిబింబించేది. ఉత్తమ ప్రవర్తనను ఆదర్శంగా నిలిపేది. కథానాయకుడనగానే, అందరిలోకీ ఉత్తముడు అన్న భావన కలిగేది. సహనం, శాంతి, నియమం, గౌరవం, విచక్షణ కథానాయకుడికి తప్పనిసరి లక్షణాలుగా ఉండేవి. సాధారణంగా ప్రతి పిల్లవాడూ కథానాయకుడవ్వాలని కోరుకుంటాడు. కథానాయకుడి లక్షణాలను అనుకరిస్తాడు. అందుకనే మన సాహిత్యంలో ఆరంభం నుంచీ ఉత్తముల జీవితాలనే తప్పనిసరిగా ప్రదర్శించాలని, ఉత్తమ ప్రవర్తనను ఆదర్శంగా నిలపాలని సాహిత్యకారులు స్వచ్ఛందంగా తమపై ఆంక్షలు విధించుకున్నారు.

అనేక పరిశోధనల తరువాత శాస్త్రవేత్తలు కూడా ఇప్పుడీ సత్యాన్ని సమర్థిస్తున్నారు. యూరోపియన్ దేశాలలో పిల్లలకు ఒక వయసువచ్చేవరకూ తల్లిదండ్రులు వాళ్లకు కథలు చదివి వినిపించాలన్న నియమం ఉంది. ఆ కథలు కూడా రాజకుమారుల సాహసగాథలు, జానపదకథలు అయి ఉండాలంటారు. అలాగే ఇప్పుడు వ్యక్తిత్వవికాసం బోధిస్తున్న అనేకులు కూడా వ్యక్తి ఉత్తముల జీవితగాథలు చదవాలని, విజేతల జీవితచరిత్రలు చదవాలని అంటారు.

కవికోకిల వాల్మీకి రామచరితం రాయటంతో ఈ పరంపరకు శ్రీకారం చుట్టాడు. వేదవ్యాసుడు పురాణాలను క్రోడీకరించి ఆ పరంపరను కొనసాగించాడు. దేశమంతా ప్రతిభాషలోనూ, ప్రతి ప్రాంతంలోనూ భారత, రామాయణాలు అందరికీ అర్థమయ్యే రీతిలో అందించి ఆయా ప్రాంతాల సాహిత్యకారులు తమ సామాజికబాధ్యతను

నెరవేర్చారు. ఆపై పురాణపురుషుల కథలకు తమ సృజనాత్మకత జోడించి సాహిత్యం సృష్టించారు. ఈ సాహిత్యంలో కూడా ఉత్తమప్రవర్తన, ఉత్తమాదర్శం ప్రజలకందించాలన్న ఆదర్శాన్ని నిలిపారు. కథానుసారంగా దుష్టపాత్రలను వర్ణించినా, ఆ పాత్రలను ఆకర్షణీయంగా మలచలేదు. ప్రజల ద్వేషపాత్రులుగా వర్ణించారు. దాంతో కథ విన్నవాడికి, చదివినవాడికి కథానాయకుడిని ఆదర్శంగా తీసుకోవాలన్న ఆలోచన తప్ప మరొక అవకాశం లేకుండా జాగ్రత్త పడ్డారు. నాటకాలు, రూపకాలు, గానాలు సర్వం ఈ ఆలోచన కేంద్రంగానే ఎదిగాయి. అంటే బాల్యంలో ఏదైతే 'జో అచ్యుతానంద' అంటూ ఉయ్యాల్లో పిల్లవాడిని గోవిందుడికి ప్రతిరూపంగా భావిస్తూ జోకొట్టేవారో, గోవిందుడి లీలలను వివరిస్తూ ఉత్తమాదర్శాన్ని నేర్పేవారో, మరింత వివరంగా సాహిత్యం బోధించే దన్నమాట. ఇక పాఠశాలల్లో చిన్నప్పటి నుంచీ 'మంచి వినాలి, మంచి చేయాలి. మంచి పనులు చేస్తూ నూరేళ్ళు బ్రతకాలి' అన్న బోధనలతో పాఠం ఆరంభమయ్యేది. దాంతో ఎటు చూసినా అన్ని వైపుల నుంచీ ఉన్నతమైన ఆలోచనలు వ్యక్తికి అందేవి. అందువల్ల ఆ కాలం వారికి వ్యక్తిత్వవికాసం అంటూ ప్రత్యేక తరగతుల అవసరం ఉండేది కాదు. కానీ ఇప్పుడు పరిస్థితి మారటం వల్ల 'పాల' రుచి మారింది. దోషం మనలో ఉంది తప్ప పాలది కాదు.

## ఉత్తమాదర్శానికి పద్ధతులు

ఓ గ్రామంలోని ప్రజలు రోజంతా ఉపవాసం ఉన్నారు. రాత్రంతా భజన చేస్తూ గడిపారు. తెల్లారి నది కావల ఉన్న మందిరానికి బయలుదేరారు. భగవద్దర్శనం తరువాత వారు ఉపవాసం వదిలేస్తారు. నది దాటే ముందు ఒడ్డున ఓ సాధువు కనిపించాడు. సాధువుకు నమస్కారం చేసి ఆయనకు పళ్లు సమర్పించారు. వారి ముందే సాధువు ఆ పళ్ళను ఆరగించాడు. వారిని ఆశీర్వదించాడు – ఇంతలో ఆకాశం మేఘావృతమైంది. గాలులు వీచసాగాయి. చినుకులు పడటం మొదలైంది. ఉపవాసమున్న వారంతా ఆందోళన చెందసాగారు. నది దాటి వెళ్ళి భగవంతుడిని అర్చించందే వారు ఉపవాసదీక్ష వదిలేందుకు వీలు లేదు. క్షణక్షణానికీ గాలులు తీవ్రతరం అవటంతో వారి ఆందోళన పెరగసాగింది. ఏదో ఓ రకంగా నదిని దాటించమని పడవవాడిని బతిమలాడసాగారు. 'మీ పూజలో ఏదో లోపం ఉండి ఉంటుంది. అందుకే ఇలా వర్షం వస్తోంది. వెళ్ళి ఆ సాధువును కూడా మీతో రమ్మనండి. ఆయన వస్తేనే పడవను నడుపుతాను' అన్నాడు పడవవాడు. భక్తులకు కోపం వచ్చింది. 'నిన్న పొద్దుటి నుంచీ ఏమీ తినకుండా ఉన్నది తాము. తమ ముందే అన్నీ ఆరగించాడు సాధువు. అతడిని తమ కన్నా గొప్ప అంటున్నాడు'

అనుకున్నారు. కానీ చేసేదేమీ లేక సాధువును రమ్మన్నారు. ఆయన పడవలో కాలు పెట్టటంతోటే వాతావరణం మారిపోయింది. నది దాటి దర్శనం చేసుకుని తిరిగివస్తూ వారు ఇదే విషయాన్ని పడవవాడిని అడిగారు. 'మీరు ఉపవాసం భగవద్ధ్యానంతో చేయటం లేదు. సమయమైపోగానే తినేందుకు ఎదురుచూస్తూ చేశారు. అంటే మీరు చేసింది ఉపవాసం కాదు, తినటం కోసం ఎదురుచూస్తూ గడిపారు. అదే సాధువు ఉపవాసం ఉన్నట్టు నటించడు. తనకు అర్పించింది అవసరమైనంతే తింటాడు. మిగతాది పంచి పెడతాడు. ఆయన దృష్టి భగవంతుడి మీద తప్ప తిండి మీద లేదు' అని వివరించాడు పడవ నడిపే వ్యక్తి.

ఉత్తమ ఆదర్శానికీ, ఉత్తుత్తి ఆదర్శానికీ నడుమ ఉండే తేడాను ఈ కథ స్పష్టం చేస్తుంది. అందుకే వ్యక్తికి ఉత్తమ ఆదర్శాన్ని బాల్యం నుంచే పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకునే మనం బాల్యం నుంచీ ఉత్తమ వ్యక్తుల జీవితాల గురించి పిల్లలకు కథలు చెప్తాం. ఉత్తమ ఆదర్శాన్ని వారి ముందు ఉంచుతాం. ఐతే, ఆధునిక అభ్యుదయ భావాల తుఫాను ఈ పరిస్థితిని మార్చింది. పిల్లలకు బాల్యం నుండీ అందే ఆదర్శాల స్వరూపం మారింది. ప్రాచీన సాహిత్యంలోని కథలకు వర్గవర్ణాల రంగులు పులిమారు. కథలలో ప్రతీకాత్మకంగా అందించిన ఆదర్శాన్ని అర్థం చేసుకోలేక, పాత అన్న ప్రతీదాన్నీ విమర్శించి పక్కకు నెట్టేయటం ప్రారంభించారు. భారతీయ ధర్మాన్ని, సంస్కృతిని, పద్ధతులను చులకన చేయటమే లక్ష్యంగా ఉన్న ప్రభుత్వం ఇటువంటివారికి సహాయసహకారాలు సంపూర్ణంగా అందించింది. తమ ఇంటికి తామే స్వయంగా నిప్పు అంటించుకొనేవారిని శత్రువు వారిస్తాడా?

దాంతో మనకు ప్రాచీనమన్నదంతా పనికి రానిదైపోయింది. ఉత్తమ ఆదర్శాలు విలువ లేనివయ్యాయి. సాహిత్యంలో ఎవరు ఏది పడితే అది రాయవచ్చన్న ఆలోచన వేళ్లూనుకోవటంతో దొంగలు, గూండాలు, అల్లరి చిల్లరి పోకిరీలు కథానాయకులయ్యారు. ఆదర్శం అయ్యారు. శాశ్వతవిలువలను మరచి రోజురోజుకీ రంగులు మారే మామూలు మనుషులు ఆదర్శమూర్తులుగా ఎదగటంతో సమాజానికి వ్యక్తిత్వవికాసం ప్రధాన సమస్యగా మారింది.

ఇక్కడ మనం సాహిత్యం విషయంలో ఓ విషయం గమనించాల్సి ఉంటుంది. అనేక సాహిత్యకారులకు ప్రాచీన ఆదర్శాలను విమర్శించటం ద్వారా తాము భవిష్యతరాలకు అన్యాయం చేస్తున్నామని తెలుసు. తెలిసి కూడా వారు తాత్కాలిక లాభాల కోసం శాశ్వతవిలువలను దెబ్బ తీయటాన్ని ఓ ఉద్యమంలా చేపట్టారు.

'మాయంటావూ?' అంటూ వేదాంతాన్ని వెక్కి రించిన శ్రీశ్రీ, అవసరమైతే 'మానవ జీవితమే ఒక మహాభారతం. అది మంచిచెడుల రెంటి నడుమ నిత్యఘర్షణం, నరులుండే ఇల సకలం కురుక్షేత్రమే' అన్నాడు. శ్రీశ్రీ అంత గొప్పగా భాషపై పట్టు సాధించటం వెనుక ఆయన చదివిన ప్రబంధాలు, ప్రాచీనగ్రంథాల పరిజ్ఞానం ఉంది. అందుకే 'అరిస్తే వాద్యం, స్మరిస్తే పద్యం, అనలవేదిక ముందు అస్త్రనైవేద్యం' అంటూ సాంప్రదాయిక వర్ణనలు అత్యద్భుతంగా చేయగలిగాడు. సంప్రదాయంపై ఆయన చేసిన తిరుగుబాటు విజయవంతమై తరువాత తరాలవారు ప్రాచీనసాహిత్యానికి దూరమవటంలో ప్రధానపాత్ర వహించింది. ఆ కాలంలో ఇలా తిరుగుబాటు బావుటా ఎగరేసి సమాజంలో పేరు సంపాదించినవారందరికీ ప్రాచీనసాహిత్యంతో సన్నిహిత పరిచయం ఉంది. అందుకే వారి సాహిత్యానికి అంత శక్తి వచ్చింది.

ఐతే, ఆ ప్రతిభావంతుల ప్రభావంతో ప్రాచీనసాహిత్యాన్ని వదలి, పాశ్చాత్యమే ప్రగతికి రాజబాట అనుకుని తరువాతి తరం రచయితలు ఎదిగారు. ఇందువల్ల వారిలో ప్రతిభకు లోపం లేకున్నా, భాషపై పట్టు కొరవడింది. భావగాంభీర్యం లేకుండా అయిపోయింది. ఉత్తమవర్ణనలు, ఉదాత్తభావనలు అడుగంటాయి. ప్రేమికులు 'బురదలో వానపాముల్లా ఉందాం' అని అనుకోవటం ఉత్తమభావవ్యక్తీకరణగా మారింది. ఈ రకంగా సాహిత్యంలో ఉత్తమ ఆదర్శం ఒకోమెట్టే దిగుతూ వచ్చింది. ఇది సమాజంపై ప్రభావం చూపింది. అందుకే అన్ని రంగాలలో ఉత్తమ ఆదర్శం, ఉన్నతాశయాలు అన్నవి అదృశ్యమై పోతున్నాయి. ఆ ఉత్తమ ఆదర్శస్థానాన్ని తాత్కాలికావేశాలు ఆక్రమిస్తున్నాయి. ఒక ఆదర్శం గాని, శాశ్వతవిలువలతో పరిచయం గాని లేని సమాజం గాలి ఎటు వీస్తే అటు కొట్టుకుపోతోంది.

ఈ రకంగా దిశ కోల్పోతున్న సమాజాన్ని తప్పు దారి పట్టించటం మరింత సులభమైంది. ప్రజల మధ్య, వర్గ, వర్ణ, భావాలను రెచ్చగొట్టి విద్వేషాలను వెదజల్లటం సులువైంది. పరమోత్కృష్టమైన ఆలోచనలతో పరిచయం లేనివారు తాత్కాలికలాభాల ప్రలోభంలో పడి తమకే కాక తమ రాబోయే తరాలవారికీ తీరని అన్యాయం చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో భారతీయజీవనవిధానాన్ని అర్థం చేసుకొని, ఆ జీవన విధానంలో అంతస్సూత్రంగా పొందుపరచి ఉన్న వ్యక్తిత్వవికాససూత్రాలను ఆచరించటం అత్యంత ఆవశ్యకం.

పిల్లవాడికి ఆరంభం నుంచీ దైవత్వభావన పట్ల విశ్వాసం కలిగించాలి. తన శరీరం ఒక దేవాలయం అనీ, శరీరం అణువణువునా రకరకాల దేవతలు నివసిస్తున్నారన్న

భావనను కలిగించాలి. తాను విశ్వసృష్టికారుడి నుండి విడదీయరాని అద్వైతభావాన్ననీ, తన ప్రతి చర్యా రాబోయే అనేకతరాల భవిష్యత్తుపై ప్రభావం చూపిస్తుందన్న విచక్షణను కలిగిస్తే, ప్రతి చిన్న విషయానికీ ఆవేశానికి లోనవటం ఉండదు. తన జీవితం అతిపవిత్రం, అమూల్యం అన్న ఆలోచన ఉన్న వ్యక్తి, అనవసర విషయాలకు ప్రాముఖ్యాన్నివ్వడు. తాత్కాలికప్రలోభాలు, ఆకర్షణల వెంట పడడు. అతడి దృష్టి శాశ్వత ప్రయోజనాలపై ఉంటుంది. ఉన్నతాలోచనల తరువాత పిల్లవాడికి అందజేయవలసింది క్రమశిక్షణ, యోగ ద్వారా మనస్సుపై నియంత్రణ, శారీరక స్వస్థత సాధించేట్టు చేయాలి. ఉత్తమ ప్రవర్తన, పరిచయం చేయాలి. ఆపై పిల్లవాడి ముందు ఉత్తమాదర్శాన్ని ఉంచాలి.

భారతీయజీవన విధానంలో బలవంతంగా ఏ పనీ చేయించటం కనబడదు. గురువు శిష్యుడికి నిర్బంధంగా బోధించటం కనబడదు. శిష్యుడి ప్రశ్నకు గురువు సమాధానం ఇస్తాడు. దాన్ని అర్థం చేసుకుని మళ్ళీ సందేహం నివృత్తి చేసుకోవటం శిష్యుడి బాధ్యత. అలాగే, ఒక వ్యక్తి ఒకే దేవుడిని పూజించాలన్న నిర్బంధం భారతీయధర్మంలో లేదు. ఎవరి సంస్కారాన్ని బట్టి, ఎవరి ఇష్టాన్ని బట్టి వారు మనసుకు నచ్చిన దేవీదేవతలను పూజించవచ్చు. అందుకే 'కొందరి దేవుడు రాళ్ళల్లో ఉంటే ఇంకొందరి దేవుడు నీళ్ళలో ఉంటాడు. కొందరి దేవుడు కట్టెలో ఉంటే, మరి కొందరి దేవుడు మట్టిలో ఉంటాడు. ఇంకా కొందరి దేవుడు అన్నంలో ఉంటే, ఇంకొందరి దేవుడు శూన్యంలో ఉంటాడు. తరచి చూస్తే సృష్టిలోని అణువణువునా దేవుడుంటాడు' అంటుంది శాస్త్రం. అందుకే పిల్లలకు ఇవ్వవలసిన సంస్కారాలు, ఉన్నతాలోచనలు ఇచ్చిన తరువాత వారికి ఉత్తమాదర్శాన్ని పరిచయం చేసిన తరువాత తనకు నచ్చిన ఆదర్శాన్ని, లక్ష్యాన్ని ఎంచుకునే బాధ్యత పిల్లవాడి విచక్షణకే వదిలేయాల్సి ఉంటుంది. ఇంత వరకూ మనం చర్చించింది ఒక ఆదర్శపరిస్థితిని. కానీ ప్రస్తుతం సమాజంలో ఇటువంటి ఆదర్శ పరిస్థితులు లేవు. ఉన్నతమైన ఆలోచనలు, ఉత్తమాదర్శాలు అంత సులువుగా లభ్యమయ్యే పరిస్థితి లేదు. ఆరంభం నుంచీ అయోమయపరిస్థితులలో ఎదగాల్సి వస్తోంది పిల్లవాడు.

చదువులు, పరీక్షలు, ఉద్యోగాల వేటలు, ప్రేమలు, డబ్బు సంపాదన – ఇవి జీవితంలో ప్రధానాంశాలయ్యాయి. ఇటువంటి పరిస్థితులలో, భారతీయ సంస్కారాలు, సాహిత్యం, జీవనపద్ధతులు ఏ రకంగా వ్యక్తిత్వవికాసానికి తోడ్పడతాయో చర్చించాల్సి ఉంటుంది. ప్రాచీనపద్ధతులను ఆధునికపరిస్థితుల కనుగుణంగా అన్వయించుకోవాల్సి ఉంటుంది.

ఇద్దరు మిత్రులు గంగానదికి స్నానానికి వెళ్ళారు. వారిలో ఒకడు ప్రతి విషయాన్నీ భౌతికదృష్టితో చూస్తాడు. మరో మిత్రుడు మనసుతో భావిస్తాడు. అన్నిటినీ భౌతికదృష్టితో చూసే మిత్రుడు ఎగతాళి ఆరంభించాడు. 'గంగానదిని ఎంతో పవిత్రం అంటారు. ఇది కేవలం మంచు కరగటం వల్ల ఏర్పడిన నది. ప్రవహించే నీరు మాత్రమే. నీరు హైడ్రోజన్, ఆక్సిజన్ అణువుల కలయిక వల్ల ఏర్పడుతుంది. ఇదేమీ దైవం కాదు. పాపాలను ఏమీ కడిగేయదు' అంటూ వాదించాడు. 'గంగానది విష్ణువు పాదం నుంచి జన్మించింది. అతిపవిత్రమైనది. మాత లాంటిది. సకలపాపనాశిని గంగామాత' అన్నాడు ఇంకో మిత్రుడు. కాస్సేపు ఇలా వాదించుకుని ఇద్దరు మిత్రులూ గంగానదిలో స్నానం చేశారు. ఒక మిత్రుడు 'ఇది కేవలం నీరు మాత్రమే' అనుకుంటూ స్నానం చేస్తే, మరో మిత్రుడు 'ఇది పవిత్రనదిధార. ఈ స్నానం వల్ల నా శరీరం, మనస్సు శుభ్రపడతాయి' అని భావిస్తూ స్నానం చేశాడు. ఇద్దరి శరీరాలూ శుభ్రమయ్యాయి. కానీ ఒకరి మనస్సు కూడా శుభ్రమైంది.

ఆధునికసమాజంలో ప్రతి వ్యక్తి పరిస్థితీ ఈ ఇద్దరు మిత్రుల మధ్య సంఘర్షణ వంటిది. ఒక వంక భౌతికవాదం శక్తిమంతంగా వినిపిస్తూంటుంది. మరో వంక వ్యక్తిలోని ఆధ్యాత్మికత అతడిని మరో వైపు లాగుతూంటుంది. ఇటువంటి సమయంలో, సందిగ్ధ పరిస్థితులలో భారతీయజీవనవిధానం నుండి మార్గదర్శనం లభిస్తుంది. ఈ మార్గదర్శనం ఎలా లభిస్తుందో చర్చించే కన్నా ముందు ఆధునిక వ్యక్తిత్వవికాసపద్ధతులను టూకీగా పరామర్శించాల్సి ఉంటుంది.

ఆధునికవ్యక్తిత్వవికాసం గంగానది హైడ్రోజన్, ఆక్సిజన్ అణువుల కలయిక మాత్రమే అనే వ్యక్తి వంటిది. కార్లలో తిరగటం, ఖరీదైన కాన్వెంట్లలో చదవటం, విమానాల్లో ప్రయాణాలు చేయటం, గొప్ప ఉద్యోగాలు సంపాదించటం, ఎదుటివాడిని ప్రభావితం చేయగలగటం, అధికారం చేయటం వంటివన్నీ వ్యక్తిత్వవికాసం కిందికే వస్తాయి. ఒక పది వ్యక్తిత్వవికాసపుస్తకాలు పరిశీలించి, వాటిలో వారు విజయవంతులుగా ఉదాహరించినవారి పేర్లు కొన్ని పరిశీలిస్తే, వారిలో కంపెనీల అధినేతలు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు కనిపిస్తారు. వీరిని ఉదాహరిస్తూ, విజయం సాధించాలనుకునే వారికి ఏదో సాధించాలన్న తపన, ధైర్యం, కొత్త కోణంలో చూసే సృజనాత్మకత, సంకల్పం ఉండాలని తేలుస్తారు. ఈ విజయం సాధించేందుకు వ్యక్తి తన శక్తిసామర్థ్యాలను గుర్తించాలి, బలహీనతల నుంచి బయటపడాలి, నెగెటివ్ ఆలోచనలను అణచివేసి బలవంతాన పాజిటివ్ ఆలోచనలను చేయాలి అని ఈ పుస్తకాలన్నీ ముక్తకంఠంతో

ఘోషిస్తాయి. కొన్ని పుస్తకాలలో పొద్దున్నే లేవగానే వార్తాపత్రికలు చూడవద్దని సలహా ఉంటుంది. ఎందుకంటే, వార్తాపత్రికల్లో హత్యలు, చావులు ఉంటాయి, అవి పొద్దున్నే 'మూడ్' పాడు చేస్తాయి. ఇలా మనసుని ఆనందంగా ఉంచుకునే టెక్నిక్కులుంటాయి. దాదాపుగా అన్ని పుస్తకాలూ బోధించేవి ఇవే విషయాలు. మేనేజ్‌మెంట్ టెక్నిక్కులు, ప్రేరణ తరగతులు తీసుకునేవారూ అటూ ఇటూ తిప్పి ఇవే బోధిస్తారు. అయితే ఇవన్నీ మనకు భారతీయధర్మంలో, సాహిత్యంలో అడుగడుగునా కనిపిస్తూనే ఉంటాయి.

## ఆదర్శం - సాహిత్యం

*ఎఱుక గల వారి చరితలు*
*గఱచుచు సజ్జనుల గోష్ఠి గదలక ధర్మం*
*బెఱుగుచు నెఱిగిన దానిని*
*మఱవ కనుష్ఠించునది సమంజసబుద్ధీ.*

మహాభారతంలో నన్నయ రచించిన ఈ పద్యం వ్యక్తిత్వ వికాసానికి పునాది వేస్తుంది. 'ఎఱుక' అంటే జ్ఞానం. 'ఎఱుక గలవారి చరితలు' అంటే జ్ఞానుల జీవిత చరిత్రలు అని అర్థం. జ్ఞానుల జీవితచరిత్రలు తెలుసుకోవటం, మంచివారి మాటలు వినటం, చర్చలలో పాల్గొనటం, ఇలా తెలుసుకున్నదాన్ని, నేర్చుకున్నదాన్ని తప్పనిసరిగా పాటించటం ఉత్తమవ్యక్తిత్వసాధనకు రాజమార్గం అన్న సత్యాన్ని నన్నయ ఈ పద్యంలో పొందుపరచాడు.

క్షరం లేనిది అక్షరం. అంటే అక్షరానికి నాశనం లేదు. ఎలాగైతే నీటిలోకి విసిరిన రాయి ఎంత చిన్నదైనా అలలు రేపుతుందో, అలాగే మనం చదివిన ప్రతి అక్షరం మన ఆలోచనలపై ప్రభావం చూపిస్తుంది. చదివిన వెంటనే ప్రభావం కనబడకపోవచ్చు. కానీ వ్యక్తి అచేతనలో నిద్రాణస్థితిలో ఉన్న ఆ భావం ఏదో ఓ సమయంలో వ్యక్తి ఆలోచనను ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఉన్నతమైన ఆలోచనలున్న పుస్తకాలు చదవటం మంచిది. ఉన్నతుల జీవితాలను మించి ఉన్నతమైన ఆలోచనలు ఇంకెక్కడ దొరుకుతాయి? అందుకే వ్యక్తిత్వవికాసంలో మొదటి అంశం జ్ఞానుల జీవితచరిత్రలు చదవటం. ఒక రకంగా చూస్తే భారతీయసాహిత్యంలో ఆదికావ్యం కూడా సమాజానికి ఉత్తమవ్యక్తిత్వాన్ని ఆదర్శంగా అందించే ఉద్దేశ్యంతో రచించటం జరిగిందనిపిస్తుంది. రామాయణరచన ద్వారా వాల్మీకి అత్యుత్తమవ్యక్తిత్వాన్ని సమాజానికి అందించాడు.

రామాయణం ఆరంభంలోనే వాల్మీకి నారదుడిని కొన్ని ప్రశ్నలు అడుగుతాడు. 'ప్రపంచంలో అత్యంతగుణవంతుడెవరు? వీరుడెవరు? ధర్మతత్పరుడెవరు? సత్య

వాక్పరిపాలకుడు, దృఢ వ్రతుడు, సర్వజనుల హితాన్ని కాంక్షించేవాడు, విద్వాంసుడు, సమర్థుడు, విజ్ఞానవంతుడు, కోపాన్ని జయించినవాడు, శక్తిమంతుడు, భయరహితుడు, దయాళువు అయినవాడు ఎవరు?' అని అడుగుతాడు. సమాధానంగా నారదుడు రామాయణగాథను వాల్మీకికి చెప్తాడు. అప్పుడు వాల్మీకి ఆ పురుషోత్తముడి జీవిత చరిత్రను రచించి ప్రపంచానికి అర్పించాడు.

'రఘువంశ' రచన ఉద్దేశ్యం ప్రథమసర్గలోనే కాళిదాసు స్పష్టం చేస్తాడు. జన్మించినప్పటి నుంచీ విజయం సాధించే వరకూ విశ్రమించనివారు, అడిగినవారికి లేదనకుండా దానమిచ్చే వారు, ధర్మాచరణకు ప్రాధాన్యం ఇచ్చేవారు, న్యాయమూర్తులు, సమయాసమయాల విచక్షణ కలవారు, ప్రజలకు పంచేందుకే ధనార్జన చేసేవారు, వాక్శుద్ధి కలవారు, అసత్యం ఆడనివారు, బాల్యంలో అన్ని కళలూ నేర్చుకుని, యౌవనంలో జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించి, వార్థక్యంలో సన్న్యాసాశ్రమం స్వీకరించి, సమయం రాగానే సంతోషంగా దేహాన్ని త్యాగం చేసి నటువంటి రఘువంశ రాజుల కథను ప్రపంచానికి అందిస్తున్నానని కాళిదాసు వివరిస్తాడు.

*తం సన్తః శ్రోతు మర్హన్తి సదస ద్ధచ్ఛక్తి హేతవః*
*హేమ్నః స లక్ష్య తేహ్యగ్నౌ విశుద్ధిః శ్యామికాపివా॥*

తాను వినిపించే ఈ కథను మంచి చెడు విచారించే విచక్షణ, ఉన్నవారు విని నిప్పులో కాల్చి బంగారం నిగ్గును తేల్చినట్టు, తన కథలో నిగ్గును తేల్చాలని కోరతాడు. అంటే, రచనలో కవి ప్రధానోద్దేశ్యం, తాను గొప్ప పేరు సంపాదించటం, తన కళను ప్రదర్శించటం కన్నా, సమాజం ముందు ఉత్తమాదర్శం నిలపటమేనన్నమాట.

అందుకే మన ప్రాచీనసాహిత్యమంతా ఉత్తమవ్యక్తిత్వాల పరిచయంతో, ఉన్నత విలువలతో నిండిఉంటుంది. చదివేవారికి భాషలో ప్రయోగాలు, భావగాంభీర్యంతో ఆనందం కలిగించటమే కాదు, ఉత్తమాలోచనలందిస్తూ వ్యక్తిత్వవికాసానికి రాచబాటను నిర్మిస్తుంది మన సాహిత్యం. అయితే ఈ చెవిన విని ఆ చెవిన వదిలేయటం, ఈ కంటితో చదివి, ఆ పంటితో పారేయటం చేయకూడదు. చదివినదాన్ని మరవక ఆచరించాలి. అదే సమంజసబుద్ధి. అతడే ఉత్తమవ్యక్తిలా ఎదుగుతాడు.

ఏకం సత్ విప్రా బహుధా వదంతి

ఒకే సత్యాన్ని పలువురు పలు రకాలుగా వివరిస్తారంటుంది శాస్త్రం. ఆధునిక వ్యక్తిత్వవికాస డాక్టర్లు బోలెడన్ని డబ్బులు వసూలు చేసి నేర్పించే టెక్నిక్కులు మన

పూర్వీకులు ఎంతో సులువుగా, స్వచ్ఛందంగా ప్రజలకు అందించారు. ఒక అద్భుతమైన కథను అమోఘమైన రీతిలో చెప్తూ, కథ నడుమ మరపురాని రీతిలో మనోజ్ఞమైన వ్యక్తిత్వ వికాససూత్రాలను పొందుపరచారు. మణుల్లాంటి సత్యాలను ఆసక్తికరమైన కథ అనే సూత్రంతో అల్లి, మణుల హారం తయారుచేసి అందించారు.

ఆధునిక వ్యక్తిత్వవికాసపుస్తకాల్లో రామోజీ రావు, డాక్టర్ అంజిరెడ్డి, రామలింగరాజు, రోనాల్డ్ రీగన్, జాన్ ఫోర్డ్, బిల్ గేట్స్, వగైరా వగైరాల జీవితా లను విజయానికి ఆదర్శంలా పరిచయం చేయటం; ఇంకా మైకెల్ జాక్సన్, ఎడ్డీ మర్ఫీ వంటి కళాకారులను సైతం విజయానికి ప్రతీకలుగా పరిచయం చేయటం జరుగుతుంది. వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోమని బోధిస్తారు. వీరంతా ఒక రంగంలో ప్రావీణ్యం ప్రదర్శించి డబ్బు, పేరు గడించినవారు తప్ప 'ఎఱుక గలవారు' కారు. వీరి 'ఎఱుక' వేరు.

ఎందుకంటే, మనం ఆదర్శంగా తీసుకునే వ్యక్తిని ఆరాధిస్తాం. ఆ వ్యక్తిలో ఏదైనా లోపం కనిపిస్తే తల్లడిల్లిపోతాం. ఒక్క దెబ్బతో ఆదర్శం అభాసుపాలై, ఆలోచనలు అంధకారం అయిపోతాయి. మైకెల్‌జాక్సన్ అభిమానులంతా అతడిపై వచ్చిన ఆరోపణలకు తల్లడిల్లిపోయారు. మానసికాందోళనలకు గురయ్యారు. అనేకులు అతడి రికార్డులను బయట పారేశారు. టెండూల్కర్‌ను ఆదర్శం అనుకున్నవారు అతడు సరిగ్గా ఆడకపోతే, బహిరంగంగా అతడిని అవమానించారు. కాబట్టి ఇటువంటి ఆదర్శాల వల్ల లాభం కన్నా హాని ఎక్కువ కల్గుతుంది. మనం ఆదర్శం అనుకున్న వ్యక్తి ఉత్తమప్రవర్తన ప్రదర్శించకపోతే మన ప్రపంచం తల్లకిందులవుతుంది. ఇది గ్రహించిన మన పూర్వీకులు జ్ఞానుల చరిత్రల పఠనం వ్యక్తిత్వవికాసానికి మొదటి మెట్టు అన్నారు. కాబట్టి ఆధునికసమాజంలో వ్యక్తిత్వవికాసం కోరే వ్యక్తి మొదటి చేయవలసింది జ్ఞానుల చరిత్రలు చదవటం, చదివిన దాన్ని అర్థం చేసుకోవటం, అర్థం చేసుకున్నదాన్ని ఆచరించటం.

వ్యక్తి పరిమితులు :

*అనువు కాని చోట అధికుల మనరాదు*<br>
*కొంచె ముండు టెల్ల కొదువ గాదు*<br>
*కొండ అద్ద మందు కొంచెమై ఉండదా!*

వ్యక్తిత్వవికాసంలో సమయం, సందర్భం బట్టి సర్దుకుపోవటం ప్రధానపాత్ర వహిస్తుంది. 'అనువు కాని చోట అధికుల మనరాదు' అన్నది ఇందులో ప్రధానపాత్ర వహిస్తుంది. ఇది యువతీయువకులకే కాదు వ్యక్తి వయసుతో నిమిత్తం లేకుండా జీవితంలో ప్రతిక్షణం పనికి వచ్చే సూత్రం.

ఓ అబ్బాయి ఇంటర్వ్యూకి వెళ్లాడు. అంతకు ముందు రోజే సినిమాలో చూసిన దృశ్యాలు ఆ అబ్బాయి మెదడులో నిండి ఉన్నాయి. ప్రశ్నలు అడిగేవారిని అవమానిస్తాడు హీరో. 'మీరెవరు నన్ను ప్రశ్నలు అడగటానికి?' అని ఎదురు ప్రశ్న వేస్తాడు. చివరికి ఆ ఇంటర్వ్యూ చేసేవాళ్లందరికీ ఓ లెక్చరిస్తాడు. కాలరెగరేసి, చెదిరిన జుట్టు సవరించుకుని బయటకు వచ్చేస్తాడు. ఆ అబ్బాయి కూడా ఇంటర్వ్యూలో తలపొగరుగా ప్రవర్తించాడు. గొప్పగా ప్రవర్తించాననుకున్నాడు. ఉద్యోగం అతడికి రాలేదు. ఇక్కడ నష్టం ఎవరికి? అన్న ఆలోచన ఆ యువకుడికి వచ్చేసరికి చేతులు కాలేయి. పట్టుకునేందుకు ఆకులు కూడా లేవు.

తల్లిదండ్రులు పిల్లలను ఎంతో ప్రేమగా పెంచుతారు. పిల్లవాడు ఏ మాత్రం కష్టపడకూడదనుకుంటారు. వాడు అడిగినవన్నీ కొనిస్తారు. కానీ 'కొంచె ముందు టెల్ల కొదువ గాదు' అన్న నిజం మాత్రం నేర్పరు. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేస్తూండటంతో ఆధునికసౌఖ్యసాధనాలన్నీ పిల్లలకు పసితనంలోనే అలవాటవుతాయి. దాంతో తమ దగ్గర లేనివి, ఎదుటివారి దగ్గర చూస్తే భరించలేకపోతారు. ఇది రకరకాల మానసిక వైకల్యాలకు దారి తీస్తుంది. కాబట్టి వీలైనంత వరకూ పిల్లలకు నిజానిజాలు వివరిస్తుండాలి.

రాము, చందూ, సోము సమవయస్కులు. దాదాపుగా వారి ఆర్థికస్థితి కూడా ఒకే రకం. కానీ రాము తన దగ్గర లేనివి ఎదుటివాడి దగ్గర కనిపిస్తే భరించలేడు. అది పుస్తకమే కావచ్చు, పెన్సిల్ కావచ్చు. ఎదుటివాడి దగ్గర ఉన్నదాన్ని నాశనం చేస్తే గానీ నిద్ర పోడు. దాన్ని దొంగిలిస్తే కానీ మనశ్శాంతి లభించదు. ఇందుకు కారణం, అతని కుటుంబ వాతావరణంలో అతడికి నిజానిజాలు వివరించే పరిస్థితి లేదు.

చందూ కూడా తన దగ్గర లేనివి ఎదుటివాడి దగ్గర చూస్తే కుమిలిపోతాడు. రాములాగా దొంగతనం చేయడు. కానీ న్యూనతాభావంతో బాధపడతాడు. తానెందుకూ పనికిరాని వాడినని క్రుంగిపోతాడు. ఇతడికి కూడా నిజానిజాలు అర్థం చేసుకునే దృక్పథం లేదు.

సోము కూడా తన దగ్గర లేనివి ఎదుటివారి దగ్గర చూస్తే బాధపడతాడు. అయితే అతనికి బాల్యంలోనే అతని తల్లిదండ్రుల వద్ద నుంచి సరైన శిక్షణ లభించింది. దాంతో తన నిరాశనూ, న్యూనతాభావాన్నీ ప్రయోజనాత్మకదిశకు మళ్లించగలిగాడు. ముందుగా 'సోము'కు తెలుసు. ప్రపంచంలో అందరూ ఒకే రకంగా ఉండరని. రూపు రేఖల్లోనే కాదు స్థితిగతుల్లో కూడా తేడాలుంటాయని అతడికి తెలుసు. ఒకరు కారులో వస్తే మరొకరు కాలి నడకన వస్తారని తెలుసు. అదీ గాక భగవంతుడి సృష్టిలో న్యాయానికి

తప్పు అన్యాయానికి తావు లేదని తెలుసు. ఇంకా భగవంతుడి ప్రణాళికలో ప్రతి వ్యక్తికీ నిర్దిష్టమైన పాత్ర ఉంటుందని అతడికి తెలుసు. ఒకరు ఓ రంగంలో నిష్ణాతులై ఉంటే, మరొకరు ఇంకో రంగంలో అసమానప్రతిభ కలవారై ఉంటారన్న గ్రహింపు అతడికి ఉంది. కాబట్టి ఎవరూ ఎవరికీ తక్కువ కాదు. ఎవరూ ఎవరికీ ఎక్కువ కాదు. ఒక విషయంలో ఒకరు ఎక్కువ ఐతే, ఇంకో విషయంలో ఇంకొకరు ఎక్కువ. కాబట్టి ఏ వ్యక్తీ తాను ఒకరి కంటే తక్కువ అని భావించి న్యూనతాభావానికి గురవ్వాల్సిన అవసరం లేదు. తనదగ్గర లేని వస్తువు ఇంకొకరి దగ్గర ఉంటే చూసి బాధపడటం మామూలే. దాంట్లో తప్పు లేదు. కానీ ఆ అసూయకు లొంగిపోవటం, బాధను హద్దులు దాటించటం తప్పు అని సోముకు తెలుసు. ఎదుటివాడి దగ్గర తన దగ్గర లేనిది ఉంటే, దాన్ని చూసి ఎప్పటికీ అసూయపడుతూనే ఉండటం తప్పు. తన అసూయను అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి వ్యక్తి. ఆ అసూయకు కారణాన్ని విశ్లేషించాలి.

ఉదాహరణకు సోము మిత్రుడు క్లాసులో ఫస్టు వచ్చాడనుకుందాం. అది సోములో అసూయ కలిగించింది. చాలా మంది ఈ అసూయను, ఫస్టు వచ్చినవాడిని విమర్శించటం ద్వారానో, ఏడ్పించటం ద్వారానో, తక్కువ చేసి మాట్లాడటం ద్వారానో, లేక పూర్తిగా వాడితో మాట్లాడటం మానేయటం ద్వారానో ప్రదర్శిస్తారు. కానీ, అతడు ఫస్టు రావటం వెనుక ఉన్న శ్రమను గుర్తించాలి. తన కన్నా ఎక్కువ కష్ట పడ్డాడు కాబట్టి వాడికి ఎక్కువ మార్కులు వచ్చాయి. తానూ ఏకాగ్రతతో చదివితే తనకూ మార్కులు వస్తాయి అని తన దృష్టిని మరింతగా పాఠ్యపుస్తక పఠనం వైపు మళ్లించాలి. ఇది సోముకు తల్లిదండ్రుల నుంచి అందిన సంస్కారం.

ఇది కేవలం మార్కుల విషయంలోనే కాదు. ప్రతి విషయానికీ వర్తిస్తుంది. సమవయస్కులలో ఒకరు దుర్భరదారిద్ర్యంలో ఉంటే, మరొకరు సకలైశ్వర్యాలతో తులతూగుతుండవచ్చు. వ్యక్తి దానికి కారణం విశ్లేషించాలి. తాను పేదరికంలో ఉండటానికి దారి తీసిన కారణాలు గ్రహించాలి. ఆ వ్యక్తి ధనవంతుడవటానికి కారణాలు విశ్లేషించాలి. ఆపై తాను తన పరిస్థితిని ఎలా మెరుగుపరచుకోగలడో పథకాలు వేయాలి. అంతే కానీ, వాడు తన కన్నా మంచి స్థితిలో ఉన్నాడని ఏడుస్తూ కూచోవడం వల్ల తన పరిస్థితి బాగుపడటం అటుంచి ఆరోగ్యం కూడా పాడవుతుంది. అంటే అసూయకు లోనవటం తప్పుకాదు. అసూయకు లొంగిపోవటం తప్పు అన్నమాట. ఇది 'కొంచె ముందు టెల్ల కొదువ కాదు' అన్న నిజం వెనుక ఉన్న అర్థం. అందరికీ అన్నీ ఉండవు. ఉన్నదాంతో సంతృప్తి చెందటం ఉత్తమం. అలాగని ఎంత ఉంటే అంతతో సంతృప్తి చెందితే ఎదుగుదల

ఉండదు. తన శక్తిని గ్రహించి అడుగు ముందుకు వేయాలి. దీన్ని 'అనువు కాని చోట అధికుల మనరాదు'తో అన్వయించుకోవాలి.

మహాభారతయుద్ధంలో శ్రీకృష్ణుడి మద్దతు కోరాలి. మద్దతు కోరటానికి వచ్చిన దుర్యోధనుడు రాజఠీవి ప్రదర్శించాడు. అర్జునుడు వినయం చూపాడు. రాజుకు సైన్యం దక్కింది. అర్జునుడికి స్వయంగా శ్రీకృష్ణుడు దక్కాడు. 'అనువు కాని చోట అధికుల మనరాదు' అన్న విచక్షణ అర్జునుడు ప్రదర్శించాడు. కృష్ణుడిని అభ్యర్థించటానికి వచ్చిన అర్జునుడు రాజఠీవి ప్రదర్శిస్తే లాభం లేదు. అభ్యర్థి అభ్యర్థిలానే ఉండాలి.

అలాగే నారాయణమూర్తిలా అందరూ పదివేల పెట్టుబడితోనే మైక్రోసాఫ్ట్ అధినేతలు కాలేరు. అలాగని ప్రయత్నించటంలో తప్పు లేదు. ఆ ప్రయత్నాలు కూడా తన నిజశక్తిని గ్రహించిన ప్రయత్నాలై ఉంటే నష్టం లేదు.

స్టాక్ మార్కెట్‌లో డబ్బు త్వరగా, సులభంగా సంపాదించే వీలుంటుంది. స్టాక్ మార్కెట్‌లో డబ్బు సంపాదించినవారి ఉదాహరణలు అనేకం ఉన్నాయి. కానీ స్టాక్ మార్కెట్ గురించి సరిగ్గా తెలుసుకోకుండా, అంచనా వేయగల తన సామర్థ్యాన్ని పరిశీలించకుండా వ్యక్తి గుడ్డిగా స్టాక్ మార్కెట్‌లో దిగితే నష్టం తప్పదు.

కాబట్టి ఉన్నదాంతో సంతృప్తి పడుతూ, తన శక్తిసామర్థ్యాలను సరిగ్గా అంచనా వేసుకుంటూ ముందుకు సాగటం ఉత్తమవ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ ఉత్తమవ్యక్తిత్వాన్ని నిర్వచిస్తుంది వేమన పద్యం 'అనువు కాని చోట అధికుల మనరాదు'.

ఈ నిజాన్నే భగవద్గీత మరో కోణంలో ప్రదర్శిస్తుంది.

*ధ్యాయతో విషయాన్ పుంసః*
*సంగస్తే షూపజాయతే।*
*సంగాత్ సంజాయతే కామః*
*కామాత్ క్రోధోభిజాయతే॥*

*క్రోధోద్భవతి సమ్మోహః*
*సమ్మోహాత్ స్మృతివిభ్రమః*
*స్మృతిభ్రంశా ద్బుద్ధినాశః*
*బుద్ధినాశాత్ ప్రణశ్యతి॥*

విషయాల గురించి ఆలోచించటం వల్ల వాటిపై ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి కోరిక అవుతుంది. కోరిక నెరవేరకపోతే క్రోధం కలుగుతుంది. దాని వల్ల ఆవేశం జనిస్తుంది. ఆవేశంలో వ్యక్తి విచక్షణను మరచిపోతాడు. దాంతో విచక్షణను మరచిన వ్యక్తి అనరాని మాటలంటాడు. చెయ్యరాని పనులు చేస్తాడు. ఫలితంగా నష్టపోతాడు. అశాంతి పాలవుతాడు.

తన నిజశక్తిని గ్రహించకుండా, సామర్థ్యాన్ని అంచనా వేసుకోకుండా, ప్రవర్తించేవాడు 'అనువుకాని చోట అధికుడ'నని అంటాడు. భంగపడతాడు. అది దుఃఖానికి దారి తీస్తుంది. తన సామర్థ్యాన్ని అంచనా వేయకుండా ఎదుటివాడిని చూసి అసూయపడేవాడు కూడా విచక్షణను కోల్పోతాడు, నష్టపోతాడు.

కాబట్టి వ్యక్తి తన సామర్థ్యాన్ని సరిగ్గా గుర్తించగలగాలి. తన శక్తియుక్తుల పరిమితులను అర్థం చేసుకోవాలి. ఆపై ఉన్నదాంతో సంతృప్తి పడుతూ, తన పరిమిత పరిధిలో తాను అనుకున్నది సాధించే ప్రయత్నం చేయాలి. ఇందుకు వ్యక్తికి విచక్షణ అవసరం అవుతుంది. ఈ విచక్షణ విజ్ఞానుల జీవితచరిత్రలను చదవటం, సజ్జనుల సాంగత్యంలో గడపటం ద్వారా, విజ్ఞానాన్ని గ్రహించటం వల్ల వస్తుంది. ఇలా గ్రహించిన విజ్ఞానాన్ని ఆచరణలో పెడితే వ్యక్తి సుఖంగా జీవించగలుగుతాడు. ఇతరులకు మార్గ దర్శకుడవుతాడు.

❖ ❖ ❖

# వ్యక్తిత్వం - మాట

## మాటే మంత్రం

మనుషులకు దేవుడిచ్చిన అత్యద్భుతమైన వరం మాట. మనసులో చెలరేగే భావాలను వ్యక్తపరచేందుకు ఉపయోగపడుతుంది మాట. తన మనసులో కలిగిన భావాలను కప్పిపుచ్చుకుంటూ, ఎదుటి వ్యక్తిని తప్పు దారి పట్టించేందుకు ఉపయోగపడేదీ మాటనే. ఎదుటి వ్యక్తిని ప్రభావితం చేసి, తన అదుపులోకి తెచ్చుకునేందుకూ అవసరమయ్యేది మాటనే. మాట వల్ల ఎదుటి వ్యక్తి కంట నీరు తెప్పించవచ్చు, కంట అగ్నిని పొంగించ వచ్చు. మాటతో మనిషి ప్రేమ పొందవచ్చు. మాటతో ద్వేషాన్ని కొని తెచ్చుకోవచ్చు. మాటతో మనిషిలోని సున్నితభావనలు జాగృతం చేయవచ్చు. మాటతో మనిషిని పశువులా మార్చవచ్చు. కాబట్టి వ్యక్తిత్వవికాసంలో మాట అత్యంత ప్రధాన పాత్ర వహిస్తుందని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరంలేదు. ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే మిటంటే నిత్యజీవితంలో 'మాట' వాడకం గురించి.

మొత్తం రామాయణం, దశరథుడు కైకేయికి ఇచ్చిన 'మాట'పై ఆధారపడి ఉంది. ఈ కథ మనకు 'మాట' ఇచ్చేటప్పుడు పాటించాల్సిన విచక్షణను స్పష్టం చేస్తుంది. ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం మన ధర్మం. కాబట్టి మాట ఇచ్చేటప్పుడే ముందు వెనుక తప్పనిసరిగా ఆలోచించాల్సి ఉంటుంది. మహాభారతంలో సైతం 'మాట' ప్రాధాన్యం అడుగడుగునా కనిపిస్తూంటుంది. తల్లికి ఇచ్చిన 'మాట' ప్రకారం, అర్జునుణ్ని తప్ప మిగతా పాండవులను హతమార్చగలిగిన అవకాశం ఉండి కూడా వదిలేస్తాడు కర్ణుడు. అలాగే ద్రోణాచార్యుడి 'మాట'కు కోపగించి అతని మరణం వరకూ యుద్ధంలో పాల్గొనడు కర్ణుడు. 'సూతపుత్రు'డన్న మాట, కర్ణుడి నిర్ణయాలపై ఎంతో ప్రభావం చూపించింది. అలాగే అందరూ అవమానిస్తున్న సమయంలో తనను గౌరవించిన దుర్యోధనుడి వైపు కర్ణుడు మళ్ళటం కూడా, దుర్యోధనుడి మాటల వల్లనే. ఇలా మన పురాణాల్లో అడుగడుగునా మాటల ప్రాధాన్యాన్ని స్పష్టం చేసే సంఘటనలు, కథలు కోకొల్లలు.

అందుకే సావిత్ర్యుపాఖ్యానంలో ఎఱ్ఱన్న సావిత్రి పాత్రతో ఇలా అనిపించాడు.

ఏడు మాట లాడిన యంత నెట్టివారు
నార్యజనులకు జుట్టంబు లగుదు రనినఁ
జిరసమాలాపసంసిద్ధి జేసి నీకు
నేను జుట్టమనియు వేఱ యేల చెప్ప.

సావిత్రి యముడితో అన్న ఈ మాటలు వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శనం చేస్తాయి. ఎదుటివాడు మనకు వ్యతిరేకంగా ఉన్నా, మాట నేర్పుతో ముందరి కాళ్ళ బంధం వేసి పనులు సాధించే నేర్పరితనాన్ని నేర్పుతాయి.

సావిత్రి కథ అందరికీ తెలుసు. తన భర్త ప్రాణాన్ని కొనిపోతున్న యముడిని మాటలతో బోల్తా కొట్టించి మరీ పని సాధించింది. యముడు తన కర్తవ్యం నిర్వహిస్తున్నాడు కానీ అందువల్ల తనకు నష్టం కలుగుతోంది. పైగా తీసుకున్న ప్రాణాన్ని తిరిగి ఇవ్వటం యమధర్మం కాదు. కానీ సావిత్రికి ఆమె భర్త ప్రాణం కావాలి. అంటే యముడితో అధర్మమైన పని చేయించాలి. ఈ పనికి నడుం కట్టిన సావిత్రి, తన తెలివి తేటలను ఉపయోగించింది. 'మాట' అనే తిరుగు లేని సమ్మోహనాస్త్రాన్ని ప్రయోగించింది.

'నా భర్త ప్రాణం నాకియ్యి', 'నువ్వెవరవు దాన్ని తీసుకోటానికి?' అంటూ యుద్ధానికి దిగలేదు. 'అయ్యో నా భర్త లేక బ్రతకలేను' అంటూ ఏడ్చి పెడబొబ్బలు పెట్టి యముణ్ని కరిగించాలని ప్రయత్నించలేదు. యముడితో వాగ్యుద్ధానికి దిగలేదు. ఇందులో ఏది చేసినా ఆమె తన ప్రయత్నంలో విఫలమయ్యేది. ఆమె ఎఱుక గలవారి చరితలు తెలుసుకుంది. సజ్జనసాంగత్యంలో గడిపింది. మంచి విచక్షణ, విజ్ఞానాలు కలది. అందుకని ముందే యముడి ముందరి కాళ్ళకు బంధం వేసింది. 'సఖ్యం సాప్తపదీనాం' అంటారు. అంటే కలసి ఏడడుగులు వేసినా, ఏడు మాటలు మాట్లాడినా, సత్పురుషులు ఒకరికొకరు మిత్రులవుతారట. 'Birds of the same feather flock together' అని ఇంగ్లీషులో ఓ సామెత ఉంది. అందుకే యముడితో వాగ్యుద్ధానికి దిగి, అతడిని చీకాకు పరచలేదు. 'ఏడు మాటలాడితేనే చుట్టాలవుతారు కదా, మనమింత సేపు మాట్లాడేము, చుట్టాలమెందుకు కాదు? అని ప్రశ్నించింది. పైగా 'ఆర్యజనులకు' అని వాడటంతో తానూ గౌరవనీయురాలే అని, యముడితో సమానస్థాయి కలదనీ, కాబట్టి బంధువు అయ్యే అర్హత ఉందని చెప్పకనే చెప్పింది. అంటే తాను పరమయోగ్యురాలు కాబట్టే యముడిని చుట్టంగా భావిస్తోంది అంటోంది.

సావిత్రి తన ధర్మం కోసం పోరాడుతోంది. యముడు తన ధర్మాన్ని నిలుపుకుంటున్నాడు. కానీ మనకు సన్నిహితులను మనం ఏమైనా అడగవచ్చు. అవతలివాడెంత కఠోరుడైనా మనకు బంధువైతే, మనకు కావలసింది అతడిని అడిగే చనువు మనకు ఉంటుంది. ఈ ఒక్క పద్యంతో సావిత్రి ఆ చనువు సంపాదించింది. ఏడు మాటలాడితేనే సత్పురుషులు బంధువులైతే, ఇన్ని మాటలు మాట్లాడినవారు బంధువులైనట్టే కదా! తిరుగులేని వాదం ఇది. అందుకే తన ధర్మవ్యతిరేకంగా ప్రవర్తించమని యముడిని కోరబోతోంది సావిత్రి.

ఈ వాదానికి ముందు మరో పద్యంలో యముడిని కట్టిపడేస్తుంది సావిత్రి.

*ఎడపక వాఙ్మనఃక్రియల నేరికి హింస*
*యొనర్ప బూన రె*
*య్యెడలను దీనులం గరుణ యేర్పడ*
*బ్రోవగ చూతు రిచ్చుచో*
*గడమ వడంగ నీకెదిరి కాంక్షితముల్*
*దుదిముట్ట దీర్తు రె*
*క్కుడు మది గూర్తు రాశ్రితులకున్ విను*
*మిన్నియు నార్యధర్మముల్.*

పద్యంలో సావిత్రి యముడిని ఆర్యుడని అనలేదు. కానీ ఆర్యధర్మాలన్నీ చెప్పింది. మనోవాక్కాయకర్మలతో ఎవరికీ హింస చేయనివాడు, దీనులను కరుణతో చూసేవాడు, ఇచ్చేటప్పుడు కొంత ఇచ్చి వెనక్కు లాగనివాడు, ఆశ్రితులను సంపూర్ణంగా పాలించేవాడు ఆర్యుడు. ఇది ఆర్యధర్మం (అంతే తప్ప ఆర్యులు ఓ జాతి కాదు). ఈ లక్షణాలున్న వారంతా ఆర్యులే. ఈ మాటలు చెప్పి 'మనం ఆర్యులం' అనటంతో యముడి అహంకారాన్ని సంతృప్తి పరచటమే కాదు, ఇపుడు దీనురాలైన తనపై జాలి చూపించాలని, కొంత ఇచ్చి వెనక్కు లాగే ప్రయత్నం చేయకూడదని, అలా చేస్తే యముడు 'ఆర్యుడు' కాదనీ చెప్పకనే చెప్తోంది సావిత్రి.

అంటే ఓ పని సాధించాలంటే, ముందుగా మనకు ఎవరితో పని ఉందో వారి మనస్తత్వాన్ని పరిశీలించాలి. వారు మనకు సుముఖంగా ఉంటే పరవాలేదు. వ్యతిరేకంగా ఉంటే ముందుగా వారి అహంకారాన్ని సంతృప్తి పరచాలి. ఆ సంతృప్తిపరచటంలో మళ్లీ మన ఆత్మగౌరవాన్ని వదులుకోకూడదు. సావిత్రి యముడికి ఆర్యధర్మాలు చెప్పింది.

'నువ్వు ఆర్యుడని ఒప్పుకోవాలంటే ఆ ధర్మాలను నువ్వు పాటిస్తున్నా'వని నిరూపించమంది. ఇదంతా వాదంలా కాక ఇద్దరు సన్నిహితుల నడుమ జరిగే సంభాషణలా జరిగింది. అందుకే సావిత్రి యముడి అహంకారాన్ని సంతృప్తి పరచటమే కాదు, అతడితో బంధుత్వాన్ని నెరపి, అతను చేయకూడని పనిని కూడా చేయించింది. విజయం సాధించింది.

ఈ పద్ధతికి భిన్నమైన పద్ధతిని నచికేతుడు పాటించాడు. నచికేతుడు యముడి ఇంటి ద్వారం వద్ద మూడురోజులు నీరు, తిండి లేకుండా ఎదురుచూశాడు. దాంతో యముడు నేరభావనకు గురయ్యాడు. దాన్ని కప్పిపుచ్చుకునేందుకు నచికేతుడికి వరాలిస్తానన్నాడు. నచికేతుడు తన కోసం ఏమీ కోరలేదు. తన కోసం కేవలం సంపూర్ణ జ్ఞానం కోరాడు. దాన్ని ఇవ్వకుండా ఉండేందుకు యముడు అనేక ప్రలోభాలు చూపించాడు. కానీ నచికేతుడు లొంగలేదు.

*'యో అయం వరో గూఢ మను ప్రవిష్టో*
*నాన్యం తస్మాన్నచికేతా వృణీతే॥'*

'గ్రహించనలవి కాని విషయం తప్ప నచికేతుడు మరొక వరం కోరడు' అని స్పష్టంగా, దృఢంగా చెప్తాడు. సావిత్రిలాగా నచికేతుడు మాట నేర్పు, చమత్కారాలను ప్రదర్శించలేదు. నిజాయితీని, పట్టుదలను ప్రదర్శించాడు. పట్టుదల ఉంటే పర్వతాలే శిరసులు వంచి దారినిస్తాయి. సముద్రాలు అలలు తగ్గి మార్గాన్నిస్తాయి. యముడికి సైతం నచికేతుడి పట్టుదల ముందు లొంగక తప్పలేదు. అంటే, ఎప్పుడైతే మనసులో స్వచ్ఛత, మాటలో స్పష్టత ఉంటుందో, ఎప్పుడేతే లక్ష్యసాధనపై పట్టుదల ఉంటుందో అప్పుడు యముడికి సైతం తల వంచటం తప్ప గత్యంతరం లేదన్నమాట.

ఈ రెండు కథలూ, నిత్యజీవితంలో చిన్న పనుల నుంచి పెద్ద పనుల వరకూ సాధించటంలో 'మాట' ప్రాధాన్యంతో పాటు అది సాధించాలన్న పట్టుదల, నిజాయితీల ఆవశ్యకతలను సైతం స్పష్టంగా చేస్తాయి.

అంతే కాదు 'అనువు కాని చోట అధికుల మనరాదు' అన్న సూక్తిని పాటించటం వల్ల కలిగే లాభాన్ని చూపిస్తాయి. సావిత్రి యముడితో వాగ్యుద్ధానికి దిగకపోవటానికి కూడా ఈ 'అనువు కాని చోట అధికుల మనరా'దన్న విచక్షణయే కారణం. ఎందుకంటే యముడు అధికారి లాంటివాడు. సావిత్రి అభ్యర్థిని వంటిది. అభ్యర్థి ఎన్నడూ అధికారి

దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి ఉంటాడు కాబట్టి, అభ్యర్థి పని సాధించాలంటే అధికారిలోని దయాదాక్షిణ్యాల భావనను జాగృతం చేయాలి. ఇది తప్ప మరో మార్గం లేదు. ఒక దిగువ స్థాయి ప్రభుత్వకార్యాలయంలో పని సాధించటం దగ్గర నుంచి అంతర్జాతీయ రంగంలో అనుకున్నది పొందాలన్నా ఇదే మార్గం.

అంటే వ్యక్తిత్వవికాసంలో, విజ్ఞానం, విచక్షణ, సత్సాంగత్యం, పట్టుదల, నిజాయితీలకు మంచి మాట తోడవాలన్న మాట. ఇందులో ఏ ఒక్క అంశం లోపించినా వికాసం సంపూర్ణం కాదు. ఈ విషయాన్నే

*సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్*
*న బ్రూయాత్ సత్య మప్రియం*
*ప్రియం చ నా నృతం బ్రూయాత్*
*ఏషః ధర్మః సనాతనః*

అని చెప్పారు పెద్దలు. సత్యం చెప్పాలి. అది ప్రియంగా చెప్పాలి. ప్రియమైన సత్యం చెప్పాలి. అప్రియమైన సత్యాన్ని చెప్పకూడదు. అలాగని ప్రియమైందని అబద్ధం చెప్పకూడదు. ఇది వ్యక్తిత్వ వికాసానికి 'బ్రహ్మాస్త్రం' వంటి సూత్రం.

యముడిని 'నువ్వు హంతకుడివి. ప్రాణాలు దొంగిలించేవాడివి' అనకూడదు. అవి నిజాలే ఐనా అవి అహంకారాన్ని దెబ్బ తీస్తాయి. మొదటికే మోసం వస్తుంది. అందుకే సావిత్రి ప్రియమైన సత్యాలు ఆర్యధర్మాలు చెప్పి, నువ్వు ఆర్యుడివి అన్న నిజం చెప్పి పని సాధించింది. నచికేతుడు సైతం 'నువ్వు అతిథి మర్యాదలలో విఫలమయ్యా'వన్న సత్యాన్ని చెప్పలేదు. అప్రియమైన సత్యాన్ని చెప్పటం మాని యముడి వరాలను స్వీకరించాడు. జ్ఞానం పొందాడు.

నిత్యజీవితంలో అనుక్షణం ఉపయోగపడే ఇటువంటి అమృతగుళికలు భారతీయ వాఙ్మయంలో కోకొల్లలు.

## మాట మరో రూపం

మనిషి మనసులోని భావాలను వ్యక్తపరిచే సాధనం మాట. ఒక వ్యక్తి గురించి ఎదుటివారు అతడు మాట్లాడే మాటలనుబట్టి అభిప్రాయం ఏర్పరచుకుంటారు. కాబట్టి మనం మాట్లాడే మాటలు మనకు సమాజంలో గౌరవాన్ని, అభిమానాన్ని

సంపాదించిపెడతాయి. అందుకే సుమతీ శతకకారుడు 'మాట' ప్రాధాన్యాన్ని ఇలా వివరించాడు.

*ఇమ్ముగ జదువని నోరును*
*నమ్మా యని పిలిచి యన్న మడుగని నోరున్*
*దమ్ముల బిలువని నోరునుఁ*
*గుమ్మరి మను ద్రవ్వినట్టి గుంటర సుమతీ.*

ప్రతి వ్యక్తి కొడుకు, అన్న, తమ్ముడు, భర్త, యజమాని, ఉద్యోగి వంటి పలు పాత్రలను నిత్యజీవితంలో నిర్వహించాల్సి ఉంటుంది. పాత్ర ఎటువంటిదైనా వ్యక్తి ముందుగా ఎదుటి వ్యక్తి పట్ల చూపవలసినవి అనురాగం, ఆత్మీయత, గౌరవం.

తనివితీరా చదవాలి. మొక్కుబడిగా కాదు. చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా చదవాలి. పరస్త్రీలను సైతం నోరారా 'అమ్మా' అని పిలిచి గౌరవించాలి. తమ్ములను కూడా ప్రేమగా, గౌరవంగా సంబోధించాలి. 'ఒరే' అని పిలిచినా, ఆ పిలుపులో ఆత్మీయత, అభిమానా లుండాలి. గమనిస్తే, ప్రేమగా అనే 'ఒరే' లోనూ, కోపంగా అనే 'ఒరే'లోనూ ఎంతో భేదముంటుంది. పదం ఒకటే అయినా భావం మారుతుంది. తల్లి ప్రేమగా 'పిచ్చి మొద్దు' అంటే, హృదయం ఉప్పొంగుతుంది. బయటివాడు 'పిచ్చి మొద్దు' అంటే ఒళ్ళు మండుతుంది. ఇక్కడ అర్థం చేసుకోవాల్సిందేమిటంటే, ఏదో మొక్కుబడిగా, యాంత్రికంగా పలికే పదాలకు శక్తి ఉండదు. అవి కేవలం మామూలు పదాల్లా మిగిలిపోతాయి. ఆ పదాల వెనుక ఉండే వ్యక్తి వ్యక్తిత్వం ఆ పదాలకు ఒక శక్తినిస్తుంది. ఎదుటివారి మనస్సులపై ప్రభావం చూపిస్తుంది. ఈ విషయం మనం పసిపిల్లల స్పందనను బట్టి గ్రహించవచ్చు.

సాధారణంగా పసిపిల్లలు కొత్తవారిని చూసి ఏడుస్తారు. భయపడతారు. ఎవరెంత అనునయంగా చూసినా, ముద్దు చేసినా అందరి దగ్గరకూ పోరు. కొందరి దగ్గరకు పరుగెత్తుతారు. అలవాటవటం దీనికి ఒక కారణం. మరో కారణం... పిల్లలకు మాటల అర్థాలు తెలియవు. కానీ వారు ఎదుటివారి మనఃస్థితిని గ్రహించగలరు. అందుకే పైకి ముద్దు చేస్తున్నా, మనస్సులో ఉండే క్రోధాన్ని గ్రహించి వారికి దూరంగా ఉంటారు. ఇది మనం కూడా సినిమాల్లో నటీనటుల నటనలోని నిజాయితీని బట్టి అనుభవిస్తాం. భారీ డైలాగులు పలికినా కలగని అనుభూతి ఒక్కో నటుడు ఒక్క పలుకుతో కలిగించగలుగుతాడు. కాబట్టి ఎదుటివారి పట్ల గౌరవం, అనురాగం చూపటమే కాదు మన మాటను శక్తిమంతం చేసే మరో అంశం నిజాయితీ.

*మాటకు బ్రాణము సత్యము*
*కోటకు బ్రాణంబు సుభటకోటి ధరిత్రిన్*
*బోటికి బ్రాణము మానము*
*చీటికి బ్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ.*

చీటికి (ఆజ్ఞకు) సంతకం, కోటకు భటులు, పడతికి మానం, మాటకు సత్యం ప్రాణం వంటివి అంటాడు సుమతీశతకకారుడు.

అందుకే తైత్తిరీయోపనిషత్తులో విద్యాభ్యాసం పూర్తయిన విద్యార్థికి, వీడ్కోలు మాటల్లో.... వ్యక్తిత్వవికాసానికి గురువు అందించే సందేశంలో ముందు 'సత్యం వద, ధర్మం చర' అనటం చూడవచ్చు. ధర్మపాలనకు ఎంత ప్రాముఖ్యముందో, సత్యం మాట్లాడటానికీ అంత ప్రాధాన్యం ఉంది. ఎందుకంటే సత్యం పలకటమే మన ధర్మం కాబట్టి.

మనుధర్మశాస్త్రం కూడా సత్యం పలకటం విషయాన్ని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తుంది. 'అన్యాయంగా అడిగినవాడు, అన్యాయంగా బదులు చెప్పినవాడు దోషి అవుతాడు. లేక విరోధాన్ని పొందుతాడు.' అంటే మనం మాట్లాడే ప్రతి మాటకు 'ప్రతిమాట' ఉంటుందని గ్రహించాలి. ఎదుటివాడు మన కన్నా చిన్నవాడా, పెద్దవాడా, తక్కువ స్థాయి వాడా అన్న దాంతో సంబంధం లేకుండా గౌరవంగా పలకరించాలి. గౌరవించి మాట్లాడాలి. గోడకు కొట్టిన బంతి అంతే వేగంగా వెనక్కు వచ్చినట్టు, మనం గౌరవిస్తే మనకు గౌరవం లభిస్తుంది. మనం మర్యాద పొందాలంటే, ఎదుటివాడు మర్యాదనివ్వటం కోసం ఎదురు చూడకుండా మనమే ముందుగా మర్యాదనివ్వాలి. మన మాటలో ఈ మంచితనాన్ని ప్రకటించాలి.

'అమంగళకరమైన మాటలను కూడా మంగళకరమైన పదాలతో చెప్పాలి. వృథాగా ఒకరితో వైరం, వివాదాలు పెట్టుకోవద్దు' అంటుంది మనుధర్మశాస్త్రం. ప్రస్తుతసమాజంలో 'సారీ', 'థాంక్యూ'లు ఒక రకంగా అనేకరకాల ఉద్విగ్నతలను తగ్గించే సాధనాలు. మన వల్ల పొరపాటు జరగకున్నా, నిజాయితీగా 'సారీ' అనేస్తే సగం గొడవ తగ్గుతుంది. అనవసరమైన అహం ప్రదర్శిస్తే, క్షణంలో తేలిపోయే విషయం కూడా, అనవసరమైన వాగ్వివాదాలకు, మనస్తాపాలకూ దారి తీస్తుంది.

ఉదాహరణకు రైల్వే ఎంక్వయిరీ కౌంటర్‌లో ఓ సారి ఓ వ్యక్తి కూచున్నాడు. ఆ రోజు తుఫాను వల్ల రైళ్ళన్నీ బాగా ఆలస్యం అవుతున్నాయి. ఏ రైలు ఎన్ని గంటలకు

వస్తుందో సరైన సమాచారం తెలియటం లేదు. దాంతో తమవారిని రిసీవ్ చేసు కోవటం కోసం వచ్చినవారు అసహనంగా కౌంటర్‌ను చుట్టుముట్టి అడిగినవే అడుగుతూ, గుచ్చిగుచ్చి ప్రశ్నలు వేస్తున్నారు.

ఆ ప్రశ్నలకు విసిగిన ఆ క్లర్కు 'తుఫాను రావటం నా తప్పా? రైళ్ళాగిపోయాయి. అది నా తప్పా? దానికి నేను బాధ్యుడినా?' అంటూ ప్రయాణికులతో వాదానికి దిగాడు. ముందే ఆందోళనతో, అసహనంగా ఉన్నారు ప్రయాణికులు. అతడి వాదానికి మరింత రెచ్చిపోయారు. నిజానికి, దాదాపుగా ఓ రెండు – మూడు గంటలు ఓపికగా సమాధానం చెప్పాడా క్లర్కు. చివరికి ఓపిక నశించటంతో దురుసుగా ప్రవర్తించాడు. దాంతో పరిస్థితి గందరగోళంగా తయారైంది. వాదాలు పెరిగాయి. ఉద్రిక్తతలు పెరిగాయి.

పరిస్థితి చేజారిపోవటం గమనించిన మరో క్లర్కు, వెంటనే రంగప్రవేశం చేశాడు. అందరికీ చేతులు జోడించి క్షమాపణలు చెప్పాడు. పరిస్థితి వివరించాడు. తుఫాను వల్ల సమాచారం సరిగ్గా అందకపోవటం వల్ల సరైన సమాచారం ఇవ్వలేకపోతున్నామని క్షమించమని వేడుకున్నాడు. సమాచారం అందగానే అందింది అందినట్లుగా ప్రకటిస్తామని, ఓపిక పట్టమని వేడుకున్నాడు. అంతే... క్షణాల్లో పరిస్థితి సర్దుకుంది. అంత వరకూ ఆవేశం ప్రదర్శించిన ప్రయాణికులు చల్లబడ్డారు. 'అవును, తుఫాను వచ్చింది. ఏం చేస్తాం!' అని తమలో తాము సర్దిచెప్పుకున్నారు.

గమనిస్తే, మొదటి క్లర్కు చెప్పిందే, రెండో క్లర్కు చెప్పాడు. అదనపు సమాచారం ఏమీ ఇవ్వలేదు. అయితే ఇతడు సామరస్యపూర్వకంగా మాట్లాడాడు. గౌరవించాడు. ప్రయాణికుల కష్టంతో సానుభూతి ప్రదర్శిస్తూ ప్రవర్తించాడు. తన కష్టాన్ని, పొద్దుటి నుంచీ అవే సమాధానాలు ఇస్తూ తాను శారీరకంగా, మానసికంగా పడుతున్న వేదనని ప్రదర్శించలేదు. ఎందుకంటే, మనుషులకు ఎదుటివాడి బాధలు, వేదనలు అనవసరం, తమ బాధలు, వేదనలు ప్రధానం. తమ అహంకారం ప్రాధాన్యం వహిస్తుంది. కాబట్టి ఎదుటివాడి అహంకారాన్ని సంతృప్తిపరుస్తూ, వాడిని అర్థం చేసుకుంటూ గౌరవంగా ప్రవర్తించటం వ్యక్తి ఔన్నత్యానికి నిదర్శనం. అంతే తప్ప 'ఎదుటివాడిని గౌరవించటం నా స్థాయికి భంగం కలిగిస్తుంద'న్నట్టు ప్రవర్తించటం సమంజసం కాదు. మనం బ్యాంకుకు వెళ్తాం. చిరునవ్వుతో, ఓపికగా సమాధానం ఇచ్చేవారిని గౌరవిస్తాం. వారి దగ్గరకే మళ్ళీ మళ్ళీ వెళ్తాం. విసుక్కునేవారిని అసహ్యించుకుని దూరం పోతాం. కాబట్టి నోరారా, ప్రేమగా వ్యక్తులను, గౌరవించి, పలకరించటం వ్యక్తిత్వవికాసంలో అత్యంత ఆవశ్యకమైన అంశం. ఈ అంశాన్ని ఎంతో నైపుణ్యంతో నేర్పుతాడు నన్నయ, ఈ కింది పద్యంలో

*నిండుమనంబు నవ్యనవ*
*నీతసమానము పల్కు దారుణా*
*ఖండల శస్త్రతుల్యము జ*
*గన్నుత విప్రుల యందు నిక్క మీ*
*రెండును, రాజు లందు విప*
*రీతము గావున విప్రు డోపు, నో*
*పం డతి శాంతుడయ్యు నర*
*పాలుడు శాపము గ్రమ్మఱింపగన్॥*

ఉదంకుడనే మహర్షి, గురుదక్షిణ కోసం పౌష్యుడనే మహారాజు దగ్గరకు వెళ్తాడు. అక్కడ ఉదంకుడు తాత్కాలికంగా విచక్షణను మరచిపోతాడు. దాంతో కోపాలు పెరుగుతాయి. రాజు, మహర్షి ఒకరిని ఒకరు శపించుకుంటారు. తరువాత ఇద్దరూ తమ తప్పును గ్రహిస్తారు. మహర్షి తన శాపాన్ని ఉపసంహరించుకుంటాడు. రాజు ఉపసంహరించుకో లేకపోతాడు.

మహర్షుల మనస్సు నవ్యనవనీతసమానం. నిండైనది. దాంట్లో క్రోధం ఉండదు. ఉన్నా తాత్కాలికమే. వారికి కోపం వస్తే వారి పలుకు వజ్రాయుధం లాంటిది. కానీ వారి మనస్సు వెన్నలాంటిది కావటంతో శాపాన్ని ఉపసంహరించుకోగలుగుతారు. ఎందుకంటే వారి కోపంలో స్వార్థం లేదు. క్రోధం తాత్కాలికమే. కానీ రాజులు అలాంటివారు కాదు. వారు కపటులు, వారి మాట మెత్తగా ఉంటుంది. హృదయం శస్త్రసమానమైందిగా ఉంటుంది. రాజ్యం నడిపేందుకు రకరకాల వేషాలు వేయాలి. అధికారం నిలుపుకునేందుకు కుట్రలు పన్నాలి. వారి నిజాయితీలో స్వార్థం ఉంటుంది. వారి క్రోధం దీర్ఘకాలం ఉంటుంది. కాబట్టి వారు శాపాన్ని ఉపసంహరించుకోలేరు.

ఇదీ మనకు అనుభవమే. ఒక వ్యక్తి మనకు సన్నిహితుడు. అతడు ఒకోసారి కోపంగా తిట్టినా మనం పట్టించుకోం. కోపం తగ్గిన తరువాత అతడే మన దగ్గరకు వస్తాడు. క్షమాపణ వేడుకుంటాడు. ఇక్కడ 'మాట' కన్నా మనసు ప్రాధాన్యం వహిస్తుంది. అంటే, వాక్కు ఎంత కఠినంగా ఉన్నా, మనస్సు మెత్తనైతే వాక్కులోని కాఠిన్యం, తీవ్రతలు తగ్గుతాయి. అందుకే, తల్లిదండ్రులు ప్రేమ కురిపిస్తూ, అప్పుడప్పుడు కఠినంగా వ్యవహరించినా, పిల్లవాడు వారి ప్రేమను అర్థం చేసుకోగలుగుతాడు. ఇక్కడే వ్యక్తి నోరారా పిలవటం, ప్రేమగౌరవాలు ప్రదర్శించటం వంటి అంశాలు ఉపయోగిస్తాయి.

కాబట్టి మన నిత్యజీవితంలో అనుక్షణం 'మాట' ప్రాధాన్యం వహిస్తుందని గ్రహించాలి. ఎదుటివారికి మనం మన మాట ద్వారానే అర్థమౌతాం. కాబట్టి మాట స్పష్టంగా, నిజాయితీగా ఉండాలి. డొంక తిరుగుడుగా, వ్యంగ్యంగా, నిష్ఠురంగా మాట్లాడటం వల్ల లాభం లేదు. నిజాయితీగా, సత్యం పలకటం వ్యక్తి ఉన్నతవ్యక్తిత్వానికి నిదర్శనం. అయితే ఈ సత్యం కూడా కుండ బద్దలు కొట్టినట్టు ఉండకూడదు. అప్రియమైన దాన్ని కూడా ప్రియంగా అయ్యేట్టు చెప్పాలి. అమంగళకరమైనదాన్ని కూడా మంగళకరమైన పదాలతో చెప్పాలి. ఇందుకు మనం 'వాక్కు' శక్తిని అర్థం చేసుకోవాలి.

మన లోంచి వెలువడుతున్న వాక్కు సరస్వతీస్వరూపం అని గ్రహించాలి. మనం మాట్లాడే ప్రతి మాటా ఆ వాగ్దేవికి మనం అర్పిస్తున్న నీరాజనంలా భావించాలి. అప్పుడు మన 'మాట' కొక కొత్త సొగసు వస్తుంది. ప్రతి మాటా ఆ వాగ్దేవి అర్చన గీతంలా పవిత్రతను ఆపాదించుకుంటుంది. స్వచ్ఛమైన, స్పష్టమైన వాక్కు ఆనందాన్ని కలిగించటమే కాదు, ఆరోగ్యానికీ హేతువవుతుంది. అందుకే 'మాటను బట్టి మనిషి, మనిషిని బట్టి మాట' అన్నారు పెద్దలు.

## మాట – మనిషి

మనిషినీ, మనిషిని దగ్గర చేస్తుంది మాట. మాట వల్ల ఎదుటివారిని ప్రభావితం చేయవచ్చు. వారిని ఉన్నతకార్యసాధనకు ప్రేరేపించవచ్చు. వ్యక్తిత్వవికాసంలో అందుకే మాట ప్రధానపాత్ర వహిస్తుంది. ఎందుకంటే 'మాట'కు శక్తి పదాల వల్ల రాదు. ఆ మాటను ఉచ్చరించిన మనసు వల్ల పదాలకు శక్తి వస్తుంది. ఆ పదాలను పలికిన మనసులోని నిజాయితీ వల్ల మాటకు శక్తి వస్తుంది.

రామకృష్ణ పరమహంస దగ్గరకు ఓ భక్తురాలు వచ్చి, వాళ్ల అబ్బాయి తీపి పదార్థాలు విపరీతంగా తింటున్నాడు. ఆ అలవాటు మంచిది కాదని చెప్పమని కోరింది. ఎవరు ఎంత చెప్పినా వినని ఆ అబ్బాయి రామకృష్ణుల వారు చెప్పగానే విన్నాడు. ఆయన మాటల అర్థం కన్నా ఆయన మనస్సులోని నిజాయితీ ఆయన మాటలకు ఆ శక్తినిచ్చింది. అది ఆయన అంతశ్శక్తిప్రభావం. ఆ అంతశ్శక్తి ఆయన మాటలకు అంతశక్తిని ఇచ్చింది. ఆయన మాటలు మనకు ఒక వివేకానందను అందించాయి. వివేకానంద 'ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ నిబోధత' అన్న ఉపనిషద్వాక్యాలతో భరతజాతిని జాగృతం చేసి గమ్యం వైపు దారి చూపాడు. ఇవే మాటలు ఇతరులెవరు చెప్పినా, ఆ పదాలకింత ప్రభావం ఉండేది కాదన్నది నిస్సంశయం.

అంటే 'వ్యక్తిత్వవికాసం' అన్నది కేవలం ఓ ఉద్యోగం సంపాదించటమో, ఓ లక్ష పాలసీ చెయ్యటమో, లేక ఒక కంపెనీ స్థాపించి కోట్లు గడించటమో కాదన్నమాట. వ్యక్తిత్వ వికాసం అంటే మనిషి సంపూర్ణమైన మానవుడుగా ఎదగటం అని అర్థం. ఎందుకంటే 'మాట'లో మెత్తదనం రావాలన్నా, మాటకు శక్తి రావాలన్నా నాలుగు కఠినపదాలు, ఐదారు చమత్కారప్రయోగాలు నేర్చుకుంటే సరిపోదు. లేకపోతే వాటిని నాటకీయంగా, భావానుసారం పలికితే సరిపోదు. మాటకు శక్తి శబ్దం వల్ల రాదు. మనసులోని భావనవల్ల వస్తుంది. మనిషి మనసుపై అతని ఆలోచనలు ప్రభావం చూపిస్తాయి. అతని శారీరక – మానసికక్రమశిక్షణలు అతని ఆలోచనల దిశను నిర్దేశిస్తాయి. అనారోగ్యంతో ఉన్నవాడి దృష్టి ఎంత సేపూ అనారోగ్యం పైనే ఉంటుంది తప్ప, ఆరోగ్యకరమైన ఆలోచనలపై ఉండదు. దాంతో ఆ అనారోగ్యం, అది మానసికమైనా, శారీరకమైనా, అతని మాటల్లో ద్యోతకమౌతుంది. అందుకే మనిషి ముఖం ఎలా అతని భావాలకు అద్దం పడుతుందో, అలాగే మాటలు అతని మనసు లోతుల్లోని ఆరోగ్యాన్ని, అనారోగ్యాన్ని ప్రతిబింబిస్తాయి. 'మాట' శక్తిమంత మవ్వాలంటే ముందుగా వ్యక్తి మాట స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. 'మాట'ను 'వాక్కు' అంటారు. వాగ్దేవి సరస్వతి. అంటే మనం మాట్లాడే ప్రతి మాటా సరస్వతి స్వరూపం.

శబ్దం అన్నది వస్తువులో ప్రకంపనలు కలగటం వల్ల జనిస్తుంది. మనం ఒక మాట మాట్లాడాలంటే మన శరీరంలో వాయుసంచలనం జరుగుతుంది. ఈ వాయు ప్రకంపనాన్ని స్వరపేటిక కదలికల ద్వారా నిర్దేశిస్తూ నిర్దిష్టమైన శబ్దాలను గొంతు పలుకుతుంది. అంటే మనం పలుకుతున్న ప్రతి మాట ప్రభావం ఎదుటివాడి పైనే కాదు, మన శరీరం పైన, మన మనసు పైన కూడా ఉంటుందన్నమాట.

మనం నవ్వుతూ మాట్లాడేటప్పుడు శరీరం ఉల్లాసంగా ఉంటుంది. కోపంగా పలికేటప్పుడు శరీరం వణుకుతుంది. రక్తప్రసరణ వేగవంతమౌతుంది. ప్రేమతో పిల్లవాడిని దగ్గర తీసుకున్నప్పుడు, తెలియకుండానే స్వరంలో మెత్తదనం ప్రవేశిస్తుంది. అంటే మన ప్రమేయం లేకుండానే, మనకు తెలియకుండానే మనం పలికే ప్రతి మాటా తన ప్రభావం మన శరీరం పైన, మనస్సు పైన చూపిస్తుంది. అందుకే మాటలు జాగ్రత్తగా మాట్లాడాలి. పదాలను స్పష్టంగా పలకాలి. అస్పష్టంగా, వక్రంగా పదాలు పలికితే ఆ దుష్ప్రభావం శరీరం పైన పడుతుంది. వాయుప్రసారనియంత్రణ 'యోగ'కు ప్రాతిపదిక. మనం మాట్లాడేటప్పుడు ఊపిరి బిగబడతాం. వేగంగా మాట్లాడితే మరింత ఎక్కువ బిగపడతాం.

అరిచేటప్పుడు ఒక రకంగా బిగపడతాం. నవ్వేటప్పుడు, సౌమ్యంగా మాట్లాడేటప్పుడు, వాదించేటప్పుడు, రోదించేటప్పుడు... ఇలా భావాన్ని బట్టి ఊపిరిని బిగబట్టటం ఉంటుంది. ఇదీ ఒక రకమైన యోగమే! ఈ యోగప్రభావం కూడా శరీరంపై పడుతుంది. అందుకే మంచి మాటలు మాట్లాడాలి. మంచి ఆలోచనలు చేయాలి అంటారు.

ఇదే ఆలోచన చదువు ప్రారంభించేటప్పుడు చేసే సరస్వతి ప్రార్థనలో కనిపిస్తుంది.

*'తల్లీ నిన్ను దలంచి పుస్తకము చేతన్*
*బూనితిన్ నీవు నా*
*యుల్లం బందున నిల్చి జృంభణముగా*
*నుక్తుల్ సుశబ్దంబుల్ శో*
*భిల్లం బల్కుము'*

అంటూ సరస్వతీమాతను మన మనస్సులో నిల్పి స్పష్టంగా మాట పలికేట్టు చేయాలని ప్రార్థిస్తాం. ఎందుకంటే సరస్వతి 'వీణావరదండ మండితకర' చేతుల్లో వీణ యొక్క శ్రేష్ఠమైన దండం కలది.

ఒకానొక వాయువు కదలిక నాభీమండలంలో ఉదయించి, వెన్నుపూస వెంట ప్రయాణించి, కంఠం చేరటం వల్ల ముఖావయవాల కదలిక చేత వాక్కు ఏర్పడుతుంది. వేదంలో సరస్వతి అగ్ని నుంచి జనించి నట్టుంది. వాయువు కదలిక వల్ల శరీరంలో జనించే అగ్ని, వాక్కు శక్తిరూపంలో బయల్పడుతుంది. అంతఃప్రపంచం వాక్కు రూపంలో వెలువడితే బయట ప్రపంచం ఏర్పడుతుంది. వాక్కు లేకపోతే ప్రపంచమే లేదు. అందుకే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సైతం సరస్వతిని పూజిస్తారు. అటువంటి సరస్వతీదేవి అనుక్షణం మన శరీరంలో నిలుస్తూ, వాగ్రూపంలో బహిర్గతమౌతుంది. అందుకే మనం మాట్లాడే ప్రతి మాటా ఒక రకమైన భగవదార్చన వంటిదే. ఈ నిజం గ్రహిస్తే వ్యక్తి ప్రతి చిన్న విషయానికీ నోరు పారేసుకోడు. అనవసరంగా మాట్లాడడు. అందుకే యోగులు మౌనంగా ఉంటారు. మితంగా మాట్లాడతారు. తమలోని శక్తిని అనవసరంగా వ్యర్థం చేసుకోరు. ఎక్కువగా మాట్లాడని వ్యక్తి మాట్లాడే ప్రతి మాటనూ ప్రతివారూ గౌరవంగా వింటారు. ఆ మాటలకు విలువనిస్తారు. బడబడా వాగేవాడికి విలువ ఉండదు. ఇది మనకు అనుభవమే. మనం మాట్లాడే ప్రతి మాట భగవంతుడి అర్చన లాంటిది కాబట్టే పోతన 'శ్రీనాథు వర్ణించు జిహ్వాజిహ్వ' అన్నాడు. 'నోరు నొవ్వంగ హరి కీర్తి నుడువదేని' అన్నాడు.

మాట పవిత్రతను అర్థం చేసుకున్న తరువాత వ్యక్తిత్వవికాసం కోసం చేయవలసిన పని ఒకటుంది. అది పలు మాటల ప్రోదిని తయారు చేసుకోవటం. ఇంగ్లీషులో దీన్ని 'వొకాబులరీ' (vocabulary) అంటారు. ఈ 'వొకాబులరీ' సాధన కోసం వ్యక్తి ప్రత్యేకంగా శ్రమించాల్సిన అవసరం లేదు. ఉత్తమగ్రంథాలను పఠించాలి. ఉత్తమకావ్యాలను పఠించాలి. మంచి పద్యాలను కంఠోపాఠం చేయాలి. ప్రాచీనకవులు పదాలను ఎంత శక్తిమంతంగా వాడారో గ్రహించాలి.

ఉదాహరణకు అగస్త్యుడు సముద్రోదకపానం చేయటానికి వెళ్లేటప్పుడు ఆ సముద్రాన్ని ఒక నదిలా వర్ణిస్తాడు నన్నయ్య. నిజానికి ఆయన నది అని వర్ణించినా ఆయన వర్ణించింది సముద్రాన్నే. ఆ పదాలు చదువుతూంటేనే కళ్ల ముందు అలలతో ఎగసిపడుతున్న సముద్రం సాక్షాత్కరిస్తుంది.

*రంగదుత్తుంగ తరంగ హస్తంబుల*
*నాడెడు నది వోలె, నతుల వేగ*
*వాత విధూతమై వఱలెడు నది వోలె,*
*బర్వత కందరోపాంత తతుల*
*దొడరెడు నది వోలె, ధ్రువ ఫేన వితతుల*
*నగియెడు నది వోలె, నాగనక్ర*
*మకర కుల క్షుభ్యమాణమై తద్బాధ*
*కోపని యది వోలె నుచ్చ భీమ*

*నినద మగుచునున్న నీరధి యొద్దకు*
*నమరగణముతో మహామునీంద్ర*
*గరుడ ఖచర సిద్ధ గంధర్వ పన్నగ*
*యక్ష గణము తోడ నరుగుదెంచి.*

సముద్రాన్ని చూడని వ్యక్తికి సముద్రాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే అక్షరచిత్రపటం ఇది. పెద్ద తరంగాలు కల నది లాంటిది. పెద్ద గాలి చేత కట్టిన నదిలాంటిది. పర్వత గుహలలో పరవళ్లు తొక్కే నది లాంటిది. పెద్ద పెద్ద నురుగులు లేచిన నది లాంటిది, లోపల ఉన్న మొసళ్లు, ఇతరజంతువులతో క్షుభితమవుతున్న నదిలా ఉందట ఆ సముద్రం. సముద్రాన్ని నదితో పోల్చటం వెనుక ఓ చమత్కారం ఉంది. పౌరాణికంగా సముద్రంలో నీరంతా గంగ నీరే! ఇక, వస్తుసాక్షాత్కారం కలిగేట్టు పదాలను పొదిగి రాయటం గొప్ప

కవితాలక్షణం. నన్నయ పద్యం చదువుతూంటే కలిగే భావం, కళ్ల ముందు నిలబడే అద్భుతమైన దృశ్యం మరే ఇతరపదాలు వాడినా కలగవు. ఇదీ పదాల శక్తి. ఈ శక్తి అర్థం కావాలంటే వ్యక్తి తప్పనిసరిగా ప్రాచీన కావ్యాలు చదివి తీరాలి. పదప్రయోగాలు తెలుసుకోవాలి. పదాల అర్థాలు తెలుసుకోవాలి. కవులు పొందుపరచిన నీతిసూక్తులు బట్టీ పట్టాలి. సందర్భానుసారంగా ఆ సూక్తులను ఉదహరిస్తే మాటకు విలువ లభిస్తుంది. గౌరవం లభిస్తుంది.

అంటే వొకాబులరీ ఒక అమ్ముల పొది లాంటిది. మాటలు దానిలోని బాణాలు. ఎన్ని రకాల పదాలను ఆ అమ్ముల పొదిలో చేరిస్తే వ్యక్తి అంత శక్తిమంతుడన్నమాట. సమయాన్ని బట్టి, సందర్భాన్ని బట్టి ఒకో వాగ్బాణాన్నీ వదులుతుండాలి. అయితే ఈ మాటల బాణాలను విచక్షణతో, జాగ్రత్తగా, పవిత్రంగా వాడాలి. లేకపోతే ప్రమాదం. ఎందుకంటే, ఎటువంటి బాణఘాతాకైనా మందు ఉంది కానీ వాఙ్మయశరానికి మందు లేదు. తిక్కన పద్యం ఈ నిజాన్ని ప్రతిబింబిస్తుంది.

*'నరునకు నది వాఙ్మయమగు*
*శరమై హృదయంబు నాటి చలియింపక దు*
*ర్భరవేదన జేయంగా....'*

కర్ణుడు అర్జునుడిని ఒక మాట అన్నాడు. అది వాఙ్మయశరం, వాక్కుతో చేసిన బాణంలా అర్జునుడి హృదయంలో నాటుకుని దుర్భరవేదన కలిగింది. అర్జునుడు దెబ్బ తిన్న పులి అయ్యాడు. బీభత్సుడయ్యాడు. ఇదీ వాఙ్మయశరానికి ఉన్న ప్రభావం. ఏ బాణం సాధించలేనిది వాగ్బాణం సాధిస్తుంది. కాబట్టి వాగ్బాణ ప్రయోగంలో విచక్షణ సాధించక పోతే వ్యక్తి ఎంత గొప్పవాడైనా వికసితవ్యక్తిత్వం సాధ్యం కాదు. అందుకే పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్న వారు, డబ్బులు సంపాదించినవారు కూడా వాక్కుపై నియంత్రణ లేక అభాసు పాలవుతూంటారు. విలువ కోల్పోతుంటారు.

## మాట – నియంత్రణ

మాట మనిషి మనసును బయటి ప్రపంచానికి ప్రదర్శిస్తుంది. మాట వల్ల మనిషికి ఒక గుర్తింపు వస్తుంది. మాట వల్ల మనిషికి గౌరవం లభిస్తుంది. మాటను బట్టి శత్రువులు సైతం మిత్రులవుతారు. మాట సరస్వతీస్వరూపం. కాబట్టి ప్రతి మాటను దేవికి అర్పించే నీరాజనంలా భావిస్తూ మాట్లాడాలి. మాట ఒక యోగం. ఎలాగైతే యోగలో వాయు

నియంత్రణ వల్ల స్వస్థత సాధన ఉంటుందో, అలాగే మాట వల్ల కూడా శరీరంలో వాయు నియంత్రణ జరుగుతుంది కాబట్టి మాటపై మనిషి ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కరకైన మాటలు మాట్లాడితే శరీరంపై చెడు ప్రభావం ఉంటుంది. సౌమ్యమైన మాటలు, మంచి మాటల ప్రభావం మంచిగా ఉంటుంది. ఇవన్నీ ఇంత వరకూ మాట గురించి మనం చర్చించిన అంశాలు. మాటలు సంస్కారవంతంగా, శక్తిమంతంగా, చమత్కార భరితంగా ఉండాలంటే ఉత్తమసాహిత్యం చదవాలి. ఉత్తమభావ ప్రకటనలను ప్రత్యేకశ్రద్ధతో గుర్తుంచుకోవాలి. ఇది కూడా మన చర్చలోకి వచ్చింది. ఇప్పుడు మనం ఎవరితో, ఎలా మాట్లాడాలి అన్న అంశంపై దృష్టి పెడదాం. సౌమ్యమైన మాట వల్ల రక్తపాతరహితవిప్లవం సాధించగలగటాన్ని చర్చిద్దాం.

ఇది చాలా ప్రాముఖ్యాన్ని వహించే విషయం. ఎందుకంటే మాట కూడా ఒక ఆయుధం వంటిది. విచక్షణతో వాడకపోతే అనవసరమైన కష్టాలకు దారి తీస్తుంది. కాబట్టి కేవలం మర్యాదగా, చమత్కారంగా మాట్లాడటంతో సరిపోదు. విచక్షణతో మాట్లాడటం చాలా అవసరమైన అంశం.

ఒక వ్యక్తి తన జీవితంలో తనకు తెలియకుండానే అనేక రకాల పాత్రలు ధరిస్తాడు. కొడుకుగా, అన్నగా, తమ్ముడుగా, భర్తగా, ఒక ఉద్యోగిగా, సహోద్యోగిగా, సహాధ్యాయుడుగా, ఒక కస్టమర్‌గా, అధికారిగా ఇలా... అనేకపాత్రలు ధరిస్తాడు. అన్ని పాత్రలలో ఒకే రకంగా వ్యవహరించి లాభం లేదు. అలాగని పాత్రను బట్టి మనిషి మారడు. కాబట్టి అన్ని సందర్భాలలో మనిషి మౌలికంగా ఒకడే అయినా, అతని వ్యక్తిత్వం అదే అయినా, అతని మాటలో మార్పు రావాల్సి ఉంటుంది.

*తన యందు నఖిలభూతము లందు నొక భంగి*
*సమహితత్వంబున జరుగువాడు*
*పెద్దల బొడగన్న భృత్యుని కైవడి*
*చేరి నమస్కృతుల్ సేయువాడు*
*కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన*
*మాతృభావము సేసి మరలువాడు*
*తల్లిదండ్రుల భంగి ధర్మవత్సలతను*
*దీనుల గావ చింతించువాడు.*
*సముల యెడ సోదరస్థితి జరుపువాడు*

*దైవతము లంచు గురువుల దలచువాడు*
*లీల లందును బొంకులు లేనివాడు*
*లలితమర్యాదుడైన ప్రహ్లాదు డధిప!*

భారతీయుడన్నవాడు నడచుకోదగిన ఆదర్శప్రవర్తనకు అద్దం పట్టుతుంది భాగవతంలో పోతన రచించిన ఈ పద్యం. ఒకప్పుడు పిల్లవాడికి ఐదేళ్ళు వచ్చి బడికి వెళ్ళే లోపల ఇటువంటి అనేకపద్యాలు కంఠతా వచ్చేవి. దాంతో తన సంప్రదాయం, తన ధర్మం, తన ప్రవర్తన గురించిన అనేకాంశాలు, ఇతరబాహ్యప్రభావాలు పడకముందే, పిల్లవాడి మదిలో నాటుకొనిపోయేవి.

ఈ ఆధునిక యాంత్రిక, గందరగోళప్రపంచంలో ప్రతి వ్యక్తికీ 'ప్రహ్లాదుడు' అత్యుత్తమాదర్శంగా నిలుస్తాడు. ప్రహ్లాదుడి కథ అందరికీ తెలుసు. హిరణ్యకశిపుడి కొడుకు ప్రహ్లాదుడు. లోకకంటకుని కడుపున విష్ణుభక్తుడు జన్మించాడు. రాక్షసగురువుల వద్ద విద్యాభ్యాసం చేశాడు. తాను నమ్మిన విషయాలకు వ్యతిరేకంగా వారు చేసిన బోధనలను ఖండించలేదు. 'నేనీ చదువును చదవను' అంటూ హీరో డైలాగులు కొట్టలేదు. తండ్రిని వ్యతిరేకించి వాదించలేదు. తోటి విద్యార్థులకు ఉపన్యాసాలిచ్చి నోరు పారేసుకోలేదు. గురువులతో వాదించి, హీరోల్లా వారిని వెక్కిరిస్తూ పాటలు పాడలేదు. మౌనంగా తన పని తాను చేసుకుపోయాడు. ఆవేశాలకు తావివ్వ లేదు. విచక్షణకు ప్రాధాన్యమిచ్చాడు. బాలుడైన ప్రహ్లాదుడు ప్రదర్శించిన విచక్షణ పెద్దలు ప్రదర్శించలేదు.

*'ఏ పగిది వారు సెప్పిన,*
*నా పగిదిం చదువు గాని యట్టిట్టని యా*
*క్షేపింపడు దా నన్నియు,*
*రూపించిన మిథ్యలని నిరూఢమనీషన్.'*

తనకు ఇష్టం ఉన్నా, లేకున్నా వారు చెప్పిన చదువు చదివాడు. 'ఇదేమిటి? అదేమిటి?' అని ప్రశ్నించ లేదు. కానీ తన స్వీయవ్యక్తిత్వాన్ని మాత్రం నిలుపుకున్నాడు. తన కిష్టమైన విషయాన్ని వదలలేదు. ఎదుటివారి ఇష్టాన్ని ప్రశ్నించలేదు. ఎందుకంటే, ఈ ప్రపంచం సర్వం భగవంతుడి సృష్టి అన్న విజ్ఞానం ఉన్నవాడు, తనలోనూ, ఎదుటివాడి లోనూ దైవాంశను దర్శించగలిగేవాడు ఎవరిని ద్వేషిస్తాడు? ఎవరిని దూషిస్తాడు? ఎవరితో వాదిస్తాడు? అనవసరంగా ఆవేశం ప్రదర్శించి భగవంతుడు అందించిన శక్తిని ఎందుకు

వృథా చేస్తాడు? ఈ విచక్షణ ఉన్నవాడు కాబట్టి తాను నిజమని నమ్మిన అంశాన్ని వదలలేదు. ఇతరులు దూషించినా ఆవేశపడలేదు.

తన హీరోని ఎదుటివాడు ఏదో అన్నాడని బాలురే కాదు, పెద్దలూ తన్నుకునే కాలం ఇది. అభిమాన సంఘాల పేరిట ఎదిగినవారు సైతం బాలుర కన్నా కనాకష్టంగా ప్రవర్తిస్తూ తమ జీవితానికి విలువలేనట్టు ప్రవర్తించటం మనం చూస్తూనే ఉన్నాం. అటువంటివారికి ప్రహ్లాదుడి గురించిన జ్ఞానం బాల్యంలోనే లభిస్తే! అభిమానసంఘాలే కాదు, తమను తప్పు దారి పట్టించే వారినెవరినైనా గుడ్డిగా అనుసరించటం మానేస్తారు.

ఇక హిరణ్యకశిపుడు ప్రహ్లాదుడినే కాదు అతడు దైవంలా భావించే విష్ణువునూ దూషించాడు. ప్రహ్లాదుడిని హింసించాడు. విష్ణువును దూషించి నందుకు ప్రహ్లాదుడు ఆవేశపడలేదు. 'నీ అంతు చూస్తా'నని హీరోల్లా సవాళ్లు విసరలేదు. ఈ కాలం సినిమాల్లోని ఆదర్శపాత్రల్లా తండ్రిని ఎదిరించి అవమానకరంగా మాట్లాడలేదు. తండ్రి వాదాన్ని ఖండించలేదు కూడా. కేవలం తన వాదాన్ని వినిపించాడు. తన దృక్కోణాన్ని వివరించాడు. మూర్ఖుడి లక్షణాలు చెప్పి మూర్ఖుడు కావద్దని తండ్రికి హితబోధ చేశాడు. ఇంత చేయాలంటే మనిషికి ఎంత ఆత్మవిశ్వాసం ఉండాలి! ప్రహ్లాదుడు పలికిన పలుకులు ఎంత మధురమైనవంటే ప్రతి వ్యక్తీ నిత్యం పారాయణం చేయవలసిన అమృతతుల్యాలు.

*చదివించిరి నను గురువులు,*
*చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులు నే*
*జదివినవి గలవు పెక్కులు,*
*చదువులలో మర్మ మెల్ల చదివితి తండ్రీ*

చదువు నిత్యజీవితంలో ఉపయోగపడుతుంది. అది శరీరానికి. విద్య మనస్సుకి. వ్యక్తి మనిషిలా ఎదగటంలో తోడ్పడుతుంది. ఎంతో మర్మంగా, గుంభనగా ఈ నిజాన్ని మొదటి అడుగులోనే తండ్రికి స్పష్టం చేశాడు.

'కమలాక్షు నర్చించు కరములు కరములు' అని తన సిద్ధాంతాన్ని ప్రకటించాడు. ఆ పైన

*'దేవదేవుని జింతించు దినము దినము,*
*చక్రహస్తుని బ్రకటించు చదువు చదువు*

*కుంభినీధవు జెప్పెడి గురుడు గురుడు,*
*తండ్రి! హరి చేరు మనియెడి తండ్రి తండ్రి.*

అంటూ తన చుట్టూ ఉన్నవారి ఆలోచనలలో లోపాలను మెత్తగా ఎత్తి చూపాడు. 'తండ్రీ నన్ను మనిషిలా ఎదగమను. యాంత్రికజీవితంలోని గొర్రెల్లో ఓ గొర్రెలా బతకమనకు' అని ఎంతో లోతుగా చెప్పాడు. తన తోటి విద్యార్థులతో కూడా 'తనకంతా తెలుసు' అన్నట్టు ప్రవర్తించలేదు. 'సముల యెడ సోదరస్థితి' జరుపుతూ, ఓ సోదరుడిలా వారికి నిజానిజాలు వివరించాడు.

*బాలకులార రండు మన ప్రాయపు*
*బాలురు కొంద ఱుర్విపై*
*గూలుట గంటిరే గురుడు*
*క్రూరుడ నర్థచయంబునందు దు*
*శ్శీలత నర్థకల్పనము*
*జేసెడి గ్రాహ్యము గాదు శాస్త్రముల్*
*మే లెఱిగించెదన్ వినిన*
*మీకు నిరంతర భద్ర మయ్యెడిన్.*

ప్రస్తుతసమాజంలో విద్యార్థుల సంశయాలను తీర్చే బోధన ఇది. మానవులు అందరూ వందేళ్ళు బ్రతకరు. పసి వయసువారూ మరణిస్తారు. కాబట్టి జీవితం ఉన్నప్పుడే భగవన్నామస్మరణ చేయాలి. గురువు క్రూరు డెందుకయ్యాడంటే ఉపయోగపడని చదువు చెప్తున్నాడు. – ఆర్థికం, రాజకీయాలు నేర్పుతున్నాడు కానీ నీతినియమాలు, విలువలు నేర్పటం లేదు. అర్థం లేని వాటిలో కల్పనల వల్ల లేని అర్థాలు సృష్టిస్తున్నాడు. ఎందుకంటే రాజాజ్ఞకు లోబడి బోధిస్తున్నాడు. కాబట్టి ఆ బోధనలోనూ గురువు తప్పు లేదు. కానీ మనం విచక్షణను ప్రదర్శించాలి.

*'కంటిరే మనవారు ఘనులు గృహస్థులై,*
*విఫలులై కైకొన్న వెఱ్ఱితనము*
*భద్రార్థులై యుండి పాయరు సంసార*
*పద్ధతి నూరక పట్టువడిరి...'*

అంటూ నిజాన్ని వివరించాడు. తోటివారి అభ్యున్నతికి తోడ్పడ్డాడు. ఒక రకంగా చూస్తే నిజాన్ని తాను ఆచరిస్తూ, సౌమ్యంగా అందరికీ బోధించి విజయం సాధించిన

ప్రహ్లాదుడు నిశ్శబ్ద సౌమ్య సాత్త్విక విప్లవకారుడు. రాక్షసుల నడుమ పుట్టి వారికి విష్ణుభక్తి బోధించి, రాజు పెట్టిన బాధలన్నీ అనుభవించి మరీ నెగ్గినవాడు. అలా ప్రహ్లాదుడు విజయం సాధించటం వెనుక తాను నమ్మిన సిద్ధాంతం పట్ల అచంచల విశ్వాసం, ఆచరణలో నిజాయితీ, మాటలో సత్యం, తన సంస్కృతీ సంప్రదాయాలపట్ల గౌరవం ఉన్నాయి. అందుకే అతని మాటలకు ఆ శక్తి వచ్చింది. ఏనుగులు అతడిని ఏమీ చేయలేకపోయాయి. విషసర్పాలు వ్యర్థమయ్యాయి. నిప్పు తాకలేకపోయింది. ఎటువంటి యుద్ధం చేయకుండా, రక్తపాతం లేకుండా, విశ్వాసం ద్వారా, దాన్ని ప్రకటించే మాట ద్వారా రాక్షససామ్రాజ్యాన్ని నాశనం చేసి దైవీసామ్రాజ్యాన్ని స్థాపించాడు ప్రహ్లాదుడు. ఇదీ భారతీయసంప్రదాయంలో విప్లవం జరిగే తీరు. సమసమాజం స్థాపించేసి ప్రజలందరినీ సమానం చేసేయాలన్న ఆదర్శసాధన కోసం ప్రజలనే హింసించి, చంపి పశువుల్లా ప్రవర్తించేవారందరికీ ఉత్తమవ్యక్తిత్వం సాధించే అద్భుతాల స్వరూపాన్ని బోధిస్తుంది 'ప్రహ్లాదుడి' వ్యక్తిత్వం. మన పాపాలను భరించేందుకు చచ్చి, ఆపై అందరినీ తమ మతంలోకి మార్చాలనుకున్నవారికీ ప్రహ్లాదుడి వ్యక్తిత్వం గుణపాఠాలు నేర్పుతుంది.

ఉత్తమసాహిత్యపఠనం, ఉత్తముల సాంగత్యం, ప్రేమపూరితసంభాషణ, విచక్షణ సహితమైన ప్రవర్తనలు వ్యక్తిత్వవికాస సోపానాధిరోహణకు దారులు. అయితే వీటిలో మరో అంశం ఉంది. అది సభలో మాట్లాడే విధానం. ప్రస్తుతం దీన్ని 'పబ్లిక్ స్పీకింగ్' అంటారు. ఈ 'పబ్లిక్ స్పీకింగ్' కూడా వ్యక్తిత్వవికాసంలో ఓ భాగం.

## పబ్లిక్ స్పీకింగ్

*శుభముల నొందని చదువును*
*నభినయమును రాగరసము నందని పాటల్*
*అభిలాష లేని కూటమి*
*సభ మెచ్చని మాటలెల్ల జప్పన సుమతీ!*

మంచిని చేకూర్చని చదువు, ఇంపును, హాయిని కలిగించని పాటలు, ఉత్సాహాన్నివ్వని కలయిక, సభాసదులు మెచ్చని మాటలు – సారం లేనివి.

మామూలుగా ఇద్దరు వ్యక్తులు కలిసినప్పుడు మాట్లాడే మాటలు వేరు. ఒక గుంపుగా మిత్రులు కలిసినప్పుడు జరిపే వ్యవహారం వేరు. సభలో జనులు తీరి కూర్చునప్పుడు పలికే పలుకులు వేరు. సభలో మాట్లాడాలనుకున్నవారు ఈ సున్నితమైన తేడాను

గ్రహించాలి. ఎందుకంటే, సభ మెచ్చని మాటలు మాట్లాడేవారు ఎంత విజ్ఞానవంతులైనా, ఎంత తెలివి గలవారైనా ప్రజల అభిమానపాత్రులు కాలేరు.

'పబ్లిక్ స్పీకింగ్' అన్నది కత్తి మీద సాము లాంటిది. కానీ ఒకసారి సభలో మాట్లాడి ప్రజలను అలరించటం అన్నది అలవాటైతే, ఎటువంటి సభలోనైనా ప్రజలను ఉర్రూత లూగించటం సులభమౌతుంది.

ఆధునిక సామాజికపరిస్థితులలో పదిమంది ముందు ధైర్యంగా మాట్లాడి వారి మెప్పు పొందగలిగేవాడు సామాజికంగా పైకెదగటం సులభం. ముఖ్యంగా రాజకీయాలలో ప్రవేశించాలనుకునేవారు, పదిమందికీ తన దృక్కోణాన్ని వివరించి, ప్రభావితం చేయాలనుకునేవారు పదిమంది ముందు మాట్లాడగలగటాన్ని తప్పనిసరిగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది.

పండిత జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభభాయి పటేల్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి వారంతా తమ ఉపన్యాసాలతో ప్రజలను ప్రభావితం చేశారు. స్వాతంత్ర్యోద్యమానికి ఉద్యుక్తులను చేశారు. గమనిస్తే, వీరంతా ఒక ఉద్యమతరంగ శిఖరంపై నిలిచి, ఆ ఊపులో ఉపన్యాసాలను వెలువరించినవారు. వారి ఉపన్యాసాల కన్నా వారి వ్యక్తిత్వం, వారి ఇమేజ్, వారు చేపట్టిన ఉద్యమ ఆవేశం వారి పదాలకు శక్తినిచ్చింది. వారి మాటలకు ప్రజలు స్పందించేట్టు చేసింది.

అంటే, ఒక వ్యక్తి గొప్ప 'మాటకారి' కానవసరం లేదు. 'పబ్లిక్ స్పీకింగ్'లో ప్రతిభ కనబరచాలనుకునేవారు చేయవలసిన పని సభకు వచ్చే ప్రజల 'మూడ్'ను గమనించాలి. సభకు వచ్చే శ్రోతలు ఏం వినేందుకు వస్తున్నారో గమనించాలి. అంటే, ప్రవాహదిశను గమనించి, ఆ దిశలోనే ప్రయాణించటం చేయాలన్నమాట. వేదాంత ఉపన్యాసాలు వినాలని వచ్చినవారికి వైజ్ఞానికాంశాలు వివరించాలన్న ప్రయత్నం వ్యర్థం. ఏదో పది నిమిషాలు వినోదంగా గడపాలని వచ్చినవారి ముందు వేదాంతసంభాషణలు చేయటం కూడని పని. అందువల్ల ప్రజలను ఇబ్బంది పెట్టటమే కాక, ఉపన్యాసకుడూ ఇబ్బంది పడతాడు. కాబట్టి, ఉపన్యాసకుడు, ముందుగా చేయవలసింది శ్రోతల మనోభావాలను ఆకట్టుకోవటం.

చికాగోలో ఉపన్యాసం ఇవ్వటానికి వెళ్ళినప్పుడు స్వామి వివేకానంద ఎవరో ఎవరికీ తెలియదు. ఆయనకు సమయం ఇచ్చేందుకే ఎవ్వరూ ఇష్టపడలేదు. అయిష్టంగా,

మొక్కుబడిగా సమయం కేటాయించారు. ఐతే ఆరంభవాక్యాలతోనే వివేకానంద అక్కడి ప్రజల మనస్సులను గెలుచుకున్నారు. సంక్లిష్టమైన, మతపరమైన ఉపన్యాసాల నడుమ శ్రోతలను 'సోదరసోదరీమణులు'గా సంబోధించటంతోటే, శ్రోతల పైమెట్టునున్న వాడిలా కాక, వారిలో తానూ ఒకడైపోయాడు. విశ్వవేదికపై వివేకానందుడు ఓ శక్తిగా ఉద్భవించాడు.

ఉపన్యాసాలిచ్చేవారు గమనించాల్సిన అంశం ఇది. వీలైనంత త్వరగా ఎదురుగా ఉన్న శ్రోతలతో సంబంధం ఏర్పరచుకోవాలి. శ్రోతల కన్నా తాను ఒక మెట్టు పైనున్న వాడిలా కాక తానూ శ్రోతలలో ఒకడన్న భావనను శ్రోతలకు కలిగిస్తే తోటే ఉపన్యాసకుడు సగం విజయం సాధించినట్టే.

ఆధునికసమాజంలో 'వాజ్‌పేయి' ఉపన్యాసాలంటే, సభల పేరు చెప్తే ఆమడ దూరం పారిపోయేవారు కూడా సభలకు పరుగెత్తి వస్తారు. ఇతరరాజకీయనాయకులంతా ఓ వైపు, ఉపన్యాసాలలో వాజ్‌పేయి ఒక్కడూ ఓ వైపు. గమనిస్తే, వాజ్‌పేయి ఉపన్యాసాలలో ఏ నాడూ తాను ఓ మెట్టు పైనున్నాడన్న భావన శ్రోతలకు కలగనివ్వడు. పైగా చమత్కార పూరితమైన సంభాషణలతో సభను అలరిస్తాడు. మామూలుగా మనం మాట్లాడే పదాలనే విరిచి పలకటం, వాటిని పలుకుతున్నప్పుడు తానూ ఆనందం అనుభవిస్తూ పలకటం, వల్ల వాజ్‌పేయి మామూలు మాటలు కూడా సభలో ప్రేక్షకులను ఉర్రూతలూపుతాయి. పైగా, తన ఉపన్యాసంలో సమకాలీనసంఘటనలను, ప్రాంతీయఘటనలను వ్యంగ్యంగా ప్రస్తావించటంతో వాజ్‌పేయి ఉపన్యాసాలు ప్రేక్షకులను అలరిస్తాయి.

వాజ్‌పేయి తరువాత శ్రోతలను అంతగా అలరించేవి అబ్దుల్ కలామ్ ఉపన్యాసాలు. వాజ్‌పేయి ధోరణికి, వాక్శైలికి పూర్తిగా భిన్నమైంది అబ్దుల్ కలాం ధోరణి. అయితే ఇద్దరిలో మనం గమనించాల్సిన అంశం, వారు వీలైనంతగా శ్రోతలకు దగ్గరగా ఉండాలని ప్రయత్నిస్తారు. శాస్త్రవేత్తగా తన ఇమేజీని వాడుకుంటూ, ప్రతి ఒక్కరికీ మంచిని బోధించాలన్న నిజాయితీని ప్రదర్శిస్తూ, అబ్దుల్ కలామ్ శ్రోతలను స్ఫూర్తిమంతం చేయగలుగుతున్నాడు. గమనిస్తే రాజకీయసంబంధిత ఉపన్యాసాలిస్తున్నప్పుడు అబ్దుల్ కలామ్ వ్యవహారశైలి మొక్కుబడిగా ఉంటుంది. అదే పిల్లల నడుమ, విద్యార్థుల నడుమ ఆయన చైతన్యంతో ఉట్టిపడుతూ, చైతన్యాన్ని కలిగిస్తాడు.

దీన్ని బట్టి గ్రహించాల్సిందేమిటంటే, ఉపన్యాసకుడు తనకు ఏ అంశాలపై పట్టు ఉందో, ఏ అంశంపై తాను శక్తిమంతంగా మాట్లాడగలడో తెలుసుకొని ఉండాలి. లేకపోతే

వేదికనెక్కి ఆ భాసు పాలు కాక తప్పదు. ప్రస్తుతం మన నాయకులనేకులకు తాము మాట్లాడాల్సిన అంశాలపై పట్టు ఉండదు. ఏదో రొటీన్‌గా, మొక్కుబడిగా మాట్లాడతారు. దాంతో సభలంటేనే విసుగు పుడుతుంది. సాహిత్య సభలు కూడా ఇలాగే తయారయ్యాయి.

సాహిత్యసభలు తమ పూర్వవైభవాన్ని కోల్పోవటం వెనుక ఉపన్యాసకులలో నిజాయితీ లోపించటం ప్రధానకారణం. పొగడ్తలతో ఒకరి నొకరు ఆకాశానికి ఎత్తేయటం, ఏ సభకు ఆ సభలోని వ్యక్తే కాళిదాసుకు పెద్దన్న అన్నట్టు మాట్లాడటం సర్వసాధారణమై పోయింది. విమర్శలు భరించే సహనం లేకపోవటంతో పొగడ్తలే దివ్యౌషధంగా మారాయి. దాంతో సాహిత్యసభలు విలువను కోల్పోయి పరిహాసాస్పదం అయ్యాయి.

సభల్లో మాట్లాడేటప్పుడు ఉపన్యాసకుడు ముందుగా తాను మాట్లాడే అంశం గురించి క్షుణ్ణంగా తెలుసుకుని ఉండటం తప్పనిసరి. చమత్కారపూరితసంభాషణ లేకున్నా, విభిన్నభావాలు ప్రదర్శించలేకున్నా, శ్రోతల దృష్టిని నిజాయితీగా, విజ్ఞానవంతంగా ఉండే ఉపన్యాసకుడు ఆకర్షించగలుగుతాడు. ఒక వ్యక్తి ఎంత గొప్ప ఉపన్యాసాలివ్వగలిగిన వాడైనా శ్రోతలంటే, సభామర్యాదకు గౌరవం ఇవ్వకపోతే ఆభాసుపాలవుతాడు. ఉదాహరణకు ఓ పుస్తకావిష్కరణ సభలో, పుస్తకసమీక్షకుడుగా వచ్చిన ఉపన్యాసకర్త, ఆ పుస్తకాన్ని 'శతాబ్దంలోనే ఉత్తమపుస్తకం' అని పొగిడి, రచయితను 'దశాబ్దంలోనే ఉత్తమ రచయిత' అని ఆకాశానికి ఎత్తేసి 'సారీ' నేను రోజూ పది చోట్ల ఉపన్యాసాలివ్వవలసి రావటం వల్ల పుస్తకం పది పేజీలే చదివాను' అన్నాడనుకోండి, ఆయన అంత వరకూ పొగడిన పొగడ్తల విలువ పోవటమే కాదు, ఆయన సైతం అభాసుపాలవుతాడు. సభ మొత్తం హాస్యాస్పద మవుతుంది. 'పబ్లిక్ స్పీకింగ్'లో ప్రావీణ్యం సంపాదించాలనుకునేవారు తప్పనిసరిగా గుర్తుంచుకోవలసిన నియమం ఇది. ఉపన్యాసం ఇవ్వటంలో నిజాయితీ అవసరం. కానీ అతినిజాయితీ అనర్థదాయకం.

'గంగిగోవు పాలు గరిటెడైనను చాలు' అన్న రీతిలో ఉపన్యాసం, ఎంత సేపు ఇచ్చాం అన్నది కాకుండా, ఎంత సూటిగా, స్పష్టంగా ఇచ్చాం, ఎంతవరకూ శ్రోతలను స్పందింపచేయగలిగాం అన్నది ముఖ్యం. మైకు పుచ్చుకుని మైకం వచ్చినట్టు ప్రవర్తించటం వల్ల లాభం లేదు.

ప్రస్తుతం 'సామవేదం షణ్ముఖశర్మ' తన వాక్కు ద్వారా శ్రోతలను ఉర్రూతలూ గిస్తున్నారు. ఆయన మాటలలో నిజాయితీ కనిపిస్తుంది. చెప్పే అంశాన్ని తానూ అనుభవిస్తూ, తన్మయత్వంతో వివరించటం తెలుస్తుంది. సాహిత్యాంశాలలోని మాధుర్యాన్ని

ఆయన అనుభవించి, ఆనందించటం చూసిన శ్రోత తాను కూడా స్పందిస్తాడు. ఆయన బోధించే అంశాల పట్ల క్షుణ్ణమైన అవగాహనతో పాటుగా, దానికి సంబంధించిన ఇతరాంశాలను జోడించి, సమూలంగా, సంపూర్ణంగా వివరించటంతో, వింటున్న శ్రోత ఆ పాండిత్యానికి ముగ్ధుడవుతాడు. ఉపన్యాసం విన్న తరువాత తానెంతో విజ్ఞానాన్ని సంపాదించిన అనుభూతి పొందుతాడు. ఉపన్యాసకర్తగా పేరు సంపాదించాలనుకునేవారు గమనించవలసిన అంశం ఇది. విషయాన్ని మూస పోసిన ధోరణిలో కాక, సరి కొత్త దృక్కోణంలో వివరించటం వల్ల కూడా ప్రజలను ఉత్తేజపరచవచ్చు. మామూలుగా కనిపించే అంశాలలోనే అద్భుతాన్ని దర్శింపచేయటం ద్వారా ప్రేక్షకులను అలరింప చేయగలగటమే కాదు, వారి గౌరవమర్యాదలనూ పొందవచ్చు.

కాబట్టి ఉపన్యాసాల ద్వారా అలరించి, తమ వ్యక్తిత్వ ముద్రను సమాజంపై వేయాలనుకునేవారు విజ్ఞానవంతులై ఉండాలి. తాము నమ్మిన ఆదర్శంపై, సూత్రాలపై లోతైన అవగాహన కలిగి ఉండాలి. తాను ఉపన్యాసం ఇచ్చేందుకు వెళ్తున్న ప్రాంత పరిస్థితులను కూడా దృష్టిలో ఉంచుకోవటం తప్పనిసరి. ఎక్కడైనా 'రామకృష్ణ' అంటే 'రామకృష్ణ పరమహంస' గుర్తుకు వస్తాడేమో కానీ, వరంగల్ వెళ్ళి 'రామకృష్ణ' అంటే వాళ్ళకు నక్సలైట్ నాయకుడే గుర్తుకువస్తాడు. ఇలాంటి ప్రాంతీయమనోభావాలను పరిగణనలోకి తీసుకుని, ఉపన్యాసంలో ఆయా సున్నితాంశాలను అతిజాగరూకతగా ప్రస్తావించాల్సి ఉంటుంది.

ఉపన్యాసకర్త తనదంటూ ఓ ప్రత్యేకసంభాషణ పద్ధతిని జాగ్రత్తగా ఏర్పరచుకోవాలి. ఇంగ్లీషులో 'మానరిజం' అంటారు. ఉపన్యాసకుడి మానరిజం, అతడి విగ్రహానికి తగ్గట్టు ఉంటే, వెంటనే ప్రేక్షకులను ఆకర్షించే వీలుంటుంది. ప్రచారప్రభావం వల్ల ప్రేక్షకులు ఆయా మానరిజంలు చూసేందుకే ఉపన్యాసం పట్ల ఆకర్షితులవుతారు. అంటే ఉపన్యాసకులకు కాస్త నటన కూడా తెలిసి ఉండాలి. అవసరమైతే ఆవేశం ప్రదర్శించాలి. అక్కడక్కడా హాస్యం చిలకరించాలి. ఉండి ఉండి కరుణ కురిపించాలి. అవకాశం దొరికి నప్పుడల్లా గాంభీర్యం చూపించాలి. ఈ రకంగా తాను నమ్మిన అంశాన్ని నిజాయితీగా, సోదాహరణగా, లోతుగా వివరిస్తూ ప్రేక్షకులలో ఒకడై, ఊపునిచ్చే ఉపన్యాసప్రభావం అత్యంతశక్తిమంతంగా ఉంటుంది.

ఇది సాధించాలంటే వ్యక్తి ఉత్తమ ఉపన్యాసకారుల ఉపన్యాసాలు చదవాలి. వారు ఉపన్యాసాలిచ్చే ధోరణిని గ్రహించాలి. ఉత్తమసాహిత్యం పఠించాలి. మంచి కొటేషన్లు,

ఉదాహరణలు చమత్కారాలు నేర్చుకోవాలి. సభామర్యాద పాటించాలి. ముఖ్యంగా, తానివ్వ వలసిన ఉపన్యాసం గురించి వేదిక ఎక్కే ముందే స్పష్టమైన ఆలోచన ఏర్పరచుకోవాలి. వీలైతే తన ఊహలో ఉపన్యాసం ఇస్తున్నట్టు, ఊహించాలి. దాని ప్రభావం ప్రేక్షకులపై ఎలా ఉంటుందోనని ఆలోచించాలి. వీలైనంతవరకూ తన ఉపన్యాసం ప్రేక్షకులను అలరించినట్టు ఊహించుకోవాలి. 'యద్భావం తద్భవతి' అంటారు. కాబట్టి తాను విజయం సాధించినట్టు ఊహించుకునేవాడు విజయం సాధించి తీరతాడు. భయపడుతూ, చెడు ఊహించేవాడు కంగారుపడి అపజయాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. 'అంగట్లో అన్నీ ఉన్నా నోట్లో శనిని ఉంచే భయాలను ఎదుర్కోవటం ఎలాగో చర్చిద్దాం.'

✣ ✣ ✣

# వ్యక్తిత్వం - భయం

## భయం - అభయం

*చంద మెఱిఁగి మాట జక్కగా చెప్పిన*
*నెవ్వడైన మా రికేల పలుకు?*
*చంద మెఱిఁగి యందు సందర్భ మెఱుగుమా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

మాట సందర్భాసందర్భాలు, అర్థాలు తెలిసి చక్కగా మాట్లాడితే ఎవరూ ఎదురు చెప్పరు. ఎదురు చెప్పటానికి వారి దగ్గర ఏమీ ఉండదు. కాబట్టి నేర్పుతో, చక్కగా, మృదుమధురంగా మాట్లాడటం నేర్చుకోవాలి. చక్కగా మాట్లాడటం ఒక కళ.

'మాట' గురించి ఇంత మంచి పద్యం రచించిన వేమనను స్మరిస్తూ, ప్రస్తుతానికి మాటకు వీడ్కోలు చెప్పి, మాటను పరోక్షంగా ప్రభావితం చేసే అత్యంతశక్తిమంతమైన మనసు భావన 'భయం' వైపు అడుగులేద్దాం.

ఆహార, నిద్రా, భయ, మైథునాలు సకలజీవజాలాల మౌలికలక్షణాలు. ఆహార ప్రాధాన్యం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆహారం శక్తినిస్తుంది. సరైన ఆహారం సేవించకపోతే మనిషి అనారోగ్యం పాలవుతాడు. కాబట్టి ఆహారం లేకపోతే జీవులు జీవించలేవు. అలాగే నిద్ర అత్యంత ఆవశ్యకమైన అంశం. కంటి నిండా నిద్ర, కడుపు నిండా తిండి, తగిన శారీరకవ్యాయామాన్ని మించిన ఆరోగ్యసూత్రం మరొకటిలేదు. మైథునం లేకపోతే సృష్టే లేదు. ఆహార, నిద్రా, మైథునాలు జీవులకెంత ప్రాధాన్యమో భయం కూడా అంత ప్రాధాన్యం వహిస్తుంది.

భయాన్ని జయించటం ఎలాగో ఆలోచించే కన్నా ముందు భయస్వరూప స్వభావాలను గుర్తించి తెలుసుకోవటం తప్పనిసరి. ఎందుకంటే ఏ విషయంపైనైనా విజయం సాధించాలంటే ముందుగా ఆ విషయంపై సమగ్రమైన అవగాహన ఉండాలి.

ఆపై ఆ విషయాన్ని గెలిచేందుకు ప్రణాళికలు వేయవచ్చు. ఆ అంశంలోని బలహీనత ఆధారంగా దాడి చేసి విజయం సాధించవచ్చు.

ముందుగా మనిషికే కాక ఇతరజీవులలో భయస్వరూపాన్ని తెలుసుకుంటే అప్పుడు సకలజీవులలో భయమనే భావన ఒకటే ఐనా మనిషి భయానికి, ఇతరజీవులలోని భయంలోఉన్న తేడా అర్థమవుతుంది. పుట్టిన ప్రతి ప్రాణికీ మరణం తప్పదు. ఇది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ పుట్టిన ప్రతి ప్రాణికి జీవించటంకోసం పోరాటం చేయటం తప్పదు. మరణం అనివార్యం కదా అని స్వీయ రక్షణను విస్మరించటం కుదరని పని. చివరిక్షణం వరకూ పోరాడుతూనే ఉండాలి. మనిషికి మెదడు ఉంది. తెలివి ఉంది. ఆలోచించగల శక్తి ఉంది. ప్రమాదాన్ని ఊహించి దాన్ని ఎదుర్కొనేందుకు ప్రణాళికలు వేయగలడు మనిషి. అందుకే జీవప్రపంచంలో అన్ని జీవుల కన్నా అతి బలహీనమైన రక్షణవ్యవస్థ మనిషికి ఉంది.

ఇతరజీవులు తమ 'ఇన్‌స్టింక్ట్' పై ఆధారపడతాయి. వాటికి గ్రహింపు జ్ఞానం ఉండదు. అందుకని ప్రమాదాన్ని ఎదుర్కోవటం స్వాభావికంగా జరిగిపోతుంది. వాటికి ఏ క్షణం, ఏ వైపు నుంచి ఎలా ప్రమాదం ముంచుకొస్తుందోనన్న 'భయం' తప్ప మరో భయం ఉండదు. 'రేపెలా?' అన్న ఆలోచన ఉండదు. వాటికి ఉన్న ఏకైక భయం ప్రాణభయం.

అందుకే, జీవులు అనుక్షణం ప్రమాదం పొంచి ఉన్నట్టు 'అలర్టు'గా, అప్రమత్తంగా ఉంటాయి. ఒక ఉడతను గమనించండి. అది గబగబా తింటూ చుట్టూ చూస్తూంటుంది. చిన్న అలికిడి అయితే చాలు, చకచకా రక్షణ ఉన్న స్థలానికి పరుగిడుతుంది. పక్షులు, ఎలుకలు.... ఇతరజీవులన్నీ ఇంతే. ఆహారం కోసం వెతకటం, దొరికింది తినటం, ప్రమాదం వస్తే తప్పించుకునేందుకు సిద్ధంగా ఉండటం... ఇంతే జీవుల జీవితం. అందుకే, గమనిస్తే, అడవిలో జంతువులన్నీ గుంపులుగా తిరుగుతాయి. సింహం, పులి వంటి జంతువుల బారి నుంచి తప్పించుకోవాలంటే, ఒంటరిగా కన్నా సామూహికంగా ఎదుర్కోవటం మేలు. అది వాటికి ఎవరూ నేర్పనక్కర్లేదు. వాటి జీవలక్షణం అది.

పర్వతం వంటి ఏనుగులే కాదు, అన్ని జంతువులూ కూడా తమ పిల్లలను గుంపు మధ్యలో ఉంచుతాయి. ఎందుకంటే, పిల్లలకింకా ప్రమాదాన్ని ఎదుర్కొనే శక్తి లేదు కాబట్టి, గుంపు మధ్యలో ఉంటే వాటి రక్షణ సులభమౌతుంది. తిమింగలాలు కూడా తమ పిల్లలను వెంట తీసుకునే తిరుగుతాయి. కానీ వాటిని తినే హంతక తిమింగలాలు, సొరచేపలు, తల్లి నుంచి వేరు చేసి పిల్లలను తినేస్తాయి.

అలాగే ఒక బొద్దింకను గమనించండి. అలికిడి ఐతే చాలు, నీడలోకి పరుగిడుతుంది. చివరి క్షణం వరకూ గిలగిలా కొట్టుకుంటుంది. ఒక జింక, ఓపిక ఉన్నంత వరకూ పులి నుంచి తప్పించుకుని పరుగిడుతుంది. దీన్ని బట్టి చూస్తే, మనిషి మినహా మిగతా జీవుల భయం 'ప్రాణభయం' అని అర్థమవుతుంది. అదే ఆలోచనలున్న మనిషి విషయానికి వస్తే మనిషిలో ప్రాణభయం బాల్యంలో ఊహ తెలియనంతవరకే ప్రత్యక్షంగా ఉంటుంది. ఊహ తెలిసి, ఆలోచనలు వచ్చేసరికి ప్రాణభయం నేపథ్యంలోకి వెళ్తుంది. అనేక ఇతర భయాలు తెర పైకి వస్తాయి. ఐతే అన్ని భయాలకూ కేంద్రమైన మరణభయం అణిగి ఉంటుంది తప్ప పూర్తిగా అదృశ్యమైపోదు. అణగి ఉన్న ఈ భయం, అనేక ఇతర భయాలూ మనిషిని పట్టి పీడించేందుకు పరోక్షంగా దోహదపడుతుంది.

మహాభారతంలో యక్షప్రశ్నల్లో ఒక ప్రశ్న 'తనకు మరణం తప్పదని తెలిసినా మనిషి తాను శాశ్వతుడనని ఎందుకనుకుంటాడు?' అన్నది. ఈ ప్రశ్నకు సమాధానం అర్థమై అనుభవిస్తే భయ స్వరూపం సంపూర్ణంగా అర్థమౌతుంది.

ఇతరజీవులకు తమ జీవితం అశాశ్వతం అన్న ఆలోచన, గ్రహింపులేవు. అవి పుడతాయి, పుడుతూనే మరణాన్ని తప్పించుకొనేందుకు పోరాటం ప్రారంభిస్తాయి. పోరాటంలో ఓడిపోయి మరణిస్తాయి. ఇంతే వాటి జీవితం.

మనిషికి 'జాతస్య మరణం ధ్రువం' అని తెలుసు. పుట్టిన ప్రతి ప్రాణీ గిట్టక మానదని తెలుసు. కాబట్టి మరణం అంటే భయపడాల్సిన అవసరం లేదనీ తెలుసు. ఎప్పుడో రాబోయే మరణం గురించి ఇప్పుడే జీవించటం మానేయటం అర్థరహితం అని తెలుసు. మరణం వచ్చేవరకూ ఏదో ఒక విధంగా జీవిక కొనసాగించక తప్పదని తెలుసు. అందుకే అనేక కోరికలు, వ్యామోహాల మత్తులో పడి, అనుభూతుల వలయంలో చిక్కి, మరణభావనను మరుగున పడేయాలని ప్రయత్నిస్తాడు. ఇలా అణగిన మరణభావన ఇతరభయభావనలకు దారి తీస్తుంది. అందుకే మరణమంటే ఏమిటో తెలియకుండా, మరణం గురించిన ఆలోచన లేకుండా అనుక్షణం మరణంతో పోరాడే జీవులకు ఉండేది ఒక్క మరణభయం మాత్రమే. మరణస్వరూపం గ్రహించి, ఏ నాడో ఒక నాడు మరణించక తప్పదని తెలిసిన మనిషికి అడుగడుగునా భయాలే. అనుక్షణం రకరకాల భయాలు.

ఆధునికమానసికశాస్త్రం భయాలను 'ఫోబియా'లంటుంది. లెక్క తీస్తే మానసిక శాస్త్రంలో కొన్ని వేల ఫోబియాలున్నాయి. పురుగులంటే కలిగే అకారణభయం నుంచి, నీటిని చూస్తే కలిగే అకారణభయం, ఏ ప్రమాదం లేకున్నా ఊహాప్రమాదం వల్ల అనుక్షణం

కలిగే భయం, ఎవరో ఏదో చేస్తారన్న అర్థం లేని భయం వరకూ కొన్ని వేల రకాల భయాలున్నాయి. శాస్త్రవేత్తలు పరిశోధించి అనేక రకాల భయాలను గుర్తించి వాటికి పేర్లు కూడా పెట్టారు.

'శబ్దం' అంటే ఉండే భయాన్ని 'అకౌస్టికో ఫోబియా' అంటారు. ఎత్తులంటే ఉండే భయాన్ని 'అక్రోఫోబియా' అంటారు. పూలను చూస్తే కలిగే భయానికి 'ఆంథోఫోబియా' అని పేరు. వెంట్రుకల వల్ల కలిగే భయం 'కేటోఫోబియా', 'వేగం' వల్ల కలిగే భయాన్ని 'టాకోఫోబియా' అంటారు. కొందరిలో హాస్పటళ్ళంటే ఉండే భయాన్ని 'నోసోకెమోఫోబియా' అంటారు. ఇలా కొన్ని వేల భయాలున్నాయి. ఫోబియాలు ముదిరితే మేనియా (పిచ్చితనం) లు అవుతాయి. అంటే మెదడు లేని జీవులకు ఒకే భయం 'ప్రాణభయం' ఉంటే, మెదడు, ఆలోచనలు, విచక్షణలున్న మనిషికి అడుగడుగునా అకారణభయాలే అన్నమాట. ఐతే మనిషిలో ఈ భయాల వల్ల నష్టంతో పాటు లాభం కూడా ఉంది. అనేక రకాల భయాలు మనిషి స్వభావంపై ప్రభావం చూపుతాయి. అతని సహజ స్వభావం నుంచి అతడిని దూరం చేస్తాయి. కానీ కొందరిలోని భయాలు, వాటిని జయించాలన్న తపన అభివృద్ధికి దారి తీస్తుంది. మానవజాతి అడుగు ముందు పడేట్టు చేస్తుంది. భయం నుంచి మనిషి రక్షణ కోసం చేసే ప్రయత్నాలు అభివృద్ధిపథంలో ప్రయాణానికి దారి తీస్తాయి. కానీ ఎప్పుడైతే మనిషి భయాన్ని జయించాలనే ప్రయత్నం మాని భయానికి లొంగిపోవటం జరుగుతుందో, అది పతనానికి దారి తీస్తుంది. అయితే భయాన్ని జయించేందుకు సక్రమమైన ప్రయత్నాలు కాక అక్రమరీతిలో ప్రయత్నాలు చేయటం అనర్థదాయకం. పురాణాల్లో మరణాన్ని జయించాలన్న వ్యక్తుల స్వార్థ, ప్రయత్నాలు, మనుషులను రాక్షసులనుగా చేయటం మనకు తెలిసిందే. ఐతే రాక్షసులై, ప్రజలను పీడించినా వారు మరణం నుంచి తప్పించుకోలేకపోయారు. మరణం నుంచి తప్పించుకోవాలని రాక్షసులు కోరిన చిత్రవిచిత్రమైన కోరికలు, ఆ కోరికలలో ఏదో ఓ చిన్న లోపం ఆధారంగా భగవంతుడు మానవరూపం ధరించి వారిని సంహరించటం, ఎంత ప్రయత్నించినా మనిషి మరణాన్ని జయించలేడని నిరూపిస్తాయి. అంతే కాదు, మనిషి జయించాలని ప్రయత్నించాల్సింది, మరణాన్ని కాదు, మరణం గురించి మనిషిలో కలిగే భయాన్ని అని బోధపరుస్తాయి పురాణకథలు. అందుకే భగవద్గీత ఆరంభంలోనే శ్రీకృష్ణుడు, అర్జునుడిలోని మరణాన్ని గురించిన భయాన్ని తొలగించాడు. ఇది, సమస్త మానవాళిలో మరణభావన వల్ల కలిగే భయాన్ని నిర్జించేందుకు భగవంతుడు స్వయంగా చూపిన దారి అన్నమాట.

## భగవంతుడు చూపిన దారి

యుద్ధం ఆరంభమయ్యే సమయం ఆసన్నమైంది. ఇరువైపులా సైన్యాలు మోహరించి ఉన్నాయి. వీరులు సింహనాదాలు చేశారు. శంఖాలు పూరించారు. భేరులు, పణవానకాలు, గోముఖుల వంటి నానావిధవాద్యాల నొకసారి మోగించి మహత్తరశబ్దాలు సృష్టించి భూనభోంతరాలు నింపేశారు. ఎటువంటివాడిలోనైనా వీరరసం ఉప్పతిల్లే సంఘటన అది. ఆరితేరిన రణకోవిదులు ఎవ్వరూ ఉత్సాహంతో ముందుకు దూకకుండా ఉండలేరు. ఇటువంటి ఉద్వేగభరిత, ఉత్సాహం ఉవ్వెత్తున ఎగసే సందర్భంలో వీరుడు, విజయుడైన అర్జునుడు 'యుద్ధం చేయను పొ'మ్మంటాడు. ఇంకెవరైనా ఈ మాట అంటే వాళ్ళు భయపడుతున్నారని అనవచ్చు. కానీ వీరాధి వీరుడు అర్జునుడే ఆమాట అంటే ఎగతాళి చేయటం కుదరదు. గోగ్రహణం సందర్భంలో సమస్తకౌరవసేననూ ఒంటరిగా ఎదుర్కొని విజయం సాధించిన వ్యక్తి, అంతిమసంగ్రామ విజయం అందుబాటులోకి వచ్చిన సమయంలో, యుద్ధవిముఖత ప్రదర్శిస్తే దాన్ని అత్యంత గంభీరంగా తీసుకోవాల్సి ఉంటుంది. జగద్గురువు శ్రీకృష్ణుడు అదే చేశాడు. మానవ మనస్తత్త్వాన్ని ఆమూలాగ్రంగా ఎరిగిన జగద్గురువు, నరుడి మనసులో సందేహాన్ని వైరాగ్యాన్ని, సంశయాన్ని జనింపజేసిన మూలభావన 'భయం' అని సులభంగా గ్రహించాడు. అందుకే, ఆరంభంలోనే ముందు ఆత్మతత్త్వాన్ని వివరించి, ఆపై మరణ తత్త్వాన్ని బోధించాడు. ఆ తరువాతనే మిగతా యోగాలు, తత్త్వాలూ బోధించాడు.

ఇది ప్రతివ్యక్తీ నిత్యజీవితంలో అనుభవించే భయం. ఓ పని చేయాలని నిశ్చయించుకుంటూ అన్నీ సిద్ధం చేసుకుంటాం. కానీ తీరా పని ఆరంభించే సమయానికి ఏదో అర్థం కాని బెరుకు వెనక్కు లాగుతుంది. పని చేయగలమా? లేదా? అన్న అనుమానం వస్తుంది. విద్యార్థులు పరీక్షల కోసం రాత్రింబవళ్ళు చదువుతారు. అన్ని ప్రశ్నలూ నేర్చుకుంటారు. తీరా పరీక్ష రాసే సమయం వచ్చేసరికి, చదివినవన్నీ గుర్తుంటాయా? చదవకుండా వదిలిందేదో వస్తే? వంటి సంశయాలు విద్యార్థిని చుట్టుముడతాయి. అంతెందుకు, ఆటల్లో బంతిని గోల్‌వరకూ నైపుణ్యంతో తీసుకెళ్లిన ఆటగాడు, గోల్ కొట్టే సమయానికి సంశయంలో పడతాడు. క్రికెట్టులో పరుగులు చకచకా తీసిన వ్యక్తి ఆ ఒక్క పరుగు తీసి వంద చేసేందుకు తంటాలు పడతాడు.

అంటే, గమ్యం చేరేందుకు తపనపడటం, ప్రయత్నించటం ఒక ఎత్తు. గమ్యం దగ్గరకు వచ్చిన తరువాత, అది చేరేందుకు వేసే చివరి అడుగు ఒక ఎత్తు. విజితుల్ని, పరాజితుల్ని వేరుచేసేది ఈ చివరి అడుగే. పైకి ఈ సంశయాలు, భయాలు అన్నీ

వేర్వేరుగా అనిపించినా, వీటన్నింటికీ మూలం మౌలికంగా జీవులలో ఉండే మరణభయమే. అందుకే శ్రీకృష్ణుడు, అర్జునుడికి అతడి గొప్పతనాన్ని, శక్తిని గురించి చెప్పలేదు. అర్జునుడు ఎవరెవరిని ఎలా గెలిచాడో గుర్తు చేయలేదు. సూటిగా అర్జునుడి భయాలన్నింటికీ మూలకారణమైన 'మరణభయాన్ని' ప్రస్తావించి, ఆ భయాన్ని జయించే మార్గం సూచించాడు.

జాతస్య హి ధ్రువో మృత్యుః
ధ్రువం జన్మ మృతస్య చ।
తస్మా దపరిహార్యే ఽర్థే
న త్వం శోచితుమర్హసి॥

'పుట్టిన ప్రతిదీ మరణిస్తుంది. మరణించిన ప్రతిదీ మళ్లీ జన్మిస్తుంది. ఇది అనివార్యమైన ప్రకృతినియమం. దీన్ని ఉల్లంఘించటం కుదరదు. ఉల్లంఘింపరాని నియమం కోసం శోకించటం తగదు' అని స్పష్టంగా చెప్పాడు.

అక్కడ అర్జునుడు వైరాగ్యం ప్రదర్శించటం, రాజ్యం ఎందుకని ప్రశ్నించటం, ఇంత మందిని చంపి సాధించే విజయం వల్ల లాభమేమిటనుకోవటం అన్నిటి వెనుక 'మరణభయం' ఉంది. అందుకే కృష్ణుడు జననమరణాల చక్రనేమి గతిని స్పష్టంగా చెప్పి 'మరణం' గురించి ఆలోచన అనవసరం అని నిర్ద్వంద్వంగా చెప్తాడు.

తరచి చూస్తే, ఏమీ తెలియని బాల్యావస్థలో పిల్లవాడికి భయాలుండవు. 'పాల' కోసం ఏడుస్తాడు. ఏదైనా బాధ కలిగితే ఏడుస్తాడు. అంతే తప్ప కొత్త పాత ఎవరు దగ్గర తీసినా ఏడవడు. పట్టించుకోడు. అదే కాస్త ఊహ తెలిసిందా, కొత్తపాతల తేడా తెలుస్తుంది. తనవారు, పరాయివారు తెలుసుకోగలుగుతాడు. దాంతో అపరిచితులు దగ్గరకు రాగానే ఏడుస్తాడు. భయపడతాడు. కొత్త ప్రదేశాలంటే భయపడతాడు. అపరిచితమైందేదైనా అతనిలో భయం కలిగిస్తుంది. అది జీవుల్లో మౌలికంగా కనిపించే 'మరణభయం'. అలవాటైన స్థితిలో భద్రత ఉంది. కాబట్టి అలవాటు లేందేదైనా, అలవాటయ్యేంత వరకూ ప్రమాదమే. ఈ రకమైన ఆలోచన వ్యక్తి జీవితంలో అడుగడుగునా కనిపిస్తుంది.

కొత్తగా స్కూలుకెళ్లేటప్పుడు ఏడుస్తాడు. స్కూలు వదిలినప్పుడల్లా అలవాటయ్యేంత వరకూ ఏడుపే. కొత్త వ్యక్తులతో పరిచయం అంటే అయిష్టం వెనుక ఉండేదీ, మౌలికంగా మనిషిలో ఉండే మరణభయమే. 'కొత్తలో ఏం ప్రమాదం ఉందో?' అన్న భావన వ్యక్తి

వ్యక్తిత్వంపై ప్రభావం చూపిస్తుంది. తన వ్యక్తిత్వనిర్మాణంపై దృష్టి పెట్టే వ్యక్తి ముందుగా జయించవలసింది ఈ 'భయం' భావననే.

*అవ్యక్తాదీని భూతాని వ్యక్తమధ్యాని భారత।*
*అవ్యక్త నిధనా న్యేవ తత్ర కా పరిదేవనా?*

భూతజాలాలు పుట్టక ముందు, మరణించిన తరువాత ఏమౌతాయో ఎవరికీ తెలియదు. ఈ మధ్యలోనే వ్యక్తమై ప్రత్యక్షమౌతాయి. అటువంటి క్షణికమైనవాటి కోసం పరితపించటం సమంజసమా? అని ప్రశ్నిస్తాడు కృష్ణుడు.

ముందుగా మరణం, జననం అన్నవి ఎవరి చేతుల్లో లేనివి, ఇది ఉల్లంఘించలేని నియమం అన్నాడు. ఆపై పుట్టక ముందు ఎక్కడ ఉన్నామో, మరణం తరువాత ఏమౌతామో తెలియనిదాని గురించి బాధపడాల్సిన అవసరం లేదని చెప్పాడు. ఏ రకమైన భయాన్ని జయించాలన్నా సంజీవని లాంటి సూత్రం ఇది. ముందుగా భయానికి కారణం తెలుసుకోవాలి. ఆపై ఆ కారణాన్ని విశ్లేషించాలి. ఇంకేం, భయం పారిపోతుంది.

ఒక వ్యక్తి ఇంటర్వ్యూ కోసం బాగా తయారయ్యాడు. ఏమి అడిగినా చెప్పేయగలనన్న ధీమా ఉంది. కానీ ఏదో తెలియని భయం వల్ల అతడికి ఇంటర్వ్యూ అంటేనే భయం కలుగుతోంది. శ్రీకృష్ణుడు సూచించిన తార్కికపద్ధతిని ఉపయోగిస్తే అతని భయం పటాపంచలవుతుంది.

'నేను అన్నీ బాగా చదివాను. నా వంతు బాధ్యత నేను సక్రమంగా నిర్వహించాను. ఇంటర్వ్యూ చేసేవాళ్లు కోరలు, కొమ్ములు ఉన్నవారు కారు. వాళ్ళు మీద పడి కొట్టరు. ప్రశ్నలు అడుగుతారు. తెలిస్తే చెప్తాం. లేకపోతే లేదు. దానికి ఇంత భయం ఎందుకు?' అని ప్రశ్నించుకోవాలి.

'ప్రశ్నలకు సమాధానాలు చెప్పకపోతే ఉద్యోగం రాదు. రాకపోతే? పరిస్థితిలో ఏమీ మార్పు రాదు. ఇంకో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తాను. లేకపోతే స్వశక్తితో ఇంకేదైనా చేస్తాను' అనుకుంటే ఇక ఇంటర్వ్యూ భయం ఉండదు. ఈ రకమైన తర్కంతో చిన్న భయాల నుంచి పెద్ద భయాల వరకూ ప్రతిదాన్నీ జయించటం వీలవుతుంది.

ఓ పిల్లవాడికి చీకటి అంటే భయం. 'ఎందుకు?' అంటే 'ఏమో!' అన్న సమాధానం వస్తుంది. దీన్ని బట్టి మనం గ్రహించాల్సిందేమిటంటే, మన భయాలన్నిటికీ కారణం 'అజ్ఞానం'. మనకు తెలియనిది మనకు భయం కలిగిస్తుంది. అందుకే మరణాన్ని చీకటితో పోల్చారు. 'నీలమేఘ విలసత్కా లాంజనాకారు, ఘోర నిశాతోత్కట దంష్ట్రు' అంటూ

ఎఱ్ఱన భారతంలో యముడిని వర్ణించాడు. యముడు కారు నలుపు. వాడి కోరలు కలవాడు. ఇదీ యముడి వర్ణన. కానీ

ఆశ్చర్యవత్ పశ్యతి కశ్చిదేనం
ఆశ్చర్యవద్వదతి తథైవ చాన్యః।
ఆశ్చర్యవచ్చైన మన్యఃశృణోతి
శ్రుత్వాఽ ప్యేనం వేదనచైవకశ్చిత్।

మరణం గురించి, దేహి–దేహ పరస్పరసంబంధం గురించి వింతగా చూస్తారు. వింతగా మాట్లాడతారు. ఆశ్చర్యంతో వింటారు. ఎంత మాట్లాడినా, ఎన్ని విన్నా నిజంగా మరణం గురించి తెలుసుకున్నవారు ఎవ్వరూ లేరు. కాబట్టి మరణమంటే భయం వ్యక్తిలో అంతర్గతంగా ఎల్లప్పుడూ ఉంటుంది. ఈ మరణభయాన్ని తర్కంతో జయించాలి. అది తప్పనిసరి. ఎవరూ తప్పించుకోలేరు. అదేమిటో ఎవరికీ తెలియదు. ఇక దాని గురించి భయపడి లాభం లేదు. లాభం లేనిదాని గురించి, మనం ఏమీ చేయలేని దాని గురించి భయపడటంలో అర్థం లేదు.

ఎప్పుడో మరణం వస్తుందని ఇప్పటి నుంచీ బాధపడుతూ కూచుంటే, వచ్చే మరణం ఎలాగూ వస్తుంది. కానీ ఉన్న జీవితం చేజారిపోతుంది. కాబట్టి భయపడి లాభం లేదు. ఈ రకమైన 'వాదం' ప్రతి భయాన్నీ జయించేందుకు ఉపయోగించవచ్చు. ఏదో వస్తువు కొనాలని ఉంటుంది. కానీ దుకాణం వాడు మోసం చేస్తాడేమోనన్న భయంతో వెనుక ముందు ఆడుతుంటాడు.

'వస్తువు కొంటాను. మోసం చేస్తాడు. అయితే ఏంటట?' అనుకుని ముందుకు వెళ్తే పని అవుతుంది. పైగా 'వాడు మోసం చేస్తాడని తెలిసీ మోసపోయానంటే, ఇక బాధపడే అర్హత నాకు లేదు' అనుకుంటే సమస్య లేదు.

కొందరు ప్రతి చిన్న విషయానికీ 'ఏమౌతుందో' అని భయపడుతుంటారు. వారు అనుక్షణం తమని తాము ఇలా ప్రశ్నించుకుంటూ, తర్కించుకుంటూ భయాన్ని అధిగమించవచ్చు. ఒకామెకు ఇల్లు వదిలి సగం దూరం వచ్చాక ఇంటికి తాళం వేసిందో, లేదోనన్న అనుమానం కలిగింది. దాంతో ఆమె ప్రయాణమంతా స్తిమితంగా ఉండలేక పోయింది. తిరిగి ఇంటికి వచ్చిన తరువాత తాళం చూస్తే కానీ ఆమెకు శాంతి కలగలేదు. కానీ ఈ లోగా ఆమె ప్రయాణాన్ని ఎంజాయ్ చేయలేకపోయింది. ఆమె తోటివారి ఆనందం పాడైంది. ఇటువంటప్పుడు కూడా 'సరే. తాళం వేయటం మరిచిపోయాను.

ఐతే ఏమైంది? ఇంట్లో వస్తువులు పోతాయి. మళ్లీ కొనవచ్చు' అనుకోవచ్చు. లేకపోతే ఇరుగుపొరుగు వారికి ఫోన్ చేసి చెప్పి 'కాస్త చూడండి' అని చెప్పవచ్చు. ఇలా, ఇక భయం కలిగితే దాన్ని తర్కంతో జయించటం అలవాటు చేసుకోవాలి.

ఒకాయన రోజూ ఉదయమే వాకింగ్‌కు వెళ్తాడు. ఐతే ఆయన నడిచే దారిలో చీకటి ఉంటుంది. కుక్కలు అరుస్తుంటాయి. కుక్క అరుపు వినగానే ఆయన వాకింగ్ మానేసి వెనక్కు వచ్చేస్తుంటాడు. ఆ వైపు వెళ్లాలంటే భయం. ఓ రోజు ధైర్యం చేశాడు. 'కుక్కలు ఏం చేస్తాయి? చెయ్యెత్తితే పారిపోతాయి' అనుకుని తడబడుతున్న గుండెను చిక్కబట్టుకుని చీకట్లోకి అడుగు వేశాడు. కుక్కలు అరుస్తూ, వాటి గోలలో ఈయనని పట్టించుకోలేదు. ఈయన వాకింగ్ కొనసాగించాడు. ఆ తరువాత తన భయాన్ని చూసి నవ్వుకున్నాడు. ఈ చిన్న భయం వల్ల ఎన్నాళ్లు వాకింగ్ మానేశాడో తలుచుకుని మరింత నవ్వుకున్నాడు.

మన భయాలన్నీ ఇటువంటివే. మన భయాలలోని అర్థరాహిత్యాన్ని నిరూపిస్తూ, మానసిక శాస్త్రవేత్తలు అనేక ప్రయోగాలు చేశారు. ఆ ప్రయోగాల వివరాలతో భయాన్ని జయించిన విజేతల కథలు చర్చిద్దాం.

## భయంపై జయం

మన భయాలు అర్థరహితం అని చెప్పేందుకు ఓ ప్రయోగం ఉంది. ఓ తరగతిలో టీచర్ చేసిన ప్రయోగం అది. కుర్చీల్లో కూర్చున్న విద్యార్థులందరినీ లేచి ఓ వైపు వచ్చి నిలబడమన్నాడు. ఆపై అందరినీ మరో వైపు కు పొమ్మన్నాడు. అడ్డుగా ఉన్న కుర్చీలను దాటుకుంటూ, ఆ వైపు చేరారు విద్యార్థులు. మళ్లీ ఈ వైపు రమ్మన్నాడు టీచర్. అయితే ఈ సారి విద్యార్థుల కళ్లకు గంతలు కట్టాడు. ఆపై నిశ్శబ్దంగా, గదిలో ఉన్న కుర్చీలు తీయించేశాడు. ఇప్పుడు మరో వైపు రమ్మన్నాడు.

ఒక్క విద్యార్థి కూడా కదలలేదు. 'దారిలో కుర్చీలు, బల్లలు అడ్డుగా ఉన్నాయి. కళ్లకు గంతలు కట్టారు. వాటిని దాటుతూ ఆ వైపు రావటం కష్టం' అన్నారు. చివరికి ఓ విద్యార్థి ధైర్యంగా ముందుకు వచ్చాడు. తడబడుతూ, లేని టేబిళ్ల కోసం వెతుకుతూ అడుగులు వేయటం ఆరంభించాడు. అతడి వల్ల మరి కొందరు ముందుకు వచ్చారు. అయితే, చేతికి ఏమీ తగలకపోవటంతో సందిగ్ధంలో పడి సగంలో ఆగిపోయారు. అన్ని సందిగ్ధాలను మించి, లేని అడ్డంకులను దాటుకుంటూ, అడ్డేమీ లేదని నిర్ధారించుకుంటూ ఒక విద్యార్థి గమ్యం చేరాడు.

ఇదీ మన భయాల స్వరూపం!

మనం ఏదైనా పని సాధించాలనుకోగానే ముందుగా సందేహాలు ముసురు కుంటాయి. ఆపై అడ్డంకులు గుర్తుకు వస్తాయి. దారిలోని అవరోధాలను స్మరిస్తాం. దాంతో అడుగు ముందుకు వేయం. ఆలోచన ఉంటుంది. కానీ అది ఆచరణలోకి రాదు. ఒకవేళ ఆచరణ ఆరంభించినా, మొదటి ప్రతి బంధకంలోనే వెనక్కు తిరుగుతాం. ఎవరైతే ఆలోచనను ఆచరణలో పెట్టటమే కాదు, ప్రతిబంధకాలన్నీ ఊహాత్మకమైనవే తప్ప నిజమైనవి కావు అని గ్రహించి గమ్యం వైపు సాగిపోతారో, వారు తమ గమ్యం చేరుతారు. లక్ష్యాన్ని సాధిస్తారు. అందుకే మన పూర్వికులు మనుషులను మూడు రకాలుగా వర్గీకరించారు.

'ఆరంభించరు నీచమానవులు' అన్నారు.

ఎవరైతే ఏదైనా పని చేయాలనుకోగానే, రకరకాల అవరోధాలను ఊహించి, అడ్డంకులను చూసి భయపడుతూ పని ఆరంభించనే ఆరంభించరో వారు అధమస్థాయి మానవులు. ప్రగల్భాలు పలుకుతూ, తాము చేయగల పనులు సాధించగల గొప్ప లక్ష్యాల గురించి మాటలు మాట్లాడతారు తప్ప చేతల దగ్గరకు వచ్చేసరికి అడుగు ముందుకు పడదు. తాము అడుగు ముందుకు వేయకపోవటమే కాదు ఇతరులనూ అడుగు ముందుకు వేయనీయరు వీరు. అందుకే వీరు నీచమానవులయ్యారు.

ఇక్కడ 'నీచం' అంటే 'చెడు' అని కాదు. 'నీచులు' అంటే నేరస్థులు, హంతకులు, మోసగాళ్లు కారు. వారి కన్నా తక్కువస్థాయి వారు వీరు. ఎందు కంటే ప్రతివ్యక్తికీ కర్తవ్యపాలన తప్పని సరిగా పాటించవలసిన ధర్మం అని భగవంతుడు నిర్దేశించాడు. అది సాధించదగ్గదా, అందుబాటులో ఉన్నదా అన్నది కాదు ముఖ్యం. కర్తవ్య నిర్వహణ ముఖ్యం. అటువంటి కర్తవ్యనిర్వహణను విస్మరించే వారంతా నీచులే. వారు ధనవంతులు కావచ్చు, విజ్ఞానవంతులు కావచ్చు. నాయకులు కావచ్చు. ఇంకెవరైనా కావచ్చు. స్వధర్మాన్ని పాటించకుండా, కర్తవ్యనిర్వహణను విస్మరిస్తే వారు నీచులే అవుతారు.

మొఘలు సామ్రాజ్యం విస్తరిస్తూ, దేశమంతా తురుష్కుల అకృత్యాలు పెరిగి పోతున్నప్పుడు, ఎంతో మంది వారికి వ్యతిరేకంగా పోరాడాలని మనస్సుల్లో అనుకొని ఉంటారు. కానీ 'అంత పెద్ద మొఘలుల శక్తిని ఎదుర్కోగలమా?', 'నేనొక్కడినీ ఏం చేయగలను?' అనుకుని ఎవరో వచ్చి తమని రక్షించాలని ఎదురుచూస్తూ మౌనంగా ఉండిపోయి ఉంటారు. వారినెవరూ స్మరించరు. వారి జాడలు కూడా మనకు మిగలలేదు.

కానీ, మొఘలుల శక్తి గురించి ఆలోచించి భయపడకుండా, ఓ చిన్న సంస్థానం నాది. తుఫానును అరచేయి అడ్డుపెట్టి ఆపే ప్రయత్నం నాది అనుకుని, జంకకుండా ఓ వ్యక్తి మొఘలులకు వ్యతిరేకంగా రంగంలోకి దూకాడు. ఒక మహాశక్తి అయి, మొఘలులను గడగడలాడించాడు. ఈ నాటికీ దేశభక్తికి ప్రతీక అయి, ప్రజలకు స్ఫూర్తినిస్తూ ప్రాతః స్మరణీయు డయ్యాడు. అతడే ఛత్రపతి శివాజీ.

అంటే, 'పని సాధ్యం కాదు' అనుకుని ముడుచుకుని కూర్చునే కన్నా, రంగంలోకి దూకటం మంచిదన్నమాట. లక్ష్యం సాధించకున్నా పరవాలేదు. కాని పని ఆరంభించి, లక్ష్యం వైపు అడుగు లేయటం వాంఛనీయం అన్నమాట. ఇలా పని ఆరంభించిన వారు మధ్యములు అవుతారు.

ఏ పని అయినా చేయటం ఆరంభిస్తే కానీ మనం చేయగలమో, లేదో తెలియదు. కాబట్టి 'చేయలే'మని ముడుచుకుని కూర్చునే బదులు, పని ఆరంభించటం మంచిది. పని మధ్యలో వదిలేస్తే, మధ్యములమవుతాం. కనీసం నీచత్వం నుంచి ఒక మెట్టు ఎదిగినవారమవుతాం. ఎందుకంటే, మనం ఆరంభించిన పనిని మనం పూర్తి చేయలేక పోవచ్చు. కానీ పని ఆరంభించటం వల్ల ఇతరులకు స్ఫూర్తినిచ్చిన వారమవుతాం. మార్గదర్శనం చేసినవారమవుతాం.

ఇక కార్యం ఆరంభించి, అన్ని అడ్డంకులను మించి, లక్ష్యం సాధించినవారు ఉత్తములు. ఐతే వీరు ఉత్తములవటం వెనుక, కార్యం ఆరంభించని నీచులు, సగంలో వదిలేసిన మధ్యముల స్ఫూర్తి కూడా ఉంటుందన్న విషయం విస్మరించకూడదు.

తురుష్కులకు వ్యతిరేకంగా శివాజీ కత్తి పట్టటం వెనుక రాణా ప్రతాప్ పోరాట స్ఫూర్తి ఉందన్నది కాదనలేని అంశం. అలాగే, స్వతంత్ర పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన ఒకో వీరుడు, ఎందరో ఇతరదేశభక్తులకు స్ఫూర్తి నిచ్చాడన్నది కాదనలేని అంశం. ఒక శాస్త్రవేత్త తన పరిశోధనలో విజయం సాధించి ఓ సత్యం కనుక్కున్నాడంటే, దాని వెనుక తరతరాలుగా అనేక ఇతరశాస్త్రవేత్తల పరిశోధన ఫలితాలు ఉంటాయి.

కాబట్టి పని ఆరంభించే ముందు, రకరకాల భయాలతో, వెనుకడుగు వేయటం మాని అడుగు ముందుకు వేయటం చేయాలన్నమాట. అందువల్ల మనం లక్ష్యం సాధిస్తే సరేసరి. లేకపోతే కనీసం ఇతరులకు స్ఫూర్తినిచ్చి మార్గదర్శనం చేసినవారమవుతాం. అయితే ఏదైనా పని చేసే ముందు ఆలోచించవలసింది అడ్డంకుల గురించి కాదు. ఆ పని వల్ల పదిమందికి మేలు జరుగుతుందా, లేదా, అన్న విషయం ఆలోచిస్తే చాలు.

ఎనిమిదేళ్ల కుర్రవాడు సంసారాన్ని త్యజించి హిందూధర్మోద్ధరణకు నడుము కట్టాడంటే వినేవారికి హాస్యాస్పదంగా అనిపిస్తుంది. కానీ ఆ కుర్రాడు నడుం కట్టటమే కాదు, హిందూధర్మానికి నూతనదిశనిచ్చి భావితరాల వారికి స్ఫూర్తిగా నిలిచాడంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఆ కుర్రాడికి నీరాజనాలర్పించాలనిపిస్తుంది. 'ఎనిమిదేళ్ల బాలుడిని, దేశంలో వేళ్లూనుకున్న బౌద్ధాన్ని నిర్జించి, హిందూధర్మాన్ని నిలపటం నా వల్ల ఏమౌతుం'దని ఆ పిల్లవాడు జంకి ఉంటే ఈ నాడు మనం 'హిందువుల'మని సగర్వంగా చెప్పుకునే అవకాశం ఉండేదికాదు. ఆయన స్ఫూర్తితో తరువాత రామానుజాచార్యులు, మధ్వాచార్యులు, వల్లభాచార్యులు ఇలా... తరతరాలుగా పలువురు హిందూధర్మధ్వజానికి కొత్త వన్నెలు తీర్చిదిద్దారు. సమాజానికి వ్యతిరేకంగా వర్తిస్తే సమాజం తనను వెలివేస్తుందని రామానుజాచార్యులు భయపడి, బ్రహ్మ జ్ఞానాన్ని ఎలుగెత్తి చాటకుండా ఉండి ఉంటే, భారతసామాజికచరిత్ర కొత్త మలుపు తిరిగి ఉండేదా? అపరిమితం, అనంతమైన వేదాలను, ఉపనిషత్తులను, పురాణాలను పరిష్కరించటం నా ఒక్కడి వల్ల సాధ్యమా? అన్న ఆలోచనతో వేదవ్యాసుడు ఆగిపోయి ఉంటే, ఈ నాడు మన వాఙ్మయం మనకు మిగిలేదా? కఠోరతపస్సు చేసి ద్యోమార్గఝరిని భువిపై ప్రవహింప చేయడం నా వల్ల ఏమౌతుందని భగీరథుడు అడుగు ముందుకు వేయకుండా ఉండి ఉంటే, దివిజగంగ భువికి దిగేదా? గంగ భూమిపై దూకితే దాన్ని ఆపేదెవరు? అని ఆలోచించి అసలు తపస్సు ఆరంభించటం మానేయలేదు భగీరథుడు. ముందు గంగను ఒప్పించాడు. ఆపై శివుడిని మెప్పించాడు. గంగను భూమిపై అవతరింపచేశాడు. ఆపై గంగకు అడ్డు పడిన ఋషులను ఒప్పించాడు. ఇలా ఇన్ని అడ్డంకులను దాటుకుంటూ లక్ష్యం సాధించాడు భగీరథుడు. రాబోయే అడ్డంకుల గురించి ఆలోచిస్తూ ఉంటే, భగీరథసాధన సాధ్యం అయ్యేదా? ఇక ధ్రువుడి దీక్ష, అర్జునుడి తపస్సు, విశ్వామిత్రుడి పట్టుదల, ఒకటేమిటి... మన చరిత్రలో, పురాణాల్లో 'అసంభవం' అన్న మాట లేకుండా ప్రతికార్యాన్నీ సంభవం చేసిన అత్యద్భుతమైన వ్యక్తులు అడుగడుగునా కనిపిస్తారు. అయితే వారు ఇన్ని అద్భుతాలను సాధించటం వెనుక ధర్మపాలన, కర్తవ్య నిర్వహణ అన్న భావాలున్నాయి. ఈ రెండు భావనలు దారి దివ్వెలుగా చేసుకుని ముందుకు సాగిపోతే వ్యక్తికి అపజయమన్నదే లేదు.

నిజానికి ప్రపంచంలో భయపడాల్సిన విషయమే లేదు. ఎందుకంటే అన్నిటి కన్నా అతితీవ్రమైంది, మౌలికమైంది మరణభయం. కానీ పుట్టిన ప్రతిదీ మరణించక తప్పదు. ఇది మార్చలేనిది. కాబట్టి మరణం గురించి భయపడి లాభం లేదు. జీవించినంత కాలం ధర్మనిర్వహణ, కర్తవ్యపాలన చేస్తుండాలి. ఈ రెండు కార్యాలూ చేసేవారికి

అపజయం లేదు. అంటే, మనిషికి మరణభయం లేక, పరాజయమంటే వెరపు లేకపోతే ఇక ఏ భయం ఉంటుంది? దేన్ని చూసి భయపడాలి?

చిన్న పనులకైనా, పెద్ద కార్యాలకైనా భయపడాల్సిన పని లేదు. తెలుగు మీడియంలో చదివేవారికి ఇంగ్లీషు అంటే భయం. ఇంగ్లీషు నేర్చుకునే ప్రయత్నాలు చేయకుండానే దాన్ని చూసి భయపడతారు. అలా కాక ప్రయత్నాలు ఆరంభిస్తే, అసలు విషయం తెలుస్తుంది. నీచస్థాయి నుంచి మధ్యమస్థాయికి వస్తారు. ఎన్నిమార్లు ఆగినా ప్రయత్నాలు కొనసాగిస్తుంటే మధ్యమస్థాయి నుంచి ఉత్తమస్థాయికి చేరుతారు.

ఓ వ్యక్తికి సంస్కృతంలో ప్రావీణ్యం సాధించాలని ఉండేది. ఎన్నోమార్లు సంస్కృతం చదవటం ఆరంభించాడు. కానీ ప్రతిసారీ అడ్డంకులు వచ్చేవి. చదువు ఆగిపోయేది. అలా 99 ఏళ్ళు గడిచాయి. అప్పుడు తీరిక దొరికింది చదవటం ఆరంభించాడు. అందరూ హేళన చేశారు. వెక్కిరించారు. 'ఈ వయసులో చదివి ఏం సాధిస్తావు?' అన్నారు. దానికి ఆయన సమాధానం, మన భారతీయజీవనవిధానం వ్యక్తిత్వావికాసతత్వానికి దర్పణం పడుతుంది. 'ఎన్నోమార్లు ఆరంభించాను, ఆపాను. ఆపిన దగ్గర నుంచి మళ్లీ ఆరంభించాను. ఇప్పుడు నేను కాస్త నేర్చుకుని చచ్చిపోతాను. కానీ ఈ సంస్కారం నా ఆత్మను అంటుకొని ఉంటుంది. వచ్చే జన్మలో ఇక్కడి నుంచి చదవటం ఆరంభిస్తాను' అన్నాడు.

ఇదీ భారతీయ జీవనవిధానంలో మౌలికమైన మరణభయాన్ని జయించి, కర్తవ్యనిర్వహణలో ఎదురయ్యే అవరోధాలను విస్మరించి, ముందుకు సాగే విధానం. ఎదురయ్యే అడ్డంకులు, విమర్శలు, ప్రతిఘటనల గురించి ఆలోచిస్తూ కూచుంటే వ్యక్తికీ, బండ రాయికీ తేడా లేదు. భగవంతుడిపై భారం వేసి ముందుకు సాగటమే పని. ముసురుకునే భయాలను పక్కకు పెట్టి కర్తవ్యం పాటించటమే పరమోత్తమ ధర్మం. అయితే ఎంత కాదనుకున్నా అనేక చిన్న చిన్న భయాలు మనల్ని వదలవు. వాటిని జయించటంలో భారతీయధర్మం చూపే మార్గం గురించి తెలుసుకోవాల్సి ఉంటుంది.

## భారతీయధర్మమార్గం

మన భయాలన్నీ అర్థరహితమైనవేనని నిశ్చయించుకున్నా, అడుగు ముందుకు వేయాలనుకునేసరికి చిన్నవీ, పెద్దవీ రకరకాల భయాలు ముసురుకుంటాయి. 'ఆరంభించరు నీచమానవులు' అనుకుంటూ కనీసం మధ్యముడుగా మిగిలిపోవాలని, పని ఆరంభిస్తే చేయగలమో లేదోనని ధైర్యం చెప్పుకుని అడుగు ముందుకేసినా,

అడుగడుగునా అనేకభయాలు చుట్టుముడుతూంటాయి. ఈ భయాలకు లొంగిపోతే పని పూర్తి కాదు. మధ్యముడుగా మిగిలిపోతాం. అలా కాక, ఎప్పటికప్పుడు ధైర్యం చెప్పు కుంటూ, అడ్డంకులు ఎదురైనప్పుడు చెదిరిపోక, ఓపికతో అడ్డంకులను దాటుతూ, చివరి వరకూ ప్రయత్నిస్తున్న వ్యక్తి ఉత్తముడు అవుతాడు. అయితే ఇక్కడ మనం మనల్ని ప్రశ్నించుకోవాల్సిన ప్రశ్న ఏమిటంటే, అసలు రకరకాల భయాలు మనల్ని ఎందుకు బాధిస్తాయి?

నిజం చెప్పాలంటే భయాలు లేని వ్యక్తి లేడు. ఎవరైనా తానే విషయానికీ భయపడనని అంటూంటే, అతడికి 'భయం' అంటే ఏమిటో సరిగ్గా అర్థం కాలేదని అనుకోవచ్చు. లేకపోతే అతడు అబద్ధం చెప్తున్నాడని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఎందుకంటే ప్రతి వ్యక్తికీ భయాలుంటాయి. విభిన్నాంశాలకు విభిన్నవ్యక్తులు ప్రతి స్పందించే తీవ్రతలో తేడా ఉండవచ్చు. కానీ ప్రతి వ్యక్తికీ భయమన్నది ఉండి తీరుతుంది. ధైర్యవంతుడు భయపడతాడు. పిరికివాడూ భయాన్ని పైకి చూపిస్తాడు. ధైర్యవంతుడు తన భయతీవ్రతను అదుపులో పెట్టుకోగలుగుతాడు. లోపల ఎంత భయపడుతున్నా దాన్ని పైకి కనబడనీయడు. అందుకే అంటారు, పిరికివాడు, ధైర్యవంతుడు భయంతో వెయ్యిసార్లు చస్తూంటారు. పిరికివాడు దాన్ని చూపిస్తాడు. ధైర్యవంతుడు పైకి చూపడు, అంతే తేడా.

గమనిస్తే, మన భయాలన్నిటికీ ఏదో ఒక రకంగా అజ్ఞానం కారణం అని అర్థమౌతుంది. మనకు తెలియని విషయం మనల్ని భయపెడుతుంది. తెలిసిన విషయం గురించి బాధనే లేదు. ఉదయం పూట హాయిగా స్వేచ్ఛగా తిరిగిన దారుల్లోనే, రాత్రి దీపం వెలుతురు లేకుండా తిరగాలంటే ఎంతవారికైనా గుండెలు అదురుతాయి. మన ఇళ్ళల్లోనే, చీకటి గది భయం కలిగిస్తుంది. దీన్ని బట్టి మనం అర్థం చేసుకోవాల్సిందేమిటంటే, అజ్ఞానం భయం కలిగిస్తుంది. జ్ఞానం భయాన్ని తొలగిస్తుంది.

చీకట్లో తాడును చూసి పాము అని భ్రమ పడతాం. భయపడతాం. చెమటలు కక్కేస్తాం. కానీ వెలుతురు వేసి చూస్తే అది పాము కాదు తాడు అని తెలుస్తుంది. అంత వరకూ మనం అనుభవించిన భయం మటుమాయం అవుతుంది. కాబట్టి మనకు కలిగే చిన్నచిన్న భయాల స్వరూపస్వభావాలను అర్థం చేసుకుంటే, వాటిని మించటం ఎంతో సులభం అవుతుంది. భయభావన పూర్తిగా అదృశ్యం కాకున్నా, ఆ భయభావనను మనకు లాభకరంగా వాడుకొనే వీలుంటుంది.

మానసికశాస్త్రవేత్తల ప్రకారం పుట్టిన పిల్లవాడికి భయాలుండవు. అతడిలో భయాలను మనమే కలిగిస్తాం. ఈ రకమైన ఆలోచనను ప్రతిపాదించటమే కాదు, వైజ్ఞానికపరిశోధనల ద్వారా నిరూపించిన వ్యక్తి జాన్.బి. వాట్సన్. 1920లో ఈయన పదకొండు నెలల ఆల్బర్ట్ అనే బాలుడిపై భయంకరమైన పరిశోధనలు చేశాడు. ఆ వయసు పిల్లల్లాగే ప్రతి విషయం పట్ల భయరహితమైన కుతూహలం ప్రదర్శించేవాడు ఆల్బర్ట్. అటువంటి ఆల్బర్ట్ దగ్గరలో పెద్ద శబ్దం చేసి భయపెట్టటం ఆరంభించాడు వాట్సన్. ఆ తరువాత అతని ఎదురుగా ఓ ఎలుకను వదిలిపెట్టేవాడు. ఆల్బర్ట్ ఎలుక వైపు చూసి భయపడటం ఆరంభించాడు. ఈ ప్రయోగం ఇలాగే కొనసాగింది. ఇంకొన్నాళ్ళకి కేవలం ఎలుకను చూస్తూనే కాదు, బొచ్చు ఉన్న ప్రతి జంతువూ అతడిలో భయం కలిగించేది. కుక్క, పిల్లి, కుందేలు – ఇలా ప్రతీదీ అల్బర్ట్‌ను భయపెట్టేది. ఈ ప్రయోగం ద్వారా పిల్లలకు భయాలు పెద్దలే కలుగజేస్తారని వాట్సన్ నిరూపించాడు. బాల్యంలో పిల్లలు నిద్ర పోకపోతే, బూచి వస్తుందని బెదిరిస్తాం. ఇది వారిలో తెలియని భయాన్ని కలిగిస్తుంది. దాంతో నిద్ర వారికొక భయకారణం అవుతుంది. అలాగే ఇచ్చింది తీసుకోకపోతే 'పక్క పిల్లవాడికి ఇచ్చేస్తాం', 'వాడొచ్చి ఎత్తుకుపోతాడు' వంటి వాక్యాలతో భయపెడతాం. తాత్కాలికంగా పిల్లవాడు మనం చెప్పిన మాట విన్నా ఇటువంటి మాటలు అతడి మనసులో శాశ్వతంగా భయాలు కలిగిస్తాయి. ఎదిగిన కొద్దీ, అచేతనలోని (Sub-Conscious) ఈ భయాలు, తన దాన్ని ఎవరైనా ఎత్తుకు పోతారేమో, తనకు రావాల్సింది ఇతరులకి వెళ్ళిపోతుందేమోనన్న భావనలుగా రూపాంతరం చెందుతాయి. వ్యక్తిలో అభద్రతాభావాన్ని కలిగిస్తాయి.

సాధారణంగా మనం కొందరిలో కొన్ని విషయాలకు వాటి స్థాయిని మించిన తీవ్రమైన స్పందనను గమనిస్తాం. పిల్లలు మట్టి ముట్టితే చాలు, చితకబాదే తల్లిదండ్రులు మనకు తెలుసు. పరిశీలిస్తే ఈ ప్రవర్తనకు కారణం, ఇప్పటి పెద్దవాళ్ళు, పిల్లలుగా ఉన్నప్పుడు, వాళ్ళు మట్టి ముట్టినప్పుడల్లా వాళ్ళ పెద్దలు బెదిరించటం, కొట్టటం వంటివి చేసేవారని తెలుస్తుంది. అందువల్ల ఇప్పుడు అకారణంగానే పిల్లలు మట్టిని తాకగానే హిస్టీరియా వచ్చినట్టు ప్రవర్తించటం చూస్తాం. ఇందుకు భిన్నంగా కొందరు పిల్లలు మట్టితో ఆడుతున్నా పెద్దగా పట్టించుకోరు. దీనికి కారణం బాల్యంలో వాళ్ళ తల్లిదండ్రులు, పెద్దవాళ్ళ ప్రవర్తన కారణం. 'పిల్లలు మట్టిలో ఆడటం సహజం. అందువల్ల ఏమీ కాదు. స్నానం చేయిస్తే సరి' అన్న రీతిలో పెద్దలు ప్రవర్తిస్తే పిల్లల్లో సైతం 'మట్టిలో ఆడటం తప్పు' అన్న భావన కలగదు.

ఈ నిజాన్ని బాలకృష్ణుడి కథ ఎంతో సున్నితంగా ప్రదర్శిస్తుంది. బాల్యంలో కృష్ణుడు చేసిన అల్లరి ఎవ్వరూ చేసి ఉండరు. మనుషుల సంగతి సరే సరి, దేవతలూ చేసి ఉండరు. శ్రీకృష్ణుడు మట్టి తినే ఘట్టం అందరికీ తెలుసు. వాళ్ళమ్మ నోరు తెరిచి చూపించమంటే అతడి నోట్లో సకల చరాచరజగత్తు కనిపిస్తుంది. అది 'దైవమాయ' అనుకుంటాం. కానీ ఈ కథ వల్ల మనకు తెలిసేదేమిటంటే, పిల్లలు మట్టి తినటం స్వాభావికం. అందువల్ల వారిని తిట్టీకొట్టీ లాభం లేదు. తద్వారా వారి మనస్సులపై పడే ప్రభావం ప్రపంచంపై ప్రభావం చూపిస్తుంది. కాబట్టి మట్టి తినటమే కాదు, ఇతర రకాల పిల్లల అల్లర్లను అర్థం చేసుకుని ఓపికగా వ్యవహరించాలి. పిల్లల అల్లరి వారిలోని సృజనాత్మకశక్తికి ప్రతీక. దాన్ని నిరోధించటం వల్ల, విమర్శించటం వల్ల వారి ప్రాకృతికస్వభావం దెబ్బ తింటుంది. అందుకే, గమనిస్తే శ్రీకృష్ణుడి చిన్నచిన్న అల్లర్ల విషయంలో యశోద ఆందోళన చెందినా, చికాకుపడినా, పొరుగువారి ఫిర్యాదులను ఆమె పట్టించుకోదు. కృష్ణుడినే సమర్థిస్తుంది.

ఒక రకంగా చూస్తే బలరామకృష్ణులు బాల్యంలో అనుభవించిన స్వేచ్ఛ ప్రతి బాలుడూ కలలు కనే స్వేచ్ఛ. ఊరిలో తిరగటం, వారినీ వీరినీ వెక్కిరించటం, పొరుగిళ్ళల్లో వెన్న దొంగిలించటంతో పాటు పిల్లలు ఆడుకునే ఎన్నో ఆటలు ఆడుకున్నారు వారు.

*గోవల్లభు డనే గోవులు మీరని*
*వడి ఱంకె వైచుచు, వంగి యాడు*
*రాజ నే భటులు మీరలు రండు రండని,*
*ప్రాభవంబున బెక్కు పనులు వనుచు*
*నే దస్కరుండ మీరింటివారని నిద్ర*
*పుచ్చి సొమ్ములు గొనిపోయి డాగు*
*నే సూత్రధారి మీ రందఱు బహురూపు*
*లని చెలంగుచు నాటలాడబెట్టు*

అంటే రాజులే కాదు, దొంగలు కూడా అయ్యారన్నమాట. వాళ్ళ తల్లిదండ్రులు వెంటపడి దొంగాట ఆడవద్దని చెప్పలేదు.

ఒక రకంగా ఈ ఆటలు పిల్లల్లోని అనేకలక్షణాలను, గుణాలను బహిర్గతం చేస్తాయి. ఆయా ఆటల్లో పిల్లలు ప్రవర్తించే తీరు వారి స్వాభావికవ్యక్తిత్వాన్ని స్పష్టం చేస్తుంది.

*మూల లుఱుకును డాగుడు మూతలాడు*
*నుయ్యెలల నూగు జేబంతు తాన వైచు*
*జాఱ జీరల జిఱుతల సాటి నిగుడు*

ఇలా స్వేచ్ఛగా, అడ్డూ అదుపూ లేకుండా ఆడుకున్నాడు కృష్ణుడు. ఇన్ని ఆటలు ఆడినా చెడిపోలేదు. జగద్గురువు అయ్యాడు. శ్రీకృష్ణుడి అల్లరి గురించి అందరూ ఫిర్యాదు చేస్తే 'అన్యమెఱుగడు తనయంత నాడుచుండు, మంచివాడిత డెగ్గులు మానరమ్మ' అని కొడుకును సమర్థించింది యశోద. ఇది కృష్ణుడి ఆత్మవిశ్వాసం. అంటే బెదిరించి, భయపెట్టి పిల్లల్లో లేని భయాలు కలిగించే బదులు, వారిలోని విశృంఖల సృజనాత్మకస్రవంతికి అడ్డుకట్టలు కట్టే బదులు, తమంతట తాము నిజానిజాలు తెలుసుకునేట్టు చేయటం ఉత్తమం అన్నమాట. శ్రీకృష్ణుడి బాల్యం ఈ విషయాన్ని స్పష్టం చేస్తుంది.

పురుషోత్తముడు శ్రీరాముడి బాల్యం ఈ విషయాన్ని మరింత స్పష్టం చేస్తుంది. చందమామ కావాలని శ్రీరాముడు ఏడిస్తే బూచిని చూపి బెదిరించి ముద్ద నోట్లో కుక్కే బదులు, అద్దంలో చంద్రుడిని చూపి సంతసపరిచారు. ఇది పిల్లవాడికి ఆత్మ విశ్వాసాన్నిస్తుంది. తన కోరికను తీర్చుకునే పట్టుదలనిస్తుంది. అవసరమైతే సప్త సముద్రాలను దాటి, రాక్షసులను సంహరించే తెగువను కలిగిస్తుంది. అంటే పిల్లలపై భయంకరమైన పరిశోధనలు చేసి, మానసికంగా వారిని హింసించే బదులు, మన పురాణగాథలు పిల్లలను మానసికంగా ఆరోగ్యవంతులను చేసే విధానం అందమైన కథల రూపంలో పొందుపరచి మనకందిస్తున్నాయన్న మాట.

వాట్సన్ పరిశోధన వల్ల పెద్దలే పిల్లలకు భయాలను కలిగిస్తారని తేలింది. కానీ ఆల్బర్ట్‌లో అకారణభయాల్ని వాట్సన్ తొలగించలేదు. అంటే, ఆల్బర్ట్‌లో వాట్సన్ కలిగించిన అకారణభయాలు ఆల్బర్ట్‌ను జీవితాంతం వెన్నాడుతూనే ఉన్నాయన్న మాట. 'బాలురకు దాడనంబ పథ్యంబరయన్' అని యశోద కృష్ణుడిని రోటికి కట్టేస్తే ఏమైందో మనకు తెలుసు. అంటే పిల్లవాడిని శిక్షించటం వల్ల ఉద్భవించే రాక్షసులను (భయాలు) ప్రతీకాత్మకంగా మనకు చూపుతుంది శ్రీకృష్ణుడి బాల్యం. శ్రీకృష్ణుడు దేవుడు కాబట్టి రాక్షసులను జయించాడు. మనం వాటి ప్రభావానికి గురవుతాం.

## భయస్వరూపం

*యది కశ్చిత్ సమర్థోవః సాగర ప్లవనే హరిః*
*స దదాత్విహ నః శీఘ్రం పుణ్యామభయ దక్షిణామ్.*

రామాయణంలో కీలకమైన ఘట్టం అది. సీతను వెతికేందుకు నాలుగు మూలలకూ వానరులు వెళ్తారు. అంగదుడు, హనుమంతుడు, ఇతరవానరులు దక్షిణం వైపు వెళ్తారు. వారికి సీత జాడ తెలియదు. నిరాశకు గురవుతారు. ఇంతలో సముద్రం అడ్డు వస్తుంది.

సముద్రం దాటి వెళ్ళాలి. కానీ అంత దూరం లంఘించగల శక్తి ఎవరికుంటుంది? అందుకని సముద్రం లంఘించగల శక్తి మనలో ఎవరికి ఉందో వారు తక్షణం తమ శక్తిని తెలిపి, సీతను కనుగొనలేమన్న భయాన్ని తొలగించమని అంగదుడు కోరతాడు. ఒకో వానరుడు తన శక్తిని తెలుపుతూంటాడు. ఒకరు వంద యోజనాలు ఎగరగలమని అంటే, మరొకరు ఎనిమిది వందల యోజనాలంటారు. కానీ ఎవరి శక్తి కూడా సముద్రం దాటేంత ఉండదు. శక్తి ఉన్న హనుమంతుడు దూరంగా ఒంటరిగా కూచుని దుఃఖిస్తుంటాడు.

అప్పుడు జాంబవంతుడు హనుమంతుడిని సమీపించి అడుగుతాడు.

*వీరవానర లోకస్య సర్వ శాస్త్ర విదాం వర।*
*తూష్ణీం ఏకాంత మాశిత్య హనుమన్ కిం నజల్పసి।*

(వానరలోకవీరుడా, సర్వశాస్త్రపారంగతుడా! ఇలా ఒంటరిగా విషాదంగా కూచున్నావెందుకు? నువ్వెందుకు మాట్లాడవు?)

ఆపై హనుమంతుడికి అతని పూర్వికుల గురించి వివరిస్తాడు. హనుమంతుడి గొప్పతనాన్ని ప్రస్తావిస్తాడు. ఇప్పుడు తాను వృద్ధుడవటం వల్ల తన శక్తి ఉడిగిపోయిందని, కాని, ఇప్పుడు తన శక్తిని ప్రదర్శించే అవకాశం హనుమంతుడికి లభించిందని ప్రేరేపిస్తాడు. వానరులంతా హనుమంతుడి శక్తిప్రదర్శన దర్శనం కోసం ఉత్సాహంతో ఉన్నారని, సీతను కనుగొనలేక నిరాశలో ఉన్న వారందరిలో ఆశాభావం చిగురింపచేసే బాధ్యత హనుమంతుడిదేనని అతడికి ఉత్సాహం కలిగిస్తాడు.

*తద్ విజృంభస్వ విక్రాంత ప్లవతా ముత్తమో హ్యసి!*
*తద్వీర్యం ద్రష్ట కామా హి సర్వ వానర వాహినీ*

(నీ శక్తి ప్రదర్శించి విజృంభించు. వానరసమూహం నీ శక్తిని దర్శించేందుకు ఉవ్విళ్ళూరుతున్నది).

*ఉత్తిష్ఠ హరిశార్దూల లంఘయస్వ మహార్ణవమ్।*
*పరాహి సర్వభూతానాం హనుమాన్ యా గతిస్తవ॥*

(లే, వానరోత్తమా! ఇతరజీవులన్నిటి కన్నా అత్యంతశక్తిమంతుడు హనుమంతుడు. మహాసముద్రాన్ని లంఘించి దాటగల శక్తి నీ ఒక్కడికే ఉంది.)

*విషణ్ణాహరయః సర్వే హనుమాన్ కి ముపేక్షసే।*
*విక్రమస్వ మహావేగ విష్ణు స్త్రీన్ విక్రమానివ॥*

(వానరులంతా నిరాశలో ఉన్నారు. వాళ్ళ నిరాశను పారద్రోలుతూ అత్యంతవేగంతో, వామనుడి మూడు అడుగుల్లా సముద్రాన్ని దాటి లంఘించు)

ఇలా హనుమంతుడికి అతడిలో నిక్షిప్తమై ఉన్న శక్తిని గురించి వివరించి, ఆత్మవిశ్వాసం కలిగిస్తాడు జాంబవంతుడు. దాంతో ఉత్సాహం హెచ్చిన హనుమంతుడు తన శక్తిని గుర్తించి సముద్రాన్ని దాటేందుకు ముందుకు వస్తాడు.

ఇది ప్రతి వ్యక్తి కథ.

హనుమంతుడిలోనే కాదు, ప్రతి వ్యక్తిలో అనంతమైన శక్తి ఉంటుంది. ఒక్క సముద్రాన్నే కాదు, అనేకసముద్రాలను అవలీలగా దాటే అపరిమితమైన శక్తి ప్రతి వ్యక్తిలో నిక్షిప్తమై ఉంటుంది.

ఎలాగైతే భౌతికశాస్త్రంలోని నిత్యశక్తిత్వసూత్రం 'సృష్టిలోని శక్తి ఎల్లప్పటికీ సమానంగా ఉంటుంది. అది ఒక రూపం నుంచి మరో రూపానికి మారుతుం'దని అంటుందో, అలాగే ప్రతి వ్యక్తిలో అపరిమితమైన శక్తి ఉన్నా, అది వ్యక్తమయ్యే రూపంలో తేడా ఉంటుంది. ఒకరిలో ఆ శక్తి ఓ ఆటలో 'ప్రావీణ్యం'గా కనిపిస్తే, మరొకరిలో ఆ శక్తి ఏదో ఓ 'కళ' రూపంలో ప్రదర్శితమౌతుంది. ఒకరిలో అది వాక్చాతుర్యంగా కనిపిస్తే, మరొకరిలో అది కార్యశూరత్వంగా ప్రస్ఫుటమౌతుంది. అంటే ప్రతి వ్యక్తిలో ఒకే రకమైన శక్తి ఒకే పరిమాణంలో ఉన్నా వ్యక్తి వ్యక్తిత్వం వల్ల అది బయటకు ప్రకటితమయ్యే రూపు మారుతుంది. దాని తీవ్రత మారుతుంది అన్నమాట.

ఒక పదార్థం కాలినప్పుడు వెలుతురు వస్తుంది. ఎంత వెలుతురు వస్తుంది అన్నది పదార్థలక్షణంపై, పదార్థస్వభావంపై ఆధారపడి ఉంటుంది. ప్రకటితమయ్యే వెలుతురు తీవ్రతలాగే మనిషిలోని శక్తి కూడా అంతే. కాబట్టి తరచి చూస్తే ఏ వ్యక్తీ మరొకరి కన్నా ఎక్కువ కాదు. ఎవరూ ఎవరికీ తక్కువ కాదు. ఎక్కువతక్కువలు వ్యక్తి తన జీవలక్షణం గుర్తించి, తనలో దాగి ఉన్న శక్తిస్వరూపాన్ని గ్రహించి, దాన్ని వ్యక్తపరచటంలో చూపే తపనలోనే ఉంటుంది.

ఈ సత్యాన్ని గ్రహించి మన పూర్వులు 'ఈశావాస్యం ఇదం సర్వం' అన్నారు. ప్రపంచమంతా ఈశ్వరుడే. ప్రతి అణువునా ఈశ్వరుడే. ప్రతి వ్యక్తిలో ఉన్నదీ ఈశ్వరుడే.

ఈశ్వరుడిలో ఎక్కువతక్కువ లుండవు. ఎక్కువతక్కువలు తనలో ఉన్న ఈశ్వరుడిని గుర్తించటంలోనే ఉంటుంది.

హనుమంతుడిలో సముద్రాన్ని లంఘించగల శక్తి ఉంది. కానీ ఓ మూల కూర్చుని విషాదంలో మునిగిపోయాడు. సముద్రాన్ని దాటలేక వానరు లంతా నిరాశకు గురవుతున్నా, హనుమంతుడు, ఆ పని సాధించగల శక్తి ఉండి కూడా నిర్వ్యాపారంగా కూచుండిపోయాడు. జాంబవంతుడు హనుమంతుడిలోని శక్తిని తెలియజేస్తే కానీ హనుమంతుడు సముద్రాన్ని దాటేందుకు సిద్ధపడలేదు.

ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది.

మరి అందరిలోనూ శక్తి సమానంగా ఉంటే, సముద్రాన్ని అందరూ దాటగలగాలి. ఒక్క హనుమంతుడే ఎందుకు దాటాడు? అని అడగవచ్చు.

దానికీ సమాధానం ఉంది. శక్తి ఒకటే అయినా అది ప్రకటితమయ్యే తీరు వేరు. అందుకు ముందు వ్యక్తి తనలోని శక్తిని గుర్తించాలి. ఇతరవానరులు ఆ పని చేయలేరు. ఆరంభం నుంచీ హనుమంతుడు శక్తిని ప్రదర్శిస్తూ వచ్చాడు. మరో విషయంవైపు దృష్టి మళ్ళకుండా తన శక్తిని ప్రకటితం చేయటంపైనే దృష్టి పెట్టాడు.

ఎలాగైతే సానబెడితే కానీ వజ్రానికి మెరపు రాదో అలాగే శక్తిని ప్రదర్శిస్తున్న కొద్దీ అది తీవ్రతర మౌతుంది. నైపుణ్యం పెరుగుతుంది. హనుమంతుడి విషయంలో అదే జరిగింది. అందుకే ఇతరులు వంద, ఎనిమిది వందల యోజనాలే లంఘించగలిగితే, హనుమ సముద్రాన్ని దాటగల శక్తి సాధించాడు.

అయితే తన శక్తిని పెంపొందించుకున్నా, దాన్ని ప్రదర్శించేందుకు వ్యక్తికి ప్రేరణ కావాలి. ఆ ప్రేరణ వ్యక్తికి స్వతహాగా మనస్సు లోంచి వస్తే సమస్య లేదు. లేకపోతే బాహ్యప్రేరణ కావాలి. ఈ బాహ్యప్రేరణ గురువు ద్వారా లభించవచ్చు. తల్లిదండ్రుల ద్వారా లభించవచ్చు, సమాజం నుంచి లభించవచ్చు.

హనుమంతుడికి బాహ్యప్రేరణ అవసరమైంది. హనుమంతుడికే కాదు, మన అందరికీ బాహ్యప్రేరణ అవసరం. ఒక రచయితకు పాఠకుల మెప్పు ప్రేరణనిస్తే, గాయకుడికి శ్రోతల కరతాళధ్వనులు ప్రేరణనిస్తాయి. నటుడికి ప్రేక్షకుల అభిమానం ఊపు నిస్తే, నాయకుడికి ప్రజల సమర్థన శక్తినిస్తుంది.

అయితే ఇక్కడ మరో సందేహం జనిస్తుంది.

తనలో శక్తి ఉండి, ఆ శక్తిని గుర్తించిన వ్యక్తికి దాన్ని ప్రదర్శించేందుకు ప్రేరణ అవసరం ఏముంది?

ఇక్కడే మనల్ని వెంటాడి, అచేతన (సబ్-కాన్షస్)లో ఉంటూ మన ఆలోచనల్ని ప్రభావితం చేసే భయాలు ప్రధానపాత్ర వహిస్తాయి.

సర్వశక్తిమంతుడు హనుమంతుడు. కానీ 'నేను సర్వశక్తిమంతుణ్ని. సముద్రాన్ని దాటేస్తాను' అంటూ ధైర్యంగా ముందుకు రాలేకపోయాడు. ఆయన ధైర్యంగా ముందుకు రాలేకపోవటం వెనుక ఉన్నది 'పరాజయభావన' అంటే తాను 'ఈ పని చేస్తానని ముందుకు వచ్చి చేయలేకపోతే?' అందరూ నవ్వుతారు. హేళన చేస్తారు. వెక్కిరిస్తారు. తాను నవ్వుల పాలవుతాడు. ఈ అవమానం నుంచి తప్పించుకోవాలంటే, నోరు విప్పకపోవటమే మంచిది. అనుకుని కదలకుండా ఉండిపోయాడు.

దీన్ని మనం 'జడత్వం' అంటాం. పైకి బద్ధకం, నిర్లక్ష్యం, అయిష్టం – ఇలా ఎన్ని రకాల పేర్లు వాడినా మౌలికంగా ఇవన్నీ భయం వ్యక్తమయ్యే విభిన్నరూపాలు.

దీన్ని అర్థం చేసుకోవాలంటే మనం భౌతికశాస్త్రంలోని న్యూటన్ చలనసూత్రాలను తెలుసుకోవాల్సి ఉంటుంది. కదలకుండా, చలనరహితంగా ఉన్న వస్తువు చలనరహితంగా ఉండేందుకే ఇష్టపడుతుంది. అది కదలాలంటే దానిపై శక్తి ప్రయోగం జరగాల్సిందే. అలా ఒక్కసారి కదలటం ఆరంభించిన వస్తువు కదులుతూనే ఉంటుంది. అది ఆగాలన్నా, దిశ మార్చాలన్నా మళ్ళీ శక్తి అవసరం అవుతుంది. ఇవీ న్యూటన్ సూత్రాలు.

చలనరహితస్థితిలో ఉన్న వస్తువు అదే స్థితిలో ఉండిపోవాలనుకోవటాన్ని 'జడత్వం' అంటారు. అంటే నిత్యపరివర్తనశీలమైన ప్రపంచంలో మనిషి మార్పు కోరడన్నమాట. మార్పు అనేది ఒక తెలియని విషయం. మార్పు ప్రభావం ఎలా ఉంటుందో తెలియదు. దాని ఫలితాలు మంచివో, చెడువో తెలియదు. దాని వల్ల కలిగే నష్టాల గురించి తెలియదు. అటువంటప్పుడు అలవాటైన భద్రతను వదలి ఏదీ తెలియని 'మార్పు'ను ఎలా ఆహ్వానిస్తాం?

మనలో శక్తి ఉంది. కానీ దాన్ని ప్రదర్శిస్తే అభాసుపాలవుతామేమో తెలియదు. ఎందుకొచ్చిన గొడవ? అంటూ మిన్నకుండిపోతా రనేకులు.

ఒక వ్యక్తి మిత్రుల నడుమ అద్భుతంగా మాట్లాడతాడు. కానీ స్టేజి ఎక్కితే ఏమీ మాట్లాడలేడు. అనేక రకాల భయాలు అతడి గొంతు నొక్కేస్తాయి. దాంతో స్టేజి ఎక్కటం మాని, ప్రేక్షకులలో కూచుంటాడు. తనలో శక్తి ఉండి కూడా ప్రదర్శించలేక పోతున్నందుకు

బాధపడతాడు. అది బాగా మాట్లాడేవారిపై ద్వేషంగా ప్రకటితమౌతుంది. ప్రేక్షకులలో కూర్చుని రకరకాల విసుర్లు, వ్యాఖ్యలు చేస్తూ సంతృప్తి పడతాడు.

అతడి భయాలను మించాలంటే, అతడిలోని శక్తిని అతడికి తెలియజెప్పే ప్రేరేపకుడి అవసరం అవుతుంది. అంటే అంతర్గతంగా ఉన్న భయం జడత్వంలా ప్రకటితమైతే, దాన్ని పారద్రోలేందుకు ప్రేరణ కానీ, స్ఫూర్తి కానీ కావాలన్నమాట. హనుమంతుడికి జాంబవంతుడి మాటలు ప్రేరణనిచ్చాయి. అతడి భయాలను తొలగించి విజయపథం వైపు నడిపించాయి. 'నీకంత శక్తి ఉంది. నువ్వు గతంలో అంత చేశావు. ఇప్పుడిదో లెక్కా?' అని చెప్పాల్సి వచ్చింది. అప్పుడు కానీ సర్వశక్తిమంతుడిలో కదలిక రాలేదు. మనలో కదలికను నిరోధించి జడత్వాన్ని పెంచే భయాల గురించి మరి కాస్త చర్చిద్దాం.

## జడత్వం - భయం

పనిచేయాలంటే మనిషిలో ఉండే అయిష్టం, మనిషికే కాదు ప్రపంచంలోని జీవులకూ, నిర్జీవులకూ వర్తిస్తుందని న్యూటన్ చలనసూత్రం నిరూపిస్తుంది. ఈ అయిష్టం పరోక్షంగా మౌలికంగా జీవుల్లో ఉన్న మరణభయ ఫలితమనీ మనం తెలుసుకున్నాం. గమనించి చూస్తే, ఈ భయాలు చిత్రవిచిత్రమైన రూపాలలో వ్యక్త మౌతాయి. ఒకరికి బల్లిని చూస్తే భయం. మరొకరికి బొద్దింక అంటే విపరీతమైన భయం. ఇంకొకరికి 'పాము' పేరు వింటేనే వణుకు వస్తుంది. మరొకరు 'రక్తం' చూస్తే చాలు కళ్ళు తిరిగి పడిపోతారు. ఈ చిన్నచిన్న భయాలను జయించటంలోనే మనిషి వ్యక్తిత్వం ప్రస్ఫుట మౌతుంది. తనలో అడుగడుగునా చెలరేగుతూ, ఏ పని చేయాలన్నా వెనక్కు లాగే భయాలను జయించటం వ్యక్తిత్వవికాసపథంలో ప్రయాణించాలంటే తప్పనిసరి. మనిషిలోని ఈ చిన్న చిన్న భయాలు అతని ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తాయి. అతడిలోని అభద్రతా భావాలను బహిరంగం చేసి అతడిని బలహీనం చేస్తాయి. చిన్న చిన్న సంఘటనలలో ప్రదర్శితమయ్యే ఈ భయాలు వ్యక్తిని హేళనకు గురి చేస్తాయి. మానసికంగా క్రుంగదీస్తాయి.

'బిల్లు' కట్టేందుకు 'క్యూ'లో నిలబడ్డ వ్యక్తి 'తన వంతు వస్తుందో, రాదో' నన్న కంగారు ప్రదర్శించటం, మాటిమాటికీ డబ్బు లెక్కపెట్టుకోవటం, కౌంటర్ దగ్గరకు రాగానే ఏదో వంకన క్లర్కు వెనక్కు పంపేస్తాడన్నట్టు ప్రవర్తించటం చూస్తే, ఒక మామూలు 'బిల్లు' కట్టటం కొందరికి 'ఎంత ప్రాణాంతకంగా' అనిపిస్తుందో అర్థమౌతుంది. ఈ రకమైన కంగారునే సినిమా టికెట్లు కొనటంలో, రిజర్వేషన్ ఆఫీసుల్లో, కాలేజీ సీట్లలో, బస్సులు ఎక్కటంలో - ఇలా ఒకటేమిటి, ప్రతి చిన్న విషయంలో కనిపిస్తుంది. ఈ

రకమైన భయాల వల్ల లాభం లేదు.  పైగా ఆరోగ్యం దెబ్బ తింటుంది. ప్రస్తుతం ప్రతి వారినీ బాధిస్తున్న అధికరక్తపుపోట్ల వంటి అనారోగ్యాలకు దారి తీస్తాయి ఇటువంటి భయాలు.

ఇటువంటివే ఐనా మనిషిని అడుగు ముందుకు వేయనివ్వని భయం 'ఆరంభభయం'. ఏ పని ఆరంభించాలన్నా, ఏదో తెలియని భయం మనిషిని వెనక్కు లాగుతుంది. 'నేను చేయగలనో లేదో, నా వల్ల కాదీ పని, నాకు చేత కాదు' అంటూ అడుగు ముందుకు వేయకుండా ఆగిపోతారు కొందరు. 'ఇవాళ కాదు', 'ఇప్పుడు మూడ్ లేదు', 'కుదరటం లేదంటూ వాయిదా వేస్తారిం కొందరు. అడుగు ముందుకు వేయకపోవటం, వాయిదా వేయటం రెండూ ఒకే భయానికి రెండు రూపాలు. ఇటువంటి వారందరి భయం తొలగించి, వారిని కార్యోన్ముఖులు చేయటమనే కార్యాన్ని భగవంతుడు అర్జునుని ద్వారా చేశాడు.

*'క్లైబ్యం మా స్మ గమః పార్థ! నైతత్త్వ య్యుపపద్యతే।*
*క్షుద్రం హృదయదౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప॥'*

(పౌరుషం వదలి షండుడిలా ప్రవర్తించటం అనుచితం. నీది నీ వారిపై జాలి కాదు. నీచమైన పిరికితనం. గుండె దిటవు లేకపోవటం. అలాంటి దౌర్బల్యాన్ని వదిలేయి. యుద్ధానికి సిద్ధం.) అంటూ యుద్ధం చేయనన్న అర్జునుడిని రెచ్చగొట్టాడు కృష్ణుడు.

వ్యక్తిని ప్రేరేపించి కార్యోన్ముఖుడిని చేయటంలో మరో పద్ధతి ఇది. ఏ వ్యక్తిలో ఐతే శక్తి ఉండి, కార్యోన్ముఖుడు కాకుండా ఉండేందుకు కారణాలు వెతుకుతుంటాడో, అటువంటివాడిని రెచ్చగొట్టాలి. హేళన చేయాలి. దాంతో రోషానికి వచ్చి వ్యక్తి కార్యోన్ముఖుడవుతాడు.

ఇక్కడ అర్జునుడు సమస్తమానవాళినీ పట్టి పీడించే జడత్వాన్ని ప్రదర్శిస్తున్నాడు. పని సాధించగలిగి ఉండీ పిరికితనం ప్రదర్శిస్తున్నాడు. అటువంటివాడిని హేళన చేసి రెచ్చగొట్టాడు కృష్ణుడు. అతని గొప్పతనాన్ని వివరిస్తూ మేలమాడాడు. ఆ పైన జ్ఞానబోధ చేశాడు. అంటే వ్యక్తిని ప్రేరేపించటంలో అతడి భయాలను తొలగించటం ప్రధానపాత్ర వహిస్తుందనన్నమాట. వ్యక్తిని హేళన చేయటంతో సరిపోదు. జ్ఞానబోధ చేయాలి. అతడి శక్తి అతడు గుర్తించేట్టు చేయాలి.

గమనిస్తే హనుమంతుడిని కార్యోన్ముఖుడిని చేయటంలో పొగడ్త ప్రధానపాత్ర వహిస్తే, అర్జునుడిని ముందుకు నడిపించటంలో హేళన, జ్ఞానబోధలు కీలకమైన పని చేశాయి.

అంటే ప్రతి వ్యక్తికీ పొగడ్త కావాలి. ప్రతి వ్యక్తికీ అతడి శక్తిని గుర్తు చేయాలి. అతడు సాధించబోయే పనిలో విజయం సాధిస్తే అనుభవించే సౌఖ్యాలతో బాటు, పరాజయం పొందినా పరవాలేదన్న ధైర్యాన్నివ్వాలి. 'యుద్ధంలో గెలిస్తే రాజ్యం దక్కుతుంది. ఓడిపోతే వీరస్వర్గం లభిస్తుంది. కాబట్టి గెలుపు – ఓటములతో పని లేకుండా కార్యోన్ముఖుడవు క'మ్మని అర్జునుడికి కృష్ణుడు బోధించాడు. కృష్ణుడు ఉపయోగించిన ఈ తర్కాన్ని ఉపయోగించి మనం మన మామూలు భయాలన్నిటినీ మించవచ్చు.

ఓ వ్యక్తి కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నాడు. ఉద్యోగం వచ్చేవరకూ వస్తుందో, లేదోనన్న ఆరాటం తీరా ఉద్యోగం వచ్చిన తరువాత 'చేయగలనో? లేదో?' అన్న భయంగా మారింది. కొత్త వ్యక్తుల నడుమ ఎలా నెట్టుకొస్తానో? అన్న భయంగా రూపాంతరం చెందింది. దాంతో ఏదో ఓ కారణంతో ఉద్యోగానికి వెళ్లకుండా ఉండాలని ప్రయత్నించాడతడు. కానీ తప్పనిసరిగా వెళ్ళాల్సివచ్చింది. చేరిన వారంలో తన భయాలను తలచుకుని నవ్వుకున్నాడు. ఎందుకంటే, ఉద్యోగంలో చేరే ముందు తనని తాను ప్రశ్నించుకున్నాడు ఆ అబ్బాయి.

'ఏమిటీ నాకు భయం? ఎందుకు భయపడుతున్నాను నేను? ఎవరయినా కొత్తల్లో తప్పులు చేస్తారు. పని శ్రద్ధతో నేర్చుకుని బుద్ధిగా చేస్తే తప్పులు రావు. పని సరిగ్గా చేసేవాడిని అందరూ గౌరవిస్తారు. కాబట్టి నేను దేనికీ భయపడాల్సిన అవసరం లేదు. ఒకవేళ పని కష్టమై చేయలేకపోతే, వేరే ఉద్యోగం వెతుక్కుంటాను. ఐనా నేను పని ఎందుకు చేయలేను? నా కన్నా ముందు ఈ పని చేసినవారూ మనుషులే. నేను వదిలేస్తే ఎవరో చేస్తారు. మరి వాళ్లంతా చేయగలిగినప్పుడు నేనెందుకు చేయలేను? ఆ ఎందుకు చేయలేనో తెలుసుకునేందుకైనా ఉద్యోగంలో చేరాలి! ఎందుకు చేయలేనో తెలుసుకున్న తరువాత ఆ లోపాన్ని సరిచేసుకోవాలి' అని నిశ్చయించుకున్నాడు, విజయం సాధించాడు.

ఈ రకంగా వ్యక్తి తన భయస్వరూపాన్ని ప్రశ్నించుకోవాలి. తన శక్తిని సమీక్షించుకోవాలి. ఎవరో కొన్ని మైళ్లు పరుగెత్తారు కాబట్టి నేనెందుకు పరుగెత్త లేననుకోవటం మూర్ఖత్వం. అలా పరుగెత్తగలిగే ముందు ఆ వ్యక్తి పొందిన శిక్షణను తలచుకుని తానూ అలా శిక్షణ పొందితే చేయగలననుకోవాలి. తన దృష్టి ఏ వైపుందో గమనించి, ఆ విషయంలో ప్రావీణ్యం సంపాదించేందుకు కృషి చేయాలి.

విశ్వనాథన్ ఆనంద్ చదరంగంలో ప్రతిభ ప్రదర్శిస్తే, సచిన్ టెండూల్కర్ క్రికెట్‌లో ప్రావీణ్యం సాధించాడు. విక్రమ్ సేఠ్ రచనారంగంలో పేరు సాధిస్తే, రామ్‌గోపాల్‌వర్మ

సినీరంగంలో పేరు సాధించాడు. బాలసుబ్రహ్మణ్యం సినీ పాట వల్ల పేరు పొందితే, బాలమురళీకృష్ణ శాస్త్రీయసంగీతంలో సమాజాన్ని ఉర్రూతలూగించాడు. ఇలా అసంఖ్యాకులు అనేకరంగాల్లో అపరిమితమైన ప్రతిభ ప్రదర్శించి తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. భవిష్యత్తులో అనేకులు తమ ప్రతిభను ప్రదర్శిస్తారు. ప్రజల మెప్పు పొందుతారు.

ఎలాగైతే ప్రతి విత్తనంలో మహావృక్షమయ్యే లక్షణాలు నిక్షిప్తమై ఉంటాయో, అలాగే ప్రతి వ్యక్తిలో అమోఘమైన శక్తి నిగూఢంగా ఉంటుంది. తనంతట తాను ఆ శక్తిని గుర్తించగలగటం వ్యక్తి విజయానికి ఒక దారి, తన ఆంతరంగికులు, గురువుల ప్రేరణ ద్వారా దాన్ని గుర్తించి, ఆ శక్తిని సద్వినియోగం చేసుకోగలగటం విజయానికి మరో దారి. రాముడు శక్తిశాలి, ధైర్యవంతుడు. కానీ సీత దూరమైతే మామూలు మనుషుల్లాగే దుఃఖించాడు. చెట్టు, పుట్ట, గుట్ట, పిట్టలను సీత జాడ అడిగాడు రోదిస్తూ. అప్పుడు అతడికి ప్రేరణ నిచ్చింది లక్ష్మణుడు. 'వనంలోని అణువణువూ సీత కోసం వెతుకుదాం. దుఃఖించకు రామా' అంటూ 'మా విషాదం మహాబుద్ధే కురుయత్నం మయాసహ!' అంటాడు 'విషాదానికి లోను కాకు. ఇద్దరం కలిసి సీతను వెతికే ప్రయత్నాలు చేద్దాం' అంటూ ధైర్యం చెప్తాడు. అంటే శ్రీరాముడంతటివాడే ఓ బలహీనక్షణంలో భయానికి లొంగిపోయాడు. సకలజగద్రక్షకుడే నిర్వీర్యుడై దుఃఖించాడు. అటువంటి సమయంలో లక్ష్మణుడు ఆయనకు ధైర్యం చెప్పి కర్తవ్యం వైపు అతడి దృష్టిని మళ్లించాడు. కాబట్టి మనలోని భయాలను చూసి మనం సిగ్గుపడవలసిన అవసరం లేదు. మనం సిగ్గుపడవలసింది ఆ భయాలకు లొంగిపోతున్నందుకే. పక్కన ప్రేరణనిచ్చే వారెవరూ లేకపోతే మన ప్రాచీనుల నుండి ప్రేరణ పొందాలి. మన పురాణకథల నుండి స్ఫూర్తి పొందాలి. బాహ్యంగా అందే స్ఫూర్తి కన్నా అంతరంగంలో ఉద్భవించే ప్రేరణ ఉత్తమమైంది. హనుమంతుడికి ప్రతి సారీ ప్రేరణ అవసరమైంది. రాముడికి ఒకేసారి అవసరమైంది. అదే శ్రీకృష్ణుడు ప్రతిక్షణం జగత్తుకు ప్రేరణనిస్తూ ముందుకు సాగాడు.

అంటే ఏ వ్యక్తీ ఎవరికీ తక్కువ కాదు. భగవంతుడి సృష్టిలో హెచ్చుతగ్గులు లేవు. హెచ్చుతగ్గులు మనలోని భగవదంశను గుర్తించి దాన్ని భద్రపరచుకునేందుకు వ్యక్తి ప్రయత్నించటంలోనే ఉంది. మహాభారతంలో అర్జునుడు, కర్ణుడు సమానమైన శక్తి కలవారు. గమనిస్తే అర్జునుడి కన్నా కర్ణుడు శక్తిమంతుడు. అర్జునుడు రాజపుత్రుడు. అతడి జీవితం వడ్డించిన విస్తరి. అదే కర్ణుడు సూతపుత్రుడు. జీవితంలో ప్రతి విషయానికీ

అతడు పోరాడాల్సి వచ్చింది. చివరికి తన విలువిద్యను ప్రదర్శించేందుకు కూడా కర్ణుడు అవమానాలు సహించాల్సి వచ్చింది. కానీ ఎక్కడా కర్ణుడు భీరుడవలేదు. తన నైపుణ్యాన్ని నమ్ముకున్నాడు. అస్త్రశస్త్రాలలో అసమానప్రావీణ్యం సాధించాడు. అయినా సరే యుద్ధంలో ఓడిపోవాల్సి వచ్చింది. కర్ణుడి చావుకు పదివేల కారణాలు చెప్తారు. కానీ అసలు కారణం రథసారథుల్లో ఉంది. అర్జునుడి రథసారథి శ్రీకృష్ణుడు. భగవంతుడు 'క్లైబ్యం'తో యుద్ధం చేయనన్నవాడిని యుద్ధోన్ముఖుడిని చేశాడు. జ్ఞానబోధ చేశాడు. భయాల్ని నశింపచేశాడు. అర్జునుడిని విజయుడిని చేశాడు. అర్జునుడికి దీటైన ప్రతిభాపాటవాలున్న కర్ణుడి రథసారథి శల్యుడు. అడుగడుగునా కర్ణుడిని నీరసపరిచాడు. 'నీ వల్ల ఏమౌతుంది?' అంటూ నిరుత్సాహపరిచాడు. అడుగు కదపకముందే 'ఓటమి తథ్యం పొ'మ్మన్నాడు. అడుగడుగునా కర్ణుడిలోని భయాలను పెంచి, జడత్వానికి నీరు పోశాడు. ఫలితంగా కర్ణుడు పరాజయం పాలయ్యాడు.

భారతీయతత్త్వంలో మనిషి జీవితం రథప్రయాణం వంటిది. మనస్సు రథసారథి వంటిది. జీవితం మంచిచెడుల నడుమ పోరాటం. అదే మహాభారతం. ఈ పోరాటంలో మనిషి ప్రయాణించే ఇంద్రియాలు పూన్చిన గుర్రానికి సారథి భగవంతుడైతే వ్యక్తిలో భయాలు తొలగుతాయి. భగవంతుడి మార్గదర్శనంలో భయాలను జయించి వ్యక్తి విజయుడవుతాడు. అలా కాక మనిషి భగవంతుడిని వదలి, తన భయాలకు లొంగి కళ్లెం వాటి చేతికిస్తే పరాజయం తప్ప గత్యంతరం లేదు. ఈ నిజాన్ని తిక్కన ఈ పద్యంలో అద్భుతంగా వర్ణించాడు.

*పాపంబులు కర్జములై*
*యేపుం గనెనేని యవియు నింపగు ధర్మ*
*వ్యాపారమ్ము లపేతము*
*లై పరిణతి పొందెనేని యట్టులె చెల్లున్.*

పాపములు పరిణతి పొందుతాయి. పాపాలు చేస్తున్నంత కాలం ఇంపుగానే ఉంటాయి. ధర్మాలు పరిహరించినా పూర్వజన్మ సుకృతం ఉన్నంత కాలం చెల్లిపోతుంది. సుకృతం అయిపోయిన తరువాత దుఃఖం అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి పాపం చేయవద్దు. ధర్మం చేయాలి. ధర్మమార్గంలో భయాలుండవు. ఎందుకంటే ధర్మం ప్రకారం ప్రవర్తించే వాడి వెంట భగవంతుడుంటాడు. అతడి మనస్సులోని భయాలను తొలగిస్తాడు. కాబట్టి ధర్మమార్గంలో భగవంతుడు మనస్సుకు మార్గదర్శనం చేస్తుండగా ప్రయాణించే

వ్యక్తి నిత్యజీవితంలో జరిగే మంచిచెడుల నిత్యఘర్షణలో విజయం సాధించి సంపూర్ణవ్యక్తిగా ఎదుగుతాడన్నమాట. అలా కాక వ్యక్తి ఎంత శక్తిమంతుడైనా, ఎంత మంచివాడైనా, ధర్మం వదలితే, పరాజయం తప్పదు.

మంచిచెడుల మధ్య తేడాను గ్రహించే విచక్షణను ప్రదర్శించి, సంపూర్ణ వ్యక్తిత్వ సాధన మార్గంలో ప్రయాణించటంలో తోడ్పడే ఆలోచనలపై నియంత్రణ సాధించటం గురించి చర్చిద్దాం.

✣ ✣ ✣

# వ్యక్తిత్వం - ఆలోచనలు

## ఆలోచనపై నియంత్రణ

*కేనేషితం పతతి ప్రేషితం మనః*
*కేన ప్రాణః ప్రథమః ప్రైతియుక్తః*
*కేనేషితాం వాచ మిమాం వదన్తి*
*చక్షుః శ్రోత్రం క ఉ దేవో యునక్తి॥*

దేని చేత ప్రేరేపితమై మనస్సు విషయాలపై పడుతుంది? దేని చేత ప్రేరేపితమై ప్రాణం తన పనులను నిర్వర్తిస్తుంది? దేని ఇష్టాన్ని అనుసరించి మానవులు మాటలు పలుకుతారు? ఏ బుద్ధి, కన్నులనూ, చెవులనూ నియమిస్తుంది?

ఆరంభం నుంచీ భారతీయతత్త్వవేత్తలు, ఏ విషయాన్నయినా మూలాలకు వెళ్లి కూలంకషంగా చర్చించటానికే ప్రాధాన్యం ఇచ్చారు. ఏ విషయాన్నీ పైపైనే స్పృశించి వదిలేయటం గాని, అన్నీ తెలుసని విర్రవీగటం గాని, మాకు తెలిసిందే పరమసత్యమని ప్రపంచమంతా ఒప్పుకోవాలన్న మూర్ఖపు పట్టుదల గానీ, ఏ నాడూ భారతీయులకు లేవు. ఆలోచనలను నియంత్రించటంపై భారతదేశంలో జరిగిన పరిశోధనలు కూడా అలవాటైన రీతిలో క్షుణ్ణంగా మూలాలకు వెళ్ళి జరిపినవే.

'కేనోపనిషత్తు'లోని ఆరంభశ్లోకం, ఆలోచనలపై పరిశోధనకు నాంది వంటిది. ఆలోచనలను నియంత్రించటం మానవుడు మనిషిగా ఎదగటంలో ప్రధానపాత్ర వహిస్తుందన్నది నిర్వివాదాంశం. ఆలోచనలపై ఇంద్రియాలు ప్రభావం చూపిస్తాయన్నదీ ఎటువంటివాదమూ అవసరం లేని నిజం. కళ్లు, చెవులు, నాసిక, చర్మం, నాలుక వంటి ఇంద్రియాలు గ్రహించిన అంశాలు మెదడులో ముద్రితమౌతాయని, ఆధునికమానసిక శాస్త్రవేత్తలు కూడా అంగీకరిస్తున్నారు. వారు జరిపిన అనేక పరిశోధనల ప్రకారం మెదడు ఒక టేప్ రికార్డర్ లాంటిదని, బాల్యం నుంచీ ప్రతి విషయం, ప్రతిభావం, ప్రతి

సంఘటన, ప్రతి స్పందన మెదడులో నిక్షిప్తమై ఉంటుందనీ తేలింది. ఎలాగైతే కొత్తగా కొన్న క్యాసెట్లు ఎక్కువసార్లు వింటూ, పాతబడుతున్నకొద్దీ పక్కన పడేసి, కొన్నాళ్ళకు వాటిని విస్మరిస్తామో, అలాగే సంఘటనలు జరిగినప్పుడు ఎక్కువ ప్రభావం చూపిస్తూ, రాను రాను మెదడు పొరల్లో జ్ఞాపకాలుగా మిగిలి, కొద్ది కాలానికి విస్మృతిలో పడతాయి. కానీ, వ్యక్తి ప్రమేయం లేకుండానే వాటి ప్రభావం అతని వ్యక్తిత్వాన్ని నిర్దేశిస్తుంది. అతని ఆలోచనల కొక దిశనిస్తుంది. అందుకే ఆధునిక మానసిక విశ్లేషకులు మనిషి మెదడుపై పడే ముద్రలను 'చైల్డ్, పేరెంట్, అడల్ట్' అని మూడు రకాలుగా విభజించారు. ఈ మూడు రకాల ముద్రల పరస్పర కలయిక ప్రభావంతో వ్యక్తిత్వం ప్రదర్శిత మౌతుందని నిరూపించారు. భారతీయతత్త్వ వేత్తలు ఈ విషయాన్ని ముందే గుర్తించారు. అందుకే బాల్యం నుంచీ 'మంచి వినాలని, మంచి ఆలోచనలు కలగాలని, తాను అందరితో కలసి ఉండాలని, అందరూ అభివృద్ధి చెందాలనీ' మంచి భావాలు నాటాలని సూచించారు. ఐతే భారతీయతత్త్వవేత్తలు ఇంతటితో సంతృప్తి పడలేదు.

'అసలు ఆలోచనలు ఎక్కడ నుంచి వస్తాయి? ఎలా వస్తాయి' అని శోధన ఆరంభించారు. ఈ విషయంలో విస్తృతమైన పరిశోధనలు జరిగాయి. ఈ పరిశోధనలు పలు మార్గాల ప్రయాణించాయి. ఒక మార్గంలో పరిశోధనల ఫలితంగా ప్రపంచంలో ఆలోచనలు తరంగాల రూపంలో ఉంటాయని, మనిషి మెదడు ఓ 'రిసీవర్' లాంటిదని నిర్ధారించారు. ప్రతి వ్యక్తికీ జన్మతః ఓ సంస్కారం పారంపర్యంగా వస్తుంది. ఆపై అతను పెరిగిన వాతావరణానికి ఆ సంస్కారం స్పందిస్తుంది. దాని ఫలితంగా అతని మెదడు కొన్ని ఆలోచనలను అందుకుని ప్రభావితమయ్యేందుకు సిద్ధంగా ఉంటుంది. అటువంటి సమయంలో అతని మెదడు ఆ ఆలోచనలను అందుకుని స్పందిస్తుంది అని తేల్చి చెప్పారు. అందుకే ఒక్కోసారి హఠాత్తుగా మెరపులా ఓ ఆలోచన వస్తుంది. ఎక్కడ నుంచి వచ్చిందో, ఎలా వచ్చిందో ఎంత తరచినా అర్థం కాదు. రోజూ ఆర్కిమెడిస్ తొట్టెలో స్నానం చేసేవాడు. కానీ, ఎప్పుడైతే అతడి మెదడు బంగారంలో కల్తీని కనుక్కొనే పద్ధతి గురించి ఆలోచిస్తూ వుందో, అప్పుడు తొట్టిలో స్నానం అతడి ఆలోచనకొక దిశను ఇచ్చింది. 'యురేకా' అంటూ ఆనందంతో వీథుల వెంట పరుగెత్తాడు. కానీ తరచి చూస్తే బంగారంలో కల్తీ కలయిక, బరువుకు తగ్గ నీరు తొలగిపోవటం అనే రెండు విభిన్న అంశాలను ముడిపెట్టి సమస్యను పరిష్కరించే ఆలోచన ఎలా వచ్చింది? అన్న ప్రశ్నకు సమాధానం లేదు. దాన్ని 'ఇన్‌స్పిరేషన్' అని 'క్రియేటివిటీ' అనీ రకరకాలుగా వివరిస్తారు.

అలాగే, వృద్ధులను, శవయాత్రలను, ప్రతి ఒక్కరూ ఏదో ఓ సమయంలో చూస్తూనే ఉంటారు. ఎన్ని జాగ్రత్తలు వహించినా గౌతమబుద్ధుడు సైతం అటువంటి దృశ్యాలను చూసి ఉంటాడు. కానీ రోజూ కలగని కదలిక ఓ ప్రత్యేకమైన రోజు కలిగింది. ఆ దృశ్యాలనూ చూస్తూనే ఉన్నా ఎవరిలో కలగని వైరాగ్యం గౌతమబుద్ధుడికే కలిగింది. ఎందుకంటే, ఆ సమయానికి అతని మనస్సు వైరాగ్యభావనలను స్వీకరించేందుకు పక్వస్థితిలో ఉంది.

అంటే అందరం ఆలోచిస్తాం. అందరం స్పందిస్తాం. కానీ ఒకే విషయానికి అందరి స్పందనా ఒకే రకంగా ఉండాలని లేదు. ఒకరికి హాస్యంగా అనిపించింది, మరొకరికి ప్రాణాంతకంగా తోచవచ్చు. ఒకరు తేలికగా కొట్టేసే విషయాన్ని ఇంకొకరు సీరియస్‌గా పట్టించుకోవచ్చు. ఒకరు విట్టీగా, చమత్కారపూరితంగా మాట్లాడతారు. ప్రతి మాటకూ వారి వద్ద ఓ చమత్కారభరితసమాధానం సిద్ధంగా ఉంటుంది. మరొకరికి ఎంత ప్రయత్నించినా నోరు పెగలదు.

ఇలా తరచి చూస్తే, వ్యక్తులందరూ ఒకటే రకమైన వాతావరణంలో ఉన్నా, ఒకే రకమైన దారుల్లో ప్రయాణిస్తూ, అవే అనుభవాలు పొందుతూన్నా వారి 'ఆలోచనలు' ప్రతి ఒక్కరినీ ఇతరుల కన్నా భిన్నంగా, ప్రత్యేకంగా నిలబెడతాయి.

బాల్య అనుభూతుల ప్రభావం, పెరిగిన వాతావరణం, నేర్చుకున్న చదువు, జన్మతః వచ్చిన సంస్కారమే కాక, ఇంకేదో శక్తి వ్యక్తి ఆలోచనలను ప్రభావితం చేస్తున్నట్టు తోస్తుంది. 'ఇలా మాట్లాడాలి' అనుకొని మాట్లాడే వ్యక్తి కూడా 'ఇలా మాట్లాడాలని, ఎలా అనుకున్నావు?' అనడిగితే సమాధానానికి తడుముకుంటాడు. అంటే, ఒక మెరపులాగ మెదడులో ఆలోచనలు వెలుగుతాయి తప్ప ఆలోచనలకొక నిర్దిష్టపథం, రంగు, రూపు వంటివేవీ లేవన్నమాట. ఆలోచనలకొక భౌతికవ్యక్తీకరణ లేదన్న మాట. పాశ్చాత్య తత్త్వవేత్తలు ఇప్పటికీ ఈ విషయంలో తల బద్దలు కొట్టుకుంటున్నారు.

'నేను ఆలోచిస్తున్నాను – కాబట్టి నేనున్నట్టే' అన్న తత్త్వవేత్త రీనీ దేకార్తె సైతం భౌతికశరీరం, అధిభౌతికమైన మనసు ఆదేశాలనెలా పాటిస్తుందని చర్చించటం తప్ప ఏమీ తేల్చలేకపోయాడు. పదార్థం, మనసు మాట వింటుందా, మనసును పదార్థం నిర్దేశిస్తుందా అని పాశ్చాత్యతత్త్వవేత్తలు వాదాల్లో మునిగారు. సందిగ్ధాల సుడిగుండాలలో కొట్టుమిట్టాడుతున్నారు. ఐతే, భారతీయతత్త్వవేత్తలు ఈ సమస్యను పరిష్కరించటమే కాదు, ఆలోచనలపై నియంత్రణ సాధించే దిశలో అడుగు ముందుకు వేశారు కూడా.

శ్రోతస్య శ్రోత్రం మనసో మనోయద్
వాచోహ వాచం సఉ ప్రాణస్య ప్రాణః
చక్షుషశ్చ క్షురతి ముచ్య ధీరాః
ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవన్తి

మనిషిని నిర్దేశించేది ఆత్మ. ఆత్మశక్తితో చెవి వింటుంది. కన్ను చూస్తుంది. జిహ్వ మాట్లాడుతుంది. మనస్సు గ్రహిస్తుంది. ప్రాణం పని చేస్తుంది. బుద్ధిమంతుడు ఆత్మను ఈ ఇంద్రియవ్యాపారాల నుంచి వివక్షిస్తాడు. ఇంద్రియబద్ధమైన జీవితాన్ని దాటి అమరత్వాన్ని పొందుతాడు. ఇది కేనోపనిషత్కారులు కనుగొన్న సత్యం.

అంటే పదార్థం గొప్పదా? మనసు గొప్పదా? అన్న ప్రశ్నను దాటి 'ఆత్మ' అన్నిటినీ నిర్దేశిస్తుందని భారతీయతత్త్వవేత్తలు దర్శించారన్న మాట.

ఈ 'ఆత్మ' గురించిన పరిశోధనలు మరో శాస్త్రం వైపు దారి తీస్తాయి. అయితే, మనిషి శరీరంలో ప్రాణం ఉన్నంత వరకే 'ఆత్మ' పనిచేస్తుంది. (ఆ తరువాత అది ఏమౌతుందన్న ప్రశ్న మరో శాస్త్రానికి నాంది అయింది) ప్రాణాన్ని శరీరంలో కదలే ఊపిరి (వాయువు) బంధించి ఉంచుతుంది. ఊపిరి ఉన్నంత వరకే ఆలోచనలుంటాయి. ఇంద్రియాలు పని చేస్తాయి. ఊపిరి ఆగిపోతే ప్రాణం పోతుంది. అంతా శూన్యమై పోతుంది. మన ప్రతి చర్య శరీరంలో ఊపిరి రూపంలోని వాయు కదలికలపై ఆధారపడి ఉంటుంది. మనం ఏకాగ్రతతో పని చేసేటప్పుడు ఊపిరి బిగబడతాం. పరుగెత్తినప్పుడు వేగంగా ఊపిరి తీస్తూ ఆయాసపడతాం. శక్తిని కూడ దీసుకుని బలం ప్రయోగించేటప్పుడు శ్వాస బిగబట్టి, ఒక్కసారిగా వదలటం వల్ల శక్తిని కేంద్రీకృతం చేయగలుగుతాం. దీర్ఘనిద్రలో దీర్ఘంగా ఊపిరి పీలుస్తాం. మాట్లాడేటప్పుడు వాయు నియంత్రణ వల్ల రకరకాల శబ్దాలు సృష్టిస్తాం. అంటే, మన ప్రతి చర్య శరీరంలోని వాయుసంచలనం పైనే ఆధారపడి ఉందన్నమాట. అటువంటప్పుడు, శరీరంలోకి ఎటు నుంచో హఠాత్తుగా ప్రవేశించి ప్రభావితం చేసే ఆలోచనలను సైతం వాయు కదలికలు ప్రభావితం చేస్తూండవచ్చు కదా! అంటే, శరీరంలో కదిలే వాయునియంత్రణ వల్ల ఆలోచనలను నియంత్రించటం సాధ్యమయ్యే అవకాశం ఉంది కదా! అడ్డూ అదుపు లేని ఆలోచనలను నియంత్రించటం వల్ల వ్యక్తి సంపూర్ణవ్యక్తిత్వవికాసం సాధించి, అమరత్వాన్ని పొందవచ్చు కదా! ఈ దిశలో జరిగిన పరిశోధనల ఫలితంగా వాయు నియంత్రణ, తద్వారా ఆలోచనలపై నియంత్రణ సాధించేందుకు ప్రయోగాలు జరిగాయి. ఫలితంగా వ్యక్తిత్వవికాసంలో అత్యంతప్రాధాన్యం వహించే, ఆలోచనలపై నియంత్రణ సాధించేందుకు తోడ్పడే 'యోగశాస్త్రం' ఆవిర్భవించింది.

## యోగశాస్త్రం

*యుక్తాహార విహారస్య యుక్త చేష్టస్య కర్మసు*
*యుక్తస్వప్నావబోధస్య యోగో భవతి దుఃఖహా॥*

తిండిపోతుకు ఈ యోగం సాధ్యం కాదు. మరీ ఉపవాసాలు చేసేవారికి యోగం కుదరదు. ఎక్కువ నిద్రించేవాడికి, నిద్ర మాని జాగరణ చేసేవాడికి కూడా యోగసాధన అసాధ్యం.

కాబట్టి సర్వకర్మలలో మితాన్ని పాటించేవాడికే యోగం సిద్ధిస్తుంది. దుఃఖం నశిస్తుంది. భగవద్గీతలోని ఈ శ్లోకం వ్యక్తిత్వవికాసంలో యోగప్రాధాన్యాన్ని అత్యంత ప్రతిభావంతంగా వివరిస్తుంది.

ఆలోచనల నియంత్రణ వ్యక్తిత్వవికాసానికి రాజమార్గం వంటిది అని మనకు తెలుసు. ఆలోచనల నియంత్రణ యోగశాస్త్రంలో ఒక ప్రధానాంశం. ఐతే యోగాభ్యాసం ద్వారా ఆలోచనలను నియంత్రించాలనుకునేవారు మౌలికంగా అవలంబించి, ఆకళింపు చేసుకోవాల్సిన లక్షణాలను భగవద్గీత ప్రతిపాదిస్తోంది.

సాధనకు మూలం ఆహారనియమం. సరైన ఆహారం, మితంగా, సరిపోయినంత భుజించాలి. సాత్త్వికాహారం చక్కగా నమిలి మింగటం వల్ల శరీరం రోగరహిత మవుతుందన్నది ఆరోగ్యశాస్త్రంలో ప్రధాన సూత్రం. రోగరహితమైన శరీరం నిర్మలమైన ఆలోచనలకు ఆలవాలం. అలాగే సరైన వేళలో పడుకుని తెల్లవారే నిద్ర లేవటం వల్ల సరిపడ విశ్రాంతి శరీరానికి లభిస్తుంది. అంటే క్రమబద్ధమైన జీవితం గడపటం యోగసాధనకు మొదటి మెట్టు అన్నమాట. ఒకప్పుడు 'గూట్లో దీపం. నోట్లో ముద్ద' అన్న సామెత చెప్పారు. అంటే, దీపాలు పెట్టే వేళకు ఆహారం భుజించేయాలి అన్నమాట. త్వరగా నిద్రించి సూర్యోదయానికి ముందే లేవాలన్నమాట. కానీ ఆధునికజీవన విధానంలో క్రమబద్ధమైన జీవితానికి తావు లేదు. రాత్రింబవళ్ళు చదివితే కానీ మార్కులు సరిగ్గా రావన్న ఆత్రానికి డే అండ్ నైట్ క్రికెట్ పోటీలు, 24 గంటల టీవీ ఛానళ్లు ఇంకా ఇతర అనేకాంశాలు తోడై వ్యక్తికి రోజులో ఏ పని ఎప్పుడు చేస్తాడో సరిగ్గా నిర్ణయించుకోలేని పరిస్థితిని ఏర్పరుస్తున్నాయి. 'షిఫ్టు డ్యూటీ'లు, రాత్రంతా మేల్కోవాల్సి వచ్చే కాల్ సెంటర్ ఉద్యోగాలు, అవసరమైతే వారం పాటు నిద్రాహారాలు మాని డెడ్‌లైన్లో పని పూర్తి చేయాల్సిన కంప్యూటర్ ఉద్యోగాలు.... ఇలా ఒకటేమిటి, ప్రతి ఒక్క అంశం జీవితంలో 'క్రమబద్ధత' అన్నదానికి తావు లేకుండా చేస్తున్నాయి.

ఇక ఆహారం విషయానికి వస్తే చాక్లెట్లు, పిజ్జాలు, బర్గర్లు, ఐస్ క్రీములు, సమోసాలు, పేస్ట్రీలు – ఇలా సమయానికి ఏది దొరికితే అది తినేసే పరిస్థితులు నెలకొన్నాయి. వీటికి టీ – కాఫీలు తోడయ్యాయి. దాంతో ఆహారనియమం పాటించటం అసిధారా వ్రతమౌతోంది.

ఓ సారి కుష్వంత్ సింగ్ ఓ డైటీషియన్ దగ్గరకు అనారోగ్యం కారణంగా వెళ్ళాడట. ఆ డాక్టరు కుష్వంత్ సింగ్‌ను ఓ రోజంతా తన దగ్గర ఉండమన్నాడు. కుష్వంత్ అందుకు ఒప్పుకున్నాడు. అతడిని ఓ గదిలో ఉండమని, అతని పక్కనే ఓ పెద్ద గంగాళాన్ని ఉంచాడు డాక్టర్. ప్రొద్దునలేవగానే కుష్వంత్ ఓ గ్లాసు కాఫీ తాగాడు. వెంటనే ఓ గ్లాసు కాఫీ ఆ గంగాళంలో పోశాడు డాక్టర్. అలా పొద్దుటి నుంచీ కుష్వంత్ ఏమేం తిన్నాడో, తాగాడో, అంత పరిమాణంలో ఆయా ఆహారాలను ఆ గంగాళంలో వేశాడు డాక్టర్. తెల్లారేసరికి గది కంపుతో నిండిపోయింది. 'ఇదేమి'టని? అసహ్యంగా అడిగాడు కుష్వంత్. సమాధానంగా 'ఆ గంగాళం మీ పొట్ట. మీరు అడ్డూ అదుపు లేకుండా, ముందువెనుక చూసుకోకుండా మీ పొట్టలో పడేస్తున్న పదార్థాల ఫలితం ఈ కంపు.' వెలుతురు, గాలి ధారాళంగా ఉన్న వాతావరణంలోనే ఈ పరిస్థితి ఉంటే, ఇక రకరకాల బాక్టీరియాలతో మూసిన గది లాంటి పొట్ట పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకో'మన్నాడు డాక్టరు. యాసిడ్లు, ఎంజైమ్‌లు, జీర్ణం చేసే రసాయనాలు మనం అదే పనిగా పొట్టలోకి వేస్తున్న అడ్డమైన గడ్డినీ జీర్ణం చేయలేక ఎంత సతమతమవుతాయో ఊహించమన్నాడు. ఒక్క క్షణం ఆగి, మనం ఒక రోజు పొద్దుటి నుంచి రాత్రి పడుకునే వరకూ పొట్టలోకి ఏమేం వేస్తున్నామో ఆలోచిస్తే కుష్వంత్ చెప్పిన సంఘటనను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం. మనం మన జీర్ణవ్యవస్థను ఎంతగా కష్టపెడుతున్నామో గ్రహించవచ్చు. అంటే ఎన్ని రకాల వ్యాయామాలు చేసినా, ఎన్ని 'జిమ్'లకు వెళ్ళి ఎంత డైటింగ్ చేసినా, మౌలికంగా ఆహారనియమాలను పాటించటాన్ని, ఆహారసేవనాన్ని పరిమితంగా ఉంచటాన్ని మించిన ఆరోగ్యసూత్రం మరొకటి లేదన్నమాట.

ఇటీవలి కాలంలో యాంత్రికజీవనంలోని ఉద్విగ్నతలను తగ్గించి, ఉద్యోగుల నుంచి మరింత ఏకాగ్రతతో పని సాధించేందుకు అనేక ప్రైవేట్ సంస్థలు 'యోగ' తరగతులను నిర్వహిస్తున్నాయి. విపాసన, క్రియాయోగ, మెడిటేషన్, బ్రహ్మకుమారీలు ... ఇలా రకరకాల పేర్ల కింద ఉద్యోగులకు ప్రశాంతచిత్తసాధన, ఏకాగ్రత సాధన, చిరాకు తగ్గించుకోవటం, ఉద్యోగాన్ని శ్రద్ధగా చేస్తూ మరింత చురుకుగా పని చేయగలగటంలో ఇవన్నీ తోడ్పడతాయని భావిస్తున్నారు. అలాగే అనేకవిద్యాసంస్థలు సైతం, తమ కోచింగ్

తరగతులలో ధ్యానం తరగతులు నిర్వహిస్తున్నాయి. మెడిటేషన్ నేర్పుతున్నాయి. కానీ వీటి వల్ల అనుకున్న ఫలితాలు సాధించలేకపోతున్నాయి. ఎందుకంటే యోగసాధనకు మౌలికంగా కొన్ని సూత్రాలను పాటించటం తప్పనిసరి.

యోగశాస్త్రం ఆరంభంలోనే ఏకాగ్రసాధనకు అడ్డు వచ్చే తొమ్మిది కారణాలను పొందుపరచటం కనిపిస్తుంది. అవి 1. వ్యాధి, 2. బద్ధకం, 3. సంశయం, 4. యోగ సాధనకు తగ్గ మానసికస్థాయి లేకపోవటం, 5. నిరుత్సాహం, 6. విషయచింతన, 7. సరైన విజ్ఞానం లేకపోవటం, భ్రమలలో ఉండటం, 8. రకరకాల ఆలోచనలు, సందిగ్ధాలు ముసురుకోవటం, 9. మానసికచంచలత్వం.

సాధారణంగా మనం చూస్తూనే ఉంటాం. ధ్యానంలో ఉంటారు కానీ చుట్టూ జరిగేవన్నీ చూస్తూనే ఉంటారు. పూజలో ఉంటారు కానీ ప్రతి విషయాన్నీ గమనిస్తూ ఉంటారు. పుస్తకం ఎదురుగా ఉంటుంది. కళ్లు అక్షరాల వెంబడి పరుగెత్తుతూంటాయి. కానీ మెదడు వాటిని గ్రహించదు. మన మాటలు వింటూనే ఉంటారు. కానీ ఎక్కడో ఉన్నట్టుంటారు. ఎంతగా ప్రయత్నించినా వారి మనసు ఒక చోట స్థిరంగా ఉండదు. ఒక విషయంపై స్థిరంగా నిలవదు. ఇటువంటి చంచలమనస్కులకు, ఓ వారమో, రెండు వారాలో ప్రత్యేకతరగతులలో శిక్షణనివ్వటం వల్ల ఫలితం ఉండదు. వీరికే కాదు, ఎవరికైనా ఏదైనా ఫలితం ఇవ్వాలంటే, క్రమం తప్పకుండా నిరంతరం అభ్యాసం చేస్తూండాలి.

'యమ నియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణా ధ్యాన సమాధయోఽ ష్టాంగాని' అన్నది పతంజలి యోగసూత్రం.

యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి అనేవి అష్టాంగాలన్నమాట యోగసాధనలో.

వీటిలో యమనియమాలు ఏకాగ్రత సాధనలో మొదటి రెండు మెట్ల లాంటివి.

*అహింసా సత్యమాస్తేయ బ్రహ్మచర్యా*
*పరిగ్రహా యమాః*
*శౌచ సంతోష తపఃస్వాధ్యాయే*
*శ్వర ప్రణిధానాని నియమాః*

యమ అంటే నియంత్రణ సాధన. అహింస, సత్యం, దొంగిలించకుండా ఉండటం, బ్రహ్మచర్యం, అత్యాశ లేకపోవటం అన్ని 'యమం' కిందికే వస్తాయి.

గమనిస్తే ఇవన్నీ వ్యక్తిత్వవికాసానికి దోహదపడే అంశాలే. ఇవన్నీ భారతీయ జీవనవిధానంలో పడుగుపేకల్లా కలిసిపోయిన అంశాలే.

'ఒరులేయవి ఒనరించిన' అన్న పద్యాన్ని సూక్ష్మంగా అర్థం చేసుకుంటే 'అహింస' అన్నది దానంతట అదే అర్థమౌతుంది. ఏ రకమైన హింస చేయకపోవటం 'అహింస'. కేవలం చర్యల ద్వారానే కాదు, మానసికంగా కూడా ఎవరినైనా హింసించాలన్న ఆలోచన సైతం దరిదాపులకు రాకూడదు. అంటే ఎలాగైతే ఎదుటివాడేం చేస్తే తనకు బాధ కలుగుతుందో, అది తాను చేయకుండా ఉండాలో, అలాగే విశ్వమంతా పరమాత్మ అయినపుడు ఇక తేడాలేముంటాయి. 'హింస' అన్న పదం అదృశ్యమౌతుంది. అందుకే భగవద్గీత ఆత్మను చంపేవాడుగా, చంపబడేవాడుగా భావించేవాళ్ళిద్దరూ అజ్ఞానులే అంటుంది. ఆత్మ చంపేది, చంపబడేది కాదని స్పష్టంగా చెప్తుంది.

*య ఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్।*
*ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే॥*

'యమ'లో చెప్పిన అంశాలన్నిటికీ ఇది వర్తిస్తుంది. అంతా భగవంతుడే అయినప్పుడు ఇది ఎదుటివాడి దానికి ఆశపడటం, దొంగిలించటం అన్న ప్రసక్తే రాదు. అసత్యం చెప్పటం అన్న ఆలోచన రాదు. ఎందుకంటే మనం ఎదుటి మనిషికి అబద్ధం చెప్పి నమ్మించవచ్చు. కానీ మనలో ఉన్న ఆత్మకు ఏ అబద్ధం చెప్తాం? అందుకే 'మనస్సు మంచి చెడు చూపించే దర్పణం లాంటిది' అంటారు తత్త్వవేత్తలు. ఎప్పుడైతే వ్యక్తి ఇది గ్రహిస్తాడో 'యమ' అతనికి అర్థమౌతుంది.

ప్రపంచం అంతా 'భ్రమ' అని అర్థం చేసుకోవటం వేరు. దాన్ని ఆచరించి చూపటం వేరు. ఇక్కడే 'నియమం' అవసరమౌతుంది. నియమంలో నిత్యజీవితంలో వ్యక్తి పాటించవలసిన అంశాలుంటాయి. ఇది పాటించటం వల్ల వ్యక్తి ఒక చోట కాస్సేపు ఏకాగ్రతగా కూచోగలుగుతాడు.

'నియమం' కన్నా ముందు 'యమం' చెప్పటం. ఎందుకంటే 'నియమాలు' పాటించాలన్న జిజ్ఞాస, పట్టుదల 'యమం' ద్వారా కలుగుతాయి.

ఎదుటివాడి ఆస్తిని చూసి ఆశపడేవాడు, అబద్ధాలు చెప్పేవాడు, దొంగతనం చేసేవాడి మనస్సు ఎప్పుడూ భయాందోళనలతో నిండి ఉంటుంది. అటువంటివాడి మనస్సు ఒక్క విషయంపై నిశ్చలంగా ఉంటే నియమపాలన వల్ల యమం సైతం సాధ్యమౌతుంది. ఎందుకంటే నియమంలో ప్రధానంగా పాటించాల్సిన అంశం శౌచం.

'శౌచం' అంటే శుభ్రత. భారతీయధర్మంలో శుభ్రత అత్యంతప్రాధాన్యాన్ని వహించే అంశం. మనుధర్మశాస్త్రంలోనైతే జీవితంలోని ప్రతి చిన్న చర్యలోనూ పాటించవలసిన శుభ్రత గురించి విపులంగా పొందుపరచి ఉంది. ఈ నాడు మనం 'టాయ్‌లెట్' అంటున్న దాన్ని మనవారు 'శౌచాలయం' అనేవారు. ఇప్పుడు మనకు హాస్యాస్పదంగా అనిపించే అనేకశౌచాంశాల వెనుక ఎంతో ఆలోచన కనిపిస్తుంది. కానీ ఆధునికపద్ధతుల ప్రచార ప్రలోభం వల్ల మన 'శౌచా'న్ని వదలి అశౌచాన్ని ఆనందంగా స్వీకరిస్తున్నాం. వ్యక్తిత్వ వికాసంలో యోగప్రాధాన్యం గురించి తెలుసుకునేముందు 'శౌచం' ప్రాధాన్యం తెలుసుకోవటం తప్పనిసరి.

## శౌచం

*జ్ఞానం తపో ఉ గ్నిరాహారో మృన్మనోవార్యు పాంజనమ్*
*వాయుః కర్మార్కకాలౌ చ శుద్ధేః కర్తౄణి దేహినామ్॥*

'జ్ఞానం, తపస్సు, అగ్ని, ఆహారం, మట్టి, మనస్సు, నీరు, వాయువు, యజ్ఞకర్మలు, సూర్యుడు, కాలం.... ఇవీ మానవులను శుద్ధి చేసేవి'.

'శౌచం' అంటే శుభ్రంగా పవిత్రంగా ఉండటం. మనిషి పై అంశాల వల్ల పవిత్రుడవుతాడని మనుస్మృతి చెప్తుంది.

సంధ్యావందనంలోనే కాదు, ప్రతి పూజలోనూ మనం 'బాహ్యాభ్యంతరశుచి'ని ప్రస్తావిస్తాం. అంటే శరీరమే కాక మనస్సు కూడా శుభ్రంగా ఉండాలన్నది మన ప్రయత్నం అన్నమాట. శరీరం శుభ్రంగా ఉంటే మనస్సు నిర్మలంగా ఉంటుంది. మనస్సు శుభ్రపడితే శరీరం శుభ్రంగా ఉంటుంది. అందుకే మన ధర్మంలో శారీరకశుభ్రత గురించిన ప్రతి అంశాన్నీ విపులంగా వివరించారు. మానసికపరిశుభ్రత కోసం అడుగడుగునా సూత్రాలు పొందుపరిచారు.

ఉదయం నిద్ర లేవగానే కాలకృత్యాలు సత్వరం తీర్చుకోవాలి. శరీరాన్ని శుభ్రం చేసుకునేందుకు నీటిని పుష్కలంగా వాడాలి. నోటిని, పళ్ళను శుభ్రపరచుకోవాలి. స్నానం చేయాలి. (మనుస్మృతి 4వ అ. 45-52, 56-152).

ఇక మలవిసర్జనకూపాలు నివాసాలకు దూరంగా ఉండాలని మనుస్మృతి స్పష్టంగా చెప్తుంది.

*దూరాదావసథాన్మూత్రం దూరాత్పాదావ సేచనమ్।*
*ఉచ్ఛిష్టాన్నం నిషేకం చ దూరాదేవ సమాచరేత్॥*

మలవిసర్జన జనావాసాలకు దూరంగా చేయాలి. కాళ్ళు కడిగిన నీరు, ఉమ్మేయటం, పారేసే ఆహారపదార్థాలు, స్నానం నీటి వంటివన్నీ ఇంటికి దూరంగా పోవాలి. కేవలం వ్యక్తిగతశుభ్రతకే కాదు, సామూహిక సామాజికఆరోగ్యానికి మౌలిక సూత్రాలివి. అంటే, ఇంటి పరిసరప్రాంతాలు శుభ్రంగా ఉండాలన్నమాట. కానీ ఇళ్ళల్లోనే బాత్రూంలు, ఇంటి బయట చెత్త కుండీలు, ఇంటి ముందు నుంచి డ్రైనేజీ నీళ్ళు, రోడ్ల పైన పగిలిన డ్రైనేజీల నుండి పొంగి పొర్లే అశుద్ధజలం సర్వసాధారణమైన సమయంలో 'శౌచం' వెనుకబడి అశౌచం అద్భుతం కావటంలో ఆశ్చర్యం లేదు. ఒక రకంగా చూస్తే ప్రస్తుతం దేశాన్ని కుదుపుతున్న చికెన్ గున్యా, డెంగ్యూ వంటి వ్యాధులు, ప్రపంచాన్ని కుదుపుతున్న సార్స్, బర్డ్ ఫ్లూ వంటి వైరస్‌లు అశౌచం విపరీతమవటం వల్ల వ్యాపిస్తున్నవే.

అన్నం తినే ముందూ, తిన్న తరువాతా శుభ్రంగా శరీరాన్ని కడుక్కోవాలంటుంది మనుశాస్త్రం.

*ఉపస్పృశ్చ ద్విజో నిత్యమన్న మద్యా త్సమాహితః।*
*భుక్త్వా చోపస్పృశోత్సమ్యాగద్భిః ఖాని చ సంస్పృశేత॥*

ఆకుల్లో తినటం ఉత్తమం. కానీ ప్లేట్లలో తినటం, ప్లేట్లు తుడిచి మరొకరు తినటం, ఒకే బక్కెట్ నీటిలో ప్లేట్లు ముంచి కడగటం, ఒకే గ్లాసు నుంచి పదిమంది తాగటం, ఆధునికసామాజికజీవనంలో 'శౌచం' అన్నది లేకుండాపోయింది. ఇరానీ హోటళ్ళలో పదిమంది పట్టి చూసి వదలిన సమోసాలు పదకొండోవాడు తింటాడు. అన్నిసార్లూ వెయిటర్ సమోసాలు చేత్తో ప్లేట్లో పెడతాడు, మళ్ళీ అదే చేత్తో రకరకాల పనులు చేస్తాడు.

మనకు పాఠశాలలో నేర్పే 'మానర్స్' మన అశౌచాన్ని హాస్యాస్పదమైన ఎత్తులకు తీసుకువెళ్తున్నాయి. దగ్గేటప్పుడు చెయ్యి అడ్డం పెట్టుకోవాలంటారు. ఎందుకంటే దగ్గు వల్ల వెలువడే వైరస్‌లు, బాక్టీరియాలు గాల్లోకి పోకుండా చేయి అడ్డుకుంటుంది కాబట్టి అది 'గుడ్ మానర్స్.' ఇటీవలే ఓ వ్యక్తి ఓ టిఫిన్ సెంటర్‌కి వెళ్లాడు. ప్లేటు ఇడ్లీలు తినాలని నిశ్చయించుకొన్నాడు. ఎందుకంటే, బయట ఇడ్లీలు తప్ప వేరే ఏది తిన్నా ఆరోగ్యానికి మంచిది కాదన్నారు. అది సెల్ఫ్ సర్వింగ్ క్యాన్‌టీన్. చిట్టీ తీసుకుని ఇడ్లీల కౌంటర్ దగ్గరికి వెళ్లాడు. ఆ కౌంటర్‌లో అబ్బాయి, మర్యాద ప్రకారం చెయ్యి అడ్డం

పెట్టుకుని దగ్గి, అదే చేత్తో ఇడ్లీలు ప్లేట్లో పెట్టి ఇచ్చాడు. 'అది అన్యాయం' అని వాదిస్తే, పక్కన ఉన్నవాడితో పెట్టించి ఇచ్చాడు. అది తిన్న గంట లోగా ఆ వ్యక్తి తుమ్మటం ఆరంభించాడు. ఇదీ ఆధునికజీవనవిధానంలోని 'శౌచం.' ఇలా గమనిస్తే జీవితంలోని ప్రతి అంశంలో మనం శుభ్రతకు, 'ఆధునికత' పేరిట ఎలా తిలోదకాలిచ్చి అనారోగ్యాన్ని కొనితెచ్చు కుంటున్నామో అర్థమౌతుంది.

'శరీరాన్ని కడుక్కునేటప్పుడు నీటిని విరివిగా వాడాలి' అంటుంది మనుశాస్త్రం. పేపర్ నాప్కిన్‌లు వాడటం ఆధునికం అయింది. వాళ్ళ దేశంలో నీళ్ళు సరిగ్గా ఉండవు, చలికి నీటిని తాకటం కష్టం కాబట్టి నీటి బదులు పేపర్లు వాడి అనారోగ్యాలు తెచ్చుకుంటారు. కానీ ఆధునికం పేరిట మనం ఉన్న నీటిని వదులుకొని పేపర్లు వాడి శౌచాన్ని వదలి శోకం పాలవుతున్నాం. అంటే వాడు లేక పేదవాడైతే మనం అన్నీ ఉన్నా బీదవాళ్ళం అవుతున్నామన్నమాట.

విశ్వనాథ సత్యనారాయణ 'హాహా హూహూ' అని ఓ నవలిక రాశారు. దాంట్లో లండన్‌లో హఠాత్తుగా ఓ వింత జీవి ప్రత్యక్షమౌతుంది. దానికి పళ్ళు, ఫలహారాలు ఏం పెట్టినా తినదు. అది నెత్తి మీద నీళ్ళు పోసుకున్నట్టు సైగ చేస్తుంది. చివరికి అక్కడ ఉన్న హిందూ దేశస్థుడు 'అది స్నానం చేస్తుందేమో' అంటాడు. అప్పుడు దాని మీద నీళ్ళు పోస్తే, అది ఒళ్ళు తుడుచుకుని ఉత్తరీయం కట్టుకుని, ధ్యానం చేసి, చెంబులో నీళ్ళు తీసుకుని పళ్ల మీద నీళ్ళు చల్లి భగవంతుడిని ధ్యానించి, పళ్ళు తింటుంది. పాశ్చాత్యులకు, మనకూ 'శౌచం' విషయంలో ఉన్న తేడాను వ్యంగ్యంగా చూపిస్తుందీ ఘటన.

అందుకే మన ధర్మశాస్త్రాల్లో ఉదయం లేవగానే కాలకృత్యాలు, స్నానం, ధ్యానం, ఇలా విధులను క్రమపద్ధతి ప్రకారం నిర్వచించారు. కానీ బెడ్ కాఫీ, స్నానం చేయకుండా తినేయటం వంటివి నియమోల్లంఘనలే ఆధునికం అన్న అభిప్రాయం నెలకొనటంతో, ఎవరూ 'ఛాందసు'డన్న ముద్రపడ కూడదని అంతా ఆధునికం అయిపోయాం. ఎవరైనా 'శుచీ, శుభ్రత' అంటే పనికిరానివాడని ఈసడించి కాలర్లెగరేస్తాం. అందుకే మనుశాస్త్రంలో గురువు విద్య నేర్పే ముందు విద్యార్థికి 'శౌచం' నేర్పాలని స్పష్టంగా ఉంది.

*'ఉపనీయ గురుశ్శిష్యం శిక్షయేచ్ఛౌచమాదితః'*

'ఉపనయనం తరువాత ముందు శౌచం నేర్పించాలి.' అంతకు ముందు 54-57 శ్లోకాలలో వ్యక్తి నిర్మల మనస్కుడై ఆహారాన్ని ధ్యానించి భుజించాలని, నడుమ నడుమ

భుజించరాదని, మితిమీరి తినకూడదని, ఎంగిలి అన్నం ఎవరికీ పెట్టకూడదని, ఎంగిలి చేత్తో ఎక్కడికీ పోరాదని, అతిభోజనం అనారోగ్యం, ఆయుక్షీణం, అపుణ్యం, అస్వర్గ్యం, లోకనిందాపాత్రమని స్పష్టంగా మనుస్మృతి ప్రకటిస్తుంది.

ఒక రకంగా చూస్తే ఆధునికవైద్యులు, విజ్ఞానవంతులు, మేధావులు అంతా ఇవే చెప్తున్నారు. డైటింగ్ చేయించే డాక్టర్లు ఇదే చెప్తున్నారు. వాళ్లు చెప్తే పనికి వచ్చేది మనువు చెప్తే పనికి రాకుండా పోవటం, మన సమాజంలో 'మంచి చెప్పే' వాటి పట్ల ఉన్న చులకనను స్పష్టం చేస్తుంది. ఎందుకంటే డాక్టర్లు, మేధావులు అంతా చేతులు కాలిన తరువాత ఆకులను పట్టుకోమని చెప్తున్నారు. అనారోగ్యం పాలైన తరువాత ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో చెప్తున్నారు. అందుకని వాళ్ళ మాటలు బాగా అర్థమౌతాయి. ఏదైనా చేజారిన తరువాతి దాని విలువ తెలుస్తుంది కదా!

మనువు బాల్యం నుంచీ శుభ్రత, మితాహారం, వ్యాయామం వంటి విషయాల ఆవశ్యకతను నొక్కి చెప్తున్నాడు. ఇదంతా వ్యక్తి అనుసరించవలసిన ధర్మం అంటున్నాడు. అందుకే పనికి రాని పాత చింతకాయ పచ్చడి అయ్యాడు. రకరకాల వ్యాధులు వ్యాపించి ప్రజలు మరణిస్తూంటే కానీ, చెత్తను శుభ్రం చేయాలన్న ఆలోచన రాని సమాజం, ఆరంభం నుంచీ శుభ్రంగా ఉండి, చెత్త పేరుకోకుండా చూస్తే, అనారోగ్యాలే రావు అంటే ఒప్పుకుంటుందా? మనుస్మృతిలో అశుద్ధాన్ని తాకిన వ్యక్తి స్నానం చేస్తేనే శుద్ధుడవుతాడంటుంది.

స్నానేన శుద్ధ్యతి

మృత్తో యైః శుద్ధ్యతే శోధ్యమ్

మట్టి, నీటి వల్ల ప్రతి వస్తువూ పరిశుద్ధమౌ తుందంటాడు మనువు. అందుకే శౌచకూపానికి వెళ్ళినప్పుడు ఎన్నిసార్లు మట్టితో చేయి కడుక్కోవాలో కూడా స్పష్టంగా సూచించాడు. ఇంట్లో పాత్రలను ఎలా శుభ్రంగా ఉంచాలో చెప్పాడు. మనువు సూత్రాన్ని పాటించి ఉంటే చేతిలో దగ్గిన వెంటనే చేయి కడుక్కొని ఇడ్లీలందించేవాడు. ఈ చిన్న నియమం పాటించడం వల్ల అనేకులకు రోగాల వ్యాప్తి తప్పేది.

భారతీయధర్మంలో 'శుభ్రత'కున్న ప్రాధాన్యం ప్రపంచంలో ఇతర ఏ నాగరికతలోనూ లేదు. ఎందుకంటే వ్యక్తిత్వవికాసంలో 'శుభ్రత' అత్యంతప్రాధాన్యం వహిస్తుంది. ఇది గ్రహించిన పూర్వికులు 'శుభ్రత'ను మన జీవనవిధానంలో విడదీయరాని భాగం చేశారు. అది వదిలిన మనం వ్యక్తిత్వ రహితులమై చేతులు కాల్చుకుని ఆకుల వెంటపడుతున్నాం.

‘ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్’ అంటారు. రోగం వచ్చిన తరువాత మందు వేసుకునే కన్నా రోగం రాకుండా చూసుకోవటమే మంచిదని సూక్తి. కానీ రోగం వస్తే కానీ ‘శుభ్రత’ విలువ తెలియని పరిస్థితుల్లో మనం ఉన్నాం. అందుకే వ్యక్తిత్వవికాసంలో శౌచం ప్రాధాన్యం గురించి విపులంగా చర్చించాల్సిన అవసరం ఉంది. ఈ విషయాన్ని విస్మరించటం వల్లే ఆధునికవ్యక్తిత్వవికాస డాక్టర్ల ప్రభావం పరిమితమౌతోంది. ఎవరెన్ని పుస్తకాలు రాసినా, ఎన్ని లెక్చర్లిచ్చినా ఫలితం ఉండటం లేదు.

భారతీయధర్మంలో కనబడేవాటికే కాదు, కనబడనివాటికీ ప్రాధాన్యం ఉంది. ఒక వ్యక్తి ప్రత్యక్షంగానే కాదు, పరోక్షంగానూ ఎదుటి వ్యక్తిపై ప్రభావం చూపిస్తాడు. అందుకే జననమరణాలలో సైతం ‘శౌచం’ ప్రసక్తి వస్తుంది. అయితే ‘వ్యక్తిత్వవికాసా’నికి ‘శౌచం’ కన్నా, నిత్యజీవితంలో పాటించాల్సిన శుభ్రత అవసరం ఎక్కువ కాబట్టి, ఆ ప్రసక్తి అప్రస్తుతం అవుతుంది.

ఇంత వరకూ మనం భౌతికశౌచం గురించే మాట్లాడుకున్నాం. కానీ భౌతికశౌచానికి, మానసికనైర్మాల్యం తోడైతేనే వ్యక్తిత్వవికాసం సంపూర్ణమౌతుంది. ఇదెలా సాధ్యమో మనుధర్మశాస్త్రం స్పష్టంగా సూచిస్తుంది.

*అద్భిర్గాత్రాణి శుద్ధ్యంతి మనః సత్యేన శుద్ధ్యతి।*
*విద్యా తపోభ్యాం భూతాత్మా బుద్ధిర్ జ్ఞానేన శుద్ధ్యతి॥*

శరీరాన్ని నీరు శుభ్రం చేస్తుంది. మనస్సును సత్యం శుభ్రపరుస్తుంది. ఆత్మను జ్ఞానం, తపం శుభ్రపరుస్తాయి. విచక్షణ నిస్తుంది విజ్ఞానం.

ఇదీ వ్యక్తిత్వవికాసానికి బంగారం వంటి సూత్రం.

## ఆరోగ్యం

*సమం కాయశిరోగ్రీవం ధారయన్నచలం స్థిరః।*
*సంప్రేక్ష్య నాసికాగ్రం స్వం దిశశ్చానవలోకయన్॥*
*ప్రశాన్తాత్మా విగతభీః బ్రహ్మచారి వ్రతే స్థితః।*
*మనస్సంయమ్య మచ్చిత్తో యుక్త ఆసీత మత్పరః॥*

‘నడుమును, మెడను, శిరాన్ని వంగక చలింపక స్థిరంగా ఉంచి, దిక్కులు చూడక ముక్కు కొనపై దృష్టి నిలిపి నాపై మనస్సు నిలిపి, భయం వదలి, బ్రహ్మచర్య వ్రతం అవలంబించి శాంతచిత్తంతో ధ్యానం చేయాలి, ధ్యానానికి శ్రీకృష్ణుడు విధించిన నియమాలివి.

'స్థిరసుఖమాసనమ్' అంటుంది పతంజలి యోగసూత్రం. అంటే స్థిరంగా, సుఖంగా కూచోవటం 'ఆసనం' అన్నమాట. ఈ స్థిరంగా, సుఖంగా కూచోవటం అంటే ఏమిటో భగవద్గీత విపులీకరిస్తుంది. నడుము, మెడ, శిరస్సు వంగకూడదు. చలించకూడదు. స్థిరంగా ఉండాలి. ఇవి స్థిరంగా ఉండాలంటే భౌతికంగా శారీరకస్వస్థత నిచ్చే 'యోగాసనాలు' దారి చూపిస్తాయి.

భారతీయధర్మంలో వ్యక్తిత్వవికాసానికిచ్చిన ప్రాధాన్యం ఇక్కడే స్పష్టమౌతుంది. 'ఈశా వాస్యం ఇదం సర్వం' అన్నారు. ప్రపంచమంతా ఈశ్వరమయం. కాబట్టి తనలోనే కాదు, ప్రతి వాడిలోనూ, ప్రతి అణువులోనూ భగవంతుడున్నాడన్నమాట. ప్రపంచమంతా భగవంతుడిమయం అయినప్పుడు, తానూ భగవంతుడిలో భాగమైనప్పుడు, ప్రపంచమంతా తనదే అవుతుంది. ఇక తన దాన్నే తాను దొంగిలించటం, తన దానికే తాను ఆశపడటం అన్నది అర్థం లేని విషయం. ఈ రకంగా భగవంతుడి భావనను నిత్యజీవితంలో ధర్మానికి ముడిపెట్టి భగవదారాధనను జీవన విధానం చేశారు. దాంతో అడుగడుగునా వ్యక్తిలో ఓ పవిత్ర భావన జనిస్తుంది. తన పట్ల, తన శరీరం పట్లనే కాదు, తన చుట్టూ ఉన్న ప్రపంచం పట్ల కూడా ఈ పవిత్రభావన విస్తరిస్తుంది.

శారీరక స్వస్థతనిచ్చే యోగాసనాలను కూడా భగవద్భావనతో మిళితం చేయటం సూర్యనమస్కారాలలో కనిపిస్తుంది. సూర్యనమస్కారాలు, సూర్యోదయవేళలో కానీ సూర్యాస్తమయంలో కానీ చేయాలి. సూర్యుడిని ఉద్దేశిస్తూ బీజాక్షరసంపుటితో కూడిన సూర్యనమస్కారాల మంత్రాన్ని జపిస్తూ చేయాలి సూర్యనమస్కారాలు. అంటే దేవాలయం లాంటి శరీరాన్ని శుభ్రంగా ఉంచి, దార్ఢ్యంగా, ఆరోగ్యంగా ఉంచటం కూడా దైవకార్యమేనన్న మాట. బీజాక్షరపూరిత మంత్రపఠనం వల్ల శారీరకంగా, మానసికంగా, అంతర్గతంగా, యోగపరంగా లాభాలున్నాయి. సూర్యనమస్కారాలలోని పన్నెండు భంగిమల వల్ల శరీరం అంతర్భాగాలలో చక్కటి కదలికలు కలుగుతాయి. వీటి వల్ల గ్రంథులన్నీ చైతన్యవంతమౌతాయి. వెన్నముక స్థిరమౌతుంది. శారీరకస్వస్థత సాధించటంతోటే వ్యక్తికి తనకు తెలియకుండానే తనపై విశ్వాసం పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం కలగటంతో వ్యక్తిత్వవికాసంలో సరైన దిశలో అడుగు పడ్డట్టే.

ఇక్కడే మనం యువతలో పాతుకొని ఉన్న కొన్ని అపోహలను ప్రస్తావించుకోవాల్సి ఉంటుంది. ఒక పద్ధతి ప్రకారం సమాజం 'బ్రెయిన్' ఎలా 'వాష్' చేయబడిందో తెలుసుకోవాల్సి ఉంటుంది.

ప్రతివారూ ఆరోగ్యాన్ని కోరుకుంటారు. శక్తిమంతులవ్వాలని కోరుకుంటారు. తనవారిని, దేశాన్ని తన బాహుబలంతో రక్షించాలని ఉవ్విళ్లూరు తారు. అందుకే ఏ దేశంలో, ఏ సంస్కృతిలోనైనా 'శక్తి'ని, శక్తిమంతులను ఆరాధించటం, ఆదర్శంగా తీసుకోవటం కనిపిస్తుంది. హెర్క్యులెస్, అలెగ్జాండర్, జూలియస్ సీజర్, కింగ్ ఆర్థర్ ఇలా పాశ్చాత్యులు శక్తిమంతులకు పెద్దపీట వేసి వారిని ఆదర్శం చేసుకొన్నారు.

మన పూర్వికులు సైతం మనకు రాముడు, భీముడు, హనుమంతుడు, అర్జునుడు, పృథువు, వంటివారిని ఆదర్శంగా నిలిపారు. రాణా ప్రతాప్, శివాజీ, విక్రమార్కుడు, చంద్రగుప్తుడు, కృష్ణదేవరాయల వంటివారు మనకు ఆరాధ్యులు. అయితే పాశ్చాత్య ఆదర్శాలకు, మన ఆదర్శానికి తేడా అల్లా మనం కేవలం శక్తిమంతులవటమే ఆదర్శంగా ఎంచుకునేందుకు అర్హతగా భావించ లేదు. అలాగైతే రావణుడు, బకాసురుడు, జరాసంధుడు, వంటివారు కూడా శక్తిమంతులే. కానీ తనకున్న శక్తికి ధర్మపాలన తోడైతేనే వ్యక్తి 'ఆదర్శం'గా నిలుస్తాడు. గమనిస్తే మనకు పూజనీయులైన శంకరాచార్యులు, రామానుజాచార్యుల వంటివారు ఆధ్యాత్మికతలో నిష్ణాతులైనా శారీరకస్వాస్థ్యంలో ఎవరికీ తీసిపోరు. కాబట్టి ఆరంభం నుంచీ మనం విచక్షణతో కూడిన విజ్ఞానార్జన, ధర్మంతో కూడిన బలాన్ని 'ఆదర్శం'గా తీసుకున్నామన్నమాట.

కానీ పాశ్చాత్యుల ప్రభావంతో ఈ ఆదర్శస్వరూపం మారింది. బలహీనతను ఆరాధించటం ఆరంభమైంది. ఎపుడైతే కాళిదాసు నాటకాల కన్నా గ్రీకు ట్రాజెడీలపై మోజు పెరిగిందో, అపుడే మన ఆదర్శాలలో బలహీనత ప్రవేశించటం ఆరంభమైంది. నాయకుడు బలహీనుడై, కష్టాలకు క్రుంగి తాగుబోతై ఆత్మహత్య చేసుకుంటే మరీ మంచిది. 'దేవదాసు' వంటి బలహీనమనస్కుడు, ఎందుకూ పనికిరానివాడు తరతరాలుగా యువతీయువకుల ఆలోచనలను ప్రభావితం చేస్తున్నాడు. పైగా 'హీరో' అన్నవాడు నాజూకుగా ఉండాలి. వంగి నిలబడాలి అన్న అభిప్రాయం సమాజంలో బలపడటంతో సమాజం వెన్నెముక మొత్తంగా వంగిపోవటం ఆరంభమైంది. దీనికి బీజం ఎప్పుడో పడింది. ఆ కాలంలోనే ఇది గమనించిన వివేకానంద, దేశవ్యక్తిత్వాన్ని ఉత్తేజితం చేసేందుకు 'ఉక్కు నరాలు' కల యువత కావాలని గర్జించాడు. కానీ ఆ తరువాత రంగప్రవేశం చేసిన సినిమాలు ఉక్కు నరాలను తుక్కు నరాలు చేశాయి. దారిద్ర్యాన్ని గ్లామరస్‌గా ప్రదర్శించి, ఓటమినే హీరోయిజంగా చూపించి ప్రజల మెదళ్ళను కలుషితం చేశాయి. అందుకే రానురాను వ్యాయామం చేయటం, శారీరకంగా బలంగా ఉండటం పహిల్వాన్లకూ, గూండాలకే పరిమితమైంది. ఇప్పుడు మళ్ళీ సంజయ్ దత్, సల్మాన్

ఖాన్, హృతిక్ రోషన్‌ల ప్రభావంతో (ఆ హీరోలపై ఆర్నాల్డ్ ష్వార్జ్‌నెగ్గర్ ప్రభావం ఉందనుకోండి) యువత జిమ్‌లకు పరుగెత్తి కండలపెంపుపై దృష్టి నిలుపుతున్నారు. అంతే తప్ప శారీరక స్వాస్థ్యం ఈ నాటికీ అధికశాతం ప్రజల దృష్టిలో 'తనది కానిది' అయింది. అందుకే ఒక వయసు వచ్చి అనారోగ్యాలు పైన పడితే కానీ వ్యాయామం వైపుకు దృష్టి మళ్లటం లేదు. అప్పుడు కూడా 'వాకింగ్' తప్ప మరేమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది.

ఇటువంటి పరిస్థితి రాకుండా ఉండేందుకు మన పూర్వీకులు శారీరకవ్యాయామాన్ని కూడా నిత్యం అనుసరించవలసిన ధర్మాలలో ఒకటి చేసి దైవంతో ముడిపెట్టారు. (అందుకే భారతీయత మతమో, ధర్మమో తేల్చుకోలేక ఇప్పటికీ కుహనా మేధావులు తలలు బద్దలు కొట్టుకుంటున్నారు). అంటే ఎప్పుడైతే వ్యక్తి ధర్మాన్ని పాటిస్తాడో, అప్పుడు శారీరకస్వాస్థ్యం సాధించటం అతని జీవితంలో నిత్యకృత్యం అవుతుంది తప్ప, బలవంతాన చేయాల్సిన 'పని' కాదన్నమాట.

ఇలా నిర్దిష్టమైన వ్యాయామం ద్వారా శారీరకదార్ఢ్యం సాధించినవాడు 'స్థిర సుఖ మాసనమ్' సులభంగా చేయగలుగుతాడు.

ప్రస్తుతం యోగ గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ, పరిశోధనలు చేస్తున్న వ్యక్తి మేడపాటి వెంకటరెడ్డిగారు. ఈ వయసులో కూడా ఆయన స్థిరంగా, నిశ్చలంగా వంగకుండా కూచుంటారు. ముఖం ప్రశాంతంగా చిరునవ్వులు చిందిస్తూంటుంది. ఆయన ముందు ఎంతోమంది యువకులు వంగిపోయి, క్రుంగిపోయి కనిపిస్తారు. నియమబద్ధమైన జీవితం జీవించేవారికీ, నియమాలన్నవి లేకుండా బ్రతికేవారికీ ఉండే తేడా యోగాసనాలు వేస్తూ, ఆహారనియమాలను, ఇతరనిబద్ధతలను పాటించేవారినీ చూసినప్పుడు స్పష్టంగా తెలుస్తుంది. గమనిస్తే యోగులంతా దీర్ఘకాలం ఆరోగ్యంతో అలరారినవారే. ఈ నాటికీ 'సత్య సాయిబాబా' ఆరోగ్యం అందరికీ ఆశ్చర్యం కలిగించే అంశం. కాబట్టి వ్యక్తిత్వ వికాససాధనలో అత్యంత ప్రధానమైన 'ధ్యానం'లో ఒక స్థాయి సాధించాలంటే శారీరక వ్యాయామం తప్పనిసరి అన్నమాట.

తరచి చూస్తే గతంలో వ్యక్తిత్వవికాసానికి ఆవశ్యకమని ప్రస్తావించిన విషయాలన్నీ ఒక దానితో ఒకటి పడుగులో పేకలా కలిసిపోయి విడదీయరాని బంధం కలిగి ఉండటం కనిపిస్తుంది. ఆరోగ్యంగా ఉంటే ఉత్తమాలోచనలు వస్తాయి. వ్యక్తి స్థిరంగా కూచుని ఏదైనా విషయంపై దృష్టిని కేంద్రీకృతం చేయగలుగుతాడు. ఆవేశానికి లోను గాక శాంతంగా విచక్షణతో ప్రవర్తించగలుగుతాడు.

ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తి సరైన ఆహారం తీసుకోవాలి. తగిన శారీరక శ్రమ చేయాలి. శుభ్రత పాటించాలి. భగవంతుడిపై నమ్మకం కలిగి ఉండాలి. పెద్దలంటే గౌరవం ఉన్నవాడై ఉండాలి. శారీరకస్వస్థత కలిగిఉండాలి. ఇందుకు నిర్ణీతపద్ధతిలో యోగాసనాల వ్యాయామం తప్పనిసరి. దాంతో అతడి నడుము, వెన్నెముక, శిరస్సు వంగకుండా నిశ్చలంగా, స్థిరంగా ఉంటాయి. ఏదైనా విషయంపై దృష్టి నిలపగలుగుతాడు. భయరహితుడౌతాడు. ధ్యానం చేయగలుగుతాడు.

అయితే భగవద్గీత, పతంజలి యోగసూత్రాలు, మనుధర్మశాస్త్రమే కాదు, సకల భారతీయతత్త్వశాస్త్రాలూ వ్యక్తిత్వవికాససాధనలో బ్రహ్మచర్యానికి అత్యంత ప్రాధాన్యాన్నిచ్చాయి. 'యమం'లో బ్రహ్మచర్యం ఒక అంశం. బ్రహ్మచర్యవ్రతం అవలంబించాలని భగవద్గీత అంటుంది.

'బ్రహ్మచారి గురుకులంలో నివసిస్తూ ఇంద్రియాలను నిగ్రహించి, ఆత్మార్థం తపోభివృద్ధికి నియమాలను పాటించా'లని మనువు 'బ్రహ్మచర్యవ్రతానికి' పెద్ద పీట వేశాడు. అంటే శుచీ శుభ్రత, వ్యాయామం వంటి ఎన్ని వ్యక్తిత్వవికాసలక్షణాలున్నా 'బ్రహ్మచర్యం' అన్నది లోపిస్తే, వ్యక్తిత్వవికాసానికి సంపూర్ణత్వం రాదన్నమాట.

✣ ✣ ✣

# వ్యక్తిత్వం - బ్రహ్మచర్యం

## బ్రహ్మచర్యం

*అథ కేన ప్రయుక్తోఽ యం పాపం చరతి పూరుషః।*
*అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః*

(మనుషులు పాపాలెందుకు చేస్తారు? ఇష్టం ఉన్నా, లేకున్నా, ఎవరో బలవంతంగా చేయిస్తున్నట్టు పాపాలు చేస్తుంటారు. అంటే, పాపాలు చేసేందుకు కారణం ఆంతరంగికమా లేక బాహ్యమా?)

భగవద్గీతలో శ్రీకృష్ణుడిని అర్జునుడు అడిగిన ఈ ప్రశ్న ప్రతి మనిషీ ఏదో ఓ సమయంలో తనని తాను ప్రశ్నించుకుంటాడు. తన ఆంతరంగికులను ప్రశ్నిస్తాడు. అవకాశం ఉంటే గురువును అడుగుతాడు. లేకపోతే ఆకాశం వైపు తిరిగి పిడికిళ్ళు బిగించి అరుస్తాడు, 'ఎందుకు నేనిలా పాపాలు చేస్తున్నాను?' అని.

ఇక్కడే మరో ప్రశ్న ఉదయిస్తుంది. పాపం అంటే ఏమిటి? ఏది పాపం, ఏది పుణ్యం?

*యే పాప్ హై క్యా, యే పుణ్య్ హై క్యా*
*రీతోం పర్ ధర్మ్‌కె మొహరే హైం*
*హర్ యుగ్ మే బదల్తే ధర్మోం కో*
*కైసే ఆదర్శ్ బనావోగే?*

(ఈ పాపమేమిటి, పుణ్యమేమిటి? మనిషి ప్రవర్తనపై ధర్మమనే ముద్రలేమిటి? యుగాన్ని బట్టి ధర్మాలు మారతాయి. ఇలా మారే ధర్మాలలో ఏ ధర్మాన్ని ఆదర్శంగా తీసుకుంటావు?) అంటూ ఈసడిస్తారు ఆధునిక ఆనందవాదులు, పాపపుణ్యాల మీమాంసని. పాపం లేదు, పుణ్యం లేదు, జీవితాన్ని ఇష్టం వచ్చినట్టు అనుభవించ

మంటారు. క్షణకాలంలో అదృశ్యమయ్యే జీవితాన్ని భయాలతో, వాదాలతో వ్యర్థం చేయవద్దు, అందినంత ఆనందంగా అనుభవించమంటారు.

ఎంతో చిన్నది జీవితం
ఇంకా చిన్నది యవ్వనం
అనుభవించరా జీవితం
ఆగదు ఆగదు ఆగదు యవ్వనం

అంటూ ప్రచారం చేస్తారు. కట్టుబాట్లు, నియమనిబంధనలు అన్నీ పాత చింతకాయ పచ్చళ్ళని ఆవల పారేయమంటారు. ధర్మాలు, నీతులు కాలం చెల్లిపోయినవని, పనికిరానివని ఈసడిస్తారు. 'నియమం, నాగరికత' అన్న నిర్వచనాన్ని కాదని, నియమోల్లంఘనమే ఆధునికనాగరికత అంటూ ప్రచారం చేస్తారు. ఎవరైనా ఇంకా 'పాత'ని పట్టుకొని వేలాడుతూంటే, వాడిని అభ్యుదయనిరోధకుడని దూషిస్తారు. అంటరానివాడిని చూసినట్టుచూస్తారు. 'కొంతమంది కుర్రాళ్ళు పుట్టుకతో వృద్ధులు' అంటూ వెక్కిరిస్తారు. ఈ రకంగా ఊహ తెలిసినప్పటి నుంచీ పెద్దల మాటలు వినటం 'చేతకానితనం' అన్న భావన పిల్లల్లో నాటుతారు. దాంతో, పెద్దలను లెక్క చేయటం 'పాతతనం' అనుకుంటారు పిల్లలు. పెద్దలు చెప్పిన నీతులు వినటం 'పనికిరానితనం' అనుకుంటారు. తమలో చెలరేగుతున్న అనేకభావనలను నియంత్రించకుండా విశృంఖలంగా ప్రవర్తించటమే 'వినూత్న అభ్యుదయం' అనుకుంటారు. విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు. ఇంతా జరుగుతూంటే, మళ్ళీ ఈ ఆధునిక అభ్యుదయ ఆనందవాదులు, 'సమాజంలో మానవసంబంధాలు దిగజారుతున్నా'యని వేదికలెక్కి వాపోతారు. మరో వేదికనెక్కగానే 'ఎవరైనా మరొకరిని ఎందుకు గౌరవించాలి?' అంటూ వాదిస్తారు.

'బొమ్మరిల్లు' అని ఓ సినిమా ఉంది. సూపర్ హిట్ అయింది. పెద్దలు, పిల్లలు, యువతీయువకులు, అందరూ ఆ సినిమాను చూస్తున్నారు. ఆనందిస్తున్నారు, పొగుడుతున్నారు. మేధావులు సైతం 'యువకులు, యువకుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ యువకుల కోసం తీసిన యూత్ చిత్రం' అంటూ గొప్పగా మెచ్చేసుకుంటున్నారు. సినిమా కూడా వినోదాత్మకంగా, ఎక్కడా విసుగు కలగకుండా సాగటంతో ప్రతివారూ ఆకర్షితు లవుతున్నారు. పెద్దలు తమ యౌవనంలో తల్లిదండ్రులు విధించిన ఆంక్షలను తలచు కుంటూంటే, యువతీయువకులు తల్లిదండ్రులు విధిస్తున్న ఆంక్షలను ఈసడిస్తున్నారు. బాలబాలికలు ఇప్పటి నుంచే తమపై విధించే ఆంక్షలను ఉల్లంఘించేందుకు సిద్ధమౌతున్నారు.

ఇంతకీ ఆ సినిమాలో యువతకు అందే సందేశం ఏమిటంటే, 'కెరీర్, పెళ్ళి విషయాల్లో తప్ప మిగతా విషయాలన్నింటిలో తల్లిదండ్రుల మాట వినవచ్చు. వారిచ్చే డబ్బులు అనుభవించవచ్చు. వాళ్ళు చదివించే చదువులు చదవవచ్చు. ఆ డబ్బుతో వెర్రివేషాలు వేయవచ్చు. అవసరమైనపుడు 'నువ్వు నాకేం చేశావు? నా ఇష్టం ఎప్పుడు పట్టించుకున్నావు?' అని నిలదీయవచ్చు. అయితే సినిమాలో హీరో కెరీర్‌ని గాలికి వదిలి పెళ్ళి వెంటపడతాడు. బాధకలిగినప్పుడు తాగి తండ్రిని బూతులు తిడతాడు. ఇదో గొప్ప అన్నట్టు చూపిస్తారు. యువతీయువకులకు ఇది అర్థమౌతుంది బాగా. ఇదంతా ఓ జోక్ అని పెద్దలు ఇప్పుడు ఆనందిస్తున్నారు. కానీ రేపు తమ సంతానం ఈ సినిమాలో హీరోలాగే తాగి తమని బూతులు తిడుతూంటే, 'ఆధునికయువకుడికి ప్రతీక' అంటూ పొంగిపోగలరా? ఇదే సినిమాలో మరో సందర్భంలో 'అన్నీ నాన్న ఇష్టం' అనే అమ్మాయిని చేతకాని, పనికిరాని అమ్మాయిగా చూపిస్తారు. హీరో, ఆ అమ్మాయితో ఎంగేజ్‌మెంట్‌ను రద్దు చేసుకుంటాడు. ఎందుకంటే, ఆమె స్వతంత్రభావాలు చూపకుండా ప్రతి విషయాన్నీ 'అన్నీ నాన్నగారి' మీదే వదిలేస్తుంది. అందుకని. అంటే, తల్లిదండ్రులను గౌరవించి, వారి ఇష్టాయిష్టాల ప్రకారం మసులుకునే వ్యక్తికి స్వీయవ్యక్తిత్వం లేనట్టన్నమాట.

మనకాదర్శం శ్రీరామచంద్రుడు, లక్ష్మణుడు, సీత. తండ్రి మాట కోసం రాజ్యాన్ని రాజభోగాలను, సర్వసుఖాలను తృణప్రాయంగా భావించి అరణ్యవాసానికి వెళ్ళినవాడు రాముడు. అన్న కోసం అన్నీ విసర్జించి వెంట వెళ్ళినవాడు లక్ష్మణుడు. భర్త వెంట ఉండేందుకు ఇతరాలన్నింటినీ వదిలివెళ్ళిన ధీశక్తి సీత. అంటే, త్యాగంలో ఉన్న ఔన్నత్యం, మహోన్నతవ్యక్తిత్వం మన ఆదర్శం అన్నమాట. జన్మనిచ్చినవాడి గౌరవం కోసం స్వీయ సౌఖ్యాలను త్యజించటం ఉత్తమవ్యక్తిత్వమా? లేక నా కెరీరు, నా పెళ్ళి, నా జీవితం అంటూ వెంపర్లాడటం వ్యక్తిత్వమా? తండ్రిని గౌరవించటం వల్ల రాముడి వ్యక్తిత్వం మరింత మహోన్నతంగా ఎదిగింది తప్ప కుంచించుకుపోలేదే? కానీ ఆధునికసమాజంలో పెద్దల మాట వినక ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించటమే స్వీయవ్యక్తిత్వవికాసానికి రాచబాట అన్నట్టు ప్రచారం జరుగుతోంది. మనసుని అదుపులో పెట్టకుండా కళ్ళాలను వదిలేసి ఎటు లాక్కువెళ్తే అటు వెళ్ళటమే 'ఆధునికత'కు పర్యాయపదంగా మారింది.

తండ్రి మాట మన్నించి అడవికి వెళ్లవద్దని రాముడిని అందరూ బతిమలాడుతారు. లక్ష్మణుడు ఆగ్రహం వ్యక్తపరుస్తాడు. దానికి సమాధానంగా రాముడు, 'ఈ పద్ధతి నేను కొత్తగా అనుసరిస్తున్నది కాదు. పరంపరగా మనకు అందుతున్న ఉత్తమసంప్రదాయం

ఇది. నేను ఆ బాటను అనుసరిస్తున్నాను అంతే' అంటాడు. 'తండ్రి ఆజ్ఞ పాటిస్తూ, గోహత్య చేశాడు కందమహర్షి. తండ్రి ఆజ్ఞ పాటిస్తూ, భూమిని తవ్వుతూ సగరుడి పుత్రులు ప్రాణాలర్పించారు. పరశురాముడు తండ్రి ఆజ్ఞప్రకారం తల్లి రేణుక తల నరికినా తండ్రి ఇచ్చిన వరం వల్ల తన తల్లిని తిరిగి బ్రతికించుకొన్నాడు. తప్పని తెలిసినా తండ్రి మాట పాటించటం అనే సంప్రదాయాన్ని నేను పాటిస్తున్నాను' అంటాడు. ఇంకా ఆవేశం తగ్గని లక్ష్మణుడిని శాంత పరుస్తూ, ఇలా అంటాడు:

*యస్మిస్తు సర్వే స్సురసంనివిష్టా*
*ధర్మోయతః స్యాత్ తదుపక్రమేత।*
*ద్వేష్యో భవత్యర్థ పరో హి లోకే*
*కామాత్మతా ఖల్వా న ప్రశస్తో॥*

(మానవలక్ష్యం ప్రతిబింబించని వాటి వెంట పడకూడదు. ధర్మార్థకామమోక్షాలను సాధించే ధర్మమార్గాన్నే అనుసరించాలి. భౌతికసుఖసాధనల వెంటపడేవాడు ద్వేష పాత్రుడౌతాడు. ఇంద్రియలాలసత్వంలో మునిగితేలటం అభిలషణీయం కాదు.)

అంటే సర్వసుఖాలనూ త్యజించటం వల్ల మనిషికి వచ్చే నష్టం లేదు. కానీ ధర్మాన్ని కాదని భౌతికసుఖాల వెంటపడటం, క్షణికానందాల మోజులో పడి సర్వం మరవటం వ్యక్తికీ, కాదు సమాజానికీ ప్రమాదకరం అన్నమాట. ఇదీ ఉత్తమవ్యక్తిత్వానికి ఉత్తమ నిదర్శనం. అంటే, సమాజశ్రేయస్సు కోసం తన 'వ్యక్తిగతా'న్ని త్రోసి రాజనగలగాలి వ్యక్తి.

ఐతే ఒక తుఫానులా వీస్తున్న 'అందినంత అనుభవించు', 'వ్యక్తి ఆనందం ముందు సర్వం దిగదుడుపే'ననే ప్రచారం ఎంత శక్తిమంతమైందంటే, భౌతికసుఖలాలసకే పెద్ద పీట వేయటం జరుగుతోంది. ఈ భావన మన నిత్యజీవితంలో అడుగడుగునా కనిపిస్తోంది.

విద్యార్థులు పాఠశాలల కెళ్ళేదెందుకంటే 'ప్రేమించటానికే' అన్న భావన బలంగా నాటుకుంటోంది. కాలేజీ ప్రేమలు పోయి ఇప్పుడు 'పదవ తరగతి' ప్రేమలు బహిరంగంగా ప్రదర్శితమౌతున్నాయి. 'ఫ్రెండ్‌షిప్' పేరిట స్త్రీపురుషులు స్వేచ్ఛగా కలసి తిరగటం ఆధునికం అయింది. 'ఇదేమిటి?' అన్నవాడు బూజుపట్టిన భావాలకు ప్రతినిధి అయ్యాడు. పొద్దున లేచినప్పటి నుంచీ 'ప్రేమ' తప్ప మరొక మాట వినబడటంలేదు. 'ఇంద్రియ నిగ్రహం' అన్నమాట పనికిరానిదైంది. ఇటువంటి పరిస్థితులలో వ్యక్తిత్వవికాసంలో అత్యంత ప్రాధాన్యాన్ని వహించే 'బ్రహ్మచర్యం' పాటించటం అత్యంతకఠినమైనదవుతుంది.

ఈ పరిస్థితులలో 'బ్రహ్మచర్యం' గురించి ఆలోచించటమంటేనే, చెవులు చిల్లు పడే తుఫాను హోరులో 'పాట' పాడటం వంటిదైంది. ఐనాసరే, ప్రవాహదిశలో కొట్టుకుపోవటంలో గొప్ప లేదు, ప్రవాహవేగాన్ని తట్టుకుని పర్వతంలా నిలిచి ప్రవాహదిశను నిర్దేశించగలగటమే ఉత్తమ వ్యక్తిత్వానికి నిదర్శనం. 'బ్రహ్మచర్యం' లేనిదే వ్యక్తిత్వవికాసం సాధ్యం కాదు కాబట్టి, కష్టాలను ఊహించి చేతులు ముడుచుకొని కూర్చోవటం కన్నా, అడుగు ముందుకేయటం మధ్యమం కాబట్టి 'బ్రహ్మచర్యం' గురించి చర్చించటం తప్పనిసరి.

'బ్రహ్మచర్యా'నికి ముందుగా కావలసింది పెద్దలన్నా, సంస్కృతీసంప్రదాయాలన్నా గౌరవం. గమనిస్తే, తండ్రి మాట వినటం వల్ల వ్యక్తుల వ్యక్తిత్వాలు మహోన్నతమయ్యాయి తప్ప పనికి రానివి కాలేదు. సగరుడి పుత్రులు ఆయన మాట వినటం వల్ల భగీరథుడు గంగను భూమికి దింపాల్సి వచ్చింది. తద్వారా లోకకల్యాణం జరిగింది.

తండ్రి మాట ప్రకారం తల్లి తల నరికిన పరశురాముడి వ్యక్తిత్వం గురించి ప్రత్యక్షంగా చెప్పనవసరం లేదు. రాముడు మనకు ఆదర్శం కాబట్టి క్షణికావేశాలకు లోనై పెద్దలను ఎదిరించి, సంప్ర దాయాన్ని ఉల్లంఘించటం ఉత్తమవ్యక్తిత్వం కాదని గ్రహించాలి. ఈ ఆలోచనతో మనం 'బ్రహ్మచర్యం' వైపు అడుగులు వేద్దాం.

## అదుపులో కోరికలు

*యతో యతో నిశ్చరతి మనశ్చంచల మస్థిరమ్*
*తతస్తతో నియమ్యై తత్ ఆత్మన్యేవ వశం నయేత్*

(స్వాభావికంగా చంచలం, అస్థిరం అయిన మనస్సు ఎప్పుడెప్పుడు లక్ష్యాన్ని వదిలి విషయవస్తువులవైపు పరుగిడుతుందో, అప్పుడప్పుడు దానిని మళ్ళీ లక్ష్యం వైపు నిలపాలి).

మానవజీవితమే ఒక 'మహాభారతం' అంటారు పెద్దలు. మహాభారతం మంచి చెడుల నడుమ ఘర్షణను ప్రతిబింబిస్తుంది. అంటే, మనిషి జీవితంలో నిత్యం మంచికీ, చెడుకూ నడుమ సంఘర్షణ జరుగుతూ ఉంటుందన్నమాట. ఈ ఘర్షణలో మనకు మార్గదర్శనం చేసి సక్రమమైన బాట వైపు పయనించేట్టు చేస్తుంది భగవద్గీత. అందుకే వ్యక్తిత్వవికాసంలో భగవద్గీతకు అత్యంతప్రాధాన్యం ఉంది.

మనిషి ఓ లక్ష్యం ఏర్పరచుకుంటాడు. కానీ ఆ లక్ష్యసాధనకు ఉపక్రమించినప్పటి నుంచీ అడుగడుగునా అనేక అవాంతరాలు ఎదురవుతాయి. అనేక ఆకర్షణలు దారి

తప్పించాలని చూస్తాయి. వాటన్నిటినీ మించి లక్ష్యం సాధించాలంటే మనస్సును అదుపులో ఉంచుకోవాలి. మనస్సు అదుపు తప్పుతుంది. ఇష్టం వచ్చిన దిశలో, ఇష్టం వచ్చినట్టు పరుగిడటం మనస్సు లక్షణం. అందుకే స్వాభావికంగా మనస్సు చంచలం, అస్థిరం అంటుంది భగవద్గీత.

'రామాయణం'లో సీతాదేవి బంగారు లేడిని చూసి ఆశపడింది. ఆ లేడిని ప్రాణాలతో కాకపోతే కనీసం చంపైనా తీసుకురమ్మంది. అప్పుడు దాని బంగారు చర్మంపై తామిద్దరూ కూర్చోవచ్చని రాముడిని బతిమలాడింది. అయితే సీతకు అంతరాంతరాలలో తన కోరిక అనర్థదాయకమని, సర్వం త్యాగం చేసి తాపసుల్లా పర్ణశాలలో బ్రతకాల్సిన తాము బంగారు లేడిని ఆశించటం అంటే లక్ష్యం నుంచి దారి తప్పటమనీ తెలుసు. అందుకే 'కామవృత్తమిదం రౌద్రం స్త్రీణామసదృశం మతమ్' అంటుంది. స్త్రీలకు సమంజసం కాని హింసాత్మకమైంది నా ఆలోచన. కానీ బంగారు లేడిని సాధించాలన్న కోరిక నా స్వాభావికచిత్తవృత్తిని నిరోధిస్తోంది' అంటున్నదన్నమాట సీత. రాముడు సైతం ఇది రాక్షసమాయ అని తెలిసీ, ఆ లేడి వేటకు వెళ్తాడు. అంటే, ఒక్కసారి మనస్సులోకి ఏదైనా కోరిక కానీ, ఆలోచనకానీ ప్రవేశిస్తే, దాన్ని ఆరంభంలోనే అణచేయకపోతే అది మనిషి విచక్షణను కప్పేస్తుందన్నమాట.

మహామహాఋషులు లక్ష్యసాధన కోసం తపస్సు ఆరంభిస్తారు. వాళ్ళు తపస్సు ఆరంభించి, ఒక దశకు చేరుకోగానే ఇంద్రుడికి కంగారు పెరుగుతుంది. వెంటనే వర్షాలు కురిపిస్తాడు. ఎండను మండిస్తాడు. తుఫానులు సృష్టిస్తాడు. వీటికి కూడా చలించక పోతే రంభ, ఊర్వశి, మేనకలను పంపిస్తాడు. ఎటువంటి కష్టనష్టాలకు తట్టుకుని కూడా తపస్సును కొనసాగిస్తున్నవారు సైతం, ఇంద్రుడు పంపిన సుందరీమణుల మోహాన్ని తట్టుకుని నిలబడటం కష్టం. విశ్వామిత్రుడు ఇందుకు మంచి ఉదాహరణ. సాధించిన తపశ్శక్తిని ఆయన ఊర్వశి ప్రలోభంలో పడి పోగొట్టుకోవటం, ఊర్వశీవ్యామోహాన్ని జయించిన తరువాత మళ్ళీ తపస్సు కొనసాగించటం వ్యక్తిత్వవికాసంలో 'కోరిక'లను కట్టడిలో ఉంచటం ఎంత ఆవశ్యకమో మనకు నిరూపిస్తుంది.

కీచకుడు గొప్ప శక్తిమంతుడు. కానీ ద్రౌపదీమోహావేశపరుడైన కీచకుడు బలహీనుడు. ధర్మరాజు ఉత్తముడు. ధర్మపాలనతత్పరుడు. కానీ, జూదవ్యసనలోలుడైన ధర్మరాజు విచక్షణ రహితుడై. ద్రౌపదిని సైతం పణంగాపెట్టి జూదమాడిన అంధుడు. విప్ర నారాయణుడి కథ అందరికీ తెలిసిందే. అంత వరకూ అందరి గౌరవమన్నన లందుకున్న ఉత్తముడు, ఒక వేశ్య మోహంలో పడి సర్వం కోల్పోతాడు. అహల్యను మోహించిన

ఇంద్రుడు గౌతముని శాపాన్ని సైతం లెక్కచేయకుండా మోసం చేసేందుకు సిద్ధపడతాడు. గౌరవం కోల్పోతాడు. ఇలా అనేకపురాణకథలు, మనిషి మనస్సు చంచలత్వాన్ని, ఆ ప్రలోభంలో పడటం వల్ల కలిగే అనర్థాలను హృదయానికి హత్తుకునే రీతిలో ప్రదర్శిస్తాయి. మనిషికి మార్గదర్శనం చేస్తాయి.

'సారంగు తమ్మయ్య' అన్న కవి 'విప్రనారాయణ చరిత్ర' అనే కావ్యం రాశాడు. ఆ కావ్యంలో ఒక పద్యంలో కామప్రలోభంలో పడ్డ వ్యక్తి ఎలా దిగజారుతాడో అత్యంత అద్భుతంగా వర్ణించాడు.

*ఆ విప్రోత్తము వజ్రపంజర నిభంబై నిశ్చలంబైన స*
*ద్భావం బంగన సాహచర్య గుణ సంపర్కంబునన్ లోహమై*
*గ్రావంబై దృఢదారువై తరుణవృక్షంబై ఫలప్రాయమై*
*పూవై తన్మకరందమై కరగె బోబో నీళ్ళకున్ బల్చనై.*

విప్రనారాయణుడు విష్ణుభక్తుడు. పరమనిష్ఠాగరిష్ఠుడు. ఇలా జీవించటం కూడా ఒక తపస్సు వంటిదే. తపస్సు చేయటం అంటే అడవిలోకి వెళ్ళి ముక్కు మూసుకుని కూర్చోవటం కాదు. సుళ్ళు తిరిగే సామాజికజీవనస్రవంతిలో ఉంటూ కూడా, తామరాకును నీటి బొట్టు తాకనట్టే, సమాజప్రవాహగతిని కొట్టుకుపోకుండా నిశ్చలంగా నిలచి తన విధ్యుక్తకర్మలను నిర్మోహంగా నిర్వహించటం తపస్సే. భగవంతుడిపై అచంచల విశ్వాసాన్ని కలిగి ఉండటం ఒక తపస్సే. అటువంటి విప్రనారాయణుడి తపస్సును భగ్నం చేస్తానని 'దేవదేవి' అనే వేశ్య ప్రతిజ్ఞ చేస్తుంది. తన అందచందాల రంగుల పంజరంలో విప్ర నారాయణుణ్ని బందీ చేసుకొంటుంది.

విప్రనారాయణుడు ఎటువంటివాడంటే 'వజ్రపంజరనిభంబై, నిశ్చలంబైన సద్భావం' కలవాడు. 'సద్భావం' అంటే సద్విషయకమైన భావం. భగవంతుడు సచ్చిదానంద స్వరూపుడు. సత్ అంటే ఉన్నది. అది తప్ప మిగిలినవేవీ లేవని అర్థం. 'సద్భావం' అంటే పరమేశ్వరసంబంధమైన భావం. అది ఒక్కటే నిత్యమైంది. సత్యమైంది. నిశ్చలమైన పరమేశ్వరభావానికి మరో పేరు బ్రహ్మచర్యం! స్త్రీ సంయోగం వల్ల బ్రహ్మ భావన చెడుతుంది. మనిషి దృష్టి బ్రహ్మభావనను వదలి భౌతికసుఖావేశపరవశ మవుతుంది. ఐతే విప్రనారాయణుడి బ్రహ్మచర్యభావన వజ్రంతో కట్టిన అభేద్యమైన పంజరం లాంటిది. అంటే అంత దృఢమైనదన్నమాట. కానీ 'అంగన సాహచర్య గుణసంపర్కం'తో అంటే స్త్రీ సాహచర్యమనే గుణం కలవటంతో 'వజ్రం' లాంటి సంకల్పం కాస్తా లోహమైంది. లోహం రాయి అయింది. రాయి గట్టి కొయ్యగా మారింది. అది లేతమొక్కంత

మెత్తనైపోయింది. మొక్క గట్టితనం 'పండు' అంత మెత్తగా అయిపోయింది. చివరికి పూల వలె, వాటిలోని మకరందంగా కరగి, ద్రవం అంత పలచన అయింది. ఇలా పలచబడుతూ చివరికి నీళ్ళ కన్న పలుచనైపోయింది.

ఎంత అద్భుతమైన వర్ణన! వజ్రం అంత కఠినమైంది చివరికి నీరై 'పారి'పోయింది. బ్రహ్మచర్యంలోని ఔన్నత్యం, కామానికి లొంగటం వల్ల దిగజారే 'అధమత్వం' ఇంత కన్న సరళంగా, అందంగా, అద్భుతంగా చెప్పటం కుదరని పని.

పురాణకథలలో 'తపస్సు' కూడా మనిషి వజ్రసంకల్పానికి ప్రతీక. ఒకవేళ సంకల్పం తీవ్రమైనదైతే భౌతికకష్టాలను కలిగించే వేడి, వర్షం, చలి వంటి వాటిని తట్టుకుంటాడు. కానీ రంభ, ఊర్వశి, మేనకలు కలిగించే కామభావనలను తట్టుకుని ముందుకు సాగేవారు అరుదు. ఈ నిజాన్ని పరమశివుడి 'కామదహనం' కథ స్పష్టం చేస్తుంది.

శివుడు తపస్సు చేస్తున్నాడు. అతడు తపస్సు చాలించి పార్వతిని పరిణయమాడితే కానీ లోకకళ్యాణం సాధ్యం కాదు. కాబట్టి ఇంద్రుడు కామ దేవుడిని పిలిచాడు.

*ఉమా రూపేణ తేయూయం సంయమస్తిమితం మనః*
*శంభోర్యతథ్వమాకృష్ట మయస్కాంతేన లోహవత్॥*

'మనస్సును నియంత్రించి తపస్సు చేస్తున్న శివుడి హృదయాన్ని, అయస్కాంతం ఇనుమును ఆకర్షించినట్టు ఆకర్షించు' అని ఇంద్రుడు ఆజ్ఞాపించాడు.

వర్షించని మేఘంలా, అలలు లేని సరస్సులా, నిశ్చలమైన జ్యోతిలా తపస్సులో నిమగ్నమై ఉన్నాడు శివుడు. అంటే, అతని మనస్సు అంత నిశ్చలంగా లక్ష్యంపై కేంద్రీకృతమై ఉందన్నమాట. కానీ కామబాణాలు తాకగానే శివుడి నిశ్చలమైన మనస్సులో చలనం కలిగింది.

*హరస్తు కిన్చిత్పరిలుప్త ధైర్యశ్చంద్రోదయా*
*రంభ ఇవాంబురాశిః*
*ఉమా ముఖే బింబఫలాధరోష్ఠే*
*వ్యాపారయామాస విలోచనాని॥*

నిశ్చలమైన సముద్రం చంద్రోదయసమయంలో ఎలా అలలతో కదులుతుందో, అలా ఉమాదేవి బింబఫలాల (దొండపండ్ల) వంటి పెదవులను చూసిన శివుడి మనస్సు చలించింది.

అంటే, పరమశివుడి అంతటివాడు, సృష్టిస్థితిలయకారుడైనవాడు సైతం, ఏదో ఒక సమయంలో కామవికారభావనలకు లొంగవలసి వచ్చిందన్నమాట.

ఆపై మూడవ కంటి నుండి వెలువడిన జ్వాలలలో కామదేవుడు దగ్ధమౌతాడు. అంటే, కామాన్ని జయించలేని శివుడు, కామభావనలకు కేంద్రమైన కామదేవుడిని బూడిద చేశాడన్నమాట. అంత కఠినమైనది బ్రహ్మచర్యవ్రతం. అందుకే మనస్సు చంచలమనీ, అటూ ఇటూ పరుగిడుతుందనీ, అయినా దాన్ని అదుపులోకి తెచ్చుకుని లక్ష్యంపై కేంద్రీకరించాలని భగవద్గీత చెప్తుంది. అంటే, భారతీయధర్మంలో కోరికను అణచటం కాదు ప్రధానం. కోరికను అదుపులో ఉంచటానికే పెద్ద పీట అన్నమాట. అణచిన కోరిక వికృత ఫలితాలనిస్తుంది. అదుపులో ఉన్న కోరిక కొన్నాళ్ళకు అదృశ్యమౌతుంది.

ఇతరధర్మాలకు, నియమాలకూ, భారతీయధర్మానికీ ఉన్న తేడాను సక్రమంగా విశ్లేషిస్తే, భారతీయధర్మంలో వ్యక్తిత్వవికాససాధనలోని మౌలికమైన రహస్యం విస్పష్ట మౌతుంది.

## ధర్మాలు, నియమాలు

*యే భోగ్ భీ ఏక్ తపస్యా హై*
*తుమ్ త్యాగ్ కీ మారే క్యా జానో?*
*అపమాన్ రచయితా కా హోగా*
*రచనా కో అగర్ ఠుక్‌రావోగే!*

త్యాగాన్నే గొప్పగా భావించే మీరు భోగాలను అనుభవించటం కూడా ఒక తపస్సు లాంటిదేనని అర్థం చేసుకోలేరు. రచనను తిరస్కరించటం రచయితను అవమానించినట్టే అవుతుంది. ఈ ప్రపంచం భగవంతుడి రచన. కాబట్టి ప్రపంచంలోని సుఖదుఃఖాలు, ఆనందవిషాదాలు అనుభవించకుండా, ఏవీ తాకకుండా నిర్మోహి అయి తామరాకు మీద నీటి బొట్టులా ఉండాలనుకోవటం, భగవంతుడి రచనను తిరస్కరించి అతడిని అవమానించినట్టే అవుతుంది. కాబట్టి 'తపస్సు', 'గిపస్సు' బ్రహ్మచర్యం వంటి మాటలు కట్టిపెట్టి జీవితాన్ని అనుభవించాలన్నమాట.

శక్తిమంతమైన వాదమిది!

ఏ భగవంతుడిని చేరుకోవటం కోసం సర్వసుఖాలను త్యాగం చేయటమంటే, భగవంతుడి రచనను కాదని ఆయనను అవమానపరచటమేనంటే, మొత్తం లక్ష్యం దెబ్బ

తినే సాధన చేస్తున్నారన్న భావన కలుగుతుంది. జీవితాన్ని అనుభవించకపోవటం నేరం అనిపిస్తుంది. ఎటువంటి వారి మదిలోనైనా సందేహం జనిస్తుంది.

అవును! ప్రపంచంలో ఇన్ని రకాల ఆనందాలను, అందాలను భగవంతుడు సృజించాడు. వాటిని అనుభవించకుండా కాదనటం వల్ల లాభం ఏముంటుంది? కరిగిన కాలం తిరిగి రాదు. అటువంటప్పుడు కాలాన్ని వ్యర్థం చేసుకుని, అన్ని సుఖాలను త్యజించటం వల్ల ఒరిగేదేముంది? పైన భగవంతుడు ఉన్నాడో లేదో తెలియదు, స్వర్గం ఉందో లేదో ఎవరు చూశారు, కాబట్టి ఉన్నదో లేదో తెలియనిదాని కోసం ఉన్నదాన్ని చేజార్చుకోవటం ఎందుకు? బ్రహ్మచర్యం పేరుతో, తపస్సు పేరుతో జీవితంలో అమూల్యమైన ఆనందాలను అందించే అంశాలను కాదనటం ఎందుకు?

ఈ వాదానికి తోడుగా యుగాన్ని బట్టి మారే ధర్మాలను పట్టుకొని పాపపుణ్యాలను ఎలా నిర్ణయిస్తారు? అంటూ జరిపే వాదాన్ని జోడిస్తే, జీవితాన్ని అనుభవించటమే మానవుడి పరమలక్ష్యం అన్న భావన స్థిరపడుతుంది. 'వ్యక్తిత్వవికాసం' అంటూ విచక్షణను ప్రదర్శిస్తూ యమనియమాలను పాటించటం మూర్ఖత్వం అన్న ఆలోచన కలుగుతుంది. ఒకరకంగా చూస్తే, ఇటువంటి వాదాలు, ఆలోచనల వల్ల నీతినియమాలు పాటిస్తూ క్రమబద్ధమైన జీవితం గడిపేవాడు ఛాందసుడయ్యాడు. అవహేళన పాత్రుడయ్యాడు.

పొద్దున్నే లేచి వ్యాయామం (యోగ) చేసేవాడిని వెక్కిరిస్తారు. కాలేజీకి వెళ్లి బుద్ధిగా చదువుకోవాలనుకునేవాడిని, ఇతరమిత్రులంతా కలిసి ఆటపట్టిస్తారు. అమ్మాయిలతో స్నేహం చేసి, వారి గురించి జోకులు వేయని యువకుడు జీవితాన్ని అనుభవించటం తెలియని వాడవుతాడు. క్లాసులు ఎగగొట్టటం, సినిమాలు చూడటం, జులాయిలా తిరగటం మాత్రమే జీవితాన్ని 'ఎంజాయ్' చేయటం అన్న భావన బలంగా నాటుకుంది. ఇందులో భాగమే, పెద్దల మాట వినకపోవటం, సంప్రదాయాన్ని తిరస్కరించటం, పద్ధతులను, నియమాలను కాదని విశృంఖలంగా ప్రవర్తించటం వంటి అంశాలు.

ఆ మధ్య ఓ సినిమాలో కాలేజీలో పాటల పోటీలవుతుంటాయి. ఓ విద్యార్థి రాగాలాపన ఆరంభించగానే ప్రేక్షకులంతా గోలచేస్తారు. 'వొద్దు' అని అరుస్తారు. ఆ వెంటనే ఆ విద్యార్థి పాశ్చాత్యలయతో పాటను అందుకుంటాడు.

మన సినిమాల్లో చీర కట్టుకునే అమ్మాయి, లంగా, వోణీలు వేసుకునే అమ్మాయిలను హేళన చేయటం కనిపిస్తుంది. మోడర్న్ దుస్తులు వేసుకున్న అమ్మాయిల వెంటే హీరోలు పడతారు. మరో సినిమాలో బుద్ధిగా రోజూ క్రమం తప్పకుండా సాధన చేస్తుండే అన్న

ఓ ప్రమాదం వల్ల పనికి రాకుండా పోతే, అప్పటివరకూ ఇష్టం వచ్చినట్టు తిరిగే తమ్ముడు (హీరో) అదే లక్ష్యం సాధించేస్తాడు. ఇలా యువతీయువకులు మెదళ్లలో, జీవితాన్ని అనుభవించటమే 'అంతిమలక్ష్యం' అన్న భావన ఓ వైపు నుంచి, సంప్రదాయాలను పాటించటం అంటే 'పాత'ను పట్టుకుని వేలాడే పనికిరానితనం అన్న భావన మరోవైపు నుంచి నింపుతూంటే, వైజ్ఞానికదృక్పథం పేరుతో మరో రకంగా ప్రజల మెదళ్లను కలుషితం చేస్తున్నారు.

ఆధునికయుగంలో 'సెక్స్ ఎడ్యుకేషన్' ఓ ప్రధానాంశంగా మారింది. ప్రతి ఒక్కడూ ఈ ముసుగు వేసుకొని రకరకాలుగా సమాజంలో విషాన్ని వెదజల్లుతున్నారు. గోప్యంగా, పవిత్రంగా, ఇద్దరు మనుషులకు మాత్రమే పరిమితంగా ఉండాల్సిన అనేక అంశాలను బహిరంగంగా చర్చిస్తూ, మానవులలోని అధమస్థాయి లక్షణాన్ని ఉత్తేజపరచి పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వివాహేతరసంబంధాలను ప్రోత్సహిస్తూ, విశృంఖలత్వాన్ని సమర్థిస్తూ, నియమాలను, నియంత్రణలను త్రోసిరాజంటున్నారు. గుప్త జ్ఞానాన్ని బహిరంగపరచి అభ్యుదయవాదుల్లా చలామణి అవుతున్నారు. ఇది కూడా సమాజంలో విపరీతమైన ప్రభావం చూపిస్తోంది. కృత్రిమపద్ధతుల ద్వారా స్వయంతృప్తి సాధించటం, అక్రమపద్ధతుల ద్వారా కామతృప్తి పొందటం సబబేనన్న వీరి వాదం ప్రజలను తప్పు దారి పట్టిస్తోంది. 'లైంగికస్వేచ్ఛ' పరమానందమన్న ప్రచారం వల్ల వ్యాపారులకు లాభాలు అధికంగా ఉండటంతో, ప్రతి ఒక్కరూ అదే పాట పాడుతున్నారు.

తమ వాదానికి సంప్రదాయ మద్దతు కోసం వీరు ఖజురహో శిల్పకళకు వికృతభాష్యం ఇస్తున్నారు. వాత్స్యాయనుడి 'కామసూత్రా'లను కాచివడబోసినట్టు మాట్లాడుతూ, మన పూర్వికుల గురించి అసంబద్ధవ్యాఖ్యలు చేస్తూ కాలర్లెగరేస్తున్నారు.

ఇటువంటి ఉధృతమైన ప్రచారప్రవాహంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న సమాజంలో నియమనిబంధనలు, శాశ్వత ఆలోచనలు, దూరదృష్టి అన్నవి అదృశ్యమవటంలో ఆశ్చర్యం లేదు. ఇటువంటి ప్రచారప్రభావంతో ఎదుగుతున్న పసిపిల్లల మెదళ్లు ఆవేశాలకు లోనుగావటం సాధారణం అవుతుంది. ఎవరన్నా గౌరవం లేకపోవటం, జీవితంపై చులకన భావం ఉండటంలో ఆశ్చర్యం ఉండదు.

అందుకే 'ప్రేమ' నేటి సమాజంలో అత్యంతవికృతరూపంతో దర్శనమిస్తోంది.

తాను ప్రేమించిన అమ్మాయిని కలవనివ్వటం లేదని, ఓ యువకుడు 'వాటర్ ట్యాంక్' ఎక్కి 'షోలే'లో 'ధర్మేంద్ర'లా ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అది

చూసి వెర్రెక్కిన యువతీయువకులంతా 'వాటర్ ట్యాంకు'లెక్కేసి తమ ప్రేమలను ప్రకటించేస్తున్నారు. దీనికి పరాకాష్ఠ ఏమిటంటే, పెళ్ళయి, ఇద్దరు పిల్లలు గల తల్లి సైతం తన 'లవర్'తో తనను కలపాలని 'వాటర్ ట్యాంక్' ఎక్కి గోల చేయటం.

అంతకు ముందు సినిమాల్లో విఫలప్రేమికులు ఆత్మహత్యలు చేసుకునేవారు. అందుకని, చార్మినార్, బాబూఖాన్ ఎస్టేట్, ట్యాంక్‌బండ్లు ప్రేమను ప్రకటించుకునేందుకు స్థావరాలయ్యాయి. అయితే, ఆధునికతరంలో ప్రేమ కన్నా లైంగికప్రచోదనలు ప్రధానపాత్ర వహించటంతో, పార్కులు, పబ్బులు ప్రేమాలయాలుగా వెలశాయి. పైగా 'ప్రేమ' కన్నా 'కెరీరు' ప్రధానమవ్వటంతో, ప్రేమ కేవలం 'లైంగిక తృష్ణ' తీర్చుకునే ముసుగులా మారింది. పాశ్చాత్యదేశాల్లోనూ 'ఎమోషన్‌లెస్ మోషన్' (భావరహిత కదలిక) గా మాత్రమే 'ప్రేమ' మిగులుతోంది. ఇటువంటి పరిస్థితులలో 'బ్రహ్మచర్యం' గురించి మాట్లాడటం అంటేనే మూర్ఖత్వం అనిపిస్తుంది. కానీ, యుగాన్ని బట్టి మారే ధర్మాలు అశాశ్వతధర్మాలు. యుగంతో సంబంధం లేకుండా మానవజీవితాలను శాశ్వతంగా నిర్దేశించే ధర్మాలు శాశ్వతధర్మాలు. అటువంటి శాశ్వతధర్మం బ్రహ్మచర్యం!

*తస్మాదజ్ఞాన సమ్భూతం హృత్‌స్థం జ్ఞానాసినాऽత్మనః*
*ఛిత్త్వైనం సంశయం యోగం ఆతిష్ఠోత్తిష్ఠ భారత!*

(అజ్ఞానజనితమై హృదయంలో మెదులుతున్న సంశయాలను జ్ఞానఖడ్గంతో నరికేయాలి. యోగనిష్ఠుడివికావాలి. నీ కర్తవ్యాన్ని నిర్వహించాలి).

సంశయాలతో దారి తప్పుతున్న అర్జునుడికి శ్రీకృష్ణుడు ఇచ్చిన ఉపదేశం ఇది. మన సంశయాలు, సందిగ్ధాలన్నీ అజ్ఞానం వల్ల జనిస్తాయి. అజ్ఞానాన్ని పారద్రోలేది కేవలం జ్ఞానమే. కాబట్టి సరైన విజ్ఞానాన్ని సాధిస్తే పాపం, పుణ్యం వంటి సందేహాలు పటాపంచలవుతాయి. నియమం, నియంత్రణ వంటి అంశాల ప్రాధాన్యం స్పష్టమౌతుంది.

ఎలాగైతే ఓ వ్యక్తి తపస్సు ఆరంభించగానే, అతడిని దారి మళ్లించేందుకు రకరకాల ఆకర్షణలు చుట్టుముడతాయో, అలాగే ధర్మపథంలో ప్రయాణించి వ్యక్తిత్వవికాసం సాధించాలనుకునే వ్యక్తిని సైతం తప్పు దారి పట్టించేందుకు అనేకసందిగ్ధాలు సిద్ధంగా ఉంటాయి. ఆ సందిగ్ధాలను మించేందుకు అవగాహన అవసరం.

'బ్రహ్మచర్యం' ఏ రకంగా అనుసరణీయం, అభిలషణీయమో, ఆధునిక విశృంఖల సమాజంలో బ్రహ్మచర్యం ఏ రకంగా సాధ్యమో, వ్యక్తిత్వవికాసంలో బ్రహ్మచర్య సాధన విజయాన్ని మరింత చేరువగా ఎలా చేయగలుగుతుందో అర్థం చేసుకోవాలంటే,

ముందుగా బ్రహ్మచర్య వ్యతిరేకప్రచారాన్ని ధర్మవిరుద్ధమైన భావాల తుఫాను తాకిడిలోని మర్మాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

## కామతత్త్వం

*కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః।*
*మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్॥*

(రజోగుణకార్యమైన కామం, అది విఫలమైనప్పుడు జనించే క్రోధం, పాపాచరణకు ముఖ్యకారణాలు. కామం ఎప్పటికీ తృప్తి చెందేది కాదు. ఇది మహాపాపి. జీవుడికి పరమశత్రువు కామమే).

పాపమేమిటి? పుణ్యమేమిటి? మనుషులను పాపాచరణకు ప్రోత్సహించేదేమిటి? అన్న అర్జునుడి సందేహానికి శ్రీకృష్ణుడిచ్చిన సమాధానం ఇది.

ఈ సమాధానంలో యుగాలను బట్టి మారే ధర్మం ప్రసక్తి లేదు. రీతిరివాజుల మాట లేదు. ప్రపంచంలో శాశ్వతంగా నిలిచే ధర్మం ప్రసక్తి ఉంది. శాశ్వత సత్యం ఉంది. యుగాలు మారినా, తరాలు మారినా, పద్ధతులు మారినా మారని సత్యం ఉంది.

సాధారణంగా, కాలాన్ని బట్టి మారేది ధర్మం కాదు, సంప్రదాయం. 'సంప్రదాయం' అంటే 'సంక్రమించేది' అని అర్థం. అంటే ప్రతియుగంలో, సాంఘికజీవితంలోని అంశాలు ఒక తరం నుండి మరో తరానికి అందేవన్నీ సంప్రదాయం కిందికే వస్తాయన్నమాట. గత తరం కొత్త తరానికి 'సంప్రదాయం' అనే ధనాన్ని ఇస్తుంది. ఆ మూలధనాన్ని కొత్త తరం ఆమోదిస్తే ఆ సంప్రదాయం నిలుస్తుంది. తిరస్కరిస్తే ఆ సంప్రదాయం అంతరిస్తుంది. దాని స్థానంలో కొత్త పద్ధతి వస్తుంది.

ఒకప్పుడు బాల్యవివాహాలు సంప్రదాయంగా ఉండేవి. బాలిక కన్య కాగానే పెళ్లి చేసేయటం ఆచారంగా ఉండేది. పరిస్థితులు మారాయి. పద్ధతులు మారాయి. బాల్య వివాహాల అవసరం తీరింది. ఇప్పుడు చలామణిలో ఉన్న పరిస్థితులలో బాల్యవివాహాలు జరపమని, నిర్బంధించినా, జరిపేవారు కనబడరు.

అలాగే భర్త మరణిస్తే అదే చితిలో మరణించే 'సతి' సంప్రదాయం ఉండేది. ఇప్పుడది లేదు. అంటే, ఇప్పుడు దాని అవసరం లేదు. ఇవన్నీ కాలాన్ని బట్టి మారే పద్ధతులు.

సాధారణంగా, సమాజం ఓ పద్ధతిలో, ఓ బాటలో నడుస్తూంటుంది. ప్రతిభావంతుడైనవాడు, అందరూ నడిచే బాటను కాదని ముళ్ల దారిలో ఓ కొత్త బాటను ఏర్పరుస్తాడు. అతడు ఏర్పరచిన బాటలో మిగతావారు నడవటం ఆరంభిస్తే, ఆ బాట బాగా నలుగుతుంది. అదొక సంప్రదాయంగా మారుతుంది. పాత సంప్రదాయం వెనక్కు వెళ్తుంది. కొన్నాళ్లకు అదృశ్యమైపోతుంది. లోకం రీతి ఇది.

*యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః।*
*స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే॥*

(పెద్దలు ఎలా వ్యవహరిస్తారో, దాన్ని సామాన్యజనులు అనుకరిస్తారు. సదాచారం విషయంలో పెద్దలు ఏర్పరచిన ప్రమాణాన్నే జనసామాన్యం అవలంబిస్తారు)

ప్రపంచగతిని, రీతిని ఆకళింపు చేసుకుని ఏర్పరచిన నియమం ఇది. ప్రపంచం నిత్య పరిణామశీలి. అటువంటి ప్రపంచంలో కాలాన్ని బట్టి సంప్రదాయం మారటంలో ఆశ్చర్యం లేదు. అలా మారిన ప్రతిదీ మంచిదేననుకోవాల్సిన అవసరం లేదు. జనులు కొన్నాళ్ళు కొత్త పద్ధతిని అనుసరిస్తారు. దుష్ఫలితాలు వస్తే దాన్ని వదలి నూతన పద్ధతి వైపు మొగ్గుతారు.

ఐతే, శాశ్వతమైంది ధర్మం. 'బ్రహ్మచర్యం' అటువంటి శాశ్వతమైన ధర్మం–కాలాన్ని బట్టి మారేది కాదు. ఎందుకంటే, కోరికలు అలల్లాంటివి. అవి ఆగటం అంటూ ఉండదు. తీర్చుకున్న కొద్దీ వస్తూనే ఉంటాయి. దీనికి యుగంతో సంబంధం లేదు. మారే కాలంతో సంబంధం లేదు. కోరిక లేనిదే, ప్రపంచమే లేదు. కాబట్టి ప్రపంచం ఉన్నంత కాలం కోరికలుంటాయి. అన్ని కోరికలు తీరవు. తీరిన కోరిక కొత్త కోరికకు కారణమైతే, తీరని కోరిక నిరాశను కలిగిస్తుంది. క్రోధాన్ని కలిగిస్తుంది. ఇవి విచక్షణను హరిస్తాయి. విచక్షణరహితమైన చర్య పాపకార్యానికి దారి తీస్తుంది.

అంటే, మనుషులను పాపం వైపు ఎవరు నెడుతున్నారన్న అర్జునుడి ప్రశ్నకు సమాధానంగా శ్రీకృష్ణుడు, బయటవారు కాదు, మనిషిని పాపం వైపు అతడి మనసులో జనించే కోరికలే నెడుతాయని స్పష్టంగా చెప్తున్నాడన్నమాట. అంటే, మనిషికి శత్రువు బయట ఎక్కడో ఉండదన్నమాట. అతడి మనసులోనే శత్రువు దాగి ఉన్నాడు. తన మనసులో నిరంతరం జనిస్తున్న కోరికల స్వరూపాన్ని గ్రహించి, వాటి పట్ల ఆసక్తిని నశింపచేసుకోవటం మనిషి కర్తవ్యం.

*ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూపజాయతే।*
*సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధోऽభిజాయతే॥*
*క్రోధాద్భవతి సమ్మోహఃసమ్మోహాత్ స్మృతివిభ్రమః।*
*స్మృతి భ్రంశా ద్బుద్ధి నాశో, బుద్ధినాశాత్ ప్రణశ్యతి॥*

(విషయచింతన వల్ల వాటిపై ఆసక్తి కలుగుతుంది. ఆసక్తి బలపడి కోరికగా మారుతుంది. విఫలమైన కోరిక క్రోధంగా పరిణమిస్తుంది. క్రోధం వల్ల ఆవేశం, దాని వల్ల తననుతాను మరచిపోవటం, యుక్తాయుక్త వివేకం నశించటం జరుగుతాయి. దాంతో బుద్ధి నశించిన మనిషి పాపకార్యాలు చేస్తాడు).

మనిషి పాపకార్యాచరణకు ఒడిగట్టేందుకు కారణాలను సరళంగా, తర్కబద్ధంగా వివరిస్తుంది భగవద్గీత. అన్ని పాపాలకూ హేతువు నియంత్రణలేని కోరిక. కోరికను జయించటం కష్టం. ఎందుకంటే, ఒక రకంగా చూస్తే, ప్రపంచానికి మూలం కోరిక.

ఒక సిద్ధాంతం ప్రకారం భగవంతుడికి సృష్టించాలన్న కోరిక (సిస్రృక్ష) కలగటం వల్ల ఈ సృష్టి జరిగింది.

మరో సిద్ధాంతం ప్రకారం ప్రకృతిలో మూడు గుణాలుంటాయి. అవి సత్త్వం, రజస్సు, తామసం. ఈ మూడు గుణాల నడుమ సమతౌల్యం ఉంటుంది. అప్పుడు సృష్టి లేదు. కానీ పురుషుడి రాకతో ప్రకృతిలో వికారం జనిస్తుంది. దాంతో ఈ మూడు గుణాల నడుమా ఉన్న సమతౌల్యం దెబ్బతింటుంది. సృష్టి జరుగుతుంది.

గమనిస్తే, ఈ వివరణ దాదాపుగా అన్ని విషయాలకూ వర్తిస్తుంది. ఒక వ్యక్తి పూర్తి నియంత్రణలో ఉన్నాడు. అతడికి దేనిపై వ్యామోహం లేదు. కోరిక లేదు. సుఖ, దుఃఖభావనలు లేవు. అతడి మనస్సు అలలు లేని నిశ్చలతటాకం వంటిది. అక్కడ సృష్టి లేనట్టే.

అదే, వ్యక్తిలో నియంత్రణ దెబ్బ తింటే, అతడికి కోరిక కలుగుతుంది. క్రోధం జనిస్తుంది. సృష్టి చైతన్యవంతమవుతుంది. కామదేవుడి బాణాలకు శివుడు చెక్కు చెదరకుంటే 'కుమారసంభవం' సంభవమయ్యేది కాదు.

అందుకే, ఎటువంటి కోరికలూ లేని నిశ్చలస్థితిని 'సమాధిస్థితి' అని, 'మోక్షం' అనీ వర్ణించారు మన పూర్వికులు. 'సృష్టి' లేనప్పుడు సర్వం భగవంతుడిలో 'లయ'మైనట్టే కదా! కాబట్టి సమాధిస్థితిని చేరిన వ్యక్తి 'మోక్షం' సాధించినట్టే అవుతుంది.

ఇది మహామహాయోగులకు కానీ సాధ్యం కాదు. ఎవరైనా తనకది 'సాధ్యం' అయిందనుకుంటే, పొరపాటు పడినట్టే. ఈ నిజాన్ని వివరిస్తూ పురాణకథ ఉంది. తన 'బ్రహ్మచర్యం' పట్ల ఎంతో గర్వం ఉన్న నారదుడు సైతం, సంసారలంపటంలో చిక్కుకున్న ఆ కథ అందరికీ తెలుసు.

ఓ సారి ఓ విద్యార్థి గురువు వద్దకు వచ్చి తాను కామాన్ని జయించానని విన్నవించాడట. ఇక నేను ధ్యానం చేయాల్సిన అవసరం లేదు. దేవుడిని ప్రార్థిస్తూ, కోరికలను నియంత్రించాలని ప్రయత్నించాల్సిన అవసరం లేదు అన్నాడట. దానికి సమాధానంగా గురువు 'కోరికలను జయించానని అనుకోవటం పొరపాటు. నీ నియంత్రణను పరీక్షిస్తూ, భగవంతుడు నీలో ఆశ కలిగించే కోరికను నీ ముందు ఉంచాలని ప్రార్థిస్తాను. ఒకవేళ నువ్వు ఆ కోరికను జయిస్తే, మరో కోరికను నీ ముందుంచాలని వేడుకుంటాను. ఎందుకంటే కోరికలపై నియంత్రణ సాధించే పోరాటం నిత్యమైనది. అది అనుక్షణం జరుగుతూనే ఉండాలి' అన్నాడు.

అంటే, వ్యక్తిత్వవికాసంలో అత్యంతప్రాముఖ్యం వహించే 'బ్రహ్మచర్యం' ఎంత ఆవశ్యకమైందో, అంత కఠినతరమైంది అన్నమాట. యుగాలు మారినా, తరాలు మారినా, సిద్ధాంతాలు మారినా, ఎలాగైతే మనిషిలో కోరికలు కలగటం మారదో, అలా ఆ కోరికలను నియంత్రించి, వాటిని జయించాలన్న 'బ్రహ్మచర్య' ప్రాబల్యం కూడా మారనిది అన్నమాట. కేవలం భారతీయధర్మంలోనే కాదు, ప్రపంచంలోని ప్రతిధర్మంలో, మతంలో 'బ్రహ్మచర్యా'నికి పెద్దపీట వేయటం చూడవచ్చు. ఐతే కోరికను అణచటంకన్నా దాని స్వరూపాన్ని అర్థం చేసుకుని, కోరికలు సహజమని గ్రహించి, వాటిని అదుపులో ఉంచుకునే, ఆరోగ్యకరమైన ఆలోచనను భారతీయధర్మం ఒక్కటే ప్రదర్శిస్తుంది. మిగతా ధర్మాలలో 'కోరిక' కలగటమే 'పాపం'. దాంతో 'సృష్టికార్యం' మొత్తం 'పాపం' అయిపోయింది. అంటే పుడుతూనే వ్యక్తి 'పాపి' అవుతాడన్నమాట. జీవితాంతం తాను 'పాపి' అన్న నేరభావనను మోస్తూ బ్రతుకుతాడు. అటువంటివారిలో అనేకవికృతులు జనిస్తాయి. మానసికంగా జనించే వికృతుల వల్ల వాళ్లు రాక్షసుల కన్నా ఘోరంగా ప్రవర్తిస్తారు. పాశ్చాత్యదేశాలలో జరిగే అనేకమైన ఘోరమైన నేరాలకు కారణం వ్యక్తులలో లైంగికాలోచనలను అణచిపెట్టి, తాను 'పాపి' అన్న భావనే అని మానసికశాస్త్రవేత్తలు తేల్చి చెప్పారు కూడా. వ్యక్తుల అంతరంగాలలో ప్రాకృతికంగా కలిగే స్పందనలను కృత్రిమంగా అణచివేసే ప్రయత్నాలు విఫలమౌతున్న కొద్దీ, తాను ఘోరమైన 'పాపి'ని అన్న భావన బలపడుతుంది. వ్యక్తులలో జరిగే ఈ సంఘర్షణను పాశ్చాత్యకళాకారులు

తమ కళ ద్వారా ప్రదర్శించి ప్రపంచానికి చూపారు. హెర్మన్ హెస్ నవల 'డెమియాన్', జేమ్స్ జాయ్స్ నవల 'పోర్ట్రెయిట్ ఆఫ్ యాన్ ఆర్టిస్ట్ యాజ్ ఎ యంగ్‌మాన్', ఆల్డస్ హక్స్‌లే నవల 'క్రోమ్‌యెల్లో', ఇంకా ఇటువంటి అనేకరచనలు ఇందుకు నిదర్శనాలు. తాను 'పాపిని కాను' అన్న తిరుగుబాటు ధోరణిని ప్రదర్శించిన రచయితలు, విచ్చలవిడితనాన్ని ప్రదర్శించారు. లార్డ్ బైరన్, డిహెచ్ లారెన్స్ వంటివారు ఇందుకు ఉదాహరణలు.

కానీ 'భారతీయధర్మం' ఇందుకు భిన్నంగా, బ్రహ్మచర్యాన్ని ఒక ఆరోగ్యకరమైన 'వ్రతం'గా మలచి, వ్యక్తిత్వవికాసానికి దారి దివ్వెగా మలచింది.

## బ్రహ్మచర్యవ్రతం

*న జాతు కామః కామానా ముపభోగేన శామ్యతి।*
*హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే॥*

(కోరికల అనుభవంతో కామం తీరదు. పైగా, హవిస్సుతో అగ్ని పెంపొందినట్లు, తీరుతున్న కొద్దీ కామం పెరుగుతుంది.)

పురాణ కథలలో యయాతి కథ అందరికీ తెలుసు. యయాతి ఆరు రోజులలో మహీమండలాన్నంతా జయించిన ఘనుడు. వార్ధక్యదశలో సన్న్యాసం స్వీకరించేందుకు సిద్ధమయ్యాడు. శరీరం కృశించింది కానీ కోరికలు నశించలేదు. మళ్ళీ యౌవనం వస్తే, యౌవనసౌఖ్యాలు అనుభవించవచ్చన్న ఆశ కలిగింది. దాంతో అయిదుగురు పుత్రులనూ పిలిచి వారిలో ఎవరైనా ఒకరిని తనకు యౌవనం ఇచ్చి, తన వార్ధక్యం తీసుకోమని కోరాడు. కానీ రాజు జరాభారం గ్రహించేందుకు అతని పుత్రులు ముందుకు రారు. చివరికి 'పూరుడు' ముందుకు వస్తాడు. తండ్రి వార్ధక్యం తాను స్వీకరించి, తన యౌవనాన్ని తండ్రికి సమర్పిస్తాడు. మళ్ళీ యౌవనం సాధించిన యయాతి, విశ్వాచితో కలసి 'స మార్గ మాణః కామానా మంతం', అంటే కామం అంతాన్ని వెతుకుతూ భూమి అంతా విహరిస్తాడు. సంతృప్తి కలిగిన తరువాత పూరుడికి యౌవనం ఇచ్చేసి వానప్రస్థాశ్రమం స్వీకరిస్తాడు. ఇది యయాతి కథ. పై మాటలు యయాతి అనుభవసారాలు.

కోరికలు ఎంత తీర్చుకుంటే అంత పెరుగుతాయి. కోరికలు తీరే దాకా, తీర్చుకుని, వాటిపై విముఖత కలిగేంతవరకూ అనుభవించి, ఆపై కోరికలను విసర్జించాలని కొందరు ఓ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆశ్రమాలు స్థాపించి, ఎవరికి ఎవరిపై ఏ కోరిక

కలిగినా వెంటనే తీర్చుకోవచ్చని స్వేచ్ఛనిచ్చారు. కానీ తీర్చుకుంటే తీరేదైతే అది కోరికనే కాదు. ఆశ్రమంలో వికృతులు జనించాయి. వ్యక్తులు మానసికంగా గాయపడ్డారు. కొన్నాళ్ళకి ఆ సిద్ధాంతకర్తల మోసం బయటపడింది. తమ వికృతలైంగికేచ్ఛలకు సిద్ధాంతం, ఆధ్యాత్మికతల ముసుగు వేసి ప్రజలను మభ్యపెడుతున్నారని తెలిసింది. వారి కథ అంతటితో ముగిసింది. కానీ హిందూధర్మసిద్ధాంతంలో అది ఒక మాయని మచ్చలా మిగిలింది.

భారతీయధర్మంలో 'కామం' అంటే కేవలం 'లైంగికం' కాదు. ఎటువంటి కోరిక అయినా కోరికే. సృష్టిచేయాలన్న భగవంతుడి తలంపును కూడా (సిసృక్ష) కోరిక అన్నారు. కాబట్టి, చిన్నది, పెద్దది అన్న సంబంధం లేకుండా ప్రతి కోరిక 'కామం' కిందికే వస్తుంది. ఇటువంటి కోరికలు తీర్చుకుంటే తరగవు. 'కౌపీనసంరక్షణార్థం' సన్యాసి సంసారైన కథ అందరికీ తెలుసు. ఈ నిజాన్ని వివరిస్తుంది యయాతి కథ.

రాజుగా సర్వభోగాలను అనుభవించాడు యయాతి. ఐనా సరే, ఇంకా భోగాలను అనుభవించాలన్న తృష్ణ తీరలేదు. ఆ కోరిక అతడి విచక్షణను కప్పేసింది. తన యౌవనాన్ని తాను సంపూర్ణంగా అనుభవించాడు. తన సంతానానికి వారి యౌవనాన్ని అనుభవించే హక్కుందన్న విషయం మరచాడు. కోరికలను తీర్చుకోవాలన్న తృష్ణ ఈ వయసులో తనకే ఇంత ఉంటే, యౌవనంలో ఉన్నవారికి ఇంకెంత ఉంటుందో అన్న ఆలోచనను విస్మరించాడు. కోరకూడని కోరికను సంతానాన్ని కోరాడు. తన కోరికను సంతానం నిరాకరించటం సమంజసమే. ఎందుకంటే, వారింకా జీవితాన్ని అనుభవించే దశలోనే ఉన్నారు. తాను జీవితాన్ని సంపూర్ణంగా అనుభవించాడు. ఐనా సరే, తన కోరికను సంతానం కాదనేసరికి విచక్షణను మరచి, ఆవేశంతో వారిని శపించాడు. నిర్లజ్జగా, తన చిన్న కొడుకుకు తన వార్ధక్యం ఇచ్చి, అతని యౌవనం స్వీకరించి, సుఖభోగాలు మళ్ళీ అనుభవించాడు. ఐనా సుఖలాలస వదలేదు. కోరికల దుగ్ధ వదలలేదు. అప్పుడు యయాతి ఈ నిజాన్ని గ్రహించాడు. భూమిలోని ధనధాన్యాలు, బంగారం వంటి విలువైన వస్తువులు, పశువులు, స్త్రీలు ఇవేవీ వ్యక్తికి తృప్తినివ్వవని అర్థం చేసుకున్నాడు. ఇవన్నీ కామప్రేరేపకాలే తప్ప కామాన్ని చల్లార్చేవి కావని గ్రహించాడు.

*యాత్పృథివ్యాం వ్రీహియనం హిరణ్యం పశవః స్త్రియః।*
*నాలమేకస్య తత్సర్వ మితి కృత్వా న ముహ్యతి॥*

ధాన్య సంపద, బంగారం, పశువులు, స్త్రీలు, ఏవీ తృప్తినియ్యవని తెలిసినప్పుడు వ్యక్తి వాటికి మోహపడడు. అంటే వ్యక్తి కామస్వరూపం గ్రహించాలన్నమాట. అది

గ్రహించకుండా 'జన్మ దుఃఖం, జరా దుఃఖం' అని వల్లెవేస్తూ, కోరికలకు లొంగిపోతూంటే, అతడి జన్మ దుఃఖమయమే అవుతుంది. జీవితమూ దుఃఖమయమే అవుతుంది. ఈ నిజాన్ని యయాతి అనుభవం ద్వారా గ్రహించి ప్రపంచానికి చెప్తున్నాడు. ఎక్కడో ముక్కు మూసుకొని తపస్సు చేస్తూ 'కోరికలు జయించండి' అని చెప్పే వాడి మాటకు విలువ ఉండదు. 'ఆఁ' వాడు సన్న్యాసి. వాడికేమైనా ఉందా? వాడెన్నయినా చెప్తాడు' అని కొట్టేస్తారు. కానీ అన్నీ అనుభవించి, ఒకసారి యౌవనంపోయిన తరువాత మరోసారి యౌవనం పొంది, మళ్ళీ అనుభవించిన వ్యక్తి చెప్తున్నాడంటే అతని మాటలు అంత తేలికగా కొట్టేయలేం. సముద్రం ఒడ్డున నుంచుని 'సముద్రం ఎంతో లోతు' అని చెప్పేవాడి మాటల కన్నా, సముద్రం లోతులలోకి దూకి పరిశోధించి వచ్చి చెప్పేవాడి మాటలకు ఎక్కువ విలువ ఉంటుంది. యయాతి కథలో మనం అదే చూడవచ్చు.

*యా దుస్త్యజా దుర్మతిభిర్యాన జీర్యతి జీర్యతః*
*యోసౌ ప్రాణాంతకో రోగస్తాం తృష్ణాం త్యజతః సుఖమ్*

'దుర్మతులు దేన్ని వదిలించుకోలేరో, మనిషి ముసలివాడైనా, దేనికి ముసలితనం లేదో, ఏది ప్రాణాంతకమైన రోగమో, ఆ తృష్ణ అనే రోగాన్ని వదిలించుకొన్న వాడిదే సుఖం' అంటాడు యయాతి. సుఖాంతాన్ని చూడాలని ప్రయత్నించినవాడి అనుభవసారం ఇది.

పురాణకథలను పుక్కిటి కథలని, కల్పితాలని కొట్టేయటం వల్ల ఆ కథల సారాన్ని మనం తేలికగా తీసుకుంటున్నాం. అలా కాక, పురాణకథలను విశ్లేషిస్తే సుఖమయ జీవనవిధానానికి దారి తెలుస్తుంది. ఉత్తమవ్యక్తిత్వ వికాసమార్గం సులువుగా బోధ పడుతుంది.

గమనిస్తే, తీర్చుకుంటే కోరిక పెరుగుతుందని ఆధునికమానసికశాస్త్రవేత్తలు కూడా అంటున్నారు. ఉదాహరణకు 'మందుకు బానిసలు' (ఆల్కహోలిక్స్) అయినవారికి చికిత్స చేసిన తరువాత వారిని మందు వైపు చూడను కూడా చూడవద్దంటారు. చూస్తే తాగాలనిపిస్తుంది. ఒక్క చుక్క తాగితే అది ఒక వరదలా మళ్ళీ అలవాటైపోతుందని బోధిస్తారు. వ్యాయామం చేస్తూ, డైటింగ్ చేసేవారు కూడా ఒక్క రోజు వ్యాయామం మానేస్తే రెండో రోజు వెళ్ళ బుద్ధి కాదు. అలా 'ఒక్క రోజే కదా', అంటూ నెలలు గడిచిపోతాయి. డైటింగ్ చేసేవారు కూడా ఓ బలహీనక్షణంలో 'ఈ ఒక్క రోజు తింటే ఏమీ కాదు' అనుకుంటారు. అంతే నియంత్రణ కోల్పోతారు. ఇటువంటి నియంత్రణ

కోల్పోవటాన్ని 'బింజ్' అంటారు. పడవకు ఒక్క ఛిద్రం లేనంతకాలం, నీరు లోపలికి రాదు – సన్నటి రంధ్రం ఏర్పడితే చాలు, ఒక్క చుక్కలోపలికి వస్తుంది. కొద్దిసేపటికి పడవ జలమయమై మునిగిపోతుంది. దృఢనిశ్చయమనే మానవుడి మనస్సును 'కోరిక' అనే వెల్లువ ముంచెత్తటానికి కూడా చిన్న రంధ్రమనే ఆశ చాలు. ఈ ఒక్క కోరిక తీర్చుకుని అవి బలహీనపడితే... కోరికలు తీరవు. మనిషి జీవితం అయిపోతుంది.

'క్రూరైరనార్యైః సౌమిత్రే పరిహాసః కథంచన!"

'క్రూరులతో, అనార్యులతో పరిహాసం ఆడకూడ'దని లక్ష్మణునితో శూర్పణఖ ఉదంతంలో రాముడు అంటాడు.

అరణ్యంలో నివసిస్తున్న రాముడిని చూసి మోహిస్తుంది శూర్పణఖ. కానీ తాను భార్యతో ఉన్నాడు కాబట్టి లక్ష్మణుడి వైపు ఆమెని పంపుతాడు రాముడు. తాను సేవకుడు, కాబట్టి తనతో ఉండి లాభం లేదు. 'నువ్వు అందమైన రూపం ధరిస్తే అసహ్యంగా ఉన్న సీతను వదలి నీ వెంట పడతాడు రాముడు' అని శూర్పణఖతో హాస్యంగా అంటాడు లక్ష్మణుడు. అతడి మాటలలోని వ్యంగ్యం గ్రహించలేని శూర్పణఖ, 'నిజమే' అనుకుని సీతను చంపబోతుంది. అపుడు ఈ మాటలతో లక్ష్మణుడిని వారించి, ఆమెను వికలాంగిని చేయమని ఆజ్ఞాపిస్తాడు రాముడు.

కోరిక బాహ్యరూపం అందంగా ఉన్నా, దాని అసలు ఫలితం వికృతమే. శూర్పణఖ కోరిక అధర్మం. అందుకే శూర్పణఖ భయంకరమైన రాక్షసి. రాముడు మానవుడు. ఆ కాలంలో బహుభార్యాత్వం తప్పు కాదు. కానీ మానవుడు రాక్షసిని కూడటం అధర్మం. అయినా సరే, శూర్పణఖని చిన్నబుచ్చకుండా ఆమెను లక్ష్మణుడి వైపు తోశాడు రాముడు. కానీ రాముడి అంత విచక్షణ లేని లక్ష్మణుడు ఆకృతి దాల్చిన కోరిక వంటి శూర్పణఖతో పరిహాసమాడాడు. కోరిక తనను కబళించేందుకు వస్తే, కోరిక ముక్కుచెవులు కోశాడు. కానీ పూర్తిగా జయించక, కొద్దికొద్దిగా దెబ్బ తిన్న కోరిక, తన రాక్షససోదరుల సహాయం కోరింది. వారి జీవితాలను అల్లకల్లోలం చేసింది. శూర్పణఖ గాథ, కోరికను సరైన రీతిలో జయించక, దాంతో పరిహాసమాడితే కలిగే అనర్థాలను ప్రతీకాత్మకంగా ప్రదర్శిస్తుంది.

అంటే, వ్యక్తి కోరికతో చెలగాటమాడితే అతని జీవితం అల్లకల్లోలమవుతోందన్న మాట. అందుకే 'యచ్చ కామసుఖం లోకే యచ్చ దివ్యం మహత్సుఖమ్। తృష్ణా క్షయ సుఖస్యైతే కలాం నార్హంతి షోడశీం' అంటుంది శాస్త్రం. కామసుఖం, స్వర్గలోకంలో

కలిగే దివ్యసుఖం కూడా తృష్ణాక్షయం వల్ల కలిగే సుఖంలో పదహారో వంతు కూడా కావు అన్నమాట. అంటే అన్ని సుఖాల కన్నా గొప్ప సుఖం కోరికలను నశింపజేసుకోవటం వల్ల కలిగే సుఖం వల్ల కలుగుతుందన్నమాట. మిగతా సుఖాలన్నీ కోరికల నాశనం వల్ల కలిగే సుఖం ముందు దిగదుడుపేనన్న మాట. ఈ విషయాలు వ్యక్తిత్వవికాసంలో బ్రహ్మచర్యప్రాముఖ్యాన్ని స్పష్టం చేస్తాయి.

బ్రహ్మచర్యం అంటే కేవలం లైంగికభావనలను అదుపులో పెట్టుకోవటం మాత్రమే కాదని, 'యదా భావం న కురుతే సర్వ భూతేషు పాపకమ్। కర్మణా మనసా వాచా బ్రహ్మ సంపద్యత్ తదా॥' (సర్వభూతాలపై మనసా వాచా కర్మణా పాపాలోచన చేయని జీవుడు బ్రహ్మ అవుతాడు) ఎటువంటి మోహం లేక, త్రికరణశుద్ధిగా ఏ విషయం గురించి చెడు ఆలోచన చేయకపోవటం బ్రహ్మచర్యమనీ గ్రహించాం. అయితే రెండు సందేహాలు ఈ సందర్భంలో ఉత్పన్నమౌతాయి.

కోరికలు రావటం తప్పు కాదు. కోరికలు తీర్చుకోవటం వల్ల కోరికలు తీరవు. కాబట్టి కోరికలను అదుపులో ఉంచుకోవాలి. కానీ ఎలా? నిరంతరం చెలరేగే అలలను ఎవరైనా అదుపు చేయగలరా? సరే, కోరికలను అదుపులో ఉంచుకుంటాం. ప్రపంచమంతా బ్రహ్మచారులై, కామాన్ని జయిస్తే, మరి ప్రపంచం సాగేదెలా? సృష్టి కొనసాగేదెలా? ప్రతి వ్యక్తి మనసులో జనించే ఈ సందేహాలకు సమాధానాలు, మన పురాణాల్లో, సాహిత్యంలో కోకొల్లలుగా లభిస్తాయి.

## కోరికల అదుపు

కోరికలను అదుపులో ఉంచుకోవటం, కర్తవ్యపాలనం జీవితాంతం తప్పదు.

*అజానన్ దాహాత్మ్యం పతతు శలభో దీపదహనే*
*స మీనోఽ ప్యజ్ఞానాద్ బడిశయుత మశ్నాతు పిశితమ్*
*విజానన్తో ఽ ప్యేతే వయ మిహ విపజ్జాల జటిలాన్*
*న ము ఞ్చామః కామా నహహ! గహనో మోహమహిమా*

కాలుతుందని తెలియక మిడత నిప్పులో పడటం సమంజసమే. తెలియక, మాంసానికి ఆశపడి చేప గాలానికి చిక్కటం అర్థం చేసుకోవచ్చు. కానీ సకల ప్రమాదాలకూ, ఆపదలకూ కారణమని తెలిసి కూడా మనం స్త్రీసౌఖ్యకామాన్ని విడిచి పెట్టలేకుండా ఉన్నాం. కామమహిమ ఇంతా, అంతా కాదు. అతిరహస్యమైంది. జటిలమైంది.

‘కోరికలను జయించాలి, వాటిని నశింపచేయాలి, అణచేయాలి’ అని చెప్పటం సులభం. ‘అన్ని అనర్థాలకూ మూలం కోరికలే కాబట్టి వాటికి లొంగకూడదు’ అని బోధించటం సులభం. కానీ ఆచరించి చూపటం కష్టం. ఎందుకంటే, సర్వసృష్టీ కోరికల మయం. కోరిక లేకపోతే సృష్టి లేదు. సముద్రంలోని అలలను ఎవరు నియంత్రించగలరు? అలలు ఆగిపోవాలంటే వీచే గాలి ఆగిపోవాలి. భూభ్రమణం ఆగిపోవాలి. అంటే, సృష్టి సర్వం అదృశ్యమైపోవాలి. కాబట్టి మోహాన్ని జయించటం చెప్పినంత సులభం కాదు. ఈ నిజాన్ని గ్రహించి భారతీయశాస్త్రవేత్తలు మనస్సులను అదుపులో పెట్టుకునేందుకు అనేకమార్గాలను సూచించారు.

ముందుగా గ్రహించవలసింది – కోరికలు కలగటం తప్పు కాదు. పాపం కాదు, కోరికలు కలగటంలో వ్యక్తి దోషం ఏమీ లేదు. కోరికలను వ్యక్తి ఆత్మవిశ్వాసంతో జయించాలి, తప్ప, ఆత్మన్యూనతాభావంతో, నేరభావనతో కాదు.

ఇది స్పష్టంగా గ్రహించటం, కోరికలను జయించటంలో మొదటి మెట్టు వంటిది. ఎందుకంటే, ఎప్పుడైతే వ్యక్తి తనలో కోరికలు కలగటం వల్ల తాను పాపి అని భావిస్తాడో, కోరికలుండటం తన దోషం అని భావిస్తాడో, అలా భావించటమే, ఒక రకంగా, కోరికలు అతడిపై విజయం సాధించినట్టవుతుంది. కోరికలు ‘పాపం’ అన్న బరువు కింద వ్యక్తి నలిగిపోతాడు. ఎంతగా కోరికలను అణచాలని ప్రయత్నిస్తాడో, అంతగా కోరికలు విజృంభించి అతడిని అణగదొక్కుతాయి.

మానవస్వభావంలో ఓ వైచిత్రి ఉంది. వద్దన్న అంశం వైపే అతడి దృష్టి పరుగులిడుతుంది. నీరు పల్లం వైపు ప్రవహించినట్టు, ‘నిషిద్ధం’ వైపు మనిషి మనసు ఆకర్షితమౌతుంది. కాబట్టి ఏదైనా ‘పాపం’ కాబట్టి ఆ పని ‘చేయవద్దు’ అంటే అది చేసి తీరతాడు మనిషి. ఈ విషయం మనం పసిపిల్లల్లో కూడా గమనించవచ్చు. ఏదైనా ‘వొద్దు’ అంటే దాని వైపు పాకుతారు. దాని కోసం చేయి చాపుతారు. ‘పసితనం’ కాబట్టి మనకది ముద్దుగా అనిపిస్తుంది. హాయిగా ఆడిస్తాం. కానీ ఇదే లక్షణం వ్యక్తితో పాటు ఎదుగుతూంటుంది.

మానవస్వభావంలోని ఈ లక్షణం గమనించిన మన పూర్వికులు కామం ‘పాపం’ అని అననే లేదు. అవకాశం దొరికినప్పుడల్లా మనిషి నూరేళ్ళ నిండు జీవితం ఆనందంగా, సంతోషంగా గడపాలని బోధిస్తూ వచ్చారు. అయితే ఆ జీవితం ధర్మబద్ధంగా, శాస్త్ర విహితమైన కర్మలు చేస్తూ బ్రతకాలని బోధించారు.

దాంతో కోరికలు కలగటం 'సహజం' అన్న భావనతో భారతీయధర్మం ఎదిగింది. అందుకే, మన దగ్గర కోరికలను అదుపులో ఉంచటానికి ప్రాధాన్యం ఎక్కువ. కోరికలు కలగటం సహజమే అయినా, కళ్ళెం లేని గుర్రంలా వదిలేస్తే కోరికలు వీరవిహారం చేస్తాయి. అదుపు తప్పి మనిషిని సర్వనాశనం చేస్తాయి. కాబట్టి మనసుకు కళ్ళెం వేయమన్నారు. కోరికలను అణచటంతో విఫలమైనా బాధపడవద్దన్నారు. మళ్ళీ నడుం బిగించి ప్రయత్నించమన్నారు.

విశ్వమంతా భగవంతుడి మయం. 'ఈశావాస్య మిదం సర్వం'. కాబట్టి ప్రతి మనిషీ భగవదంశను తనలో ఇముడ్చుకున్నవాడే. కానీ ఇంద్రియాల వశమైన శరీరంలో ఒదగాల్సి రావటంతో, మనిషి తనలోని భగవదంశను గుర్తించలేకపోతున్నాడు. తనలోని భగవదంశను గుర్తించేందుకు ప్రయత్నించటం మనిషి కర్తవ్యం. కాబట్టి, ఎలాగైతే నడక అలవాటు అయ్యేంతవరకూ పిల్లవాడు, పడుతూ లేవటం తప్పనిసరో, అలాగే వ్యక్తికి తన కోరికలపై నియంత్రణ సాధ్యమయ్యేవరకూ ప్రయత్నిస్తూండటం తప్పనిసరి. ప్రతి వైఫల్యం వెనుకా గాఢవిజయం పొంచి ఉందని భావించాలి. నిరాశ పడకుండా ముందుకు సాగాలి.

మన పురాణకథలలో తపస్సు చేసే ఋషులు అనేకులు మధ్యలో నియంత్రణ కోల్పోవటం కనిపిస్తుంది. దాంతో అంత వరకూ వారు సంపాదించిన తపశ్శక్తి భగ్నమైపోతుంది. అప్పుడు మళ్ళీ తపశ్శక్తి సాధించేందుకు, తమ భావావేశాన్ని నియంత్రించేందుకు వారు మరోసారి తపస్సు ఆరంభిస్తారు. ఇలా ఎన్నిమార్లు నష్టపోయినా, మళ్ళీ మళ్ళీ ప్రయత్నిస్తూండేవారు తమ లక్ష్యం సాధిస్తారు. విశ్వామిత్రుడు ఎన్నిమార్లు తపస్సు ఆపి, ఆరంభించి, తన గమ్యం చేరుకున్నాడో అందరికీ తెలుసు. కాబట్టి కోరికలను అదుపులో ఉంచుకోవటమన్నది ఒక్క రోజులోనో, ఒక్క నెలలోనో సాధ్యమయ్యేది కాదని అర్థం చేసుకోవాలి.

కోరికలుండటం పాపం కాదు. కానీ, వాటిని అదుపులో ఉంచుకోవటం ఆనందదాయకం. అందుకోసం ప్రయత్నించి విఫలమవటంలో దోషం లేదు. చిన్నతనం లేదు. కానీ ధర్మమార్గంలో తీర్చుకోవాలి. విధ్యుక్తకర్తవ్యాన్ని నిర్వహిస్తూ, కోరికలను, ఆ పరిధిలోనే తీర్చుకోవాలి.

*నియతం కురు కర్మ త్వం కర్మ జ్యాయో హ్యకర్మణః*
*శరీరయాత్రా ఽ పి చ తే న ప్రసిద్ధ్యే దకర్మణః॥*

నీ కర్మలను సక్రమంగా నిర్వహించాలి. నిర్వ్యాపారంగా ఉండటంకంటే, ఏదో పని చేస్తూండటం మేలు. పనిపాటులు లేని సోమరులకు బ్రతకటమే కష్టం.

'యుద్ధం చేయ'నని, ఏదైనా కార్యం నిర్వహించాల్సి వచ్చినపుడు, మనిషిలో సహజంగా తలెత్తే జడత్వాన్ని, వైరాగ్యం ముసుగులో దాచుకోవాలని అర్జునుడు ప్రయత్నించాడు. దానికి శ్రీకృష్ణుడి సమాధానం ఇది.

ప్రతి వ్యక్తీ తన కర్మలను నిర్వహించి తీరాలి. భగవంతుడు సృష్టించిన ఈ ప్రపంచంలో విధ్యుక్త విధులను తప్పనిసరిగా నిర్వహించాలి. చదవటం, పరీక్షలు రాయటం, మంచి భవిష్యత్తును నిర్మించుకునేందుకు పునాది వేసుకోవటం ప్రతి బాలుడి కర్తవ్యం. బాల్యంలో ప్రపంచానుభవం ఉండదు. భవిష్యత్తు గురించిన ఆలోచన, అవగాహనలుండవు. కాబట్టి తల్లిదండ్రులు చూపిన మార్గంలో ప్రయాణించాల్సిందే. తల్లిదండ్రులు చెప్పినట్టు చదవాల్సిందే. పరీక్షలలో ఉత్తముడుగా ఉత్తీర్ణుడవ్వాల్సిందే.

సంసారంలో ఉన్నవారు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాల్సిందే. భార్య, భర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని అనురాగపూరితంగా జీవించాలి. తమ తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించి వారి పట్ల తమ బాధ్యతలను, కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నెరపాలి. అలాగే తమ సంతానానికి సరైన విద్యాబుద్ధులు నేర్పి, వారి భవిష్యత్తుకు తమ శక్తి ప్రకారం మంచి బాట చూపాలి. ఇక తాముంటున్న సమాజంలో తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించాలి. అంతే కానీ 'సంసారం దుఃఖకారణం కాబట్టి నేను సంసారం చేయను' అని తప్పించుకునే వీలు లేదు. అయితే నిజంగా వ్యక్తికి వైరాగ్యభావన కలిగితే ఆ పరిస్థితి వేరు.

ఎనిమిదేళ్ళ వయస్సులో శంకరాచార్యులు సన్న్యాసం స్వీకరించారు. కానీ అది ఒక రకంగా ధర్మాతిక్రమణం అవుతుంది. అందుకని తల్లి అనుమతి తీసుకునే తరువాత సన్న్యాసం స్వీకరించారు. కానీ తల్లి అవసాన దశలో, ఎక్కడున్నా సరే 'వస్తా'నని వాగ్దానం చేశారు. నెరవేర్చుకున్నారు. అదీ కర్తవ్యపాలన అంటే! అంటే వ్యక్తి ఇష్టాయిష్టాలు, సమాజం అతని నుంచి ఆశించే ధర్మవర్తనకూ నడుమ ఎటువంటి ఘర్షణ లేని వ్యవస్థ అన్నమాట మనది. అంతే తప్ప, 'ఇది నా ఇష్టం. నా ఇష్టాన్ని కాదనేందుకు నువ్వెవరు?' అని తల్లిదండ్రులను నిలదీసి, సమాజాన్ని వ్యతిరేకించి తిరుగుబాటుదారులా ప్రవర్తించటం మన విధానమే కాదు. ధర్మం కోసం తన వ్యక్తిగత ఇష్టాయిష్టాలను అణచిపెట్టి, తన కోరికలను ధర్మానుసారమే తీర్చుకోవాలని మన సామాజికజీవనం నేర్పుతుంది.

అన్నీ వదిలిన అద్వైతవేదాంతి కూడా 'అమ్మ మాట' అనే ధర్మాన్ని పాటించాడు. అందుకే కర్మలు తప్పనిసరిగా చేయాలి. కర్తవ్యం నిర్వహించాలి. కానీ దాని ఫలితంపై వ్యామోహం, ఆసక్తి వంటివి ఉండకూడదు' అంటుంది భగవద్గీత.

ఈ నిజాన్ని శ్రీకృష్ణుడు అర్జునుడికి స్పష్టంగా చెప్పాడు.

*నమే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన।*
*నానవాప్తమవాప్తవ్యం వర్త ఏవ చ కర్మణి॥*

మూడు లోకాలలో నేను పొందవలసింది, కర్తవ్యం అన్నదీ నాకు లేనే లేదు. అయినా నేను నా విధ్యుక్తకర్మలను, లోకవ్యవహారాలను నిర్వహిస్తున్నాను' అంటున్నాడు శ్రీకృష్ణుడు. ఎందుకంటే శ్రీకృష్ణుడు విధ్యుక్తకర్తవ్యాన్ని నిర్మోహంగా నిర్వర్తించే ఆదర్శాన్ని ప్రపంచం ముందు ఉంచాలనుకున్నాడు. అందుకే యుద్ధం చేయను, హింసకు దిగను అన్న అర్జునుడిని యుద్ధం చేయమన్నాడు. 'నీ స్వధర్మం, కర్తవ్యం అయిన యుద్ధం చేయకపోతే కర్తవ్యలోపం వాటిల్లి పాపం ఒనగూడుతుంద'ని చెప్పాడు.

అంటే, భారతీయధర్మంలో కోరికలు కలగటం పాపం కాదు. ధర్మబద్ధంగా వాటిని తీర్చుకోవటం పాపం కాదు. ఇది స్వాభావికం. వ్యక్తి విధ్యుక్తధర్మం. కానీ కోరికలకు లొంగిపోయి నియంత్రణ లేకుండా ప్రవర్తించటం పాపం. కోరికలను అదుపులో పెట్టుకోవాలన్న కనీసప్రయత్నం చేయకుండా ఉండటం పాపం. తనలోని ఆత్మ అనంతత్వాన్ని గ్రహించే ప్రయత్నం చేయాలన్న విధ్యుక్తధర్మాన్ని నిర్వహింపకపోవటం పాపం.

## చిన్న గీత - పెద్ద గీత

ప్రజాపతి ఐన ధర్మమూర్తికి నరనారాయణులు జన్మించారు. వాళ్ళిద్దరూ తపస్సు చేసేందుకు గంధమాదనపర్వతానికి వెళ్ళారు. వారు ఘోరతపస్సును ఆరంభించారు. వారి తపస్సు దేవేంద్రుడిని కలవరపరచింది. దాంతో ఇంద్రుడు మదనుడిని పిలిచాడు. వాళ్ల తపస్సును భగ్నం చేయమన్నాడు. మదనుడు, రతి, మేనక, తిలోత్తమ, విప్రచిత్త వంటి అత్యంతాకర్షణీయమైన సౌందర్యవతులను తీసుకుని తపోవనానికి వచ్చాడు. వారంతా తమ రకరకాల చర్యలతో నరనారాయణులను ఆకర్షించాలని ప్రయత్నాలు ఆరంభించారు. నారాయణుడు కామాన్ని జయించినవాడు. చెక్కు చెదరలేదు. కానీ నరుడు కామాన్ని జయించే ప్రయత్నంలో ఉన్నవాడు మాత్రమే. దాంతో అతడు కళ్ళు తెరిచాడు. సౌందర్యవతులైన స్త్రీలను చూశాడు. అతడి మనస్సు చలించింది.

మనస్సు చలించటమన్నది అంటు వ్యాధి వంటిది. ఒకరి మనస్సు చలిస్తుంది. ఈ చలించిన మనస్సుకనుగుణంగా వారు ప్రవర్తిస్తారు. అది చూసి పక్కనున్నవారిలో కూడా ధైర్యం ప్రవేశిస్తుంది. 'నేనూ అలా ఎందుకు ప్రవర్తించకూడ'దన్న ఆలోచనకు ఊపు వస్తుంది. అంతవరకూ అణచిపెట్టిన కోరికలు శక్తిమంతమవుతాయి. ఇలా ఒకరి నుంచి మరొకరికి పాకి పోతుందీ మనస్సు చలించటమన్నది. కొంత కాలానికి అది సమాజంలో ఒక సంప్రదాయంలా చలామణి అయ్యే స్థాయికి వస్తుంది.

ఉదాహరణకు ఒకప్పుడు సినిమాల్లోకి మర్యాదస్థులు వచ్చేవారు కారు. సినిమాల్లో నటించేందుకు ఆడవాళ్ళు ముందుకు వచ్చేవారు కారు. ఒకరు ధైర్యం చేసి ముందుకు వచ్చారు. ఆ తరువాత ఒకరొకరుగా సినిమాల్లోకి రావటం ఆరంభమైంది. విద్యాధికులు, సంప్రదాయకుటుంబాలూ సినిమాల వైపు మళ్ళాయి. ఆరంభంలో నాయికానాయకులు దూరం నుంచే ఒకరినొకరు చూస్తూ నిట్టూర్పులు విడిచేవారు. ఆ తరువాత దగ్గర దగ్గరకు రావటం మొదలైంది. ఇంతలో ఓ నాయిక అతి తక్కువ దుస్తులతో నటించి సంచలనం సృష్టించింది. ఇప్పుడు వస్త్రహీనంగా నటించటం సాధారణమైంది. ఇలా ఎవరో ఒకరు ఓ అడుగు ధైర్యంగా ముందుకు వేస్తే, నెమ్మదిగా ఆ దారి రహదారి అవుతుంది.

నారాయణుడికి ఇది తెలుసు. అందుకే చలిస్తున్న నరుడి మనసును అదుపులో పెట్టాలని నిశ్చయించాడు. తన ఊరువు నుంచి ఓ సుందరమైన నవయౌవనవతిని సృజించాడు. ఎదురుగా ఉన్న లావణ్యవతుల సౌందర్యాన్ని తలదన్నే ఊర్వశిని సృష్టించాడు. ఆమె సౌందర్యాన్ని చూసి ఇంద్రుడి పటాలమంతా సిగ్గుపడింది. అసమానసౌందర్యం తమది అని గర్విస్తున్న వారంతా తమ ఎదురుగా నిలచిన నిరుపమానసుందరిని చూసి, తమ ఓటమిని అంగీకరించి, తలవంచుకుని వెళ్ళిపోయారు. దాంతో, నరుడి దృష్టి తన ఎదురుగా ఉన్న దేవతాస్త్రీల నుంచి, నారాయణుడు సృష్టించిన ఊర్వశి వైపు మళ్లింది. ప్రపంచంలోని అందం క్షణికం అని గ్రహింపుకు వచ్చింది. ఒక సౌందర్యాన్ని చూసి మైమరచేలోగా మరో సౌందర్యం దాన్ని మించి కనిపిస్తుందని, దానికి అంతు లేదని అర్థమైంది. ప్రపంచంలో అనుపమానమైన అసమానసౌందర్యం విశ్వసృష్టికారుడిదేనని బోధపడింది. నరుడి దృష్టి స్థిరమైంది. సంచలనం అణగిపోయింది.

పురాణాలలో ఊర్వశి సృష్టి గురించి చెప్పే ఈ కథ, మనసును అదుపులో పెట్టు కోవటంలో మనిషి పాటించవలసిన విధానాన్ని సూచిస్తుంది.

ఒక గీత పెద్దగా కనిపిస్తుంటుంది. దాన్ని చిన్నదిగా చేయాలంటే ఆ గీతను తుడిపేయాల్సిన పని లేదు. దాని కింద దాని కన్నా పెద్ద గీతను గీస్తే చాలు. పిల్లవాడు ఓ బొమ్మ కోసం ఏడుస్తూ ఉంటాడు. ఆ ఏడుపును ఆపాలంటే అతడి దృష్టిని ఆ బొమ్మపై నుంచి మరల్చాలి. ఏదో శబ్దం చేస్తాం. మరో రంగు బొమ్మనో, వింత వస్తువునో చూపిస్తాం. వెంటనే పిల్లవాడు ఏడుపును ఆపి రెండో వస్తువు వైపు దూకుతాడు. మొదటి వస్తువు మరచిపోతాడు. కోరికలను జయించాలంటే, ఉన్న కోరికను మించిన మరో కోరిక వైపు దృష్టి నిలపాలి. మానవమనస్తత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకుని ఏర్పరచిన సూత్రం ఇది.

నరుడు దేవలోకస్త్రీల వైపు ఆకర్షితుడవుతున్నాడు. అతడి దృష్టి వారి నుంచి మరల్చేందుకు వారి కన్నా సౌందర్యవతి ఐన స్త్రీని నారాయణుడు సృష్టించాడు. దాంతో నరుడి దృష్టి మరలింది. తులసీదాసు ఓ సౌందర్యవతి అయిన స్త్రీకి దాసుడయ్యాడు. ఆమె తోడిదే లోకంగా జీవించేవాడు. అయితే అతడి దృష్టి మరల్చేందుకు, ఆ స్త్రీని మించిన భగవంతుడి శాశ్వత సౌందర్యావగాహన అవసరమైంది. 'రామచరిత మానస్' తులసీదాసు సౌందర్యారాధనలోని తాత్త్వికతకు ప్రతీకగా ప్రపంచానికి అందింది.

రామానుజాచార్యులవారి 'విశాలనేత్రాల' కథ అందరికీ తెలుసు. స్త్రీ సౌందర్యం అశాశ్వతం అని నిరూపించి, అనంతం, శాశ్వతం, అద్భుతం, అమేయం అయిన విష్ణు సౌందర్యం వైపు భక్తుడి దృష్టిని మరల్చటం ద్వారా భక్తుడిని చరితార్థుడిని చేశారు రామానుజులవారు. అలాగే వేమన కథ కూడా ప్రసిద్ధి పొందింది. వేమన వేశ్యాంగనల సాహచర్యంలో దిగజారుతూ వచ్చాడు. ఎప్పుడైతే అతడికి అసలు సౌందర్యభావన అవగతమైందో, అప్పుడే అతడు వేదాంతి అయ్యాడు. క్షణంలో అదృశ్యమయ్యే అశాశ్వతాలను విసర్జించి, శాశ్వతానందం వైపు దృష్టిని మరల్చాడు. నిత్యజీవితంలో మనిషిని పట్టి కుదిపే ప్రతి కోరికనూ మించేందుకు ఈ పద్ధతిని వాడవచ్చు.

ఓ స్త్రీ భర్తను కోల్పోయి దుఃఖిస్తూంటుంది. ఇక తన జీవితానికి అర్థం లేదని రోదిస్తుంటుంది. భర్తతో తానూ మరణించాలని పట్టుబడుతుంది. ఆమె సన్నిహితులు ఆమెని ఓదారుస్తారు. వారి ప్రేమఫలాలైన సంతానం వైపు ఆమె దృష్టిని మరలిస్తారు. సంతానం కోసం బ్రతకమంటారు. బాధ్యతను నిర్వహించేందుకు జీవించమంటారు. ఆమె దృష్టి భర్త పోయిన బాధ నుంచి మళ్లుతుంది. భవిష్యత్తుపై దృష్టి సారిస్తుంది.

యువకులకు జీవితాన్ని అనుభవించాలనే ఆశ ఉంటుంది. కానీ సర్వసౌఖ్యాలను తృణప్రాయంగా త్యజించాలంటే, సౌఖ్యలాలసను మించిన లక్ష్యం వారి మనస్సులో నిలవాలి. 'దేశభక్తి' అనే ఉత్తమాదర్శం వ్యక్తి మనస్సును ఆక్రమిస్తే ఇతరసౌఖ్యాలన్నీ ఆ ఆదర్శం ముందు దిగదుడుపే అవుతాయి. దేశభక్తి అనే ఆదర్శ జ్యోతి మనస్సులో వెలుగుతూండబట్టే భగత్‌సింగ్ వంటి దేశభక్తులు చిరునవ్వుతో ఉరికంబాన్ని కౌగలించుకోగలిగారు. నిండు యౌవనంలో అండమాన్‌లో గానుగెద్దులాంటి జీవితాన్ని చిరునవ్వులా గడపగలిగాడు సావర్కర్. ఈ నాటికీ, ఆధునిక లైంగిక ప్రచార తుఫానులను తట్టుకుంటూ అనేకులు నీతిమంతమైన జీవితాన్ని గడపటం చూస్తున్నాం. యువకులు, 'ప్రచారక్'లలా దేశబాధ్యతను భుజస్కంధాలపై వేసుకుని నియమబద్ధమైన జీవితాన్ని ఆదర్శవంతంగా గడపటం చూస్తూన్నాం. దీనికి ప్రధానకారణం, మామూలు కోరికలను చిన్న గీతలా మార్చి, కళ్ళకు కనబడకుండా చేసే పెద్ద గీత వంటి 'దేశభక్తి' అనే ఆదర్శం. అంటే, ఎప్పుడైతే వ్యక్తి కఠిననిర్ణయాన్ని తీసుకుని తన కళ్ళ ముందు ఉత్తమ ఆదర్శాన్ని నిలుపుకుంటాడో, అప్పుడు అతడిని మామూలు అలల్లాంటి కోరికలు తాకలేవు. చలింపచేయలేవు. 'సత్యవాక్పాలన' అనే ఆదర్శం హరిశ్చంద్రుడికి, అనేకకష్టాలను చిరునవ్వుతో భరించగలిగే శక్తినిచ్చింది. 'పితృవాక్పాలన' అనే విశ్వాసం శ్రీరామచంద్రుడికి, అడవినే అందమైన భవనంలా భావించి జీవించే ధీశక్తినిచ్చింది. రాముడితో కలసి ఉండాలనే కోరిక సీతాదేవికి వనవాసాన్ని నందనోద్యానవిహారంలా భావించే ధీశక్తి నిచ్చింది. అన్నని వదలలేని తీవ్రకోరిక భార్య విరహాన్నే కాక, వనవాసజీవితాన్ని, రావణయుద్ధాన్ని చిరునవ్వుతో భరించగలిగే ఓర్పునిచ్చింది లక్ష్మణుడికి. ఇలా గమనిస్తూ పోతే పురాణాల్లోని బోలెడన్ని కథలలో ఒక తీవ్రమైన వాంఛ, ఒక ఉత్తమాదర్శం పాటిస్తూ, మామూలు కోరికల కెరటాలను దాటి, ఉత్తమస్థాయికి చేరుకున్న పాత్రలనేకం మనకు కనిపిస్తాయి.

ఈ కథలన్నింటి ద్వారా గ్రహించవలసింది ఒకటే. కోరికలు వస్తుంటాయి, కుదిపేస్తుంటాయి, పోతుంటాయి. వాటి బారి నుండి తప్పించుకోవాలంటే వ్యక్తి తన దృష్టి కోరికల నుంచి మళ్ళించుకోవాలి. ఈ కోరికల నుంచి దృష్టి మళ్ళించుకోవాలంటే, అతని దృష్టి ఉత్తమమైన ఆదర్శం వైపు ఉండాలి. లేకపోతే ఏ కోరికల బారి నుండి తప్పించు కోవాలనుకుంటున్నాడో వాటి బారినే పడతాడు.

టాల్‌స్టాయ్ ఓ కథ రాశాడు. దాన్లో ఓ వ్యక్తికి బోలెడంత భూమి సంపాదించాలని ఉంటుంది. దేవుడు ప్రత్యక్షమై 'ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఎంత మేరకు

భూమిని చుట్టివస్తూ నడిస్తే అంత భూమి అతడికే చెందుతుం'దని వరం ఇచ్చాడు. ఇంకేం, ఆ వ్యక్తి నడవటం ఆరంభించాడు. నడుస్తూనే ఉన్నాడు. ఎండను భరించాడు. ఆకలిని గమనించలేదు. నీరు తాగాలనే కోరికను వదిలాడు. శ్రమను, నొప్పిని గమనించలేదు. సాయంత్రం వరకూ వీలైనంత భూమిని సాధించాలన్న ఆత్రంలో మామూలు కష్టాలను త్రోసి రాజన్నాడు. తాను సాధించదలచిన భూమి గురించిన అంచనాను పెంచుకొంటూ పోయాడు. చివరికి సాయంత్రం అయ్యేసరికి ప్రాణాలు కోల్పోయాడు. ఇక్కడ కూడా భూమి సాధించాలనే పెద్ద గీత ముందు శ్రమ, ఆకలి, ఎండ వంటి కష్టాలు దిగదుడుపే అయ్యాయి. కానీ ఉత్తమ ఆదర్శరాహిత్యం వల్ల వ్యక్తి పతనమయ్యాడు. అందుకే మన పూర్వికులు కామాన్ని జయించాలంటే, దాన్ని మించిన కోరిక వైపు దృష్టి మరల్చాలని సూచించారు. నరనారాయణుల కథలో నరుడి కామభావన ఊర్వశిని చూడగానే నశించింది. ఎందుకంటే 'సౌందర్యం' అన్నదానికి అంతు లేదని నరుడు గ్రహించాడు. చూస్తూ పోతూంటే ఒక దాన్ని మించిన సౌందర్యం మరొకటి వస్తూ పోతూంటుంది. ఇక సౌందర్యతృష్ణ తీరటం అంటూ ఉండదు. జీవితం సర్వం అశాంతిలో, అన్వేషణలో గడిచిపోతుందన్న గ్రహింపు అతనికి కలిగింది కాబట్టి అతని మనస్సు కామం నుంచి మరలిపోయింది. కానీ, అతని కామభావనను నశింపచేసిన ఊర్వశి ఉత్తరోత్తరా ఇతరుల తపస్సు చెడగొట్టి, వారి కామోద్దీపనకు దోహదమవటం గమనించాల్సిన అంశం.

ప్రపంచంలో అన్నిటి కన్నా శక్తిమంతమైనది కామం. కామాన్ని కూడా జయించగలిగే శక్తిమంతమైనది భగవద్ధ్యానం. అందుకే, భగవద్ధ్యానానికి భారతీయధర్మంలో అంత ప్రాధాన్యం. భగవంతుడిని కీర్తిస్తూ సర్వం మరచిపోయినవారు మనకు తెలుసు. భగవన్నామజపంలో మునిగి అన్నిటినీ వదిలేసినవారి కథలు మనం వింటున్నాం. శ్రీకృష్ణుడి ధ్యానంలో మీరాబాయి తన్మయురాలై, మామూలు ప్రపంచాన్ని మరచింది. భక్త తుకారామ్, జ్ఞానదేవ్, త్యాగరాజు, అన్నమయ్య – ఇలా ఎందరెందరో, తమ కోరికల కడలిని భగవన్నామమనే పడవ ఆధారంగా దాటారు. ఇతరులకు మార్గదర్శనం చేశారు.

ఐతే అందరూ ఆ స్థాయికి చేరుకోవటం కష్టం. అందరిలో అంత గాఢమైన భగవద్భావన జాగృతం కావటం కష్టం. అటువంటి వారి దృష్టి కేంద్రీకృతమవటం కోసం భగవంతుడికి రూపం, లావణ్యం, అలంకారాల వంటివి అవసరమయ్యాయి. లలితకళలు భగవద్ధ్యానానికి ప్రతిరూపాలయ్యాయి. మందిరంలో శిల్పాలను చెక్కుతూ ప్రపంచాన్ని మరచిన శిల్పుల గాథలు మనకు తెలుసు. దైవరాధన రచనలు చేస్తూ,

ఇతరసౌఖ్యాలను తృణప్రాయంగా భావించిన కవులున్నారు. కీర్తనల గానంలో ప్రపంచాన్ని మరచిన గాయకులున్నారు. వారి స్థాయికి చేరలేని సామాన్యులు వారి కళానైపుణ్య ప్రదర్శనలో ఆనందాన్ని అనుభవించి, ఉత్తమస్థాయికి ఎదిగే వీలు కల్పించారు. తద్వారా కనీసం కొన్ని కోరికలనైనా మించే శక్తి వారికి లభిస్తుంది.

అయితే కళలలో తన్మయత్వం చెందలేని వారు, చిన్న గీతను మరపించే పెద్ద గీతను గీసుకోలేనివారు సైతం కోరికలను అధిగమించేందుకు భారతీయధర్మంలో మరి కొన్ని విధానాలున్నాయి.

**కోరికను దాటాలి**

ప్రపంచంలో అతిశక్తి వంతమైనది కామం. కామం లేనిదే ప్రపంచం లేదు. కానీ కామానికి లొంగి పోతే వ్యక్తికి నిష్కృతి లేదు అని తెలుసుకున్నాం. వ్యక్తిత్వవికాసంలో కామాన్ని అదుపులో ఉంచటం అత్యంతప్రధానపాత్ర వహిస్తుందనీ అర్థం చేసుకున్నాం. భౌతికవిషయికమైన కామాన్ని అదుపులో ఉంచాలంటే అంత కన్నా పెద్ద కామం 'భగవద్ధ్యానం' 'దేశభక్తి' వంటి వాటిపై దృష్టి మరల్చాలనీ అర్థం చేసుకున్నాం. ఐతే ఈ ప్రపంచంలో ఏ ఒక్క వ్యక్తీ మరో వ్యక్తిని పోలి ఉండదు. భౌతికంగా అందరికీ రెండు కళ్లు, కాళ్ల వంటి అవయవాలు మామూలుగానే ఉన్నా, స్వభావాలను మనం వర్గీకరించగలిగినా, ఏ వ్యక్తికి ఆ వ్యక్తే ప్రత్యేకం. కాబట్టి చిన్న గీత, పెద్ద గీత సిద్ధాంతం కొందరికి వర్తించవచ్చు. ఇంకెందరికో వర్తించకపోవచ్చు. ఊర్వశిని చూసిన నరుడికి 'అందం అశాశ్వతం, అనంతం' అన్న గ్రహింపు వచ్చి వైరాగ్యం కలిగింది. కానీ అదే ఊర్వశి వలలో పడి సర్వం కోల్పోయినవారి కథలు అనేకం ఉన్నాయి. కాబట్టి అందరినీ ఒకే గాట కట్టేసి ఒకే సిద్ధాంతం అందరికీ వర్తిస్తుందనటం కుదరని పని. ఇది గ్రహించిన మన పూర్వికులు అందరికీ 'ఒకే సూత్రం' అనలేదు. వ్యక్తుల స్వభావాలను అనుసరించి కామాన్ని అదుపులో పెట్టే పద్ధతులు సూచించారు.

మానవుడి మనస్సు ఒక కెమెరా లాంటిది. అదీ ఎల్లప్పుడూ 'రికార్డు' చేస్తున్న కెమెరా లాంటిది. ఆధునికమానసికశాస్త్రవేత్తలు కూడా ఈ విషయాన్ని అంగీకరిస్తారు. అంటే, అనుక్షణం, మన చుట్టూ జరుగుతున్న విషయాలన్నిటినీ మన మనస్సనే కెమెరా గ్రహిస్తుంటుందన్నమాట. దాన్ని ఆపేసే వీలు లేదు. సినిమాల్లో అయితే అవసరమైన దృశ్యాలను 'ఎడిట్' చేసే వీలుంటుంది. కానీ మనసుకు అటువంటి అవకాశం లేదు.

ఎటువంటి ఆలోచనైనా మనస్సుపై ప్రభావం చూపించి తీరుతుంది. అందుకని వీలైనంత వరకూ చెడు ఆలోచనలు చేయకూడదని నియమం ఏర్పరచారు. బ్రహ్మచర్య సమయంలో వ్యక్తి పాటించవలసిన నియమాలను సూచించారు.

మనుధర్మశాస్త్రం ఈ నాడు అనేకవివాదాలకు కారణమౌతున్నది. అందులోని సూత్రాలను, నియమాలను సరైన దృష్టితో చూడక దుర్వ్యాఖ్యానం చేసి దూషిస్తున్నారు. శిష్యుడు గురువుగారి భార్యను కన్నెత్తి చూడరాదని, ఆమె పాదాలు తాకి నమస్కరించరాదని మనుస్మృతిలో నియమాలు విధిస్తాడు. పరస్త్రీలను కన్నెత్తి చూడరాదని, పరాయి స్త్రీలతో ఏకాంతంగా గడపకూడదని నియమాలున్నాయి.

*నవ్వకుమీ సభ లోపల*
*నవ్వకుమీ తల్లిదండ్రి నాథుల తోడన్*
*నవ్వకుమీ పరసతులతో*
*నవ్వకుమీ విప్రవరుల నయమిది సుమతీ*

అంటే సభలో, తల్లిదండ్రులతో, అధికారు లతో, పరస్త్రీలతో, బ్రాహ్మణ శ్రేష్ఠులతో పరాచికాలు ఆడకూడదని సుమతీ శతకం చెప్తోంది.

*పరసతుల గోష్ఠి నుండిన*
*పురుషుడు గాంగేయుడైన భువి నింద పడున్*
*బరసతి సుశీలయైనను*
*బరు సంగతినున్న నిందపాలగు సుమతీ.*

బ్రహ్మచర్యవ్రతంలో ఉన్న భీష్ముడైనా పరకాంతలతో మాట్లాడుతూ కనిపిస్తే అపకీర్తి పాలవుతాడు. అలాగే మంచి శీలవతి అయినా పరపురుషుడితో స్నేహంగా ఉంటే నిందలు మోయాల్సివస్తుంది. రావణాసురుడు 'సీత'ను అశోకవనంలో ఉంచాడని, అతడితో తిన్నగా మాట్లాడక సీత 'గడ్డి పోచ' ద్వారా రావణుడితో మాట్లాడిందని అందరికీ తెలుసు. ఐనా 'సీత'ను శంకించారు. నీలాపనిందలను ఆమె భరించాల్సి వచ్చింది. పదిమంది ఓ అబద్ధాన్ని పదిసార్లు పలికితే, ఆ అబద్ధమే నిజమై కూచుంటుంది. కాబట్టి స్త్రీపురుషులు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నమాట.

భారతీయధర్మంలో ఓ చోట బ్రహ్మచర్యదీక్షలో విజయం సాధించాలనుకున్నవాడు 'సజీవస్త్రీల నటుంచి, స్త్రీల చిత్రాలను కూడా చూడరాదు. కొయ్యతో చేసిన స్త్రీ చిత్రం

పాదాంగుష్ఠాన్ని కూడా తాకరాదు' అని ఓ నియమం ఉంది. ఇప్పుడు ఈ నియమం విన్నవారు నవ్వచ్చు. 'స్త్రీల చిత్రపటాలను చూస్తే ఏమవుతుంది? కొయ్య బొమ్మను తాకితే ఏమవుతుంది? అంతా చాదస్తం' అని కొట్టేయవచ్చు. దీన్ని వివరిస్తూ ఓ పురాణకథ ఉంది.

బ్రహ్మ రతీదేవిని సృజించాడు. ఆమెని చూడగానే అంత వరకూ నియమంగా ఉన్న దేవతలందరి మతీ చలించింది. ఆమెను పొందేందుకు దేవతల నడుమ కొట్లాటలు మొదలయ్యాయి. బ్రహ్మకు కూడా రతిపై మోహం కలిగింది. అంటే, అందానికి చలించి, మోహించటం అన్నది స్వభావం అన్నమాట. దేవతలు సైతం రతిమోహ పరవశుల య్యారంటే, ఇక మామూలు మనుషుల గురించి చెప్పాల్సిన అవసరం ఏమీ లేదు. అందుకే పరస్త్రీని తలెత్తి చూడరాదు. బొమ్మలను చూడకూడదు. చివరికి స్త్రీ కొయ్య బొమ్మని కూడా తాకకూడదు అని నియమాలు విధించాడు బ్రహ్మ.

ఓ తపస్వి ఏకాంతంలో ఉంటూ, ఎండుటాకులను తింటూ నిరంతరం తపోనిరతుడై ఉన్నాడు. అతడికి తపస్సు చేయాలన్న సంకల్పం తప్ప మరో కోరిక లేదు. ఎటువంటి కోరిక కోరీ అతడు తపస్సు చేయటం లేదు. ఆయన ఓ రోజు ఉదయం స్నానానికి వెళ్తూంటే, కాలికి కొయ్య బొమ్మ తగిలింది. ఓ సుందరమైన స్త్రీ కొయ్య బొమ్మ అది. దాన్ని చూస్తూ ఆ తపస్వి ఆ బొమ్మను తయారుచేసిన కళాకారుడి కళాకౌశలానికి ఆశ్చర్యపోయాడు. ఆ స్త్రీ లావణ్యానికి, శరీరనిర్మాణానికి ముగ్ధుడయ్యాడు. 'ఈ బొమ్మకు ప్రాణం వస్తే ఎంత బాగుండు' అనుకున్నాడు.

అంత వరకూ ముని ఎటువంటి కోరికా కోరలేదు. దాంతో ఒక్క కోరిక కోరాడు కదా అని సంతోషించి భగవంతుడు వెంటనే అతడి కోరిక తీర్చాడు. ఆ కొయ్య బొమ్మ సజీవమూర్తి అయింది. తపస్వి ఆశ్చర్యపడ్డాడు. ఆపై ఆమె గురించి తెలుసుకోవాలని కుతూహలపడ్డాడు. ఆమెని తాకాడు. ఇద్దరూ పరవశులయ్యారు. వివశులయ్యారు.

ముని తపస్సు, గిపస్సు మరచిపోయాడు. ఆమెను వివాహమాడాడు. పిల్లల్ని కన్నాడు. సంసారంలో పడ్డాడు. తపశ్శక్తి మొత్తం పోగొట్టుకున్నాడు. ఎప్పుడూ సంసారం గురించిన ఆలోచనలే. తపస్వి భ్రష్టుడై సంసారి అయ్యాడు. పతనమయ్యాడు. అందుకే, స్త్రీ కొయ్య బొమ్మని తాకినా బ్రహ్మచర్యవ్రతం భంగమయ్యే అవకాశం ఉంటుందంటుంది శాస్త్రం.

బ్రహ్మచర్యం పాటించాలనుకున్నవాడు కాముకపురుషుల సాంగత్యానికి దూరంగా ఉండాలన్న నియమం ఉంది. ఎలాగయితే సిగరెట్ తాగేవారి వద్దనుండి సిగరెట్ వాసన వచ్చి పక్కనున్న వారి ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుందో, అలాగే కాముకుల సాన్నిహిత్యం ఎటువంటివాడి దృష్టినైనా కామం వైపు ఆకర్షింపచేస్తుంది.

సౌభరి అనే మహర్షి అందరి సంగమానికీ దూరంగా జలంలో ఉండి తపస్సు చేసుకొనేవాడు. ఆ జలంలో అతడు మైథునంలో ఉన్న చేపలను చూశాడు. వాటి ప్రభావంతో అతడి మనస్సు చలించింది. 'నేనింతకాలమూ తపస్సు చేస్తూ గృహస్థ సౌఖ్యాలను అనుభవించలేదు' అనుకున్నాడు. ఆ సంకల్పం ఫలితంగా అతడు యాభైమంది రాజకుమార్తెలను వివాహమాడాడు. ఈ పురాణకథలన్నీ బ్రహ్మచర్యం ఎంత కఠినమో నిరూపిస్తాయి.

ఆధునికసమాజంలో స్త్రీపురుషులు ఇరువురూ సాన్నిహిత్యంగా ఉండటం తప్పనిసరి అవుతోంది. ఇటీవల అయితే రాత్రులు కూడా కలిసి పని చేయాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు, కంప్యూటర్ తరగతులు, ట్యూషన్లు, ఉద్యోగాల వంటివి చిన్నా పెద్దా లేకుండా ప్రతి వయసు స్త్రీపురుషులు సన్నిహితంగా మెలిగే అవకాశాన్ని స్తున్నాయి. ఆపై, వ్యాపారసంస్కృతి స్త్రీ అందాన్ని ఎరగా వేసి వ్యాపారం చేయటాన్ని 'ఆధునిక అభివృద్ధి చెందిన నాగరికతకు పరాకాష్ఠ' అన్న అభిప్రాయాన్ని ప్రజల మెదళ్లలో చొప్పించింది. దాంతో తక్కువ దుస్తులు ధరించటం ఆధునికం అయింది. పురుషులతో సన్నిహితంగా మెలగటం స్త్రీ 'విముక్తి'కి నిదర్శనం అయింది. స్త్రీలతో తిరగటం పురుషత్వానికి ప్రతీక అయింది. సినిమాలు, టీవీలు, నవలలు ఈ అభిప్రాయాన్ని పుట్టినప్పటి నుంచీ వ్యక్తి మెదడులోకి చొప్పిస్తున్నాయి. దాంతో 'నియమం' అన్నది అపహాస్యంపాలు అవుతోంది. నియమబద్ధుడై జీవితం గడిపేవాడు హేళనకు గురి అవుతున్నాడు. ఇటువంటి పరిస్థితులలో 'మనువు' చెప్పిన నియమాలు ఎంతో ప్రాధాన్యం వహిస్తాయి. కానీ అవీ అవహేళనకు గురి అవుతున్నాయి.

నీరు పల్లం వైపు ప్రవహించినట్టే, వ్యక్తి సులువైన దారిలో ప్రయాణించాలను కుంటాడు. ఈ నిజాన్ని అర్థం చేసుకున్న మన పూర్వీకులు అనేకసామాజికనియమాలను ఏర్పరచారు. నియమోల్లంఘన జరిగితే సమాజం శిక్షిస్తుందన్న భయం వ్యక్తిని పాపమార్గంలో ప్రయాణించేందుకు విముఖుడిని చేస్తుంది. సామాజికబాధ్యత సక్రమంగా నిర్వహించని వ్యక్తిని సమాజం వెలివేస్తుందన్న భయం, వ్యక్తి తన బాధ్యతలను

నిర్వహించేట్టు చేస్తుంది. ప్రయత్నం మీద మనస్సును అదుపులో పెట్టేట్టు చేస్తుంది. కానీ సామాజికనియమోల్లంఘనమే 'ఆధునికత' ఐనపుడు వ్యక్తికి అడ్డూ అదుపూ ఉండవు. ప్రస్తుతం మనసమాజంలో ఈ పరిస్థితిని చూడవచ్చు.

యువతీయువకులు స్వేచ్ఛగా కలవటం ఎవ్వరూ ఆపలేరు. అలా ఆపాలని ప్రయత్నించటం ప్రస్తుతపరిస్థితులలో అన్యాయం, మూర్ఖత్వం అవుతాయి. అలాగని దారం తెగిన గాలిపటాల్లా వాళ్లని వదిలేయలేరు పెద్దలు. యువతీయువకులకు ఆరంభం నుంచి స్త్రీపురుషసంబంధాల పట్ల విజ్ఞానం వికృతరూపంలోనే అందుతోంది. వాళ్లకి 'సెక్స్ ఎద్యుకేషన్' ఇవ్వాలని తహతహలాడుతున్నారు కానీ, మానవమనస్తత్వాన్ని, స్త్రీ పురుషసంబంధతత్వాన్ని వివరించాలన్న ఆలోచనను ఎవ్వరూ ప్రదర్శించటం లేదు.

యువతీయువకుల పరిస్థితి ఇలా ఉండగా, పెద్దల పరిస్థితి మరో రకంగా ఉంది. స్త్రీపురుషులు స్వేచ్ఛగా కలిసే అవకాశాలుండటంతో అనేక కుటుంబాలు విచ్ఛిన్న మౌతున్నాయి. వివాహేతరసంబంధాలు వ్యక్తుల జీవితాలను అతలాకుతలం చేస్తున్నాయి. కనీసం, అటువంటి ఆలోచనలు, ప్రతి వ్యక్తి హృదయాన్నీ కలుషితం చేస్తున్నాయి. అందుకే, స్త్రీలు ఇన్ని రంగాలలో ముందంజ వేస్తూ తమ వ్యక్తిత్వాన్ని నిరూపిస్తూ, తెలివితేటలను ప్రదర్శిస్తున్నా, వారు మరింత చులకన అవుతున్నారు. ఊహ తెలియని పిల్లవాడి నుంచి వయసుడిగిన వ్యక్తి వరకూ ప్రతి ఒక్కరూ స్త్రీని కాంక్షగా చూడటం, ఆపై చులకన చేయటం నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. ఇటువంటి పరిస్థితులలో వ్యక్తి నియమబద్ధమైన జీవితం గడపాలంటే, అతడికి ఎంతో పట్టుదల, దీక్షలు అవసరం. అతడికి తన సంసారం పట్ల, ధర్మం పట్ల అచంచలవిశ్వాసం ఉండటం ఎంతో అవసరం.

అడవిలో, శూర్పణఖ అందమైన రూపంలో వచ్చి, తనని తాను అర్పించుకునేందుకు సిద్ధపడినా ఆమెను తిరస్కరించేంత దృఢనిశ్చయం ఉండాలి. హిమాలయాల నడుమ, కనుచూపు మేరలో మనిషి లేని చోట, వచ్చి వాలిన వరూధినిని తిరస్కరించే ప్రవరాఖ్యుడి ధర్మదీక్ష వ్యక్తికి ఉండాలి. లేకపోతే సొంత భార్యలో సైతం జగన్మాతను దర్శించి కొలవగలిగే రామకృష్ణ పరమహంస భక్తివైరాగ్యభావనలు వ్యక్తిలో ఉండాలి. సామాజికనియమాలు ఉల్లంఘించటమే అభివృద్ధికి ఆధునికానికి ఉత్తమనిదర్శనంగా చలామణి అవుతున్న పరిస్థితులలో, బ్రహ్మచర్యం పాటించాలంటే, వ్యక్తికి స్త్రీపురుషసంబంధతత్త్వం గురించి సరైన అవగాహన ఉండాలి. ఆధునికసమాజంలో వ్యక్తికి 'సెక్స్ ఎద్యుకేషన్' కన్నా 'సెక్స్ ఫిలాసఫీ' సరైన రీతిలో తెలిసి ఉండాలి.

## స్త్రీపురుష సంబంధతత్త్వం

*ఒక తరాన్ని ప్రసవించటమంటే తమాషా కాదు*
*ఒక నిండు కలలు జగత్తునే మేల్కొల్పడం.*
*ఎన్నో అవ్యక్తాత్మలు, చిత్రవిచిత్రానుభూతుల ఒడిలో*
*స్పందన పొందిన తరుణాల స్వరాలు, ఈ తరాలు!*

గుంటూరు శేషేంద్రశర్మ రచించిన ఈ 'కవిత' ఎంతో తాత్త్వికంగా, నిగూఢంగా మానవసంబంధాల పరమార్థాన్ని ప్రదర్శిస్తుంది.

'లైంగికచర్య'ను సాంప్రదాయికంగా 'సృష్టికార్యం' అంటారు. అది లేకపోతే సృష్టి లేదు. అందుకే వ్యక్తి జీవితంలో 'సెక్స్' అంత ప్రాధాన్యం వహిస్తుంది. 'సంతానోత్పత్తి' జీవుల మౌలికలక్షణాలలో ఒకటి. అంటే, లైంగికభావనలు కూడా మానవమౌలిక లక్షణం అన్నమాట. ఎలాగైతే వ్యక్తికి ఆకలి వేస్తుందో, దాహం కలుగుతుందో, అలాగే ఒక నిర్దిష్టమైన వయస్సు వస్తూన్నకొద్దీ వ్యక్తిలో తన ప్రమేయం లేకుండానే లైంగికప్రచోదనలు కలుగుతాయి. చిరుగాలి వీచినపుడు ఎలాగైతే నీటి ఉపరితలంపై అలలు కదలుతాయో, అలాగే లైంగికభావనలు స్వాభావికంగా వ్యక్తిలో స్పందనలు కలిగిస్తాయి.

భాగవతంలో 'రుక్మిణీ కల్యాణం' కథ మన కందరికీ తెలుసు. ఈ కథను చెప్తున్నప్పుడు పోతన తన పద్యాలలో వ్యక్తులలోని ఈ స్వాభావికస్పందనలను ఎంతో సరళంగా, అత్యద్భుతంగా వివరించాడు. ఒక బీజం ఎదిగి మొక్క అయి, ఆకులు వేసి, పూలు పూసినంత స్వాభావికంగా, ప్రాకృతికంగా రుక్మిణీకృష్ణుల ఎదుగుదలను, వారి స్పందనలను వర్ణిస్తాడు.

*దేవకీ సుతు కోర్కి తీగలు వీడంగ*
*వెలదికి మై దీగె వీడఁ దొడగె*
*గమలనాభుని చిత్తకమలంబు వికసింప*
*గాంతినింతికి ముఖ కమలమొప్పె*
*మధువిరోధికి లోన మదనాగ్ని పొడసూపఁ*
*బొలతికి జనుదోయి పొడవు సూపె*
*శౌరికి ధైర్యంబు సన్నమై డాయంగ*
*జలజాక్షి మధ్యంబు సన్నమయ్యె*

*హరికి బ్రేమబంధ మధికంబుగాఁ గేశ*
*బంధమధికమగుచు బాల కమరె*
*బద్మనయను వలనఁ బ్రమదంబు నిండార*
*నెలత యౌవనంబు నిండియుండె.*

ఈ పద్యాల్లో ఒకే సమయాన బాలబాలికలు యువకులుగా, యువతులుగా రూపాంతరం చెందే పరిణామక్రమాన్ని అత్యంతసుందరంగా వర్ణించారు పోతన. ఎక్కడా అసభ్యానికి తావు లేదు. ఎక్కడా, తాను యౌవనావిర్భావాన్ని వర్ణిస్తున్నానన్న ఇబ్బంది లేదు. ఎలాగైతే ఒక మొగ్గ పుష్పంగా వికసించటం వర్ణిస్తామో, ఎలాగైతే చీకటి రాత్రిని తరిమేస్తూ ఆకాశంలో వెలుతురు రేకలు విస్తరించటాన్ని వర్ణిస్తామో అంత సులభంగా, అంత స్వాభావికంగా యౌవనప్రాదుర్భావాన్ని వర్ణించాడు పోతన.

ఇక్కడ కృష్ణుడు పెరుగుతున్నాడు. అక్కడ రుక్మిణీదేవి ఎదుగుతోంది. కృష్ణుడి వాంఛ తీగలుగా సాగుతుంటే, తీగలాంటి రుక్మిణీదేవి శరీరం యౌవనాన్ని పొందే వైపు సాగుతోంది. ఇక మిగతా వర్ణనలన్నీ మనకు అలవాటై, అర్థమయ్యే వర్ణనలే.

ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే, పోతన వర్ణిస్తున్నది మానవరూపం ధరించిన లక్ష్మీ విష్ణువుల యౌవనావిర్భావాన్ని. మానవశరీరం దేవాలయమైనపుడు, శరీరంలోని ప్రతి అణువూపవిత్రమే అవుతుంది. శరీరంలో ప్రాకృతికంగా కలిగే మార్పులూ పవిత్రమే అవుతాయి. ఈ పవిత్రభావన పద్యంలోని ప్రతి పదంలో కనబడుతుంది. మానవరూపం ధరించిన దేవతలలో మాత్రమే ఈ మార్పులు పవిత్రం కావు. ప్రతి వ్యక్తిలో భగవదంశ ఉంటుంది. అనంతుడైన భగవంతుడు పరిమితమైన భౌతిక శరీరంలో వొదిగినట్టే. అనంతమైన ఆత్మ భౌతికశరీరంలో ఒదిగి పరిమిత మౌతుంది. కాబట్టి భగవదవతారం ఎంత పవిత్రమో, మామూలు మనుషులూ అంత పవిత్రమన్నమాట. మనిషికీ, దైవానికీ తేడా లేని 'అద్వైత' భావన అన్న మాట లైంగికభావన. అందుకే 'కుమారసంభవం'లో కాళిదాసు, వర్ణించిన పార్వతీ, పరమేశ్వరుల శృంగారం అత్యుత్తమస్థాయిలో ఉంటుంది. ఈ శృంగారవర్ణన పార్వతీ, పరమేశ్వరులదే కానక్కరలేదు. ఇది సమస్తమానవాళి శృంగారకేళీవిలాసవర్ణన. కానీ పార్వతీపరమేశ్వరులనగానే ఓ పవిత్రభావన మదిలో కలుగుతుంది.

*పాణి పీడన విధే రనంతరం శైల*
*రాజ దుహితుర్వరం ప్రతి।*

*భావ సాధ్వా సపరిగ్రహా దభూత్*
*కామ దోషద  మనోహరం వపుః॥*

వివాహమైన మరుక్షణం నుంచీ పార్వతి శరీరం, అత్యంతప్రేమభావనతో అత్యంత, సుందరంగా అగుపించసాగింది. తీవ్రమైన ప్రేమ, కోరిక, భయాలు ఉక్కిరిబిక్కిరి చేస్తూంటే ఆమె మరింత అందంగా శోభిస్తోంది.

నవవధువు శరీరంలో శోభిల్లే శృంగారభావనల రసధార వారికి నూత్న శోభ నివ్వటం అందరికీ అనుభవమే. ఆ సామాన్యమైన స్పందనను అనన్యసామాన్యమైన రీతిలో వర్ణిస్తూ, ఆ భావనలకు సార్వజనీనతను ఇస్తున్నాడు కవి. ఆ తరువాత పార్వతి సిగ్గుపడటాన్ని, భయపడటాన్ని, పరమశివుడి శృంగారప్రదర్శనను అత్యంతసుందరంగా వర్ణిస్తాడు కాళిదాసు. కొన్నాళ్ళకు పార్వతిలో బిడియం పోతుంది. శివుడిపై ప్రేమ ప్రవాహంలో బిడియం కొట్టుకుపోతుంది.

*తం యథాత్మాసహుశం వరం*
*వధూర అన్వరజ్యత వరస్తథైవ తామ్।*
*సాగరాదనపగా హి జాహ్నవీ*
*సోపి తన్ముఖర సైకనివృత్తిః॥*

శివపార్వతులిరువురూ ఒకరి పట్ల మరొకరు తీవ్రంగా ఆకర్షితులయ్యారు. అంటే వధువు వరుని వైపు ఎంతగా ఆకర్షితురాలైందో, వరుడు కూడా వధువు వైపు అంతగా ఆకర్షితుడయ్యాడన్నమాట. ఎలాగైతే సముద్రంలో మిళితమైన గంగానది వెనక్కు తగ్గదో, అలాగే శివపార్వతుల సంగమపరిష్వంగం విడివడటం అన్నది లేదన్నమాట.

ఇలా అత్యంతసుందరంగా శివపార్వతుల రతికేళీవిలాసాన్ని కాళిదాసు వర్ణిస్తాడు. ఇంకా, 'శృంగారం' అనగానే కృష్ణుడి రాసకేళి మదిలో మెదులుతుంది. ఆపై రాధ తలపులోకి వస్తుంది. 'జయదేవుడి' అష్టపదులు గుర్తుకు వస్తాయి. అంటే, 'సృష్టికార్యాన్ని' వర్ణించేందుకు, వివరించేందుకు మన పూర్వికులు ఉత్తమం, ఉదాత్తం, పవిత్రం, ప్రమోదభరితమైన విధానాన్ని ఎన్నుకున్నారన్నమాట. సమాజం ముందు అత్యంత ఉన్నతమైన ఆదర్శాన్ని ఉంచారన్నమాట. ఈ రచనలు ఆధారంగా, మన శిల్పులు శిలలను శృంగారరసప్రవాహ ఫలకాలుగా మలచారు. కవులు ఎంత పవిత్రభావనతో భగవంతుడి శృంగారకేళీవిలాసాన్ని వర్ణించారో, శిల్పులూ అంత పవిత్రభావనతో వాటిని శిలలపై

ప్రతిష్ఠించారు. అవి దర్శించినవారికి, స్మరించినవారికి కూడా లైంగికచర్య ఎంత ఉన్నతమో, పవిత్రమో అర్థమయ్యేది. అందుకే, గమనిస్తే లైంగికపరమైన మానసిక వికృతులు మన సమాజంలో లేవు.

మనుధర్మశాస్త్రంలో బ్రహ్మచారి విధులను వివరిస్తూ, ఓ సందర్భంలో 'బ్రహ్మచారి ఎక్కడైనా ఒంటరిగా పడుకోవాలి. కామంతో రేతస్సును విడవరాదు. అలా విడిచిన వాడు బ్రహ్మచర్యవ్రతాన్ని కోల్పోతాడు. కామం లేకుండానే స్వప్నస్థలనం అయినవాడు మరునాడు ఉదయమే స్నానం చేసి, సూర్యోపాసన చేసి 'పునర్మామైత్వింద్రియం' (ఇంద్రియమా నన్ను మళ్ళీ పొందు!) అని జపించాలి అన్న సూత్రాన్ని వివరిస్తాడు.

'బ్రహ్మచారి ఒంటరిగా పడుకోవాలి' అన్న నియమం వెనుక ఎంత తాత్త్వికత ఉందో, ప్రస్తుతం ఒక్కసారి కళ్ళు తెరచి చుట్టూ చూస్తే అర్థమౌతుంది. మనకు పరిచయం లేని 'స్వలింగసంపర్కం' పాశ్చాత్యదేశాల నుండి దిగుమతి అయి, మన దగ్గర ఓ 'ఫేషన్'గా మారటం చూస్తే, మనువు సూచన వెనుక దాగి ఉన్న పరమార్థం బోధపడుతుంది.

యౌవనంలో వ్యక్తి ప్రమేయం లేకుండా కామభావనలు కలుగుతాయి. శరీరం స్పందిస్తుంది. కానీ వ్యక్తి ఆ స్పందనకు లొంగకూడదు. 'కామభావనతో రేతస్సు విడవరాదు' అంటాడు మనువు. కామభావన ఉద్రేకాన్నిస్తుంది. ఉద్రేకం వల్ల శరీరం ఉద్విగ్నమౌతుంది. వ్యక్తి ఉద్రేకానికి లొంగిపోతే దాని ప్రభావం అతడి ఆలోచనలపై ఉంటుంది. కాబట్టి తాత్కాలికోద్రేకాన్ని అదుపులో పెట్టుకోవాలని మనువు సూచిస్తున్నాడన్నమాట. ఆధునిక సెక్స్ డాక్టర్లు 'ఉద్రేకాన్ని అదుపులో పెట్టుకోనక్కర్లే'దని బోధిస్తున్నారు. ఇందువల్ల వ్యక్తిలో మానసికాందోళనలు పెరుగుతాయి కాబట్టి లైంగిక ప్రచోదనలను అణచకూడదని ప్రచారంచేస్తున్నారు. ఇవన్నీ పాశ్చాత్యసంస్కృతిలోని వికృతులను అనుసరిస్తూ చేసిన సిద్ధాంతాలు. ఆ సిద్ధాంతాలను వీళ్ళు మన సమాజంలో చొప్పిస్తూ లేని వికృతులను సృష్టిస్తున్నారు.

ఎందుకంటే, వ్యక్తి తనలోని లైంగికభావనల నుంచి దృష్టి మళ్లించుకున్నా, శరీరం తన పని తాను చేసుకుంటూ పోతుంది. శరీరంలో రేతస్సు ఉత్పత్తి అవుతూంటుంది. అలా ఉత్పత్తి అయిన రేతస్సు ఒక దశకు చేరుకోగానే, శరీరం తనంతట తానే దాన్ని బయటికిస్తుంది. నిద్రిస్తున్న సమయంలో, వ్యక్తి ప్రమేయం లేకుండానే రేతస్సును శరీరం విసర్జిస్తుంది. దీన్నే 'స్వప్నస్ఖలనం' అంటాం. దీంట్లో వ్యక్తి ప్రమేయం లేదు. అతనిలో

కామభావన ఉండదు. ఉద్రేకం, ఉద్వేగం, ఉద్విగ్నతలు ఉండవు. అదొక స్వాభావికమైన చర్య. కాబట్టి అలా 'స్వప్నస్ఖలనం' అయితే వ్యక్తి తెల్లవారి లేచి స్నానం చేస్తే సరిపోతుందన్నమాట. ఎటువంటి నేరభావనలూ అవసరం లేదు. వ్యక్తి సిగ్గుపడి, దోషిలా భావించుకోవాల్సిన అవసరం లేదు. అంటే శరీరంలో ఒత్తిడి ఎక్కువైనప్పుడు, ఆ ఒత్తిడి తనంతట తానే తగ్గించుకునే ఈ ప్రాకృతికవ్యవస్థ శరీరంలోనే ఉందన్నమాట. మరి 'కృత్రిమంగా ఒత్తిడి తగ్గించుకోండి. తప్పులే'దని ఆధునిక సెక్స్ డాక్టర్లు ప్రచారం చేస్తున్నారంటే, దాని వెనుక ఉన్న కుటిలస్వార్థభావనలను అర్థం చేసుకోవటం కష్టంకాదు.

ఈ సందర్భంలోనే భారతీయజీవనవిధానంలోని లైంగికతత్త్వం అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. లైంగికచర్య సృష్టికార్యం. అది ప్రాకృతికం. ఆ చర్య వల్ల వ్యక్తి తన వారసత్వంగా మరో తరాన్ని సృజిస్తాడు. అంటే తన పూర్వికుల పరంపరను తన ద్వారా మరో తరానికి అందిస్తూ, అనంతమైన మానవహారంలో తానూ ఓ పుష్పమౌతాడన్నమాట. లైంగిచర్య ద్వారా వ్యక్తి మరణం లేని చిరంజీవి అవుతాడు. అనంతుడవుతాడు. ఈ నిజాన్ని శేషేంద్రశర్మ 'ఎన్నో అవ్యక్తాత్మలు చిత్రవిచిత్రానుభూతుల ఒడిలో స్పందన పొందిన తరుణాల స్వరాలు ఈ తరాలు' అని ప్రకటించాడు. అంత పవిత్రమూ, అద్భుతమూ అన్నమాట సెక్స్. ఈ చర్య ద్వారా వ్యక్తి సృష్టికర్త అవుతాడు. పరమేశ్వరుడవుతాడు. మరణం లేని వాడవుతాడు. అంత పవిత్రమూ, అద్భుతమూ ఐన చర్య పాపం ఎలా అవుతుంది? వ్యక్తి పాపి ఎలా అవుతాడు? ఇతర సంప్రదాయాల్లో, మతాల్లో సెక్స్‌ను చీదరించుకుని అసహ్యించుకుంటారు. పాపం అంటారు. వ్యక్తి నేరభావనతో అణగి వికృతులకు గురవుతాడు. కానీ భారతీయతత్త్వంలో లైంగికచర్య వ్యక్తికి దైవత్వాన్ని ఆపాదిస్తుంది. మనం మన దేవతల శృంగారాన్ని అతి పవిత్రంగా భావిస్తాం. ఎందుకంటే ఆ చర్య ద్వారా మనమూ సృష్టి చేసే భగవంతులమవుతాం. ఈ నిజాన్ని దేవరకొండ బాలగంగాధర తిలక్ 'అద్వితీయం' అనే కవితలో అత్యద్భుతంగా ప్రదర్శించాడు.

ఇది సృష్టి. ఇది మిథస్సమాశ్లేష చకిత

*తను యష్టి నేనొక పరమేష్ఠి*
*ఇది నీవు ఇది నేను ఇరువురము*
*ఒకటైన యీ నిమేషమ్ము*
*విశ్వరహస్యమ్ము.*

## జీవలక్షణం

ప్రజా చ స్వాధ్యాయ ప్రవచనే చ।
ప్రజనశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ।
ప్రజాతిశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ।

తైత్తిరీయ ఉపనిషత్తులోని మంత్రాలివి. శిష్యుడు నిర్వర్తించవలసిన విధ్యుక్తధర్మాలను గురువు, శిష్యుడికి, బోధిస్తున్నప్పుడు చెప్పిన మంత్రాలివి. సత్యం చెప్పటం, ధర్మాన్ని అనుసరించటం, జ్ఞానాన్ని సంపాదించటం, నియమబద్ధంగా, నీతిపాలన చేస్తూ బ్రతకటం, ఇంద్రియాలను నిగ్రహించటం, అగ్నులను ప్రజ్వలింపచేయటం, యజ్ఞం చేయటం, అతిథులను ఆదరించటం వంటి కర్తవ్యాలతో పాటుగా, 'సంతానాన్ని కనటం, విద్యాబోధన చేయటం, వారు సంతానాన్ని కనేట్టు చూసి విద్యాబోధన చేయటం, మనవడి విద్యాబోధనలు చూడటం' కూడా వ్యక్తుల కర్తవ్యాలలో భాగాలని బోధిస్తాడు గురువు.

మానవుడికే కాదు ప్రతి జీవి లక్ష్యం 'సంతానోత్పత్తి.' కదలలేనివిగా భావించే చెట్లు, మొక్కలు కూడా సంతానోత్పత్తి కర్తవ్యాన్ని నిర్వహిస్తాయి. పూలు పూస్తాయి. వాటిలోని తేనెను గ్రహించేందుకు పక్షులు, కీటకాలు, పురుగులు వస్తాయి. అవి మకరందాన్ని గ్రహిస్తాయి. ఆ సమయంలో వాటి కాళ్ళకు పుప్పొడి అంటుతుంది. అవి మరో పువ్వు నుండి మకరందం గ్రోలేందుకు వాలినప్పుడు ఈ పుప్పొడితో ఆ పుప్పొడి సంపర్కం చెందుతుంది. నూతన మొక్క ఆవిర్భావం జరుగుతుంది. మరి కొన్ని సందర్భాలలో పళ్లు పగిలిపోతాయి. విత్తనాలు గాల్లోకి వెదజల్లబడతాయి. అనువైన ప్రదేశంలో బీజం పడగానే మొక్క మొలుస్తుంది.

సృష్టిలోని 'అద్భుతం' జీవ 'సృష్టి'లో కనిపిస్తుంది. ఓ రకమైన కీటకాలున్నాయి. వాటి గుడ్లు రెండున్నర ఏళ్ళపాటు నీటి ఒడ్డున పడి ఉంటాయి. రెండున్నర ఏళ్ళ తరువాత ఒక నిర్ణీతసమయంలో హఠాత్తుగా గుడ్లను తొలిచి కీటకాలు గాలిలోకి ఎగురుతాయి. కొన్ని లక్షల సంఖ్యలో ప్రాణం పోసుకున్న కీటకాలు ఒకేసారిగా గాలిలోకి ఎగురుతాయి. మగ కీటకం, ఆడ కీటకాన్ని కలుస్తుంది. తన బీజాన్ని నిక్షిప్తం చేసి, వెంటనే మరణిస్తుంది. ఇదంతా జరిగేందుకు కేవలం రెండున్నర సెకన్లే పడుతుంది. అంటే రెండున్నర ఏళ్ళ పాటు నిరీక్షించి, ప్రాణం పోసుకున్న కీటకం, రెండున్నర సెకన్లు మాత్రమే జీవిస్తుందన్నమాట. ఆ రెండున్నర సెకన్లలో అది సంతానోత్పత్తి చేసి మరణిస్తుంది. మగ కీటకం మరణించిన అర సెకనుకి ఆడకీటకం కూడా మరణిస్తుంది. కానీ, ఈ

లోగా అది నీటి ఒడ్డున గుడ్లను పెట్టి మరణిస్తుంది. మళ్ళీ రెండున్నర ఏళ్ళకు ఆ గుడ్లు కీటకాలవుతాయి.

అనేకప్రాణులకు సంభోగానికి ప్రత్యేకఋతువు ఉంటుంది. ఆ ఋతువు సమయంలో స్త్రీపురుషజీవులు సంభోగానికి తహతహలాడతాయి. ఒకదాన్నొకటి ఆకర్షించటానికి రకరకాల ప్రక్రియలు జరుపుతాయి. పద్ధతులు అనుసరిస్తాయి. కొన్ని రెక్కలు విప్పి ఆడితే, మరి కొన్ని గొంతెత్తి పాడతాయి. మరి కొన్ని కొమ్ములు చూపి ఆకర్షిస్తే, ఇంకొన్ని రంగురంగుల అలంకారాలతో అలరిస్తాయి. ఈ రకంగా, పద్ధతి ఏదైనా, ప్రతిక్రియ ఏదైనా, సర్వజీవుల లక్ష్యం 'సంభోగం' కాదు, సంతానోత్పత్తి అన్నది మాత్రం స్పష్టం. అంటే 'సంతానోత్పత్తి' అన్న లక్ష్యం సాధించేందుకు 'సంభోగం' అన్నది మార్గం మాత్రమే.

బృహస్పతి భార్య తార. బృహస్పతి శిష్యుడు చంద్రుడు. తార చంద్రుడిని మోహించింది. చంద్రుడు తారను మోహించాడు. దాంతో, విచక్షణ మరిచి చంద్రుడు తారను ఎత్తుకుపోయాడు. తన భార్య తనకు కావాలని బృహస్పతి పట్టుబట్టాడు. ఆమె కోసం యుద్ధానికి సిద్ధమయ్యాడు. దేవతలంతా దిగి వచ్చి యుద్ధాన్ని ఆపారు. 'తార బృహస్పతిదే' అని తీర్పు చెప్తారు. ఇంతలో తార గర్భవతి అని తెలిసింది. ఆ 'శిశువు నా'దంటే 'నాది' అని మళ్ళీ బృహస్పతి, చంద్రుడు యుద్ధానికి సిద్ధమయ్యారు. మళ్ళీ దేవతలు దిగి వచ్చారు. తన గర్భంలో పెరుగుతున్నది చంద్రుడి శిశువు అని తార చెప్పింది. దాంతో బుధుడు  చంద్రుడికి దక్కాడు. ఇక్కడ గమనించవలసిందేమిటంటే, తార చంద్రుడితో పారిపోయినా బృహస్పతి ఆమెని తప్పు పట్టలేదు. 'మనసు చలించటం మానవస్వభావం' అన్నాడు. ఆమెకు కలిగే పుత్రుడు చంద్రుడి సంతానం అని తెలిసినా ఆ 'సంతానం తనది' అని వాదించాడు. అంటే, ఇక్కడ ప్రాధాన్యం సంతానానికే తప్ప ఇతరాంశాలకు కాదన్నమాట. మన పూర్వికుల దృష్టిలో 'సంభోగం' ఒక ఉన్నతలక్ష్యం (సంతానోత్పత్తి) సాధించటంలో తోడ్పడే చర్య తప్ప అదే ప్రధానం కాదు. అందుకే అహల్య ఇంద్రుడితో సంభోగించినందుకు కాక, సంతానోత్పత్తి దృష్టితో కాక కేవలం సంభోగసుఖమోహంతో కనుక ఆమెను శపిస్తాడు గౌతముడు.

ఇతరజీవులకు, మానవులకు 'సంతానోత్పత్తి' విషయంలో ఉన్న తేడాను, తత్సంబంధిత మానసికాంశాలను సంపూర్ణంగా గ్రహించారు మన పూర్వికులు. ఇతర జీవులు ఒకేసారి పెద్ద సంఖ్యలో సంతానోత్పత్తి చేస్తాయి. ఎందుకంటే, పుట్టిన పిల్లల్లో అనేకం బాల్యావస్థలోనే మరణిస్తాయి. వాటికి స్వీయరక్షణశక్తి తక్కువగా ఉండటంతో

వాటి జీవితకాలం కూడా తక్కువే. అందుకే వాటికి సంభోగానికి ఒక ప్రత్యేక కాలం ఉంటుంది. సృష్టిలోని గొప్పతనం ఇక్కడే చూడవచ్చు.

పెద్ద సంఖ్యలో తాబేళ్ళు సముద్రం ఒడ్డున గుడ్లు పెడతాయి. సరైన సమయానికి గుడ్లు పొదిగి శిశువులు బయటకు వస్తాయి. బయటకు వస్తూనే చిన్ని తాబేళ్ళు సముద్రం వైపు పరుగులిడతాయి. కానీ అదే సమయానికి ఆకలిగా ఉన్న పక్షులతో ఆకాశం నిండుతుంది. గుడ్డు నుండి బయటకు వచ్చి సముద్రం చేరే లోపుగా ఆ పక్షులు తాబేళ్ళను నోట కరుచుకుపోతాయి. వాటి బారి నుంచి తప్పించుకుని వేగంగా నీటిని చేరిన తాబేళ్ళు బ్రతుకుతాయి. అంటే ఒకేసారి పది తాబేలు పిల్లలు పుట్టినా వాటిలో ఎన్ని బ్రతికి బట్టకడతాయన్నది సందేహమే!

మానవశిశువు విషయం అలా కాదు. వీర్యంలో కొన్ని మిలియన్ల కొద్దీ కణాలుంటాయి. కానీ వాటిలో ఒకటే అండం చేరుతుంది. ఏది అండాన్ని చేరుతుంది, ఆ శిశువుకు ఎటువంటి లక్షణాలుంటాయి, రూపం ఎటువంటిది వంటి విషయాలపై ఎవరికీ నియంత్రణ ఉండదు. అంటే శిశువుగా రూపొందగలిగే కొన్ని మిలియన్ కణాలలో ఒకటే అండాన్ని చేరుతుంది. శిశువుగా ఎదుగుతుంది. అలా ఎదిగిన శిశువుకు ఇతర జీవులకు భిన్నంగా కొన్నేళ్ళ వరకూ తల్లిదండ్రుల సంరక్షణ అవసరం. అందుకే 'సంసారాశ్రమాని'కి అంత ప్రాధాన్యం ఉంది మన ధర్మంలో. ఇక్కడే బ్రహ్మచర్యప్రాధాన్యం స్పష్టమౌతుంది.

బ్రహ్మచర్యమంటే స్త్రీని తాకకుండా జీవితాంతం ఉండటం కాదు. ఇది అందరికీ సాధ్యం కాదు. 'బ్రహ్మచర్యం' అంటే నియమబద్ధంగా, స్వధర్మాన్ని అనుసరించి, సంతానోత్పత్తి అభిలాషతో, ధర్మబద్ధమైన స్త్రీతో సంగమించటం.

*యస్య సర్వే సమారమ్భాః కామ సఙ్కల్ప వర్జితాః।*
*జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం తమాహుః పండితం బుధాః॥*

ఎవని కర్మలన్నీ కామవాసనరహితాలై ఉంటాయో, ఎవరి కర్మలు జ్ఞానాగ్నితో దగ్ధమై ఉంటాయో వాడిని విజ్ఞులు పండితుడంటారు.

సంతానోత్పత్తి జీవుల లక్షణం. అది ధర్మకార్యం. కాబట్టి సంతానోత్పత్తి లక్ష్యంగా సంభోగం జరిపితే అది ధర్మవిరుద్ధం కాదు. అదే, కేవలం శారీరకసౌఖ్యం కోసం స్త్రీ సంభోగానికి వెంపర్లాడటం అధర్మం అవుతుంది. సంతానోత్పత్తి కోసం పత్నితో జరిపే సంభోగం కూడా ధర్మబద్ధంగా బ్రహ్మచర్యం అవుతుంది. అలా కానిది పాపం అవుతుంది.

అందుకే సంతానోత్పత్తిపై దృష్టి లేకుండా, కేవలం శారీరకవాంఛతో అహల్యను మోసం చేసిన ఇంద్రుడి 'వృషణాలు' నశించాలని గౌతముడు శపించాడు. ఈ విషయాన్ని భగవద్గీత మరింత నొక్కి చెప్తుంది.

*నిరాశీర్యతచిత్తాత్మా త్యక్త సర్వ పరిగ్రహః।*
*శారీరం కేవలం కర్మ కుర్వన్నాప్నోతి కిల్బిషమ్॥*

ఆశను వదలి, ఎవరి వద్ద నుంచీ ఏమీ గ్రహించకుండా, మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించి శరీరంతో వ్యవహారం చేసేవాడిని కర్మపాపాలు అంటవు.

ఇదీ భారతీయధర్మంలోని 'సెక్స్ ఫిలాసఫీ'కి ఆధారం.

స్త్రీపురుషసంబంధ ప్రధానోద్దేశ్యం 'సంతానోత్పత్తి.' ఆ తరువాత ఆ సంతానాన్ని ఉత్తమమానవులుగా తీర్చిదిద్దటం. ఇలా తన ధర్మం నిర్వహిస్తూ సామాజికంగా తన కర్తవ్యాన్ని పాటిస్తూ సాటి మానవుడి అభ్యున్నతికి తోడ్పడటం. అందుకే మానవుడి జీవితంలో సర్వకర్మలను యజ్ఞదృష్టితో నిర్వహించటాన్ని 'బ్రహ్మకర్మ సమాధినిష్ఠ' అంటుంది భారతీయధర్మం. మన జీవితంలో ఊపిరి పీల్చటం ఒక యజ్ఞం. ఆహారాన్ని సేవించటం ఒక యజ్ఞం. అలాగే సృష్టికార్యం కూడా ఒక యజ్ఞం. 'యజ్ఞం' అనేది పరమపవిత్రం. భగవదర్చనలో ఒక భాగం. అయితే, మానవుడి శరీరం సమస్తం భగవన్మయమే. ప్రతి ఒక అవయవంలో, ఆ అవయవానికే ప్రత్యేకమైన దేవతలు కొలువై ఉన్నారని ఉపనిషత్తులు చెప్తాయి. అందుకే దేహమే దేవాలయం అయింది. అటువంటి దేహంతో జరిపే కర్మలు 'పాపం' ఎప్పుడవుతాయంటే, ఎప్పుడయితే తాను జరిపే కర్మల పవిత్రత గ్రహించకుండా, తాను చేసే కర్మలను భగవదర్పితంగా భావించకుండా, తన శరీరంలోని భగవంతుడిని మరచి, 'తన సుఖలాలసతే సర్వం' అన్నట్టు వ్యక్తి ప్రవర్తిస్తాడో అప్పుడు అది 'పాపం' అవుతుంది. అందుకే భారతీయధర్మంలో 'సెక్స్' పాపం కాదు. లైంగికచర్యలో అత్యున్నత ఆనందం అనుభవించేందుకు పరిశోధనలు జరిగాయి. కామం ఒక కళ అయింది. కామం శాస్త్రమైంది. శాస్త్రమైందేదీ ధర్మవిరుద్ధం కాదు. అందుకే, బ్రహ్మచర్యం అంటే స్త్రీని తాకకపోవటం, స్త్రీ గురించి ఆలోచించకపోవటం కాదు. తనదైన స్త్రీ గురించి కాక పరస్త్రీ గురించి అన్యథా భావించటం. సుఖలాలసత కోసం సంగమాన్ని అభిలషించటం, ఇవన్నీ బ్రహ్మచర్యవిరుద్ధాలు. తనదైన స్త్రీసంగమం, సంతానోత్పత్తి ఆలోచనతో సంగమం బ్రహ్మచర్యమే అవుతుంది. అందుకే భార్య సహధర్మచారిణి అయింది మన ధర్మంలో.

సేవించిన ఆహారం రక్తమై, స్త్రీపురుషులలో శుక్రశోణితాలై వాటి సంయోగం వల్ల భూతజాల ఉత్పత్తికి కారణం అవుతుంది. అందుకే 'అన్నాద్భవంతి భూతాని' అంటుంది భగవద్గీత. కాబట్టి అన్నం సేవించటం ఒక యజ్ఞమైంది. అందుకే ప్రతియజ్ఞక్రియలో సర్వవ్యాపకుడైన పరమాత్మ సుప్రతిష్ఠితుడై ఉన్నాడంటుంది భగవద్గీత.

ఇదీ మన 'సెక్స్ ఫిలాసఫీ.'

## మనసు చేసే మాయ

భౌతికప్రపంచానికీ, ఆధిభౌతికప్రపంచానికీ నడుమ వారధి వంటివాడు అగ్ని. అగ్ని ద్రవం కాదు. వాయువు కాదు. ఘనపదార్థం కాదు. అగ్నిని వర్ణించటం కుదరదు. 'వస్తునిత్యత్వసూత్రం' ప్రకారం ప్రపంచంలో పదార్థం అదృశ్యమవటం, కొత్తగా సృష్టించటం కుదరదు. కానీ, అగ్నిలో పడ్డ పదార్థం అదృశ్యమైపోతుంది. అగ్నిలో ఆజ్యం పోస్తే అగ్ని మరింత ప్రజ్జ్వలిస్తుంది. కానీ పోసిన పదార్థం ఏమౌతుందో ఎవరికీ తెలియదు. అలాగే కట్టెను అగ్నిలో ఉంచితే కట్టె కాలి బొగ్గు మిగులుతుంది. బూడిద మిగులు తుంది. అందుకే, భౌతికప్రపంచంలోని తమ కోర్కెలను ఆధిభౌతిక ప్రపంచంలో ఉన్న దేవతలకు అగ్ని మోసుకువెళ్తాడని మన పూర్వికులు భావించేవారు. దేవతలకు సమర్పించాల్సిన వాటిని అగ్నికి అర్పించారు. అగ్నిని ధ్యానించారు. అర్చించారు. అటువంటి, భౌతిక, ఆధిభౌతికాల నడుమ విహరించే అగ్ని సైతం కామమోహ పరవశుడయ్యాడు!

ఓ సారి అగ్ని, సప్తర్షి పత్నులను చూసి మోహించాడు. కానీ తన మోహం అధర్మం అని తెలుసు. విషయం తెలిస్తే సప్తర్షులు శపిస్తారన్న భయమూ ఉంది. కానీ కామావేశ పరవశుడికి కామదాహం తీరితే కానీ నిష్కృతి లేదు. అందుకే తన కోరిక బయటపెట్టలేక, దాన్ని అణచుకోలేక బాధపడసాగాడు. చివరికి క్షీణించిపోసాగాడు. అగ్నిదేవుడి భార్య స్వాహాదేవి అగ్ని బాధ గుర్తించింది. తానే సప్తర్షుల భార్యల రూపాలూ ధరించి వచ్చి అగ్నిని సంతృప్తి పరిచింది.

ఆ తరువాత కథ వేరే ఉంది. కానీ మానవమనస్తత్త్వాన్ని, లైంగికతత్త్వాన్ని విశ్లేషించి అవగాహన చేసుకునేందుకు ఇంత కథ చాలు మనకు.

సకలప్రాణులకు లైంగికవాంఛ సంతానోత్పత్తి కోసమే నన్నది సార్వజనీనసూత్రం. అయితే, ఇతరప్రాణులు తమ 'ఇన్‌స్టింక్ట్' లను అనుసరించి ప్రవర్తిస్తాయి. వాటి భావనలు, ఉద్వేగాలు, ఆనందాలు, మానవుడి భావనలకు భిన్నం. సృష్టిలోని సమస్యలన్నిటికీ కారణం,

అనంతాత్మను పశువు శరీరంలో ఉంచి, తన అసలు రూపాన్ని గుర్తించమనటమే అంటుంది తత్త్వం. ఎందుకంటే, పశువు శరీరంలో ఉంటూ, పరిమిత ఇంద్రియశక్తుల ద్వారా ప్రపంచాన్ని అనుభవించాల్సి వచ్చిన ఆత్మ, తన అసలు స్వభావాన్ని మరచిపోవాల్సి వస్తుంది. కానీ అలా మరచిపోతే, వ్యక్తి పశువు అవుతాడు. పశువు కాకూడదనుకుంటే, ఈ పరిమితశరీరంలో ఉంటూ, తన అనంత ఆత్మతత్త్వాన్ని వ్యక్తి గ్రహించాలి. తనలో చెలరేగే పశుభావనలను అదుపులో పెట్టాలి. కానీ అది అంత సులభం కాదు.

ఇతరప్రాణులకు భిన్నంగా మానవుడికి సుఖభావన ఉంది. ఉన్నదాంతో సంతృప్తి చెందక మరింత సంపాదించాల్సిన అత్యాశ ఉంది. ఒక జంతువు వేటాడుతుంది. తన కడుపు నిండే వరకూ మరో జంతువును తన వేట దగ్గరకు రానీయదు. కడుపు నిండిన తరువాత మిగిలినదాన్ని అలాగే వదిలేసిపోతుంది తప్ప 'నాది' అని దాచుకోదు. కానీ మానవుడు అలా కాదు. 'అవసరం'తో సంబంధం లేకుండా సంపాదించాలనుకుంటాడు. ఇది లైంగికభావనకు కూడా వర్తిస్తుంది.

స్త్రీపురుషుల నడుమ ఆకర్షణ స్వాభావికం. అందమైన అమ్మాయిని చూసిన పురుషుడు కామభావనలతో ఉక్కిరిబిక్కిరి అవటం సహజం. అగ్ని సైతం అందమైన భార్య సరసనుండగా ఋషిపత్నుల వైపు ఆకర్షితుడయ్యాడు. ఆ ఆకర్షణ ఎంత బలీయమైందంటే, తన భార్య ఋషి పత్నుల వేషంలో వచ్చి సంతృప్తిపరచిన విషయం గుర్తించలేకపోయాడు. సంతృప్తి చెందాడు. ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే, అగ్ని సంగమించింది తన భార్యతోనే. కానీ అతని మెదడు చెందిన భ్రమ అతడికి సంతృప్తినిచ్చింది. మానవుడి కామభావనలోని అపరిమితత్వాన్ని ఇది ప్రతీకాత్మకంగా సూచిస్తుంది.

ఆధునికలైంగికశాస్త్రవేత్తలు సెక్స్‌శరీరానికి సంబంధించి కాదు, మెదడుకు సంబంధించింది అంటారు. ఆ నిజాన్ని నిరూపిస్తుంది 'అగ్నికామావేశ' కథ. అంటే ఎన్ని విభిన్నదిశల ప్రవహించినా కామభావన స్రవంతి ఒకటే. దాన్ని నియంత్రించుకుని ఏకస్త్రీపై కేంద్రీకృతం చేయటం ధర్మం. అందుకే భార్యను ధర్మపత్ని అంటాం. సహధర్మచారిణి అంటాం. ఈ లైంగికభావన పరమార్థం సుఖభ్రాంతి కాదు, సంతానం పొందటం అన్న జ్ఞానం ఉంటే దశదిశల విశృంఖలంగా ప్రవహించే లైంగికభావనను నియంత్రించటం సులభం.

ఎందుకంటే, 'ఒక తరాన్ని ప్రసవించటమంటే తమాషా కాదు. ఒక నిండు కలల జగత్తునే మేల్కొల్పటం.' పుట్టిన ప్రతి పిల్లవాడూ ఒక నిండు కలల ప్రపంచం. అతడి

ప్రపంచం, పూర్తిగా వేరు. తల్లిదండ్రుల వల్ల జన్మించినా, పిల్లవాడు పూర్తిగా తనదంటూ ప్రత్యేకానుభవాలను, ఆనందాలను, ఆవేశాలను, ఆశలను మూట కట్టుకుంటాడు. తనదైన విశిష్ట ఆత్మను తన అంతరంగంలో ధరించి జన్మిస్తాడు. దాని స్వరూపాన్ని గ్రహించటం కోసం తనదైన ప్రత్యేకపంథాలో జీవితాంతం శ్రమిస్తాడు. ఎప్పుడైతే వ్యక్తికి ఈ గ్రహింపు వస్తుందో, అప్పుడు సృష్టివిస్తరణ క్రమంలో వ్యక్తికి తన విశిష్టపాత్ర అవగాహనకు వస్తుంది. తన కామభావనను విచ్చలవిడిగా వర్తించనివ్వడు.

ఆధునికవ్యాపారప్రపంచంలో, వ్యక్తిని సులభంగా రెచ్చగొట్టగలిగే లైంగికభావన వ్యాపారులకు జీవగఱ్ఱలా మారింది. దాంతో సంతానోత్పత్తి, సహధర్మచారత్వం అనే అర్థాలు అడుగంటాయి. లైంగికభావనకు ప్రేమ ముసుగు వేసి అదే పవిత్రమైన కర్తవ్యంలా విస్తృతప్రచారం ఆరంభమైంది.

వ్యక్తికి ధర్మం బోధించి, సరైన మార్గంలో నడిపింపచేయటం కష్టం. కానీ వ్యక్తిని రెచ్చగొట్టి తప్పు దారి పట్టించటం సులభం. వ్యక్తికి తనలోని దైవత్వాన్ని వివరించి, అధ్యాత్మపథంలో నడిపించటం కఠినం. అతడిలోని పశువును రెచ్చగొట్టి, రాక్షసప్రవృత్తిని ప్రకోపింపచేయటం అత్యంతసులభం. దాంతో ముందుగా ధర్మమార్గం, ఋజువర్తన, బ్రహ్మచర్యభావన వంటివన్నీ దుర్వ్యాఖ్యానాలకు గురై, అవహేళన పాత్రమయ్యాయి.

బ్రహచర్యమంటే స్త్రీని తాకకుండా ఉండటం కాదు. బ్రహ్మచర్యమంటే ధర్మబద్ధంగా వివాహమాడిన స్త్రీతో, పవిత్రభావనతో, ధర్మమార్గంలో, ఉన్నతాశయంతో కలసి జీవించటం అన్న ఆలోచన విస్మృతిలో పడింది. 'ప్రేమ' అంటే స్త్రీపురుషులు తమ వాంఛలను సరైన మార్గంలో నియంత్రిస్తూ, ఒకరి నొకరు కర్తవ్యపాలనకు ప్రేరేపిస్తూ, తమ బాధ్యతలను ధార్మికంగా నిర్వహించటమన్న భావన అదృశ్యమైంది. దాని స్థానే 'ప్రేమ' మతం వెలసింది.

సహజమైన స్త్రీపురుషాకర్షణ గురించి యువతీయువకులకు సరైన అవగాహన లేకపోవటం అనేకవికృతులకు దారి తీస్తుంది. సహజంగా, ఒక వయసు వచ్చిన తరువాత వారి మధ్య సాన్నిహిత్యం వికారభావనలు కలిగిస్తుంది. అందుకే మన పూర్వీకులు ఈ విషయంలో అనేకనియమాల నేర్పరచారు. తారాశశాంకుల కథ, కచ – దేవయాని కథ వంటి కథలను అనేకం వివరించి, 'అన్యకాంత లడ్డంబైన మాతృభావము జేసి మరలువా'డని ప్రహ్లాదుడిని ఆదర్శం చేశారు. కానీ ఈ ఆదర్శంలో వ్యాపారలాభాలు తక్కువ. ఈ ఆదర్శం వల్ల సంస్కృతి ఔన్నత్యం తెలుస్తుంది. దాంతో యువతీయువకుల

నడుమ సాన్నిహిత్యానికి 'ఫ్రెండ్‌షిప్' అని పేరు పెట్టారు. ఆ సాన్నిహిత్యాన్ని నిరసించి, అందువల్ల కలిగే అనర్థాలు ఆలోచించి, జాగ్రత్తపడమన్నవారిని 'కన్సర్వేటివ్'లన్నారు. అలా కాస్త దూకుడుగా వివరించిన వారిని 'కల్చరల్ పోలీసు'లన్నారు. ఇంకాస్త ముందుకెళ్ళినవారికి 'హిందూ మిలిటెన్సీ' ముద్ర వేశారు. యువతీయువకులు స్వేచ్ఛగా కలవటాన్ని 'ఆధునికం' అన్నారు. ఎదుగుతున్న సమాజానికి 'చిహ్నం' అన్నారు. నాగరికత అభివృద్ధికి ప్రతీక అన్నారు. ఆపై 'పాప్'లు, 'వాలంటైన్లు', డిస్కోలు ఒకటొకటిగా రంగప్రవేశం చేసి యువతను ఉత్తమవ్యక్తిత్వానికి దూరం చేస్తున్నాయి.

పవిత్రమైన 'ప్రేమ' అంటే కేవలం 'కుర్రకారు లైంగికభావన' అన్న అర్థం స్థిరపడింది. కాలేజీకి వెళ్తే ప్రేమ. రోడ్డు మీద నడిస్తే ప్రేమ. ఆఫీసుల్లో ప్రేమ. సినిమా హాళ్ళల్లో ప్రేమ. పార్కుల్లో ప్రేమ. ఐస్ క్రీమ్ పార్లర్లలో ప్రేమ. కాదన్నవాడు అసూయాపరుడు. అభివృద్ధినిరోధకుడు. మరీ మాట్లాడితే మతఛాందసుడు. 'ఫండమెంటలిస్టు ఫాసిస్టు' అయ్యాడు. యువతీయువకులు తరచు కలుస్తుంటే వారిలో వికారభావనలు జనిస్తాయి. ఇరువురి నడుమ సుఖస్పందనలు కలుగుతాయి. వాటిని నిరోధించకపోతే అది తీవ్రమైన కామభావనగా మారి వ్యక్తుల మానసికవ్యవస్థను అల్లకల్లోలం చేస్తుంది. ఈ ఆకర్షణ, సుఖభావన సర్వం సంతానోత్పత్తి కోసమని, అది ప్రాణి మౌలిక లక్షణమని, ప్రతి వ్యక్తి నిర్వహించవలసిన పవిత్రబాధ్యత అని, వ్యక్తిని పరమేష్ఠిగా మార్చే పవిత్రకార్యానికి నాంది అని బోధించి, అవగాహన కలిగిస్తే, ఇప్పుడున్నంత ఆకర్షణగా 'ప్రేమ' కని పించదు. ఇప్పుడు నడుస్తున్నంత వ్యాపారం ప్రేమ పేరిట నడవదు.

'ప్రేమ' అనేది ధర్మబద్ధంగా స్త్రీపురుషులు కలిసి చేసే సామాజిక జీవనసాహచర్య, సౌందర్యం అని చెప్తే, ఇప్పటి ప్రేమలోని ఆవేశం, లైంగికత అదృశ్యమౌతాయి. బాధ్యత, కర్తవ్యం గ్రహింపుకు వస్తాయి. ఇది గ్రహించటం వ్యక్తిత్వవికాసంలో అత్యంతప్రాముఖ్యం వహించే అంశం. ఎప్పుడైతే తన ఆవేశం 'ఒక నిండు కలల జగత్తును మేల్కొల్పు తుంది' అన్న భావన ఉంటుందో, తన క్షణికసుఖలాలస ఫలితం 'అవ్యక్తాత్మల చిత్ర విచిత్రానుభూతుల స్పందనలకు రూపం' ఇస్తుందన్న అవగాహన ఉంటుందో, అప్పుడు వ్యక్తి ప్రవర్తనలోని తేలికతనం అదృశ్యం అవుతుంది. ఆధునికప్రేమలోని 'లైంగిక' స్వరూపం గ్రహించిన వ్యక్తి విచక్షణ ప్రదర్శిస్తాడు.

ధర్మపాలన, ధర్మోద్ధరణ లక్ష్యంగా కల శ్రీరాముడిని 'ప్రేమ' భావన ఏ నాడూ బాధించలేదు. ఎన్ని రాసలీలలు జరిపినా శ్రీకృష్ణుడిని మించిన ధర్మగురువు, ఉత్తమ బ్రహ్మచారి మరొకడు చరాచరజగత్తులోనే లేడు. అందుకే, ఈ నాడు సెక్స్ ఎడ్యుకేషన్

కన్నా సెక్స్ ఫిలాసఫీ ప్రాధాన్యం అధికప్రాముఖ్యం వహిస్తుంది. 'సురక్షిత సెక్స్' నేర్పి విశృంఖలత్వాన్ని ప్రోత్సహిస్తూ, నైతికవిలువలు పతనమౌతున్నాయని వాపోవటం కన్నా, లైంగికతత్త్వపరమార్థాన్ని బోధిస్తూ, వ్యక్తికి తన పట్ల, సమాజం పట్ల, సృష్టి పట్ల అవగాహన కలిగించి, బాధ్యత తెలిపి, విజ్ఞానవంతుడిని చేస్తే వ్యక్తి స్వచ్ఛందంగా తనని తాను అదుపులో పెట్టుకుని వ్యక్తిత్వవికాసం వైపు పురోగమిస్తాడు. భావనలను అదుపులో పెట్టు కోవటంలో విజ్ఞానం తోడ్పడుతుంది. అది లేనిచోట 'భయం' వ్యక్తిని అదుపులో పెడుతుంది. ఈ దిశలో కూడా భారతీయధర్మం ఇతరులకు భిన్నమైన మార్గాన్ని అనుసరించింది.

## అజ్ఞానం - విజ్ఞానం

'భయం' ప్రతి ప్రాణి మౌలికలక్షణం. కానీ ఇతరప్రాణులకూ, మానవుడి భయభావన స్వరూపానికీ తేడా ఉంది. ఈ తేడాను ఆధారం చేసుకొని, విచ్చలవిడిగా విహరించే మానవుడి మనస్సుకు కళ్లెం వేయాలని మన పూర్వికులు ప్రయత్నించారు.

ఇతరప్రాణులకు మరునాటిని గురించిన ఆలోచన లేదు. తనవారు అన్న భావన లేదు. బంధుప్రీతి లేదు. ఇవన్నీ మనిషికి ఉన్నాయి. తన వారికేమీ కాకూడదు. తనకేమైనా అయితే, తనవారి గతి ఏమిటి? వంటి ఆలోచనలు మనిషిని పట్టి పీడిస్తాయి. అనేక జీవులు ఎండ కాలమంతా శ్రమించి వర్షకాలం కోసం తిండిని దాస్తాయి. చలికాలం ఆరు నెలలు నిద్రించే సమయంలో శరీరానికి శక్తినిచ్చే ఆహారాన్ని ముందే గ్రహిస్తాయి. 'అవసరం' అయినంత మటుకే అవి గ్రహిస్తాయి. కానీ మనిషి అలా కాదు. అందుకే పటిష్ఠమైన సామాజికవ్యవస్థను ఏర్పరచి, ఆ వ్యవస్థ సక్రమంగా నడిచేట్టు నియమాలను ఏర్పరచి, నియమోల్లంఘనకు శిక్షను నిర్ణయించారు. ఆ 'శిక్ష' భయంతోనైనా మనిషి తన ఆలోచనలను అదుపులో ఉంచుకుంటాడని ఆశించారు.

గమనిస్తే, ఈ రకమైన నియమాలు, శిక్షలు ఒక స్థాయి వ్యక్తులను మాత్రమే అదుపులో ఉంచగలుగుతాయి. అటు అధములు, ఇటు ఉన్నతులు ఈ నియమాలను త్రోసిరాజనే అవకాశముంది. ఉన్నతులు తమ అర్థబలంతోనో, అంగబలంతోనో, తార్కిక శక్తితోనో నియమాలను ఉల్లంఘించి తమను తాము సమర్థించుకోవచ్చు. అటువంటి ఆలోచనలు వారికి రాకుండా ఉండేందుకే మనకు 'రామాయణం' ఆదర్శం అయింది.

రావణబ్రహ్మ ఓ రకంగా చూస్తే అన్ని రకాల సద్గుణాలూ ఉన్నవాడు. భక్తితత్పరుడు. శక్తి మంతుడు. జ్ఞానసంపన్నుడు. కానీ, 'పరస్త్రీవ్యామోహం' అతడిని రాక్షసుడిని చేసింది.

అతడిని సర్వనాశనం చేసింది. రావణాసురుడి పరస్త్రీవ్యామోహాన్ని నశింపచేయటంలో రాముడికి సహాయంచేసిన వానరులు సైతం పూజనీయమయ్యారు. అంటే, ఉత్తములు, నీచులు అన్నదానితో సంబంధం లేకుండా 'ధర్మపాలన'కే పెద్ద పీట అన్న మాట. ధర్మాన్ని పాటించకపోతే వెలి అవుతామనో, పదిమందిలో హేళన పాత్రమౌతామనో, తన ధర్మాన్ని పాటింపని దోషాన్ని అనుభవించాల్సి వస్తుందన్న భయం చేతనో, వ్యక్తులు తమ కోరికలపై పట్టు సాధించే ప్రయత్నాలు చేస్తారు. కోరికల దారి మళ్ళిస్తారు. అందుకే కోరికలను అదుపులో పెట్టటంలో 'భక్తి'కి పెద్ద పీట వేశారు.

భగవద్భావన వ్యక్తిని ఉన్నతుడిని చేస్తుంది. అతడి తుచ్ఛమైన కోరికలను కూడా ఉన్నతంగా మారుస్తుంది. అందుకే వ్యక్తిలోని లైంగికతను సృజనాత్మక శక్తిగా రూపాంతరం చెందించి, దాన్ని భగవదర్పితం చేయటాన్ని ఒక 'కళ'గా మలచారు. అందుకే సాధారణంగా 'అహం' అమితంగా ఉండి, ఇచ్ఛవచ్చినట్టు ప్రవర్తించే కళాకారులు, కొన్ని తరాలపాటు తమ అహాన్ని, వ్యక్తిగతాలను మరచి, మందిరాల నిర్మాణంలో తమని తాము మరచారు. కేవలం తమ 'కళ'గా మిగిలారు. 'ఎల్లోరా' గుహలలో 16వ గుహ ఒక అద్భుతం! కొన్ని వేల టన్నుల రాతిని పైనుంచి తవ్వుతూ మందిరనిర్మాణం కొన్ని వందల ఏళ్ళ పాటు సాగింది. అంటే మొత్తం పథకం ముందే ఏర్పరచుకుని, ఆపై రాతిని పై నుంచి కిందికి తొలిచి మలచటం జరిగిందన్నమాట. ఏ ఒక్క కళాకారుడు, ఏ మాత్రం 'అహం' 'వ్యక్తిత్వం' ప్రదర్శించినా మొత్తం మందిరం వ్యర్థమయ్యేది. కానీ అలా జరగలేదు. వ్యక్తుల అహాన్ని భగవద్భావన ఆక్రమించింది.

తమలోని కోరికలను, ఆవేదనలను, ఆవేశాలను భగవదర్పితం చేస్తూ, ఆ ఆవేశంలో లీనమై సర్వం మరచిపోవటం ఏ భారతీయమందిరనిర్మాణంలోనైనా చూడవచ్చు. మహాబలిపురం, చిదంబరం, మథుర, ఖజురహో, కాశీ విశ్వనాథమందిరం, సోమనాథ మందిరం... ఇలా ప్రతి ఒక్క మందిరం వ్యక్తిలోని కోరికలను భగవదర్పితం చేయటం వల్ల సమాజానికి ఒనగూడే ప్రయోజనానికి తిరుగు లేని నిదర్శనం. కీర్తనలు, పురాణ రచనలు, కవిత్వరచన, సర్వం ఇలా తనలోని కోరికల శక్తికి సృజనాత్మకశక్తిని జోడించి భగవదర్పితం చేయటం 'బ్రహ్మచర్య' భావన సాధన దిశలో వ్యక్తికి విజయపథం సూచిస్తుంది. ఇలా సాధ్యం కానివారు, ఇతరుల సృజనాత్మకసృష్టి, కళాభివ్యక్తీకరణలను చూసి తన్మయులౌవుతారు. ఒక మెట్టు ఎదుగుతారు. అయితే, ఆధునికసమాజంలో వ్యక్తి కేవలం 'తన కోసమే' బ్రతకాలన్న సిద్ధాంతం వల్ల, లేక, వ్యక్తిగతంగా వ్యక్తికి విలువ లేదు, సమాజస్రవంతిలో అతడో నీటి బిందువు మాత్రమే, అని అహాన్ని దెబ్బ

తీయటం వల్ల 'కళాకారుడి' కళలో దైవం అదృశ్యమైంది. ఆకాశంలో విహరించే గంగా ప్రవాహాన్ని నేల దించి, మురికి కాలువలలో కలపటం ద్వారా ఎత్తున ఉన్నవారిని కిందికి దించేయాలన్న వెర్రి మొర్రి ఆరాటం కళాకారుల కళను 'వ్యాపారం' చేసింది. ఫలితం అనుభవిస్తున్నాం.

మానవజీవితంలోని ప్రతి క్షణం అర్థవంతం. ప్రతి కదలిక అర్థవంతం. గమనిస్తే, శాస్త్రీయనృత్యాలలో ప్రతి కదలికకూ, ముద్రకూ పరమార్థం ఉంది. కానీ ఆధునిక నృత్యాలలో శారీరక పరమైన కదలికల అర్థం ఒక్కటే. అదీ నీచతాపూర్ణమైందే. అందుకే, కోరికల దారి మళ్ళించి వ్యక్తిత్వవికాసం సాధించాల్సిన వ్యక్తి కోరికల వెల్లువలో కొట్టుకుపోతూ, గడ్డిపోచల్లాంటి కృత్రిమవ్యక్తిత్వవికాసాల ఊత కోసం అర్రులు చాస్తున్నాడు. ఇటువంటి పరిస్థితి వస్తుందని ముందే ఊహించినట్టు మన తత్త్వవేత్తలు, కోరికలను అదుపులో ఉంచుకునేందుకు మరో రకమైన 'భయా'న్ని ప్రదర్శించారు.

*'పునరపి జననం పునరపి మరణం*
*పునరపి జననీ జఠరే శయనం'*

మనిషి అనుభవించే నరకయాతనలన్నిటిలోకీ, మాతృగర్భంలో, చీకటిలో, కళ్ళు, కాళ్ళు సరిగ్గా ఎదిగీఎదగక, ఏం జరుగుతూందో, ఏమీ అర్థం కాక, ఉమ్మ నీటిలో, మలమూత్రభూయిష్ఠ ప్రాంతంలో తొమ్మిది నెలలు గడపటమే పరమనికృష్టమైనదని మన తత్త్వవేత్తలు నొక్కిచెప్పారు.

'మానవజన్మ అత్యుత్తమమైనది' అని నొక్కి చెప్పారు. కానీ మరో జన్మ లేకుండా చూసుకోవటమే వ్యక్తి 'లక్ష్యం' అని ప్రవచించారు. ఒక వైపు ధర్మాన్ని, కర్తవ్యాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూనే, మరో వైపు ప్రాపంచిక విషయాలపై వ్యామోహాన్ని తొలగించాలని ప్రయత్నించారు. ప్రాపంచికసౌఖ్యాలపై నిరాసక్తతతను, అసహ్యాన్ని పెంచాలని చూశారు. ముఖ్యంగా స్త్రీ వ్యామోహాన్ని తొలగించాలని తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఈ ప్రయత్నాలు కాస్త ముందుకు వెళ్ళి మహిళను 'మాయ'గా అభివర్ణించే స్థాయికి చేరుకున్నాయి. మగవారిని భ్రష్టులను చేసేందుకే స్త్రీలు ఉన్నరన్న అభిప్రాయాన్ని కలిగించి, ఆధునిక స్త్రీవాదులకు ఆయుధాలను అందించారు.

ఇలా ప్రాపంచికసౌఖ్యాలపై విరక్తిని కలిగించటంలో భాగమే స్త్రీసాంగత్యంలోని సౌఖ్యభావన అసలు రూపం వివరించటం. గమనిస్తే, పైకి కనబడే చర్మం ఒక తొడుగు

వంటిది. కానీ ఈ పైతొడుగు తొలగించి చూస్తే... కళ్ళు గుంటలు. నోరు ఓ కంత. ముక్కు రంధ్రాలు. తల భాగం పుర్రె. దానిపై అతికించినట్టు జుట్టు. అధరామృతమని అభివర్ణించే పెదవులు మాంసఖండాలు. శరీరం ఎముకల గూడు. ఊరించి, అలరించి, మనిషిలో ఆవేశం కలిగించి, అతడిని పశువును చేసే అంగాలన్నీ మాంసఖండాలు. ఈ మాంసఖండాల సంగమం కోసం ఉవ్విళ్ళూరుతూ, విచక్షణను మరచి, మనిషి పశువు అవుతున్నాడు.

ఈ రకమైన వర్ణనలు, వివరణల ద్వారా వ్యక్తిని విధ్యుక్తధర్మం తప్ప ఇతరప్రాపంచిక సౌఖ్యాల నుంచి విరక్తుడిని చేయాలని ప్రయత్నించారు. ఓ రకంగా చూస్తే, ఈ వర్ణనలో అబద్ధం, అతిశయోక్తులేవీ లేవు. ఈ రకంగా జ్ఞానం ద్వారా, విచక్షణ ద్వారా, విజ్ఞానం ద్వారా, భక్తి ద్వారా, భయం ద్వారా, సామాజికనియమల పాలన ద్వారా, ధర్మపాలన, కర్తవ్యనిర్వహణ ద్వారా వ్యక్తి బ్రహ్మచర్య పాలనకోసం ప్రయత్నించవచ్చు. వ్యక్తిత్వవికాస సాధన దిశలో అడుగు ముందుకు వేయవచ్చు.

తనలో కోరిక కలిగినప్పుడు, ఆవేశం కలిగినప్పుడు వ్యక్తి ఒక్క క్షణం ఆగి తన కోరిక స్వరూపాన్ని విశ్లేషించాలి. ఆవేశాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం చేయాలి. తనలో చెలరేగుతున్న లైంగికభావనల పరమార్థం సంతానప్రాప్తి అని గ్రహించాలి. దాంతో వ్యక్తికి 'బాధ్యత' గుర్తింపుకు వస్తుంది. తనలో చెలరేగుతున్న కోరికల తుఫానును అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తాడు. అదీ కుదరకపోతే, పురాణాలలో లైంగికమైన కోరికలు అదుపు తప్పినవారి స్థితిని గురించి చదివి జాగ్రత్తపడే ప్రయత్నాలు చేయాలి. అదీ కుదరకపోతే, శంకరాచార్యులు సూచించిన 'పునరపి జననం' మననం చేయాలి. ఇంకా అదుపులోకి రాని కోరికను అదుపులోకి తెచ్చుకోవాలంటే, తొడుగు లేని మానవ శరీరాన్ని ఊహించాలి. బ్రహ్మచర్యసాధనలో కోరికను అదుపులో ఉంచుకునేందుకు ఇన్ని రకాల ప్రయత్నాలున్నాయి, మన జీవనవిధానంలో. 'భక్త తుకారాం' అనే ఓ సినిమా ఉంది. దాంట్లో ఓ నర్తకి (కాంచన) తుకారాంను ప్రలోభపెట్టాలని నర్తిస్తుంది. ఊరిస్తుంది. అయితే తుకారాం ఆమె ప్రలోభానికి లొంగడు. ప్రస్తుతం యౌవనంలో ఉన్న ఆమె శరీరాన్ని వర్ణించి, వార్ధక్యంలో తోలు తిత్తి అయి, వాడి వక్కలైపోయే ఆమె శరీరాన్ని ఊహకు తెస్తాడు. అంతే... ఆమెలో తన అందం పట్ల అతిశయం నశించటంతో పాటు, ఆమె కూడా భగవద్భావనకే అంకితం అవుతుంది. అదుపులేని లైంగికేచ్ఛను అదుపు లోకి తెచ్చుకుని భగవద్భావన జోడించి సృజనాత్మకంగా దాన్ని వ్యక్తపరిస్తే, ఏ కోరిక

అయితే వ్యక్తిని పశువుగా మార్చి దిగజారుస్తుందో, అదే కోరిక వ్యక్తిని ఉన్నతుడినీ, ఆదర్శప్రాయుడినీ, చిరంజీవినీ చేస్తుంది. అందుకే వ్యక్తిత్వ వికాసంలో బ్రహ్మచర్యభావనకు అంత ప్రాధాన్యం ఉంది.

## బ్రహ్మచర్యభావన

వ్యక్తిత్వవికాసానికి యమనియమాల ప్రాధాన్యం, ముఖ్యంగా బ్రహ్మచర్య ప్రాధాన్యం విపులంగా చర్చించుకున్నాం. వ్యక్తిత్వవికాసంలో ప్రధానపాత్ర వహించే ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానాల వైపు దృష్టిసారించే కన్నా ముందు మరో ప్రధానమైన అంశం గురించి స్పష్టంగా తెలుసుకోవాల్సి ఉంటుంది.

ఒక పద్ధతి ప్రకారం మనది అన్న ప్రతిదానిపై దాడి జరుగుతోంది. మన దాన్ని మనకు కాకుండా చేసి, మనది కానిదాన్ని మన కంటగట్టి, మన ప్రమేయం లేకుండా, మనల్ని సంపూర్ణంగా రూపాంతరం చెందించే ప్రయత్నాలు గతంలోనూ ఉన్నా, ఇప్పుడు మరింతగా ఊపందుకుంటున్నాయి. అందుకే, బ్రహ్మచర్యం అంటే స్త్రీ సంపర్కం లేకుండా ఉండటం మాత్రమే కాదని, అన్యస్త్రీలపై ఎటువంటి దురూహలు కలగకుండా మాతృభావంతో మెలగటం, సక్రమంగా తనదైన రీతిలో తన స్త్రీతో సంసారం చేయటం కూడా బ్రహ్మచర్యమేనని నిస్సందేహంగా తెలుసుకోవాలి. ఎందుకంటే, భారతీయధర్మంలో అన్ని ఆశ్రమాల కన్నా గృహస్థాశ్రమానికే ఎక్కువ విలువ ఉంది. సమాజానికి వెన్నెముక వంటిది గృహస్థాశ్రమం.

సన్యాసి అన్నీ వదిలినవాడు. బాలుడు స్వయంప్రతిపత్తి లేనివాడు. వృద్ధుడు ఎవరో ఒకరిపై ఆధారపడాల్సినవాడు. కానీ వీరందరినీ ఆదరించి, సేవలు చేసి, పెంచి పోషించి, ఆధారంగా నిలిచేవాడు గృహస్థు. ఎప్పుడైతే గృహస్థాశ్రమం విచ్ఛిన్నమౌతుందో అప్పుడు సమాజం విచ్ఛిన్నమౌతుంది. అన్ని అంశాలపై దాడులు జరుగుతున్నట్టే దాంపత్యధర్మంపై కూడా దాడి తీవ్రతరంగా సాగుతూ వస్తోంది. 'వేయి పడగలు' నవల అంతరార్థం వివరిస్తూ విశ్వనాథ సత్యనారాయణగారు 'ఈ దేశమునందు సర్వధర్మములు నశింపవచ్చును కాని, దాంపత్యధర్మము, పాతివ్రత్యము యెన్ని బిల్లులు పెట్టిననూ పో'వని దాంపత్యధర్మంపై విశ్వాసం ప్రకటించారు. కానీ ప్రస్తుతం దాంపత్యధర్మం కూడా ప్రమాదంలో పడిందని ఒక్కసారి మన చుట్టూ ఉన్న సమాజాన్ని పరికిస్తే స్పష్టమౌతుంది. విశ్వనాథవారు బిల్లుల వల్ల బాధలేదని భావించారు. కానీ సాంస్కృతికపరమైన దాడిని ప్రస్తావించలేదు. ప్రస్తుతం దాంపత్యధర్మంపై, మన సంస్కృతిపై మనమే ఆధునికత,

అభ్యుదయం పేరిట దాడులు చేస్తున్నాం. ఇందుకు ఇటీవల వస్తున్న సాహిత్యం, తీస్తున్న సినిమాలు  నిదర్శనాలు.

విప్లవం పేరిట సాహిత్యం ఏ నాడో పాతివ్రత్యాన్నీ, దాంపత్య ధర్మాన్నీ త్రోసిరాజంది. భర్తని వదిలేయటం 'గొప్పతనం'గా 'అభివృద్ధి వైపు అడుగులు వేయటం'గా ప్రచారం చేశారు అనేకసాహిత్యకారులు. ఇందులో భాగమే మనం గౌరవించే పౌరాణిక స్త్రీలను, దేవీదేవతలను  హేళన చేయటం, ఎద్దేవా చేయటం. సినిమాలు సాహిత్యం కన్నా ఎక్కువ ప్రభావం సమాజంపై చూపిస్తాయి. దాంతో సినిమాల్లోని దిగజారుడుతనం సమాజంపై అతిత్వరగా దుష్ప్రభావం చూపిస్తోంది. పసి వయసు ప్రేమలు యువతీ యువకులకు లేనిపోని ఆలోచనలిస్తూంటే, అక్రమ సంబంధాల సమర్థన, లైంగిక వికృతులకు ప్రామాణికతను ఆపాదించటం సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. నిజానిజాలు గుర్తించే శక్తిని హరించి, ఆవేశాలే ఆనందదాయకం, క్షణికాలే ఆమోదయోగ్యంగా మారుస్తున్నాయి. ఇటీవల వస్తున్న సినిమాల్లో హాస్యం పేరిట, ముగ్గురు – నలుగురు యువకులు ఓ నడివయసు స్త్రీ వెంట వెర్రిగా పడటం అసహ్యంగా చూపించారు. 'ఇదేమి'టని? ప్రశ్నించినవారు అభివృద్ధినిరోధకులయ్యారు.

స్త్రీపురుషుల లైంగికసంబంధాలను విచ్చలవిడిగా చూపించటం సర్వసాధారణమైంది. అక్రమసంబంధాలను 'గ్లోరిఫై' చేస్తూన్న సినిమాలను విమర్శిస్తే 'ఆర్టిస్టిక్ ఫ్రీడమ్' ముసుగు వేసుకుని ఇల్లెక్కి గోల చేశారు. ఇవన్నీ ఒక ఎత్తు. విడుదలై 'హిట్' సినిమాల జాబితాలో చేరిన రెండు హిందీ సినిమాలు 'కభీ అల్విదా నా కహనా' 'నిశ్శబ్ద్'లు మరో ఎత్తు.

'కభీ అల్విదా నా కహనా' రెండు జంటల కథ. ఓ జంటలో భార్య ఉన్నతోద్యోగి. భర్త గొప్ప ఆటగాడు కావాలనుకుంటాడు. కానీ ఓ ప్రమాదం వల్ల పనికిరానివాడవుతాడు. వారిద్దరి నడుమ అభిప్రాయభేదాలుంటాయి. మరో జంట నడుమ ప్రేమ ఉండదు. భర్త జీవితాన్ని అనుభవించాలనుకునే రకం. భార్యకు అన్నిటి పట్లా అనాసక్తి. అనుకోని పరిస్థితులలో అనాసక్తి భార్య పనికి రాని భర్తను కలుస్తుంది. వాళ్లిద్దరూ ప్రేమలో పడతారు. ఆమె భర్తని వదిలి వచ్చేస్తుంది. ఇదీ సినిమా కథ. చిన్న చిన్న పొరపాట్లు, అభిప్రాయభేదాలు, నిరాశలు, అసంతృప్తులు ఏ సంబంధంలోనైనా సర్వసాధారణం. అటువంటి వాటిని పెద్దగా చేసుకొని బంధాలను పాడుచేసుకొనే కన్నా రాజీ ధోరణిలో సర్దుకునిపోయి హాయిగా బ్రతికే విధానం వెతకాలని నేర్పటం 'పాత భావం' అయి పోయింది. 'ప్రేమ లేని పెళ్ళిళ్లు' అన్న ముద్ర వేసి బంధాలను తెంచుకోవటం ప్రగతికి రాచమార్గంగా ప్రచారం జరుగుతోంది. సినిమాల ప్రభావం సమాజంపై అపరిమితంగా

ఉంటుంది. సినిమాలో చూపించినట్టుగా ఏవేవో అసంతృప్తులున్నవారంతా, తమ సమస్యలకి పరిష్కారం దొరికినట్టు భావిస్తే, సమాజంలో జరిగేదేమిటో ఊహించటం కష్టం కాదు.

'నిశ్శబ్ద్' సినిమా, పురుషుడిలోని ఓ వికృతికి ప్రామాణికత, సానుభూతిని కల్పించే సినిమా. వయసుతో సంబంధం లేకుండా స్త్రీపురుషుల నడుమ ఆకర్షణ ఉంటుందన్నది కాదనలేని అంశం. ఈ ఆకర్షణకు వయసే కాదు, బంధుత్వం కూడా అడ్డు రాదన్నదీ కాదనలేని సత్యం. అందుకే మన పురాణాల్లో, శాస్త్రాల్లో స్త్రీపురుషులు కలవటం పట్ల ఎన్నో జాగ్రత్తలు, నియమాలు సూచించారు. అనేకపౌరాణికకథల ద్వారా స్త్రీపురుషులు ఎటువంటి పరిమితులు లేకుండా కలిస్తే కలిగే అనర్థాలను వివరించారు. అటువంటి కథలను 'గ్లామరస్'గా చెప్పకుండా, తప్పు చేసినవారికి కలిగే అనర్థాలకు పెద్ద పీట వేస్తూ చెప్పారు. కానీ వ్యాపారలాభాలు కోరిన కళాకారులు, తమ లైంగిక వికృతులకు 'పురోభివృద్ధి' ముసుగు వేసి ప్రామాణికత కల్పించుకుంటూ వస్తున్నారు. ఇటువంటి సినిమాల ప్రభావానికి గురైనవారు, తమ వికృతులను సమర్థించుకోగలుగుతున్నారు. 'దాంట్లో తప్పేంటి?' అని వాదించి నెగ్గుకురాగలుగుతున్నారు.

అబ్బాయి, అమ్మాయి 'ఫ్రెండ్‌షిప్' అంటూ సన్నిహితంగా ఉంటారు. హఠాత్తుగా వారి మధ్య ప్రేమ ఉదయిస్తుంది. ఆ సినిమా ప్రభావంతో అనేక 'ఫ్రెండ్స్' ప్రేమికులైపోయారు. పక్కింటి 'ఆంటీ', 'అంకుల్'లు సైతం ప్రస్తుతం కళాకారులకు వ్యాపారవస్తువులయ్యారు. కళాప్రదర్శన ముసుగులో సమాజంలో విషం వెదజల్లుతూ వ్యాపారలాభాలు  గడిస్తున్నారు.

*కసుగాయ గఱచి చూచిన*
*మసలక తగు యొగరు గాక మధురంబగునా?*
*పస గలుగు యువతులుండగ*
*బసి బాలల బొందువాడు పశువుర సుమతీ.*

'పచ్చిగాయ వగరుగా ఉంటుందే కానీ మధురంగా ఉండదు. అలాగే పసిబాలలతో కూడటం వికటంగా ఉంటుంది. అలాంటివాడు పశువుతో సమానుడు' అని ఆ నాడే హెచ్చరించాడు సుమతీ శతకకారుడు. కానీ ఈ నాడు పశుత్వమే ప్రీతిపాత్రమౌతోంది. కళాకారుడి కళాప్రదర్శనకు గీటురాయిగా మారుతోంది. విచక్షణను విస్మరించటమే విజయానికి మొదటి అడుగవుతోంది.

*కారణము లేని నగవును*
*బేరణమును లేని లేమ పృథివీ స్థలిలో*
*బూరణము లేని బూరెయు*
*వీరణములు లేని పెండ్లి, వృథరా సుమతీ.*

కారణంలేని నవ్వు, రవిక లేని స్త్రీ, పూరణంలేని బూరె, వాద్యాలు లేని పెళ్ళి గౌరవం లేక వృథా అవుతాయని సుమతీ శతకకారుడు స్పష్టం చేశాడు. కానీ మిగతావాటి సంగతి ఎలా ఉన్నా, అంగాంగప్రదర్శనతో ప్రజలను వెర్రివాళ్ళను చేసి మన్నన లందుకుంటున్నవారికి లభిస్తున్న గౌరవం, జీవితాన్ని దేశం కోసం అర్పించిన వారికి లభించటం లేదు. విజ్ఞానార్జనలో జీవితాన్ని వెచ్చించి ఉన్నతశిఖరాలు అధిరోహించినవారికీ లభించటం లేదు. ఈ ఒక్క అంశం చాలు, సమాజం ఏ దిశలో ప్రయాణిస్తోందో అర్థం చేసుకునేందుకు.

వ్యక్తిత్వవికాసంపై ఆసక్తి కలవారు ఇది తప్పనిసరిగా గమనించాల్సిన అంశం. ప్రచారప్రభావానికి లోనుకాకుండా, పాలను నీళ్ళను వేరు చేసి చూడగలిగే విచక్షణ సంపాదించటం వ్యక్తిత్వవికాసంలో అత్యంతప్రాధాన్యం వహించే అంశం. ఈ నిజం గ్రహిస్తే, ప్రచారప్రభావానికి లోనుగాక, తామరాకు మీద నీటి బొట్టులా తన ప్రత్యేకతను నిలబెట్టుకోగలిగితే తనలోని పశువుపై వ్యక్తి సగం విజయం సాధించినట్టే.

*పరనారీ సోదరుడై*
*పరధనముల కాస పడక, పరులకు హితుడై*
*పరులు దను బొగడ నెగడక*
*బరు లలిగిన నలుగనతడు, పరముడు సుమతీ.*

ఇలాంటి ఉత్తమత్వసాధన భారతీయధర్మలక్షణం.

✣ ✣ ✣

# వ్యక్తిత్వం - శాంతం

## అసలు శత్రువు

*తన కోపమె తన శత్రువు*
*తన శాంతమె తనకు రక్ష, దయ చుట్టంబౌ*
*తన సంతోషమె స్వర్గము*
*తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ!*

అతిసులభంగా అర్థమయ్యే పద్యం ఇది. కోపాన్ని మించిన శత్రువు, శాంతాన్ని మించిన రక్షణ, దయను మించిన చుట్టం, సంతోషాన్ని మించిన స్వర్గం, దుఃఖాన్ని మించిన నరకబాధ లేదు... కామన్ సెన్స్ ఇది.

కోపం మనిషి విచక్షణను హరించేస్తుంది. కోపం వల్ల కలిగే ఉద్రేకంతో మనిషి పశువు అవుతాడు. ఆలోచన నశిస్తుంది. ఎదుటి వ్యక్తిని ఏదో రకంగా హింసించాలి, బాధించాలి అన్న భావన తప్ప, తన చర్యల ఫలితం గురించి ఆలోచన ఉండదు. దాంతో అనకూడని మాటలు అనేస్తాడు. చేయకూడని పనులు చేస్తాడు. కాబట్టి వ్యక్తి వీలైనంతగా కోపాన్ని అణచుకోవాలి. శాంతంగా ఉండే ప్రయత్నం చేయాలి. ఎందుకంటే, శాంతంగా ఉండే మనిషిని ఎవరూ మోసపుచ్చలేరు.

శాంతం అభ్యాసం వల్ల వస్తుంది. వ్యక్తి తన మనోభావాలను అదుపులో ఉంచుకునేందుకు నిరంతరం, అవిశ్రాంతంగా చేసే ప్రయత్నం వల్ల శాంతం వస్తుంది. వ్యక్తి తనకు ఎందుకు కోపం వస్తోందో గ్రహించాలి. తన కోపానికి కారణం విశ్లేషించాలి. అనేకసందర్భాలలో, గమనిస్తే, కోపం రావటానికి బాహ్యసంఘటనలు ప్రేరేపకాలుగా కనిపించినా, కోపం వ్యక్తి మనస్సులోంచే వస్తూంటుంది.

ఆఫీసులో బాసు తిడతాడు. బాసుని ఏమీ అనలేడు. ఇంటికి రాగానే పిల్లవాడు చాక్లెటో, పుస్తకమో, ఫీజో ఏదో అడుగుతాడు. ఛర్రున కోపం వస్తుంది.

అనుకున్నదేదో కాదు. ఎంత ప్రయత్నించినా పని పూర్తి కాదు. ఆ సమయంలో ఎవరు పలకరించినా కోపం వచ్చేస్తుంది. అరిచేస్తాం.

అవసరమైనది దొరకదు. ఎంత వెతికినా దొరకదు. ఆ సమయంలో అవసరమైన వస్తువులను ఎక్కడో పెట్టి మరిచిపోయిన తనను తిట్టుకోడు మనిషి. దాన్ని ఎవరో తీశారని అరుస్తాడు. ఇల్లు సర్దినవారిపై విరుచుకుపడతాడు. ఆ తరువాత అందరినీ తిట్టినందుకు బాధపడతాడు.

*బహుళ కావ్యములను బరికింపగా వచ్చు*
*బహుళ శబ్ద చయము పలుక వచ్చు*
*సహన మొక్కటబ్బ చాల కష్టమ్మురా*
*విశ్వదాభిరామ వినుర వేమ.*

అనేకగ్రంథాలు చదవవచ్చు. అనేకశబ్దాలను పలకవచ్చు. కానీ సహనం అలవరచుకోవటం చాలా కష్టం.

ప్రస్తుతసమాజంలో అసహనం అలంకారం అయింది. మన సినీహీరోలు ప్రతి చిన్న విషయానికీ భీకరముష్టి యుద్ధాలు చేస్తూండటం, ప్రతీకార ప్రతిజ్ఞలు పడు తూండటంతో, వారి వల్ల త్వరగా ప్రభావితమయ్యే సమాజం అసహనానికే పెద్ద పీట వేయటం చూడవచ్చు.

వరల్డ్ కప్ క్రికెట్‌లో భారత్ ఓడి పోగానే దేవుళ్ళలా భావించిన ఆటగాళ్ళను దూషించి, బొమ్మలు తగులబెట్టి నానాహంగామా చేశారు. ఆటగాళ్ళ ఇళ్ళపై దాడులు చేశారు. అయితే, ఆ ఆటగాళ్ళను చాపెల్ దూషించగానే ఆటగాళ్ళను పొగిడి, చాపెల్‌ను తిట్టారు. ఆ మధ్య ఓ ఇద్దరు సినీనటులు బహిరంగంగా దూషించుకుంటే, వారి అభిమానులు వీథుల్లో పడి కొట్టుకున్నారు.

ఇక రోడ్ల మీద ప్రతి చిన్నవిషయం ఆవేశకావేశాలకు దారి తీయటం మనం చూస్తూనే ఉన్నాం. ఈ మధ్య ఓ స్కూటరిస్టు, మరో స్కూటరిస్టుకు నడుమ వాగ్వివాదం జరిగింది. హెల్మెట్‌తో ఒకరు మరొకరిని కొట్టారు. దెబ్బ తిన్నవాడు మరణించాడు. ఇటువంటి పనికి రాని ఆవేశాల వల్ల నిండు జీవితాలు వ్యర్థంగా, అనవసరంగా బలైపోవటమే కాదు, వారి మీద ఆధారపడ్డ ఇతరుల జీవితాలు అల్లకల్లోలం అవుతాయి.

ఎప్పుడు ఆవేశాన్ని ప్రదర్శించాలి, ఎప్పుడు సహనం ప్రదర్శించాలి అన్న విచక్షణ ఉండటం 'వ్యక్తిత్వవికాసం'లో అత్యంతప్రాధాన్యం వహిస్తుంది. అనవసరంగా

వ్యర్థప్రేలాపన చేయటం, వాడిని చంపేస్తా, వీడిని చంపేస్తా'నని ప్రగల్భాలు పలకటం, 'వాడెంత, వీడెంత' అని ఎదుటివాడి స్థాయిని గ్రహించకుండా చులకన చేయటం, సర్వం వ్యక్తి మూర్ఖత్వానికి నిదర్శనాలు.

*అల్పుడెప్పుడు పల్కు నాడంబరముగాను*
*సజ్జనుండు పల్కు చల్లగాను*
*కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?*
*ఎంత గొప్పగా చెప్పాడు యోగి వేమన!*

కంచు ఖంగున మోగుతుంది. కానీ అసలు మోగని బంగారంతో పోలిస్తే, కంచు విలువ ఏ పాటి? అందుకే ఆడంబరంగా, ఇష్టం వచ్చినట్టు మాట్లాడేవారు, విచక్షణ రహితంగా ప్రవర్తించేవారు ఆభాసుపాలవుతారు.

'ఉమాభారతి' మంచి వక్త. ఉపన్యాసంతో ప్రజలను ఉత్తేజపరచగలదు. కానీ ఆమె విచక్షణరహిత అసహనప్రదర్శన ఆమెను అభాసుపాలు చేసింది. ఇదే సమయానికి, తనపై ఎటువంటి విమర్శలు వచ్చినా, ఎవరెంత దూషించినా పెదవి విప్పకుండా, తన పని తాను చేసుకుంటూ పోతూ 'నరేంద్ర మోడి' ఈ నాటికీ అందరి గౌరవం పొందుతున్నాడు. అతడిని విమర్శించేవారికి సైతం అతడిని గౌరవించక తప్పటం లేదు.

అలాగే, క్రికెట్ ఆటగాళ్ళు ప్రతి ఒక్కరూ ఏదో రకమైన వ్యాఖ్యలు చేస్తున్నారు. గ్రెగ్ చాపెల్ ఇష్టం వచ్చినట్టు ప్రకటనలు చేస్తున్నాడు. బోర్డు సభ్యులూ అభిప్రాయాలు వెలిబుచ్చేస్తున్నారు. ప్రతి వ్యాఖ్యాత, మాజీ క్రికెటర్లు తోచినట్టు మాట్లాడుతున్నారు. కానీ ఓడిన జట్టు కెప్టెన్ రాహుల్ ద్రావిడ్ నోరు విప్పటం లేదు. ఎవరెంతగా రెచ్చగొట్టినా ఆవేశం తెచ్చుకోటంలేదు. ఈ ప్రవర్తన అతడిని పలువురి మన్ననలకు పాత్రుడిని చేస్తోంది. ఎందుకంటే, 'వేమన' చెప్పిన విచక్షణను అతడు తుచ తప్పకుండా పాటిస్తున్నాడు.

అనువు గాని చోట అధికుల మనరాదు
కొంచె ముండు టెల్ల గొదువ కాదు
కొండ అద్దమందు గొంచెమై ఉండదా...

వ్యక్తిత్వ వికాసంలో ఈ విచక్షణ అత్యంతప్రాధాన్యం వహిస్తుంది. అనేకసమస్యలను మొగ్గలోనే తుంచేస్తుంది. 'మౌనం భూషణం' అన్నారు పెద్దలందుకే.

*తగిలి మదంబుచే నెదిరి దన్ను నెఱుంగక దొడ్డవానితో*
*బగ గొని పోరు టెల్ల నతిపామరుడై చెడు టింతె గాక తా*

*నెగడి జయింపలేడనుట నిక్కము,తప్పదు, ధాత్రి లోపలన్*
*తెగి యొక కొండతో తగరు ఢీకొని తాకిననేమి? భాస్కరా.*

మూర్ఖత్వంతో కొండతో పోరాడి గొఱ్ఱె గెలవగలదా? ఎదుటివాడి శక్తి, ఘనతలు తెలుసుకోకుండా పోరాటానికి దిగటం వల్ల లాభం లేదు. 'సద్దాం హుస్సేన్' ఉదాహరణ మన ముందు కనిపిస్తూనే ఉంది.

పరమశివుడు తనని అవమానించాడని కోపించాడు దక్షుడు. పరమశివుడి శక్తి తెలియక, తన శక్తిని గ్రహించకుండా శివుడితో వైరం పెట్టుకున్నాడు. పిలవకుండా యజ్ఞానికి వచ్చిన తన కూతురిని దూషించాడు. ఆమె మరణానికి కారకుడయ్యాడు. అయినా తన కోపం వల్ల జరుగుతున్న అనర్థం దక్షుడు గ్రహించలేకపోయాడు.

శివుడు ప్రళయరుద్రుడై విలయతాండవం ఆరంభించినప్పుడు తన మూర్ఖత్వం దక్షుడికి గ్రహింపులోకి వచ్చింది. కానీ చేతులు కాలిన తరువాత ఏం లాభం?

*పట్టుగ నిక్కుచున్ మదము బట్టి మహాత్ముల దూలనాడినన్*
*బట్టిన కార్యముల్ చెడును బ్రాణము పోవు నిరర్థ దోషముల్*
*పుట్టు, మహేశు గాదని కుబుద్ధి నొనర్చిన యజ్ఞ తంత్రముల్*
*ముట్టకపోయి దక్షునికి మోసము వచ్చె గదయ్య, భాస్కరా!*

తానెంత గొప్పవాడైనా, ఇతరులను అనవసరంగా దూషించకూడదు. అలా దూషించటం వల్ల పాపం కలగటమే కాక ప్రాణాలు కూడా కోల్పోవాల్సి రావచ్చంటాడు భాస్కరశతకకారుడు. 'భారతం'లో, కృష్ణుడిని దూషించిన శిశుపాలుడి గతి మనకు తెలుసు. తానెంత హింసించి, దూషించినా చలించని ప్రహ్లాదుడిని చూసి హిరణ్యకశిపుడే భయపడ్డాడు.

*ఆగ్రహమున నే జేసిన,*
*నిగ్రహములు పరులతోడ నెఱి నొక నాడున్*
*విగ్రహము లనుచు బలుక ద,*
*నుగ్రహములుగా స్మరించు, నొవ్వడు మదిలోన్*

కావున వీడు మహాప్రభావసంపన్నుండు వీనికెందును భయంబు లేదు వీని తోడి విరోధమునం దనకు మృత్యువు సిద్ధించునని.....

సహనం గొప్పతనం అది. 'సహనం' ప్రదర్శించిన ప్రహ్లాదుడు ఆదర్శమయ్యాడు. అసహనం ప్రదర్శించి, నోటి కొచ్చినట్టు మాట్లాడిన హిరణ్యకశిపుడు శిక్షను అనుభవించాడు. వ్యక్తిత్వవికాసంలో సహనం ప్రాధాన్యం ఇది.

*గంగ పాఱు నెపుడు కదలని గతి తోడ*
*మురికి వాగు పాఱు మ్రోత తోడ*
*పెద్ద పిన్నతనము పేరిమి ఈలాగు*

అందుకే, వ్యక్తి తన స్వభావాన్ని, సహనం సాధించటం విషయంలో భారతీయతత్త్వం అనేకపరిశోధనలు జరిపింది. సూచనలు చేసింది.

## సహనసాధన

*ఆరోప్యతే శిలా శైలే యత్నేన మహతా యథా*
*నిప్యాత్యతే క్షణే నాథ స్తథాత్మా గుణ దోషయోః*

ఒక పెద్ద శిలను పర్వతం మీదకు ఎక్కించాలంటే ఎంతో ప్రయత్నం చేయాలి. పైన ఉన్నదాన్ని కిందికి క్షణంలో తోసేయవచ్చు. అలాగే ఎంతో ప్రయత్నం చేస్తే కానీ సద్గుణాలు అలవడవు. కానీ దుర్గుణాలు సంపాదించేందుకు శ్రమపడాల్సిన పని లేదు.

మానవమనస్తత్త్వాన్ని కాచి వడబోచి నిర్ధారించి తేల్చి చెప్పిన సత్యం ఇది. ఎలాగైతే శిలను పర్వతం పైకి చేర్చాలంటే శ్రమపడాల్సి వస్తుందో, అలాగే మంచి నేర్చుకొని దాన్ని స్థిరంగా నిలుపుకొనేందుకు ఎంతో శ్రమపడటం తప్పనిసరి. కోపం తెచ్చుకోకూడదు, అనవసరంగా మాట్లాడవద్దు, ఎదుటివారిని కించపరచవద్దు, శాంతంగా ఉండాలి అని బోధించటం ఎంతో సులభం. పాటించటం కష్టం. ఎందుకంటే, మానవుని మనస్సులోనే దిగజారుడుతనం వైపు సులభంగా ఆకర్షితమయ్యే గుణం ఉంది.

*ఆహార నిద్రా భయ మైథునాని*
*సమాన మేత త్పశుభిర్నరాణామ్*
*ఏకో వివేకో హ్యధికో మనుష్యే తే*
*నైవ హీనాః పశుభిస్సమానః*

ఆహారం, నిద్ర, భయం, మైథునం వంటివి మానవులకు, పశువులకూ కూడా సమానమే. మనుషులలో వివేకం అధికంగా ఉంటుంది. అది లేనివాడు పశువుతో సమానుడు. అంటే, మనిషిలోని ఈ పశుస్వభావం అతడిని పశుత్వం వైపు లాగుతూ

వుంటుంది. తన వివేకంతో మనిషి ఆ పశుత్వాన్ని అడ్డుకొని దైవత్వం వైపు ప్రయాణించాలి. మన పూర్వికులు ఈ పశుస్వభావాన్ని 'రాక్షసత్వం'గా పరిగణించారు.

ఉపనిషత్తులలో ఓ కథ ఉంది. మనిషి శరీరాన్ని సృష్టించాడు దేవుడు. వెంటనే శరీరావయవాల్లో రాక్షసులు ప్రవేశించారు. తరువాత ఆయా అవయవాలలోకి దేవతలు ప్రవేశించి వాటిని పవిత్రం చేశారు. కానీ రాక్షసులను మాత్రం తరమ లేకపోయారు. అంటే, మానవశరీరంలో, మనసులో నిత్యం దేవదానవసంగ్రామం జరుగుతూ ఉంటుందన్నమాట. ఏ మాత్రం వీలు చిక్కినా రాక్షసులు తలెత్తుతారు. విజయం సాధిస్తారు. మనిషిని పశువును చేస్తారన్నమాట.

అందుకే ఏ ఒక్క మనిషీ సంపూర్ణంగా మంచి అనీ, చెడ్డ అనీ ముద్ర వేయలేం. కొన్ని విషయాల్లో సౌమ్యుడుగా, మంచివాడుగా ఉన్న వ్యక్తి మరికొన్ని విషయాలలో క్రూరుడుగా, లోభిగా, ప్రవర్తిస్తాడు. కొన్ని సమయాల్లో తెలివిగా ప్రవర్తించిన వ్యక్తి, కొన్ని సమయాల్లో మూర్ఖుడి కన్నా హీనంగా ప్రవర్తిస్తాడు. మానవస్వభావంలోని ఈ అనూహ్యమైన వైచిత్రి వల్ల మనిషి మనసు మంచి చెప్తూన్నా, మనిషి శరీరం చెడు చేస్తుంది. తప్పు అని తెలిసి కూడా మనిషి తప్పు చేస్తాడు. ఐతే మంచివాడుగా ఉండాలని ప్రయత్నిస్తూ న్నంతకాలం ఆ వ్యక్తిలో 'మంచి' సజీవంగా ఉన్నట్టే. ఈ వ్యక్తికి శక్తినిచ్చేందుకే శుభవచనాలు పలకటం, మంచి చెప్పటం, నీతులు బోధించటం వంటివి.

*అహో దుర్జన సంసర్గాన్మానహానిః పదే పదే*<br>*పావకో లోహ సజ్గేన ముద్గరై రభిహన్యతే*

దుర్జనులతో సంబంధం వల్ల అడుగడుగునా గౌరవభంగం కలుగుతుంది. ఇనుముతో సంబంధం వల్ల అగ్నిని సమ్మెటతో దెబ్బలు కొడుతారు. అందుకే 'వ్యక్తిత్వవికాసం' సాధించాలనుకునే వ్యక్తి సజ్జనులు, దుర్జనులను వేరు చేసి గుర్తించగల వివేకం ప్రదర్శించాలి. ఆకర్షణీయమైన ప్రతిదీ మంచి కాదని గ్రహించాలి.

*ఆచారః పరమోధర్మః ఆచారః పరమం తపః*<br>*ఆచారః పరమం జ్ఞానమాచారాత్ కిం న సాధ్యతే*

మంచి నడవడికకు ఆచారం అని పేరు. ఆచారమే గొప్పధర్మం. ఆచారమే గొప్ప తపస్సు. ఆచారమే గొప్ప జ్ఞానం. ఆచారం వల్ల సాధించరానిది ఏదీ లేదు.

'ఆచారం' అంటే మనకి 'వెనుకబడినతనం' లేకపోతే 'పాతని పట్టుకుని వేలాడే మౌఢ్యం' అని వినిపిస్తుంది. కానీ తరచి చూస్తే, ఆచారం, సంప్రదాయాలన్న పేరిట

మన పూర్వికులు వ్యక్తిత్వవికాసానికి రాచబాట వేశారు. ఈ రాచబాటలో 'సహనం' ఒక మైలు రాయి వంటిది.

అరుష్యన్ క్రుశ్య మానస్య సుకృతం నామ విన్దతి
దుష్కృతం చాత్మనో మర్షీ రుష్యత్యే వాపమారే ష్టిచ

తనని తిడుతున్నవాని విషయంలో కోపం రానివాడు, వాని పుణ్యాన్ని తీసేసుకుంటాడు. సహనశీలుడు తన పాపాన్నంతా తిట్టేవాడికి ఇచ్చేసి తన పాపం తుడిచేసుకుంటాడు.

తనని అవమానించినవాడిపై ప్రతీకారం తీర్చుకునేవాడు, మాటకి మాట, దెబ్బకు దెబ్బ ఇచ్చేవాడు, తల్లిదండ్రులను, గురువును, ఇతర పెద్దలను అవమానించి, ఎదిరించేవాడు 'హీరో' కాదన్నమాట. తనని ఎవరేమన్నా తొణకకుండా, ద్వేషించ కుండా, ప్రతీకారవాంఛ ప్రకటించకుండా ఉన్నవాడే నిజమైన హీరో అన్నమాట.

అవశ్యం భావి భావానాం ప్రతీకారో భవే ద్యది
తదా దుఃఖై ర్న విప్యేర న్నల రామయుధిష్ఠిరాః

తప్పకుండా జరగవలసిన విషయాలకు ప్రతిక్రియ ఉండే పక్షంలో నలుడు, రాముడు, యుధిష్ఠిరుడు అన్ని కష్టాలు పడేవాళ్లు కారు.

తన అరణ్యవాసం కోరిన కైకను రాముడు ద్వేషించలేదు. తండ్రిపై తిరుగుబాటు చేయమన్న సలహాలను పాటించలేదు. పెద్దల మాటను మన్నించాడు. వారి ఆజ్ఞలను శిరసా వహించాడు. మామూలు మనుషులకు సాధ్యం కాని అసామాన్యసహనం ప్రదర్శించాడు. ఆదర్శప్రాయుడయ్యాడు. ఎందుకంటే రాముడు సదాచారం పాటించాడు.

అసత్ప్రలాపం పారుష్యం పైశునమనృతం తథా
చత్వారి వాచా రాజేన్ద్ర న జల్పేన్నానుచిన్తయేత్

ఉత్తమమానవుడి లక్షణాన్ని మహాభారతంలోని ఈ శ్లోకం స్పష్టంగా ప్రకటిస్తున్నది. చెడ్డ మాటలు, పరుషవచనం, చాడీలు, అసత్యం ఈ నాల్గింటినీ పలకకూడదు. మనస్సులో అనుకోకూడదు.

అప్రియ వచనాంగీ రై ర్దగ్ధోపి
న విప్రియం వదత్యార్యః
కిం దహ్యామాన మగరు స్వభావ
సురభిం పరిత్యజతి

అప్రియాలైన మాటల కొరివితో కాల్చినా సజ్జనుడు అప్రియవాక్యం పలకడు. అగరును కాలుస్తున్నా అది సహజమైన సుగంధాన్ని వదిలిపెట్టదు కదా!

ఇదీ 'సహనం' విలువ. కానీ మన సమాజంలో 'అసహనం' అలంకారంగా ప్రచారం జరుగుతోంది. దెబ్బకు దెబ్బ తియ్యనివాడు పనికి రానివాడుగా పరిగణనకు గురవుతున్నాడు. దాంతో పశుత్వాన్ని ప్రదర్శించటమే 'ఉత్తమత్వం' అన్న భావన స్థిరపడుతోంది. అసలు నిజం మరుగున పడుతోంది.

*అవమానారణి మథితం దుర్వాగిన్ధన వివర్ధితజ్వాలమ్*
*సత్పురుషాః కోపాగ్నిం జ్ఞానామ్బుఘటైః ప్రశమయన్తి*

కోపమనే అగ్ని, అవమానమనే అరణి నుంచి పుడుతుంది. దుర్భాషలనే కట్టెలు చేర్చటంతో జ్వాలలు వ్యాపిస్తాయి. సత్పురుషులు, విజ్ఞానమనే నీరు నింపిన కుండలతో ఈ కోపాగ్నిని చల్లార్చేస్తారు.

కాబట్టి, ఎదుటివాడు తనని నిందిస్తే, తిరిగి నిందిస్తే గొడవ పెరుగుతుంది. అనవసరమైన అనర్థాలు జరుగుతాయి. వ్యర్థంగా కోపం ప్రదర్శించటం 'హీరోయిజం' కాదు. అది మూర్ఖత్వానికి నిదర్శనం. ఎదుటివాడి దూషణలు, అవమానాల వెనుక ఉన్న కారణాన్ని విశ్లేషించేవాడికి కోపం రాదు. వచ్చిన కోపాన్ని చల్లార్చుకుంటాడు. ఎందుకంటే, అనవసరంగా ఎదుటివాడిని దూషించేవాడి మనసులో ఓ రకమైన న్యూనతాభావం ఉంటుంది. తన లేకితనాన్ని కప్పి పుచ్చుకునేందుకు వాడు, ఎదుటివాడిని అవమానించి సంతృప్తి పడుతూంటాడు. తనకన్నా పై స్థాయిలో ఉన్నవాడిని అవమానించి ఆనందిస్తూంటాడు. జ్ఞానులు అటువంటివారిని చూసి జాలిపడతారు. అనవసరంగా స్పందించి, వాడి పశుత్వాన్ని ప్రకోపింపచేసి, వాడి మాటలకు విలువనివ్వరు.

*అప్రియముక్తాః పురుషాః ప్రయతక్తే ద్విగుణ మప్రియం వక్తుమ్*
*తస్మాదవాచ్యమప్రియ మన్య ప్రియ వాక్యకామేన*

ఎవరి విషయంలోనైనా అప్రియవాక్యం పలికితేవాళ్ళు రెట్టింపు అప్రియంగా ఉండే పరుషవాక్యం పలుకుతారు. అందుకే ఇతరులు తన విషయంలో ప్రియంగా పలకాలని కోరుకునేవారు అప్రియంగా పలకకూడదు.

ఎటువంటి విత్తనం నాటితే అటువంటి చెట్టే వస్తుందంటారు. అందుకే, ఉత్తమ వ్యక్తిత్వం సాధించాలనుకునే వ్యక్తి, ముందుగా ఎవరి గురించీ చెడు ఆలోచనలు చేయకుండా ప్రయత్నం చేయాలి. ఆపై పరుషవాక్యాలను పలకటం తగ్గించుకోవాలి.

ఎందుకంటే, తనకు అపకారం చేసేవారి పైనే మనిషికి కోపం వస్తుంది. కాబట్టి మనిషి ముందుగా కోపించాలంటే, కోపం పైనే కోపించాలి. కోపం చేసేంత అనర్థం ఇంకొకటి చేయదు.

*అపకారాణి కోపశ్చేత్ కోపే కోపః కథం న జాయేత్*
*ధర్మార్థ కామ మోక్ష ప్రాణయశోహారిణి క్రూరే.*

కోపం చాలా క్రూరమైంది. ధర్మార్థ కామ మోక్షాలను నశింపచేస్తుంది. ప్రాణాలు తీస్తుంది. కీర్తిని హరిస్తుంది. 'శాంతము లేక సౌఖ్యము లే'దని పెద్దలందుకే అన్నారు. కోపాన్ని జయించి, సహనం సాధించి, శాంతితో వ్యక్తిత్వం వికసింపచేసుకుని ఉత్తమమానవుడుగా ఎదిగేందుకు ఉపయోగపడుతుంది ధ్యానం.

## ధ్యానం

*యథాదీపో నివాతస్థో నేంగతే సోపమా స్మృతా।*
*యోగినో యతచిత్తస్య యుంజతో యోగమాత్మనః॥*

గాలి లేని చోట దీపం చలించక స్థిరంగా వెలిగే రీతిలో, యోగసాధనతో మనస్సును జయించే యోగి చిత్తం స్థిరమై ఉంటుంది.

సాధారణంగా, ప్రతి వ్యక్తీ ఏకాగ్రతను వాంఛిస్తాడు. జీవితంలో విజయానికి అత్యంత ప్రధానమైన కారణం ఏకాగ్రత. వ్యక్తి తన సర్వేంద్రియాలూ కేంద్రీకరించి, సర్వశక్తులూ కూడగట్టుకొని ఏ పని అయితే చేస్తాడో, ఆ పని సాధించటంలో తప్పకుండా విజయవంతుడౌతాడు.

భౌతికశాస్త్రంలో ఓ ప్రశ్న ఉంటుంది. సూది కన్నా ఎక్కువ శక్తిమంతమైనది ఇనుప కమ్మీ. కానీ సూది కాగితాన్ని ఛేదించినంత సులభంగా ఇనుపకమ్మీ ఛేదించ లేదెందుకు? దీనికి సమాధానం చాలా సులభం. ఇనుపకమ్మీ కొన, సూదిమొనలా సన్నగా ఉండదు. సూది మొన సన్నగా 'పాయింటెడ్'గా ఉండటం వల్ల మనం దానిపై తెచ్చే ఒత్తిడి అంతా మొత్తంగా తక్కువ ప్రాంతంపై పడుతుంది. అంటే తక్కువ స్థలంలో ఎక్కువ ఒత్తిడి కలగటం వల్ల ప్రభావం అధికంగా ఉండి సూది మొన కాగితాన్ని ఛేదించగలుగుతుంది. అదే ఇనుపకమ్మీ కొన బల్ల పరుపుగా ఉండటం వల్ల, మనం దానిపై తెచ్చే ఒత్తిడి ఎక్కువ స్థలంలో విస్తరిస్తుంది. అంటే, మన శక్తి ఎక్కువ ప్రాంతంలో పడాల్సి రావటం

వల్ల దాని ప్రభావం తగ్గుతుందన్నమాట. అందుకని కాగితాన్ని సూది ఛేదించినంత సులభంగా, ఇనుపకమ్మీ ఛేదించ లేదు. ఈ సమాధానం ఓ మహత్తరమైన సత్యాన్ని సూచిస్తుంది.

మనిషి మెదడు సూది మొనలాగా, ఎక్కువ శక్తిని తక్కువ స్థలంలో కేంద్రీకృతం చేయగలిగితే ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. అలా కాక ఎక్కువ స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే, శక్తి మొత్తం ఎక్కువ ప్రాంతంలో విస్తరించాల్సి రావటంవల్ల బలహీనమై పోతుంది. అందుకని ఏదైనా ఒక పనిని సంపూర్ణ ఏకాగ్రతతో సాధించే ప్రయత్నం చేస్తే సఫలమయ్యే అవకాశం ఎక్కువ ఉంటుంది. మనిషి మెదడులో 'ఏకాగ్రత' ఈ సూది మొనలాంటి పని చేస్తుందన్న మాట. ఇది గ్రహించిన మన పూర్వీకులు ఈ ఏకాగ్రత సాధించేందుకు 'మననం' మంచి మార్గం అని నిశ్చయించారు. ఈ 'మననం' ద్వారా వేదాలను 'చిరంజీవి'గా నిలిపారు.

ఏదైనా నేర్చుకోవాలంటే దాన్ని ముక్కలు ముక్కలుగా విడగొట్టి నేర్చుకొంటే, ఎంత పెద్దదైనా సులభంగా నేర్చుకోవచ్చు. ఉదాహరణకు భగవద్గీతలోని శ్లోకాన్ని తెలుసుకుందాం.

'యథాదీపో నివాతస్థో నేఙ్గతే సోపమా స్మృతా' అనే పాదాన్ని నేర్చుకోవాలంటే దాన్ని యథా, దీపో, నివాతస్థో ఇలా విడగొట్టి నేర్పుతారు. ఆపై యథాదీపో ఇలా నేర్పుతారు. ఆ తరువాత ఇలాగే వెనుక నుంచి ముందుకు చదువుతారు. ఆపై ఒకో అక్షరాన్నీ వేరు చేసి చదివిస్తారు. ఇలా నేర్పటంతో వ్యక్తి దృష్టి మొత్తం శ్లోకం పైనే కేంద్రీకృతమౌతుంది. ఒక్కసారి నేర్చుకున్నది ఇక మరచిపోవటం జరగదు. ఏకాగ్రత సాధనకు ఇది ఒక సులువైన పద్ధతి. ఈ పద్ధతి నుంచే 'బట్టీ' పద్ధతి వచ్చింది.

'బట్టీ పట్టటం' అంటే చాలా మందికి చిన్న చూపు ఉంటుంది. కానీ ఏకాగ్రత సాధనలో మొదటి అడుగు బట్టీ పట్టటం. ఎలాగయితే విద్యార్థి అక్షరాభ్యాసం 'అఆ'లు దిద్దటంతో ఆరంభమవుతుందో వ్యక్తి ఏకాగ్రత సాధన, ధ్యానమార్గానికి ఆరంభం బట్టీ పట్టటంతో అవుతుంది. పిల్లవాడికి 'అ ఆ' అని అనిపిస్తూ అక్షరాలు దిద్దిస్తాం. ఎందుకంటే అక్షరానికి, భావానికి నడుమ ఉన్న అనిర్వచనీయమైన అనుబంధం వివరణకు ఒదగదు. కానీ మెదడు దాన్ని గ్రహిస్తుంది. అందుకే అక్షరాన్ని ఉచ్చరిస్తూ దిద్దటం ద్వారా మెదడు, కళ్ళు, చెవులు, చేతులు – అన్నీ సంయుక్తంగా ఆ అక్షరరూపాన్ని, శబ్దాన్ని, భావాన్ని తమలో ఇముడ్చుకుంటాయి. అందుకే కొంత కాలం గట్టిగా ఉచ్చరిస్తూ అక్షరాన్ని దిద్దిన పిల్లవాడు, కొంత కాలానికి అక్షరాల్ని చూడగానే గుర్తుపట్టగలుగుతాడు. ఆ తరువాత

అక్షరాన్ని గట్టిగా పైకి అనకుండా రాయగలుగుతాడు. అంటే వ్యక్తి ఏకాగ్రత సాధనలో ఒక అడుగు దాటి పైకి వెళ్ళినట్టన్నమాట. అలా కాక నేర్పేటప్పుడు పైకి అక్షరాన్ని ఉచ్చరించకుండా మనస్సులోనే అనుకుంటూ రాయటం చేస్తే, పిల్లవాడి గ్రహణశక్తి దెబ్బ తింటుందని, పైకి ఉచ్చరిస్తూ రాసే పిల్లవాడిలో ఉన్న చురుకుదనం, మనసులోనే అనుకునే పిల్లవాడిలో ఉండదని శాస్త్రవేత్తల ప్రయోగాలు నిరూపిస్తున్నాయి. దీనికి కారణం ఉంది.

మన ప్రపంచం నామరూపాత్మకమైనది. అంటే దేన్నైనా మనం పేరుతో, రూపంతో గుర్తించగల్గుతాం. నామరూపరహితమైనదాన్ని ఊహించటం కుదరదు. ఊహను వివరించటం కుదరదు.

'చీమ' అనగానే ఒక ప్రత్యేకరూపం కళ్ళ ముందు మెదులుతుంది. అలాగే బల్ల, రాముడు, కుర్చీ, జార్జ్ బుష్ ఇలా పేరు రూపం లేకపోతే ప్రపంచంలో దేన్నయినా గుర్తించటం కుదరదు. ఉదాహరణకు 'నేను నా ఫ్రెండ్ సోము' అన్నాననుకోండి. నాకు తప్ప ఆ విషయం ఎవరికీ అర్థం కాదు. అలా కాక నేను నా గురించి వివరించి, నా మిత్రుడి రూపరేఖలను వర్ణిస్తే ఇద్దరితో పరిచయం ఉన్నవారు సులభంగా గుర్తుపట్ట గలుగుతారు. పరిచయం లేనివారికి కూడా ఓ అవగాహన కలుగుతుంది. భవిష్యత్తులో ఎప్పుడైనా మళ్ళీ సోము ప్రసక్తి వస్తే గుర్తు పడతారు.

ఇది గ్రహించిన మనవారు పైకి అనటం, పెద్దగా చదవటం, బట్టీ పట్టటం వంటి చిట్కాలను ఏర్పరచారు. బిగ్గరగా చదువుతూ బట్టీ పట్టటం సత్ఫలితాలను ఇవ్వటం వెనుక మరో కారణం ఉంది.

మనిషి మనస్సు నిత్యచంచలమైంది. ఏ ఒక్క విషయంపై స్థిరంగా ఉండదు. పలు విషయాలపై పరుగులిడుతూంటుంది. అటువంటప్పుడు 'శబ్దం' మనసును ఒక విషయంపై కేంద్రీకృతం చేయటంలో తోడ్పడుతుంది. వ్యక్తి బిగ్గరగా చదవటం వల్ల, అతని స్వరం సృష్టిస్తున్న శబ్దాలు చెవుల ద్వారా మళ్ళీ అతనిలోకి చేరతాయి. అటూ ఇటూ పరిగెత్తుతున్న మనస్సు ఉలిక్కిపడి మళ్లీ అతడు వల్లె వేస్తున్న విషయాల పైకి ప్రసరిస్తుంది. ఈ రకంగా పైకి చదవటం వల్ల చెదురుతున్న వ్యక్తి ఏకాగ్రత స్థిరపడుతుంది. ఇది దైవసంబంధిత మంత్రాలను వల్లె వేయటంలో గమనించవచ్చు.

కొందరు స్తోత్రాలను, మంత్రాలను బిగ్గరగా చదువుతారు. దాన్ని చుట్టుపక్కలవారు హాస్యం చేయవచ్చు. హేళన చేయవచ్చు. కానీ ఏకాగ్రత సాధనలో అది ఒక మార్గం.

మనసులో చదువుకుంటూ మననం చేసేవారు ఒకోసారి నిద్రలోకి జారుకుంటారు. మరోసారి పెదిమలు యాంత్రికంగా మంత్రాలను వల్లె వేస్తూంటాయి కానీ మనసు ఎక్కడెక్కడో తిరుగుతూంటుంది. ఎప్పుడైతే బిగ్గరగా మంత్రాలు, శ్లోకాలు వల్లె వేస్తూంటారో, అప్పుడు మనసు తాత్కాలికంగా అటూ ఇటూ పరిభ్రమిస్తున్నా, శబ్దాల ప్రభావం వల్ల మళ్లీ మంత్రాల వైపు ప్రవరిస్తుంటుంది.

ఆధునికసమాజంలో వ్యక్తికి దైవం కోసం ప్రత్యేకంగా కేటాయించేంత సమయం ఉండటం లేదు. అందుకే, అనేకసందర్భాలలో శ్లోకాలు వల్లె వేస్తూ మహిళలు ఇంటి పనులు చేస్తూండటం కనిపించటం సర్వసాధారణమైంది. వంట చేస్తూ లలితసహస్ర నామాలు చదివేవారు కొందరైతే, పిల్లలకు జడలు వేస్తూ విష్ణుసహస్రనామాలు చదివేవారింకొకరు. సుప్రభాతం వింటూ ఇల్లూడ్చేవారు కొందరైతే, భక్తిగీతాలు వింటూ పనులు చేసేవా రింకొందరు. ఇవన్నీ ఏకాగ్రత సాధన, ధ్యానాలకు దారి తీస్తాయి.

పనులు ఏవి చేస్తున్నా అవి యాంత్రికంగా చేసేవే. మనసు మాత్రం మంత్రాలను వల్లె వేయటంపై ఉంటుంది. మన మెదడు ఒకేసారి పలు పనులపై కేంద్రీకృతమయ్యే శక్తి కలిగి ఉంటుంది. అటువంటి మెదడు యాంత్రికకార్యాలు చేసేటప్పుడు పెద్దగా అవసరం లేదు. అందుకే పైకి యాంత్రికంగా పనులు చేస్తూ కూడా మెదడు మంత్రాలను గ్రహిస్తుంటుంది. చూసే మనకు వీళ్ళు మంత్రాలు చదువుతున్నారా, పనులు చేస్తున్నారా అని నవ్వు వస్తుంది. కానీ మనసును మంత్రాలపై కేంద్రీకృతం చేయటంలో ఇదొక పద్ధతి.

గాలిబ్ అనే కవి ఉండేవాడు. ఆయనకు హఠాత్తుగా ప్రేరణ వచ్చి కవితలు చెప్పేవాడు. అవి రాసుకునే సమయం ఉండేది కాదు. అప్పుడు కవితలు బిగ్గరగా చదువుతూ, పైజామా నాడా ముడి వేసేవాడు. ఇంటికి వచ్చిన తరువాత ఒక్క నాడా ముడి విప్పుతూ కవితలను గుర్తుకు తెచ్చుకునేవాడు.

'దాశరథి' జైల్లో ఉన్నప్పుడు అనేక కవితలను రాశాడు. వాటిని బిగ్గరగా గానం చేస్తుంటే మిత్రులు విని వారూ గానం చేసేవారు. జైల్లోంచి విడుదలైన తరువాత మళ్ళీ ఆ కవితలను గుర్తు తెచ్చుకుని రాసుకున్నాడు దాశరథి.

మనిషికి విన్న మాట గుర్తుంటుంది. ఆ వినేది ఏకాగ్రతతో వింటే ఇంకా చాలా బాగా గుర్తుంటుంది. అందుకే పిల్లవాడికి 'అ' ను చూపి 'అమ్మ' అనిపిస్తే, 'అ' సులభంగా గుర్తుంటుంది. 'ఇ'ని చూపి 'ఇల్లు' అంటే బాగా అర్థమౌతుంది. దాంతో అతడికి ఏకాగ్రత

కుదిరి అక్షరాలు సులభంగా గుర్తుంటాయి. అంటే దేనిపైనైనా ఏకాగ్రత కుదరాలంటే, మనకు పరిచితమైన వస్తువులతో పోల్చిచెప్తే వాటిపై ఆసక్తి జనిస్తుందన్నమాట. ఆసక్తి జనించటం ఏకాగ్రత ఆరంభానికి సూచన. ఏకాగ్రత కుదిరిన వ్యక్తి మనస్సు గాలి లేనప్పుడు నిశ్చలంగాఉండే దీపంలా కదలదు. ఒకసారి ఏకాగ్రత సాధించటం అలవాటైతే ఎటువంటి తుఫానులు కూడా వ్యక్తి మనస్సును చలింపచేయలేవు.

## ఏకాగ్రత – ధ్యానం

ధ్యానం, ఏకాగ్రతలు శబ్దానికి, అర్థానికి నడుమ ఉన్న సంబంధం లాంటి సంబంధం కలవి. కాబట్టి ధ్యానం అలవడాలంటే ఏకాగ్రత పట్టుబడాలి. ఏకాగ్రత సాధించాలంటే ధ్యానం అలవాటవ్వాలి.

గమనిస్తే, మనకు ఏకాగ్రత కుదిరే అంశాలన్నీ ఏదో ఒక రకంగా మన మనసుకు నచ్చేవే.

పాఠం ఎంత విన్నా గుర్తుండని విద్యార్థికి సినిమా పాట ఒకసారి వినగానే గుర్తుంటుంది. సినిమా పాట ఎంత విన్నా గుర్తుండని వ్యక్తికి ఆ పాటకు హీరోహీరోయిన్లు చేసే నృత్యపు కదలికలు ఒకసారి చూడగానే గుర్తుంటాయి. ఇలా, ప్రతి వ్యక్తి తనకు నచ్చిన అంశం త్వరగా గుర్తుంచుకోగలుగుతాడు. నచ్చని అంశాన్ని ఎంత ప్రయత్నించినా గుర్తుంచుకోలేడు. గుర్తుంచుకోగలగటం అన్నది ఏకాగ్రతకు సంబంధించిన విషయం.

ఓ విద్యార్థికి గణితశాస్త్రం అంటే భయం. ఎందుకంటే, లెక్కలు అతడికి అర్థం కావు కాబట్టి. కానీ, హఠాత్తుగా ఆ విద్యార్థికి లెక్కలు నేర్చుకోవటం పట్ల శ్రద్ధ కలిగింది. తోటి తెలివైన విద్యార్థుల వెంటబడి లెక్కలు చెప్పించుకోవటం ఆరంభించాడు. రాత్రింబగళ్ళు లెక్కలు సాధన చేయటం మొదలుపెట్టాడు. దాంతో అతడు ఆ తరగతిలో లెక్కల్లో మంచి మార్కులు సాధించటమే కాదు, భవిష్యత్తులో మంచి ఇంజినీరయ్యాడు. అతడికి హఠాత్తుగా లెక్కలపై ఆసక్తి కలగటానికి కారణం, లెక్కలకు కొత్త టీచర్ రావటం. ఎందుకో ఆ టీచర్ అంటే విద్యార్థికి మక్కువ కలిగింది. అతడి మెప్పు పొందాలన్న తపన కలిగింది. మెప్పు పొందాలంటే మంచి మార్కులు రావాలి. మంచి మార్కులు రావాలంటే, లెక్కలు రావాలి... ఇలా లెక్కలపై ఆసక్తి కలిగేందుకు టీచర్ ప్రేరణగా నిలిచాడన్నమాట. అంటే, మన మనసుకు నచ్చని విషయమైనా, ఏదో ప్రేరణ లభిస్తే, మనసు పెట్టే విషయంగా మారుతుందన్నమాట. పై ఉదాహరణలో విద్యార్థికి ప్రేరణ టీచర్ నుంచి లభించింది. ఈ ప్రేరణ వ్యక్తికి తన తల్లిదండ్రుల నుంచి లభించవచ్చు.

సోదరీసోదరుల నుండి లభించవచ్చు, సమాజం నుంచి లభించవచ్చు, సంస్కృతీ సంప్రదాయాల నుంచి లభించవచ్చు. లభించిన ప్రేరణను సరైన రీతిలో ఉపయోగించుకుని పైకి ఎదగటంలో వ్యక్తి వ్యక్తిత్వం ప్రధానపాత్ర వహిస్తుంది.

ధ్రువుడు తపస్సు చేసి ఆకాశంలో తారగా నిలిచేందుకు పట్టుదల తన తండ్రి ప్రేమను సంపాదించాలన్న కోరిక నుండి లభించింది. విశ్వామిత్రుడికి రాజర్షి అవ్వాలన్న ప్రేరణ వశిష్ఠుడిని మించాలన్న పట్టుదల నుంచి లభించింది. దివిజగంగను భువికి దింపాలన్న భగీరథుడి తపస్సుకు ప్రేరణ తన పూర్వీకులను రక్షించి తండ్రిని ఆనందింపచేయాలన్న తీవ్రమైన కోరిక నుంచి లభించింది. చిటికెన వేలితో గోవర్ధనగిరిని గొడుగుగా చేసే శక్తి శ్రీకృష్ణుడికి, ఇంద్రుడి అధికారదాహాన్ని అణచి ప్రజలను రక్షించాలన్న ఆకాంక్ష నుంచి లభించింది. అందరికన్నా ఉత్తముడుగా నిలవాలన్న ఆకాంక్ష అర్జునుడికి, పక్షి కన్ను తప్ప మిగతా ప్రపంచాన్ని అదృశ్యం చేయగల ఏకాగ్రతనిచ్చింది. 'చక్రి చింత లేని జన్మంబు జన్మమే?' అన్న విశ్వాసం ప్రహ్లాదుడికి ఎనలేని ఏకాగ్రత నిచ్చింది. పాములు కరచినా, కొండలపై నుండి దొర్లించినా, ఏనుగులతో తొక్కించినా విష్ణుభక్తిపై దృష్టిని నిలిపే అచంచల ఏకాగ్రత ప్రహ్లాదుడికి అలవడింది. గజేంద్రుడిని రక్షించాలన్న ఆత్రంతో, విష్ణువు దృష్టి మొత్తం గజేంద్రుడి మొర పైనే కేంద్రీకృతమైంది. దాంతో సిరికిం చెప్పక, శ్రీకుచోపరిచేలాంచలం కూడా వీడక వైకుంఠం వదిలి భూమి పైకి పరుగెత్తుకు వచ్చాడు విష్ణువు.

ఇలా చెప్తూ పోతే పురాణాలలో అడుగడుగునా వ్యక్తి ఏకాగ్రతకు ప్రేరణనిచ్చే అనేకాంశాలు లభిస్తాయి. ప్రేరణ అన్నది బయటి నుంచి లభించినా, అది మనస్సును తట్టి లేపినప్పుడే వ్యక్తి మిగతా విషయాలన్నిటినీ విస్మరించి ఏకాగ్రతను సాధిస్తాడని అర్థమవుతుంది. అందుకే 'ప్రేరణ దైవానిదైనా సాధించేది నరుడే' అంటారు.

ఇక్కడే మనం మరో విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. విషయం ఏదైనా, ప్రేరణ ఏదైనా, అది మనిషి మనస్సును తట్టి లేపగలిగినప్పుడే అతడికి ఏకాగ్రత సిద్ధిస్తుంది. లేకపోతే ప్రేరణ ఎంత శక్తిమంతమైనదైనా, విషయం ఎంత గొప్పదైనా అవి ఎడారిలో కురిసే వర్షాలే అవుతాయి. అందుకే, కొందరు ఎంతో చిన్న విషయానికే స్పందించి ప్రేరణ పొందితే, మరి కొందరు ఎంత గొప్ప ప్రేరణ లభించినా బండరాళ్లలా కదలరు.

రోజూ వృద్ధులను చూస్తూంటాం. వ్యక్తుల మరణాల గురించి వింటూంటాం. కానీ అటువంటి దృశ్యాలను ఒక్కసారి చూడగానే సిద్ధార్థుడు గౌతముడయ్యాడు.

ప్రపంచాన్ని దుఃఖం నుంచి విముక్తం చేయాలని కఠోరదీక్షను అవలంబించగలిగాడు. హైందవధర్మాన్ని  సంరక్షించాలన్న ప్రేరణ ఎనిమిదేళ్లకే శంకరాచార్యులను సన్న్యాసి చేసింది. అది ముప్ఫయి ఏళ్ళ జీవితంలోనే కొన్ని యుగాలలో కూడా సాధించలేనన్ని కార్యాలను సాధించగలిగే ఏకాగ్రతను, శక్తిని ఇచ్చింది. దేశాన్ని జాగృతం చేసి, ప్రజలలో దేశభక్తి జ్యోతిని వెలిగించాలన్న పట్టుదల సావర్కర్‌కు ఇరవై అయిదేళ్ళ వయసులోనే, కొన్ని వేలమంది చరిత్రకారులు సాధించలేని పరిశోధనలు సాగించే పట్టుదలను, ఏకాగ్రతను ఇచ్చింది. 'సిపాయిల తిరుగుబాటు'పై విదేశీయులు కప్పిన ముసుగులు తొలగించి 'ప్రథమ స్వాతంత్ర్యపోరాటపు' వెలుగులను ప్రపంచానికి అందించేటట్టు చేసింది.

అయితే, ఒకోసారి ఒకే రకమైన ప్రేరణ వ్యక్తులలో విభిన్నదిశలలో ప్రయాణించేట్టు చేస్తుంది. తండ్రిపై ప్రేమ పరశురాముడిని గండ్ర గొడ్డలి ధరించేట్టు చేస్తే, శ్రీరాముడిని వనవాసానికి పురికొల్పింది. ప్రతీకారేచ్ఛ ఒక బాలుడిని ధ్రువుడిని చేస్తే, మరొకరిని రావణాసురుడుగా మలచింది. సౌందర్యారాధన ఒకరిని కవిని చేస్తే, మరొకరిని శిల్పిగా మలస్తుంది. ఇదే సౌందర్యారాధన ఒకడిని జారుడిని చేస్తే, మరొకరిని ఆధ్యాత్మికపు టంచులకు చేరేట్టు చేస్తుంది. సమాజోద్ధరణ ఒకరిని కమండలం ధరించేట్టు చేస్తే, మరొకరిని కత్తి పట్టేట్టు చేస్తుంది. మోక్షసాధనలక్ష్యం ఒకరిని వాగ్గేయకారుడిని చేస్తే, మరొకడిని సన్న్యాసిని చేస్తుంది.

అంటే ప్రేరణ ఏదైనా ఫలితమన్నది వ్యక్తి 'జీవితలక్షణం' మీద ఆధారపడి ఉంటుందన్నమాట. ఒకే వర్షం ఆకాశం నుంచి కురిసినా, ఏయే చోట ఏయే మొక్కలు మొలుస్తాయన్నది ఆ వర్షం కురిసిన క్షేత్రంలో నిక్షిప్తమై ఉన్న బీజాలపై ఆధారపడి ఉంటుందన్నమాట. ఆ క్షేత్రం బండరాయి అయితే నీరు కిందికు జారిపోతుంది. ఎడారి అయితే ఆవిరైపోతుంది. కాబట్టి ప్రతి వ్యక్తికీ ప్రత్యేకప్రేరణ అవసరం. అన్ని రోగాలకూ ఒకే మందు సరిపోనట్టు, వ్యక్తులందరినీ ఒకే గాటకి కట్టి ఒకే ప్రేరణ ఒకే ఫలితాన్నివ్వాలని ఆశిస్తే కుదరదు.

ఈ సందర్భంలో మనం మరో ప్రధాన అంశాన్ని తెలుసుకోవాల్సి ఉంటుంది. భారతీయతత్త్వం ప్రపంచమంతా 'ఒకే ఆత్మ భిన్నరూపం' అంటుంది.

*యథా ప్రకాశయత్యేకః కృత్స్నం లోకమిమం రవిః।*
*క్షేత్రం క్షేత్రీ తథా కృత్స్నం ప్రకాశయతి భారత॥*

ఒకే సూర్యుడు జగత్తునంతా వెలిగించే విధానంగా, ఒకే ఆత్మ సర్వక్షేత్రాలనూ ఉద్దీపింపచేస్తున్నాడు. అంటే, వేర్వేరు ప్రాంతాలలో వేర్వేరు సూర్యులు లేనట్టు, వేర్వేరు శరీరాల్లో వేర్వేరు ఆత్మలు లేవన్నమాట.

ఇటువంటప్పుడు ఒకే ప్రేరణకు వేర్వేరు స్పందనలు ఫలాలుగా ఎలా వస్తున్నాయన్న సందేహం జనిస్తుంది. ఈ సందేహనివృత్తి ఏకాగ్రతసాధనలో తొలి అడుగు వంటిది. ఎందుకంటే, ఏదైనా విషయంపై ఏకాగ్రత కుదరాలంటే, ముందుగా ఆ విషయం గురించిన అవగాహన ఉండాలి. ఆ విషయం మనకు అర్థం కావాలి. అర్థం కాని విషయాలపై మనకు ఆసక్తి పోతుంది. ఆసక్తి లేకపోతే ఏకాగ్రత కుదరదు.

ఉదాహరణకు మనం పది భాషల పాటలు ఒకేసారి విన్నా, మనకు అర్థమయ్యే భాష పాటనే గుర్తుంచుకుంటాం. ఇతరభాషల పాటల బాణీలు బావున్నా, ఆకర్షణీయంగా ఉన్నా, అర్థమయ్యే భాష పాటలో పదాలే గుర్తుంటాయి. అలాగే, పూజలు, పెళ్లిళ్ల వంటి సందర్భాలలో పూజారి గడగడా చదివే మంత్రాలపై మన దృష్టి నిలవదు. మనసు అటూ ఇటూ పరుగెడుతూంటుంది. కానీ, మనకు తెలిసిన మంత్రం రాగానే ఒక్కసారిగా మన దృష్టి మంత్రం వైపు కేంద్రీకృతమౌతుంది.

ఇది మంత్రం విషయంలోనే కాదు, పాఠం విషయంలోనూ, పాటల విషయంలో కూడా వర్తిస్తుంది. ఓ వ్యక్తి ఇచ్చే ఉపన్యాసం అర్థం కాక బోరుగా ఉన్నా, దాన్లో మనకు తెలిసిన విషయం ప్రసక్తి రాగానే ఉపన్యాసం వైపు దృష్టి కేంద్రీకృతమౌతుంది. దేనిపై మనకు ఆసక్తి ఉందో, ఆ విషయం మనం మరచి పోవటం జరగదు.

కాబట్టి ఏకాగ్రత కుదరాలంటే, ఒకే విషయంపై దృష్టి కేంద్రీకృతమవ్వాలంటే, ఆ విషయం గురించిన అవగాహన ఉండాలి. జ్ఞానం ఉండాలి అన్నది అత్యంత ఆవశ్యకమైన అంశం అన్నమాట. ఒకే ప్రేరణ విభిన్నవ్యక్తులలో వేర్వేరు రకాలుగా స్పందనలు కలిగించటం గురించి వచ్చేవారం చర్చిద్దాం.

## ప్రేరణ – స్పందన

*అవజాన మాంతి మూఢాః మానుషీం తనుమాశ్రితమ్।*
*పరం భావ మజానంతో మమ భూతమహేశ్వరమ్॥*
*మోఘాశా మోఘ కర్మణో మోఘ జ్ఞానా విచేతసః*
*రాక్షసీ మాసురీం చైవ ప్రకృతిం మోహినీంశ్రితాః॥*

వ్యర్థమైన కోరికలు కలిగి, నిష్ప్రయోజనాలైన కర్మలు ఆచరిస్తూ, నిష్ఫలజ్ఞానులు, వివేకశూన్యులైన మూఢులు హింసాత్మక రాక్షసతామస ప్రకృతిని, ఆసురమైన కామపూరితమైన రాక్షసప్రకృతిని, మోహజనకమైన అవిద్యనాశ్రయించి, నా స్వరూపాన్ని గ్రహించలేక నన్ను మానవశరీరంలో ఉండటం వల్ల సామాన్యమానవుడుగా భావించి అవమానిస్తారు.

భగవద్గీతలో అర్జునుడికి అతిరహస్యమైన విజ్ఞానంతో కూడిన జ్ఞానాన్ని ఉపదేశించే సందర్భంలో శ్రీకృష్ణుడు పై సత్యం తెలిపాడు. ప్రపంచం మొత్తం భగవత్స్వరూపమే అయినా అందరూ సమానమే అయినా, వ్యక్తుల నడుమ అనేక అంశాలలో తేడాలుండటాన్ని అత్యంతతాత్త్వికంగా, మానసికశాస్త్రపరంగా, భౌతికశాస్త్రపరంగా, అనేక విభిన్నకోణాలలో వివరిస్తున్నాడు భగవంతుడు.

భౌతికశాస్త్రప్రకారం ప్రపంచంలో పదార్థాలన్నీ అణువులమయం. అణువులన్నీ ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లమయం. తరచి చూస్తే ఈ ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు కూడా మరింత సూక్ష్మమైన కణాలమయం. ఇంకా లోతుకు వెళ్లి చూస్తే ఈ కణాలన్నీ శక్తి స్వరూపాలే. అంటే విశ్వం మొత్తం శక్తిమయం. ఆ శక్తి ధరించే భిన్నరూపాలు మనం అనుభవిస్తున్న వైవిధ్యం.

మెరుపు శక్తిరూపం. గాలి శక్తిరూపం. నీరు శక్తిస్వరూపం. ప్రాణం శక్తికి మరో రూపం. శబ్దం శక్తి. అణువులో శక్తి, పరమాణువు శక్తి. ఎలక్ట్రాన్ ఋణాత్మక శక్తి. ప్రోటాన్ ధనాత్మకశక్తి. శూన్యం అర్థం కాని అలౌకికశక్తి. వెలుతురు శక్తి, వేడి శక్తి. విశ్వమంతా శక్తి. అంటే ఈ జగత్తంతా శక్తి. జగత్తు అణువణువులో కణకణంలో శక్తి ఉంది. కానీ 'శక్తి'లో జగత్తు లేదు. ఈ సత్యాన్ని భగవద్గీత స్పష్టం చేస్తుంది.

*మయా తతమిదం సర్వం జగదవ్యక్త మూర్తినా।*
*మత్ స్థాని సర్వభూతాని న చాహం తేష్వవస్థితః॥*

ఈ జగత్తంతా అవ్యక్తరూపుడైన నాచే వ్యాపించబడిఉంది. భూతజాలాలన్నీ నాలోనే ఉన్నాయి. కానీ నేను మాత్రం వాటిలో లేను.

అంటే అణువులో, పరమాణువులో, నీటిలో, నింగిలో, గాలిలో, ధూళిలో, ప్రాణిలో, ప్రాణంలో – అన్నిటిలోనూ అదే శక్తి ఉంది. కానీ ఇవేవీ ఆ శక్తిలో లేవు. భౌతికశాస్త్రం కూడా దీన్ని సమర్థిస్తుంది. ఈ నిజాన్ని గుర్తించిన తరువాత, ఒకే శక్తి అన్నిటిలో ఉన్నా ప్రతి ఒక్కటి, వేర్వేరుగా, ప్రత్యేకంగా మనగలగటం వైపు దృష్టి సారించాలి.

గమనిస్తే, మనం చూస్తున్న ప్రతీదీ ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల కలయికతో ఏర్పడినదే. ప్రతి అణువు, పరమాణువులలో ఉన్నాయి. అవే ఎలక్ట్రాన్లు. అవే ప్రోటాన్లు. కానీ వాటి సంఖ్యలో మార్పుతో మూలకంలో మార్పు వస్తుంది. అలాగే ఒకే మూలకం విభిన్న సందర్భాలలో విభిన్నంగా ప్రవర్తిస్తుంది. సృష్టిలోని జీవులన్నీ కర్బనం (కార్బన్) భిన్న రూపాల ఫలితాలు. మానవశరీరం మొత్తం కార్బనే. చివరికి మనం విడిచే ఊపిరిలో కార్బన్-డై-ఆక్సైడ్ ఉంది. కానీ జీవులన్నీ ఒక దానికి మరొకటి భిన్నం.

వజ్రం, బొగ్గు, - రెండూ కార్బన్ ప్రతిరూపాలే. అదే కార్బన్ ఆక్సిజన్‌తో కలిస్తే కార్బన్-డై-ఆక్సైడ్ ఏర్పడుతుంది. మామూలు వాతావరణంలో వాయురూపంలో ఉంటుంది. ఒత్తిడికి గురైతే కార్బన్ బొగ్గుగా మారుతుంది. మరింత ఒత్తిడికి, వేడికి గురైతే వజ్రంగా మారుతుంది. ఇంతకీ ఆక్సిజన్, క్లోరిన్, నత్రజని, కార్బన్ వంటి మూలకాలన్నీ ఎలక్ట్రాన్ ప్రోటాన్లమయమే. కానీ పరిస్థితులను బట్టి, ఏ మూలకంతో కలిశాయన్నదాన్ని బట్టి వాటి స్వరూపస్వభావాలుంటాయి.

ఆక్సిజన్ మామూలుగా చూస్తే మండే వాయువు. మనం పీల్చే గాలిలో ఆక్సిజన్ ఉంటుంది. శరీరంలోని వివిధ మూలకాలను మండించి శక్తిని వెలువరించటంలో ఆక్సిజన్ తోడ్పడుతుంది. అదే ఆక్సిజన్ హైడ్రోజన్‌తో కలిస్తే ప్రాణాధారమైన నీరు ఏర్పడుతుంది. నైట్రోజన్, హైడ్రోజన్, ఆక్సిజన్‌లు కలిస్తే అనేక విటమిన్లు, ప్రోటీన్లు ఏర్పడతాయి. అంటే, తరచి చూస్తే సూక్ష్మస్థాయిలో ఏకశక్తిరూపమైన ప్రపంచం, ఎదుగుతున్న కొద్దీ పరస్పర విభిన్నమైన అంశాలుగా ప్రతిఫలితమౌతోందన్నమాట. మనిషి కూడా అంతే!

సూక్ష్మరూపంలో, తరచి చూస్తే మనుషులంతా ఒక్కటే. అందరూ సమానమే. అందరిలో ప్రవహించే ప్రాణస్వరూపం ఒక్కటే. అందరినీ నడిపించే శక్తి ఒక్కటే. కానీ స్థూలరూపానికి వచ్చేసరికి, ఏ ఒక్కరూ మరొక్కరిలా ఉండరు. ప్రతి వ్యక్తీ, తనకు మాత్రమే ప్రత్యేకమైన భిన్నప్రపంచం వంటివాడు.

ఎలాగైతే ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లు కలయికల వల్ల విభిన్నమూలకాలు ఏర్పడతాయో, విభిన్నమూలకాల కలయికల వల్ల పరస్పర విరుద్ధమైన పదార్థాలు ఏర్పడతాయో, అలాగే ఏకశక్తిస్వరూపమైన మనుషులు, స్వభావాలు, వాతావరణాల వల్ల వేర్వేరుగా కనిపిస్తారు. కొందరు తెలివైనవారుగా, కొందరు తెలివితక్కువవారుగా, కొందరు అద్భుతమైన ప్రజ్ఞ కలవారుగా, కొందరు ఎందుకూ పనికిరానివారుగా ఎదుగుతారు. ఈ తేడాలన్నీ స్థూల ప్రపంచానికే కానీ సూక్ష్మప్రపంచానికి కాదు.

ఒక ఎలక్ట్రాన్ ఉంటే అది హైడ్రోజన్ అవుతుంది. ఆరు ఎలక్ట్రాన్లు, ప్రోటాన్లుంటే అది కార్బన్ అవుతుంది. ఎనిమిది ఉంటే ఆక్సిజన్ అవుతుంది. అంటే చూడటానికి మూలకాల్లో, లక్షణాల్లో పైకి ఎంత తేడా ఉన్నా, లోపలకు వెళ్ళి చూస్తే అన్నీ ఒకటే. మనిషి కూడా అంతే. ఈ నిజం గ్రహిస్తే ఒక మహత్తరసత్యం బోధపడుతుంది.

మనుషులంతా ఒకటే. వారిలో నిక్షిప్తమై ఉన్న శక్తి ఒక్కటే. మనుషుల నడుమ హెచ్చుతగ్గులు లేవు. ఎలాగైతే మెరపులో శక్తి, నీటిలోని విద్యుచ్ఛక్తి ఒకే శక్తి భిన్న స్వరూపాలో, అలాగే ఒకరిలోని సంగీతశక్తి, మరొకరి రచనాశక్తి, ఇంకొకరి వాగ్ధాటి, ఇంకొకరి రాళ్ళు కొట్టే శక్తి అన్నీ ఒకే శక్తి భిన్నస్వరూపాలు. తేడా అల్లా వ్యక్తి తనలోని శక్తిని గుర్తించి ఉపయోగపడటంలో ఉంటుంది. తనలోని ఈ శక్తిని గుర్తించటమే వ్యక్తిత్వ వికాసానికి పరాకాష్ఠ.

ఈ దృష్టితో చూస్తే, ఏకాగ్రత సాధనలోని మర్మం బోధపడుతుంది. కొందరికి వెంటనే ఏకాగ్రత కుదరటం, మరి కొందరికి ఎంత ప్రయత్నించినా కుదరకపోవటం ఎందుకో అర్థమౌతుంది. కానీ ప్రయత్నిస్తే ప్రతి ఒక్క వ్యక్తికీ అద్భుతమైన ఏకాగ్రతశక్తి అలవడుతుందనీ అర్థమౌతుంది. ఎందుకంటే ప్రతి వ్యక్తిలో నిక్షిప్తమై ఉన్న శక్తిస్వరూపం ఒక్కటే.

ఇక్కడే భగవద్గీతలో వ్యక్తిత్వవికాసానికి భగవంతుడు, అర్జునుడికి చూపించిన మార్గం స్పష్టమౌతుంది.

అందరిలో తానే ఉన్నాడు. అందరిదీ ఒకటే శక్తి. వ్యక్తులలో ప్రవృత్తులన్నిటికీ తానే కారణం. వ్యక్తులలో కోరికలు కలిగించేదే తానే. కోరికలు నశింప జేసేదీ తానే. కానీ వ్యక్తిలోని ప్రవృత్తులలో సాత్త్వికప్రవృత్తి తాను. విద్యలు, అవిద్యలూ అన్నీ తానే. కానీ విద్యలలో ఆధ్యాత్మవిద్య తాను. వాదాలలో సక్రమవాదం తాను. అక్షరాలలో 'అ' కారం తాను.

మంచి, చెడు రెండూ తానే. కానీ ఈ రెంటిలో 'మంచి' తాను అంటున్నాడు. వ్యక్తి ముందు మంచి, చెడు రెండూ ఉంచి, రెండూ తన స్వరూపాలే అని చెప్తూ, ఈ రెంటిలో 'మంచి' నేను అని చెప్పటం ఎందుకంటే, వ్యక్తికి 'మంచి' ఏదో చూపించేందుకు తనలో కలిగే భావనలోంచి, వ్యక్తి 'ఇచ్ఛాశక్తి'ని ఉపయోగించి, మంచిని ఎంచుకోమని సూచిస్తున్నాడన్నమాట.

అందుకే, నిష్ప్రయోజనాలైన కర్మలు ఆచరించేవారు, నిష్ఫలజ్ఞానులు, వివేక శూన్యులైన మూఢులు, హింసను అనుసరించేవారు, కామానికి లొంగిపోయేవారు మానవరూపంలో ఉన్న తనని గ్రహించలేరని అర్జునుడికి బోధించాడు. తనలోని శక్తిని గుర్తించాలంటే వ్యక్తికి ఏకాగ్రత అవసరం. దృష్టిని, సర్వేంద్రియాల శక్తిని తనలో దేదీప్యమానంగా వెలుగుతున్న జ్యోతిపై కేంద్రీకరించగలగాలి. అలా కాకపోతే కళ్లున్న గుడ్డివాడిలా తన శక్తిని మనిషి గుర్తించలేడు. 'ఏకాగ్రత' అన్నది ఆసక్తి నుంచి వస్తుంది. 'ఆసక్తి'కి తెలుసుకోవాలన్న భావన కారణం. ఈ ఆసక్తి విజ్ఞానాసక్తి కావాలి. విజ్ఞానం నుంచి విచక్షణ వస్తుంది. విచక్షణ వివేకం అవుతుంది. వివేకం ఏకాగ్రతగా పరిణమిస్తుంది. ఏకాగ్రత అంతఃశోధనకు సహకరిస్తుంది. అంతఃశోధనతో వ్యక్తి సత్యాన్ని గుర్తిస్తాడు. తన శక్తిని గ్రహిస్తాడు. వ్యక్తిత్వవికాసం సాధిస్తాడు.

## ఏకాగ్రత సాధన

ఏకాగ్రత సాధన అన్నది వ్యక్తిత్వవికాసానికి కేంద్రం వంటిది. ఎప్పుడైతే వ్యక్తి, సర్వశక్తులనూ ఒక అంశంపై కేంద్రీకరించగలుగుతాడో అప్పుడు ఆ వ్యక్తి లక్ష్యసాధన దారిలో అడ్డంకులు అన్నీ తొలగిపోతాయి. విజయం తథ్యం అవుతుంది. అయితే, ఈ ప్రపంచంలో ఒక సూత్రం ఉంది. ఏదైతే విజయానికి దారి తీస్తుందో, ఆ అంశం ఎంత సులభమైందో, దాని సాధన అంత కఠినమైంది.

మానవమనస్సు నిత్యచంచలమైంది. దృష్టి ప్రసరించినంత మేరకే కాదు, దృష్టికి అందని అంశాల వైపు కూడా అది పరుగులిడుతూంటుంది. పరుగు వ్యర్థం అని తెలుస్తున్నా ఆగకుండా పరుగెత్తటం మనస్సు లక్షణం. అటువంటి మనస్సును నిశ్చలంగా ఒక విషయంపై కేంద్రీకరింపచేయటం అంటే గాలిని బంధించటం వంటిది. కాంతిని అడ్డుకోవటం వంటిది. అయినా సరే ఇటువంటి అసాధ్యమైన పని సాధ్యమేనని మన పూర్వీకులు ప్రయోగాలు చేసి నిరూపించారు. ఏకాగ్రత సాధనకు మార్గాలు సూచించారు.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే, ఎలాగైతే అన్ని పదార్థాలు ఎలక్ట్రాన్, ప్రోటాన్ల కలయిక వల్ల ఏర్పడుతున్నవే అయినా, వాటి కలయికల్లో తేడాల వల్ల వస్తు స్వరూపస్వభావాల్లో తేడాలు కనిపించేట్టు, మనుషులంతా ఒకే శక్తిస్వరూపాలైనా అందరి ఏకాగ్రతా ఒకే అంశంపై కుదరదు. ఏకాగ్రత విషయంలో ప్రతి వ్యక్తి శక్తి తీవ్రతలో తేడాలుంటాయి.

సచిన్ టెండూల్కర్ క్రికెట్ ఆట గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరం లేదు. క్రికెట్‌లాగే ఆడే 'బేస్‌బాల్' ఆట ఆడమంటే టెండూల్కర్ ఆడలేడు. అది కూడా

బంతి విసిరితే బ్యాటుతో కొట్టాల్సిన ఆటే. అయినాసరే సచిన్‌కు క్రికెట్‌లో కుదిరిన ఏకాగ్రత మరే ఆటలో కుదరదు. అలాగే, పండిత రవిశంకర్ సితార్ వాదనకు ప్రపంచం పరవశిస్తుంది. 'సితార్' వాయించే సూత్రాలే అమలు జరిపే ఇతర తీగ వాద్యాలు ఆయన మాట వినవు.

సులభంగా అర్థమయ్యే క్రికెట్ ఆట ఉదాహరణ దగ్గరకు వస్తే, అదే ఆట అయినా ఒకో ఆటగాడి ఆట తీరూ ఒకో రకంగా ఉంటుంది. సచిన్, లారా, పాంటింగ్, ద్రావిడ్, గంగూలీ, ధోనీ – ఇలా చెప్తూ పోతే విసిరిన బంతిని బ్యాటుతో కొట్టటమనే ఒకే పని తీరు, మనిషి స్వభావంతో మారుతుంది. ప్రతి వ్యక్తి ఆట తీరూ అతడి వ్యక్తిత్వాన్ని ప్రతిఫలిస్తుంది. ఇది స్పష్టంగా అర్థం చేసుకోవాల్సిన విషయం.

మానవస్వభావంలోనే అనుకరణ అన్నది ఉంది. పిల్లవాడు పెద్దలను అనుకరిస్తాడు. ఎదుగుతున్నకొద్దీ తనదైన పద్ధతిని ఏర్పాటు చేసుకుంటాడు. ఇతరులు అతడిని అనుకరిస్తారు. కాబట్టి 'సచిన్'లానే అందరూ ఆడాలనుకోవటం కుదరని పని. ఆడిన ప్రతివారూ సచిన్ అవ్వాలనుకోవటం కూడని పని. ఒక వ్యక్తి చీకటి గదిలో కూర్చుని ఓంకారం వైపు చూస్తూ ఏకాగ్రత సాధించాడని, ప్రతి ఒక్కరూ అలాగే ఏకాగ్రత సాధించాలనుకోవటం, సాధించగలమని అనుకోవటం వెర్రితనం అవుతుంది.

ప్రతి వ్యక్తీ, ఏ విషయం తన మనస్సుకు నచ్చుతోందో, ఏ విషయం పై ఏకాగ్రత కుదురుతోందో గ్రహించాలి. ఇంతవరకూ వ్యక్తిత్వవికాసమార్గంలో మనం ప్రస్తావించిన అంశాలన్నీ వ్యక్తి తనని తాను అర్థం చేసుకునేందుకు తోడ్పడతాయి. తద్వారా తన స్వభావాన్ని, తన పరిమితులను, తన శక్తిని వ్యక్తి గ్రహించగలుగుతాడు. అలా గ్రహించిన వ్యక్తి తనకు నచ్చిన అంశం, ఆసక్తి కల అంశంపై దృష్టిని కేంద్రీకరించాలి. ఏకాగ్రత అలవడటం సులభమౌతుంది.

పిల్లలకు మనం పురాణకథలు చెప్తాం. అందరూ కథలు ఆసక్తిగా వింటారు. కానీ తరచి చూస్తే మనం అందరినీ కూచోబెట్టి, ఒకే రకంగా కథలు చెప్పినా, అన్ని కథలూ అందరి పిల్లల మనస్సుకూ పట్టవు... కొందరికి రాముడి కథ నచ్చితే, మరి కొందరి మనస్సులలో కృష్ణుడి అల్లరి మిగిలిపోతుంది. ఇంకొందరికి అర్జునుడు నచ్చితే, మరి కొందరికి ప్రహ్లాదుడు నచ్చుతాడు. ప్రతి వ్యక్తిలో అతనికే ప్రత్యేకమైన సంస్కార బీజం ఉంటుంది. ఆ సంస్కారం వల్ల అతడు అన్ని విషయాలకూ స్పందించినా, కొన్ని విషయాలకు మాత్రం ప్రత్యేకంగా స్పందిస్తాడు. ఏ విషయాలు అతడిలో ప్రత్యేకస్పందనను

కలిగిస్తున్నాయో గుర్తించటం, దానిపై దృష్టి కేంద్రీకరించటం ఏకాగ్రత సాధనకు మొదటి మెట్టు.

కానీ, ప్రస్తుతసమాజంలో ఎవరికీ అంత ఓపిక, తీరిక, ఆలోచన ఉండటం లేదు. పిల్లవాడి ఆసక్తిని గమనించి అతని శక్తిని ఆ దిశలో మళ్లించే ఓపిక ఎవరికీ ఉండటం లేదు. తమ అభిప్రాయాలు, నిర్ణయాలు పిల్లలపై రుద్దటం జరుగుతోంది. దాంతో స్వతహాగా ఉన్న తెలివి వల్ల జీవితంలో ఓ స్థాయి సాధించినా, అంతర్గతంగా తనకే తెలియని అశాంతికి గురవుతున్నాడు వ్యక్తి. ఏ విషయం పైనా దృష్టిని నిలపలేక, సాధిస్తున్నదాని వల్ల సంతృప్తి పొందలేక సతమతమవుతున్నాడు. మాదకద్రవ్యాల వాడకం, మత్తు మందులకు బానిసలవటం, దొంగ ఆధ్యాత్మికగురువులకు లొంగిపోవటం వంటి వికృతులన్నీ ఈ అశాంతి ఫలితాలే.

అయితే కొన్ని సందర్భాలలో, కొందరు కొన్నాళ్ళకు తమ అసలు వ్యక్తిత్వాన్ని గుర్తిస్తారు. అటువంటివారు విజేతలుగా నిలచి మార్గదర్శకులవుతారు. వివేకానందుడుగా ఎదగక ముందు నరేంద్రునికి తనకేం కావాలో తెలియదు. కానీ ఒక్కసారి తన ఆధ్యాత్మిక దృష్టిని గ్రహించి, సర్వశక్తులనూ ఆ వైపు కేంద్రీకృతం చేయటంతో, ఆయన సమస్తహిందూ సమాజాన్నీ జాగృతం చేయగల శక్తిగా రూపాంతరం చెందాడు.

అరబిందో జీవితం గమనిస్తే ఈ విషయం మరింత స్పష్టమౌతోంది. తండ్రి కోరిక మేరకు పై చదువులకు ఇంగ్లాండ్ వెళ్లాడు. తనకా చదువులపై ఆసక్తి లేదని గ్రహించి స్వచ్ఛందంగా పరీక్షలో ఫెయిలై తిరిగి వచ్చాడు. కొన్నాళ్ళు రాజాస్థానాల్లో ఉద్యోగాలు చేశాడు. విప్లవకారుడయ్యాడు. కానీ ఎక్కడా ఆయనకు శాంతి లభించలేదు. తనని తాను తెలుసుకున్న మరు క్షణం ఆయన 'అరవింద యోగి' అయ్యాడు.

ఇంకా విభిన్నవ్యక్తిత్వాల వైపు దృష్టిసారిస్తే అనేక ఆసక్తికరమైన అంశాలు మనకు తెలుస్తాయి.

కాళిదాసు మహాకవి గురించి అనేకకథలు ప్రచారంలో ఉన్నాయి. ఆయన మూర్ఖుడని, తెలివి హీనుడని, హఠాత్తుగా ఒక రోజు కాళికామాత ప్రసన్నమైందని, అప్పటినుంచీ ఆయన నాలికపై సరస్వతి నాట్యమాడుతోందని అంటారు – అంటే, తన అసలు ఆసక్తి 'సాహిత్యసృష్టి' అని కాళిదాసు గ్రహించిన క్షణం, మాత ప్రసన్నమైన క్షణం అన్నమాట. అత్యంతనిగూఢంగా, ప్రతీకాత్మకంగా వ్యక్తి తనని తాను తెలుసుకోవటాన్ని సూచిస్తుందీ కథ.

'భక్త కన్నప్ప' (తిన్నడు) కథ కూడా మనకు తెలుసు. వేటగాడు, జాలి, కరుణ లేని వీరుడు అయిన కన్నప్ప, శివభక్తి తన సంస్కారం అని తెలుసుకున్న మరు క్షణం పరమశివభక్తుడయ్యాడు. ముక్కంటికి తన కన్ను అర్పించుకుని అమరజీవుడయ్యాడు.

తులసీదాసు, తుకారాం, వేమన, కబీరు, త్యాగయ్య, అన్నమయ్య... ఇలా విభిన్న రంగాలలో ఉత్తమత్వానికి ప్రతీకలుగా నిలిచినవారంతా, జీవితం ఆరంభంలో విభిన్నమైన వృత్తులు, ప్రవృత్తులు ప్రదర్శించినవారే. కానీ, తమ జీవలక్షణాన్ని స్పందింపచేయగల అంశాన్ని గ్రహించిన తరువాత, ఇతర ప్రపంచం వారికి అదృశ్యమైపోయింది. వారి దృష్టి సర్వం ఒకే అంశంపై నిలిచింది. ఎటువంటి అశాంతులు, సంశయాలు, సందిగ్ధాలు లేక వారు విజేతలయ్యారు. మార్గదర్శకులయ్యారు. ఈ అద్భుతసత్యాన్ని భగవద్గీత అత్యంత నిగూఢంగా వివరిస్తుంది.

*న కర్తృత్వం న కర్మాణి లోకస్య సృజతి ప్రభుః ।*
*న కర్మఫల సంయోగం స్వభావస్తు ప్రవర్తతే ॥*

భగవంతుడు జీవునికి కర్తృత్వంగానీ, కర్మాచరణంగానీ కల్పించడు. కర్మఫలం పైన ఆసక్తి కూడా ఆయన సృజించడు. ప్రకృతి స్వభావాన్ని అనుసరించే ఇవన్నీ క్రమంగా నేర్పబడతాయి.

ఏ మూలకంలో ఉన్నా ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల స్వభావంలో మార్పుండదు. కానీ ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల సంఖ్యను బట్టి మూలకం స్వభావం మారుతూంటుంది. దాని ప్రవర్తన మారుతూంటుంది. మనిషి కూడా ఇంతే. మౌలికంగా మనుషుల స్వభావాలలో తేడా లేదు. వారికి అందిన సంస్కారం, పెరిగిన వాతావరణం, వారి అనుభవాలు, అవి నేర్పే పాఠాల వల్ల మనుషులలో తేడాలు కనబడుతూంటాయి.

ఇక్కడే మరో అద్భుతమైన సత్యాన్ని అర్థం చేసుకోవాలి. క్రికెట్ ఆటలో ప్రావీణ్యం, సితార్ వాద్యంపై పట్టు, సాహిత్యరచనను పటిమ, సంగీతకళానైపుణ్యం, ఆధ్యాత్మిక శిఖరాల అధిరోహణం అన్నీ ఒకే శక్తి ధరించే పలు రూపాలు. ఎప్పుడైతే వ్యక్తి తన సర్వశక్తులనూ 'ఏక' అంశంపై కేంద్రీకృతం చేస్తాడో అప్పుడు, అతడు ప్రజల మన్నన పొందుతాడు. ఇదీ ఏకాగ్రత సాధన ఆరంభంలో గ్రహించాల్సిన విషయం.

కొందరికి భగవంతుడు, రాముడి రూపంలో ఉంటే ఏకాగ్రత కుదురుతుంది. కొందరికి కృష్ణుడి రూపంలో ఉండాలి. ఇంకొందరికి హనుమంతుడిపై దృష్టి కేంద్రీకృతమౌతుంది. మరి కొందరికి ఏ రూపం లేని శక్తిపై దృష్టి నిలుస్తుంది. కానీ,

దేని పైనో ఒక దాని పైన దృష్టి నిలపటం ప్రధానం. ఈ దృష్టి నిలవటం తోటే వ్యక్తి తనలోని నిక్షిప్తమై ఉన్న శక్తి ప్రత్యేకతను గుర్తించటంలో ఒక అడుగు ముందుకు వేసినట్టన్న మాట.

*బ్రహ్మార్పణం బ్రహ్మహవిః బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్ ।*
*బ్రహ్మైవ తేన గన్తవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥*

యజ్ఞం చేసేవాడు, హోమం చేసే ద్రవ్యాలు, వాటిని హుతం చేసే అగ్ని, అన్నీ పరబ్రహ్మస్వరూపాలే. యజ్ఞఫలితం బ్రహ్మార్పణమే. సర్వకర్మలు యజ్ఞ దృష్టితో చూడటమే బ్రహ్మకర్మ సమాధినిష్ఠ.

ఈ శ్లోకం ఆధ్యాత్మికఅర్థాన్ని నిత్యజీవితంలోని మామూలు నిత్యకర్మలకు అన్వయించుకుంటే ఏకాగ్రతసాధనదిశలో మొదటి అడుగు వేసినట్టే.

## ఏకాగ్రత - పద్ధతులు

*ఆత్మశుద్ధి లేని యాచార మదియేల*
*భాండశుద్ధి లేని పాక మేల*
*చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా*
*విశ్వదాభిరామ వినుర వేమ.*

మనస్సు నిర్మలంగా ఉంచుకోక పాటించిన ఆచారాలు, పాత్రలు శుభ్రంగా ఉంచక చేసిన వంటలు నిష్ప్రయోజనాలు. అలాగే భక్తి లేని పూజలు ఎన్ని చేసినా ఫలితం ఉండదు.

'చిత్తం శివుని మీద, భక్తి చెప్పుల మీద' అని ఒక సామెత ఉంది. ఏకాగ్రత దెబ్బ తినటంలో ప్రధానపాత్ర వహించే అంశాన్ని సూచనప్రాయంగా చెప్తుంది ఈ సామెత. గుడికి వెళ్ళిన వ్యక్తి దృష్టి గుడిలోని దైవంపై ఉండాలి. తన మనసులో నిలిచిన జ్యోతిపై ఉండాలి. కాని అందుకు భిన్నంగా గుడిలో అడుగు పెట్టినప్పటి నుంచి వ్యక్తి దృష్టి, తాను బయట విడిచిపెట్టిన చెప్పులపై ఉంటే?

మనసు చాలా అద్భుతమైంది. కొన్ని విషయాలలో ఎంత మందకొడిగా ఉంటుందో, మరి కొన్ని విషయాల్లో అంత చురుకుగా పని చేస్తుంది. 'తన చెప్పులు పోతాయేమో' అన్న భయం కలిగిన మరు క్షణం వ్యక్తి ఆలోచనలు ఎంతో వేగంగా పరుగెడుతాయి. అతని కళ్ళ ముందు ఎవరో తన చెప్పులు వేసుకొని వెళ్ళిపోతున్న దృశ్యం కనిపిస్తుంది.

ఆ వెంటనే తాను వెళ్ళి చెప్పుల కోసం వెతకటం, అవి కనబడకపోవటం కళ్ళ ముందు కదులుతాయి.

ఇప్పుడు చెప్పులు లేకపోతే ఎలా? కొనేందుకు జేబులో డబ్బెంత ఉంది? దగ్గరలో దుకాణం ఉందా? అది వెతుక్కుంటూ ఉట్టి కాళ్ళతో వెళ్ళాల్సి ఉంటుంది. దారిలో ముళ్ళు గుచ్చుకుంటే? రాళ్ళు కాళ్ళలో దిగబడితే? డాక్టర్ దగ్గరలో ఉన్నాడో, లేడో? చెప్పులు లేకుండా నడుస్తూంటే చూసేవాళ్ళు ఏమనుకుంటారో?

ఇటువంటి ఎడతెగని గొలుసు ఆలోచనలతో వ్యక్తి దృష్టి తప్పు దారి పడుతుంది. ప్రదక్షిణలు చేస్తున్నా, విగ్రహం ముందు నిలబడి చేతులు జోడిస్తున్నా, త్వరగా వెళ్ళి తన చెప్పులను కాపాడుకోవాలన్న ధ్యాస అతడికి ఏకాగ్రతను కుదరనివ్వదు.

అంటే వ్యక్తికి ఏకాగ్రత కుదరకపోవటంలో ప్రధానపాత్ర వహించేది 'వ్యాకులత'. ఏదో ఓ విషయంపై ఆరాటం ఉండటం వల్ల వ్యక్తి దృష్టి ఒక అంశంపై నిలవదు. గాబరాగా ఉంటుంది. పిల్లలను భర్తను ఆఫీసుకు పంపి, ప్రశాంతంగా పూజ చేసుకోవాలిన అనుకున్న గృహిణి మనస్సు పిలల్ల చుట్టే తిరుగుతుంది. వాళ్ళు రోడ్లు సరిగ్గా దాటారో, లేదో? బస్సు సరిగ్గా ఎక్కారో, లేదో? ఈయన టిఫిన్ సరిగ్గా తినకపోతే ఎలా? చేసిన కూర నచ్చుతుందా? చారు పడితే బట్టలు పాడవుతాయి కదా?

ఇలా మనస్సు ఒక చిన్న ఆరాటాన్ని ఒక మహా పోరాటంగా ఎదిగింపచేసి వ్యక్తి ఏకాగ్రతను హరిస్తుంది. వ్యక్తిలో ఆరాటాన్ని పెంచి, ఉద్విగ్నతను రగిలించి, అతడిని స్థిరంగా నిలవనీయకుండా చేస్తుంది.

పరీక్షల కోసం చదవాలని కూర్చున్న విద్యార్థి మనసులో అనేకసందేహాలు రగులుతుంటాయి. పది ప్రశ్నలిచ్చి, అయిదు సమాధానాలు రాయమంటారు. ఇప్పుడు నేను చదువుతున్న ప్రశ్న పరీక్షలో అడగకపోతే ఇంత శ్రమపడి వ్యర్థమౌతుంది కదా? అన్న సందేహం వస్తుంది. అంటే, ఏ ప్రశ్న వస్తుందో, ఆ సమాధానం చదివితే ఉండే లాభం, రాని ప్రశ్నకు సమాధానం చదివితే ఉండదు. ఈ సమయంలో వచ్చే ప్రశ్న చదివితే సరిపోతుంది కాదా? కాని ఏది వస్తుందో, ఏది రాదో తెలియదు. దాంతో ఆత్రుత పెరిగిపోతుంది. ఈ ఆత్రుత చిరాకు కలిగిస్తుంది. పక్క గదిలో చిన్న శబ్దమైనా ఏకాగ్రత చెదిరిపోతుంది. కోపం వస్తుంది. దీనికి తోడు, సరిగ్గా చదవకపోతే పరీక్షలో మార్కులు రావు. రాకపోతే అందరూ వెక్కిరిస్తారు. పెద్దలకు కోపాలు వస్తాయి. ఇలా

ఒకటేమిటి, సవాలక్ష భయాలు, సందేహాలు విద్యార్థి మనస్సును అతలాకుతలం చేస్తాయి. కళ్ళు అక్షరాల వెంట పరు గెత్తుతున్నా, మెదడుకు వాటి భావం అందదు. బలవంతాన మెదడును పాఠ్యాంశాల పైకి మళ్లిస్తాడు. దాంతో చదివింది మొత్తం గుర్తుండదు. సగం సగమే గుర్తుంటుంది.

ఈ రకంగా ఏకాగ్రత కుదరకపోవటం, మనస్సు స్థిరంగా ఉండకపోవటం అన్నవి వ్యక్తి పని తీరును దెబ్బ తీస్తాయి. ఇక్కడే జంతువుకూ, మనిషికీ తేడా స్పష్టంగా తెలుస్తుంది. జంతువు, ఏకాగ్రత కోసం ప్రత్యేకంగా కృషి చేయాల్సిన పనిలేదు.

గాలిలో కొన్ని వందల మైళ్ళ ఎత్తున ఎగురుతున్న పక్షికి, నీటి అడుగున ఉన్న తన ఆహారం 'చేప' కదలికలు కనిపిస్తాయి. ఆ చేప నీటి పైకి రావటం తెలుస్తుంది. వెంటనే అంత ఎత్తు నుంచి కిందికి దూకి, నీటి పైపొరకు చేరిన చేపను ముక్కున కరుచుకొని పోతుంది. ఆ ఏకాగ్రత దానికి స్వతహాగా వస్తుంది. అందుకే అంత ఎత్తు నుంచి తన ఆహారాన్ని గమనించగలగటమే కాదు. దాన్ని పట్టుకొనే సమయాన్ని సైతం సెకన్లతో సహా కచ్చితంగా అంచనా వేయగలుగుతుంది.

లేడిని వేటాడే చిరుత ఏకాగ్రత కూడా అటువంటిదే. నిశ్శబ్దంగా లేడిని చేరుతుంది. దాడి చేసే సమయం వరకు నిశ్శబ్దంగా ఎదురు చూస్తుంది. ఒక్కసారిగా లంఘిస్తుంది. వెంటపడుతుంది. దాని వేటు నుండి పరుగెత్తి తప్పించుకునే లేడి ఏకాగ్రత కూడా అసమానం. అంత వేగంలో అది అడ్డంకులను గ్రహిస్తుంది. వాటిని దాటి దూకుతుంది. అయినా వెనుక నుండి వస్తున్న చిరుతపై నుంచి దృష్టి చెదరనివ్వదు. గమనిస్తే, ప్రతి జంతువూ ఏ పనిలో ఉన్నా ప్రమాదంపై ఓ కన్నేసి ఉంచుతుంది. అందుకే ప్రశాంతంగా మేత మేస్తున్న లేళ్ళు, క్షణంలో గాలి వేగంతో పరుగెత్తగలవు. వాటికి శక్తి ఏకాగ్రత వల్ల లభిస్తుంది. ఈ ఏకాగ్రత వాటికి స్వతహాగా వచ్చింది.

మనిషిలో కూడా ఇదే ఏకాగ్రత ఉంటుంది. ఆ ఏకాగ్రత మనిషికి కూడా గొప్ప శక్తిని ఇస్తుంది. కానీ మనిషి ఏకాగ్రత కోసం కష్టపడాలి. నలువైపుల నుంచి చుట్టుకున్న ఆరాటాలను, ఆత్రుతలను, ఆకర్షణలను తట్టుకోగలగాలి. తన మెదడు నుండి వాటిని తరమగలగాలి. ఇది చేయగలిగినపుడు మనిషి ఆ జంతువులను మించిన అసమానమైన శక్తిని తనలోనే కనుగొంటాడు. కానీ ఇటువంటి ఏకాగ్రత కుదరాలంటే సాధన అవసరం. తన ఇష్టం వచ్చిన దానిపై దృష్టి కేంద్రీకరించటం అలవాటు చేసుకోవాలంటే, ముందుగా తన దృష్టిని ఆకర్షించేవాటిని గ్రహించాలి.

కొందరిని సంగీతం సర్వం మరి పింపచేస్తుంది. మరి కొందరికి గానం ప్రియం. కొందరు అందమైన చిత్రాలను చూసి సర్వం మరిచిపోతారు. ఇంకొందరు ప్రకృతిని చూసి పరవశించిపోతారు. ముందుగా వ్యక్తి, తనదృష్టి ఆకర్షించి, దాన్ని బంధించి ఉంచే అంశాన్ని గ్రహించాలి. ఆపై, తన దృష్టిని ఆ అంశంపై నిలిపి ఏకాగ్రత సాధన చేయాలి.

ఏకాగ్రత సాధన కోసం కొన్ని సాంప్రదాయిక పద్ధతులున్నాయి. చీకటి గదిలో దీపం వెలిగించి, ఆ దీపం వైపు చూస్తూ కూచోవాలంటారు. అలా కూర్చున్నప్పుడు, మదిలో మెదిలే ఆలోచనలన్నింటినీ ఒకటొకటిగా దూరం చేస్తూ పోవాలంటారు. ఏకాగ్రత కావాలంటే, వ్యక్తి నాసికాగ్రభాగంపై దృష్టి నిలపాలంటారు. కనుబొమ్మల నడి భాగంపై దృష్టి కేంద్రీకరించాలంటారు. కళ్ళు మూసుకొని జపం చేయా లంటారు. మనసుకు నచ్చిన అంశాన్ని ఊహిస్తూ, కళ్ళు మూసుకొని స్థిరంగా కూర్చుంటే, దృష్టి దాని పైన కేంద్రీకృత మౌతుందంటారు.

మనం ఓ పాట వింటుంటాం. పాటలో మన దృష్టి గాయకుడి స్వరంపై ఉంటుంది. అతడు పాడే పాటపై ఉంటుంది. దాంతో పాటలో వినబడే నేపథ్య సంగీతం మనకు వినిపిస్తూనే ఉన్నా దాన్ని గమనించం. వాద్యాల లయల కనుగుణంగా మోగే తాళాన్ని గమనించం. అదే పాటను మరోసారి వింటూ, దృష్టిని గానంపై కాకుండా నేపథ్య సంగీతంపై కేంద్రీకరిస్తే, చిత్రంగా పదాలు వినబడవు. కానీ, నేపథ్యంలోని వాద్యాల లయలు, చమత్కారాలు తెలుస్తాయి.

పాశ్చాత్యసంగీతంలో అనేకవాద్యాలు ఒకేసారి మోగే 'సింఫోనీ' పద్ధతి ఉంది. ఆ సంగీతం వినేటప్పుడు ప్రేక్షకులంతా ఒకే సంగీతం వింటున్నా, తమకు వారికి నచ్చిన వాద్యకారుడి వాద్యాన్ని మాత్రమే వింటారు. చప్పట్లు కొడతారు. అలా ఓ వందమంది ఒకే వాద్యాన్ని వాయిస్తున్నా వారిలో ఎవరో ఒకరి వైపు చూస్తూ, వారిపై దృష్టి నిలిపితే, కాస్సేపటికి, వంద వాద్యాలలో కూడా ఆ ఒక్కరి వాద్యస్వరం మనకు స్పష్టంగా వినిపిస్తుంది. ఏకాగ్రత సాధనలో ఇది ఒక మంచి సులువైన పద్ధతి.

నచ్చిన పాటను పలుమార్లు వినటం వల్ల పాట గుర్తుంటుంది. ఇతర గీతాలకన్నా ఈ పాట బాగా గుర్తుండటానికి ప్రధానకారణం అది మన దృష్టిని ఆకర్షించటం వల్ల దాన్ని మనం ఏకాగ్రతగా వినటమే. అటువంటి బాగా తెలిసిన పాటను మరోసారి వినండి. ఈ సారి వినేటపుడు ఎన్ని మార్లు విన్నా దృష్టికి రాని అనేక కొత్త విషయాలు

గ్రహింపుకు వస్తాయి. ఈ రకంగా పలుమార్లు చేయటం వల్ల అనుకున్న విషయంపై దృష్టి కుదిరిన మరు క్షణం, ఇతరవిషయాలు అదృశ్యమవటమూ తెలుస్తుంది.

అనేకధ్యానపద్ధతులకు మూలసూత్రం ఇదే. కళ్ళు మూసుకొని ధ్యానానికి కూచున్న వెంటనే రకరకాల ఆలోచనలు మెదడులో ముసురుకుంటాయి. అంత వరకు మనం పట్టించుకోని విషయాలు సైతం మెదడులో తలలెత్తుతాయి. దీపం వైపు చూడటమైనా, ఓంకారంపై దృష్టి నిలపటమైనా, భ్రూమధ్యభాగంలో దృష్టి కేంద్రీకరించటం, నాసికాగ్రాన్నే చూడటం ఎందుకంటే, వాటి పైన దృష్టి కేంద్రీకరించటం వల్ల ముసురుకుంటున్న ఆలోచనలు చెల్లాచెదరవుతాయి. ఆరంభంలో ప్రయత్నపూర్వకంగా ఆలోచనలను దూరంగా నెట్టాల్సి ఉంటుంది. కానీ కొన్నాళ్ళకు ఏకాగ్రత కోసం కూర్చోగానే దృష్టి నిలుస్తుంది. మనస్సు నిశ్చలమౌతుంది.

ఏకాగ్రత సాధనకు మరో పద్ధతి ఉంది. మన దేవీదేవతలకు సుందర రూపాలుంటాయి. కళ్ళు మూసుకొని మనసును ఆకర్షించిన సుందరరూపాన్ని దృష్టిపథం లోకి తెచ్చుకుంటే, ఏకాగ్రత సులభంగా అలవడుతుంది. ఒకవేళ సుందరరూపం ఏదీ లేకపోతే, గతంలో తాను దర్శించిన సుందరస్థలాలను, దృశ్యాలను కళ్ళ ముందుకు తెచ్చుకోవాలి. అలలు ఎగసిపడే సముద్రాన్ని, సూర్యకాంతికి మెరిసే వెండి కొండను, సుందరమైన లోయలను, పచ్చటి చెట్లను, రంగురంగుల పూలను, ఒకటేమిటి, మనసుకు నచ్చిన దాన్ని మూసిన కళ్ళ ముందు ప్రతిష్ఠించుకుని దానిపై దృష్టి నిలపాలి. ఇందువల్ల ఏకాగ్రత సులభమౌతుంది.

గమనిస్తే అనేక కళాకారులు చేసేపని ఇది. వారు గీసే చిత్రాల్లో వారిని ఆకర్షించిన వారి పోలికలు కనిపిస్తాయి. వారి దేవీదేవతల్లో వారి ప్రేమికులు దర్శనమిస్తారు. వారి రాతల్లో వారి పరిచయస్థులు, మనసు దోచినవారు కనిపిస్తారు. మనస్తత్వంలోని ఈ ప్రకృతిని గమనించి మనవారు సృష్టిలోని అణువణువులో దైవత్వాన్ని చూడమని బోధించారు. అందుకే ఒక వ్యక్తికి నచ్చిన అమ్మాయిని దేవత విగ్రహంలా ఊహించి పూజించవచ్చు. వెండి కొండ కైలాసమవుతుంది. సుందరప్రకృతిదృశ్యాలు భగవంతుడి కళాత్మకతకు నిదర్శనాలవుతాయి. అంటే, మనసుకు నచ్చిన ఏ అంశాన్ని కళ్ళ ముందు నిలుపుకున్నా, అది భగవంతుడికి ప్రతిరూపమే అవుతుంది. ఏకాగ్రత సాధనకు అంశమే అవుతుందన్నమాట. అందుకే ధూర్జటి 'మేక పెంటిక'లో శివరూపాన్ని దర్శించి తన్మయుడవగలిగాడు. ఏకాగ్రత సాధనలో తొలి అడుగు ఇది.

## ఏకాగ్రత - అభ్యాసం

తెరచిన కళ్ల ముందు కన్నా, మూసిన కళ్ల వెనుక మహాద్భుతమైన మరో ప్రపంచం దాగి ఉందని అంటారు. అది నిజం. కళ్లముందున్నది భౌతిక ప్రపంచం. ఈ ప్రపంచాన్ని చూపించేవి పరిమితశక్తి కల ఇంద్రియాలు.

పరిమితశక్తి కలవి చూపించే విషయాలు కూడా పరిమితమైనవే అయి ఉంటాయి. అవి అందించే జ్ఞానం సంపూర్ణం కాదు. అందుకే ఇంద్రియాల ద్వారా గ్రహించే జ్ఞానం ఎన్నటికీ సంపూర్ణం కాదంటుంది భారతీయతత్త్వం. సంపూర్ణజ్ఞానసాధనకు ఇంద్రియ నిగ్రహం మొదటి మెట్టు అంటుంది. ఇంద్రియాలను నిగ్రహించి ఏకాగ్రతతో సాధన చేస్తే, సంపూర్ణజ్ఞానమైన బ్రహ్మజ్ఞానం సిద్ధిస్తుందంటారు.

*త్రిరున్నతం స్థాప్య సమం శరీరం*
*హృదీంద్రియాణి మనసా సన్నివేశ్య ।*
*బ్రహ్మోడుపేన ప్రతరేణ విద్వాన్*
*స్రోతాంసి సర్వాణి భయానకాని ॥*

రొమ్ము, మెడ, తలలను నేరుగా ఉంచి, ఆసీనుడై, ఇంద్రియాలను మనస్సుతో సహా హృదయంలోకి ఉపసంహరించి, అన్ని భయానకప్రవాహాలను బ్రహ్మమనే తెప్పగా చేసుకొని దాటవచ్చు.

అయితే, ప్రతి ఒక్కరిలో బ్రహ్మజ్ఞానాన్ని సిద్ధించుకునే శక్తి ఉన్నా, అనేకకారణాల వల్ల వ్యక్తుల దృష్టి వేర్వేరు విషయాలపై ప్రసరిస్తుంది. కాబట్టి ఏకాగ్రత సాధనకు ఉపక్రమించే ముందు వ్యక్తి, తన మనస్సు దేనిపై నిలుస్తుందో గ్రహించే ప్రయత్నం చేయాలి. కొందరి మనస్సు సంగీతం వినగానే పురి విప్పి నెమలిలా ఆడితే, మరి కొందరి దృష్టి సాహిత్య సౌరభాల ఆస్వాదనలో నిమగ్నం కావచ్చు. కొందరికి ఆటలపై శ్రద్ధ కుదిరితే, ఇంకొందరు ప్రకృతివీక్షణలో సర్వం మరచిపోవచ్చు. ఇలా... ఏ విషయంపై తనకు ఆసక్తి ఉన్నదో వ్యక్తి ముందుగా నిర్ణయించుకోవాలి.

అయితే, వ్యక్తికి ఏ విషయం పైన ఆసక్తి ఉన్నా, 'ప్రాణాయామం' ద్వారా దృష్టిని నిగ్రహించి సాధించవచ్చు. అంటే, ఇష్టమైన విషయం వల్ల ఏకాగ్రత సులభంగా కుదిరితే, ప్రతి రోజూ, నియమం ప్రకారం కొద్ది కాలం స్థిరంగా కూర్చొని మనస్సును అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేయటం వల్ల కూడా ఏకాగ్రత సాధ్యమౌతుందన్నమాట. కానీ ఇలా నియమం ప్రకారం, క్రమబద్ధంగా, ప్రతి రోజూ ఏకాగ్రత సాధన చేయటానికి పట్టుదల, దృఢనిశ్చయాలు అవసరం.

ఉదయం లేవగానే వ్యాయామం చేయటం, ఆపై యోగాభ్యాసం చేయటం, చివర్లో ఏకాగ్రతతో ధ్యానం చేయటం పద్ధతి. ఎందుకంటే, మనిషి శరీరం మనసు చెప్పినట్టు వింటుంది. దానికి ఏది అలవాటు చేస్తే అది అలవాటు అవుతుంది. ఆరంభంలో కాస్త కష్టపెట్టినా పట్టుదలగా, వదలకుండా అభ్యాసం చేస్తే శరీరానికి అదే అలవాటైపోతుంది.

'వాకింగ్' ఆరంభంలో కాళ్లు నొప్పులు పుడతాయి. అలసిపోయినట్టుంటుంది. 'ఎందుకొచ్చిన గోల ఇది' అనిపిస్తుంది. అయినా సరే వదలకుండా నడుస్తూంటే, కొన్నాళ్ళకి 'వాకింగ్' చేస్తూంటే శరీరం తేలికగా అనిపిస్తుంది. రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. నడవకపోతే కాళ్లు లాగేసినట్టుంటాయి. నొప్పులు పుడతాయి. మనిషి శరీరపు ఈ లక్షణాన్ని అర్థంచేసుకుంటే, ఏ పని అయినా కాస్త పట్టుదలతో, క్రమం తప్పకుండా సాధించవచ్చని స్పష్టమౌతుంది.

*లఘుత్వ మారోగ్య మలోలుపత్వం*
*వర్ణప్రసాదః స్వర సౌష్ఠవం చ ।*
*గంధః శుభో మూత్ర పురీష మల్పం*
*యోగ ప్రవృత్తిం ప్రథమాం వదంతి ॥*

యోగాభ్యాసం చేసేటప్పుడు మొదట కలిగే ఫలితాలు : శరీరం ఆరోగ్యంగా తేలికగా ఉండటం, మనస్సులో దేనికోసమూ ఆరాటం లేకపోవటం, స్వచ్ఛమైన శరీరఛాయ, శ్రావ్యమైన కంఠమూ, ఆహ్లాదకరమైన దేహవాసనా, మలమూత్రాల విసర్జన క్రమబద్ధమవటం జరుగుతాయి.

ఏకాగ్రతసాధనకు అవసరమైనవన్నీ యోగాభ్యాసం వల్ల అలవడతాయన్నమాట. అనారోగ్యంగా ఉన్న మనిషికి ఏకాగ్రత కుదరదు. పుస్తకం తెరవగానే దగ్గు వచ్చే వ్యక్తి పఠనంపై దృష్టి పెట్టలేడు. లేదా, శరీర భాగంలో ఎక్కడో నొప్పి ఉన్నా, జ్వరంగా ఉన్నా దృష్టి కుదరదు. కాబట్టి ఏకాగ్రతసాధనకు మంచి ఆరోగ్యసాధన మొదటి మెట్టు అన్నమాట.

ఇటీవలి కాలంలో ఏకాగ్రత కుదిరేందుకు రకరకాల ధ్యానమార్గాలు ప్రచారంలో ఉన్నాయి. ఎక్కడో పుట్టి ఇక్కడికి చేరినట్టుగా చెప్పుకుంటూ ప్రజలను ఆకర్షిస్తున్న వాటన్నిటి 'మూలం' భారతీయతత్త్వంలో ఉంది. పేరు ఏదైనా, వాటిని ప్రచారం చేస్తున్న మహర్షి ఎవరైనా, అవన్నీ భారతీయ యోగధ్యానపద్ధతి ఆధారంగా ఎదిగినవే. కానీ ఆధునిక 'మార్కెటింగ్ టెక్నిక్కులు' ఉపయోగించి వీరు ప్రజలలో రకరకాల ఆశలు కల్పించి పబ్బం గడుపుకుంటున్నారు.

ఏకాగ్రతసాధనకు ఆరోగ్యసాధన మొదటి మెట్టు అని తెలుసుకున్నాం. ఆ తరువాత కావలసింది సరైన ప్రదేశం.

*సమేశుచౌ శర్కరావహ్ని వాలుకా*
*వివర్జితే శబ్ద జలాశ్రయాదిభిః।*
*మనోనుకూలే నతు చక్షు పీడనే*
*గుహానివాతా శ్రయణే ప్రయోజయేత్॥*

అభ్యాసం ఏకాగ్రతతో చేయాలి. అభ్యాసానికి అనుకూలమైన గుహల వంటి శుభ్రమైన ప్రదేశాలలో చేయాలి. నేల మిట్టపల్లాలు లేని సమంగానూ, దుమ్ము, గులక రాళ్ళు, తేమ, నిప్పు, గోల, దుమారం వంటి బాధ కలిగించేవి లేకుండా ఉండాలి. ఆనందకరంగా ఉండాలి. అలాంటి ప్రదేశాలలో అభ్యాసం ప్రారంభించాలి. అంటే ఏకాగ్రత కావాలంటే, అడవుల్లోకి, గుహల్లోకి పోవాలని అర్థం కాదు. శుభ్రమైన ప్రదేశం అంటే ఆరోగ్యసూత్రాలను పాటించే స్థలం అని అర్థం. నేల ఎగుడుదిగుడుగా ఉంటే ఎక్కువ సేపు కూర్చోవటం కష్టం. పొగ, దుమ్ము, ధూళి వంటివి ఊపిరికి అడ్డుపడి ఉక్కిరిబిక్కిరి చేసి ఏకాగ్రతను భంగం చేస్తాయి.

ప్రస్తుతపరిస్థితులలో ఏకాగ్రత సాధనకు ఇల్లే నిలయం. కాస్త ముందుగా లేస్తే, ఇంట్లో ఇతరుల కన్నా ముందే ప్రశాంతంగా సాధన చేసుకోవచ్చు. లేకపోతే ఇంటి 'బాల్కనీ' టెర్రెస్ లాంటి ప్రదేశాలలో ప్రశాంతంగా కూర్చోవచ్చు. ఇక్కడ మరో విషయం గమనించాలి.

ఏకాగ్రత సాధన అంటే కళ్ళు మూసుకుని కూర్చోవటం కాదు. ఉదయం – సాయం సమయాల్లో ఆకాశాన్ని చూడండి, ఆకాశంలో ప్రదర్శితమవుతున్న వింత వింత రంగులను గమనించండి. ఏయే రంగుల సమ్మిశ్రితమో ప్రదర్శితమౌతున్న అత్యద్భుతవర్ణాల విన్యాసమో ఆలోచించండి.

ఆపై మేఘాల మాటు నుండి చాచిన సహస్రకిరణాల బాహువులను గమనించండి. కలకల లాడుతూ, చిత్రవిచిత్రమైన నృత్యవిన్యాసాలను ఆకాశవేదికపై ప్రదర్శించే పక్షితతులను చూడండి. పల్టీలు కొడుతూ, ఆడుతూ, పాడుతూ అయినా ఓ క్రమ ఆకారంలో విహరించే పక్షులను చూడండి. రంగులు మారుస్తూ దిగంతాలలోకి దిగిపోయే సూర్య బింబాన్ని చూడండి. ఉదయం పూట, ఎటు నుంచి ఎలా పరచుకుందో, ఎంత

గమనించినా, అలవి కాని రీతిలో విస్తరించే వెలుతురును చూడండి. మేఘాల ఆకారాలను చూడండి. అవి ధరించే వింత వింత రూపాలను చూస్తూ, ఈ అత్యద్భుతమైన, అనుపమానమైన అసమానసౌందర్యాన్ని సృజించిన ఆ సృజనాత్మకశక్తికి జోహార్లర్పించండి.

ఈ అంతు లేని సౌందర్యాన్ని కళ్ళ నిండా నింపుకుని, ఓ మూల ప్రశాంతంగా కూర్చుని, మూసిన కళ్ల వెనుక ఈ దృశ్యాలను పునః దర్శించండి. హృదయంలో ప్రతిష్ఠించుకోండి. ఇంతవరకూ చూసిన దృశ్యాలను ఒకటొకటిగా కనుల పరదాలపై ప్రదర్శించి, దర్శించండి. ఏకాగ్రత కుదురుతుంది. మనసు ఆనందంతో నిండిపోతుంది. ప్రశాంతం వెన్నెలలా మనస్సుపై పరుచుకుంటుంది.

సూర్యోదయ – సూర్యాస్తమయాలే కాదు, ప్రకృతిలోని ఏ దృశ్యాన్నయినా ఇదే రీతిలో మనోభాండాగారంలో భద్రపరచుకోవచ్చు. నల్లటి ఆకాశంలో వెన్నెల వెలుగులు వెదజల్లే జాబిల్లి, ఆకాశాన్ని తాకే పర్వతాలు, గలగల పారే నదులు, జలజల దూకే జలపాతాలు... ఇలాంటి విధాత కళాప్రదర్శన విశ్వరూపాన్ని ప్రదర్శించే ఏ దృశ్యాన్నయినా మనస్సులో నింపుకుని, అనుకున్నప్పుడల్లా మనఃకుడ్యంపై ప్రదర్శించటం అలవాటు చేసుకోండి. మేఘాల మెరపులలోని వెలుతురును, ఈ ప్రకృతి దృశ్యాలను కలిపి చూస్తూ, ప్రియమైన దేవీ, దేవత విగ్రహాన్ని ఈ దృశ్యాలపై ప్రతిష్ఠించి చూడండి. ఇష్టదేవతా స్తోత్రం చేయండి. ఏకాగ్రత కుదురుతుంది. అద్భుతలోకాల ద్వారాలు తెరచుకుంటాయి. మనలో ఉన్నట్టు మనకే తెలియని శక్తి జాగృతమౌతుంది. శంకరాచార్యుల వారు 'సౌందర్యలహరి'లో వర్ణించిన దేవీవిలాసవైభవం అర్థమౌతుంది.

*అహస్సూతే సవ్యం తవ నయన మర్కాత్మకతయా*
*త్రియామాం వామంతే సృజతి రజనీ నాయకతయా!*
*తృతీయాతే దృష్టిర్దరదలిత హేమాంబుజ రుచిః*
*సమాధత్తే సంధ్యాం దివసనిశయో రంతరచరీమ్॥*

తల్లీ! నీ కుడి కన్ను సూర్యుని రూపమై పగలు కలిగిస్తోంది. ఎడమ కన్ను చంద్రుడై రాత్రిని పుట్టిస్తోంది. వికసించిన స్వర్ణకమలం లాంటి నొసటి మూడవ కన్ను దివారాత్రాల నడుమ సంచరించే ఉదయసాయంసంధ్యలను ధరిస్తోంది.

సర్వసృష్టిలయలకు కారణమైన ఆ దివ్యరూపం సకల చరాచరజగత్తు అణువణువులో కనిపిస్తుంది. కళ్లు తెరచి చూడటమే మనిషి చేయవలసిన పని.

## ఏకాగ్రత - అడ్డంకులు

ఏకాగ్రత' వల్ల రెండు ప్రధానఫలితాలు సాధించవచ్చు. ఒకటి ఆధ్యాత్మికపరంగా ఫలితం ఇస్తే, ఏకాగ్రత వల్ల నిత్యజీవితంలో కూడా ఫలితం కనిపిస్తుంది. ఆధ్యాత్మికఫలాన్ని కాస్సేపు పక్కన పెట్టి, నిత్యజీవితంలో ఏకాగ్రత వల్ల లాభాలను పరిశీలిద్దాం.

రోజూ ఉదయం అయిదు నిమిషాలో, పది నిమిషాలో, అరగంటో పనీ చేయకుండా, ఎటువంటి ఆత్రం లేకుండా, తొందర లేకుండా, వీలైనంత ప్రశాంతంగా, ఓ నిర్దిష్టస్థలంలో కూచొని ఇష్టదేవతాప్రార్థన చేయటం వల్ల మానసికంగా ఓ లాభం కలుగుతుంది.

అధునిక యాంత్రికజీవనవిధానంలో వ్యక్తికి నిలిచి ఆలోచించే తీరిక లభించటం లేదు. ఉదయం లేచినప్పటి నుంచి ఉరకులు, పరుగులు. ఇటువంటి పరిస్థితులలో కాస్త సమయం ఎటువంటి తొందర లేకుండా నిశ్శబ్దంగా కూచోవటం అంటే వ్యక్తి కనీసం ఓ పది నిమిషాలు తనతో తాను గడపటం అన్నమాట.

ఇలా ఒంటరిగా కూర్చోగానే రకరకాల ఆలోచనలు మనసుని ముసుర్తాయి. రకరకాల ఊహలు మనసులో మెదలుతాయి. ఎవరో అన్న మాటలు గుర్తుకు వస్తాయి. తన ప్రవర్తనలోని అనుచితాలు జ్ఞప్తికి వస్తాయి. తాను చేయవలసిన పనులను గురించి ఆలోచనలు వస్తాయి. ఆ పనులను ఏ రకంగా పూర్తి చేయాలో మనసు ఆలోచిస్తుంది. అంటే ఏకాగ్రతసాధన పేరిట, ధ్యానంపేరిట కాస్త సమయం వ్యక్తి తనతో తాను గడుపుతాడన్నమాట. తన రోజు వారీ చర్యలను, పరామర్శించే వీలు చిక్కుతుందన్న మాట. తన గతాన్ని తలచుకుంటూ భవిష్యత్తు గురించి ఆలోచించే తీరిక చిక్కుతుందన్న మాట. మానసికంగా ఇది ఎంతో లాభకరం.

పాశ్చాత్యదేశాలలో, వేగవంతమైన జీవితం వల్ల వ్యక్తికి తనతో తాను గడిపేందుకు సమయం చిక్కదు. నిలిచి ఆలోచించే తీరిక ఉండదు. తమ మానసికవేదనలను తలచుకుని కుమిలే తీరిక కూడా లభించదు. ఈ వేదన అధికమై వ్యక్తి మానసిక రోగి అవుతాడు. అప్పుడతడు మానసికచికిత్స కోసం డాక్టరు దగ్గరకు వస్తాడు. డాక్టరు వారానికి ఒకటో - రెండోసార్లు ఆ వ్యక్తి మనసులో మాటలన్నీ వింటాడు. 'అయ్యో' అని సానుభూతి చూపుతాడు. అక్కడ కూడా ఏవో తోచిన సలహాలిస్తాడు. బోలెడంత 'ఫీజు' లాగుతాడు. ఈ వ్యక్తి కూడా తన మనసులో వ్యథ తగ్గిందని సంతోషిస్తాడు.

అయితే, ఇలా వ్యక్తులు మానసికరోగులై, 'మాట్లాడటమే' చికిత్సకావటాన్ని రోజూ కాస్త సమయం తనలో తాను గడపటం వల్ల తప్పించుకోవచ్చు. ఎందుకంటే 'ఏకాగ్రత'

కోసం వ్యక్తి ఒంటరిగా కూచున్నప్పుడు, వ్యక్తి తనతో తాను మాట్లాడుకుంటాడు. అంటే, తన మనసులో 'సాక్షి'గా ఉన్న 'అతని'తో సంభాషిస్తూంటాడు. ఇందువల్ల వ్యక్తికి ఓ రకమైన 'శాంతి' లభిస్తుంది.

గమనిస్తే, ఆటగాళ్లు ఆటలాడేటప్పుడు తమని తాము తిట్టుకోవటం, ఉత్సాహపరచి ప్రోత్సహించుకోవటం చూస్తాం. ఇదీ అటువంటిదే. అంటే, ఏకాగ్రత వల్ల వ్యక్తికి తనతో తాను కాస్త సమయం ఒంటరిగా గడిపి తన చర్యలను సమీక్షించి విశ్లేషించుకునే వీలు లభిస్తుందన్నమాట. తద్వారా నెమ్మదిగా ఏదో విషయంపై దృష్టి కేంద్రీకరించటం అలవడుతుంది. ఇది నిత్యజీవితంలో అతడిపై ప్రభావం చూపిస్తుంది. ఏదైనా పని చేయాలనుకున్నప్పుడు సంపూర్ణంగా దృష్టిని ఆ పని పైనే కేంద్రీకృతం చేయటం అలవడుతుంది. పైగా, తనతో తాను సంభాషించుకోవటం వల్ల అతడికి వేదనలు, ఉద్విగ్నతలు తగ్గించుకోవటం కూడా తెలుస్తుంది. దాంతో ఎటువంటి పరిస్థితిలోనైనా, తన ఆందోళనను,ఆరాటాన్ని సమీక్షించి, విశ్లేషించటం ద్వారా  ఒక రకమైన 'శాంతి'ని సాధిస్తాడు.

రోజూ ఉదయం కాస్సేపు ఏకాంతంగా గడపటాన్ని మరో రకంగా కూడా వాడుకోవచ్చు. ఉదాహరణకు, ఆ రోజు ఇంటర్వ్యూకి వెళ్ళాలనుకోండి. తన పూజా మందిరంలోనో, మరేదైనా స్థలంలోనూ కూచుని, మంత్రాన్ని మననం చేస్తూ, మరో వైపు నుంచి ఇంటర్వ్యూలో ఏమేం ప్రశ్నలు అడుగుతారో, వాటికి తానేం సమాధానం చెప్తాడో, ఊహించాలి. అన్నీ సవ్యంగా, సక్రమంగా జరుగుతున్నట్టే ఊహించాలి. అంటే, ఒంటరిగా కూచోగానే పదిరకాల ఆలోచనలు మదిని ముసిరే బదులు ఏ ఆలోచన మన మనస్సుని ఆక్రమించాలో దాన్ని మనమే నిర్దేశిస్తున్నామన్నమాట. పైగా, ఆ ఆలోచనపై దృష్టిని కేంద్రీకృతం చేయటం ద్వారా నూతనోత్సాహాన్ని పొందుతున్నామన్న మాట.

'ఇంటర్వ్యూ' అన్నది ఉదాహరణ మాత్రమే. ఏదైనా చేయాల్సిన పని ప్రణాళికను వేసేందుకు ఈ ఏకాగ్రత సమయాన్ని వాడవచ్చు. చదివిన పాఠాన్ని గుర్తుకు తెచ్చుకుని ఏయే అంశాలు అర్థం కాలేదో తెలుసుకునేందుకు ఈ సమయాన్ని ఉపయోగించుకోవచ్చు. ఎవరితోనైనా చర్చించాల్సిన విషయాన్ని, అన్ని కోణాల లోంచీ విశ్లేషించేందుకు ఈ ఏకాంతాన్ని సమర్థంగా వాడుకోవచ్చు. ఎవరితోనైనా ఉన్న సమస్యలను, కోపతాపాలను నిష్పాక్షికదృష్టితో వివరించి విశ్లేషించేందుకు ఈ సమయాన్ని వాడుకోవచ్చు. పైగా, దైవప్రార్థన చేస్తూ, దైవం ముందు కూర్చోని ఆలోచిస్తున్నాం కాబట్టి, మనల్ని మనం

మభ్యపెట్టు కోకుండా నిజాయితీగా ఆలోచిస్తాం. అలా, ఒకవేళ ఏ పనిలోనైనా మనదే పొరపాటు అని తెలిస్తే, అహంకారానికి పోకుండా క్షమాపణలు కోరుకోవాలని మనస్సుని సిద్ధపరచుకోవటానికీ ఈ సమయాన్ని వాడవచ్చు. మనసులో ఉన్న చీకాకులను, కోపాలను, తాపాలను అన్నింటినీ వెళ్ళగ్రక్కి, విశ్లేషించి, సమాధానపరచి సంతృప్తిపడేందుకు ఈ ఏకాగ్రత సమయాన్ని ఉపయోగించవచ్చు.

అంటే ఒంటరిగా కూర్చోగానే చుట్టూముట్టి, మూగి, విసిగించి ఏకాగ్రతను భగ్నం చేసే విభిన్న ఆలోచనలను, ఆందోళనలను, చిరాకులను, అవేశాలను, ఆవేదనలను మనం ఏకాగ్రత సాధనకు పని ముట్టుగా వాడుకుని విజయం సాధించవచ్చున్నమాట. ఈ విషయాన్ని వివేకానందస్వామి మరో కోణం నుంచి చెప్పారు.

ధ్యానం కోసం ఒంటరిగా కూర్చోగానే రకరకాల ఆలోచనలు చుట్టుముడతాయి. కంగారు పడవద్దు. వాటిని తరిమేసే ప్రయత్నం చేయవద్దు. ఆలోచనలను రానీయాలి. వస్తున్న ప్రతి ఆలోచననూ విశ్లేషించాలి. వాటి స్వరూపాన్ని తెలుసుకొనే ప్రయత్నం చేయాలి. ఇలా కాస్సేపు జరిగేసరికి ఆలోచనలు వాటంతట అవే అదృశ్యమౌతాయి. ఏకాగ్రత సిద్ధిస్తుంది. అలా కాక, ఆలోచనలను అడ్డుకోవాలని, తరిమేయాలని ప్రయత్నిస్తే అవి రెట్టింపు శక్తితో వచ్చి మీద పడతాయి. దృష్టి అంతా వాటిని అడ్డుకోవటం వైపే ఉంటుంది.

వివేకానందుల వారు చెప్పిన ఈ నిజాన్ని తైత్తిరీయ ఉపనిషత్తులో భృగువు జ్ఞానం సంపాదించిన విధానం నిరూపిస్తుంది.

వరుణుడి కుమారుడు భృగువు. భృగువు తండ్రి వద్దకు వెళ్ళి 'అధీ హి భగవో బ్రహ్మేతి!' అని అడిగాడు. అంటే బ్రహ్మ గురించి నేర్పమని అభ్యర్థించాడు. దానికి వరుణుడు 'అన్నం ప్రాణం చక్షుః శ్రోత్రం మనో వాచమితి!! తః హోవాచ! యతో వా ఇమాని భూతాని జాయంతే! యేన జాతాని జీవన్తి! యత్రప్రయన్త్యభిసంవిశంతి! తద్దిజిజ్ఞాసస్య!' అన్నాడు.

అన్నం, పాణం, కన్ను, చెవి, మనస్సు, వాక్కు వంటి ఇంద్రియాలు బ్రహ్మజ్ఞానానికి మార్గదర్శనం చేస్తాయి. దేని నుంచి ప్రాణులు జన్మిస్తాయి, ఏది ఆధారంగా బ్రతుకుతాయో, ఏ వైపు ప్రయాణించి దేంట్లో లయిస్తాయో అది బ్రహ్మ. ఆలోచించు' అన్నాడు.

'బ్రహ్మంటే ఏది? బ్రహ్మజ్ఞానం ఇచ్చెయ్యి, అని అడగ్గానే బ్రహ్మను నిర్వచించి ఇదీ బ్రహ్మజ్ఞానం అని చెప్పెయ్యలేదు. ముందు, ఇంద్రియాలను సక్రమంగా ఉపయోగించటం

నేర్చుకోమన్నాడు. ఎందుకంటే ప్రపంచాన్ని చూపేవి ఇంద్రియాలే. ప్రపంచజ్ఞానాన్ని ఇచ్చేవి ఇంద్రియాలే. ఆ తరువాత నాలుగైదు ఆలోచనలను వివరించి ఆలోచించుకో' అన్నాడు.

అంటే ప్రపంచాన్ని గమనిస్తూ, దాని స్వరూపాన్ని విశ్లేషిస్తూ, బ్రహ్మజ్ఞాన సాధనకు ప్రయత్నించాలన్నమాట. భృగువు అదే చేశాడు. తండ్రి ఇచ్చిన పలు ఆలోచనలను మథించాడు. 'ఆలోచించు' అంటే అన్ని రకాల ఆలోచనలను మథించు అన్నాడు. ఏకాగ్రతగా కూచుని ఆలోచనలను మథించాడు. మళ్ళీ తండ్రి దగ్గరకు వచ్చాడు.

'అన్నం బ్రహ్మస్వరూపం. నాకు బ్రహ్మజ్ఞానం నేర్పు' అని అడిగాడు. ఎందుకంటే 'అన్నం' కూడా పుడుతుంది. బ్రహ్మ ఆద్యంతాలు లేనివాడు. కాబట్టి తన జ్ఞానం అసంపూర్ణం అని 'భృగువు' గ్రహించాడు. భృగువు ప్రశ్నకు సమాధానంగా తండ్రి 'ప్రాణం' పై దృష్టి కేంద్రీకరించమన్నాడు.

అంటే, మొదట్లో ఆలోచనలిచ్చాడు. భృగువు ఆ ఆలోచనల్లోంచి ఒక ఆలోచనను ఎన్నుకోగల స్థాయిని రాగానే 'ఒకే' ఆలోచననిచ్చాడు. అలా మనస్సు, ఏకాగ్రత, అనందం. ఒకో స్థాయికి ఎదుగుతూ బ్రహ్మజ్ఞానాన్ని సంపాదించాడు భృగువు.

కాబట్టి, ముసురుకునే ఆలోచనల్లోంచి, మనసుకు పట్టిన ఆలోచనను వేరు చేసి దాన్ని మథించాలి. అలా చేస్తూ పోతే ఒకటొకటిగా ఆలోచనలు అదృశ్యమై, దృష్టి ఒకే అంశంపై కేంద్రీకృతమౌతుంది. ఎందుకంటే, సకలజ్ఞానం మనిషి మనసులోనే దాగుంది. తెరచిన కళ్ళు చూపే ప్రపంచం అపరిమితం. మూసిన కళ్ళ వెనుక ఉన్న చీకటిలో విశ్వ సృష్టికారుడున్నాడు. ఇంద్రియాలు చూపే ప్రపంచం నుంచి ఏ ఇంద్రియం చేరనటువంటి ఆ ప్రపంచాన్ని చేరగలగాలి. అదీ ఏకాగ్రత అసలు లక్ష్యం.

అయితే మెట్లెక్కుతూ పోతే, ఆ దారిలో ఎన్నో అంతస్థులను దాటాల్సి వస్తుంది. పరీక్షలు, ఇంటర్వ్యూలు, సమస్యలు, ఆఫీసులో డెడ్ లైన్లు అన్ని ఆ అంతస్థుల వంటివి. ఒక్కసారి మెట్లెక్కటం అలవడితే, అక్కడ కూడా అలుపు తీర్చుకుంటూ గమ్యం చేరటం కష్టం కాదు. వ్యక్తిత్వవికాసంలో మనం చేరవలసిన గమ్యాన్ని, ధ్యానంలో మనసు నిలపవలసిన అంశాన్ని పోతన మహాద్భుతంగా సూచించాడు. మూసిన కనుల వెనుక వెలిగే దీపాన్ని తిరుగు లేని విధంగా వర్ణించి, మన మనస్సుల్లో ప్రతిష్ఠించాడు.

*లోకంబులు లోకేశులు*
*లోకస్థులు దెగిన తుది నలోకంబగు పెం*

*జీకటి కవ్వల నెవ్వడు*
*ఏకాకృతి వెలుగు నతని, నే సేవింతున్.*

## ఏకాగ్రత - పరిమితులు

*సదృశం చేష్టతే స్వస్యాః ప్రకృతేః జ్ఞానవా నపి।*
*ప్రకృతిం యాన్తి భూతాని నిగ్రహః కిం కరిష్యతి?*

ఎంతటి జ్ఞాని అయినా తన స్వభావాన్ని అనుసరించే ప్రవర్తిస్తాడు. భూతజాలాలు అన్నీ ప్రకృతిబద్ధాలైనవే. అటువంటప్పుడు బాహ్యనిరోధం ఎట్లా ఉపకరిస్తుంది?

భగవద్గీతలోని ఈ శ్లోకం 'వ్యక్తిత్వవికాసం' దృష్ట్యా అత్యంతప్రాధాన్యమైనది. వ్యక్తిత్వవికాసానికి అనేకమార్గాలను మనం విశ్లేషించాం. ఆలోచనలను నియంత్రించటం నుంచి ఏకాగ్రత సాధించటం వరకూ అనేకవిషయాలను చర్చించాం. అయితే, భగవద్గీతలోని ఈ శ్లోకం ఒక సున్నితమైన సత్యాన్ని మనసుకు బోధపడేట్టు చెప్తూంది.

ప్రతివ్యక్తికీ పరిమితులుంటాయి. ఏ వ్యక్తీ అనంతశక్తి కలవాడు కాడు. కాబట్టి, వ్యక్తికి ఎన్ని ఆశలున్నా, ఎన్ని కోరికలున్నా, ఎన్నెన్ని సాధించాలని ఉన్నా, అతను ముందుగా గుర్తించవలసింది తన పరిమితులను, తన పరిమితుల ఆధారంగా ఆశలను, ఆశయాలను ఏర్పాటు చేసుకోవాలి. ఎందుకంటే 'వ్యక్తి ఎంత జ్ఞాని అయినా తన స్వభావాన్ని అనుసరించి ప్రవర్తిస్తాడు.'

రామకృష్ణ పరమహంస దగ్గరకు 12 మంది యువకులు వచ్చారు. వారందరూ ఆధ్యాత్మిక తృష్ణ కలవారే. వారందరూ సన్న్యాసాశ్రమాన్ని స్వీకరించాలని కంకణం కట్టుకున్నవారే. కానీ వారందరిలోకీ రామకృష్ణ పరమహంస 'నరేంద్రనాథ్' అంటే ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. అందరిముందూ, నిర్మొహమాటంగా నరేంద్రనాథ్‌ను పొగిడాడు. వారందరికీ అతడిని నాయకుడిని చేశాడు. ఎందుకంటే, అందరిలో ఒకే తృష్ణ ఉన్నా, అందరిలో ఒకే శక్తి ప్రవహిస్తూన్నా, నరేంద్రనాథ్ స్వభావాన్ని అనుసరించి చూస్తే, ఆ శక్తి ప్రస్ఫుటంగా ప్రకటితమయ్యేది అతడిలోనే అన్న నిజం రామకృష్ణ పరమహంస గ్రహించగలిగాడు. కాబట్టి, ఇతరులలో అసూయ కలిగించే అవకాశం ఉన్నా, వారికీ నిజం గ్రహింపుకు రావాలని, తన తరువాత అందరూ, ఏకగ్రీవంగా తమ నాయకుడిగా అంగీకరించాలని ఆయన మొదటి నుంచీ వారిని మానసికంగా సిద్ధం చేస్తూ వచ్చాడు. ఫలితంగా, వివేకానంద నాయకత్వాన్ని ఎవరూ ప్రశ్నించలేదు. సందేహించలేదు.

ప్రతి వ్యక్తి గమనించవలసిన విషయం ఇది. కాబట్టి ముందుగా తన పరిమితులను అంచనా వేసుకోవాలి. ఏ పని తాను సులువుగా చేయగలుగుతున్నాడు? ఏ పని చేస్తూంటే తనలో ఆనందం వెల్లువవుతోంది? ఏ పనుల్లో తనకు సంతృప్తి కలుగు తోంది? ఏం చేస్తూంటే తాను ప్రపంచాన్ని మరచి పనిలో నిమగ్నమవుతున్నాడు? ఏ పని ఆపబుద్ధి కావటం లేదు! వంటి విషయాలను గమనించాలి. విశ్లేషించాలి. ఎప్పుడైతే పై ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయో, వ్యక్తికి ఏకాగ్రత కుదిరే అంశాలు తెలుస్తాయి. ఏ పనిలో తాను ఉత్తమంగా నిలువగలడో స్పష్టమౌతుంది.

అయితే, తన పరిమితులను ఒప్పుకోవటం అతి కష్టమైన పని. దీనికి తోడు ఎదుటివాడి ఆధిక్యాన్ని అంగీకరించటం అతికఠినతరమైన పని. ఈ రెంటి వల్ల ఎంతోమంది మంచివారు కూడా చెడ్డవారుగా అనిపిస్తారు. ఎంతో శక్తి ఉన్నవారు కూడా బలహీనులై, తమ శక్తిని వ్యర్థం చేసుకుని పనికిరాని వారుగా మిగిలిపోతారు.

తన జీవితాంతం వశిష్ఠుడిని మించిపోవాలని, తానే గొప్పవాడినని నిరూపించు కోవాలని విశ్వామిత్రుడు తపనపడ్డాడు. ఘోరమైన తపస్సు చేశాడు.  సాధించిన శక్తిని వ్యర్థం చేసుకున్నాడు. సృష్టికి ప్రతిసృష్టి చేశాడు. కానీ, చివరికి తన ఓటమిని ఒప్పుకున్న తరువాతే అతని శక్తికి సార్థకత లభించింది. తన పరిమితులను గ్రహించిన తరువాతనే ఆయన 'రాజర్షి' అయ్యాడు. అలాగే శిశుపాలుడు స్వతహాగా శక్తిమంతుడు. కానీ శ్రీకృష్ణుడి ముందు తన శక్తి ఎందుకూ పనికిరాదని గ్రహించలేక పోయాడు. శ్రీకృష్ణుడికి అగ్రతాంబూలం ఇస్తే కురు వృద్ధులు ఆక్షేపించలేదు కానీ, శిశుపాలుడు ఆమోదించలేకపోయాడు.  అనుభవించాడు.

అలాగే శ్రీకృష్ణుడికి ఏ నాడూ తాను ఒకరి కన్న ఎక్కువ, తక్కువ అన్న భావనలు వచ్చినట్టు కనబడదు. అవసరమైతే తనని తాను కుంచింపచేసుకొని ఎదుటివారి అహాన్ని సంతృప్తిపరచాడు.  వీలైనప్పుడు, విశ్వరూపదర్శనమిచ్చి విజ్ఞానభాండాగారాన్ని అందించాడు. అందుకే శ్రీకృష్ణుడు సంపూర్ణవ్యక్తిత్వంతో అలరారేడు.

తాను భీముడిలా గదా – మల్లయుద్ధాలు చేయలేనని తెలుసు. అందుకే భీముడిని ప్రోత్సహించాడు. యుద్ధరంగంలో దింపి విజేతగా నిలిపాడు. అంటే, తన పరిమితులు, ప్రజ్ఞాపాటవాల పట్ల స్పష్టమైన అవగాహన ఉన్న వ్యక్తి, తనలో లేని శక్తులు ఎదుటివాడిలో ఉంటే చూసి అసూయపడాల్సిన అవసరం లేదన్నమాట. ఎంతైనా 'భూతజాలాలన్నీ

ప్రకృతిబద్ధాలు' కదా! దాంతో, ఇతరులలోని శక్తిని ప్రోత్సహించి, వెలికి తేవాలని ప్రయత్నిస్తాడు. అందుకే, శ్రీకృష్ణుడు, ఓ రకంగా అన్నీ తాను చేయగలిగి ఉండీ, సాధించగలిగి ఉండి కూడా, ఇతరులలో ఉన్న శక్తిని గుర్తించి ప్రోత్సహించాడు. వారిని వీరులుగా నిలపటంలో తాను 'జగన్నాథుడి'లా నిలిచాడు.

రామాయణంలో కూడా గమనిస్తే, రావణాసురుడికి తాను మహావీరుడినని తెలుసు. కానీ 'రాముడు వీరుడ'నగానే మండిపడ్డాడు. రాముడి శౌర్యాన్ని పరీక్షించాలని ఉబలాటపడ్డాడు. రాముడు బలహీనుడని నిరూపించాలని తపించాడు.

ఇందుకు భిన్నంగా, రాముడికి తన శక్తి గురించి ఎటువంటి సందేహాలూ లేవు. కానీ తనకూ కొన్ని పరిమితులున్నాయని గ్రహించాడు. సముద్రం దాటేందుకే కాదు, సీతను వెతికేందుకూ వానరసేన సహాయం కోరాడు. తన పరిమితులను మించాడు. జగతి నీరాజనాలందుకుంటున్నాడు.

అందుకే మన పురాణాలు చదివితే అనేకసందర్భాలలో విష్ణువు, శివుడి సహాయం కోరటం కనిపిస్తుంది. శివుడు విష్ణువుపై ఆధారపడటం కనిపిస్తుంది. త్రిమూర్తులలో ఒకరై సృష్టి స్థితి లయలకు కారణమైన వారు సైతం తమ పరిమితులను అర్థం చేసుకొని, తమ శక్తులకు అనుగుణంగా ప్రవరిస్తున్నారన్నమాట. ఎందుకంటే, సృష్టి సర్వం ప్రకృతి బద్ధం కాబట్టి.

మనిషి ఈ నిజాన్ని గ్రహించినా ఆమోదించటం కష్టం. ఆచరణలో పెట్టటం కష్టం. వ్యక్తిత్వవికాససాధనలో ఈ నిజాన్ని ఆమోదించి, ఆచరించటం అత్యంత ప్రాధాన్యం వహిస్తుంది. 'పరుగు పందెం'లో ఎదుటివాడు తన పక్కనుంచి దూసుకువెళ్ళాడని, దాటిపోయాడని అసూయ చెంది లాభం లేదు. బాధపడి, దూసుకుపోతున్నవాడికి అడ్డుపడి, వాడి వేగాన్ని నిరోధించాల్సిన పని లేదు. తన శక్తి అనుసారం విజయం కోసం ప్రయత్నించాలి. కుదరకపోతే సహృదయంతో ఎదుటివాడి విజయాన్ని ఆమోదించాలి.

ఇది అర్థం చేసుకోకపోవటం వల్ల ఎంతో మంది వ్యక్తిత్వం దెబ్బ తింటుంది. ఆఫీసులో తన తోటివాడు పైకి వెళ్తున్నాడని వాడిని కిందికి లాగేయటం నుంచి ఎదురింటివాడు బాగుపడుతున్నాడనో, పొరుగింటివాడు ఎంతో పేరు తెచ్చుకుంటున్నాడనో ఏడవటం వరకూ నిత్యజీవితంలోని అనేకసూక్ష్మాంశాలపై ఈ నిజం ప్రభావం చూపిస్తుంది. ఎంతెంతో పెద్దవాళ్ళను చిన్నవాళ్ళుగా చేసి చూపిస్తుంది. ఈ విషయాన్ని ఓ హిందీ కవి చక్కగా చెప్పాడు.

*'తేరే గిర్‌నేఁమేఁ భీ తేరీ హార్ నహీఁ*
*కె, తూ ఆద్మీ హై అవతార్ నహీఁ'*

(నువ్వు విఫలమవటంలో నీ తప్పేమీ లేదు. ఎందుకంటే, నువ్వు మనిషివి, దైవావతారానివి కాదు). అయితే ఓటమిని దాచుకొనేందుకు ఇది ముసుగు కారాదు. విఫలమవటంలో తప్పు లేదు. ప్రయత్నించకపోవటంలో తప్పు ఉంది. తన ప్రయత్నలోపాన్ని తన పరిమితులపై ఆరోపించి నిర్వ్యాపారంగా కూర్చోవటంలో ఉంది.

కాబట్టి, ఏకాగ్రత సాధన కోసం ప్రతివారూ ప్రయత్నించినా, ఎవరెవరి స్వభావాన్ని, ప్రకృతిని అనుసరించి వారివారి స్థాయిలో ఏకాగ్రత సిద్ధిస్తుంది. అలాగని 'నాకింతే ప్రాప్తి' అని ప్రయత్నం మానేయటం పొరపాటు. 'ఎదుటి పిల్లవాడికి వంద మార్కులు వచ్చాయి, మా అబ్బాయి ఎంత చదివినా మార్కులు రానేరా'వని వాపోవటం వల్ల మన ఆరోగ్యం పాడవటమే కాదు, పిల్లలను మానసికంగా దెబ్బ తీసినవారమౌతాం. అలాగే కొలీగు ఏదో సాధించేశాడని, మనమేదో సాధించలేదని బాధపడటం వల్ల కూడా అవసరమైన న్యూనతాభావానికి గురై ఆరోగ్యం పాడు చేసుకున్నవారమౌతాం.

'వ్యక్తిత్వవికాసం'లో అత్యంతప్రాధాన్యం వహించే సూత్రం ఇదే. ప్రతి వ్యక్తీ తన వంతు ప్రయత్నం నిజాయితీగా, సంపూర్ణంగా చేయాలి. కానీ ప్రతి వ్యక్తీ ప్రకృతి బద్ధుడని గ్రహించాలి. జన్మతో వచ్చిన స్వభావబద్ధుడని అర్థం చేసుకోవాలి. తన పరిమితులను గ్రహించి పనిచేయలని ప్రయత్నించాలి. తన శక్తిని గుర్తించి దాన్ని సంపూర్ణంగా వాడుకోవాలని ప్రయత్నించాలి. అంతే, ఫలితం గురించి ఆలోచించవద్దు. ఎదుటివాడు తనని దాటిపోయినా బాధపడవద్దు. ఎందుకంటే ప్రతి వారికీ శక్తులుంటాయి. పరిమితులుంటాయి. ఎవరెవరు తమ శక్తిని ఏ రకంగా వాడుతూ, పరిమితులను లాభ దాయకంగా ఉపయోగించుకుంటారో వారు విజేతలౌతారు. గెలిచినవారి గొప్పలేదు. ఓడినవారు తక్కువ కాదు. ఎందుకంటే ప్రతివారూ ప్రకృతినియమాలకు, పరిమితులకు లొంగి ప్రవర్తించేవారే. భగవద్గీత ఈ నిజాన్ని మరో కోణం లోంచి చెప్తుంది.

*తత్త్వవిత్తు మహాబాహో! గుణకర్మ విభాగయోః।*
*గుణాగుణేషు వర్తంతే ఇతి మత్వా న సజ్జతే॥*

ప్రకృతి గుణాలు, వాటి వల్ల స్వాభావికంగా ఉత్పన్నమయ్యే కర్మలు, వీటి తత్త్వాన్ని గ్రహించి ప్రపంచంలోని శక్తులన్నీ నియమాలలో ఒదిగి వర్తిస్తున్నాయని అర్థం చేసుకుని, కర్మఫలాలపై ఆసక్తి లేకుండా మెలగాలి.

## చెడు స్నేహాలు

వ్యక్తిత్వ వికాస సాధనమార్గంలో మనం కీలకమైన దశలో ప్రవేశించాం. వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన అనేక అంశాలను గురించి విస్తృతంగా, విపులంగా చర్చించాం. ప్రాచీన భారతీయసాహిత్యం నుండి అవసరమైన ఉదాహరణలను, దృష్టాంతాలను తీసుకుని విశ్లేషించాం. ఈ అంశాలను నిత్యజీవితంలో అమలుపరచటం వల్ల వ్యక్తి ఉత్తముడుగా ఎదగటం సాధ్యమౌతుందని గ్రహించాం. అయితే నిత్యజీవితంలో గుర్తుంచుకుని పాటించవలసిన సూక్ష్మాంశాలు అనేకం ఉన్నాయి. మన సాహిత్యకారులు ఇటువంటి అనేకవిషయాలను ఎంతో సరళంగా వివరించారు. చక్కని ఉదాహరణలతో మన ముందుంచారు. వీటిని తెలుసుకుని ఆచరణలో పెట్టాలని ప్రయత్నించటం వ్యక్తిత్వవికాసంలో మరో ప్రధానఘట్టం. ఎందుకంటే, ఎవరితో ఎలా వ్యవహరించాలి, ఎప్పుడు, ఏం మాట్లాడాలి, ఏ విషయానికి ఎలా స్పందించాలి వంటి విషయాలు వ్యక్తిత్వవికాసంలో అత్యంతప్రాధాన్యం వహిస్తాయి.

*కానివాని తోడ గలసి మెలగుచున్న*
*గానివాని గానె కాంతు రతని*
*తాటి క్రింద పాలు ద్రాగిన చందమౌ*
*విశ్వదాభిరామ వినుర వేమ.*

మంచివాడైనా, దుష్టులతో కలసి తిరిగితే చెడ్డవాడనే పరిగణనకే గురవుతాడు. తాటి చెట్టు కింద కూచుని పాలు తాగుతున్నా, తాటికల్లు తాగుతున్నాడనే అనుకుంటారు కదా! వ్యక్తిత్వ వికాసంలో ప్రధానసూత్రం ఇది.

'వాడి మిత్రులెవరో చూపించు. వాడెటువంటివాడో చెప్తాను' అంటాడో తత్త్వవేత్త. అంటే, మన మిత్రుల ద్వారా మన వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతుందన్న మాట.

సాధారణంగా, ప్రతి వ్యక్తికీ, ఇష్టాయిష్టాలుంటాయి. ఆ ఇష్టాయిష్టాలు అతడు పెరిగిన వాతావరణం, సంస్కారం వంటి అంశాలపై ఆధారపడి ఉంటాయి. ఆ ఇష్టాయిష్టాల ఆధారంగా అతడు కొందరు వ్యక్తులకే సన్నిహితుడవుతాడు. అందరితో కలసి తిరుగుతున్నా, కొందరి తోటే అత్యంతసన్నిహితంగా వెళ్ళగలుగుతాడు. ఈ సన్నిహితులెవరో గమనిస్తే చాలు, వ్యక్తి స్వభావస్వరూపాలు బోధపడతాయి. వారు మంచివారైతే పరవాలేదు. వారు చెడ్డవారైతే, వ్యక్తి మంచివాడైనా అనుమానాస్పదుడే

అవుతాడు. ఎందుకంటే, అటువంటివారి సాంగత్య ప్రభావం వ్యక్తిపై ఎంతైనా ఉంటుంది. ఏదో ఓ రోజు అది ఫలితాన్ని చూపిస్తుంది. ఎందుకంటే,

*వేరుపురుగు చేరి వృక్షంబు చెరచును*
*చీడపురుగు చేరి చెట్టు చెఱచు*
*కుత్సితుండు చేరి గుణవంతు చెఱచురా*
*విశ్వదాభిరామ వినురవేమ!*

వేరు పురుగు వృక్షాన్ని, చీడపురుగు చెట్టును నాశనంచేసినట్టు, దుర్మార్గుడు గుణవంతుడిని పాడు చేస్తాడు.

అందుకే, ఓ సందర్భంలో వివేకానందస్వామి, 'మీరు గుహలో దాక్కుని అయినా ఓ మంచి ఆలోచన చేయండి. ఎందుకంటే ఆలోచన అత్యంతశక్తిమంతమైనది. గుహలో దాక్కుని చేసిన ఆలోచనే అయినా అది గుహలో గోడలను దాటుకుని, అనంతవిశ్వంలోకి ప్రయాణిస్తుంది. ప్రజల ఆలోచనలపై ప్రభావం చూపిస్తుంది" అంటాడు. కాబట్టి ఎల్లప్పుడు మంచి ఆలోచనలపైనే దృష్టి నిలపాలి. అలా కాక దుర్మార్గులు, దుష్టులుగా పరిగణించే వారి సాంగత్యంలో ఉంటే, వాళ్ళ నడుమ తుచ్ఛమైన ఆలోచనలే వస్తాయి. ప్రభావం చూపిస్తాయి.

చెడ్డవారి స్నేహాన్ని గుర్తించేందుకు సుమతీ శతకకారుడు మార్గం చూపిస్తున్నాడు.

*ఉపమింప మొదలు తియ్యన*
*కపటం బెడ నెడను, జెఱకు కైవడినే పో*
*నెపములు వెదకును గడపట*
*గపటపు దుర్జాతి పొందు గదరా సుమతీ!*

చెఱకు గడ మొదట తియ్యగా ఉండి, తరువాత తీపి తగ్గి, చివరికి చప్పిడియై పోయినట్టు చెడ్డవారితో స్నేహం కూడా ఆరంభంలో బాగా ఉండి, మధ్యలో వికటమై, చివరకు చేటు కలిగిస్తుంది.

*కొంచెపు నరు సంగతిచే*
*నంచితముగ గీడు వచ్చు నది యెట్లన్నన్*
*గించిత్తు నల్లి కఱచిన*
*మంచమునకు పెట్లు వచ్చు మహిలో సుమతీ!*

చిన్న నల్లి కరచినా దాన్ని తొలగించే యత్నంలో భాగంగా మంచానికి దెబ్బలు తగులుతాయి. అలాగే నీచుడితో స్నేహం చేస్తే కీడు కలుగుతుంది.

ఎందుకంటే, పైకి మంచిగా నటించినా, నీచులు మనసులో వేరే రకంగా భావిస్తూంటారు. అటువంటివారితో స్నేహం ఎప్పుడైనా ముప్పు తెస్తుంది. ఈ విషయం కూడా సుమతీశతకకారుడు అత్యంతస్పష్టంగా చెప్పాడు.

*తల నుండు విషము ఫణికిని*
*వెలయంగాఁ దోక నుండు వృశ్చికమునకున్*
*దలఁదోక యనక యుండును*
*ఖలునకు నిలువెల్ల విషము గదరా సుమతీ!*

పాముకు విషం నోట్లో ఉంటుంది. తేలుకు తోకలో ఉంటుంది. కానీ దుష్టుడికి నిలువెల్లా విషం ఉంటుంది. కాబట్టి, స్నేహాలు చేసేటప్పుడు మంచిచెడులు విచారించి చేయాలి. తన లక్ష్యం ఏమిటి, తానేం సాధించదలుచుకున్నాడు, ఈ స్నేహం వల్ల తన లక్ష్యం ఎలా నెరవేరుతుంది అన్న విషయాలు విశ్లేషించి మరీ స్నేహం చేయాలి.

ఉదాహరణకు, పరీక్షల కోసం బాగా చదివే విద్యార్థిని, మాటిమాటికీ వచ్చి బయటకు రమ్మని పిలిచే స్నేహం అంత మంచిది కాదు. చాలా మంది, తాము బాగా చదువుకుని తమ విరామసమయాన్ని గడపడానికి వచ్చి, ఏమీ చదవనట్టు, పరీక్షంటే లెక్క లేనట్టు మాట్లాడతారు. కష్టపడి చదివేవాడిని వెక్కిరిస్తారు. దాంతో చదివేవాడు సైతం తానేదో తప్పు చేస్తున్నట్టు బాధపడతాడు. చదువు వదలుతాడు. దెబ్బ తింటాడు. కాబట్టి, చదవాలనుకున్నవాడు, చదువుతూంటే వచ్చి ఏకాగ్రతకు భంగం కలిగించేవాడి స్నేహాన్ని నిర్మొహమాటంగా వదల్చుకోవాలి.

ఎదుటివాడి ఆశయాలను, ఇష్టాయిష్టాలను గౌరవించే స్నేహం నిజమైన స్నేహం. తాను చెప్పిందే ఎదుటివాడు వినాలి, తాను రమ్మన్నప్పుడు రావాలి, చేయమన్న పని చేయాలి అనేది బానిసత్వం అవుతుంది, స్నేహం కాదు. తన స్నేహితుడిలోని లక్షణాలను విశ్లేషించి, స్నేహం గురించి విచక్షణతో నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. జీవితంలోని ప్రతి విషయంలోనూ ఈ సూత్రం వర్తిస్తుంది.

వివేకానందస్వామి సన్యాసం స్వీకరించాడు. దేశపర్యటన ఆరంభించాడు. పర్యటన ఆరంభించేముందు, తన తోటి సన్యాసులెవరూ తనని అనుసరించరాదని ఆజ్ఞాపించాడు. వివేకానంద జునాగఢ్‌లో ఉండగా, తోటి సన్యాసి కనిపిస్తే ముఖం తిప్పుకున్నాడు.

ఎక్కడ తన మైత్రీబంధంతో మిత్రుడు, తన లక్ష్యానికి అడ్డు వస్తాడోనని, అతడిని వదిలించుకుని ముందుకు సాగిపోయాడు. విజయం సాధించాలనుకునే వ్యక్తి చేయాల్సిందీ ఇదే. తన లక్ష్యాన్ని సాధించే మార్గానికి అడ్డంకులుగా నిలిచేవారందరినీ వదలి ముందుకు సాగాలి.

గమనిస్తే, విజేతలు అనేకులు ఏదో ఓ దశలో సమాజంలో పిచ్చివారుగా పరిగణనకు గురైనవారే. తమ లక్ష్యంపై వారి దృష్టి ఎంతగా కేంద్రీకృతమై ఉంటుందంటే, ఇతర విషయాలన్నీ వారికి పనికిరానివిగా కనిపిస్తాయి. తన దృష్టి దేనిపై కేంద్రీకృతమై ఉందో, ఆ విషయానికి సంబంధించినవే గుర్తుంటాయి. ఆ విషయాలు మాట్లాడేవారే వారికి స్నేహితులవుతారు. అందుకే ఒకే రకమైన పక్షులు ఒకే గూటికి చేరతాయంటారు! కాబట్టి మనిషి మంచివాడైనా, చెడ్డవారితో స్నేహం, వాడి మంచితనాన్ని మరపుకు తెస్తుంది. ఒకే గూటిపక్షి అయిపోతాడు. ఈ నిజాన్ని భాస్కరశతకకారుడు కూడా స్పష్టంగా నొక్కి చెప్పాడు.

*అనఘునికైన జేకుఱు ననర్హుని గూడి చరించినంతలో*
*మనమెరియంగ నప్పు డవమానము గీడు ధరిత్రి యందు నే*
*యనువుననైన దప్పవు యథార్థము తానది యెట్టులన్నచో*
*నినుమును గూర్చి యగ్ని నలయింపదె సమ్మెట పెట్టు, భాస్కరా!*

ఇనుముతో కలవటం వల్ల అగ్నిదేవుడు కూడా సమ్మెట పోట్లు అనుభవించాల్సి వస్తుంది. అలాగే దుష్టుడితో కూడితే, మంచివారు కూడా దెబ్బ తింటారు. ఇంకా ఈ విషయంలో ఎవరికైనా సందేహం ఉంటే, దానిని పటాపంచలు చేసేందుకన్నట్టు మరో పద్యంలో ఈ సత్యాన్ని మరింత చక్కగా చెప్పాడు.

*ఊరక సజ్జనుం డొదిగి యుండిననైన దురాత్మకుండు ని*
*ష్కారణ మోర్వలేక యపకారము చేయుట వాని విద్యగా*
*చీరెలు నూరు టంకములు చేసెడివైనను బెట్టె నుండగా*
*జేరి చినింగి పోగొఱుకు చిమ్మెట కేమి ఫలంబు? భాస్కరా.*

పెట్టెలో విలువైన చీరలున్నా, తనకేమీ లాభం లేకున్నా చిమ్మెట పురుగు వాటిని కొరికి పాడు చేస్తుంది. అలాగే దుష్టుడు, సజ్జనుల దగ్గర చేరి వారిని నాశనం చేస్తాడు. అందుకే 'దుష్టులకు దూరంగా ఉండాలి' అంటారు పెద్దలు.

మరో పద్యంలో

*ఎడపక దుర్జనుం డొరుల కెంతయు గీ డొనరించు గాని యే*
*యెడలను మేలుసేయ డొక యించుకయైనను, జీడపుర్వు తా*
*జెడ దిను నంతె కాని పుడిసెండు జలం బిడిఁ బెంపనేర్చునే*
*పొడవగుచున్న పుష్పఫలభూరుహ మొక్కటినైన, భాస్కరా!*

పళ్ళతో, పుష్పాలతో అలరారే చెట్టు నాశనమయ్యేట్టు తింటుంది కానీ, ఒక్క చుక్క నీరైనా పోసి ఆ చెట్టును పెంచుతుందా చీడపురుగు? అలాగే దుర్మార్గుడు ఇతరులకు అపకారం చేస్తాడే తప్ప ఉపకారం చేయడు. వ్యక్తి అటువంటివాడని గ్రహించిన మరుక్షణం దూరంగా ఉండటం మంచిది. అయితే, మంచి, చెడ్డ అని మనుషులను చూడగానే తెలుసుకోవటం కష్టం. అనుభవం ద్వారా గ్రహించేసరికి జరగాల్సిన హాని జరిగిపోతుంది. కాబట్టి ఇటువంటి విషయాలలో పెద్దల సలహాను పాటించాల్సి ఉంటుంది.

*కానక చేరబో దలతికర్ముడు నమ్మిక లెన్ని చేసినన్*
*దానది నమ్మి వాని కడ దాయగ బోయిన హాని వచ్చు న*
*చ్చో నది యెట్లనన్ గొరుక చూపుచు నొడ్డన బోను మేలు గా*
*బోనని కాన కాసపడిపోవుచు గూలదె కొక్కు భాస్కరా!*

బోనులో ఆహారం చూసి, ఆశపడి, ప్రమాదాన్ని గ్రహించక పందికొక్కు ప్రాణాలను కోల్పోతుంది. అలాగే మంచివాడు సైతం, దుర్జనులు చేసే పైపై మంచి పనులు (ఎరలు) చూసి మోసపోతారు.

అనుభవాన్ని చిలికి తేటను అత్యంతసరళంగా, సులభంగా మనకందిస్తున్నారు మన పూర్వికులు. వారి అనుభవాల సారాలలోని సత్యాన్ని గ్రహించి మన నడవడిని తీర్చుదిద్దుకోవటం వ్యక్తిత్వవికాసంలో ప్రధానపాత్ర వహిస్తుంది.

## బుద్ధిమంతుడు

మన ప్రాచీనసాహిత్యంలో అడుగడుగునా వ్యక్తి బుద్ధిమంతుడుగా ఎదిగేందుకు అనేకసూచనలను పొందుపరచారు మన పూర్వికులు. కానీ కాలక్రమేణా 'బుద్ధిమంతుడు' అన్న పదానికి అర్థం మారిపోయింది. ఒకప్పుడు బుద్ధిమంతుడంటే ఉత్తముడు అన్న అర్థం ఉండేది. ప్రతి పిల్లవాడు, విద్యార్థి, యువకుడు 'బుద్ధిమంతు'డన్న పొగడ్త కోసం తపించే వాడు.

కానీ ఒక పద్ధతి ప్రకారం 'బుద్ధిమంతుడు' అంటే 'అమాయకుడు', 'పనికిరానివాడు' అన్న అర్థాలు స్థిరపడ్డాయి. బుద్ధిమంతుడన్నది చేతకానితనానికి పర్యాయపదంలా

మారింది. పాఠాలు శ్రద్ధగా విని నేర్చుకునేవాడు హేళనకు పాత్రుడయ్యాడు. కాలేజీకి వెళ్తే సిగరెట్లుతాగి, మద్యం సేవించి, అమ్మాయిలను ప్రేమించి, లెక్చరర్లను ఏడ్పించేవాడు హీరో అయ్యాడు. ఆపై హింసకు దిగి అందరినీ తన్ని బెదిరించేవాడు ఆదర్శ ప్రాయుడయ్యాడు. 'రంగ్ దే బసంతీ' అని ఓ సినిమా వచ్చింది. గత సంవత్సరం ఉత్తమచిత్రంగా పలువురి ప్రశంసలు పొందింది. అల్లరిచిల్లరగా తిరిగే యువత ఓ విదేశీయువతి ప్రభావంతో దేశభక్తులవుతారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పాత్రలు పోషిస్తూ వారి స్ఫూర్తితో తన్మయం చెందుతారు. అవినీతికి పాల్పడుతున్న మంత్రిని చంపేస్తారు. ఇదీ కథ.

గమనించి చూస్తే, ఈ కథలో హీరోలంతా అల్లరిచిల్లరగా తిరిగేవారే. తాగి తందనాలాడేవారే. అమ్మాయి కనపడగానే వెకిలి వేషాలు వేసేవారే. వాళ్ళని ఓ విదేశీవనిత సంస్కరిస్తుంది, అంటే మనల్ని విదేశీయులే సంస్కరించగలరన్నమాట! అలా సంస్కరితులైవాళ్ళు చేసే పని ఏమిటి? చట్టాన్ని తమ చేతుల్లో తీసుకొని అవినీతి పరుడిని చంపటం! అంటే యువకులకు ఎటువంటి సందేశం అందుతోంది? సమాజంపై ఇది ఎటువంటి ప్రభావం చూపుతుంది? పరోక్షంగా హింసను, తీవ్రవాదాన్ని సమర్థిస్తున్నట్లు కాదా? భగత్‌సింగ్, బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా పోరాడేడు. ఈ యువకులు ఎవరికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు? మన సంస్కృతిలో ఉన్న సత్యాగ్రహం, అహింసాపూరిత నిరసన ప్రదర్శనల ప్రసక్తి ఈ సినిమాలోనే రాదు.

ఇది ఒక ఉదాహరణ మాత్రమే. తరచి చూస్తే, సినిమాల్లో ప్రతి కాలేజీలో టీచర్లు బఫూన్లు. విద్యార్థులు ముఖ్యంగా హీరోలు అల్లరి వెధవలు. మగ టీచర్లు ఆడ టీచర్లతో వెర్రివేషాలు వేసేవారు. ఈ మధ్య వచ్చిన మరో హిట్ సినిమా 'మైం హూంనా..' దీన్లో హీరో, టీచర్ గురించి వెర్రిమొర్రి కలలు కంటాడు. టీచర్ కూడా అంత కన్నా ఘోరంగా ప్రవర్తిస్తుంది. ఇదంతా మనకు ఆదర్శం, ఆచరణీయం, అనుసరణీయం అన్నమాట.

పాశ్చాత్యులు ఓ పద్ధతి ప్రకారం మనకు 'సరైన హీరో' లేకుండా చేశారు. మనం మన హీరోలను నీచులుగా చేసుకొని అదే ఆదర్శాన్ని ప్రచారం చేసుకుంటున్నాం. ఈ నేపథ్యంలో మన సాహిత్యంలో పొందుపరిచిన బుద్ధిమంతుడి లక్షణాలను పరిశీలిస్తే, 'వ్యక్తిత్వవికాసా'నికి, బుద్ధిమంతుడుగా ఉండటానికీ ఎంత దగ్గర సంబంధం ఉందో స్పష్టమౌతుంది.

*అనారమ్భో మనుష్యాణాం ప్రథమం బుద్ధిలక్షణమ్*
*ఆరబ్ధస్యాన్త గమనం ద్వితీయం బుద్ధి లక్షణమ్.*

బుద్ధిమంతులైనవాళ్ళు తాము చేయలేమనుకున్న పని ఆరంభించరు. ఆరంభించినదానిని పూర్తి చేస్తే కానీ వదలరు.

'ఆరంభించరు నీచమానవులు' అన్న పద్యానికి దీన్ని అన్వయించుకుంటే, బుద్ధిమంతుల మొదటి లక్షణం స్పష్టమౌతుంది.

ఏదైనా పని చెప్పగానే 'కుదరదు', 'నా వల్ల కాదు', ఇది చేయలేను', అదిచేయలేను' అని వెంటనే తమ చేతకానితనాన్ని స్పష్టంగా చెప్తూంటారు కొందరు. అటువంటివారిని చూడగానే విసుగు వస్తుంది. వాళ్ళకి ఏ పనీ చెప్పబుద్ధి కాదు. వారిని దగ్గర రానీయబుద్ధి కూడా కాదు.

ఇంకొందరు, పని చెప్పగానే 'ఓస్ ఇంతేనా!' అంటారు. చేసేస్తాం, చూసేస్తాం అని ప్రగల్భాలు పలుకుతారు. తీరా పని దగ్గరకు వచ్చేసరికి నీరసించిపోతారు. వారు ఆ పని చేసేస్తారని మనం నిశ్చింతగా ఉంటాం. కానీ వాళ్ల వల్ల పని పూర్తి కాదు. చివరి క్షణంలో అవసరమైన ఆందోళన కలుగుతుంది.

'బుద్ధిమంతులు' ఇందుకు భిన్నం. పని చెప్పగానే తొందరపడి 'చేయలేం' అనరు. ఇంకా తొందరగా చేసేస్తాం అనరు. ఆ పని గురించి క్షుణ్ణంగా తెలుసుకుంటారు. తమ శక్తిని, బలాన్ని, అంచనా వేసుకుంటారు. ఆపై తమ నిర్ణయాన్ని తెలియచేస్తారు. కానీ ఒక్కసారి పని ప్రారంభించారా, ఇక పూర్తయ్యేదాకా వదలరు.

*అశ్వస్యలక్షణం వేగో, మదో మాతంగలక్షణమ్*
*చాతుర్యం లక్షణం నార్యో ఉద్యోగః పురుషలక్షణమ్*

గుర్రానికి ఉండవలసిన లక్షణం వేగం. ఏనుగుకు మదం, స్త్రీకి నేర్పు, పురుషుడికి ఉద్యోగం. ఇక్కడ 'ఉద్యోగం' అన్న పదాన్ని తీసుకొని 'ఉద్యోగం పురుషలక్షణమ్' అన్న అంశం ఆధారంగా, స్త్రీలు ఉద్యోగం చేయాల్సిన పని లేదని కొందరు దుర్వ్యాఖ్యానం చేస్తే, మరి కొందరు ఏదో ఓ ఉద్యోగం చేసి డబ్బు సంపాదించటమే పురుషలక్షణమ్ అని ప్రచారం చేశారు.

'ఉద్యోగం' అంటే ఇప్పుడు మనకు తెలిసిన ఉద్యోగం కాదు. ఈ ఉద్యోగం అర్థం సర్వదా ప్రయత్నశీలుడై ఉండటం. ఏదో టేబిల్ దగ్గర కూర్చుని నెలకింత సంపాదిస్తూ జీవితం గడిపేయటం ఉద్యోగం కాదు. ఉద్యోగం అంటే నిరంతరం సత్యాన్వేషణలో నిమగ్నుడై ఉండటం.

*అజరామరవ త్ప్రాజ్ఞో విద్యా మర్థం సాధయేత్*
*గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మమాచరేత్*

బుద్ధిమంతుడు తనకెన్నటికీ ముసలితనం కానీ, మరణం కానీ రావన్నట్లు విద్యనూ, ధనాన్ని సంపాదించాలి. తన జుట్టూ మృత్యువు చేతుల్లో ఉందన్నట్టు ధర్మం ఆచరించాలి. ఇది 'ఉద్యోగం' అన్నమాట.

*అప్రియం పరుషంచాపి పరద్రోహం పరస్త్రియః*
*అధర్మ మనృతం చైవ దూరాత్ప్రాజ్ఞో వివర్జయేత్*

బుద్ధిమంతుడు అసహ్యమైన మాటలను, పరుషవచనాన్ని, పరులకు ద్రోహాన్ని, అధర్మాన్ని, అసత్యాన్ని దూరంగా విడిచిపెట్టాలి.

అంటే బుద్ధిమంతుడన్నవాడు, తన శక్తి ఎరిగి ఉండటమేకాదు, తన మాటపై నియంత్రణ కూడా కలిగి ఉండాలన్నమాట. ఎందుకంటే అప్రియమైన మాటలు అనర్థాన్ని కలిగిస్తాయి. పరుషవచనాలు ద్వేషాన్ని పెంచుతాయి. పరులకు ద్రోహం చేయటం వల్ల అనవసరమైన కలహాలు, నిందలు భరించాల్సి వస్తుంది. మళ్ళీ ఎదురు తనకు ద్రోహం చేస్తారేమోనని భయపడుతూ జీవించాల్సి వస్తుంది. అధర్మం, అసత్యాలను విడవనివాడు బుద్ధిమంతుడు కాలేడు.

*అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను*
*సజ్జనుండు పల్కు చల్లగాను*
*కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా*
*విశ్వదాభిరామ వినుర వేమ*

ఇంత సున్నితంగా బుద్ధిమంతుడి లక్షణాన్ని వివరించాడు వేమన. కంచు 'ఖంగు'మంటుంది. అందరం చెవులు మూసుకుంటారు. అదే బంగారం మోగదు. కాని అందరూ దాని వెంట పడతారు.

*అల్పాక్షర రమణీయం యః కథయతి నిశ్చితం స వై వాగ్మీ*
*బహువచన మల్పసారం యః కథయతి విప్రలాపీ సః*

తక్కువ మాటలు రమణీయంగా మాట్లాడేవాడు వాక్చాతుర్యం ఉన్నవాడు. సారం లేని ఎక్కువ మాటలు మాట్లాడేవాడు వదరుబోతు. 'కంచు మోగునట్లు కనకంబు మోగునా?'కు మంచి వివరణ ఇది.

ఎంత ఎక్కువ మాట్లాడితే అంత అనవసరమైన మాటలు దొర్లుతాయి. ఏదో మాట్లాడాలని వాళ్ళ గురించి, వీళ్ళ గురించి మాట్లాడాల్సి వస్తుంది. ఈ మాటలు విన్నవాళ్ళు మాటలను మోస్తారు. ఎవరికి చేరకూడదో, వాళ్ళకి మాటలు చేరవేస్తారు. దాంతో మనసులో మనకి ఎదుటివారిపై గౌరవం ఉన్నా, మాటలు మోసే వారి చాతుర్యం వల్ల మన మనసులో మాటను ఎవరూ నమ్మని పరిస్థితి వస్తుంది. దాంతో అనవసరమైన ద్వేషాలు, ఉద్విగ్నతలు, ఆందోళనలు మొదలవుతాయి.

*అపరిచలయా సక్త్యా సుదృశా స్నిగ్ధముగ్ధయా*
*ఋజు పశ్యామి సర్వత్ర తేన జీవా మ్యనామయః*

అన్నింటినీ, అందరినీ చలించని ఆసక్తితో, స్నేహపూర్వకమైన మంచి దృష్టితో, ఏ మాత్రం వంకర లేకుండా చూస్తాను. అందుకే రోగాలు లేకుండా జీవిస్తున్నాను. అంటే, ఎవరి గురించి చెడు మాట్లాడకుండా, చెడుగా ఆలోచించకుండా, కనీసం ఊహలోనైనా వారి గురించి చులకనగా ఆలోచన రానీయకుండా జీవించేవాడు హాయిగా, సంతోషంగా, ఆరోగ్యంగా జీవిస్తాడన్నమాట.

మనం చూస్తూనే ఉంటాం, కొందరు నిజంగా మంచివాళ్ళు. కానీ ఏదేదో మాట్లాడేస్తుంటారు. అందరూ తమ గురించి ఏదేదో అనుకుంటున్నట్టు, తమ వెనుక గోతులు తవ్వుతున్నట్టు ఊహించి బాధ పడుతుంటారు. దాంతో వారి మంచితనం అంతా పనికిరాని దవుతుంది. కాబట్టి ఎదుటివాడి చెడులో కూడా మంచి చూసే ప్రయత్నం చేయాలి. 'చెడు అనవద్దు', చెడు కనవద్దు, చెడు వినవద్దు' ఉత్తముడుగా ఎదిగేందుకు మంత్రం లాంటిదన్నమాట. కాబట్టి 'వ్యక్తిత్వవికాస' మార్గంలో ప్రయాణించేవాడు చేయాల్సిన పని, ముందుగా ఎదుటివారి గురించి చులకనగా మాట్లాడటం, తోటివారిలో చెడు చూడటం మానేయాలి.

కొందరుంటారు, వారి దృష్టిలో తాము తప్ప, మిగతావారంతా పనికి రానివారు. ఎదుటివారు ఏం చేసినా దాన్లో తప్పులు పట్టుతుంటారు. లోపాలు ఎత్తి చూపుతుంటారు. ఇటువంటివారు జీవితాంతం ఎదుటివారిలో లోపాలు వెతుకుతూ, నిందిస్తూ, విమర్శిస్తూ గడుపుతారు తప్ప ఒక్క నిర్మాణాత్మకమైన పని చేపట్టరు.

*తప్పులెన్నువారు తండోపతండంబు*
*లుర్వి జనుల కెల్ల నుండు తప్పు*
*తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు*
*విశ్వదాభిరామ వినుర వేమ*

మనిషి అన్నవాడి వల్ల పొరపాటు జరుగుతుంది. కాబట్టి ఏదో ఓ రూపంలో తప్పులు పట్టేవారు బోలెడంతమంది ఉంటారు. అటువంటివారికి విలువఉండదు. కానీ ఎదుటివారి వైపు ఒకవేలు చూపితే మిగిలిన నాలుగు వేళ్ళు మన వైపు చూపుతాయన్న నిజాన్ని గ్రహించాలి. కాబట్టి రంధ్రాన్వేషణ మానేయటం మంచిది. తప్పులెంచి చూపినా అది సానుభూతితో, అవగాహనతో జరగాలి కానీ ఏదో తానే గొప్ప అన్నట్టుండకూడదు. అందువల్ల మన సహృదయం గ్రహించి ఎదుటివారు మనం చెప్పింది విని అర్థం చేసుకుంటారు. అలా కాక, ఏదో రంధ్రాన్వేషణ చేస్తూ, మనం గొప్ప, ఎదుటివాడు చేతకానివాడు అన్నట్టు మాట్లాడితే మంచి కూడా 'చెడు'లా వినిపిస్తుంది.

అనుకురుత : ఖలసుజనావగ్రిమ మిశ్చాత్య భాగయోః సూచ్యాః

విదధుత్రిరన్ధ్రమేకో గుణవానన్యస్తు పిదధాతి

దుర్జనుడు సూదిమొన లాంటివాడు. ప్రతిదానికీ రంధ్రాలు చేస్తూంటాడు. బుద్ధిమంతుడు దారాన్ని తీసుకుపోతున్న సూది లాంటివాడు. దుర్జనుడు చేస్తున్న రంధ్రాలను పూడ్చుకుంటూ పోతుంటాడు. అంటే దుర్జనుడు ఎదుటివాడిలో లోపాలను వెతుకుతూంటే, బుద్ధిమంతుడు ఆ లోపాలను కప్పేస్తూ మంచిని పంచుతూంటాడన్నమాట.

# వ్యక్తిత్వం - ధనం

## ధనమూలం ఇదమ్ జగత్

భారతీయతత్త్వమన్నా, శాస్త్రమన్నా సమాజంలో అనేకమైన అపోహలు నెలకొని ఉన్నాయి. భారతీయ సాంప్రదాయికజీవనవిధానం ద్వారా 'వ్యక్తిత్వవికాసం' అనగానే పెదవి విరుస్తారు. 'ఏముంది, అన్నీ వదిలేసి సన్యాసిగా ఉండటమే వ్యక్తిత్వవికాసం అంటారు' అని ఈసడిస్తారు. కానీ భారతీయతత్త్వం అర్థం చేసుకున్నంతగా 'ధనతత్త్వాన్ని ప్రపంచంలో మరే సంస్కృతీ అర్థం చేసుకోలేదనటం అతిశయోక్తి కాదు. ధన స్వరూపాన్ని అర్థం చేసుకున్నారు. ధనతత్త్వాన్ని శోధించారు. మానవమనస్తత్త్వంలో ఉన్న వైచిత్రిని, ధనతత్త్వంతో ముడిపెట్టారు. ఆపై ధనసంపాదనకు ధర్మంతో విడదీయరాని సంబంధం కల్పించారు. భారతీయ ప్రాచీనగ్రంథాలలో ధనం గురించి పొందుపరచిన అంశాలను పరికిస్తే ఈ విషయం మరింత స్పష్టమౌతుంది.

*అపనీతం సునీతేన యో అర్థం ప్రత్యానినీషతే*
*మతిమాస్థాయ సుదృఢాం తద్ కాపురుష వ్రతమ్॥*

మహాభారతంలోని ఈ శ్లోకం ప్రకారం నష్టమైన ధనాన్ని బుద్ధిబలం ఉపయోగించి తిరిగి సంపాదించడానికి ప్రయత్నించడమన్నది ఉత్తమపురుషుల వ్రతం. అంటే ధనం కోల్పోతే, అంతా 'దైవసంకల్పం' అని ఊరుకోవటం చేతకానితనం అన్నమాట. పోగొట్టుకున్న ధనాన్ని తిరిగి సంపాదించేవాడే ఉత్తముడన్నమాట. భారతంలో జూదంలో ధర్మరాజు సర్వం పోగొట్టుకున్నాడు. ఆట నియమాలను పాటించాడు. ఆ తరువాత తన హక్కును కోరాడు. కనీసం ఒక ఊరైనా ఇమ్మని అడిగాడు. ఎక్కడ హక్కు దొరకదో, అక్కడ పోరాడి హక్కును సాధించాలన్న సూత్రాన్ని అనుసరిస్తూ, కురుక్షేత్రయుద్ధంలో పాల్గొన్నాడు. తాను కోల్పోయిన సామ్రాజ్యాన్ని సాధించాడు. అంతే కానీ, 'అంతా విధివైపరీత్యం' అని నెత్తిన గుద్దేసుకుని ఓ మూల కూర్చోలేదు. వేదాంతం నిర్వ్యాపారాన్ని నేర్పుతుందన్నది ఓ దుష్ప్రచారం తప్ప మరేమీ కాదని మహాభారతగాథ నిరూపిస్తుంది.

'ఇయాకోక్క' అనే ఓ వ్యక్తి, ఫోర్డ్ కంపెనీలో ఉద్యోగం కోల్పోయాడు. ఉద్యోగం పోయినా నిరుత్సాహపడకుండా కొత్త వ్యాపారంలో చేరి ధనవంతుడయ్యాడు. తన అనుభవాలను పుస్తకరూపంలో ప్రచురించి కోట్లు గడించాడు. అతడిని ఆదర్శంగా తీసుకుంటా రనేకులు. కానీ అతడి తలదన్నే కథలు మన సమాజంలో బోలెడన్ని ఉన్నాయి. గోయెంకా, నారాయణమూర్తి, అంబానీ వంటివారు ఎంత నిరుపేద స్థితి నుంచి ధనవంతులయ్యారో తెలుసుకుంటే 'ఇయాకోక్క' ఓ మూలకు పనికి రాడు. ఎందుకంటే, ధనం సంపాదించడమన్నది మన సంస్కృతిలో ఓ ధర్మం.

*అనిర్వేదః శ్రియో మూలం లాభస్య చ శుభస్య చ*
*మహాన్ భవిత్య నిర్విణ్ణః సుఖం చానన్త్య మశ్నుతే॥*

భారతంలోని ఈ శ్లోకం ఐశ్వర్యానికి మూలాన్ని బోధిస్తుంది. నిరుత్సాహం చెందకుండా ఉండటం ఐశ్వర్యానికి మూలం. లాభానికి, శుభానికి కూడా అదే ఆధారం. నిరుత్సాహం చెందనివాడు గొప్పవాడవుతాడు. అనంతమైన సుఖాన్ని పొందుతాడు. అంటే పరాజయానికి క్రుంగిపోకూడదన్నమాట. ఉత్సాహంగా మరో పథకంతో ముందుకు దూకాలి. నిరుత్సాహపడితే లాభం లేదు.

అర్థశాస్త్రం కూడా ఈ విషయాన్ని స్పష్టంగా చెప్తుంది

*అనుత్థానే ధ్రువో నాశః ప్రాప్తస్యా నాగతస్యచ*
*ప్రాప్యతే ఫలముత్థానా ల్లభతే చార్థ సంపదమ్*

మానవుడు సర్వదా ప్రయత్నశీలుడుగా లేకపోతే ఇంతకు ముందు సంపాదించిందీ, భవిష్యత్తులో లభించబోయేది కూడా నశిస్తుంది. ప్రయత్నశీలుడై ఉండటం వల్ల ఫలం లభిస్తుంది. అర్థసమృద్ధి కలుగుతుంది.

ఇక, ఎటువంటివాడిని లక్ష్మి స్వయంగా వచ్చి చేరుతుందంటే,

*అనాగతవిధాతా రమ అప్రమత్త మకోపనమ్*
*స్థిరారమ్భ మదీనం చ నరం శ్రీరుపతిష్ఠతే॥*

రాబోయేదానికి ఇప్పుడే ప్రతిక్రియ చేసేవాడిని, ఏమరుపాటు లేనివాడిని, కోప స్వభావం లేనివాడిని, ప్రారంభించిన పనిలో స్థిరంగా ఉండేవాడిని లక్ష్మి స్వయంగా వరిస్తుంది. ఇప్పుడు స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే విధానాల గురించి చాలా పుస్తకాలు వస్తున్నాయి. ఆ పుస్తకాలు వందల కొద్దీ పేజీల్లో చెప్పే దాన్ని రెండు పాదాల్లో

పొందుపరచిందీ శ్లోకం. స్టాక్ మార్కెట్‌కే కాదు, ప్రతి వ్యాపారానికి శ్రీరామరక్ష వంటిదీ శ్లోకం.

రాబోయేదానిని ముందే ఊహించి జాగ్రత్తపడటం ఏ రంగంలోనైనా అత్యంత ఆవశ్యకమైంది. ఒకప్పుడు 'బెల్లం' వ్యాపారం చాలా లాభసాటి వ్యాపారం. కానీ ఇప్పుడూ అదే వ్యాపారం చేస్తానంటే కుదరదు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా వ్యాపారాన్ని మార్చుకోవాల్సి ఉంటుంది. మార్పు పవనాలు వీచే దిశను పసికట్టి, వ్యాపారదిశను మార్చటం ఉత్తమవ్యాపారి ప్రథమలక్షణం.

ఉదాహరణకు, సినిమా పాటలను అమ్మే క్యాసెట్లు చాలా ఖరీదుగా ఉండేవి. సామాన్యులకు టేప్ అందుబాటులో ఉన్నా, క్యాసెట్లు అందుబాటులో ఉండేవి కావు. ఇది గమనించిన 'గుల్షన్ కుమార్' అనే వ్యక్తి చవకలో, తక్కువ ధరకు క్యాసెట్లు అమ్మటం ఆరంభించాడు. ఒకే క్యాసెట్‌లో రెండు – మూడు సినిమాల పాటలు అందించేవాడు. అలా ఆరంభించిన అతని వ్యాపారం 'టి–సీరీస్' స్థాపనతో, సినీ పాటల వ్యాపారాన్ని రూపాంతర మొందించింది.

మిగతా కంపెనీలు 'టి–సీరీస్'ను అనుసరించే సమయానికి ఆయన కొత్త త్రోవ తొక్కాడు. పాత హిట్ పాటలను చిన్న గాయకులతో పాడించి అమ్మటం ఆరంభించాడు. అది ఇప్పటి 'రీ–మిక్స్'లకు నాంది పలికింది. అదీ అందరూ చేసే సమయానికి, పాటలను ముందే రికార్డు చేసి, సినిమా సందర్భానికి తగ్గ పాటలను అమ్మటం ప్రారంభించాడు. పాటలు ముందే రికార్డు చేసి, పాటల చుట్టూ కథ అల్లి తానే సినీ నిర్మాణం చేపట్టాడు. దాన్నీ అందరూ అనుసరించేసరికి భజనల వైపు దృష్టి మళ్ళించాడు. ఆయన మరణించినా, ఇప్పటికీ 'వైష్ణోదేవి'కి వెళ్తే గుల్షన్ కుమార్ గుర్తుకు రాకమానదు. ముందు చూపుకూ, పరిస్థితికి తగ్గట్టు పథకాలను మార్చి ధనం సంపాదించటానికీ, వ్యాపారంలో ముందు చూపుకీ గుల్షన్ కుమార్ మంచి ఉదాహరణ. అయితే, ధనం ఎటువంటివారి వద్ద నిలవదో కూడా శాస్త్రంలో స్పష్టంగా చెప్పారు.

*అత్యార్య మతిదాతార మతిశూర మతివ్రతమ్*
*ప్రజ్ఞాభిమానం చైవ శ్రీర్భయాన్నోపసర్పతి॥*

అతిమంచివాడినీ, అతిదానపరుడినీ, ఎక్కువ శౌర్యం ప్రదర్శించేవాడినీ, ఎక్కువ వ్రతాలు, నియమాలు ఆచరించేవాడినీ, తెలివైనవాడినన్న గర్వం చూపేవాడినీ లక్ష్మి సమీపించదు.

మంచితనం ప్రతివ్యక్తిలో వాంఛనీయమే. కానీ అతి మంచితనం కూడదు. సినీనటుడు నాగయ్య గురించి అందరూ గొప్పగా చెప్తారు. కానీ ఆయన డబ్బును అతిదానంతో విచ్చలవిడిగా, అడిగినవారికి లేదనకుండా ఖర్చు చేసేసేవాడు. షూటింగ్ చూసేందుకు వచ్చినవారందరికీ భోజనాలు పెట్టి పంపేవాడు. ఆయన చివరి దశలో ఆయన తిండికి కష్టమైపోయింది. అతని దగ్గర సహాయం పొందిన వారెవరూ ఆయనను పట్టించుకోలేదు. ఎవరో కృతజ్ఞత ఉన్న వారిద్దరు ముగ్గురు ఆయనకు చిన్న వేషాలిచ్చి డబ్బిచ్చేవారు. ఎందుకంటే, ఊరికే ఇస్తే ఆయన తీసుకోడు కాబట్టి. అందుకే అతిమంచివాడి దగ్గర కూడా లక్ష్మి నిలవదంటుంది మహాభారతం. అంటే ధనాన్ని సంపాదించటం ఎంత ప్రాధాన్యమో, దాన్ని నిలబెట్టుకోవటం కూడా అంత ప్రాముఖ్యం వహిస్తుందన్న మాట.

ధనం సంపాదన ఆవశ్యకత గురించి కూడా మన ప్రాచీనగ్రంథాలు స్పష్టంగా వివరించాయి.

*అర్థేభ్యోసి హి వృద్ధేభ్యః సంవృత్తేభ్యస్తతస్తతః*
*ప్రవర్తన్తే క్రియాః సర్వాః సర్వతేభ్య ఇవాపగాః॥*

పలు మార్గాల నుంచి ధనం వచ్చి చేరుతూంటే, పర్వతాల నుండి వాగులు చేరి నదులు ఏర్పడినట్టు అన్ని పనులూ సిద్ధిస్తాయి. అంటే, డబ్బు ఉంటే, అన్ని కార్యాలు సాధ్యమౌతాయన్న మాట.

*అశనాదిన్ద్రియాణీవ స్యుః కర్మాణ్యభిమన్యసి*
*ఏతస్మా త్కారణా ద్విత్తం సర్వసాధన ముచ్యతే॥*

భోజనం చేస్తే ఇంద్రియాలు పని చేసినట్టు, ధనం ఉంటేనే అన్ని పనులూ అవుతాయి. కాబట్టి, ధనం అన్నింటికీ ఉపయోగించే సాధనం. ఇంత కన్నా సులభంగా ధనావశ్యకతను చెప్పటం కుదరదు. శరీరానికి భోజనం ఎలాగో, వ్యవహారానికి ధనం అలాగ.

*అర్థేన చ విహీనస్య పురుష స్సాల్ప మేధసః*
*ఉచ్ఛిద్యన్తే క్రియాః సర్వాః గ్రీష్మే కుసరితో యథా॥*

ధనం లేనివాడు తలపెట్టిన పనులన్నీ గ్రీష్మఋతువులో చిన్న నదులు ఎండి పోయినట్టు నశిస్తాయి. అంటే, ధనం లేనివాడు ఏ పనీ చేయలేడని అర్థం. వాడు మంచి పనులు చేయాలని సంకల్పించినా సాధ్యం కావాలంటే ధనం అవసరం. అందుకే

హిందూధర్మం పునరుజ్జీవనం కోసం జీవితాన్ని వెచ్చించిన వివేకానందుడు పాశ్చాత్య దేశాలకు వెళ్ళి హిందూధర్మబోధచేశాడు. పాశ్చాత్యులు ధనవంతులు. వాళ్ళకి ఆధ్యాత్మిక, చింతనలేదు. భారతీయులు పేదవారు. అనంతమైన ఆధ్యాత్మిక సంపద ఉంది. కానీ ఈ ఆధ్యాత్మికసంపదను అర్థం చేసుకోకుండా వ్యర్థమైన వాదాల వెనుక తమ చేతకానితనాన్ని దాచుకుంటున్నారు. అందుకే వివేకానందుడు పాశ్చాత్యులను హిందూ ధర్మం పట్ల ఆకర్షితులను చేసి, వారి ధనం ద్వారా భారతీయులను జాగృతం చేయాలని ప్రయత్నించాడు. తప్పుడు ఆధ్యాత్మికవాదాలలో నిద్రిస్తున్నవారిని జాగృతం చేసి భౌతికత, ఆధ్యాత్మికతల నడుమ సమన్వయం నేర్పాలని ప్రయత్నించాడు. తాను ఒక్క పైసను స్వయంగా స్వీకరించకున్నా, హిందూధర్మోద్ధరణకు విరాళాలు సేకరించాడు.

*అసహాయః సమర్థో అపి తేజస్వీ కిం కరిష్యతి*
*నిర్వాతే జ్వలితో వహ్నిః స్వయమేవ ప్రశామ్యతి॥*

ఎంత సమర్థుడైనా, తేజోశాలి అయినా అర్థసహాయం లేకపోతే ఏమీ చేయలేడు. గాలి లేని చోట మండినా, అగ్ని దానంతట అదే శాంతిస్తుంది కాబట్టి ధనసంపాదన అన్నది మానవజీవితంలో అత్యంత ఆవశ్యకమైన అంశం అన్నమాట. అందుకే ధన సంపాదన నుంచి మనిషి విరమించటమంటే తన విధ్యుక్తధర్మాన్ని పాటించనట్టే అన్నమాట. ప్రపంచంలో ధనం ప్రాముఖ్యాన్ని వేమన అత్యంతసరళంగా, స్పష్టంగా వివరించాడు.

*ధనమే మూలము జగతికి*
*ధనమే మూలంబు సకల ధర్మంబులకున్*
*గొనములు మూలము సిరులకు*
*మనసే మూలంబు ముక్తి మహిమను వేమా!*

ప్రపంచమంతటికి ధనమే మూలం. సకల సంపదలకు ధనమే మూలం. సంపదలకు మంచి గుణాలు కారణం. మోక్షానికి మూలం మనస్సు.

ఐతే ధనసంపాదన ఎంత ఆవశ్యకమైన అంశమైనా 'అతి సర్వత్ర వర్జయేత్' అన్న నిజాన్ని గుర్తుంచుకోవాలి. వ్యక్తిత్వవికాసంలో ప్రధానాంశం ఇది. ధనం వల్ల కలిగే నష్టాలు, కష్టాలు, ధనం సంపాదించటంలో అనుసరించవలసిన పద్ధతులు, ధనాన్ని దానం చేయటంలో చూడాల్సిన అంశాలు కూడా మన పూర్వికులు మనకందించారు. ధనం ప్రాధాన్యాన్ని వివరిస్తూ, ధనానికి దాసులు కాకుండా, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకొనే సూత్రాలను వివరించారు.

## ధనవంతుడు – గుణవంతుడు

ధనమేరా అన్నిటికీ మూలం, ఆ ధనం విలువ తెలుసుకొనుట మానవధర్మం' 'లక్ష్మీనివాసం' అనే పాత సినిమాలోని పాట ఇది. 'ధనం విలువ తెలుసు కోవటమే మానవధర్మం' అని నిక్కచ్చిగా చెప్తుందీ పాట. ఎందుకంటే

*'మానవుడే ధనమన్నది సృజియించెనురా,*
*దానికి తానే తెలియని దాసుడాయెరా*
*ధనలక్ష్మిని అదుపులోన పెట్టినవాడే,*
*ధనవంతుడు, గుణవంతుడు, భగవంతుడురా'*

భారతీయధర్మంలో ధనతత్వాన్ని అత్యుత్తమరీతిలో వివరిస్తాయి యీ పంక్తులు. దేనికైనా 'విలువ' కట్టటం చాలా కష్టమైన పని. అందుకే ప్రాచీనసమాజంలో ఒక వస్తువుకు బదులుగా, మరో వస్తువు ఇచ్చిపుచ్చుకునే పద్ధతి ఉండేది. అక్కడకూడా వస్తువు విలువ సరిగ్గా నిర్ణయించటమన్నది సందేహాస్పదంగానే ఉండేది.

విశాఖపట్టణం పరిసరప్రాంతాలలో ఓ ట్రైబల్ తెగ వుండేది. వారు చింతపండును అమ్మేవారు. అక్కడకు కొత్తగా వెళ్ళిన మిషనరీలు ట్రైబల్స్ దగ్గర నుండి పెద్ద ఎత్తున చింతపండు తీసుకొని, వారికి రంగురంగుల 'క్రాసు' బొమ్మలున్న గొలుసు లిచ్చేవారు. ఆ ట్రైబల్స్ ఆ గొలుసులు చూసి మురిసిపోయేవారు. చింతపండుని మార్కెట్లో పెద్ద ధరలను అమ్ముకుని మిషనరీలు డబ్బులు చేసుకునేవారు.

'బార్టర్ పద్ధతి'లో ఇటువంటి లొసుగులున్నాయి. అందుకని సమాజనిర్మాతలు 'ధనం' అనే కొలబద్దని సృష్టించారు. ఆ ధనానికి దేవతగా 'లక్ష్మీదేవి'ని సృష్టించారు. ప్రపంచంలో ఏ ధర్మంలోనూ ధనానికి దేవత ఉన్న దాఖలాలు కనపడవు. ఆ లక్ష్మీదేవి సముద్రమధ్యంలో జనించినట్టు పురాణగాథ.

సముద్రాన్ని మథించింది రాక్షసులు, దేవతలు. అంటే మానవుడి మేథలో మంచి చెడులు కలిసి జరిపిన మథన ఫలితం లక్ష్మీజననం అన్నమాట. లక్ష్మీదేవిని నారాయణుడు స్వీకరించాడు. ఎందుకంటే 'ధనం' మంచివారి వద్ద ఉంటే ఉపయోగ పడుతుంది. నారాయణుడు ధనాన్ని నియంత్రిస్తాడు. ధనం నారాయణుడిపై ఎటువంటి ప్రభావం చూపదు. అందుకే లక్ష్మీదేవి నారాయణుడి కాళ్ళు వొత్తుతూంటుంది. అంటే ధనాన్ని అదుపులో పెట్టివాడు దైవంతో సమానుడు అన్నమాట. వాడే ధనవంతుడు, గుణవంతుడు, బలవంతుడు, భగవంతుడు కూడా.

నారాయణుడి నుంచి నరులు వచ్చారు. నరులకు ఆదర్శం నారాయణుడు. కాబట్టి మనిషి ధనానికి లొంగిపోకూడదు. లోభి కాకూడదు. ధనలక్ష్మినే తన పాదాక్రాంతం చేసుకోవాలి. జీవితం సుఖంగా, సులభంగా కొనసాగించేంత సంపాదించాలి. ఆపై సంపాదనను భగవంతుడికి అంకితం చేయాలి. సమాజసేవలో వినియోగించాలి. కానీ మనిషి ఈ ధనతత్త్వాన్ని అర్థం చేసుకోలేడు. ధనానికి బానిస అవుతాడు.

*ఆశ చేత మనుజు లాయువు గలనాళ్ళు*
*తిరుగుచుండ్రు భ్రమను ద్రిప్పలేక*
*మురికి భాండమందు ముసురు నీగల భంగి*
*విశ్వదాభిరామ వినుర వేమ*

మురికి భాండాన ఈగలు ముసిరినట్టు, ఆయుర్దాయమున్నంత కాలం మనిషి ఆశను త్యజించటం కష్టం. ఆశ ఎటువంటిదైనా, చివరకు అది ధనం వద్దకే చేరుతుంది. కాబట్టి ఆశలను అదుపులో పెట్టుకోవటం అంటే, ధనప్రాధాన్యాన్ని తగ్గించడమేనన్నమాట.

*ఆశ పాపజాతి యన్నిటి కంటెను*
*ఆశ చేత యతులు మోసపోరె*
*చూచి విడచువారు శుద్ధాత్మ లెందైన*

ఆశ చాలా పాపమైనది. ఆశ వల్ల మునులే మోసపోతుంటారు. కాబట్టి ఆశను త్యజించినవారే నిష్కల్మషులు. కానీ, పైకి ధనం అవసరం లేదని, ధన ప్రలోభంలో పడవద్దని ఎన్ని మాటలు చెప్పినా మనస్సులో ధనంపై కోరిక ఉంటుంది. అవకాశం రాగానే ఆ కోరిక మనిషిని కబళించి వేస్తుంది. అందుకే ధనంపై ఆశతో మనుషులు చేయరాని పనులు చేసేందుకు సిద్ధమౌతుంటారు.

*'అర్థార్థీ జీవలోకోఽ యం శ్మశానమపి సేవతే*
*త్యక్త్వా జనయితారం స్వం నిఃస్వంగచ్ఛతి దూరతః'*

మానవుడు ధనం కోసం శ్మశానంలో కూడా నివసిస్తాడు. ధనం లేని కన్నతండ్రిని కూడా వదలి దూరం వెళ్ళిపోతాడు.

*అనిన్ద్యమపి నిన్దన్తి స్తువన్త్య స్తుత్యముచ్చకైః*
*స్వాపతే యకృతే మర్త్యః కిం కిం నామ నకుర్వతే!*

మానవులు ధనం కోసం చెయ్యని పని లేదు. నిందించకూడనివారిని నిందిస్తారు. స్తుతించతగనివాడిని స్తుతిస్తారు.

ఇది ప్రస్తుతం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. ఒకడిని పొగడటం వల్ల లాభం కలుగుతుందనిపిస్తే వాడి అర్హతతో సంబంధం లేకుండా వాడిని పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేస్తారు. అర్హత ఉన్నవాడిని పొగిడినా లాభం లేదనిపిస్తే, వాడి పట్ల ఉదాసీనవైఖరి ప్రదర్శిస్తారు. ఒకవేళ వాడిని పొగడటం వల్ల తన స్థానానికో, గౌరవానికో భంగం కలుగుతుందనిపిస్తే, వాడిని దూషిస్తారు. ఎలాగైనా వాడిని తక్కువ చేయాలని ప్రయత్నిస్తారు. ఆంగ్లేయులు 'ప్రొఫెషనల్ రైవల్రీ' అని అందమైన పేరు పెట్టి ఈ అసూయ, ద్వేషపూరితనిందలను సమర్థిస్తారు. గమనిస్తే, 'ధనం' అది అందించే సౌఖ్యం ఈ రకమైన ప్రవర్తనలను వెన్నంటి ఉంటుంది.

నిజాన్ని గ్రహించిన మన పూర్వీకులు ఈ రకమైన ప్రవర్తనను పలురకాలుగా విమర్శించారు. వ్యంగంగా ఎత్తి చూపించారు.

*కులము గలుగువాడు, గోత్రము గలవాడు*
*విద్య చేత విర్రవీగువాడు*
*పసిడి గలుగువాని బానిస కొడుకులు*
*విశ్వదాభిరామ వినుర వేమ*

కఠినంగా అనిపించినా చేదైన నిజం ఇది. కేవలం అధికారదాహంతో, అది అందించే ధనాశతో గొప్ప గొప్పవారు సైతం విదేశీయులకు బానిసలుగా ప్రవర్తించటం మనం చూస్తున్నాం. తమ ఆత్మ గౌరవాన్ని పక్కన నెట్టి మరీ పాదపూజలు చేయటం చూస్తూనే ఉన్నాం. వ్యక్తిత్వం విడిచి, సిగ్గు లేకుండా ప్రవర్తించటం కేవలం రాజకీయ రంగంలోనే కాదు నిత్యజీవితంలో అనేకవిషయాల్లో మనం చూస్తూన్నాం, అనుభవిస్తున్నాం. ఈ నిజాన్నే చెప్తున్నాడు వేమన. ఎంత తెలివి ఉన్నా ధనం ఉన్న వాడికి బానిస కాక తప్పదు అంటున్నాడు.

అలాగే, మరో సందర్భంలో

*దోసకారియైన దూసరి వాడైన*
*పగతుడైన వేదబాహ్యుడైన*
*ధనికు నెల్లవారు తనియింపుచుందురు*
*విశ్వదాభిరామ వినుర వేమ*

ధనికుడు పాపి అయినా, నీతి దూరు డయినా, శత్రువయినా పొగడక తప్పదు.

ఇదీ మనకు అనుభవమయ్యే సత్యమే.

మన పూర్వికులు ఈ రకంగా ధనాశ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, ధనవంతుడు దుర్జనుడైతే కలిగే అనర్థాలను స్పష్టంగా వివరించారు. ధనాశ వ్యక్తిత్వాన్ని ఎలా హరిస్తుందో నిర్దాక్షిణ్యంగా ప్రదర్శించారు.

*పరగ లేమి చేత బంధువుల్ పగవారు*
*పరగ లేమి చేత బరము తప్పు*
*పరగ లేమి చేత పరపతియును తప్పు*

డబ్బు మనిషికి అత్యంతప్రధానమైన విషయం. కానీ డబ్బు వల్ల చుట్టూ చేరేవారే అధికం. అటువంటివారు డబ్బుతోపాటే వెళ్ళిపోతారు. అందుకే డబ్బు లేనివాడికి చుట్టాలు శత్రువులు అవుతారు. మోక్షం తప్పిపోతుంది. పలుకుబడీ పోతుంది. కాబట్టి ధనం అసలు లేకపోయినా పరవాలేదు. కానీ ఉన్న ధనాన్ని పోగొట్టుకోకూడదు. ధనం దగ్గర ఉన్నప్పుడు ప్రతివాడినీ చేరదీయవద్దు. పొగడ్తలకు పొంగిపోకూడదు. ఎందుకంటే,

*చుట్టములు గాని వారలు*
*చుట్టములము నీకటంచు సొంపు దలిర్పన్*
*నెట్టుకొని యాశ్రయింతురు*
*గట్టిగ ద్రవ్యంబు గలుగ గదరా సుమతీ.*

బంధువులు కానివారు కూడా ధనం ఉన్నవాడి దగ్గర తాము బంధువులమే అని చేరతారు. తమ పని సాగించుకుంటారు. పరాయివారే ఇలా ప్రవర్తిస్తే ఇక సొంత బంధువులు ఆగుతారా?

*ఎప్పుడు సంపద కలిగిన*
*నప్పుడు బంధువులు వత్తురది యెట్లన్నన్*
*దెప్పలుగ జెఱువు నిండినఁ*
*గప్పలు పదివేలు చేరు గదరా సుమతీ!*

చెఱువులో నీరు నిండితే కప్పలు కోకొల్లలుగా వచ్చి చేరినట్టు, సంపద వస్తే బంధువులు వచ్చి చేరుతారు. అందుకే,

*పుత్తడి గలవాని పుండు బాధయు గూడ*
*వసుధలోన జాల వార్త కెక్కు*
*పేదవాని యింట పెండ్లైన నెరుగరు*

ఇదీ చేదు నిజమే! ధనవంతుడి చిన్న బాధ ప్రపంచబాధగా మారుతుంది. కాని పేదవాడి ఇంట్లో జరిగే శుభకార్యం ఎవరికీ పట్టి ఉండదు. ఇలాంటి చేదు నిజాలను తేటతెల్లం చేయటంవల్ల ధనం వలన కలిగే అనర్థాలు, అన్యాయాలు మనకు మరింత స్పష్టమవుతాయి. ధనం ఎంత ఎక్కువ వచ్చి చేరితే వ్యక్తి అంతగా తన స్వభావాన్ని మరచిపోతాడు అని అర్థమౌతుంది.

*అధ్యాపయన్తి శాస్త్రాణి తృప్తి కుర్వన్తి పండితాన్*
*విస్మారయన్ని జాతిం స్వాం వరాటః పుచ్ఛిషా కరే*

చేతిలో డబ్బు చేరేసరికి, అవి అన్ని శాస్త్రాలూ చదివింపచేస్తాయి. పండితులను గడ్డి పరకలుగా చూపిస్తాయి. తన జాతిని మరపిస్తాయి. ధనం కోసం ఒళ్లు అమ్మేవాళ్ల నుండి, ధనం కోసం హత్యలు చేసేవారు, ధనం కోసం మతం మారేవారు, ధనం కోసం స్వీయాత్మనే తిరస్కరించేవారు – అందరికీ వర్తిస్తుందీ శ్లోకం.

అంటే, ధనాన్ని, ధనాశను అదుపులో పెట్టకపోతే మనిషి పశువైపోతాడన్న మాట. తన స్వభావాన్ని, స్వీయవ్యక్తిత్వాన్ని మరచిపోతాడన్నమాట. అందుకే, మన పూర్వికులు డబ్బు సంపాదించటం, మానవధర్మంగా నిర్ణయించినా, అధికధనాశ వల్ల నష్టాలు చెప్పారు. ధనలోభం వల్ల కలిగే అనర్థాలు వివరించారు. ఆపై ధనతత్త్వాన్ని నిక్కచ్చిగా వివరించి ధనాశను నశింపచేసే మార్గాలు చూసారు.

*సిరి దా వచ్చిన వచ్చును*
*సలలితముగ నారికేళ సలిలము భంగిన్*
*సిరి దా పోయిన బోవును*
*కరి మ్రింగిన వెలగపండు కరణిని సుమతీ*

ధనం వచ్చినప్పుడు కొబ్బరి కాయలోకి నీరు వచ్చినట్లు వస్తుంది. సంపద పోయే టప్పుడు ఏనుగు మింగిన వెలగ పండులోని గుజ్జు మాయమైనట్టు మాయమైపోతుంది. కొబ్బరిలోకి నీళ్ళు ఎలా చేరుతాయో ఎవరికీ తెలియదు. అలాగే ఏనుగు వెలగ పండులోని గుజ్జును ఎలా లాగేసుకుంటుందో కూడా ఎవరికీ తెలియదు. ధనం కూడా అంతే. ఎలా వస్తుందో, ఎలా పోతుందో ఎవరికీ తెలియదన్నమాట. ధనం ఎటువంటివారి వద్ద ఉంటుంది. అది ఎలా పోతుంది. ధనాన్ని ఎలా ఉపయోగించాలి. అసలైన ధనం ఏమిటి వంటివన్నీ చర్చిద్దాం.

## అసలు ధనం

*ధనాని భూమౌ పశవశ్చ గోష్ఠే నారీ గృహద్వారే, జనః శ్మశానే*
*దేహాశ్చితాయాం పరలోక మార్గే, కర్మానుగోగచ్ఛతి జీవఏకః॥*

సంపాదించిన ధనం భూమిపై ఉండిపోతుంది. పశువులు గోష్ఠంలో మిగిలిపోతాయి. భార్య గృహద్వారం వద్ద ఆగిపోతుంది. బంధుజనులు శ్మశానం వరకూ వస్తారు. దేహం చితిలో కాలిపోతుంది. పరలోకమార్గంలో, జీవుడిని వెన్నంటి వచ్చేది కర్మఫలం మాత్రమే.

ధనం సంపాదించాలి. ధనం వల్లనే సమాజంలో వ్యక్తి గౌరవమర్యాదలు పొందుతాడు. ధనం వల్ల విధ్యుక్తకర్మలు చింత లేకుండా నిర్వ హించగలుగుతాడు. ధనం వల్ల బంధువులలో గౌరవం పొందుతాడు. ధనంవల్ల భార్య ప్రేమ పొందుతాడు. ధనం వల్ల సంతానం నుండి ప్రేమాదరణలు అందుకుంటాడు. ధనం లేనివాడు పూచిక పుల్లకు కూడా కొరగాడు. ధనం లేనివాడికి ఎంత తెలివి ఉండి కూడా లాభం లేదు. ఇలా ధన సంపాదన ఆవశ్యకతను నిర్ద్వంద్వంగా ప్రకటిస్తుంది భారతీయధర్మం. ధనాన్ని లక్ష్మీదేవికి ప్రతీకగా భావించి పవిత్రంగా, గౌరవంగా చూస్తుంది.

ఐతే మానవుడిలోనే లోభత్వమన్నది అంతర్గతంగా ఉంది. అన్నీ తనకు కావాలనే ఆశతో పాటే, తన వద్దనే ఉండాలన్న ఆలోచనా మనిషికే ఉంది. జంతువులకు ధనంతో పని లేదు. అవి ఆహారం వెంటపడతాయి. ఆహారం కోసం పరుగులిడతాయి. వేటాడతాయి. కొట్లాడుకుంటాయి. కానీ కడుపు నిండగానే వేటి దారిన అవి పోతాయి. దాచుకోవాలన్న భావన వాటికుండదు. చీమలు ఆహారం దాచుకుంటాయి. కానీ, అది అందరి కోసం సామూహికంగా దాచుకుంటాయే తప్ప ఒక్క చీమ తన కోసం దాచుకోవటం ఉండదు. ఓ చక్కెర స్ఫటికాన్ని పక్కగా పెట్టుకుని దొంగతనంగా ఒక్క చీమే తినటం జరగదు. ఇది ఒక్క మనిషికే సాధ్యం.

మనిషి గొప్ప తాత్త్వికచింతనలు చేయగలడు. గొప్ప సిద్ధాంతాలు ఊహించగలడు. గొప్ప గొప్ప సాంకేతిక పరికరాలను సృజించగలడు. కానీ తనకేం కావాలో, ఎంత కావాలో మనిషికి తెలియదు. తమ కడుపు నిండటం జంతువులకు, క్రిమికీటకాలకు తెలుస్తుంది. ఎంత తినాలో, ఎంత తింటే తమకు శక్తి వస్తుందో వాటికి తెలుసు. కానీ మనిషికి తెలియదు.

ఎంత తినాలో, ఎంత శక్తి అవసరమో తెలియదు. అందుకని తింటూనే పోతాడు. అలా అవసరాన్ని మించి తింటాడు. స్థూలకాయం వచ్చి అనారోగ్యం పాలై, మళ్ళీ ఒళ్లు

తగ్గించుకోవాలని కష్టపడతాడు. సంపాదన విషయంలో కూడా అంతే. ఎంత సంపాదిస్తే సరిపోతుందో మనిషి తెలియదు. ఎంత సంపాదించినా సరిపోదు. రేపేమవుతుందో నన్న బెంగ పట్టిపీడిస్తూనే ఉంటుంది. పైగా సంపాదించింది అంతా తానే దాచుకోవాలన్న తపన మనిషిని పట్టి పీడిస్తుంది. దీన్ని లోభత్వమంటారు. భాస్కరశతకకారుడు 'లోభి'ని చక్కగా నిర్వచిస్తాడు.

*అతిగుణహీనలోభికిఁ బదార్థము గల్గిన లేక యుండినన్*
*మితముగ గాని, కల్మి గల మీదటనైన భుజింప డింపుగా*
*సతమని నమ్మ దేహమును, సంపద, నేఱులు నిండి పాఱినన్*
*గతుగక జూచుఁ గుక్క తన కట్టడి మీఱక నెందు, భాస్కరా!*

ఏళ్లు నీరు నిండి ప్రవహిస్తున్నా కుక్క నీటిని మామూలుగా తాగదు. కతుకుతూనే ఉంటుంది. అలాగే తనకెంత ఐశ్వర్యమున్నా, తక్కువగానే కావాలని తినేవాడు లోభి. తనకు లేనప్పుడు తక్కువ తినటం ధర్మం. కానీ ఉన్నప్పుడు కూడా తక్కువ తినటం లోభత్వం.

'లోభి' అయినవాడు తాను అనుభవించడు. ఇతరుడినీ అనుభవించనీయడు. అందుకే లోభి వాడి గురించి వేమన

*గొడ్డుటావుఁ బితుకఁ గుండఁ గొంపోయిన*
*పాలనీక తన్ను బండ్లు రాల*
*లోభివాని నడుగ లాభమ్ము లేదయా"* అంటాడు.

పాలివ్వని ఆవు దగ్గర పాలు పితకాలని వెళ్ళటం వల్ల లాభం లేదు. పాలివ్వదు సరికదా, అది పళ్ళూడేట్టు తంతుంది. అలాగే లోభివాడిని అడిగి కూడా లాభం లేదు.

అంటే డబ్బు సంపాదనలో పడి జీవితాన్ని మొత్తం సంపాదనలో వెచ్చించినా మనిషికి సంతృప్తి ఉండదు. డబ్బు సరిపోవటం అన్నది ఉండదు. కాబట్టి డబ్బు సంపాదన ఆవశ్యకతను నొక్కి చెప్తూనే మన పూర్వికులు డబ్బు సంపాదించాల్సిన విధానాన్ని, సంపాదించిన డబ్బును వెచ్చించాల్సిన పద్ధతులను వివరించారు. ఇలా వివరిస్తూ, ధనం వస్తుంది, పోతుంది, శాశ్వతంగా నిలిచేది ధర్మం. మనిషి సత్ప్రవర్తన అన్న నిజాన్ని ఎదకు హత్తుకునే రీతిలో బోధించారు. ధనమంటే విరక్తి కలిగే రీతిలో వివరించారు. లోభత్వంతో ధనాన్ని దాచుకోవటాన్ని నిరసించారు. అధర్మంగా ధనం సంపాదించటాన్ని ఖండించారు. అలా సంపాదించట మంటే పాపం మూట కట్టుకోవటమేనని వివరించారు.

ఆపై అసలైన ధనం ఏమిటో వివరించారు. జీవితం కొనసాగించటానికి సరిపడ ధనం సంపాదిస్తూ, తరగని, ఎవరూ దాచుకోని, ఎంత పంచినా పెరిగే శాశ్వత ధన సంపాదన మార్గాలు సూచించారు.

*అసంభోగేన సామాన్యం కృపణస్య ధనం పరైః*
*అస్యేద మితి సంబన్ధో హానే దుఃఖేన గమ్యతే*

అనుభవించకుండా దాచుకొన్న ధనం పిసినిగొట్టువాడికి ఎంతో ఇతరులకూ అంతే. ఇది వీడి ధనం అన్న సంబంధం పోయిన తరువాత కలిగే దుఃఖం వల్ల నిజం తెలుస్తుంది.

*అజ్ఞానస్య క్షయం దృష్ట్వా వల్మీకస్య చ సంచయమ్*
*అవన్ధ్యం దివసం కుర్యాద్దానాధ్యయన కర్మసు*

బరిణె నిండా పోసిన కాటుకను వేలితో ముట్టుకొని కొంచెం కొంచెం తీసినా కొన్నాళ్ళకు అయిపోతుంది. అలాగే చీమలు పెట్టే పుట్ట కొంచెం కొంచెం పెరుగుతూ పెద్దదవుతుంది. ఈ విషయాన్ని గుర్తించి మానవుడు దానం చేయటం, చదువుకోవటం, స్వకర్తవ్యాలను చేస్తూ జాగ్రత్త పడాలి.

*చీమలు పెట్టిన పుట్టలు*
*పాముల కిరవైన యట్లు పామరుడు దగన్*
*హేమంబు కూడఁబెట్టిన*
*భూమీశుల పాలఁ జేరు భువిలో సుమతీ*

చీమలు పెట్టిన పుట్టలు పాములకు ఉపయోగపడినట్టు, లోభి దాచిన ధనం రాజుల పాలవుతుంది అంటాడు సుమతీశతకకారుడు.

అంటే, ధనం దాచటం తప్పు అని కాదు, కానీ ధనం దాచటమే ధర్మంగా ఉండటం తప్పు. ఎందుకంటే, పూర్వజన్మ సుకృతం వల్ల, భగవంతుడి కృప వల్ల వ్యక్తి ధనవంతుడవుతాడు.

*ఆయుఃకర్మ చ విత్తం చ విద్యా నిధనమేవ చ*
*పంచైతాని హి సృజ్యన్తే గర్భస్థస్యైవ దేహినః॥*

జీవుడు గర్భంలో ఉండగానే వాడి ఆయుస్సు, చేయబోయే పనులు, ధనం, విద్య, మరణం అనే అయిదూ బ్రహ్మ నిర్ణయిస్తాడంటుంది శాస్త్రం. కాబట్టి ధన సంపాదనలో వ్యక్తి గొప్పతనం లేదు. ఆ ధనాన్ని వినియోగించటంలో వ్యక్తిత్వం ప్రస్ఫుటమౌతుంది.

అందుకే పూర్వకాలంలో ధనవంతులు దానధర్మాలు చేసేవారు. ధార్మిక కర్మలు నిర్వహించేవారు. గుడులు కట్టించేవారు. అన్నదానాలు చేసేవారు. విద్యాలయాలు నిర్మించేవారు. ఉచిత విద్యాబోధనకు వీలు కల్పించేవారు. ధనం సాధారణంగా వ్యక్తి పతనానికి దారి తీస్తుంది. వ్యక్తిని లోభిగా, అహంకారిగా, సాటి మానవులంటే చులకనగా చూసేవాడిలా చేస్తుంది. అలా కాక, ధనలాలసను అదుపులో పెట్టుకుని, తనకవసరమైనంత ధనాన్ని జాగ్రత్తపరచుకుని, మిగతా ధనాన్ని సామాజిక అభివృద్ధికార్యాలలో వెచ్చించటం లోనే వ్యక్తి గొప్పతనం తెలుస్తుంది. ఎలాగైతే రాజు, ప్రజల బాగోగులు చూసే 'వాచ్‌మాన్' లాంటివాడో, అలాగే ధనవంతుడు సైతం, భగవంతుడు సంపాదించిన ధనాన్ని సక్రమంగా వినియోగించే 'కేర్‌టేకర్' లాంటివాడే నన్నమాట. 'మహాభారతం'లో ఈ విషయం స్పష్టంగా చెప్పటం జరిగింది.

*అర్థేన తు సమో నార్థోయత్ర లభ్యేతేనోదయః*
*న తత్ర విపణః కార్యః ఖరకణ్డూయనం హి తత్*

ఏ ధనానికి వ్యయం చేయటం చేత అభివృద్ధి లభించదో, ఆ ధనం ధనం కాదు. అటువంటి ధనం ఎందుకూ పనికిరాదు. ఆ ధనంతో వ్యాపారం చేయటం గాడిదను గోకటం వంటిది. కాబట్టి ధనం సంపాదించటంలో తప్పు లేదు. ధనాన్ని దాచుకోవటంలో తప్పు లేదు. కానీ ధనాన్ని ధర్మమార్గంలో సంపాదించాలి. సంపాదించిన ధనాన్ని ధర్మం కోసం వెచ్చించాలి.

*అన్నేన సదృశం దానం న భూతం న భవిష్యతి*
*తస్మాదన్నం విశేషేణ దాతుమిచ్ఛన్తి మానవాః*

అన్నదానంతో సమానమైన దానం పూర్వం లేదు. ముందు ముందు ఉండబోదు. అందుకే మానవులు అన్నదానం చేయాలి. అందుకే గతంలో అన్నాన్ని అమ్మటాన్ని నేరంగా భావించేవారు. అడిగినవాడికి ఆహారాన్ని అందించటం గొప్పతనంలా కాక ధర్మంలా భావించేవారు.

*అనుకూలే విధౌ దేయం యతః పూరయితా హరిః*
*ప్రతికూలే విధౌ దేయం యతః సర్వం హరిష్యతి*

దైవం అనుకూలంగా ఉన్నప్పుడు దానం చెయ్యాలి. అలా చేస్తే విష్ణువు ఆ లోటు పూరిస్తాడు. దైవం ప్రతికూలంగా ఉన్నా దానం చెయ్యటమే మంచిది. ఎందుకంటే

దానం చెయ్యకున్నా దైవం ఎలాగూ సర్వాన్ని హరిస్తుంది. కాబట్టి ఎల్లప్పుడూ ధర్మాన్ని నిర్వర్తించటమే మంచిది.

*అదాతా పురుషస్త్యాగీ ధనం సంత్యజ్య గచ్ఛతి*
*దాతారం కృపణం మన్యే మృతో అప్యర్థం న ముఞ్చతి*

దానం చెయ్యని లోభి నిజంగా త్యాగి. ఎందుకంటే, ధనం అంతా ఇక్కడే విడిచి వెళ్ళిపోతాడు. దానం చేసేవాడు నిజమైన లోభి. ఎందుకంటే మరణించిన తరువాత కూడా పుణ్యధనం వెంట తీసుకుపోతున్నాడు.

సంపాదించి, దాచిన ధనం సద్వినియోగపడకపోతే వ్యర్థమౌతుంది. 'చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైన యట్లు' తాను లోభత్వం చూపి దాచిన ధనం ఇతరుల పాల పడుతుంది. ధనం వెంట రాదు. కాబట్టి మనిషి సంపాదించవలసింది మంచి పేరు. పుణ్యకార్యాలు చేస్తూ, ధర్మం నెరవేరుస్తూ, తాను మరణించిన తరువాత కూడా మనుషులు తనను గుర్తు చేసుకునే రీతిలో ఉత్తమంగా వ్యవహరించాలి. మనిషి ధనం సంపాదించాలి. కానీ, దానికి దాసుడు కాకూడదు. ఈ నిజాన్ని వివరించేందుకు 'ధనాని భూమౌ' వంటి సత్యాలను అత్యంతసరళంగా మరచిపోలేని విధంగా తరతరాలకు అందించి వ్యక్తిత్వవికాసానికి ఒక బాటను ఏర్పరచారు.

## జ్ఞానమే ధనం

*ఆపద్గతం హససి కిం ద్రవిణాన్ధ మూఢ*
*లక్ష్మీః స్థిరా న భవతీతి కిమత్ర చిత్రమ్*
*ఏతాన్ ప్రపశ్యసి ఘటాఞ్జలయన్త్ర చక్రే*
*రిక్తా భవన్తి భరితాః భరితా శ్చ రిక్తాః*

పూర్వకాలంలో జలయంత్రా లుండేవి. వర్తులాకారంలో ఉండే ఆ యంత్రానికి కుండలు కట్టి ఉండేవి. యంత్రం తిరుగుతూంటే కుండలు నీటి నిండేవి. వాటి నుండి నీరు బయటికి వెళ్ళిపోగానే మరో రౌండులో మళ్ళీ కుండలు నిండేవి. ధనం వచ్చిపోవటాన్ని జలయంత్రంలో కుండలు నిండి, ఖాళీ అయిపోయి మళ్ళీ నిండటంతో పోలుస్తున్నారు.

ఐశ్వర్యంతో ఒళ్లు తెలియని ఓ మూఢుడా, ఆపదల్లో ఉన్నవాడిని చూసి ఎందుకు నవ్వుతావు? లక్ష్మి ఒక చోట స్థిరంగా ఉండదు. జలయంత్రాలకు అమర్చిన ఈ తిరిగే ఘటాలను చూడు, నీళ్ళు లేనివి నిండుతూంటాయి. నీళ్ళున్నవి ఖాళీ అయిపోతుంటాయి. ఇది శ్లోకార్థం.

ధనం జగతికి మూలం. ధనం వల్ల అన్ని సౌఖ్యాలూ అమరుతాయి. కానీ అధికంగా ధనం చేరటం వల్ల అది మనుషులను పశువులను చేస్తుంది ధనం ఉన్నవాడే కాదు. ధనం కోసం అతడి చుట్టూ ఉన్న మనుషులు కూడా పశువులు అయిపోతారు. ధనం ఎక్కడా స్థిరంగా ఉండదు. ఎలా వస్తుందో, ఎలా పోతుందో ఎవరికీ తెలియదు. కాబట్టి ధనాన్ని దాచిపెట్టాలని లోభిలా ప్రయత్నించి లాభం లేదు. అందువల్ల వ్యక్తి పాపాన్ని మూట కట్టుకోవటమే కాదు, అతని పిసినారితనం చూసి దాచిపెట్టిన ధనం ఇతరుల పాలవుతుంది. కాబట్టి ధనాన్ని సద్వినియోగం చేయాలి. సద్వినియోగం కాని ధనం వల్ల ఉపయోగం లేదు. ఇటువంటి నిజాలు బోధించిన మన పూర్వికులు మానవమనస్తత్వాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవారు కాబట్టి ఇంతటితో ఆగలేదు. ధనం అంటేనే అసహ్యం, విరక్తి భావనలను కలిగించే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నం విజ్ఞానంతో కూడిన అసహ్యం, విచక్షణతో కూడిన విరక్తి కలిగించటానికీ పెద్ద పీట వేసింది తప్ప, భయపెట్టి సాధించటానికి కాదు.

మానవుడి మనస్తత్వంలో 'స్వార్థం' ప్రధానపాత్ర వహిస్తుంది. బృహదారణ్యకోపనిషత్తులో ఓ సంఘటన ఉంది. యాజ్ఞవల్క్యుడు సన్న్యాసం స్వీకరిస్తూ, తన భార్యలను చివరి కోరికలు కోరుకోమంటాడు. ఒక భార్య ధనధాన్యాలు కోరుకుంటుంది. మరో భార్య 'నిజమైన జ్ఞానం' కోరుకుంటుంది. ఆమెకు యాజ్ఞవల్క్యుడు బోధించిన జ్ఞానసారాంశం ఏమిటంటే 'మనిషి పైపైన ఎన్ని ముసుగులు వేసుకున్నా, ఎన్ని సిద్ధాంతాల వెనుక దాచినా, ఆత్మానందం కోసమే ప్రయత్నిస్తాడు. ఈ ఆత్మానందానికి భౌతికరూపమే 'స్వార్థం'. 'స్వార్థం' లేకుండా మనిషి జీవించలేడు. 'ఇది నాది' అనుకోకపోతే మనిషి ముందుకు కదలలేడు. మనిషిలో ఈ భావనను నశింపజేసి సామూహికభావనలను బలవంతాన కలిగించే ప్రయత్నాలు అనేకులు చేశారు. భంగపడ్డారు. ఎందుకంటే ఇది 'నాది' అనుకోనిదే మనిషి ఏమీ చేయలేడు. 'నా కోసం' 'నా కుటుంబం కోసం' అన్న భావన మనిషికి ఊపునిస్తుంది. ఈ భావన అధికమై, హద్దులు దాటితే వ్యక్తి స్వార్థపరుడవుతాడు. మానవుడి స్థాయి నుండి దిగజారతాడు. ఈ భావనను అదుపులో ఉంచుకుంటూ 'నాది' కాస్త ఉన్నా మిగతా 'మనది' అనుకొనే ప్రయత్నాలు చేసేవాడు మానవుడుగా ఎదుగుతాడు. ఈ నాది అన్న భావనను సంపూర్ణంగా త్యజించి, మించిన వ్యక్తి ఉత్తముడవుతాడు. తాత్త్వికపరంగా చూసినా 'అహం' అన్న భావనను నశింప చేయటమే జ్ఞానానికి దారి తీస్తుంది. మోక్షకారణం అవుతుంది.

'అహాన్ని' జయించటం అందరికీ సాధ్యం కాదు. కానీ అహాన్ని తగ్గించుకొని నిస్వార్థంగా వ్యవహరించే వీలుంటుంది. భారతీయ తత్వం అందుకే ధన సంపాదనను ఒక కర్తవ్యం చేసింది. ధనం సంపాదించాలి. ధనం సంపాదిస్తున్నప్పుడు వ్యక్తి నేరభావనకు గురికాకూడదు. ఆ ధనాన్ని న్యాయమార్గంలో సంపాదించాలి. అన్యాయంగా ధనం సంపాదించటం పాపం మోసం చేసి ధనం సంపాదించటం వల్ల లాభంలేదు.

*అహితహిత విచార శూన్యబుద్దేః శ్రుతి సమయైర్బహుభిస్తి రస్కృతస్య*
*ఉదరభరణ మాత్రకేవలేచ్ఛోః పురుష పశోశ్చ పశోశ్చ కో విశేషః*

ఏది మంచి, ఏది చెడు అన్నీ విచారణలేక, వేదోక్తాచార దూరుడై పొట్ట నింపుకోవటం పరమార్థం అనుకునే పశుతుల్యుడైనవాడికీ, పశువుకూ భేదం ఏముంది? కాబట్టి ధనసంపాదన ధర్మమార్గంలోనే చేయాలన్నమాట. అధర్మంగా డబ్బు సంపాదించే కన్నా ధర్మమార్గంలో సంపాదించే భిక్ష మేలన్న మాట.

*అష్టమే ద్వాదశే వాపి శాకం యః పచతే గృహే*
*కుమిత్రాణ్య న పాశ్రిత్య కిం వై సుఖతరం తతః*

చెడ్డవారి సహవాసం లేకుండా ఎనిమిది రోజులలో లేదా పన్నెండు రోజులలో ఓ సారి ఇంట్లో కూర వండుకోగలిగితే అంత కంటే సుఖం ఏముంది? ఇంకా అర్థం కాని వారి కోసం ఈ మహాభారతంలో మరో రెండు మంచి మార్గదర్శక శ్లోకాలున్నాయి.

*అపి శాకం పచానస్య సుఖం వై మఘవన్ గృహే*
*అర్జితం స్వేన వీర్యేణ నాప్య పాశ్రిత్య కంచన*

ఎవరినీ ఆశ్రయించకుండా తాను శ్రమపడి సంపాదించుకున్న ఆకు కూర తన ఇంట్లో వండుకొని తిన్నా అది సుఖమే.

*అకీర్తిః కీర్త్యతే లోకే యస్య భూతస్య కస్య చిత్*
*స సతత్యధమాన్ లోకాన్ యావచ్ఛబ్దః ప్రకీర్త్యతే*

ఎవరిని గూర్చి నలుగురూ లోకంలో చెడ్డగా చెప్పుకుంటారో, అతడు, ఆ చెడ్డ పేరు లోకంలో ఉన్నంత కాలం అధమలోకాలలో పడి పోతాడు. అధమలోకాలలో పడటం ఎక్కడో జరగదు. ఈ లోకంలోనే జరుగుతుంది. అధమలోకాలు మనస్సులోనే ఉంటాయి. తప్పుడు మార్గాలలో, అధర్మంగా ధనం సంపాదించినవాడి మనస్సు ఎప్పుడూ 'శాంతి'ని అనుభవించదు. ఎలా సంపాదించిన ధనం అలాగే పోతుంది. అది ఎప్పుడు,

ఎలా పోతుందోనన్న భయం మనిషిని శాంతంగా ఉండనివ్వదు. మరణం వరకూ వెంటాడుతూంటుంది. నరకాన్ని భూమి పైనే అనుభవింపజేస్తుంది.

దావూద్ ఇబ్రహీం గొప్ప ధనవంతుడు. అన్ని సౌఖ్యాలూ అందుబాటులో ఉన్నాయి. కానీ దావూద్‌కు శాంతి అన్నది లభించదు. ఏ మూల నుంచి ఎవరు వచ్చి చంపుతారో తెలియదు. ఎవరు ఎప్పుడు దాడి చేస్తారో తెలియదు. ఇల్లు వదిలి బయటకు రావాలంటే భయం. గమనిస్తే ఒక ఇల్లంటూ లేదు. ప్రమాదం ముంచుకొస్తూంటే ఇల్లు మార్చక తప్పదు. అందరూ ఇళ్లు మారుస్తుంటే, ఈయన దేశాలు మార్చాల్సివస్తోంది. అలాగే దొంగ స్టాంపులమ్మి డబ్బు సంపాదించినవాళ్ళు, స్టాక్ కుంభకోణాలు చేసి డబ్బు గడించినవారూ, తాత్కాలికంగా ఐశ్వర్యంలో తులతూగినా, శాశ్వతంగా అపకీర్తి పాలవటమే కాదు, అందుకు తగ్గ శిక్షలు అనుభవిస్తూనే ఉన్నారు. అందుకే మహాభారతంలోని మరో పద్యం అధర్మమార్గాల్లో డబ్బు సంపాదించేవారిని హెచ్చరిస్తుంది.

*అధర్మోపార్జితైః విత్తై ర్యః కరోత్యౌర్ధ్వదేహికమ్*
*నస తస్యఫలం ప్రేత్య భుజ్తై అర్థస్య దురాగమాత్*

అధర్మమార్గాలలో సంపాదించిన ధనంతో అంత్యక్రియలు చేసినా, ఆ ధనం అన్యాయంగా సంపాదించినదవటం చేత, చేసినవారికి, మరణించినవాడికి కూడా ఆ ఫలం లభించదు. అందుకే అతికష్టపడాల్సి వచ్చినా, ధర్మాన్ని ఉల్లంఘించవలసివచ్చినా, శత్రువుకు లొంగిపోవటం వల్ల గానీ లభించే ధనం కోసం ఆశపడవద్దని మహాభారతం స్పష్టంగా చెప్తుంది.

*అతిక్లేశేన యే అర్థాః స్యుర్ధర్మ స్యాతిక్రమేణ వా*
*అరేర్వా ప్రాణిపాతేనా మాస్మ తేషు మనః కృథాః*

ఐతే శాస్త్రాలు ఉన్నా, శాస్త్రాల్లో అత్యద్భుతమైన జీవితసత్యాలు, మార్గదర్శక సూత్రాలు ఉన్నా, వాటిని విస్మరించటం వల్ల ప్రస్తుతం మనం వ్యక్తిత్వవికాసాన్ని పాశ్చాత్యుల దగ్గర నుండి నేర్చుకోవాల్సి వస్తుంది. వారిచ్చే డబ్బుకో, వారు చూపే ఆశలకో లొంగి, స్వధర్మాన్ని త్యజించి పరమతాలను స్వీకరిస్తూ, అదే గొప్ప పని అన్నట్టు విర్రవీగే పరిస్థితులు వస్తున్నాయి. అందుకే, నిజంగా ధనం సంపాదించాలనుకున్నవాడు ధర్మాన్ని అనుసరించక తప్పదని చెప్పిన ధర్మాన్నే డబ్బు కోసం వదులుకుంటున్నారు మనుషులు.

*అర్థసిద్ధిం పరామిచ్ఛన్ ధర్మమేవాది తశ్చరేత్*
*నహి ధర్మాద పైత్యర్థః స్వర్గలోకా ది వామృతమ్*

పూర్తిగా అర్థసిద్ధి పొందాలనుకున్నవాడు మొదటి నుంచీ ధర్మాన్నే ఆచరించాలి. స్వర్గలోకం నుంచి అమృతం ఎలా దూరం కాదో అలాగే అర్థం నుంచీ ధర్మం దూరం కాదు. గమనిస్తే, రామాయణంలో రాముడు రాక్షసరాజులను సంహరించిన తరువాత వారి ధనం వైపు కూడా కన్నెత్తి చూసిన దాఖలాలు కనిపించవు. ఓడించినవాడిని దోచుకోవటమే ధర్మం, ఆ దోచుకున్న దాన్లో కాస్త దేవుడి మొహంమీద పడేస్తే పాపాలు మాఫీ అయిపోతాయనే నీతిసూత్రాలు ఉన్నవారి ప్రపంచంలో, ధర్మానికి దూరమైన ధనాన్ని ఆశించని రాముడి ఔన్నత్యం అర్థం కావాలంటే కొన్ని జన్మలెత్తాల్సి ఉంటుంది.

ఇది అర్థం చేసుకొనే శంకరాచార్యులవారు 'భజగోవిందం'లో సర్వ అనర్థాలకు ధనం మూలం అని స్పష్టంగా చెప్పారు. ఎందుకంటే స్వార్థం మనిషిని అధర్మమార్గాలలో ధన సంపాదనకు ప్రోత్సహిస్తుంది. ఆ పై తన అధర్మాన్ని సమర్థించుకొనేందుకు ప్రయత్నాలు చేయిస్తుంది. డబ్బు ఆశతో అతడిని పొగిడే భజనగాళ్ళు చుట్టూ చేరుతారు. వారి మాయలో పడ్డ వ్యక్తి తన తప్పును మరచి అధర్మమే ధర్మం అనుకుంటాడు. అసలు నిజం గ్రహించేసరికి జీవితం చేజారిపోతుంది.

*అర్థమనర్థం భావయ నిత్యం నాస్తి తతః సుఖలేశః సత్యమ్*
*పుత్రాదపి ధన భాజాం భీతిః సర్వత్రైషా విహితా రీతిః*

అర్థం సర్వానర్థాలకూ మూలం. దాని నుండి ఏ మాత్రం సుఖం లేదు. ఈ విషయం ఎల్లప్పటికీ మరిచిపోకూడదు. ధనవంతుడికి పుత్రుడి నుంచి కూడా ప్రమాదమే. ఇది జగతిరీతి.

రాజ్యం కోసం రాకుమారులే కాదు రాజబంధువులూ కుట్రలు పన్నటం మనకు తెలుసు. ధనం కోసం సోదరులు తమలో తాము కలహించుకోవటమే కాదు. తల్లిదండ్రులనూ ద్వేషించటం మనం చూస్తూ ఉన్నాం. ఇటీవలే అంబానీ సోదరులు డబ్బు కోసం శత్రువుల్లా కలహించు కోవటం దేశమంతా చూసింది. సోదరుల పోరు వల్ల తల్లి హృదయం ఎంతగా కలత చెంది ఉంటుంది! బహుశా అప్పుడామెకు ధనం మనుషుల్ని పశువులను చేయటం అర్థమై ఉంటుంది. కనీసం తల్లి క్షోభ కూడా అర్థం చేసుకోకుండా ఆస్తి కోసం వీధికెక్కి పోరాడేవారిని మనం నిత్యం చూస్తూనే ఉంటాం. కట్నం కోసం భార్యను అగ్గికి ఆహుతి నివ్వటం నుంచి డబ్బు కోసం మతాన్ని మార్చేసుకోవటం, దేశరహస్యాలను శత్రువుల పాలుచేయటం, గౌరవాభిమానాల్ని వదులుకోవటం మనం చూస్తూనే ఉన్నాం. తమ 'స్వార్థాన్ని' అదుపులో పెట్టుకోలేని మనుషులు ధనాశలో పడి పశువులవుతారని భారతీయధర్మం చెప్పటమే కాదు, వారి

స్వార్థాన్ని తగ్గించేందుకు ప్రయత్నాలు చేసింది. ముందుగా అసలైన ధనం గురించి బోధించింది. మామూలు ధనం వస్తుంది, పోతుంది. అదీ గాక ధనం వెంటపడితే, అది ముందు పరుగెత్తుతుంటూంది. మనం దాని వెనుక పరుగిడుతుంటాం. ఒక్క క్షణం ఆగి వెనక్కి తిరిగి చూస్తే జీవితం చేజారిపోయి కనిపిస్తుంది. అలా కాక వ్యక్తి తన కర్తవ్యం నిర్వహిస్తూ ఉంటే, అతడికి రావాల్సిన ధనం అదే తన దగ్గరకు వస్తుంది. అందుకే ధనం వెంటపడటం మాని దిగజార్చని, ఎవరూ దోచలేని, అమలినం కాని ధనాన్ని సంపాదించటంపై దృష్టి పెట్టమంటుంది భారతీయధర్మం.

*అమలీమ సమచ్ఛిద్రమ క్రేయమతి సున్దరమ్*
*అదేయమ ప్రతిగ్రాహ్యా మహో జ్ఞానం మహాధనమ్*

జ్ఞానం అన్నిటి కన్నా గొప్ప ధనం. అది మలినం కాదు. దీనికి ఛిద్రాలు ఉండవు. కొనడానికి వీలు కాదు. చాలా సుందరమైనది. ఎవరికీ ఇచ్చేది కాదు. పుచ్చుకునేది కాదు.

## ఆరోగ్యవంతమైన జీవితం

*అల్పా ఏవ భవన్త్వా శాః*
*శాన్తిస్తే మహతీ భవేత్*
*మా భుజ్వా అధిక మాహారం*
*గాఢాం నిద్రాం సుఖం భజ*

కోరికలు ఎంత తక్కువగా ఉంటే అంత ఎక్కువగా మనశ్శాంతి ఉంటుంది. గాఢనిద్ర కావాలంటే ఆహారం స్వల్పంగా తీసుకోవాలిగా మరి!

'ది మాంక్ హూ సోల్డ్ ఫెర్రారి' అని ఇటీవలె ఓ వ్యక్తిత్వవికాసపుస్తకం వెలువడింది. ఓ లాయర్ రాత్రింబవళ్ళు డబ్బు సంపాదనలో పడతాడు. ఎంతగా డబ్బు సంపాదిస్తాడో, అంతగా అనారోగ్యం పాలవుతాడు. చివరికి ఓ రోజు కోర్టులో వాదిస్తూ మధ్యలో గుండె నొప్పి వచ్చి పడిపోతాడు. అప్పు డాయనకి ఈ డబ్బు అనుభవించలేనప్పుడు సంపాదించి ఏం లాభం అన్న సందేహం వస్తుంది. సంపాదన ధ్యాసలో పడి జీవితాన్ని అనుభవించలేక పోతున్నానని గ్రహిస్తాడు. భారతదేశం వచ్చి జీవించటం నేర్చుకుంటాడు.

ప్రపంచవ్యాప్తంగా కొన్ని మిలియన్ కాపీలు అమ్ముడుపోయిందీ పుస్తకం. విదేశాలలోనే కాదు, మన దేశంలో కూడా పుస్తకం గొప్పగా అమ్ముడు పోయింది. తెలుగులో కూడా అనువదించారు. వ్యక్తిత్వవికాసానికి ఉత్తమపుస్తకం అని పొగిడారు.

గమనిస్తే, ఆ పుస్తకంలో రచయిత కొత్తగా చెప్పిందేమీ లేదు. అనాదిగా మన దేశంలో అమలులో ఉన్న విషయాలనే ఆయన తన పుస్తకంలో చెప్పాడు. ఈ విషయాలతో పరిచయం లేని విదేశీయులు ఎగబడి కొన్నారంటే అర్థం ఉంది. కానీ మన దేశీయులు కూడా ఏదో కొత్త విషయాన్ని తెలుసుకుంటున్నట్టు ప్రవర్తిస్తూ, ఎవరూ చెప్పని అద్భుతాన్ని చెప్పినట్టు భావించటం, మనం ఎంతగా మన జీవనవిధానానికి దూరమయ్యామో స్పష్టం చేస్తుంది.

ఏదైనా 'మితం'గా ఉన్న వ్యక్తి మాత్రమే ప్రశాంతంగా ఉండగలడని భగవద్గీత స్పష్టంగా చెప్తుంది. అతిగా ఆహారం తీసుకునేవాడు, అతిగా సౌఖ్యాలను ఆశించేవాడు ఆనందాన్ని అనుభవించలేడు అని భగవద్గీత బోధిస్తుంది. ఈ బోధన మరో రూపమే కోరికలు ఎంత తక్కువగా ఉంటే, మనిషి అంత ఎక్కువగా శాంతిని అనుభవిస్తాడన్నది.

కోరికలు అంతు లేనివి. సముద్రంలో అలలు వస్తూనే ఉన్నట్టు కోరికలు వస్తూనే ఉంటాయి. ఎగసిన అలలు తీరాన్ని తాకుతూ కాలక్రమేణా శిలలను సైతం ఇసుక రేణువుల్లా పిండిపిండి చేస్తాయి. ఎగసిపడే కోరికలు మానవవ్యక్తిత్వాన్ని సైతం ఇసుక రేణువుల్లా దిగజార్చేస్తాయి. సముద్రంలో అలలు గాలుల వల్ల వస్తాయి. గాలి వీయటం స్తంభిస్తే అలలూ స్తంభిస్తాయి. మనిషిలో కోరికలు అతడి ఊపిరి ఆడినంత కాలం వస్తూనే ఉంటాయి. ఊపిరి ఆగితే కోరికలు ఆగుతాయి. కానీ ఊపిరి లేకపోతే ప్రాణం పోతుంది. మనిషే ఉండడు. కాబట్టి ఊపిరిని నియంత్రించాలి. ఊపిరిని అదుపులోకి తెచ్చుకోవాలి. తద్వారా కోరికలను అదుపులోకి తెచ్చుకోవచ్చు. ఇదే యోగం! ఇదే ఆధ్యాత్మిక తత్త్వం! ఇదే భారతీయజీవనవిధానంలో స్వార్థపరుడైన పశువులాంటి మనిషిని నిస్స్వార్థపరుడైన ఉత్తమమానవుడిలా తీర్చిదిద్దే విధానం. ఆధ్యాత్మికతను నిత్యజీవితంలో అనుసరించటం వల్ల మనిషి సాధించే సంతృప్తి, సౌఖ్యాలను ప్రజలకు వివరించి, ఆచరణయోగ్యం చేయటం ద్వారా ఉత్తమవ్యక్తిత్వనిర్మాణం కావించటమే భారతీయధర్మం.

ధనసంపాదన వెంట పడకూడదని తిన్నగా చెప్పకుండా కోరికలను పరిమితం చేసుకోమన్నారు. అయితే, ఆధ్యాత్మికమార్గాన్ని అపార్థం చేసుకుని దూరం చేసుకుంటోంది ప్రస్తుతసమాజం. దాంతో, తనదైనతోవతో నుంచి తప్పు దారిలో వెళ్ళి ప్రమాదాల పాలవుతోంది. పాశ్చాత్యసాంకేతికసౌఖ్యాల మోజులో పడుతోంది. భౌతికసుఖాలే జీవితపరమావధిగా భావిస్తోంది. కానీ అంతర్గతంగా సామాజికమనస్తత్త్వంలో ఉన్న ఆధ్యాత్మికతను మరవలేకపోతోంది. ఆధ్యాత్మికతకూ, పాశ్చాత్యుల ద్వారా గ్రహిస్తున్న భౌతికతకూ నడుమ సంఘర్షణ నడుస్తోంది. ప్రతి వ్యక్తి జీవితం అశాంతిమయం అవు

తోంది. మనస్సు కోరేది ఒకటి, ఆత్మ వాంఛించేది మరొకటి అవటంతో సమాజం అశాంతికి ఆలవాలం అవుతోంది. మునిగేవాడు గడ్డిపోచను సైతం ఆధారంగా భావించినట్టు, 'శాంతి' మార్గం చూపే ఎటువంటి బోధననైనా అదే పరమావధి అన్నట్టు భావిస్తోంది. ఫలితంగా 'వ్యక్తిత్వవికాసం' వ్యాపారమైపోయింది. 'ఆధ్యాత్మికబోధనలు' ధనసంపాదన మార్గాలయ్యాయి. ఇంట్లోనే దీపాన్ని పెట్టుకుని వెలుతురు కోసం ఊరంతా తిరిగినట్టుందీ వ్యవహారం.

*అవశ్యం యాతారశ్చిర తర మాషిత్వాపి విషయా*
*వియోగే కో భేద స్త్యజతి న జనో యత్స్వ యమమూన్*
*వ్రజన్తః స్వాతన్త్ర్యా దతుల పరితాపాయ మనసః*
*స్వయం త్యక్తా హ్యేతే శమ సుఖమనన్తం విదధతి*

ఈ భోగాలన్నీ ఎంత కాలం మనతో ఉన్నా ఏ నాటికైనా మనను విడిచి వెళ్లిపోయేవే. వీటిని మనమే స్వయంగా విడిచిపెట్టవచ్చు. అప్పుడు అవి దూరమైపోవటంలో బాధ ఉండదు. వాటంతట అవి మనల్ని విడిచి వెళ్ళిపోతే మనస్తాపం కలుగుతుంది. మనమే వాటిని విడిచేస్తే ఎంతో సుఖం, మనశ్శాంతి లభిస్తాయి.

'భర్తృహరి' బోధన ఇది. ఇక్కడ 'భోగలాలస'ని విడిచిపెట్టమంటున్నాడు. 'జీవితా'న్ని వదలమనటం లేదు. వేదాంతబోధనలోని ఈ సూక్ష్మమైన తేడాని పలువురు దుర్వ్యాఖ్యానం చేసి భారతీయతత్త్వాన్ని అపార్థాల పాలుచేశారు.

భారతీయధర్మం 'వ్యక్తి సత్కర్మలు చేస్తూ నూరేళ్లు బ్రతకా'లని కోరుతుంది. నూటికి ఒక్క సెకను తక్కువ అవటానికి ఒప్పుకోలేదు. అటువంటి ధర్మం వ్యక్తికి జీవితాన్ని అనుభవించటం నేర్పుతుంది తప్ప, జీవితాన్నుంచి పారిపోవటం నేర్పదు.

ఇక్కడ 'భోగాల్ని త్యజించటం' అంటే అన్ని వదిలేసి సన్న్యాసి అయిపోమని కాదు. తనలోని భోగలాలసను 'పరిమితి'లో పెట్టమని అర్థం. 'లక్ష్మీదేవి' విష్ణువు పాదాలు ఒత్తటం అంటే, 'స్త్రీ' పురుషుడి సేవ చేయటం కాదు. మనిషి ధనాశను అదుపులో పెట్టుకోవటం. లక్ష్మీదేవి పాదాలు ఒత్తటానికి విపరీతార్థాలు తీస్తారనే, ఆ అపార్థం తొలగించేందుకు లక్ష్మి, విష్ణువుల విడదీయరాని బంధాన్ని వివరించే గాథలనేకం ఉన్నాయి. లక్ష్మి లేని వైకుంఠంలో విష్ణువు ఒక్క క్షణం కూడా ఉండలేదు. ఆమె ఎటువెళ్తే అటు వెళ్తాడు. విష్ణువు లేని చోట లక్ష్మి ఉండలేదు. అంటే విష్ణువు కాళ్ళు ఒత్తేది లక్ష్మీదేవిలోని 'ధనాంశ' తప్ప లక్ష్మీదేవి కాదన్న మాట. అలాగే వ్యక్తి ధనాన్ని ద్వేషించకూడదు. ధనాన్ని

గౌరవించాలి. ధనాన్ని సంపాదించాలి. కానీ ఆ ధనం వల్ల కలిగే సౌఖ్యభావనను అదుపులో పెట్టాలి.

ధనం వల్ల కలిగే సర్వసౌఖ్యాలను క్షణ కాలంలో త్యజించగలగాలి. ధనం ఉన్నప్పుడు ఎంత ఆనందంగా ఉన్నాడో, ధనం లేమిలోనూ అంతే ఆనందంగా ఉండగలగాలి. ఈ సందర్భంలో 'జనకమహారాజు' కథను స్మరించాలి.

సన్న్యాసులందరిలోకీ ఉత్తమసన్న్యాసి జనకమహారాజు అన్నాడట రాజగురువు. దానికి ఇతరసన్న్యాసులకు అభ్యంతరం వచ్చింది. అన్నీ వదలి ఉన్న తమ కన్నా, రాజ్యాధికారం చేస్తూ, రాజభోగాలనుభవిస్తున్న జనకుడు సన్న్యాసి ఎలా అయ్యాడన్న అనుమానం వచ్చింది వాళ్ళకు. ఇంతలో రాజధానికి నిప్పంటుకుందన్న వార్త వచ్చింది. తమ పర్ణశాలలు కాలిపోతాయేమోనని సన్న్యాసులు పరుగులు తీశారు. రాజు మాత్రం నిబ్బరంగా ఉన్నాడు. అందుకే అన్ని సౌఖ్యాలూ అనుభవిస్తూ కూడా ఏ సౌఖ్యానికి ప్రలోభం పొందనివాడు నిజమైన వేదాంతి అంటారు.

వివేకానందస్వామి రాజభవనాలలో ఉండేవాడు. రాజులతో పాటు భోగాలు అనుభవించేవాడు. కానీ మరుక్షణం నేలపై పరుండేవాడు. ఒంటరిగా కాలినడకన ప్రయాణించేవాడు. ఆకులు, అలములు తినేవాడు. వందమంది సాధారణప్రజలను మార్చటం కన్నా ఒక్క రాజుకు హిందూధర్మం బోధిస్తే రాజ్యం హిందూరాజ్యం అవుతుందని ఆయన రాజుల వద్ద ఉన్నాడు. తన పని కాగానే ముందుకు సాగిపోయాడు. అంటే పూరిగుడిసెలో ఎంత సంతృప్తిగా ఉన్నాడో, రాజభోగాలున్నప్పుడూ అదే సంతృప్తిననుభవించాడన్నమాట.

*అశీమహి వయం భిక్షామాశా వాసో వసీమహి*
*శయీమహి మహీపృష్ఠే కుర్వీమహి కిమీశ్వరైః*

మేం భిక్షాన్నం తింటాం. ఆకాశవస్త్రాన్ని ధరిస్తాం. నేల మీద పడుకుంటాం. మాకు సంపన్నులతో పనేమిటి?

కోరికలను అదుపులో పెట్టుకోవటం అంటే ఇది అర్థం. కోరికలు సహజం. అవి అదుపు తప్పటం అనర్థం. కాబట్టి అవసరమైనంత ధనాన్ని సంపాదించాలి. తాను సంపాదించే ధనానుసారం కోరికలను తీర్చుకోవాలి. అంతే తప్ప కోరికలను అనుసరించి ధనసంపాదన కోసం పరుగెత్తితే, కోరికలు ఎలాగూ తీరవు. సంపాదన కుదరదు. కానీ జీవితం చేజారిపోతుంది. తీరని కోరికల నిరాశలో, ధనసంపాదన ఉద్విగ్నతలో ఆరోగ్యం

పాడవుతుంది. ధనం వెంట పరుగిడటంలో ఆత్మీయులు దూరం అవుతారు. బాధను తీర్చేవాడుండడు. పంచుకునే వాడుండడు. దాంతో నిరాశానిస్పృహల్లో క్రుంగుతూ, అనారోగ్యంతో బాధపడుతూ వ్యక్తి మిగిలిపోతాడు. తనలోని 'ధనాశ' తన అనారోగ్యానికి అసలు కారణం అని గ్రహించకుండా ఎన్ని ఔషధాలు తీసుకున్నా లాభం ఉండదు.

*అస్తినాస్తో పిపాసాయాః సంతోషః పరమం సుఖమ్*
*తస్మాత్ సంతోష మేవేహ పరం పశ్యన్తి పండితాః*

ఆశకు అంతం లేదు. సంతోషం పరమసుఖాన్నిస్తుంది. అందుచేత పండితులు సంతోషమే మంచిదని చెప్తారు. ఇక్కడ సంతోషం, సంతృప్తితో వచ్చిన సంతోషం తప్ప ధనంతో వచ్చే భౌతికసౌఖ్యం కాదు.

*అర్థానా మర్జనే దుఃఖమర్జితానాం చ రక్షణే*
*నాశే దుఃఖం వ్యయే దుఃఖం దిగర్థం దుఃఖభాజనమ్*

ధనం సంపాదించటంలో దుఃఖం, సంపాదించినదానిని రక్షించడం ఓ దుఃఖం, అది పోతే దుఃఖం, ఖర్చయిపోతే దుఃఖం, ధనంతో అంతా దుఃఖమే. అంటే 'డబ్బు'తో కూడుకున్నదేదైనా 'హద్దు' దాటితో దుఃఖకారణ మవుతుందన్నమాట. కాబట్టి ధన సంపాదన అవసరమైనంతే చేయాలి. అదీ ధర్మానికి లోబడి, ఎవరికీ అన్యాయం చేయకుండా సాధించాలి. ఆపై దానధర్మాలు చేయాలి. ఎందుకంటే ధనం మాత్రమే కాదు జీవితం కూడా అశాశ్వతమైంది.

*అనిత్యాని శరీరాణి విభవో నైవ శాశ్వతః*
*నిత్యం సంనిహితో మృత్యుః కర్తవ్యో ధర్మసంగ్రహః*

శరీరాలు అనిత్యమైనవి. ఐశ్వర్యం శాశ్వతం కాదు. మృత్యుదేవత పక్కనే పొంచి ఉంది. కాబట్టి ధర్మాన్ని సంపాదించాలి.

ఇప్పుడు మనకు 'ది మాంక్ హూ సోల్డ్ ఫెర్రారి'లో రబీన్‌శర్మ చెప్పిన వ్యక్తిత్వ వికాససూత్రాల అవసరం కనబడదు. ఎందుకంటే అవన్నీ మనకు అనాదిగా వారసత్వంగా అందుతూ వస్తున్నవే. మనమే వాటిని గ్రహించలేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే 'రబీన్‌శర్మ' పుస్తకసారాన్ని ఈ ఒక్క శ్లోకం వివరిస్తుంది. ఆనందంగా, ఆరోగ్యంగా, సంతృప్తిగా జీవించేందుకు మార్గం చూపిస్తుంది.

*అపరిచలయా సక్త్యా సుదృశా స్నిగ్ధముగ్ధయా*
*ఋజు పశ్యామి సద్వృత్త తేన జీవామ్యనామయః*

అన్నింటినీ అందరినీ కూడా చలించని ఆసక్తితో, స్నేహపూర్వకమైన మంచి దృష్టితో, ఏ మాత్రం వక్రత్వం లేకుండా చూస్తాను. అందుకే ఏ రోగాలూ లేకుండా జీవిస్తున్నాను. ఇదే సూత్రం ఆచరణలో పెడితే వ్యక్తి హాయిగా, ఆరోగ్యంగా జీవించగలుగుతాడు.

## ధనం - ఆత్మాభిమానం

*అలముదకేన తృణైర్వా మనస్వినా*
*ప్రాణధారణా కార్యా*
*నా సంస్కృతశ్చ పురుషః*
*ప్రాకృతసత్త్వః ప్రణయితవ్యః*

ఆత్మాభిమానం ఉన్నవాడు నీళ్ళు తాగి గాని, ఆకులు అలములు తిని గాని బతకవచ్చు. అంతే కానీ సంస్కారరహితుడు, నీచబుద్ధి అయినవాడిని సంతోషపెట్టడం కోసం ప్రయత్నించకూడదు.

భారతీయజీవనవిధానంలో ఆత్మగౌరవం, ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం వంటి భావాలకు ప్రాధాన్యం అధికంగా ఉంటుంది. ధనం విషయంలో కూడా వీటి ప్రాధాన్యాన్ని ఉపేక్షించటానికి వీలు లేదు.

ప్రాచీనభారతీయవ్యవస్థలో రాజు, ధనవంతుడు, ఇలా వర్గీకరణ ఉన్నా ఏ వ్యక్తికి ఆ వ్యక్తి స్వతంత్రంగా బ్రతుకు గడిపే వీలుండేది. సామాజికంగా ప్రతి వ్యక్తికీ ఓ గౌరవం, నిర్దిష్టకర్తవ్యం ఉండేవి. వాటి ఆధారంగా జీవితాంతం ఎవరికీ తల వంచకుండా, యాచించకుండా వ్యక్తి బ్రతకగలిగేవాడు.

కానీ ఆధునిక వ్యవస్థలో వ్యక్తి స్వతంత్రజీవనం సాగించే వీలు లేదు. ప్రభుత్వం మీద ఆధారపడి బ్రతికే గుమాస్తాల తయారీ కోసం బ్రిటిష్‌వారు ఏర్పరచిన వ్యవస్థ మన ఆత్మగౌరవాన్ని తగ్గించింది. ఆత్మాభిమానాన్ని నశింపచేసి ఆత్మవిశ్వాసాన్ని హరించింది. దాంతో ఒకప్పుడు ఆత్మవిశ్వాసంలేని వ్యక్తిరహితమైన సమాజం, ఇప్పుడు ఆత్మ విశ్వాసరహితమైన సమాజంగా మారుతోంది. జీవనభృతికి ఎవరో ఒకరిపై ఆధార పడకపోతే గడవని పరిస్థితి వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో సంస్కారరహితుడు, నీచబుద్ధి అయినవాడిని సంతోషపెట్టటం కోసం ప్రయత్నించకుండా జీవిక కొన సాగించటం కష్టతరమవుతోంది. ప్రస్తుతం సమాజంలో నెలకొని ఉన్న అశాంతికి, ఆవేశానికి ప్రధానకారణం ఇదే.

*ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి*
*పురంబులు వాహనంబులున్*
*సొమ్ములు గొన్ని పుచ్చుకొని చొక్కి*
*శరీరము వాసి కాలుచే*
*సమ్మెట పోటులం బడక సమ్మతితో*
*హరికిచ్చి చెప్పె నీ*
*బమ్మెర పోతరాజొకడు భాగవతంబు*
*జగద్ధితంబుగన్.*

ప్రసిద్ధం పోతనగారి ఈ పద్యం! తాను రచించిన భాగవతాన్ని మనుజేశ్వరాధములకు అంకిత మిచ్చి డబ్బు సంపాదించటాన్ని తీవ్రంగా నిరసించాడు పోతన. తన పద్యం విలువ తెలియనివారికి, తన సృజనాత్మక నైపుణ్యాన్ని అభినందించి ఆనందించలేనివారికి, తన కావ్యాత్మలో సహస్రాంశాన్నయినా స్పృశించలేనివారికి తన రచనను అంకితమిచ్చి సకలభోగాలను అనుభవించటం కన్నా, భగవంతుడికి అంకితమిచ్చి పేదరికంలో మగ్గటమే మేలనుకున్నాడు పోతన. ఆత్మాభిమానం కలవాడు రాజులను మెప్పించి, వారి వెకిలి చేష్టలను భరించటం కన్నా నీళ్ళు తాగి బతకటానికే ఇష్ట పడతాడు. పోతన చెప్పినదాన్నే సుమతీశతకకారుడు మరో కోణంలో చెప్తాడు.

*అడిగిన జీతం బీయని*
*మిడిమేలపు దొరను గొల్చి మిడుకుట కంటెన్*
*వడి గల యెద్దుల గట్టుక*
*మడి దున్నుక బ్రతుకవచ్చు మహిలో సుమతీ.*

అడిగిన జీతం ఇయ్యనివాడి దగ్గర పని చేయడం కన్నా వ్యవసాయం చేస్తూ బతకటమే మేలంటున్నాడు సుమతీ శతకకారుడు.

*అడియాస కొలువు గొలువకు*
*గుడిమణియము సేయబోకు, కుజనుల తోడన్*
*విడువక కూరిమి సేయకు,త*
*మడవిని దోడరయ కొంటి నరుగకు సుమతీ.*

వ్యర్థమైన ఆశ గల ఉద్యోగం, దేవాలయంపై అధికారం, చెడ్డవారితో స్నేహం, అడవిలో ఒంటరిగా పోవటం మంచివి కావు అని సలహా ఇస్తున్నాడు సుమతీ

శతకకారుడు. అంటే ఏ ఉద్యోగంలోనైతే వ్యక్తి ఆశలు నెరవేరవో ఆ ఉద్యోగం చేయకూడదని అర్థం.

*అధరము కదలియు గదలక*
*మధురములగు భాషలుడిగి మౌనవ్రతుడౌ,*
*నధికార రోగపూరిత*
*బధిరాంధక శవము జూడ బాపము సుమతీ.*

పెదవి కదిలిందో లేదో తెలియని విధాన, మంచి మాటలు మాని, అధికారమనే రోగంతో మాట్లాడకుండా దర్పంగా ఉండే అధికారి, జీవచ్ఛవంతో సమానం. అటువంటి అధికారిని చూస్తేనే పాపం.

ఆత్మాభిమానం వదలకుండా మంచినీళ్లు తాగి బతకమనే శ్లోకాన్ని, పోతన పద్యాన్ని, సుమతీ శతకకారుడి ఈ మూడు సలహాలను చూస్తుంటే ఒక విషయం స్పష్టమౌతుంది. ఈ శ్లోకాలు, పద్యాలలో చెప్పినవన్నీ అక్షర లక్షలు చేసే సత్యాలు. తిరుగులేని, కాదనలేని నిజాలు. వీలుంటే, బతక గలిగితే అందరం పోతనలాగా పేదరికంలోనైనా హాయిగా సుఖంగా, ఆత్మగౌరవంతో బతకటానికే ఇష్టపడతాం కానీ ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగాలలో కొనసాగేందుకు ఇష్టపడం.

ఎందుకంటే మనమంతా పైకి ఒప్పుకోకున్నా, ఎంత కాదన్నా భారతీయధర్మ సంస్కారాన్ని వారసత్వంగా పొందినవారం. శాస్త్రపరిజ్ఞానం లేకున్నా, విధ్యుక్తకర్మల జ్ఞానం లేకపోయినా, పూజలు, పునస్కారాలు చేయకపోయినా మన ప్రమేయం లేకుండా, మన ఇష్టాయిష్టాలతో ప్రసక్తి లేకుండా మన నరనరాన, శరీరం అణువణువునా భారతీయ ధర్మం నిండి ఉంది.

అందుకే మనమంతా ఒకటే వాంఛిస్తాం.

*అకృత్వా పరసంతాపమ*
*గత్వా ఖలనమ్రతామ్*
*అనుత్సృజ్య సతాం వర్త్మ యత్*
*స్వల్పమపి తద్భహు*

ఇతరులకు బాధ కలిగించకుండా, దుర్మార్గులకు నమస్కారాలు చేయకుండా, సత్పురుషుల మార్గాన్ని విడవకుండా సంపాదించుకొన్నది కొంచెమైనా అది గొప్పదే.

'గంగి గోవు పాలు గరిటె డైనను చాలు' అని కొంచెంతోనైనా సంతృప్తి పడగల సంస్కారం మన అందరిలో ఉంది. పైగా ధనం కన్నా మనం ధర్మానికి, అభిమానానికి పెద్ద పీట వేస్తాం. కానీ ప్రస్తుతం వ్యవస్థ మన ధర్మం ఆధారంగా ఏర్పడింది కాదు. మన సమాజం మన సంప్రదాయసూత్రాల ఆధారంగా ఎదుగుతున్నది కాదు. మన ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసి, ఆత్మవిశ్వాసాన్ని నశింపజేసి ఆత్మాభిమానం లేని పౌరులను తయారుచేసే వ్యవస్థను బ్రిటిష్‌వాడు ఏర్పరిచాడు. ఆ వ్యవస్థను నిర్మూలించి నపుడే మనకు నిజంగా స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని 1903లో అరబిందో ఓ వ్యాసంలో నిష్కర్షగా ప్రకటించాడు. కానీ అదే వ్యవస్థ కొనసాగుతుండటంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో దేశప్రజలు తమ సంస్కారం సూచించే మార్గాన్ని కాక లౌకికమార్గాన్ని అనుసరించాల్సి వస్తోంది.

*అపినామ స దృశ్యేత పురుషాతిశయో భువి*
*గర్వోచ్ఛూనముఖా యేన ధనికో నావలోకితాః*

అతిశయం, గర్వం ఉట్టిపడే ధనికుల ముఖాన్ని చూడాల్సిన అవసరం కలగని ఉత్తమపురుషులెవరైనా ఈ ప్రపంచంలో కనబడతారా?

మన పూర్వికులకు ప్రపంచం తీరు తెలుసు. ఆత్మాభిమానం నిలుపుకుంటూ జీవిక కొనసాగించటం ఉత్తమం. కానీ అలా అందరికీ కుదరదు. కాబట్టి ధనికులను యాచించకుండా, వారి ముందుకు వెళ్ళి అభ్యర్థించకుండా ఎవరికీ గడవదని కూడా చెప్పారు.

*అస్య దగ్ధోదర స్యార్థే కిం న కుర్వన్తి పండితాః*
*వానరీమివ వాగ్దేవీం నర్తయన్తి గృహేగృహే*

ఈ పాడు పొట్ట కోసం పండితులు ఎంతకైనా దిగజారాల్సి వస్తుంది. వాగ్దేవిని ఇంటింటికి తీసుకు వెళ్ళి కోతిని ఆడించినట్టు ఆడించాల్సి వస్తోంది.

ఇది ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నాం. అర్హతతో సంబంధం లేకుండా అందలాలు ఎక్కేవారిని చూస్తున్నాం. అర్హత ఉన్నా అట్టడుగున ఉండిపోయి, అర్హత లేనివారి వద్ద ఆత్మాభిమానాన్ని చంపుకుని పనిచేసేవారిని చూస్తున్నాం. అలాంటి వారిలో మనమూ ఉన్నాం.

ఏమీ రానివాడు పై ఆఫీసరై పనికిరాని నిర్ణయాలు తీసుకుని సంస్థను ప్రమాదంలోకి నెడుతుంటే, ఆలోచనలుండి మౌనంగా చూస్తూ క్రుంగి పోయేవారెందరో ఉన్నారు.

మనసులో ఒకటి చేయాలని ఉంటే, జీవిక కోసం తప్పనిసరిగా ఏదో ఒకటి చేయాల్సి వచ్చి అటు మనసుని సంతృప్తి పరచుకోలేక, ఇటు చేస్తున్న పనికి న్యాయం చేయలేక సతమతమయ్యేవారు అడుగడుగునా కోకొల్లలుగా కనిపిస్తారు. అన్నీ తెలిసినా, ఏమీ తెలియనివాడి ముందు తల వంచుకుని నుంచునే వారు అణువణువునా దేశంలో కనిపిస్తారు. గుప్పెడు డబ్బుల కోసం జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని అమ్ముకుని, తనలోని శక్తికి అన్యాయం చేస్తున్న నిజాన్ని గ్రహించి నిరాశతో, నిస్పృహతో కుమిలేవాళ్ళు మన దేశంలో ప్రతికణాన దర్శనమిస్తారు. తమలో ఉన్న శక్తిని ఉపయోగించలేక, దాన్ని గుర్తించి, ప్రోత్సహించేవాడు లేక, అన్ని ఆశలను అణచుకుని, నిరాశావేశాలలో బతికే ప్రజలమయం మన దేశం. కింద పని చేసే ఉద్యోగినులపై అధికారం చేసి తన పశుత్వాన్ని సంతృప్తి పరచుకునే వాళ్ల దౌష్ట్యాన్ని జీవనభృతి కోసం భరించాల్సిరావటం ప్రస్తుత జీవన విధానంలోని మరో అంశం.

తాను నిజాయితీగా పనిచేస్తున్నా, కాకా పట్టేవాడికి గుర్తింపు లభించటం, తను చేస్తున్న పని తన తెలివికి న్యాయం చేసేది కాదని గ్రహించటం వల్ల అసంతృప్తి కలగటం వంటి అంశాలు కూడా సమాజంలో 'అశాంతి'కి కారణం.

*అభిభూతో అప్యవజ్ఞాతో యో రాజ్ఞాం ద్వారి తిష్ఠతి*
*సతు రాజ్ఞం శ్రియం భుజ్క్తే నాభిమానీ కదాచన*

తిరస్కారానికి గురైనా, అవమానించబడినా, ప్రభువుల ద్వారం విడవకుండా ఉండేవాడే వాళ్ళ ఐశ్వర్యం అనుభవించగలుగుతాడు. కానీ ఆత్మాభిమానం కలవాడు ఎన్నడూ అనుభవించలేడు. ఇదీ మన అనుభవమే. భజనగాళ్లు, చెంచాలు, పైవాడి అడుగులకు మడుగులొత్తి, వాడేం మాట్లాడినా సన్నాయి వాద్యం వింటున్నట్టు ముఖం పెట్టేవాళ్ళకే ప్రాధాన్యం లభిస్తుంటే ఉద్యోగం చేయలేక, వదిలితే బతకలేక అసంతృప్తితో, ఆవేశంతో, బతుకుతున్న వాళ్లం మనం. మనకు 'పోతన' ఆదర్శమైనా, అలా బతకాలని ఉన్నా బతకలేనివాళ్లం మనం.

*అంజలిః శపథః సాన్త్వం శిరసా పాదవన్దనమ్*
*ఆశాకరణ మిత్యేవం కర్తవ్యం భూతి మిచ్ఛతా.*

అభివృద్ధి పొందాలని కోరేవాడు చేతులు జోడించి నమస్కరిస్తూ ఉండాలి. సమయానుసారంగా ఒట్టుపెట్టడం, బతిమాలుకోవడం, తలతో పాదాభివందనం చేయడం, ఆశను చూపిస్తూ ఉండటం చేయాలి.

ఇవన్నీ చేసినవాడు అభివృద్ధి చెందుతూ, చేయలేనివాడు తెలివి ఉన్నా తిరస్కారానికి గురవుతుండటం మనలోని అసంతృప్తికి, ఆవేశానికి, నిరాశకు ప్రధాన కారణం.

## ఉద్యోగాలలో అసంతృప్తి

వ్యక్తి జీవితంలో అత్యంతప్రాముఖ్యం వహించే అంశం ఉద్యోగం. పొట్ట కూటి కోసం వ్యక్తి చేసే పని అతని మనస్తత్వానికి సరిపడింది అయితే సమస్య లేదు. అలా కాక వ్యక్తి మనస్తత్వానికి పూర్తిగా భిన్నమైన ఉద్యోగం చేయాల్సి వస్తే, అది వ్యక్తిలో తీవ్రమైన సంఘర్షణకు కారణమౌతుంది. ప్రస్తుత సమాజంలో వ్యక్తి ప్రవృత్తితో సంబంధం లేని ఉద్యోగాలు, ఆసక్తి ప్రసక్తిలేని చదువులు అవటం వల్ల ఈ సంఘర్షణ మరింత తీవ్రమవుతోంది. ఈ సంఘర్షణ లోంచి అశాంతి, అసంతృప్తులు ఉత్పన్నమౌతాయి. ఇవి వ్యక్తి జీవితాన్ని అస్తవ్యస్తం చేసి వ్యక్తిత్వాన్ని ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

ఇటువంటి అస్తవ్యస్తవ్యవస్థలో ఉంటూ కూడా తన వృత్తికీ, ప్రవృత్తికీ నడుమ సమన్వయం సాధించగలగటం వ్యక్తి వ్యక్తిత్వాన్ని నిరూపించే అంశం. గమనిస్తే, ఎందరో అత్యంతనైపుణ్యం కల వ్యక్తులు జీవనోపాధి వేటలో పడి తమ అసలు వ్యక్తిత్వాన్ని మరచిపోతారు. అది వారికి తీరని అసంతృప్తికి కారణం అవుతుంది. ఈ అసంతృప్తిని అణుచుకుంటూ జీవనభృతి సంపాదిస్తూ కూడా తనకు ఇష్టమైన అంశాన్ని సాధించగలగటం విజేతను, పరాజితుడి నుంచి వేరు చేస్తుంది.

తను చేస్తున్న ఉద్యోగాన్ని తిట్టుకుంటూ, చుట్టూ ఉన్నవారిని తిడుతూ, ప్రతిదాన్నీ విమర్శిస్తూ తనలోని అశాంతిని విస్తరిస్తూ బతుకుతారు సామాన్యులు. వీరిలో కొందరు తమ అశాంతికి కారణం గుర్తించి ఏ పనిలో తమకు ఆనందం లభిస్తుందో ఆ పని వైపు దృష్టి కేంద్రీకరిస్తారు. విజయం సాధిస్తారు. మరి కొందరు పరిస్థితులతో రాజీ పడతారు. తన వృత్తికీ ప్రవృత్తికీ నడుమ సమన్వయం సాధిస్తారు. ప్రశాంతజీవనం సాగిస్తారు.

ప్రస్తుతం ఆధ్యాత్మిక ఉపన్యాసాలతో తెలుగువారిని విశేషంగా ఆకర్షిస్తున్న సామవేదం షణ్ముఖశర్మగారూ రకరకాల ఉద్యోగాలు చేశారు. ఓ పత్రికలో సబ్-ఎడిటర్‌గా పని చేశారు. సినిమాల్లో పాటలు రాశారు. చివరికి తనలోని శక్తిని ఉత్తమరీతిలో ప్రదర్శించే మాధ్యమం లభించింది. అలాగే శివానందమూర్తిగారు పూర్వాశ్రమంలో ప్రభుత్వోద్యోగి. తనలోని ఆధ్యాత్మికతకూ, వృత్తికీ నడుమ ఆయన సమన్వయం సాధించగలిగారు. ఆయన ప్రశాంత జీవనం సాగిస్తూ, పదిమందికి శాంతి వెలుగులు పంచుతున్నారు. ఇంకా మనం గమనిస్తే అనేకకళాకారులు క్లర్కులుగా, డిటిపి ఆపరేటర్లుగా రకరకాల ఉద్యోగాలు

చేస్తూ, తమ ప్రవృత్తికి న్యాయం చేకూర్చాలని ప్రయత్నిస్తున్నారు. తమ నిరాశలను, అశాంతులను పక్కనబెట్టి మరీ తమ కళాప్రదర్శన చేస్తున్నారు.

సినిమాల్లో హీరోలు, హీరోయిన్లు అవాలని బోలెడంత మంది ప్రయత్నిస్తారు. వారిలో అనేకులు విఫలమవుతారు. ఎక్స్‌ట్రాలుగా మిగిలిపోతారు. ఒకరో, ఇద్దరో హీరోలై విజయం సాధిస్తారు. జీవితంలో కూడా ఇంతే. ప్రస్తుతసమాజంలో ప్రవృత్తిని పరిశీలించి వాటికి తగ్గ ఉద్యోగాలిచ్చే వ్యవస్థ లేదు. ఒక వ్యక్తి కళ పైనే ఆధారపడి జీవించగలిగే పరిస్థితులు లేవు. ఇటువంటప్పుడు నిత్యం తిట్టుకుంటూ, నిరాశానిస్పృహలలో బతికే కన్నా, పరిస్థితిని అర్థం చేసుకుని రాజీపడటం  వైపు వ్యక్తి దృష్టిని మళ్లించాలి.

గమనిస్తే, పూర్వకాలంలో కూడా ఉద్యోగవ్యవస్థ ఉంది. ఇప్పటిలా మరీ అన్యాయంగా కాకున్నా, వ్యక్తులు రాజాశ్రయం కోసం తాపత్రయపడేవారు. రాజులను మెప్పించి డబ్బు సంపాదించాలని ప్రయత్నించేవారు. అలా చేయటం ఇష్టం లేనివారు ఏదో ఓ మూల ఏదో పని చేసుకుని బతుకుతూ జీవితం సాగించేవారు. బ్రిటిష్‌వారి ఆగమనం ఈ వ్యవస్థను మార్చింది. ఒకరిపై ఒకరు ఆధారపడి జీవించే వ్యవస్థ స్థానంలో ఒకడిపై అనేకులు ఆధారపడే వ్యవస్థను ఏర్పాటు చేసింది. అయినా సరే, మన పూర్వికులు 'ప్రభువు'తో ఎలా మెలగాలో సూచించిన పద్ధతులు, ఈ కాలంలో 'అధికారుల'తో ఎలా మెలగాలో అన్నదానికీ వర్తిస్తాయి. గతంలో రాజు ఒక్కడికే తల వంచాల్సి వచ్చేది. ఆ తరువాత బ్రిటిష్ దొరలకు తల వంచాల్సి వచ్చేది. వారు పోయినా వారి వ్యవస్థ అలాగే ఉండటంతో తెల్లదొరల స్థానాన్ని నల్లదొరలు ఆక్రమించారు. అధికారులు, ఆఫీసర్లకు ఇప్పుడు 'సలామ్' చేయాల్సి వస్తోంది. అంటే అప్పటి ప్రభువు, ఇప్పుడు 'ఆఫీసరు' అన్నమాట.

*తనర నృపతి తోడ, తగ దుర్జనుని తోడ*
*నగ్ని తోడ, పరుని యాలి తోడ*
*హాస్యమాడు టెల్ల నగును ప్రాణాంతము*
*విశ్వదాభిరామ వినుర వేమ.*

భూపతితో, దుర్మార్గునితో, అగ్నితో, ఇతరుల భార్యలతో పరిహాసమాడటం వల్ల, ప్రాణహాని సంభవిస్తుంది. అంటే అధికారులతో హాస్యాలు ఆడకూడదన్నమాట.

సాధారణంగా మనం అధికారి అన్నవాడు కాస్త చనువుగా మాట్లాడితే పొంగిపోతాం. అంత పెద్దవాడు మనతో ఇంత బాగా మాట్లాడటమేమిటని ఉప్పొంగిపోతాం. ఈ

అత్యుత్సాహంతో నోరు జారి తరువాత ఇరుక్కుపోతాం. ఎందుకంటే తన కిందివాడు అన్నమాటని పైవాడు పట్టించుకుంటాడు. పైగా బ్రిటిష్‌వాడు అందించిపోయిన అధికారదాహం కిందివాడు తనకు సేవలు చేసేందుకే అన్న భావం పైవాడిలో కలిగిస్తుంది. ఇటువంటివారు తమకు సేవలు చేసేవారిని ఆదర్శంగా చూస్తూ, సేవలు చేయనివారిని ఇబ్బందుల పాలు చేస్తూంటారు.

మరో రకం అధికారులు, ప్రతి పనిలో తప్పులు వెతుకుతుంటారు. ఎదుటివాడిలో తప్పులు వెతకడం ద్వారా తమ ఆధిక్యాన్ని చాటుకుంటారు. అహాన్ని సంతృప్తి పరచుకుంటారు.

*ఎప్పుడు దప్పులు వెదకెడు*
*నప్పురుషుని గొల్వగూడ దది యెట్లన్నన్*
*సప్పంబు పడగ నీడను*
*గప్ప వసించిన విధంబు గదరా సుమతీ!*

కొందరు అధికారులుంటారు. వారికి తమ కిందివారి ప్రతి పని తప్పుగా అనిపిస్తుంటుంది. ప్రతి అక్షరంలో తప్పులు వెతికి, ఎదుటివారిని తక్కువ చేయందే ఇటువంటివారి అహం సంతృప్తి చెందదు. ఇలాంటి తప్పులు వెతికేవారి కింద పనిచేయటం చాలా కష్టం. పాము పడగ నీడలో ఉన్నట్టే. ఎప్పుడు కాటేస్తుందో తెలియదు. ఏ క్షణంలో పిల్చి ఏమని తిడతాడో తెలియదు. ఎందుకు తిడతాడో తెలియదు. అటువంటివాడి కింద ఉద్యోగం వదిలెయ్యమంటాడు సుమతీశతకకారుడు.

అయితే ప్రస్తుతకాలంలో దొరికిన ఉద్యోగం వదలటం అంత తేలిక కాదు. కాబట్టి ఎటువంటి అహంకారాలైనా భరిస్తూ తల వంచాల్సి వస్తుంది. మనసులో వాడిని తిట్టుకుంటూ, తమని తాము తిట్టుకుంటూ జీవితం కొనసాగించాల్సి వస్తుంది. ఇంకొందరు అధికారులు సెలవు ఇవ్వాలంటే ఇష్టపడరు. ఇంకొందరు అయిదు నిమిషాలు ఆలస్యంగా వచ్చినా విరుచుకుపడతారు. అలాగని ఆఫీసైన అరగంట దాకా వదలరు. ఇటువంటి అధికారులను చూసి వేమన ఈ పద్యం రాసినట్టున్నాడు.

*తప్పు లెన్నువారు తండోపతండంబు*
*లుర్వి జనుల కెల్ల నుండు తప్పు*
*తప్పు లెన్నువారు తమ తప్పు లెరుగరు*
*విశ్వదాభిరామ వినుర వేమ*

మనం గతంలో చెప్పుకున్నాం. దుర్జనుడు సూది కొన లాంటివాడు. ప్రతి విషయంలో రంధ్రాన్వేషణ చేస్తుంటాడు. ఎదుటివాడి దోషాలు చూపటంవల్ల తాను గొప్పవాడైనట్టు భావిస్తూంటాడు తప్ప, తనలోనూ లోపాలున్నాయని అనుకోడు. దాంతో ఏ తప్పులు చూపి తాను గొప్పవాడైపోవాలని అనుకుంటున్నాడో, ఆ తప్పుల వల్లనే తన కింది వారి గౌరవం పొందలేకపోతాడు. అవహేళనకు గురవుతాడు. ఇటువంటివారి గురించి రకరకాలుగా మాట్లాడుకుంటూ తమ అహాన్ని సంతృప్తి పరచుకుంటారు కిందివాళ్ళు. ఇది అధికారికీ తెలుసు. దాంతో తనని వాళ్ళు సరిగ్గా గౌరవించటంలేదని మరింత బలప్రదర్శన చేస్తాడు. మరింత చులకన అవుతాడు.

అధికారులతో వ్యవహరించే తీరును మన పూర్వికులు మానవమనస్తత్వాన్ని కాచి వడబోసి తేల్చి చెప్పారు.

*అపృష్టో అత్రా ప్రధానో యో బ్రూతే రాజ్ఞః పురః కుధీః*
*న కేవల మసంమానం లభతే చ తిరస్క్రియామ్*

అంతగా ప్రాధాన్యం లేని తెలివితక్కువవాడు అడగకుండా అధికారి ముందు మాట్లాడితే గౌరవం పొందకుండా అవమానం కూడా పొందుతాడు.

మనిషి కూడా తాను తెలివైనవాడిని కానని ఒప్పుకోడు. తాను మూర్ఖుడినని అసలే ఒప్పుకోడు. ప్రతి వ్యక్తికీ అహంకారం ఉంటుంది. ఈ అహంకారం వ్యక్తి తన స్థాయిని మరచేట్టు చేస్తుంది. అందుకే రాజకీయాలతో, పాలన వ్యవహారాలతో సంబంధం లేని వ్యక్తి కూడా ఆ అంశాల గురించి వ్యాఖ్యానిస్తాడు. తన వాదమే సరైందని పోరాడుతాడు. క్రికెట్ బ్యాటు పుచ్చుకోనివారు కూడా క్రికెట్ ఆట ఎలా ఆడాలో తమ అభిప్రాయం వ్యక్తం చేసేస్తూంటారు. విమర్శలు కురిపిస్తూంటారు. కాబట్టి తనకు ప్రాధాన్యం లేదని గ్రహించటం వ్యక్తి విచక్షణకు నిదర్శనం. అటువంటి వ్యక్తి అప్రస్తుతప్రసంగాలకు తావివ్వడు. అనవసరంగా అధికారుల మాటల నడుమ జోక్యం చేసుకోడు. అంటే తానెంత తెలివైనవాడినని నమ్మకం ఉన్నా, ఆ విషయాల్లో తనకు ఎంతో తెలుసని నమ్మకం ఉన్నా అనవసరంగా అధికారుల మాటల్లో జోక్యం చేసుకునేవాడు అవమానాల పాలవుతాడు. కాబట్టి అన్నీ తెలిసినా ఏమీ తెలియనట్టు ఉండగలగటం చాలా ఆవశ్యకం. తను వ్యక్తిగతంగా ఎంత ప్రతిభాశాలి అయినా, ఆఫీసులో తన స్థాయి పరిమితులను గుర్తించి మెలగటం వల్ల వ్యక్తి అనేక అసంతృప్తులను, అశాంతులను దూరం చేసుకోవచ్చు.

*అహం హి సంమతో రాజ్ఞోయ ఏవం మన్యతే కుధీః*
*బలీవర్దః స విజ్ఞేయో విషాణ పరివర్జితః*

నేనంటే అధికారికి చాలా ఇష్టం అనుకునే మందబుద్ధి కొమ్ములు లేని ఎద్దు వంటివాడు. సాధారణంగా కొందరు పై అధికారుల ప్రాపు సంపాదించటం కోసం ఆరాటపడతారు. అలా వారి వద్ద కాస్త స్నేహం సాధించి, ఇక తమ కెదురులేదన్నట్టు ప్రవర్తిస్తారు. కానీ అటువంటి వారు మందబుద్ధులే కాదు, కొమ్ములు లేని ఎద్దుల వంటివారు. అందుకే ఎవడో అధికారి దగ్గర చేరి లాభాలు పొందుతున్నాడని, వాడి దారిని అనుకరించకూడ దన్నమాట.

ప్రస్తుత సమాజంలో వ్యక్తి నైపుణ్యానికి, తెలివికి విలువ లేని కాలంలో, తనకు గుర్తింపు లేదనో, తన తెలివికి తగ్గ ఉద్యోగం లేదనో వ్యక్తి కుములుతూ అశాంతి పాలవ్వాల్సిన అవసరం లేదు. అవసరమైతే 'వసుదేవుడూ గాడిద కాళ్లు పట్టుకున్నా'డని పాండవులు విరాటుడి కొలువు చేశారని, అర్జునుడు పేడివాడుగా ఉండాల్సి వచ్చిందని గుర్తు తెచ్చుకోవాలి. అర్థం చేసుకోవాలి. తాము న్న పరిస్థితులలో మౌనంగా ఉంటూ, తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకోవాలి. ఆఫీసులో 'పిఎఫ్' నంబరుగానే ఉంటూ, నిత్యజీవితంలో తమ ప్రతిభను వెలయించాలి. ఈ సందర్భంలో వేమన చెప్పిన 'నీతి' అందరికీ శిరోధార్యం. ఆచరణీయం.

*అనువు కాని చోట అధికుల మనరాదు*
*కొంచెముండు టెల్ల గొదువ కాదు*
*కొండ అద్దమందు కొంచెమైయుండదా?*
*విశ్వదాభిరామ వినుర వేమ.*

## వ్యక్తిత్వవికాసం

*యద్యత్పరవశమ్ కర్మ తత్తద్యత్నేన వర్జయేత్।*
*యద్యదాత్మవశమ్ తు స్యాత్తత్తద్సేవేత్ యత్నతః॥*

ఇతరులపై ఆధారపడేట్టు చేసే పనులకు దూరంగా ఉండాలి. తాను నియంత్రించ గలిగే పనులను వదలకుండా చేయాలి.

మనుస్మృతిలో మనువు చేసిన సూచన ఇది. మానవమనస్తత్వాన్ని కాచివడబోసి చేసిన సూత్రం ఇది. సాధారణంగా ప్రతి వ్యక్తి స్వతంత్రంగా ఉండేందుకే ఇష్టపడతాడు. గమనిస్తే, చిన్న పిల్లవాడు సైతం, కాస్త ఆత్మవిశ్వాసం రాగానే పెద్దల చేయి విదిలించుకుని తనంతట తానే నడవటానికి ఇష్టపడతాడు. నాలుగు అడుగులు వేసి పడిపోయినా, గర్వంగా, సంతోషంతో కిలకిల నవ్వుతాడు. అలా స్వయంగా నడిచి, సంతోషించే పిల్లవాడి

సంతోషం తల్లిదండ్రులకు అపరిమితమైన ఆనందం కలిగిస్తుంది. కానీ స్వతంత్రంగా నడవటం నేర్చిన పిల్లవాడు, తనంతట తాను పరుగులిడాలని ఉబలాట పడుతూంటే పెద్దలు ఆ ఉత్సాహానికి అడ్డుకట్ట వేయాలని చూస్తారు. అతడి స్వేచ్ఛను అరికట్టాలని చూస్తారు. అనేక సంఘర్షణలకు, అసంతృప్తులకు ఇది దారి తీస్తుంది. తాను స్వతంత్రంగా పని నిర్వహించగలనన్న ఉత్సాహం పిల్లవాడిది. స్వతంత్రంగా పని సమర్థంగా నిర్వహించగలడో, లేడోనన్న భయం పెద్దలది. ఇది అర్థం చేసుకున్న మనువు సంతోషాన్ని, దుఃఖాన్ని నిర్వచించాడు.

*సర్వ పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖమ్।*
*ఏతద్విద్యా త్సమాసేన లక్షణం సుఖదుఃఖయోః॥*

అన్ని విధాలుగా స్వతంత్రంగా ఉండటం సంతోషం. పరులపై ఆధారపడి ఉండటం దుఃఖం. ఇదే సుఖదుఃఖాల అసలైన నిర్వచనం.

ఒక రకంగా మన ఉద్యోగాల వల్ల మనలో కలిగే అసంతృప్తికి, దుఃఖానికి ఇది ప్రధానకారణం. 'స్వాతంత్ర్యం' అనేది విశృంఖలత్వం కాదు. తన ఇష్టానుసారం వ్యక్తి స్వచ్ఛందంగా నియమాలలో ఒదిగి ఉండటం నిజమైన స్వాతంత్ర్యం. పెద్దల మాట వినటం, సామాజిక నియమాలు పాటించటం, తన వారిని గౌరవించటం, దాంపత్య ధర్మం పాటించటం వంటివన్నీ వ్యక్తి స్వాతంత్ర్యానికి ఏ రకంగానూ భంగం కలిగించవు. కానీ ఉద్యోగం విషయంలో వ్యక్తి తీవ్రంగా గాయపడతాడు. తన ఇష్టానికి, ఉద్యోగానికి నడుమ సంఘర్షణకు గురవుతాడు. ఎందుకంటే ప్రస్తుతం మనం చేస్తున్న ఉద్యోగాలు ఏ రకంగానూ మన వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించవు. మనలోని ప్రవృత్తిని ప్రకటించవు. మనలో నిద్రాణ స్థితిలో ఉన్న సృజనాత్మకతను ఏ రకంగానూ సంతృప్తి పరచలేవు.

యత్కర్మ కుర్వతోస్య స్యాత్పరితో షోన్తరాత్మనః।
తత్ప్రయత్నేన కుర్వత విపరీతం తు వర్జయేత్॥

ఏ పని వల్ల వ్యక్తి అంతరాత్మకు సంతృప్తి కలగదో, ఆ పని వల్ల అశాంతి జనిస్తుంది. అటువంటి పని చేయకూడదు.

నిజం! గమనిస్తే ఇప్పటి మన ఉద్యోగాలేవీ వ్యక్తిప్రాధాన్యం కలవి కావు. టిక్కెట్లివ్వటం ఓ ఉద్యోగం. డబ్బు వసూలు చేసి లెక్కలు రాయటం మరో ఉద్యోగం. ఫోన్లో సమాచారం ఇవ్వటం ఇంకో ఉద్యోగం. రాత్రింబవళ్ళు కంప్యూటర్‌లోకి సమాచారం ఎక్కించటం (డాటా ఎంట్రీ) ఇంకో ఉద్యోగం. ఇవి మచ్చుకి కొన్ని ఉద్యోగాలు మాత్రమే.

ఇటువంటి యాంత్రికకార్యాలు ప్రస్తుతం మన సమాజంలో బోలెడన్ని. ఒక రకంగా, మన సమాజాన్ని యాంత్రిక ఉద్యోగాల సమాజంగా అభివర్ణించవచ్చు. చివరికి భగవంతుడి పూజ కూడా యాంత్రికమైపోయింది.

వ్యక్తి మనస్తత్వంతో సంబంధం లేకుండా, వ్యక్తి ప్రవృత్తి ప్రసక్తి లేకుండా పరీక్షలు నిర్వహించి, ఆ పరీక్షల్లో మార్కుల ప్రకారం ఉద్యోగానికి ఎన్నుకునే వ్యవస్థ ప్రభావం ఇది. ఉద్యోగం లేనిదే పొట్ట గడవని పరిస్థితుల వల్ల ఆ ఉద్యోగాలకు ఎగబడటంతప్ప గత్యంతరం లేకపోవటంతో, దొరికిన ఏదో ఉద్యోగంలో చేరతాడు వ్యక్తి. ఆపై ఆ ఉద్యోగంలో ఇమడలేడు. అసంతృప్తి జనిస్తుంది. సమాజంపై కసి పెరుగుతుంది. ఆ కసిని అవినీతి ద్వారా తీర్చుకుంటాడు. తన అవినీతిని సమర్థించుకుంటాడు. తన తెలివికి సరైన విలువనివ్వని సమాజాన్ని ద్వేషిస్తాడు. 'కానిస్టేబిల్' నుంచి పెద్ద పెద్ద మంత్రుల వరకూ అవినీతికి పాల్పడటం, అక్రమాలను సమర్థించటం వెనుక జరుగుతున్న మానసిక సంఘర్షణ అసలు రూపు ఇది.

ఇలా అవినీతికి పాల్పడనివారి అసంతృప్తి మరో వైపు మళ్ళుతుంది. పని సరిగ్గా చేయకపోవటం, ఉద్యోగంపై దృష్టి పెట్టకపోవటం ద్వారా తమ అసంతృప్తిని ప్రకటిస్తారు. ఇంకొందరు, తమలోని సృజనాత్మకతను ప్రదర్శించటం ద్వారా అసంతృప్తికి రూపం ఇస్తారు. ఐతే, వారికి ఉద్యోగాలు ప్రతిబంధకాలవుతాయి. ఉద్యోగం వదలలేక, తనలోని కళాకారుడికి సంపూర్ణ స్వేచ్ఛనివ్వలేక సతమతమవుతారు వీరు. అందుకే, ఇటువంటివారు తమ కళాప్రదర్శనలో ఎంత ఉత్తమంగా ఉన్నా, ఉద్యోగం విషయంలో అందుకు భిన్నంగా ఉంటారు. మరి కొందరు, తమ సృజనాత్మకతను ప్రదర్శించలేక, రకరకాల వ్యాపారాల ద్వారా డబ్బు సంపాదిస్తూ, తమని తాము సంతృప్తి పంచుకుంటారు. ఉద్యోగం విషయంలో ఉదాసీనంగా, మందకొడిగా ఉండే వీరు, తమ సొంతవ్యాపారాలలో ఎక్కడా లేని చురుకుదనం, తెలివి ప్రదర్శిస్తుంటారు.

ప్రభుత్వోద్యోగాలు వదలి రకరకాల వ్యాపారాలలో, అనేకరంగాలలో విశిష్టఖ్యాతి నార్జించినవారు అనేకులు ఉన్నారు. రజనీకాంత్ పూర్వాశ్రమంలో బస్ కండక్టరు. పురాణం సుబ్రహ్మణ్యశర్మ రైల్వేలో పని చేసేవాడు. తనికెళ్ళ భరణి కూడా రైల్వేలో పని చేసేవాడు. బ్రహ్మానందం లెక్చరర్. యండమూరి వీరేంద్రనాథ్ బ్యాంకు ఉద్యోగి. మల్లాది వెంకట కృష్ణమూర్తి ఏజీ ఆఫీసులో పని చేసేవాడు. ఇలా చెప్తూ పోతే అనేకులు మామూలు ఉద్యోగాలు చేస్తూ, అసంతృప్తిపాలై, ఆ అసంతృప్తిని మరో వైపు మళ్ళించుకుని సమాజంలో పేరు ప్రఖ్యాతులు సంపాదించటం కనిపిస్తుంది.

ఇలా పేరు ప్రఖ్యాతులు సంపాదించలేక అసంతృప్తిలో ఉండేవారు అనేకులు ఉన్నారు. ఒకప్పటి వ్యవస్థలో కాంపిటేటివ్ పరీక్షల ద్వారా ఉద్యోగాలు వచ్చేవి. ఇప్పుడు అవకాశాలు పెరిగాయి. కాస్త చదువు ఉంటే చాలు, ఉద్యోగం సంపాదించే వీలుంది. సూపర్ మార్కెట్లలో సేల్స్ ఉద్యోగం నుంచి కాల్ సెంటర్లలో ఉద్యోగం వరకూ బోలెడన్ని అవకాశాలు వ్యక్తులకున్నాయి. ఐటి రంగంలో దూకితే బోలెడంత డబ్బు సంపాదించి విదేశాలకు వెళ్ళే వీలు లభిస్తోంది. కానీ, తన ఇష్టమైన పని, సృజనాత్మకతతో సంబంధం ఉన్న పనులు చేసేవారికీ, ఇలా యాంత్రికంగా పనులు చేసేవారికీ చాలా తేడా ఉంటుంది.

సృజనాత్మకరంగాలలో పని చేసేవారికి తమ సృజనాత్మకాభినివేశాన్ని సంతృప్తి పంచుకునే అవకాశం లభిస్తుంది. అటువంటివారు తమ పనిలో నిమగ్నమై సర్వం మరచిపోతారు. అలాగే పరిశోధనరంగంలో ఆసక్తి ఉండి, ఆ రంగంలో అడుగుపెట్టిన శాస్త్రవేత్తలు ప్రపంచాన్ని మరచి సత్యావిష్కరణలో సర్వం త్యజిస్తారు. 'ఇస్రో' శాస్త్రవేత్తలు, ఇతరసత్యాన్వేషకులు ఇందుకు నిదర్శనం. జయంత్ నార్లికర్, అబ్దుల్ కలామ్, కస్తూరి రంగన్ వంటి శాస్త్రవేత్తల ప్రవృత్తి, ఉద్యోగం ఒక్కటే అవటంతో సామాన్యులు అనుభవించే అసంతృప్తి వారి అనుభవానికి రాలేదు. వారు విజేతలుగా నిలిచారు. వారి అసంతృప్తుల రంగు వేరు.

ఒక కోణం లోంచి చూస్తే, మామూలు గుమాస్తాలుగా, టెలిఫోన్ ఆపరేటర్లుగా, పోస్ట్‌మెన్‌గా, సేల్స్‌మెన్‌గా పని చేసేవారందరిలోనూ శాస్త్రవేత్తలలో ఉండే సత్యశోధనాసక్తి ఉంది. కళాకారులు ప్రదర్శించే సృజనాత్మకత ఉంది. కానీ వారి అంతరాత్మను సంతృప్తి పరచే పనులు గుర్తించే తీరిక లేక, గుర్తించినా ఆ మార్గంలో ప్రయాణించలేక రకరకాల అసంతృప్తులకు గురవుతున్నారు వ్యక్తులు. ప్రస్తుతం మన సమాజంలో మనం చూస్తున్న ఆవేశం, ఆవేదనలకు ఈ అసంతృప్తి ప్రధానకారణం. ఈ అసంతృప్తిని తగ్గించటం వ్యక్తిత్వవికాసంలో ప్రధానపాత్ర వహిస్తుంది.

యాంత్రికజీవనవిధానంలో మునిగి ఓ యంత్రమైపోతున్న మనిషి, ఏ రకంగానూ తాను యంత్రమవటాన్ని ఒప్పుకోలేడు. అతడిలోని ఆత్మ అతడిని నిలదీస్తూంటుంది. ఆత్మసాక్షి బాధిస్తూంటుంది. కాబట్టి, ఎంతగా యాంత్రికార్యాల్లో మునిగినా, వ్యక్తులు తమ అసంతృప్తికి కారణం గ్రహించి, తమలోని అంతరాత్మను సంతృప్తిపరిచే ప్రయత్నాలు చేయాలి. ఆధ్యాత్మికత ఇక్కడ మనిషికి సంతృప్తి నిస్తుంది.

మంచి సాహిత్యం చదవటం, మంచి సంగీతం వినటం, మంచి ప్రవచనాలు వినటం వ్యక్తిలో ఓ రకమైన సంతృప్తికి కారణమౌతుంది. వీలైనపుడు పర్యటనలు చేయటం,

సుందర ప్రకృతిదృశ్యాలు దర్శిస్తూ, భగవంతుడి కళానైపుణ్యాన్ని అణువణువునా దర్శించే ప్రయత్నం చేయటం ఈ అసంతృప్తిని కొంతైనా తగ్గిస్తుంది. తాను డబ్బు సంపా దించే యంత్రం కాదన్న నమ్మకం వ్యక్తికి కలుగు తుంది. ఆపై తనలో మినుకు మినుకు మంటున్న ఈ జ్యోతి ఆరకుండా చూసుకునే ప్రయత్నం చేయటం వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది.

ఏ పని చేస్తూంటే తనకు ఆత్మానందం కలుగుతుందో గుర్తించాలి. ఆ పనిపై దృష్టి పెట్టాలి. ఉద్యోగం నుంచి విరామం లభించినప్పుడు లాభాలతో ప్రసక్తి లేకుండా ఆ పనిపై దృష్టి కేంద్రీకరించాలి. మనువు చెప్పినట్టు ఆత్మానందం కలిగించని పనిని పూర్తిగా విసర్జించలేని పరిస్థితులలో, ఆత్మానందం కలిగే పనిని కాస్తయినా చేయటం వల్ల కొంత అయినా సంతృప్తి లభిస్తుంది. అసంతృప్తి కాస్తయినా తగ్గుతుంది. మన దేశం వారెందరో ఇతరదేశాల్లో అత్యద్భుతమైన తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు.

ఈ నాటి ఉద్యోగాలను, తమ వ్యక్తిత్వాలను చంపుకొని మరీ చేయాల్సి వస్తోందని అర్థం చేసుకున్నాం. నిత్యజీవితంలోని అశాంతులకు, ఆవేశాలకు ప్రధానకారణం, తప్పనిసరిగా ఇటువంటి ఉద్యోగాలు చేయాల్సిరావటమేనని అర్థం చేసుకున్నాం. ఇందువల్ల వ్యక్తి ఆత్మవిశ్వాసం దెబ్బ తిని, ఆత్మగౌరవం గాయపడి, ఎందుకో తనకే తెలియని నిరాశానిస్పృహలకు వ్యక్తిని మన ఉద్యోగవ్యవస్థ గురి చేస్తోంది. ఇటువంటి ఉద్యోగాలు చేస్తూ, పరిస్థితులతో రాజీపడి, తనని తాను సమాధానపరచుకుంటూ, సమన్వయం సాధించటం వ్యక్తిత్వవికాసానికి నిదర్శనం.

❖ ❖ ❖

# వ్యక్తిత్వం - అధికారం

## మేనేజ్‌మెంట్ ప్రథమ సూత్రం

ఉపయోగపెట్టుకొనే నేర్పు పైఅధికారిలో ఉంటే, ఉపయోగపడనివాడు లేడు. ఎటువంటిదైనా 'ఉద్యోగం' అనగానే వ్యక్తిలో నిరుత్సాహం కలుగుతుంది. అది అతడు కోరుకున్నదే, వాంఛించేదే అయినా, తప్పని సరిగా చేయాల్సి రావటం వ్యక్తిలోని స్వతంత్రేచ్ఛను దెబ్బతీస్తుంది. అశాంతికి దారి తీస్తుంది. అందుకే పోటీపడి పరీక్షలు రాసి సంపాదించిన ఉద్యోగమే అయినా, కొన్నాళ్లకు వ్యక్తిలో అసంతృప్తి గూడుకట్టుకోవటం మనం చూడవచ్చు.

తన పరిస్థితులతో రాజీపడాలని వ్యక్తి ప్రయత్నిస్తాడు. అతడు ఇలా రాజీ పడటంలో యాజమాన్యం కూడా దోహదం చేస్తే, వ్యక్తి సంఘర్షణ తీవ్రత తగ్గుతుంది. ఇది మన పూర్వీకులకు తెలుసు. అందుకే ఎలాగయితే వ్యక్తి రాజీపడటానికి సూచనలు చేశారో, అలాగే యాజమాన్యానికి కూడా సూచనలు చేశారు. ప్రభువు అన్నవాడు, ఎలా ఉండాలో, తన క్రిందివారితో ఎలా వ్యవహరించాలో వివరించారు. ప్రభువు, తన ప్రవర్తన ద్వారా తాను ఉత్తమవ్యక్తిత్వాన్ని సాధించటమే కాక, తన కిందివారి వ్యక్తిత్వవికాసానికి కూడా ఎలా దోహదపడవచ్చో అత్యంత సుందరంగా వివరించారు.

*అసమైః సమీయమానః సమైశ్చ*
*పరిహీయమాన సత్కారః!*
*ధురియో న యుజ్యమాన స్త్రిభిరర్థ*
*పతిం త్యజతి భృత్యః!!*

భృత్యుడిని అతని కంటే తక్కువవాళ్ళతో సమానంగా చూసినా, సమానమైనవాళ్ల కంటే తక్కువగా చూసినా, అతనికి తగిన పని అప్పగించకపోయినా, అతడు ప్రభువును విడిచి వెళ్లిపోతాడు.

మేనేజ్‌మెంట్‌లో ప్రథమసూత్రం ఇది. అత్యంతప్రముఖమైన సూత్రం ఇది. ఆఫీస్‌లో బాస్‌కే కాదు, ఇంట్లో తల్లిదండ్రులకు, అన్నలకు, ఇలా ఎదుటివాడిపై అధికారం చలాయించగల స్థితిలో ఉన్న ప్రతివాడికీ వర్తించేసూత్రం ఇది. ఏ సందర్భంలో చూస్తే ఆ సందర్భానికి ఒదిగి అర్థాన్నిచ్చే అత్యంత అద్భుతమైన సూత్రం ఇది.

'ప్రభువు' అన్న పదానికి ఒకప్పుడు 'రాజు' అన్న పదం సరిపోయేది. భృత్యుడంటే సేవకుడు అన్న అర్థం వచ్చేది. ప్రస్తుత సందర్భంలో ప్రభువును ఆఫీసర్‌గా, సేవకుడిని 'సబార్డినేట్'గా నిర్వచిస్తే ఈ శ్లోకం ప్రస్తుత పరిస్థితులకు సరిగ్గా సరిపోతోంది.

ప్రస్తుతసమాజంలో ఉద్యోగాలు వ్యక్తి తెలివికి, ఆసక్తికి, నైపుణ్యంతో సంబంధం లేనివి. దాంతో ఆఫీసర్ స్థానంలో ఉన్న వ్యక్తి కన్నా అతని కింద పనిచేసేవారు, తెలివైనవారు అయ్యే అవకాశం ఉంది. అతని కింద పని చేసేవారు, ఒక స్థాయికి చెందినవారైనా వారిలో వారికి అనేక రకమైన ఉచ్చ, నీచస్థితులుండే వీలుంది. పైస్థానంలో ఉన్న వ్యక్తి ముందుగా అర్థం చేసుకోవాల్సింది ఇదే.

తాను ఉన్నతస్థానంలో ఉన్నవాడు కాబట్టి తాను తన కిందివారి కన్నా 'ఉన్నతుడు' అన్న భావాన్ని వ్యక్తి వదిలేయాలి. ఎందుకంటే ప్రస్తుత ఉద్యోగ వ్యవస్థలో ఓ వ్యక్తి ఉన్నతస్థానం పొందటం అన్నది తెలివి మీద కన్నా 'అదృష్టం'పైన ఆధారపడి ఉంటుంది అధికంగా. అదృష్టం దైవికం. దైవం తనపైన కరుణ కురిపించిన ఫలితంగా తానీ ఉన్నతస్థానం పొందాడు. అన్నీ ఉన్నా దురదృష్టం వల్ల, పూర్వజన్మ కర్మఫలితంగా మిగతావారు తన కింది స్థాయిలో పని చేసేవారుగా మిగిలిపోయారు. అంతే తప్ప ఈ ఉన్నతస్థానం సాధించటంలో తన గొప్ప ఏమీలేదు అని తెలుసుకోవాలి. అప్పుడు పై స్థానంలో ఉన్నవాడి దృష్టిలో మార్పు వస్తుంది. తన కిందిస్థాయిలో ఉన్నవారు పనికిరానివారు, చేతకాని వారనికాక, తమలో ఉన్న శక్తిని గుర్తించలేనివారు, దురదృష్టవ శాత్తు పైకి ఎదగలేనివారని అర్థమవుతారు. తన కిందివారిని సానుభూతితో చూడగలుగు తాడు పై అధికారి.

అధికారులలో ఈ భావన కలిగించేందుకు భారతీయతాత్త్వికులు ఎంతో ప్రయత్నించారు. ఒక వ్యక్తి రాజు కావటం అతని పూర్వజన్మ సుకృతం అన్నారు. 'రాజు' దైవాంశసంభూతుడన్నారు. రాజు ప్రజల ఆస్తులను కాపాడి, ధర్మాన్ని సంరక్షించే కాపలాదారు, అంటే కేవలం 'కేర్‌టేకర్' వంటి వాడన్న మాట. అంతేకాదు, రాజు ప్రజల భాగ్యవిధాత. అంటే, రాజు ఏదైనా దోషం చేస్తే, దాని ఫలితం ప్రజలు

అనుభవిస్తారు. రాజు తప్పు వల్ల ప్రజలలో అకాలమరణాలు సంభవిస్తాయి. ప్రజలు పేదవారు అవుతారు. రాజ్యం అల్లకల్లోలమవుతుంది. అందుకే 'యథారాజా తథాప్రజా' అన్నారు పెద్దలు. అంటే రాజు దోషి అయితే ప్రజలు కూడా దోషాలతో అష్టకష్టాలు అనుభవిస్తారు. రాజు గుణవంతుడయితే, ప్రజలు భాగ్యవంతులై, అష్టయిశ్వర్యాలు అనుభవిస్తారు.

అందుకే దిలీపమహారాజును వర్ణిస్తూ కాళిదాసు, ముందు దిలీపుడి ధర్మప్రవర్తనను వివరిస్తాడు. ఆ తరువాత దిలీపుడు రాజుగా ఉండటంతో, ప్రజలు కూడా ధర్మప్రవర్తన కలవారై ఉన్నారని అంటాడు.

*రేఖామాత్రమపి క్షుణ్ణదా మనోర్వర్త్మనః పరమ్।*
*న వ్యతీయుః ప్రజాస్తస్య నియంతుర్నేమివృత్తయః!!*

దిలీపుడు తమను పాలిస్తుండగా, ఎలాగైతే రథచక్రం క్రమం తప్పకుండా తిరుగుతుందో, అలాగే ప్రజలు ధర్మమనే బాటను క్రమం తప్పకుండా, ఇసుమంతైనా తేడా లేకుండా అనుసరిస్తున్నారు.

దిలీపుడు రాజు. రాజు ప్రవర్తన ప్రజలను ప్రభావితం చేస్తుంది. రాజు స్థానంలో ఆఫీసర్‌ని ఉంచితే, ఓ ఆఫీస్ పరిస్థితి ఆఫీసర్ ప్రవర్తనను సూచిస్తుంది. దిలీపమహారాజు ప్రజలను పాలించిన విధానం, ఆధునికసమాజంలో ఆఫీసర్లు వ్యవహరించాల్సిన తీరును స్పష్టంగా సూచిస్తుంది.

*ప్రజానాం వినయాధానాద్ర క్షణాద్భరణాదపి!*
*సపితా పితరస్తాసాం కేవలం జన్మహేతవః!!*

తన ప్రజలను విజ్ఞానవంతులను చేస్తూ, వారికి రక్షణనిస్తూ, వారికి అండగా నిలుస్తూ, రాజు, వారిని తన సంతానంలా, తాను వారికి తండ్రిలా వ్యవహరిస్తున్నాడు. నిజం చెప్పాలంటే వారి తల్లిదండ్రులు కేవలం వారికి జన్మనిచ్చినవారు. మిగతా జీవితమంతా రాజు వారికి తండ్రిలా వ్యవహరిస్తున్నాడు.

వయసుతో నిమిత్తం లేకుండా ప్రతివ్యక్తిలో 'పిల్లవాడు' సజీవంగా ఉంటాడు. అందుకే ప్రతివ్యక్తి తనపైవాడు తన ప్రతిభను గుర్తించాలని, తనను అభినందించి, సత్కరించాలని ఆశపడుతూంటాడు. తాను చేసిన పనిని పైవాడు గుర్తించి అభినందిస్తే ఉప్పొంగిపోతాడు. మరింత చురుకుగా పని చేస్తాడు. అధికారి ఇది గుర్తించాలి.

తన కింద పనిచేసేవారంతా, వయసుతో నిమిత్తం లేకుండా తన సంతానంలా భావించాలంటే అధికారి అయిన వాడికి ఎంతో పరిపక్వత ఉండాలి. ఎంతో విజ్ఞానం ఉండాలి. ఎందుకంటే, అధికారి అన్నవాడి పట్ల అతని కింద పని చేసేవారిలో ఓరకమైన వ్యతిరేకత ఉంటుంది. ఆ వ్యతిరేకతలో వ్యక్తిగతమైనదేదీ ఉండదు. అధికారి ఇది అర్థం చేసుకోవాలి. ఎలాగైతే తండ్రి, ఎటువంటివాడైనా తన సంతానాన్ని ప్రేమిస్తూ, వారి అభివృద్ధికై పాటు పడతాడో, అలాగే అధికారి తన కింద పనిచేసేవారిని ఆనందంగా ఉంచేందుకు ఆలోచించాలి. వారిని విజ్ఞానవంతులను చేయాలి. వారిని రక్షించాలి. వారికి మద్దతునివ్వాలి. ప్రోత్సాహం ఇవ్వాలి. ఇక్కడే మేనేజ్‌మెంట్‌లో మొదటిసూత్రం అత్యంతప్రాధాన్యం వహిస్తుంది.

తన కింద పనిచేసేవారు జీతం ప్రకారం, ఉద్యోగనియమాల ప్రకారం ఒకే స్థాయివారైనా, వ్యక్తిగతంగా ఎవరికివారు భిన్నమైనవారని గ్రహించాలి. అందరినీ ఒకేలాగ చూడటం కుదరదనీ అర్థం చేసుకోవాలి. వారి ప్రవృత్తులు వేరని గ్రహించాలి. కష్టపడి పని చేసేవారు కొందరుంటారు. ఆడుతూ పాడుతూ పనిచేసేవారు కొందరుంటారు. పని చేయగలిగీ చేయనివారు కొందరుంటారు. పనిచేతకాక చేయనివారు కొందరుంటారు. ఆసక్తి లేని వారు కొందరుంటారు. అందరినీ ఒకే రకంగా చూడటం కుదరదు. కాబట్టి అధికారి, తనకింద పనిచేసేవారి లక్షణాలను, గుణగణాలను, ప్రవృత్తి, ఆసక్తులను అర్థం చేసుకోవాలి. పొగడ్తలతో పనిచేసేవారిని పొగడాలి. తనతో సమానుడుగా చూడటం వల్ల ఉత్సాహంతో పని చేసేవాడిని సమానంగా గౌరవిస్తూ పని తీసుకోవాలి. తాను అధికారినన్న దర్పం చూపకూడదు. కొందరిని స్వేచ్ఛగా వదిలేస్తే అద్భుతంగా పనిచేస్తారు. వారి స్వేచ్ఛకు ఏ మాత్రం భంగం కలిగినా, వారిపై అధికారం చలాయించినా ముడుచుకుపోతారు. అటువంటివారిని స్వేచ్ఛగా వదిలేయాలి. కానీ ఓ కన్నేసి ఉంచాలి. ఇంకొందరు మాటిమాటికీ వెంటపడుతూంటేనే పని చేస్తారు. ఇలాంటి వారి వెంట పడాలి. ఇంకొందరు మొండివాళ్ళుంటారు. వారి మొండితనాన్ని మన్నిస్తూనే, మంచి మాటలతో వారి నుండి పని తీసుకోవాలి. ఇదంతా చేయాలంటే ‘ఆఫీసర్’కి మానవ మనస్తత్వంతో పరిచయం ఉండాలి. ముఖ్యంగా, మనిషిపై గౌరవం ఉండాలి. ప్రతి మనిషిలో గొప్పతనం అంతర్గతంగా దాగి ఉందనీ, పరిస్థితుల ప్రభావంవల్ల వ్యక్తి తన ప్రతిభను ప్రదర్శించలేకపోతున్నాడనీ అర్థం చేసుకోవాలి. అతడి ప్రతిభను వెలికి తెచ్చే ప్రయత్నాలు చేయాలి. దీనికి ఆఫీసరు అన్నవాడికి తన కిందివారి పట్ల గౌరవం ఉండాలి. సానుభూతి ఉండాలి. విధి పట్ల, దైవం పట్ల నమ్మకం ఉండాలి.

*అమన్త్ర మక్షరం నాస్తి నాస్తి మూలమనౌషధమ్!*
*అయోగ్యః పురుషోనాస్తి యోజకస్తత్ర దుర్లభః!!*

మంత్రంగా ఉపయోగపడని అక్షరం లేదు. ఔషధంగా ఉపయోగపడని వేరు కాని, మొక్క కాని లేదు. దేనికో ఒక దానికి ఉపయోగపడని మనిషి ఉండడు. అయితే, వీటన్నిటినీ గుర్తించి, సమకూర్చేవాడు మాత్రం అరుదుగా ఉంటాడు. ఇలా అరుదుగా ఉండేవాడే మంచి ఆఫీసర్ అన్నమాట. అక్షరాల శక్తిని గుర్తిస్తే కాని మంత్రంగా వాడలేనట్టే, మనిషి విలువ తెలిస్తే కాని మనిషిని సరిగా ఉపయోగించుకునే వీలు లేదు. అతని ప్రతిభను వెలికితెచ్చి ప్రదర్శించటం కుదరదు.

## పనికి ప్రశంస

*అరై సంధ్యార్యతే నాభిర్నాభౌ చారాః ప్రతిష్ఠితాః ।*
*స్వామి సేవకయో రేవం వృత్తిచక్రం ప్రవర్తతే ॥*

చక్రం నడుమ కేంద్రాన్ని, పరిధిని కలుపుతూ ఉండే పొడవైన కర్రలను ఆకులు అంటారు. చక్రమధ్యంలో ఉన్న గుండ్రని కర్రను నాభి అంటారు. ఈ నాభి నుండి ఆకులు వెలువడతాయి. చక్రంలో ఉండే ఈ ఆకులు నాభిని నిలబెడతాయి. నాభి ఆకులను నిలుపుతుంది. ప్రభువుకూ, సేవకుడికీ ఉండే సంబంధం ఇలాంటిదే. ప్రభువుకు సేవకులు ఆధారం. సేవకులకు ప్రభువు ఆధారం. వాళ్ల జీవితచక్రం ఇలాగే తిరుగుతూంటుంది.

జీవితంలోని ప్రతి ఒక్క అంశాన్ని క్షుణ్ణంగా విశ్లేషించారు మన పూర్వికులు. ప్రభువు, సేవకుడి సంబంధం ఇందుకు భిన్నం కాదు. సామాజికజీవితం సవ్యంగా నడవాలంటే అధికార కేంద్రం ఆవశ్యకం. అలాగని ఆ అధికారి 'తానే సర్వం' అని విర్రవీగితే వ్యవస్థ అస్తవ్యస్తమవుతుంది. కాబట్టి తన స్థానం వల్ల అధికారికి అహం పెరగకూడదు. సేవకులైనందుకు వ్యక్తులలో న్యూనతాభావం కలగకూడదు. న్యూనతాభావం కలిగిన వ్యక్తి ఆత్మవిశ్వాసం కోల్పోతాడు. తన శక్తిని గుర్తించలేడు. తన నైపుణ్యాన్ని సరైన రీతిలో ప్రదర్శించలేడు. దాంతో అతడిలో కసి పెరుగుతుంది. ఇది అతడికే కాదు సమాజానికీ హానికరం. కాబట్టి ప్రభువు సేవకుల సంబంధం హెచ్చుతగ్గుల సంబంధం కాదు. ఇందులో ప్రభువు గొప్పకాదు, సేవకుడు తక్కువ కాదు. ఇద్దరూ ఒకరిపై ఒకరు ఆధారపడినవారు. కాబట్టి ప్రభువు అవటంవల్ల గర్వించాల్సిన పనిలేదు. పైగా అంత గురుతరబాధ్యత స్వీకరించి, జనుల బాగోగులు తనపై ఆధారపడి ఉన్నాయని గ్రహించి మరింత పరిణతితో

వ్యవహరించాలి. సేవకుడు సైతం తన పరిమితులను అర్థం చేసుకోవాలి. ప్రభువులు, సేవకులు ఒకరిపై ఒకరు ఆధారపడి ఉన్నారని అర్థంచేసుకోవాలి. సామాజిక జీవితంలో తమ కర్తవ్యాన్ని నిజాయితీతో నిర్వహించాలి. వ్యక్తిగతంగా వ్యక్తి ఎంత ప్రతిభావంతుడైనా సామాజికంగా తన నిర్దిష్టకర్తవ్యాన్ని గుర్తించి, దాన్ని నిర్వహించాల్సిందే. ఇదీ భారతీయజీవనవిధానంలోని గొప్పతనం. అంటే, సామాజికంగా వ్యక్తి ఎటువంటి పనిచేయాల్సి వచ్చినా, తాను తక్కువవాడన్న భావాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉండేదికాదు. ఎందుకంటే సామాజికచక్రంలో తన నిర్దిష్టబాధ్యత, దాని ప్రాముఖ్యం వ్యక్తికి తెలిసేవి. ఇలా ప్రతి ఒక్క వ్యక్తికి తన బాధ్యత, దాని విలువ తెలియటంతో తమ సామాజికస్థాయితో సంబంధం లేకుండా తామంతా ఒకరిపై ఒకరు ఆధారపడి జీవించేవారమని అర్థం చేసుకునేవారు. ఆత్మవిశ్వాసంతో, ఆత్మగౌరవంతో జీవించగలిగే వారు.

బ్రిటిష్‌వారు ఈ వ్యవస్థను భగ్నంచేశారు. ప్రభువు, సేవకుల నడుమ ఉండే సంబంధాన్ని విచ్ఛిన్నం చేశారు. తాము విజేతలు, ప్రజలు బానిసలు అన్న భావాన్ని పెంపొందించే వ్యవస్థను ప్రవేశపెట్టారు. అధికారులంతా తెల్లవారు. బానిసలు వారికి సలామ్ చేయాలి. వారి ముందుకు వెళ్ళాలంటేనే వణుకుతూ వెళ్ళాలి. వారి మాటకు ఎదురు చెప్పవద్దు. అధికారి చెప్పినట్టు వినాలి. సేవకుడికి ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం అన్నవి ఉండకూడదు. సేవకుడికి సొంత తెలివి ఉండకూడదు. ఆలోచనలు ఉండకూడదు. ఒకవేళ ఉన్నా తన ఉద్యోగనిర్వహణలో వాటిని ఉపయోగించకూడదు. అధికారి ఉన్నతుడు. అతడి నిర్ణయాన్ని ప్రశ్నించకూడదు. సేవకుడు తక్కువవాడు. అధికారితో వినయంగా బానిసలా మాట్లాడాలి. ఇదీ తమ అహంకారాన్ని సంతృప్తి పరచుకుని, భారతీయులలో బానిసభావాన్ని జీర్ణింపచేసేందుకు బ్రిటిష్‌వారు అమలుపరచిన ఉద్యోగవ్యవస్థ. ఇప్పటికీ మనం అదే వ్యవస్థను కొనసాగిస్తున్నాం. ది బాస్ ఈజ్ ఆల్వేస్ రైట్ అని స్మరించు కొంటున్నాం. వ్యక్తిత్వాన్ని హరించి, వ్యక్తులకు తాము బానిసలం అన్న భావాన్ని పెంచే ఈ ఉద్యోగవ్యవస్థనే ఇంకా పాటిస్తూన్నాం. అందుకే ఈ నాటి సమాజంలో భృత్యుడు, సేవకుడు అన్న పదాలు అవమానకరమైన అర్థాన్ని ఇస్తున్నాయి.

గమనిస్తే, ఇప్పటికీ మౌలికంగా అధికారులు సేవకులపై, సేవకులు అధికారులపై ఆధారపడి ఉన్నవారే. అంటే, ఇద్దరి సంబంధం భౌతికంగా మారలేదు. మానసికంగా సంపూర్ణంగా రూపాంతరం చెందింది. అధికారికి తాను గొప్ప అన్న భావం ప్రబలింది. సేవకుడికి తాను తక్కువవాడు అన్న ఆలోచన స్థిరపడింది. దాంతో వ్యక్తులలో అశాంతి,

అసంతృప్తి, న్యూనతాభావాలు పెరిగిపోయాయి. సమాజం అశాంతిమయమై అల్లకల్లోలమౌతోంది. అసంతృప్తితో నిరాశతో వ్యక్తులు స్వీయవ్యక్తిత్వాన్ని మరచి పోతున్నారు. అందని దానికి అర్రులు చాస్తూ మరింత అశాంతిని కొనితెచ్చుకుంటున్నారు. 'ఉద్యోగం'లో సంతృప్తిపడని తమ అహాన్ని ఇతర అంశాలలో సంతృప్తిపరచుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. మరింత అశాంతి పాలవుతున్నారు. వ్యక్తిత్వరహితులై తమ ఆత్మనే కోల్పోతున్నారు.

'అధికారి' అయినవాడు ఇది గ్రహించాలి. తనకన్నా తక్కువ స్థాయిలో ఉన్నంత మాత్రాన వ్యక్తి తక్కువవాడు కాదని అర్థంచేసుకోవాలి. తన కింద పనిచేసే వారందరినీ ప్రత్యేకమైన వ్యక్తిత్వం కల వ్యక్తుల్లా గుర్తించాలి. వారి వారి మనస్తత్వాలను అర్థం చేసుకోవాలి. కొందరు మొండివారు, కొందరు సోమరిపోతులు, కొందరు తెలివైనవారు, కొందరు ప్రతిభావంతులు, కొందరు ఆవేశపరులు, కొందరు హాస్యచతురులు, ఇంకొందరు కష్టపడి పనిచేసేవారు... ఇలా విభిన్నమనస్తత్వాలతో అలరారే అనేకులతో, వారి వారి ఆలోచనలు, జీవనదృక్పథాలను అనుసరిస్తూ, వారిని ప్రేరేపించి పనిచేయించుకోవాలని అధికారి అర్థం చేసుకోవాలి. ఎట్టి పరిస్థితులలో తన కింద పని చేసేవారి అహాన్ని దెబ్బతీయకూడదు. తన కన్నా తక్కువ స్థాయిలో పనిచేయటమంటేనే, తప్పనిసరి పరిస్థితులలో, అహాన్ని చంపుకోవటమేనని అర్థం చేసుకోవాలి.

ఈ సందర్భంలోనే ముందు చెప్పుకున్న శ్లోకాన్ని మరోసారి స్మరించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఇప్పుడు ఆ శ్లోకార్థం మరింత స్పష్టమౌతుంది.

*అసమైః సమీయమానః సమైశ్చ*
*పరిహీయమాన సత్కారః।*
*ధురి యో న యుజ్యమాన*
*స్త్రిభి రర్థపతిం త్యజతి భృత్యః ।*

ఒక భృత్యుడిని అతని కంటె తక్కువవాళ్ళతో సమంగా చూసినా, సమమైనవాళ్ళ కంటే తక్కువగా చూసినా, అతనికి తగిన పని అప్పగించకపోయినా, అతడు ప్రభువును విడిచి వెళ్ళిపోతాడు.

ప్రభువును విడిచివెళ్ళటం అంటే ఆధునిక పరిస్థితులలో రెండు అర్థాలు వస్తాయి. ఒకటి, ఉద్యోగం వదిలి వెళ్ళిపోతాడని, రెండవ అర్థం అప్పగించిన పని పాడు చేస్తాడు, పని పట్ల విముఖుడవుతాడని అర్థం.

మన ఉద్యోగవ్యవస్థ ఓ బిగుతైన చక్రంలో బిగుసుకుపోయింది. ప్రతిభకు స్థానం లేదు. గుర్రాన్నీ, గాడిదనూ ఒకే త్రాసుతో తూచే వ్యవస్థను మనం పాటిస్తున్నాం. ఈ వ్యవస్థను ఏర్పరచిన బ్రిటిష్‌వాడి దృష్టిలో ప్రజలంతా గాడిదలతో సమానులు. ఆలోచనలు, భావనలు లేక మీదవేసిన బరువును మౌనంగా మోయటం తప్ప మరేమీ చేతకానివారి కోసం ఏర్పరచారీ ఉద్యోగవ్యవస్థను. మనం దాన్నే కొనసాగిస్తున్నాం. 'అధికారి' ఈ విషయాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకోవాలి.

తన పరిమిత అధికారపరిధులలో, తన కింద పనిచేసేవారిలో గుర్రాన్ని, గాడిదను వేరుచేసి చూడాలి. తన కింద పనిచేసేవారి ఆసక్తినిబట్టి వారి ప్రతిభను బట్టి ఉన్న పనులలోనే వారికి తగ్గ పనులను అప్పగించాలి. తన కింది వారిని తక్కువగా చూడకుండా, వారూ తనతో సమానులు అన్నట్టు వ్యవహరిస్తూ, వారి అహాన్ని సంతృప్తిపరచాలి. అధికారి అన్నవాడు ముఖ్యంగా, తన కిందివారి భుజాన్ని తడుతూ ప్రోత్సహించటం నేర్చుకోవాలి. పొగడ్తలకు లొంగని మనిషి ఉండడు. ప్రతి వ్యక్తీ పొగడ్త కోసం ఎదురు చూస్తాడు. గుర్తింపు కోసం అర్రులు చాస్తాడు. తనపై వాడు పిలిచి భుజం తట్టి 'మంచి పనిచేశావు' అంటే రెట్టించిన ఉత్సాహంతో మరింత శ్రద్ధగా పనిచేస్తాడు. ఇందుకు భిన్నంగా, ఎంత పని చేసినా 'ఏం చేశావు? ఇదో పనేనా?' అంటే పనిచేసేవాడు కూడా చేయటం మానేస్తాడు. తాను పని మానటమే కాదు, పక్కవాడి పని కూడా పాడు చేస్తాడు. ఎంత పని చేసినా గుర్తింపు లభించదని అర్థం చేసుకున్న ఇతరులు కూడా పని మానేస్తారు.

నీరు పల్లమెరిగినట్టే, మనిషి సులభమైన మార్గం వైపు మొగ్గు చూపుతాడు. కాబట్టి 'అధికారి' తన కిందివారిలో 'నిరసన' కలగకుండా చూసుకోవాలి. వారి అవసరాలు గుర్తించి, వారి కోరికలు తీర్చాలి. కిందివారికి అవసరాలు సెలవులు, పర్మిషన్లను దాటవు. అవి అడిగినప్పుడు ఇవ్వటం ద్వారా, వారి నుంచి తనకు కావలసింది రాబట్టాలి. అంతే కాని సెలవు అడగగానే 'ఆ పని చేశావా?' 'ఇది పూర్తయితేనే సెలవు' 'రెండు రోజులెందుకు, ఒక రోజు సెలవు తీసుకో' వంటి మాటలనటం వల్ల అధికారి అహం సంతృప్తి చెందుతుంది కానీ వ్యక్తుల్లో నిరసన పెరుగుతుంది. సంస్థ దెబ్బ తింటుంది.

ప్రతి వ్యక్తిలో భగవదంశ ఉంటుందని మనం ఆధ్యాత్మికంగా అంగీకరించినట్టే, ఉద్యోగ జీవితంలో కూడా ప్రతి వ్యక్తికీ ప్రతిభ ఉంటుంది. అహం ఉంటుందని అధికారి అర్థం చేసుకోవాలి. అయితే ప్రస్తుతవ్యవస్థలో అధికారికి ఆత్మవిశ్వాసం కన్నా అహంకారం

అధికంగా ఉండే అవకాశం ఉంది. తన కిందివారితో బాగా మాట్లాడితే, వారి గొప్పతనాన్ని గుర్తిస్తే, ఇక తనను లెక్కపెట్టరనీ, తనకు గౌరవం ఇవ్వరన్న భయం ఉంటోంది. దీనికి తోడుగా, ప్రతిభ ఉన్నవాడికి అవకాశం ఇస్తే, వాడు ఎక్కడ తన పదవికే ఎసరు పెడతాడో, తనని మించిపోతాడేమోనన్న భయం కలగటం జరుగుతోంది. ప్రస్తుతసమాజాన్ని బలహీనం చేస్తున్న అంశం ఇది. ఇది కేవలం ఉద్యోగాల్లో అధికారికి మాత్రమే కాదు, నిత్యజీవితంలో ఏ రంగానికైనా వర్తిస్తుంది.

*క్షిప్రం విజానాతి చిరం శృణోతి*
*విజ్ఞాచార్థం భజతే న కామాత్ ।*
*నాసంపృష్టో వ్యుపయుక్తే పరార్థే,*
*తత్ప్రజ్ఞానం ప్రథమం పండితస్య ॥*

ఆత్మవిశ్వాసం లేని అధికారి బలం ద్వారా సేవకులను వశపరచుకోవాలని ప్రయత్నించినా, తనవారిని నియంత్రించలేక అణచివేయాలని ప్రయత్నించినా, అతడు పరాజయం పాలవుతాడు.

## అది వారిలో అణుకువ

*అవిద్వానపీ భూపాలో విద్యావృద్ధోపసేవయా ।*
*పరాం శ్రియ మవాప్నోతి జలాసన్నతరు ర్యథా ॥*

రాజు విద్వాంసుడు కాకపోయినా, విద్యావంతుల సహవాసం చేత నీటికి దగ్గరగా ఉన్న చెట్టులాగా గొప్ప ఖ్యాతి పొందుతాడు.

చాలా గొప్ప సూత్రం ఇది. ఒక వ్యక్తి వ్యక్తిత్వాన్ని, అతడి మిత్రులను చూసి చెప్పవచ్చంటారు. అలాంటిదే ఇది. ఒక ప్రభువు గొప్పతనం అతడు చేరదీసిన వారి వ్యక్తిత్వాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నాటికీ మనం భోజరాజుని 'కాళిదాసు' వల్ల స్మరిస్తూంటాం. కృష్ణదేవరాయలనగానే 'అష్టదిగ్గజాలు' గుర్తుకు వస్తారు. అక్బర్ ఖ్యాతి తాన్‌సేన్, బీర్‌బల్ వంటివారిపై ఆధారపడి ఉంది. అంటే, రాజుకు ఎంత అధికారం ఉన్నా, అతడు చేరదీసి, ప్రోత్సహించినవారిపై అతడి ఖ్యాతి ఆధారపడి ఉంటుందన్నమాట.

పై సూత్రానికి మరో రూపం 'రాజతరంగిణి'లో కల్హణుడు కిన్నరుడనే రాజు గురించి చెప్తూ రచించిన శ్లోకం. కిన్నరుడు పరభార్యను మోహిస్తాడు. అతడిని ఆశ్రయించినవారితో సహా నాశనమౌతాడు. ఆ సందర్భంలో కల్హణుడు 'దారం బావి గిలకను చేరి అధోగతిని

పొందుతుంది. అదే పుష్పాన్ని ఆశ్రయిస్తే దేవతల శిరస్సుపై నిలుస్తుంది. అలాగే మానవులు, తాము ఆశ్రయించిన వారి గుణదోషాలను అనుసరించి ఊర్ధ్వ, అధోగతులకు పోతారు' అని వ్యాఖ్యానిస్తాడు. అంటే ప్రభువు ఉత్తముడైతే, అతడిని ఆశ్రయించినవారు సజ్జనులవుతారు. సత్ఫలితాలు పొందుతారు. అలాగాక ప్రభువు దుష్టుడయితే అతడిని ఆశ్రయించిన వారు సజ్జనులైనా దుష్ఫలితాలు అనుభవిస్తారు. ఈ నిజాన్ని నిరూపిస్తూ పురాణాలలో కూడా అనేక కథలున్నాయి.

మహాభారతంలో కర్ణుడి పాత్ర అందరికీ తెలిసిందే. కర్ణుడు ఉత్తముడు. వీరుడు. కుంతీ పుత్రుడు. సూర్యాంశ కలవాడు. పాండవులకు ఏ విషయంలోనూ తీసిపోయేవాడు కాదు. శౌర్య ధైర్యప్రతాపాల్లోనే కాదు, వ్యక్తిత్వం విషయంలో కూడా అత్యుత్తముడు. ఇచ్చిన మాట తప్పడు. దానవిశారదుడు. ప్రభుభక్తి కలవాడు, కానీ అతడు ఆశ్రయించింది సుయోధనుడిని. దుష్టుడుగా పరిగణనకు వచ్చేవాడిని. దాంతో పంచపాండవులకు ప్రతిగా పోరాడాల్సి వచ్చింది. దుష్టుడి కొమ్ము కాయటంతో అతని వీరత్వం నిస్తేజమైంది. అతడి శక్తి బలహీనమైంది. అతడి మంచితనం పనికి రానిదైంది.

ఇందుకు భిన్నంగా రావణాసురుడి తమ్ముడై కూడా విభీషణుడు అతడి దుశ్చర్యలను ఖండించాడు. రావణాసురుడిని సన్మార్గం వైపు మళ్లించాలని ప్రయత్నించాడు. కానీ మృత్యుఛాయలో ఉన్న రావణాసురుడు, విభీషణుడి సలహాను పెడచెవిన పెట్టాడు. పరుషపదాలతో దూషించాడు. దాంతో విభీషణుడు, రావణాసురుడిని వదిలిపెట్టాడు. రాముడి శరణు వేడాడు. రాక్షసుడైనా, సమస్తజనావళి మన్ననలందుకుంటున్నాడు. ఎందుకంటే శ్రీరామచంద్రుడిని ఆశ్రయించాడు కాబట్టి.

దారం బావి గిలకను ఆశ్రయించి అధోగతి పొందినట్టు, కర్ణుడు, సుయోధనుడిని ఆశ్రయించి నశించాడు. చెడ్డవాడుగా గుర్తింపు పొందాడు. రావణాసురుడి సోదరుడై, రాక్షసుడుగా పరిగణనకు రావాల్సిన విభీషణుడు, రాముడిని ఆశ్రయించటం వల్ల ఉత్తముడుగా పరిగణనకు వచ్చాడు.

ఈ సందర్భంలోనే వాల్మీకి మహత్తరమైన నాయకత్వలక్షణాలను రామాయణంలో పొందుపరచాడు. ప్రస్తుతం అయిదు గుర్రాలు అయిదు వైపులా లాగుతూంటే, రథాన్ని నడిపించాల్సి వచ్చేటువంటి సంకీర్ణప్రభుత్వాల కాలంలో అందరి అభిప్రాయాలనూ మన్నిస్తూ, అందరినీ కూడదీసుకొని పని సాగించుకొనే నేర్పు నాయకుడికి ఉండాలని రాముడి ప్రవర్తన ద్వారా జగతికి ప్రదర్శించాడు వాల్మీకి.

విభీషణుడు రాముడిని శరణు వేడాడు. కానీ రాముడు వెంటనే అతడికి శరణమివ్వలేదు. నిజానికి రాముడు వెంటనే శరణమిచ్చినా ఎవ్వరూ పైకి ఏమీ అనేవారు కాదు. కానీ లోలోపల తమని రాముడు సంప్రదించలేదని చిన్నబుచ్చుకునేవారు. ఎందుకంటే రాముడికి సహాయంగా వానరులు వచ్చారు. కాబట్టి రాముడు ఎటువంటి నిర్ణయం తీసుకున్నా తనకు సహాయంగా వచ్చిన వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే, రేపు రాముడి తరఫున పోరాడాల్సింది వీరే. కాబట్టి వారి అహాన్ని దెబ్బ తీయటంవల్ల సాధించేది ఏమీ లేదు. అందుకే విభీషణుడిని నమ్మవద్దని సుగ్రీవుడు అనగానే రాముడు,

*యదుక్తం కపి రాజేన రావణానుజం ప్రతి ।*
*వాక్యం హేతుమదత్యర్థం భవద్విరపిచ శ్రుతం ।*
*సహ్యాదా మర్థకృచ్ఛేషు యుక్తం బుద్ధిమతా సదా ।*
*సమర్థేనోపసందేష్టుం శాశ్వతీం భూతిమిచ్ఛతా ॥*

సుగ్రీవుడి అభిప్రాయం హేతుబద్ధంగా ఉంది. అది మీరందరూ విన్నారు. కాబట్టి, 'కీలకమైన అంశాలలో, తెలివైనవారు, నిర్ణయాలను తీసుకునే విశ్లేషణాత్మకశక్తి కలవారు, తన సన్నిహితుల మంచి కోరేవారు నిర్మొహమాటంగా అభిప్రాయాలను తెలపటం వాంఛనీయం' అంటాడు. అందరి అభిప్రాయాలను వింటాడు. ఆపై విభీషణునికి ఆశ్రయం ఇవ్వటం తన నిర్ణయం అంటాడు. సుగ్రీవుడు రాముడి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తాడు. 'సొంత సోదరుడిని మోసం చేసినవాడు ఎవరినైనా మోసం చేయగల'డంటాడు.

సుగ్రీవుడి వ్యతిరేకతకు రాముడికి కోపం రాదు. 'అందరు సోదరులూ భరతుడిలా ఉండరు. కొడుకులంతా నాలా ఉండరు. మిత్రులంతా నీలా ఉండరు' అని పొగడుతూనే చురకలు పెడతాడు. అయినా విభీషణుడిని వ్యతిరేకిస్తాడు సుగ్రీవుడు.

అప్పుడు తన శక్తిని ప్రకటిస్తాడు రాముడు. విభీషణుడి వల్ల ఎటువంటి నష్టం కలగకుండా చూడటం తన బాధ్యత అంటాడు. శరణు కోరినవాడిని ఆదరించటం శాస్త్రసమ్మతం అని బోధిస్తాడు. చివరికి,

*'సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే ।*
*అభయంసర్వభూతేభ్యో దదామ్యేతద్ వ్రతం మమ ॥'*

అంటాడు. తనను శరణు వేడినవారిని రక్షించటం తన ధర్మం అంటాడు. దాంతో సుగ్రీవుడికి వెనక్కు తగ్గక తప్పలేదు. కానీ ఆ వెనక్కు తగ్గటం వల్ల సుగ్రీవుడిలో నిరసన

కలగలేదు. అంత శక్తిసంపన్నుడైన రాముడు, తన అభిప్రాయాన్ని మన్నించి, తనకు వివరించినందుకు అతడు కృతజ్ఞుడై ఉంటాడు.

సంకీర్ణప్రభుత్వాలు నడిపేవారు రాముడి నుంచి 'మేనేజ్‌మెంట్' సూత్రాలు నేర్చుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే సంకీర్ణప్రభుత్వాలంటే, అధికారం కోసం మద్దతునిచ్చిన వారిపై ఆధారపడి ఉంటుంది మనుగడ. కానీ రామచంద్రుడు ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడినవాడు కాదు. సర్వశక్తిసంపన్నుడు. అతడికి సహాయంగా వచ్చినవారికి కూడా రాముడి శక్తి తెలుసు. రాముడు తమని సహాయం అడగటమే గొప్పగా భావించేవారు. అయినాసరే వారి అహాన్ని సంతృప్తిపరిచాడు రాముడు. నిజానికి విభీషణుడు శరణు వేడగానే అతడికి అభయం ఇవ్వాలని నిశ్చయించుకున్నాడు. కానీ అందరి అభిప్రాయాలూ అడిగాడు. వారి అభిప్రాయాలను విన్నాడు. వారు నొచ్చుకోకుండా తన అభిప్రాయాన్ని వివరించాడు. వారిని ఒప్పించాడు. వారి మెప్పు పొందాడు. ఈ టెక్నిక్ తెలియని ఇప్పటి నేతలు, తాము అభాసుపాలవుతున్నారు. దేశానికి అవమానాలు, తలవంపులు తెస్తున్నారు. పరువు, ప్రతిష్ఠ కోల్పోతున్నారు.

తాను సర్వశక్తిమంతుడైనా, తన సహాయకులందరి అభిప్రాయాన్నీ విని గౌరవించాడన్నమాట రాముడు. ఇదే ప్రవర్తన ఆఫీసుల్లో తన సబార్డినేట్లతో సక్రమంగా పని తీసుకోవటంలో ఆఫీసర్లు వాడవచ్చు. తన కింద పనిచేసేవారే కాబట్టి, తన ప్రతి నిర్ణయాన్నీ వారు యంత్రాల్లా పాటించాలి, గొర్రెల్లా తలాడించి మన్నించాలి అనుకోవటం పొరపాటు. తన నిర్ణయం ఎవరిపై ప్రభావం చూపిస్తుందో, వారితో చర్చించి నిర్ణయాలు తీసుకోవటం వల్ల అధికారి గౌరవం ఇనుమడిస్తుందే తప్ప తరగదు. ఇందువల్ల కిందివారిలో నిజాయితీ పెరుగుతుంది. ఆఫీసర్ స్థాయి వాడు తనని సంప్రదించటంతో ఇంకా బాగా పని చేయాలన్న పట్టుదల పెరుగుతుంది. అదీ గాక నిర్ణయం తీసుకోవటంలో తానూ భాగస్వామి కాబట్టి, ఆ నిర్ణయాన్ని అమలు పరచటంలో తన బాధ్యత కూడా ఉంటుందన్న భావన ఉద్యోగిలో కలుగుతుంది.

ఇది గ్రహించకుండా అనేక అధికారులు 'ఎక్కడ ఉంచాల్సిన వారిని అక్కడే ఉంచా'లని భావిస్తూ, తమ సహోద్యోగులతో ఆలోచనలు, మెదళ్లు లేనివారితో ప్రవర్తించినట్టు ప్రవర్తిస్తుంటారు. తమ అధికారం నిలబడిందని అహంకరిస్తుంటారు. ఒదిగి ఉండటంలోని ఔన్నత్యం, అందరినీ గౌరవించటంలోని ఉత్తమత్వం, వారికి అర్థం కాదు. దాంతో వారి అహం నిలబడుతుంది. కానీ పని పాడవుతుందని గ్రహించరు.

రాజకీయనాయకులు నిర్ణయాలు తీసుకుని, ప్రకటించే ముందు ఆ నిర్ణయాలను అమలు పరచాల్సిన వారిని సంప్రదిస్తే, అధికారులు తమ కిందివారికి బాధ్యతలు అప్పగించే ముందు వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటే, తల్లిదండ్రులు తమ సంతానం విషయంలో తీసుకునే నిర్ణయాలను వారితో చర్చించి తీసుకుంటే, భార్యాభర్తలు ఒకరినొకరు గౌరవించుకుంటూ సమన్వయం సాధించి, నిర్ణయాలు తీసుకుంటే... 'రామరాజ్యం' అంటే, ఏమిటో మరో మాట చెప్పవలసిన అవసరం లేకుండా అందరి అనుభవంలోకీ వస్తుంది. అందుకే రాముడు ఈ నాటికీ ప్రతి విషయంలో మనకు ఉత్తమత్వానికి ప్రతీకగా నిలుస్తున్నాడు.

ఒక అధికారి ఉత్తముడుగా నిలవటంలో అతడి సలహాదారుల ప్రభావం కూడా అధికంగా ఉంటుంది. ఎందుకంటే గంధం చెట్టును సర్పాలు చుట్టుకుని ఉండేట్టు, అధికారి చుట్టూ అతడిని తప్పుదారి పట్టించేవారు అనేకులు చేరతారు. రకరకాల మాటలతో అతడిని తప్పు దారి పట్టిస్తారు. ఈ విషయాన్ని కూడా మన పూర్వికులు వదిలిపెట్టలేదు.

*అహో ఖల భుజఙ్గస్య విపరీతో వధక్రమః*
*కర్ణేలగతి చైకస్య ప్రాణైరన్యో నియుజ్యతే*

దుర్మార్గుడనే సర్పం చంపే పద్ధతి విచిత్రంగా ఉంటుంది. ఈ సర్పం ఒకరి చెవి కొరికితే మరొకడు మరణిస్తాడు.

## నైపుణ్యాన్ని గుర్తించాలి

*శాస్త్రోపస్కృత శబ్ద సున్దరగిరః శిష్య ప్రదేయాగమాః*
*విఖ్యాతాః కవయో వసన్తి విషయే యస్య ప్రభో ర్నిర్ధనాః !*
*తజ్జాడ్యం వసుధాధిపస్య సుధీయ స్త్వర్థం వినాపీశ్వరాః !*
*కుత్స్యాః స్యుః కుపరీక్షకై ర్న మణయో యైరర్ఘతః పాతితాః !!*

సుప్రసిద్ధపండితులు, ఏ ప్రభువు దగ్గరైనా ఏమీ పొందలేకపోతే అది వారి లోపం కాదు. అది ఆ ప్రభువు అజ్ఞానం. రత్నాలకు విలువ కట్టటం చేతగాని వర్తకుని దగ్గర అమూల్యమైన రత్నాలున్నా, వాటికి విలువ కట్టలేని లోపం వర్తకుడిదే అవుతుంది. రత్నాలది కాదు కదా!

'భర్తృహరి' ఈ శ్లోకంలో ప్రభువు బాధ్యతను స్పష్టంగా చెప్తున్నాడు. తన పాలితులలో వ్యక్తుల విలువను పెంచే బాధ్యత ప్రభువుదే. రత్నాలు మట్టిలో ఉంటాయి. తమపై వెలుగు పడ్డప్పుడు మెరుస్తాయి. అంతే తప్ప తమ విలువను ప్రకటించుకుంటూ ఊరూరూ అవి తిరగలేవు. వాటిని గుర్తించి, మెరుగు పెట్టి, వాటి వెలుగులను దశదిశల ప్రవర్తింప చేయటం నిర్ణయాత్మక స్థానాలలో ఉన్న వారి బాధ్యత అవుతుంది. ఈ సూత్రం ఆ కాలంలో కన్నా ఈ కాలంలో మరింతగా అవసరం.

కేవలం ఉద్యోగాల విషయంలోనే కాదు, నిత్యజీవితంలో అనేకరంగాలకు అన్వయించే సూత్రం ఇది. ఒక పండితుడు, కళాకారుడు, ఒక నిపుణుడైన పనివాడు... ఇలా ఎవరిలో దాగున్న ప్రతిభనైనా వెలికి తెచ్చే బాధ్యత పై అధికారిదే అవుతుంది. ఐతే, అనేకకారణాల వల్ల ప్రస్తుతసమాజంలో ఎదుటివాడి ప్రతిభను చూసి ఆనందించి, ప్రోత్సహించటం కన్నా భయపడి అణిచేయటమే జరుగుతోంది. అందుకే ప్రస్తుతం మన దేశంవాళ్ళు పరాయిదేశంలో తమ తెలివి ప్రదర్శించి ఆ దేశాభివృద్ధికి తోడ్పడటం చూస్తున్నాం. మన దేశంలో ఉంటున్న తెలివైన వాళ్ళు వ్యర్థంగా జీవించటం చూస్తున్నాం. సగటు మనుషులు, సృజనాత్మకత, స్వయంసృష్టి చేయలేని వారు నిర్ణయాత్మకస్థానాలలో చేరటం వల్ల ఇతరులను అనుకరించటం, ఆలోచనచౌర్యం, పరాయీకరణ, పాశ్చాత్య భావదాస్యం వంటివి 'ప్రామాణికా'లై, ఆమోదయోగ్యాలై ఆధునికం, అభ్యుదయంగా చలామణి అయ్యే దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాం.

*అపూజ్యా యత్ర పూజన్తే పూజ్యానాం తు విమాననా*
*త్రీణీ తత్ర ప్రవర్తన్తే దుర్భిక్షం మరణం భయమ్!*

ఏ దేశంలో అర్హత లేనివాళ్లను గౌరవిస్తారో, గౌరవించదగినవాళ్ళను అవమానిస్తారో, ఆ దేశంలో దుర్భిక్షం, అకాలమరణం, ఉపద్రవం తప్పకుండా వస్తాయి. అందుకే నిజమైన వ్యక్తిత్వవికాసం మన సమాజంలో అత్యంత ఆవశ్యకమైన అంశం అయింది. ఉత్తమాలోచనలతో, ఉన్నతప్రవర్తనతో ఉన్న వ్యక్తుల సమూహం సమాజాన్ని ఉన్నతస్థాయిలో నిలుపుతుంది. అటువంటి సమాజం దేశాభివృద్ధిలో తోడ్పడుతుంది. ప్రపంచానికి మార్గదర్శకమవుతోంది. కానీ, మంచి ఉద్యోగం సంపాదించటం, నాలుగు డబ్బులు సంపాదించటమే 'వ్యక్తిత్వవికాసం'గా భావించే సమాజం మరింత దిగజారుతుంది. ఎందుకంటే వ్యక్తుల సమూహమే సమాజవ్యక్తిత్వం అవుతుంది. సమాజ వ్యక్తిత్వం దేశభవితవ్యాన్ని నిర్దేశిస్తుంది. అందుకే అధికారంలో ఉన్న వ్యక్తి ఏ రంగంలోని

వాడైనా ఉత్తమవ్యక్తిత్వాన్ని ప్రదర్శించాలి. తనలోని సంకుచితత్వాన్ని విడిచిపెట్టాలి. కులం, మతం, ప్రాంతం, భాష, రంగు వంటి సంకుచితత్వాలను దాటి ఎదగాలి. కిందిస్థాయిలో ఉన్నా నిర్ణయాత్మకమైన స్థాయికి ఎదిగినా తన సంకుచితత్వాలను దాటి ఎదగాలి. హృదయ పరిధిని విస్తృతం చేసుకోవాలి. తన వీలైనంతలో 'నైపుణ్యానికే' ప్రాధాన్యం ఇవ్వాలి. నైపుణ్యం కొలబద్దగా తన కిందివారిని ప్రోత్సహించాలి. ప్రస్తుతసమాజంలో, ఇందుకు భిన్నంగా, అన్ని రంగాలలో కులం, మతం, ప్రాంతం, ఐడియాలజీ, భాష, రంగు వంటి వాటికే ప్రాధాన్యం ఇవ్వటం మనం చూస్తున్నాం. తద్వారా సమాజంలో ద్వేషాలు పెరుగుతున్నాయి. ఆత్రాలు హద్దులు మీరుతున్నాయి. ఆరాటాలు పోరాటాలవుతున్నాయి. నిరాశానిస్పృహలు వ్యక్తులను దిగజార్చి, మనుషులను పశువులను చేస్తున్నాయి. సమాజాన్ని అసంతృప్త అగ్నిజ్వాలగా మారుస్తున్నాయి. బద్దలయ్యేందుకు సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతం స్థాయికి చేరుస్తున్నాయి.

ఇటువంటి ఉపద్రవాలను ఊహించే మన పూర్వికులు ప్రతివ్యక్తి ఉత్తమవ్యక్తిత్వంతో ఉన్నతంగా వ్యవహరించాలని ఆశించారు. అందుకు మార్గాలు సూచించారు. సమాజంలో వ్యక్తి తన స్థాయితో సంబంధం లేకుండా హృదయాన్ని విశాలం చేసుకోవాలని ఆదేశించారు.

*అయం నిజః పరోవేతి గణానా లఘుచేతసామ్*
*ఉదార చరితానం తు వసుధైవ కుటుంబకమ్*

వీడు నా వాడు, వాడు పరాయివాడు అనే ఆలోచన చిన్నబుద్ధిని సూచిస్తుంది. విశాల హృదయం కలవారికి ఈ భూమి అంతా ఒకే కుటుంబం వంటిది. అంటే ఎటువంటి ఉచ్చనీచ భేదాలు, అగ్ర – అల్పభావనలు లేకుండా అందరినీ తన వారిలానే చూడగలుగుతాడన్నమాట. 'ఈశావాస్య మిదం సర్వం' అన్న సత్యానికి ఇది అన్వయం మాత్రమే! అంటే, ఆరంభం నుండీ అందరిలోనూ, అన్నింటా దేవుడిని చూడమని, దేవుడిని తనలోనూ చూసుకోమని, అంటే విశ్వమంతా విభుడేనని, చెప్తూ అయినా భేదభావాలు ఎవరైనా భావిస్తే అది వాడి 'అల్పబుద్ధి', వ్యక్తిత్వవికాసరాహిత్యమేనని భారతీయధర్మం స్పష్టం చేస్తోందన్నమాట.

ఈ సందర్భంలో భర్తృహరి శ్లోకం స్పష్టం చేసే మరో అంశాన్ని మనం స్మరించుకోవాల్సి ఉంటుంది. రత్నం అది ఉన్న చోటే ఉంటుంది. ప్రపంచం దాని

వద్దకు వెళ్ళి దాన్ని గుర్తిస్తుంది. 'పరమహంస లక్షణం కూడా ఇదే. ఇప్పుడు మన సమాజంలో అనేక అవధూతలు, ప్రవక్తలు, దైవావతారాలు, పరమహంసలు ప్రజలలో రకరకాలు ప్రచారాలు చేస్తున్నారు. ప్రజల నుండి ధనం వసూలు చేస్తూ ఆశ్రమాలు కట్టుకొంటున్నారు. పుట్టినరోజు పండుగలు చేసుకుంటున్నారు. కానీ భారతీయధర్మంలోని 'పరమహంసోపనిషత్తు' ప్రకారం, నిజమైన పరమహంస రత్నంలాంటి వాడు. ఆయన ఎటూ వెళ్లడు. ఎవరినీ ఏదీ యాచించడు. ప్రజలే ఆయన దగ్గరకు వెళ్తారు. ప్రజలే ఆయన ఖ్యాతిని దశదిశల వ్యాపింపచేస్తారు. ఆయన మహత్తర ఆధ్యాత్మికదీప్తులతో పునీతులవుతారు. ఆయన ఎవరి దగ్గర నుంచీ ఏదీ స్వీకరించడు. ముఖ్యంగా ధనం!

*తస్మాత్ భిక్షుర్హిరణ్యం రసేన న దృష్టం చ న స్పృష్టం చ న గ్రాహ్యం చ!*

సన్న్యాసికి ఇల్లు లేదు. మఠం లేదు. ఎవరి దగ్గర నుంచీ ఏదీ యాచించకూడదు. అతడికి శిష్యులు ఉండకూడదు. ధనం ఉండకూడదు. సన్న్యాసి ధనం వైపు ఆశతో చూస్తే బ్రహ్మహత్యా పాతకం చుట్టుకుంటుంది. ధనం తాకితే చండాలుడవుతాడు. ధనం గ్రహిస్తే ఆత్మహంతకుడవుతాడు. కాబట్టి సన్న్యాసి అయినవాడు ధనం వైపు చూడకూడదు. ధనం తాకకూడదు. ధనం గ్రహించకూడదు అంటుంది పరమహంసోపనిషత్తు.

పరమహంసోపనిషత్తును ప్రామాణికంగా అనుకుంటే, ఇప్పటివారిలో ఎందరు నిజమైన పరమహంసలో నిగ్గుతేలుతుంది. అందుకే ఇటువంటి వారు తామరతంపరగా వెలిగి, వారి శిష్యపరమాణువులు తామరతంపరంగా పెరుగుతున్నా, భక్తి మురుక్కాలువల్లో, డ్రైనేజీలా పొంగిపొర్లుతోంది తప్ప ఆధ్యాత్మికాలోచనల అభివృద్ధి, వ్యక్తిత్వవికాసప్రభావాలు సమాజంలో కనిపించడం లేదు.

రమణమహర్షి ఏ నాడూ ఎవరినీ ఏదీ యాచించలేదు. ఆయన గుహలో ఓ మూల తపస్సు చేసుకుంటుంటే, ప్రజలు ఆయన చుట్టూ చేరారు. ఆశ్రమం కట్టారు. ఆదరించారు. కానీ ఆయన గుహలో ఎలా ఉన్నాడో, అంతమంది నడుమ ఆశ్రమంలోనూ అలానే ఉన్నాడు.

అరబిందో కూడా అంతే. ఒక్కసారి 'పాండిచ్చేరి' చేరిన తరువాత ఆయన సంవత్సరానికి ఒక రెండుసార్లు అతి అయిష్టంగా దర్శనం ఇచ్చేవాడు. మళ్ళీ తన ధ్యానలోకంలోకి వెళ్ళిపోయేవాడు. ప్రజలు ఆయన చుట్టూ చేరారు. ఆయన ఎవరినీ ఏమీ యాచించలేదు. కానీ ప్రపంచంపై ఆధ్యాత్మికభావనల జల్లులు కురిపించాడు.

రామకృష్ణ పరమహంస దక్షిణేశ్వర్ కాళికాలయానికే అంకితం. ఆయన దగ్గరకు ప్రపంచం వెళ్ళింది తప్ప ఆయన ఎవరి దగ్గరకూ వెళ్ళలేదు. తాను ప్రపంచం దగ్గరకు వెళ్ళకూడదు కాబట్టి తన ప్రతినిధిగా వివేకానందను ప్రపంచపర్యటనకు ప్రోత్సహించాడు.

వివేకానంద సైతం అనుక్షణం అన్నింటినీ త్యజించాలన్న సన్యాసభావనకూ, గురువాజ్ఞ పాటించక తప్పదన్న భావనకూ నడుమ సంఘర్షణతో తన లక్ష్యాన్ని చిత్తశుద్ధితో సాధించాడు. ధనాన్ని 'అంటరాని వస్తువు'లాగే చూశాడు. గురూజీ గోళ్వల్కర్ సైతం తనలోని ఆధ్యాత్మికభావాలను అణచి సామాజికనిర్మాణాన్ని దైవకార్యంలా భావించి కర్తవ్యనిర్వహణ చేశారు.

ఇలా నిజమైన గురువులను నిగ్గు తేల్చుకుని గుర్తించటం వ్యక్తిత్వవికాసంలో అత్యంత ప్రధానపాత్ర వహిస్తుంది. అందుకే 'గురుర్బ్రహ్మ, గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః, గురుస్సాక్షాత్ పరబ్రహ్మ, తస్మై శ్రీగురవే నమః' అంటూ 'గురువు'ను ఉన్నతస్థానంలో ఉంచింది భారతీయ ధర్మం. నిజమైన గురువు వ్యక్తిత్వవికాసమార్గం చూపుతాడు. ఇతరులు తమ మీద ఆధారపడే బలహీనులుగా మనుషులను మలుస్తారు. ప్రతి వ్యక్తి గమనించవలసి అంశం ఇది. ఎప్పుడైతే తాను స్వశక్తి మీద కాక ఇతరులపై ఆధారపడుతున్నాడని గ్రహించాడో, వెంటనే ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన అవసరం ఉందని అర్థం చేసుకోవాలి.

*దుర్వృత్తో వా సువృత్తో వా*
*మూర్ఖః పండిత ఏవవా,*
*కాషాయ దండ మాత్రేణ*
*యతిః పూజ్యో న సంశయః*

ఆచారశూన్యుడైనా, సదాచారం కలవాడైనా, పండితుడైనా, పామరుడైనా, కాషాయ వస్త్ర దండకమండలాలు ధరిస్తే సన్యాసి అయి పూజలందుకొంటాడు. కానీ భాష, వేషం వల్ల ప్రతివాడూ సన్యాసి అయిపోడు. అంతరంగంలో శుచి, నిజాయితీ ఉన్నవాడే నిజమైన సన్యాసి. ఇక్కడ 'అర్హత' అధికారులకే కాదు, గురువులకు, అవధూతలకు, అవతారాలకు కూడా వర్తిస్తుంది. కాబట్టి అవసరమైనవాడిని ఆదర్శంగా తీసుకున్నా, అనర్హమైన ఆలోచనలను ఆదరించినా వ్యక్తికే కాదు, సమాజానికీ నష్టం వాటిల్లుతుందన్న మాట!

శాశ్వతమైన ఉన్నతాదర్శాలను వదిలి మన సమాజం సినిమాలను, ఆటగాళ్లను, సినీనటులను, రాజకీయనాయకులను ఉన్నతస్థానంలో నిలపటం వల్ల కలుగుతున్న దుష్పరిణామాలు మనమందరమూ అనుభవిస్తున్నాం.

'ప్రేమ' అంటూ వెర్రితలలు వేస్తున్న యువతను చూస్తున్నాం. ట్యాంకులెక్కి బెదిరించటాలు, వెంటబడి కత్తితో పొడవటాలు, ఆసిడ్లు పోయటాలు, ప్రేమించమని వేధించటాలు, ఇల్లొదిలి పారిపోయి పెళ్లి చేసుకుని ఏదో గొప్ప పని చేసినట్టు పోజులు పెట్టడం వంటివన్నీ అనుచితమైన ఆదర్శాలను ఎంచుకోవటంవల్ల కలుగుతున్న వికృతపరిణామాలే.

'అధికారి' అయినవాడు ఈ విషయాలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. రత్నాన్ని గుర్తించటమే కాదు, రాతిని రత్నంలా మలచటం కూడా తన బాధ్యతేనని అర్థం చేసుకోవాలి. లేకపోతే రాయి ఎలాగూ రాయిలానే ఉంటుంది. రత్నం కూడా రాయిలా మారే అవకాశం ఉంది.

*అశ్వః శాస్త్రం శస్త్రం వీణా వాణీ నరశ్చ నారీ చ*
*పురుష విశేషం ప్రాప్తా భవన్త్య యోగ్యాశ్చ యోగ్యాశ్చ*

గుఱ్ఱం, ఆయుధం, శాస్త్రం, వీణ, వాక్కు, నరుడు, స్త్రీ – ఇవన్నీ చేరిన పురుషుడిని బట్టి యోగ్యాలు, అయోగ్యాలు అవుతాయి. ఇక్కడ గుఱ్ఱం, ఆయుధం, శాస్త్రం వంటివన్నీ విభిన్నమనస్తత్త్వాలను సూచించే వారికి ప్రతీకలు. వారిని ఎలా వాడుకోవటమో అధికారి నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. అందుకే సరైన సలహాదారులను ఎన్నుకొనటం అత్యంత ఆవశ్యకమైన అంశం.

తన కింద పనిచేసేవారి మనస్తత్త్వం గ్రహించటం, వారి నైపుణ్యాలను గుర్తించటం, వారికి తగ్గ పనులను అప్పజెప్పటం వంటి నిర్ణయాలు తీసుకోవటంలో అధికారి తాను నమ్మిన వారి సలహాల ప్రకారం వ్యవహరిస్తాడు. ఇటువంటి సలహాదారులు 'చెవి కొరికి చంపే' పాములైతే పరిస్థితి చెప్ప నవసరం లేదు. ఇది మన అందరం అనుభవిస్తూనే ఉన్నాం.

## చెవి కొరికే పాములు

*అన్తః సారై రకుటిలై రచ్ఛిద్రైః సుపరీక్షితైః*
*మన్త్రిభిర్ధార్యతే రాజ్యం సుస్తంభైరివ మన్దిరమ్ ॥*

ఒక ఇల్లు నిలబడాలంటే దాని స్తంభాలు సారం (చేవ) కలవై ఉండాలి. కన్నాలు లేకుండా, వంకర లేకుండా ఉండాలి. వాటిని బాగా పరీక్షించిన తరువాతే స్తంభాలుగా ఎన్నుకోవాలి. అలాగే రాజ్యం నిలబడాలంటే మంత్రులను బాగా పరీక్షించి ఎన్నుకోవాలి. వాళ్లకు వక్రబుద్ధి ఉండకూడదు. పూర్వకాలంలో రాజులుండేవారు. రాజులకు సలహాదార్లుగా మంత్రులు అవసరమయ్యేవారు. ఆ కాలం గతించింది. ఇప్పుడు ప్రజాస్వామ్యం వచ్చింది. ప్రజాస్వామ్యంలో అధికారం సాధించేందుకు అర్హత కేవలం జనాన్ని అధికసంఖ్యలో ఆకర్షించగలగటమే. వ్యక్తి గుణాలతో, నైపుణ్యాలతో సంబంధంలేని వ్యవస్థ ఇది. దాంతో అధికారంలో ఉన్న వ్యక్తికి సలహాలిచ్చే వారి ప్రాధాన్యం గతంలో కన్నా మరింత పెరిగింది. ఈ సందర్భంలో మనం గతంలో ప్రస్తావించుకున్న శ్లోకార్థాన్ని మరోసారి గుర్తు తెచ్చుకోవాల్సి ఉంటుంది. రాజు తన చుట్టు చేరినవాళ్ళ వల్ల ఖ్యాతి పొందుతాడన్నది ఆ శ్లోకం.

*గుణా గుణజ్ఞేషు గుణాభవన్తి*
*తే నిర్గుణం ప్రాప్య భవన్తి దోషాః*
*సుస్వాదు తోయ ప్రభావాహి నద్యః*
*సముద్ర మాసాద్య భవన్త్యపేయాః*

మంచివారితో స్నేహం చేయటం వల్ల గుణవంతుల గుణాలు ఇనుమడిస్తాయి. అదే గుణహీనులతో చెలిమి వల్ల తామూ దుర్జనులవుతారు. మంచి నీరు సముద్రంతో కలిసి ఉప్పు నీరు అవుతున్నట్టే చెడ్డవారితో చెలిమి, మంచివాడిని చెడ్డవాడిని చేస్తుందన్నమాట.

అధికారంలో ఉన్నవారు ఇది గుర్తించాలి. ఎందుకంటే 'తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరి'నట్టే, ఒక వ్యక్తి అధికారంలోకి రాగానే, అతడి ప్రాపు సంపాదించాలని బోలెడంత మంది ప్రయత్నిస్తారు. అతడి చుట్టూ చేరి, అతడి దృష్టిలో పడటం వల్ల తమ గుర్తింపు పెంచుకోవాలని ప్రయత్నించేవారుంటారు. అధికారి అయినవాడి దగ్గర వినయం ప్రదర్శించి, విశ్వాసం చూపించి, వాడి నమ్మకం కొట్టేస్తారు. ఎందుకంటే 'అప్రధానః ప్రధానః స్యాత్సేవతే యది పార్థివమ్'. రాజును సేవించే సామాన్యవ్యక్తి కూడా గొప్పవాడు అయిపోతాడు. అలాగే అధికారి చుట్టూ చేరటం వల్ల, ఏదో ఓ సమయంలో, అతడిపై తన మాటలు ప్రభావం చూపించేటట్టు చేయవచ్చు. ఒక్కసారి అధికారి తమ మాటలు వినటం మొదలుపెట్టాడా, ఇక అప్రధానుడైనవాడు అధికారి కన్నా మిన్న అయిపోతాడు.

అధికారితో పని ఉన్నవారంతా ఇతడి చుట్టూ తిరుగుతారు. అధికారి కన్నా ముందు ఇతడిని దర్శించుకుంటారు. ఇందుకోసమని, తమకు అంత పెద్ద అధికారి తెలుసునని చెప్పుకునేందుకు చాలామంది అధికారుల ప్రాపు సంపాదించుకుంటారు. ఇటువంటి వారిలో అనేకులు చెవులు కొరికి చంపే పాము ల్లాంటివారై ఉంటారు. అంటే అధికారికి ఇతరుల మీద కొండేలు చెప్పటం వల్ల వీరు లేని ప్రాధాన్యాన్ని సంతరించుకుంటారు. ఇతరులకు అపకారం చేయటం వల్ల తమ అహాన్ని సంతృప్తి పరచుకుంటారు. ఇలా ఎదుటివారిపై చాడీలు చెప్పి, వారిని బాధలపాలు చేయటంలో ఇటువంటి వారికి వ్యక్తిగతంగా ఎటువంటి ఆనందం లభించదు. ఎటువంటి లాభం ఉండదు. కానీ, అది వారి స్వభావం. అందుకే ఎవరి గురించో చెప్తాడు. దాన్ని మనసులో పెట్టుకున్న అధికారి, అనవసరంగా, అమాయకుడిని ఇక్కట్లపాలు చేస్తాడు. పాపం మూట కట్టుకుంటాడు. చెడ్డ పేరు సంపాదిస్తాడు. అందుకే, మంచి నీరు ఉప్పు నీటితో కలిసి 'మంచి' లక్షణం కోల్పోయినట్టు, మంచివారైన వారు కూడా, అధికారి కాగానే చుట్టూ చేరి చెవి కొరికే పాముల చెవుల కొరుకుడు వల్ల మంచితనం కోల్పోయి చెడ్డవారైపోతారు.

*మార్జాలో లభతే న మంజుల శుకాలాపేన కౌతూహలం*
*కస్తూరీ హరిణస్య సౌరభభరై స్సింహో న సంతుష్యతి*
*ప్రీతిర్నాస్తి మయూర తాండవశతై ర్వ్యాధస్య దుష్టైస్సదా*
*వ్యాప్తాయాం భువిః సన్తి కేపి విరళాస్సన్తో గుణ గ్రాహిణః*

'చెవులు కొరికి చంపే పాము'ల లక్షణం ఇది. చిలక పలుకులు వింటూ పిల్లి ఆనందించదు, అది ఎన్ని పలుకులు పలికినా చంపి తినేందుకే ఉత్సాహం చూపుతుంది. కస్తూరి సువాసన ఆఘ్రాణిస్తూ సింహం ఆనందించదు, మృగాన్ని చంపి తింటేనే దానికి సంతృప్తి. పురి విప్పి ఆడే నెమళ్ల నృత్యం మీద కన్నా బోయవాడి దృష్టి దాన్ని చంపి తినటం పైనే ఉంటుంది. దుష్టుల ప్రవర్తన కూడా ఇంతే. ఎదుటివాడి గుణగణాలతో వాడికి సంబంధం లేదు. ఎదుటివాడిని ఎలా బాధపెట్టగలనన్నదే వాడి లక్ష్యం.

కానీ అధికారంలో ఉన్నవాడికి తన గురించి ఎవరేమంటున్నారో తెలుసుకోవాలన్న ఉత్సాహం ఉంటుంది. తన కిందివారి అభిప్రాయాలు తెలుసుకోవాలన్న కుతూహలం ఉంటుంది. తనని అందరూ పొగడాలని ఉంటుంది. తనను విమర్శించేవారిపై తన అధికారబలం ప్రదర్శించి, వారిని దారికి తేవాలని ఉంటుంది. అధికారి చుట్టూ చేరి, మంచి మాటలు మాట్లాడుతూ, అప్పుడప్పుడు 'వాడిలా అన్నాడు', 'వీడిలా అన్నాడు'

అని అమాయకంగా మాటలు వదిలేస్తుంటారు 'చెవులు కొరికే పాములు' తరువాత ఏమీ తెలియనట్టు మాట దాటేస్తారు. కానీ అధికారికి అందవలసిన సందేశం అందుతుంది. ఒకరి చెవి కొరికి ఇంకొకరిని చంపటం అంటే ఇదే. వీరి గురించి 'భర్తృహరి' చక్కగా చెప్పాడు.

*మృగమీన సజ్జనానాం తృణ ।*
*జలసన్తోష విహిత వృత్తీనామ్,*
*లుబ్ధకధీవరపిశునా నిష్కా*
*రణమేవ వైరిణో జగతి ।*

ఎవ్వరికీ హాని తలపెట్టక గడ్డి తినే జింకకు బోయవాళ్ళు విరోధులు. నీటిలో ఉండే చేపలను వలవేసి పట్టేవారు జాలరులు. అలాగే ఎవరి జోలికి రాక తమ పనిలో తాముండే సజ్జనులను నిష్కారణంగా పీడించేవాళ్ళు కొండెగాళ్ళు! ఇదే లోకరీతి!

*అపరాధో న మేస్తీతి నైతద్విశ్వాసకారణమ్*
*విద్యతే హి నృశంసేభ్యో భయం గుణవతామపి*

నేనేమీ తప్పు చేయలేదు, ఇతడు నాకు అపకారం చేయడు అని దుష్టుడి విషయంలో అనుకోకూడదు. ఎంతటి మంచివాళ్లకైనా దుర్మార్గుల నుంచి అపకారం జరిగే భయం ఉంటుంది.

అధికారులే కాదు, మామూలువారు కూడా ఇటువంటి 'చెవి కొరికే పాము'లను గుర్తించి జాగ్రత్తపడవలసిన అవసరం ఉంటుంది. కానీ ఇటువంటివారిని గుర్తించటం కష్టం. వీరు చాలా తియ్యగా మాట్లాడతారు. తెలివిగా ఉంటారు. మన దగ్గర బోలెడన్ని మాటలు మాట్లాడతారు. వాళ్లు మాట్లాడటంతో మనకు ఉత్సాహం పెరుగుతుంది. ఇన్నాళ్లకు మనం మనసు విప్పి మాట్లాడేందుకు ఒకడు దొరికాడని సంతోషిస్తాం. మనం మన అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరుస్తాం. వాళ్లు మాట్లాడినవి మనం మరచిపోతాం. కానీ మనం మాట్లాడిన ప్రతి మాటా, పూసగుచ్చినట్టు, ఎవరికి చేరకూడదో వారికి చేరిపోతుంది. ఆ కారణంగా, మనకు హాని కలుగుతుంది. కానీ విషయం అర్థమయ్యేసరికి ఆలస్యమైపోతుంది. చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకుని లాభం లేదని అనుభవం నేర్పుతుంది. బహుశా ఈ అనుభవమే సుమతీశతకకారుడికి కలిగి ఉంటుంది. ఆ అనుభవం ఈ పద్యానికి ప్రేరణ అయి ఉంటుంది.

*ఎప్పటి కెయ్యది ప్రస్తుత*
*మప్పటి కా మాటలాడి యన్యుల మనముల్*
*నొప్పింపక తానొవ్వక*
*తప్పించుక తిరుగువాడు ధన్యుడు సుమతీ.*

సమయానికి తగిన మాటలు మాట్లాడాలి. ఒకరి గురించి అనవసరంగా వ్యాఖ్యానించకూడదు. అలా ఒకరిని నొప్పించక, తానూ నొప్పికి గురికాక తప్పించుకు తిరగాలి అంటున్నాడు సుమతీ శతకకారుడు. ఉద్యోగాలలో ఉండేవారికి ఇటువంటి అనుభవాలు కోకొల్లలు. ఇద్దరూ కలిసి ఉంటారు. నవ్వుకుంటూ మాట్లాడుకుంటారు. బాస్ గురించి ఏదో జోకు వేయగానే తెల్లారేసరికి దానికి ఫలితం కనిపిస్తుంది. ఏదో బలహీనక్షణంలో ఏదో వ్యాఖ్య చేయగానే, దానికి ప్రతిధ్వని బాస్ గదిలోంచి వినిపిస్తుంది. ఒకోసారి ఈ 'చెవులు కొరకటం' ఎలా జరుగుతుందంటే, మనం మన సన్నిహితులతో ఏదో అంటాం. వాళ్లు తమ సన్నిహితులతో మనం అన్న మాటలు చెప్తారు. ఆ చెప్పటంలో మనం అన్న సందర్భం చెప్పరు. అన్న మాటలు అన్నట్టు చెప్పరు. వారికి గుర్తున్నది కొంత, దానికి కొంత స్వపైత్యం జోడించి చెప్తారు. ఆ విన్నవాడు, ఆ మాటలకు కాళ్లు, చేతులు కూర్చి ఇంకోడి దగ్గరకు చేరుస్తారు. వాళ్లు దానికి తల, మొండెం అతికించి మరొకరి దగ్గరకు చేరుస్తారు. ఇలా రకరకాల మార్పులు చెందిన ఆ మాట ఎవరికి చేరకూడదో వారికి చేరేసరికి వికృతాకారం పొంది రాక్షసుడిలా మారుతుంది. ఏమన్నామో కూడా గుర్తు లేని మనపై విరుచుకుపడుతుంది. అల్లకల్లోలం సృష్టిస్తుంది. అందుకే,

*కొంచెపు నరు సంగతిచే*
*నంచితముగ గీడు వచ్చు నది యెట్లన్నన్*
*గించిత్తు నల్లి కరచిన*
*మంచమునకు బెట్లు వచ్చు మహిలో సుమతీ!*

చిన్న నల్లి కరిస్తే మంచానికి దెబ్బలు తగిలేట్టు, చెడ్డవారితో స్నేహం చెడుపు చేస్తుంది. ఈ చెడుపు స్నేహం చేసినవారికే కాదు, చెడ్డవారి మాటలు వినే అధికారికి కూడా కలుగుతుంది. ఎందుకంటే ఈ అధికారి చెప్పుడు మాటలు వినేవాడుగా అందరిదృష్టిలో పడతాడు. సొంత తెలివి లేక, నిర్ణయాలు తీసుకోలేక ఇతరుల మాటలు విని ప్రభావితమయ్యే బలహీనమనస్కుడిలా అతడి కింద పనిచేసే వారి దృష్టిలో చులకన అవుతాడు. అందుకే 'మా బాస్ మంచివాడే కానీ...' అనే మాటలు సర్వసాధారణ మయ్యాయి.

మన పురాణాల్లో ఇటువంటి దుర్జనుల ప్రస్తావనలు అనేకం. చల్లగా పంచన చేరి, మెల్లగా మాటలతో వంచన చేసి, ఎదుటివాడిని సర్వనాశనం చేసే చెవి కొరికే పాములకు పెద్ద ఉదాహరణ మహాభారతంలో శకుని. ఇటువంటివారికీ, ఇతరులకూ తేడా ఉండదు. వీరిని ప్రత్యేకంగా గుర్తించేందుకు వీలుండదు. ఇటువంటి 'చెవి కొరికి చంపే' శకుని లాంటివారి వల్ల నష్టాలు అపారం. కష్టాలు అనేకం. వీరిని గుర్తించి 'ఎప్పటి కెయ్యది ప్రస్తుతమప్పటికా మాటలాడి' తప్పించుకు తిరగటం అధికారులకే కాదు అందరికీ తప్పనిసరి. ఇతరుల మాటలు అధికారులకు ఎలా చేరుస్తారో, అలాగే అధికారుల ఆంతరంగికవిషయాలు కొంత తెలిసి, కొంత కల్పించి బయటకు చేరవేస్తారీ 'చెవి కొరికే శకునులు'.

## అధికారులు మరవకూడని సూత్రం

మన పురాణాల్లో 'నారదుడి' పాత్ర ఎంతో గొప్పది. నారాయణ నామభజన చేస్తూ, సకల లోకాలు తిరుగుతూ, అటు వార్తలు ఇటు, ఇటు వార్తలు అటు 'లోకకల్యాణం' కోసం చేరవేస్తుంటాడు నారదుడు. ఈ పాత్ర ద్వారా మన పూర్వికులు వార్తాహరులకు ఉండవలసిన లక్షణాలను, ఉత్తమవ్యక్తిత్వాన్ని అత్యంతప్రతిభావంతంగా లోకానికి చాటి చెప్పారు. నారదుడు సైతం ఒకరి చెవిని కొరికి, మరొకరి మరణానికి కారకుడైనా, 'దుష్టసర్పం' కాదు. నారదుడు దేవర్షి. నారదుడు బ్రహ్మచారి. రాగద్వేషరహితుడు. సకల మానవాళి శాంతిసౌఖ్య కాముకుడు. అటువంటి వ్యక్తి అక్కడి మాటలు ఇటు, ఇక్కడి మాటలు అటు చేరవేసినా అందువల్ల సమాజానికి మంచే జరుగుతుంది తప్ప చెడు జరగదు. కానీ మాటలు చేరవేసేవారంతా 'నారదమహర్షి' అంతటివారు కాలేరు. అందువల్లనే సమస్యలు ఉత్పన్నమౌతాయి.

*'కాః కథానగరే భద్ర వర్తన్తే విషయేషు చ!'*

రాముడి చుట్టూ, నగరం నుంచి పలురకాల కథలు, సమాచారవిశేషాలను సేకరించి వచ్చిన విజయ, మధుమత్త, కాశ్యప, మహిళ, కుల, సురాజి, కాలియ, భద్ర, దంతవక్ర, సుమాగాథ వంటివారు కూర్చున్నారు. రకరకాల కథలను వినిపిస్తున్నారు. తాము సేకరించిన వార్తా, విశేషాలను రాముడికి నివేదిస్తున్నారు. అవి వింటూ రాముడు, భద్రుడనే వ్యక్తిని ఈ ప్రశ్న అడిగాడు. 'నగరంలో ప్రజలు ఏ విషయాల గురించి మాట్లాడుకుంటున్నారు? వారి అభిప్రాయాలేంటి? వారు నా గురించి, సీత గురించి, నా పాలన గురించి, నా సోదరుల గురించి ఏమనుకుంటున్నారు?' అని అడుగుతూ

చివర్లో 'వక్తవ్యతాం చ రాజానో వనే రాజ్యే వ్రజన్తి చ' అంటాడు. 'రాజుల గురించి రాజుల పాలన గురించి, సరైన విమర్శ అడవుల్లో, ప్రజల నడుమనే లభిస్తుంది' అని వ్యాఖ్యానిస్తాడు.

తరువాత జరిగిన కథ పక్కన పెడితే 'ఉత్తరరామాయణం'లోని అతికీలకమైన ఈ ఘట్టం గొప్ప మేనేజ్‌మెంట్ సూత్రాన్ని పరిచయం చేస్తుంది. వ్యక్తి ఎంత ఎత్తు ఎదిగితే అంత ఒంటరి వాడవుతాడు. భూమికి అంత దూరం అవుతాడు. అతడి దృష్టి మామూలు కన్నా ఎక్కువ దూరం ప్రసరించినా, అతడి దృష్టికి చిన్న చిన్న విషయాలు ఆనవు. కానీ ఉపేక్షిస్తే చిన్న చిన్న విషయాలే, తరువాతి కాలంలో ప్రమాదకరం అవుతాయి. ఒక వ్యక్తి నిరసనను అరికట్టకపోతే, చినుకు చినుకు కలిసి చెరువును నింపినట్టు, ఆ నిరసన సమస్తసమాజానికీ పాకుతుంది. కాబట్టి ఎటువంటి చిన్న విషయాన్నయినా తేలికగా తీసేయాకూడదు. ప్రాధాన్యాన్ని అనుసరించి, విషయాలను విశ్లేషించినా, అప్రధానంగా కనిపించిన విషయాన్ని కొట్టి పారేయకూడదు. దాని ప్రాధాన్యం దానికి ఉంటుంది. అయితే, 'రాజు'లా, 'అధికారి'లా ఓ ఎత్తున ఉన్నవారు సామాన్యులకు దూరం అవుతారు. సామాన్యుల అభిప్రాయం వారిని చేరదు. కానీ, చెట్టు ఎంత వృక్షంగా ఎదిగినా, వేళ్లు భూమిలో స్థిరంగా ఉంటేనే, దానికి మనుగడ ఉన్నట్టు, రాజు ఎంత గొప్పవాడైనా, శక్తిమంతుడైనా, సామాన్యుల అభిప్రాయాన్ని నిరాకరిస్తే అతడి రాజ్యం కుప్పకూలి పోతుంది. అందుకే దేశం నలుమూలలా తిరుగుతూ, ప్రజల అభిప్రాయాన్ని నిక్కచ్చిగా రాజుకు చేరవేసేవారి అవసరం రాజుకు ఉంది. అలాగే శత్రురాజుల కుట్రలను, కార్యకలాపాలను తెలుసుకుని అందించేవారి అవసరం ఉంది. ప్రస్తుతం, రాజు స్థానాన్ని ఆక్రమించిన అధికారులకు కూడా ఒకప్పటి రాజుల్లాగే తమ కిందివారి అభిప్రాయాలను తెలుసుకుని అందించేవారి అవసరం ఉంది. పెద్ద పెద్ద కంపెనీల్లో పనిచేసేవారికి, పోటీ కంపెనీల గురించి వివరాలు అందించే వారి అవసరం ఉంటుంది. కాబట్టి, 'అధికారి' వ్యక్తిగత ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా, ఆఫీసులో వారి ప్రవర్తన గురించి, అభిప్రాయాల గురించి, అధికారికి చేరవేసే విశ్వాసపాత్రులైన వారి అవసరం ఉంటుంది. అయితే, తనకు సమాచారం సేకరించి అందించేవారి విషయంలో అధికారి ఎంతో జాగరూకత వహించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఈ సమాచారాన్ని సేకరించే వారంతా నారదుడిలా, నిర్మోహులు కారు. వారు గంధం చెట్టును చుట్టుకుని ఉండే విషసర్పాల వంటివారైతే, అధికారికే కాదు, సంస్థకు కూడా ప్రమాదం.

*అపి కాపురుషో భీరుః స్యాచ్చేన్నృపతిసేవకః*
*తథాపి న పరాభూతిం జనాదాప్నోతి మానవః*

మానవుడు ఎంతటి నీచుడైనా, పిరికిపంద ఐనా, రాజసేవకుడైతే అతడిని ఎవరూ అవమానించలేరు. ఇది లోకరీతి. 'నువ్వు గొప్ప పని సాధించకున్నా పరవాలేదు, గొప్పవాడి పక్కన నిలబడితే చాలు, వాడి గొప్ప కొంత నీకూ అంటుకుంటుంది' అని ఓ సామెత ఉంది. అందుకే బలహీనులు, చేత కానివారు, స్వయంగా ఏమీ సాధించలేనివారు శక్తిమంతుడి చుట్టూ చేరాలని ప్రయత్నిస్తారు. శక్తిమంతుడి పంచన చేరి, అతడి శక్తి ద్వారా తమ పనులు సాధించుకోవాలని చూస్తారు. తమకు లేని గొప్పను ఆపాదించుకోవాలని చూస్తారు. అధికారి అహాన్ని సంతృప్తి పరచి, అతడి నమ్మకాన్ని పొందుతారు. ఆపై, అధికారి దగ్గర తమకున్న ప్రాబల్యాన్ని ప్రకటిస్తూ, ఇతరులను భయపెట్టి తమ అహాన్ని సంతృప్తి పరచుకుంటారు. ఇటువంటివారిని గుర్తించటం కష్టం. కానీ ఇటువంటి వారిని చేరదీయటం వల్ల అధికారి ఎంత మంచివాడైనా చెడ్డ పేరు సంపాదిస్తాడు.

*పాలను గలసిన జలమును*
*బాల విధంబుననె యుండు, బరికింపంగా,*
*బాల చవి జెరుచు, గావున*
*బాలసుడగువాని పొందు వలదుర సుమతీ!*

పాలతో కలిసిన నీరు పాలలాగే ఉంటుంది. కానీ పాల రుచిని పోగొడుతుంది. అలాగే చెడ్డవారితో స్నేహం వల్ల మంచి గుణాలు పోతాయి. కాబట్టి ఆంతరంగికులను ఎన్నుకునే విషయంలో అధికారి ఎంతో జాగరూకత వహించాల్సి ఉంటుంది.

సాధారణంగా ఆఫీసుల్లో పనివారిని రెండు రకాలుగా విభజించవచ్చు. పని చేయనివారు ఒక రకం. వీరితో పని చేయించటం బ్రహ్మతరం కూడా కాదు. పని చేసేవారు రెండో రకం. వీరిని పని చేయకుండా ఉంచటం బ్రహ్మతరం కాదు. అయితే పని చేయనివారిని మరి కొన్ని రకాలుగా విభజించవచ్చు. పనిచేయగలిగి చేయనివారు ఒకరకం. పని చేయలేక చేయనివారింకో రకం. అలాగే పనిచేసే వారిలో, ఎదుటివాడి గురించి పట్టించుకోకుండా తమ పని తాము చేసుకుపోయేవారో రకం, తాము పనిచేస్తూ ఎదుటివాడు పని చేయటం లేదని ఏడుస్తూ పని చేసేవారు ఒక రకం, తమపనికి గుర్తింపు లభించటంలేదని బాధపడుతూ పనిచేసేవారింకో రకం. ఇటువంటి వారందరినీ

వారివారి మనస్తత్వాలను అనుసరించి వ్యవహరిస్తూ నియంత్రించవచ్చు. కానీ ప్రమాదకరమైన ఇంకో రెండు రకాల పనివారున్నారు. వీరు పని చేస్తున్నట్టు నటిస్తారు. నమ్మిస్తారు. మంచి పేరు సంపాదిస్తారు. ఆఫీసర్ విశ్వాసం సంపాదించిన తరువాత ఎదుటివారిమీద పితూరీలు చెప్తారు. ఎదుటివారిని తక్కువ చేయటం వల్ల తమ ఆధిక్యాన్ని చాటుకుంటారు. మరో ప్రమాదకరమైనవారు, పనిచేస్తారు. కానీ పనిచేస్తూ వక్రకార్యాలకు పాల్పడుతారు. వక్రమార్గంలో ప్రయాణిస్తారు. తమ అక్రమచర్యల నుండి రక్షణ పొందేందుకు ఆఫీసర్‌ను ఆశ్రయిస్తారు. అతడికి సేవలు చేస్తారు. అవసరమైనవి అడగకుండానే అందిస్తారు. ఆఫీసరు అడుగులకు మడుగులొత్తుతారు. విశ్వాసం సంపాదిస్తారు. తద్వారా తమ పనులు సాధించుకుంటారు.

ఈ రెండు రకాల మనుషుల వల్లా అధికారికి చెడ్డ పేరు వస్తుంది. కానీ ఇటువంటివారే అధికారులకు దగ్గరవటం జరుగుతుంది. ఎందుకంటే, పని చేసేవాడికి స్వతహాగా ఉండే ఆత్మవిశ్వాసం వల్ల వాడు, ఎవరి ప్రాపు సంపాదించటానికీ ఇష్టపడడు. తనను ప్రజలు గుర్తించాలని ఆరాటపడకుండా రత్నం ఎలా భూమిలోనే ఉండిపోతుందో, అలా వీరు కూడా ఆఫీసర్ దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నించరు. తమ పని తాము చేసుకుంటూ పోతారు. ఇందుకు భిన్నంగా, ఆఫీసరు దృష్టిని ఆకర్షించాలని, దగ్గరవ్వాలని ప్రయత్నించే వారికి స్వలాభాలుంటాయి. ఉద్దేశ్యాలుంటాయి. కానీ అధికారిలో ఉన్న అహం, తన ప్రాపు కోసం తాపత్రయపడేవారిని చూసి సంతృప్తి చెందుతుంది. వారే ఇష్టులవుతారు. తమని లెక్క చేయని పనివారంటే ఆఫీసర్‌లో కోపం కలుగుతుంది. అతడి అహం దెబ్బ తింటుంది. తన చుట్టూ చేరినవారి ప్రభావంతో, తప్పు అని తెలిసి కూడా, పని చేసేవారిని బాధించాల్సి వస్తుంది. చెడ్డ పేరు మూటకట్టుకోవాల్సి వస్తుంది.

*అసతాం సఙ్గదోషేణ సాధనోయాన్తి విక్రియామ్ ।*
*దుర్యోధన ప్రసఙ్గేన భీష్మో గోహరణే గతః ॥*

చెడ్డవారితో సంబంధం వల్ల మంచివారు కూడా చెడ్డపనులు చేయాల్సి వస్తుంది. దుర్యోధనుడితో సంబంధం వల్ల భీష్ముడు కూడా విరాటుడి గోవులను అపహరించేందుకు వెళ్ళాల్సి వచ్చింది. మహాభారతంలో 'గోగ్రహణం' కథ అధికారులను తప్పు దారి పట్టించే సలహాదారుల గురించి స్పష్టంగా తెలుపుతుంది.

పాండవుల అజ్ఞాతవాసాన్ని భగ్నం చేసేందుకు, తమకే అపకారమూ తలపెట్టని విరాటుడి గోవులను అపహరించమన్న సలహా రాజుకు ఇచ్చినవారు, అజ్ఞాతవాసం

ఇంకా ఎంత కాలం ఉందని లెక్కించరు. వారి దృష్టిలో దుర్యోధనుడు దుష్టుడిలా ఎదగాలి. అందుకే ముందూ, వెనుకా చూడకుండా సలహా ఇస్తారు. పాండవులపై క్రోధంతో దుర్యోధనుడూ ఏమీ ఆలోచించడు. అతడికి విచక్షణ నివ్వాల్సిన పెద్దలంతా మౌనంగా ఉండిపోతారు.

ఇందుకు భిన్నంగా విరాటుడి వద్ద పాండవులున్నారు. వారు తమకు ఆశ్రయమిచ్చిన వాడికి సలహాలివ్వరు. వాడి ప్రాపుకోసం అనవసరంగా ప్రయత్నించరు. తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటూ, తమ పనులను మౌనంగా చేసుకుంటూ పోతారు. కానీ, రాజుకు ప్రమాదం వాటిల్లినప్పుడు, తమ నిజరూపాలను ప్రదర్శిస్తారు. అవసరమైనప్పుడు తమ శక్తిని ప్రదర్శించి రాజును విజేతను చేస్తారు. కాబట్టి తన కింద పని చేసేవారిని అధికారి ఎంతో జాగ్రత్తగా గమనించాలి. తన ప్రాపు సంపాదించాలని ప్రయత్నించేవారి గుణగణాలను విచారించి, వారి ఉద్దేశ్యాల గురించి స్పష్టమైన అవగాహన ఏర్పరచుకున్న తరువాతనే, వారిని దగ్గరకు రానివ్వాలి. కానీ అనేక సందర్భాలలో, అధికారులు విజ్ఞత మరచి, విచక్షణ విడిచి, పైపై పొగడ్తలకు లొంగి, పైపై మెరుగులను చూసి భ్రమపడి విషసర్పాలను చేరదీస్తున్నారు. మంచివారిని దూరం చేసుకుంటున్నారు. ఈ విషయంలో 'అధికారు'లు మరవకూడని సూత్రాన్ని మన పూర్వీకులు నిర్వచించారు.

*అణ్వపి గుణాయ గుణినాం మహదపి దోషాయ దోషినాం సుకృతమ్ ।*
*తృణమపి దుగ్ధాయ గవాం దుగ్ధమపి విషాయ సర్పాణామ్॥*

గుణవంతులకు చిన్న ఉపకారం చేసినా అది మంచికి దారి తీస్తుంది. దుర్మార్గులకు చేసిన ఉపకారం ఎంత గొప్పదైనా అది దోషానికి దారి తీస్తుంది. ఆవుకు ఇచ్చేది తృణమే ఐనా, అది పాలుగా మారుతుంది. సర్పానికి పోసిన పాలు కూడా విషంగా మారతాయి.

## అధికారికి ఆదర్శం

మేనేజ్‌మెంట్ సూత్రాలకూ 'వ్యక్తిత్వవికాసా'నికీ సంబంధం లేదన్న అభిప్రాయం ప్రస్తుతం సమాజంలో నెలకొని ఉంది. అది అపోహ మాత్రమే. వ్యక్తిత్వం అనేది వ్యక్తి నిత్యజీవితంలో నిర్వహించే కర్తవ్యాలకు సంబంధించింది. నిత్యజీవితంలో ఉదయం మేలుకొనినప్పటి నుంచి రాత్రి నిదురించే వరకు ప్రతి కార్యకలాపానికి సంబంధించింది. వ్యక్తి తండ్రిగా, మానవుడుగా నిర్వహించే ప్రతి కార్యానికీ సంబంధించింది వ్యక్తిత్వవికాసం.

స్త్రీ పురుషులిద్దరూ సామాజికంగా, వ్యక్తిగతంగా నిర్వహించే ప్రతికార్యానికి సంబంధించింది వ్యక్తిత్వవికాసం. అందుకే 'ఉత్తమ మేనేజర్'గా ఉత్తమవ్యక్తిత్వం ఉన్నవారే ఎదగగలరు. లేనివారు మేనేజర్ అవటం వల్ల అతడికే కాదు, సంస్థకూ, సమాజానికీ నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని మనం అనేకరూపాల్లో అనుభవిస్తున్నాం.

'మేనేజర్' అనే వ్యక్తి నిర్ణయాత్మకస్థానంలో ఉంటాడు. అతడు తీసుకునే నిర్ణయాల పైనే క్రింది ఉద్యోగస్తుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. సంస్థ బాగోగులు ఆధారపడి ఉంటాయి. అతడి నిర్ణయాలపై ఇలాంటి నిర్ణయాత్మకమైన స్థానాల్లో ఉన్నవారికి సరైన వ్యక్తిత్వం లేకపోతే దీని ప్రభావం సమాజంపై పడుతుంది. ఆ వ్యక్తిత్వరాహిత్యం అతడి నిర్ణయాలను ప్రభావితం చేస్తుంది. అందరి దృష్టిలో ఉండటంతో అతడి ప్రవర్తన ప్రభావం కింది ఉద్యోగులపై పడుతుంది. వారి ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. ఆ ప్రభావం సంస్థపై, సమాజంపై పడుతుంది. కాబట్టి నిర్ణయాత్మక స్థానాల్లో ఉండే ఏ పురుష మేనేజర్లయినా, మహిళామేనేజర్లయినా వారికి ఉత్తమ వ్యక్తిత్వం ఉండటం తప్పనిసరి అన్నది నిర్వివాదాంశం. అందుకే ఆఫీసర్ అయినా, ప్రభువు అయినా, మేనేజర్ అయినా, నాయకుడైనా, ప్రజలపై ప్రభావం చూపే ప్రతి వ్యక్తికి ఉత్తమవ్యక్తిత్వం ఉండటం ఆవశ్యకం. ఉత్తమవ్యక్తి మాత్రమే ఉత్తమ మేనేజర్ కాగలడు.

భారతీయపురాణాలను పరిశీలిస్తే అనేక ఉత్తమ 'అధికారి' లక్షణాలను ప్రతిబింబించే పాత్రలు అనేకం లభిస్తాయి. ఉత్తమవ్యక్తిత్వాన్ని బోధించే సంఘటనలు బోలెడన్ని ఉన్నాయి.

మనకు రాముడు, కృష్ణుడు ఆదర్శం. రామకృష్ణులు మనకు దైవాలతో సమానం. వారు దైవాలే. అందుకే వ్యక్తిత్వం గురించి ఎటువంటి సందేహం వచ్చినా, ఎటువంటి సమాధానం కావాలన్నా, దృష్టి ముందుగా వీరిద్దరి వ్యక్తిత్వాల వైపు మళ్లుతుంది.

వారి వ్యక్తిత్వాల విశ్లేషణ ద్వారా, వారి జీవితాలలో అనేకసందర్భాలలో వారు వ్యవహరించిన తీరు ద్వారా మన నడవడిని తీర్చిదిద్దుకుంటాం.

రాముడు, కృష్ణుడు రెండు ప్రత్యేక వ్యక్తిత్వాలకు ప్రతీకలు. ఉత్తమవ్యక్తిత్వానికి తిరుగు లేని నిదర్శనాలు. అలాగే వారిద్దరూ అత్యుత్తమ 'మేనేజ్‌మెంట్'కు ప్రతీకలు. రాముడు రాజవుతాడనగానే ప్రజలు సంతోషించారు. రాముడు అడవులకు వెళ్లాల్సి వచ్చినప్పుడు దుఃఖించారు. క్రోధితులయ్యారు. కైకను దూషించారు. రాముడి సోదరులు సైతం ఏదో ఓ సందర్భంలో ఆవేశం ప్రదర్శించారు. కానీ రాముడు తొణకలేదు. ఆవేశం

ప్రదర్శించలేదు. దుఃఖాన్ని చూపలేదు. రాముడు కనుక ఆ సమయంలో ఆవేశం ప్రదర్శించి ఉంటే, అయోధ్యలో రక్తపుటేరులు పారేవి. ప్రజావిప్లవం వచ్చేది. అందుకే అధికారంలో ఉన్న వ్యక్తి, ప్రజల ఆదరణ పొందుతున్న వ్యక్తి ప్రవర్తనలో 'విచక్షణ' అన్నది ప్రాధాన్యం వహిస్తుంది.

ఇదే విచక్షణ అడవిలో లక్ష్మణుడి సేవలు అందుకోవటంలోనూ కనిపిస్తుంది. లక్ష్మణుడు తన ఇష్టాన్ని అనుసరించి, సేవలు ధర్మంగా భావించి చేస్తున్నా, వాటిని రాముడు ఎంత అద్భుతమైన రీతిలో స్వీకరించాడంటే, రాముడి కన్నా తాను తక్కువ అన్న భావం లక్ష్మణుడికి ఏ క్షణానా కలగనేలేదు. సాధారణంగా, ఉత్తమ అధికారి ఉంటే, అతడి కింద పని చేసేవాడు ఏదో ఓ సమయంలో స్వచ్ఛందంగా అతడికి సహాయం చేసేందుకు ముందుకు వస్తాడు. ఆ సహాయాన్ని అధికారి హుందాగా స్వీకరించాలి. ఎంత హుందాగా స్వీకరించాలంటే, సహాయం చేసే వ్యక్తికి ఆనందం, సంతృప్తి కలగాలి.

ఉదాహరణకు, ఓ అధికారి ఒంట్లో బాగాలేదని చూసేందుకు అతడి సహాయకుడు ఇంటికి వెళ్లాడనుకుందాం. ఇంటికి వచ్చినవాడి పరామర్శలను గౌరవంతో, ఆనందంగా స్వీకరిస్తే, వచ్చిన వ్యక్తి ఆనందిస్తాడు. అలా కాక, ఎందుకొచ్చిన గొడవరా బాబూ, అన్నట్టు చిరాకుతో, దర్పంతో స్వీకరిస్తే, ఇంటికి వచ్చినవాడి మనసు గాయపడుతుంది. మరోసారి ఇంటికి రాడు.

ఇలా అందరినీ సమానులుగా గౌరవిస్తూ వ్యవహరించడం వల్ల శ్రీరామచంద్రుడు వానరులమూకను వానరసేనగా మలచగలిగాడు. రావణాసురుడంతటి వీరుడిని ఓడించగలిగాడు. సుగ్రీవుడితో, హనుమంతుడితో, జాంబవంతుడితో, విభీషణుడితో ఒకరేమిటి... ప్రతి ఒక్క వ్యక్తితో రాముడు వ్యవహరించిన తీరు ఎంతో ఉత్తమమైనది. ప్రతి వ్యక్తినీ తన ఆప్యాయత, అనురాగగౌరవాలతో కట్టి పడేసుకోవడమే కాదు, వారి శక్తిని వారు తెలుసుకునేట్టు చేశాడు. వారిలోని ఉత్తమవ్యక్తిత్వాన్ని వెలికి తీసి వారిని ఉన్నతులుగా చేశాడు. శబరి కథ అందరికీ తెలుసు. ఆమె ఎంగిలిని గంగ కన్నా మిన్నగా భావించి రాముడు స్వీకరించిన విధానం రాముడి వ్యక్తిత్వానికి వన్నె తేవటమే కాదు, మిగతావారికి ఆదర్శంగా నిలుస్తుంది. అభిమాని అభిమానం తప్ప మరే విషయమూ అతడికి పట్టలేదు.

మనం ఉన్నతస్థానాల్లో ఉన్న అనేకులను చూస్తుంటాం. తమకు ఉపయోగపడేవారితో ఒక రకంగా వ్యవహరిస్తారు. ఉపయోగపడనివారితో మరో రకంగా వ్యవహరిస్తారు. పని ఉన్న వారితో మర్యాదగా ప్రవర్తిస్తారు. పని లేనివారిని తీసిపారేస్తారు. ఇటువంటి ప్రవర్తన వల్ల వ్యక్తి అహం నిలవవచ్చు. అతడి గొప్పతనం నిలవవచ్చు. కానీ ఈ ప్రవర్తన వల్ల అతడి అవమానాలు పొందిన వారి మనస్సులు గాయపడతాయి. వారిలో క్రోధం జనిస్తుంది. ఇది ఎప్పటికైనా ప్రమాదమే.

ఓ మారుమూల పల్లెటూరి అనామకుడి మాటకు విలువనిచ్చిన రాముడి ప్రవర్తనకూ, పనికిరాని వారిని తీసిపారేసేట్టు ప్రవర్తించే వారి ప్రవర్తనకూ తేడా, 'వ్యక్తిత్వా'నికి సంబంధించింది.

ఇక శ్రీకృష్ణుడు మరో రకమైన 'అధికారి' ప్రవర్తనకు అద్దంలా నిలుస్తాడు. శ్రీకృష్ణుడు లౌక్యం తెలిసిన అధికారి. ఎవరితో ఎలా వ్యవహరించాలో అలా వ్యవహరిస్తాడు. అవసరమైనప్పుడు నీతిసూత్రాలను తనకనుకూలంగా మలుచుకోగలడు. రుక్మిణిని ఎత్తుకొని వచ్చేయగలడు. ఆమె అన్నతో పోరాడినా, ఆమెలో నిరసనను కలగనివ్వడు. అలాగే శిశుపాలుడి వంటివారు దూషిస్తుంటే చిరునవ్వుతో స్వీకరిస్తాడు. తన శాంత ప్రవర్తన ద్వారా శిశుపాలుడి ఆగ్రహాన్ని అభాసుపాలు చేస్తాడు. చివరికి అందరి ఓపికా నశించే సమయానికి శ్రీకృష్ణుడు అందరి ఎదుటా శిశుపాలుడిని సంహరించినా, ప్రజలలో నిరసన కలగదు. ఎందుకంటే ఎంతో సహనంతో అతడి దూషణలను భరించాడు. 'ఇక చాల్లే' అనిపించినప్పుడు చంపేశాడు. శ్రీకృష్ణుడు నిజానికి ప్రజల ప్రీతిపాత్రుడు. శక్తిమంతుడు. ఐనా రాజ్యం తన అన్నకే అప్పగించాడు. తాను వెనుక ఉంటూ వ్యవహారం నడిపించాడు. అదీ అన్న గౌరవానికి భంగం కలగని విధంగా. పాండవులందరికీ మార్గదర్శకుడుగా నిలిచి, వారి వ్యక్తిత్వాలను ఉత్తమంగా తీర్చిదిద్దాడు. సర్వాధికారిగా ఎదగగలిగి ఉండి కూడా స్వచ్ఛందంగా ద్వితీయస్థానానికి ఒదిగాడు. అధికారాలపై పదవులపై ఎటువంటి ఆశలూ, వ్యామోహాలూ ప్రదర్శించలేదు. అనవసరంగా ఎవరినీ దూషించలేదు. కానీ పొరపాటు చేసినవారిని క్షమించలేదు. ఎవరికి తగ్గ శిక్ష వారికి వేశాడు. ఎవరికి తగ్గ పురస్కారం వారికి అందజేశాడు. పేదవాడైన కుచేలుడిని ఎంత సాదరంగా ఆహ్వానించాడో, రాజైన సుయోధనుడితో అంతే సాదరంగా వ్యవహరించాడు. ఉత్తమప్రవర్తన ద్వారా ఉన్నత ఆదర్శాన్ని ప్రజల ముందు నిలిపాడు.

అందుకే అధికారికి ఉత్తమవ్యక్తిత్వం ఉంటేనే, అతడి ప్రవర్తన ఉత్తమస్థాయిలో ఉంటుంది. వారి ప్రవర్తన ఇతరులకు ప్రామాణికం అవుతుంది. అనుసరణీయం అవుతుంది.

*యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః॥*
*స యత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే ॥*

పెద్దల వ్యవహారాన్నే సామాన్యులు అనుసరిస్తారు. సదాచారం విషయంలో వాళ్లు ఏర్పరచిన ప్రమాణాన్నే సామాన్యులు అనుసరిస్తారు.

ఒక అధికారి ధూర్తుడైతే, అతడి కింద పని చేసేవారు కర్కశులవుతారు. అధికారి అవినీతి పరుడైతే, ఆఫీసులో పని చేసేవారు అవినీతి వైపు ఆకర్షితులవుతారు. అధికారి దుర్వ్యసనుడయితే, ఆ దుర్వ్యసనాలను ప్రోత్సహించేవారు చుట్టూ చేరతారు. అంటే, అధికారి తన వ్యక్తిత్వానికి తగ్గట్టు వారిని తన చుట్టూ చేర్చుకుంటాడన్నమాట. ఈ చెవి కొరికే పాముల విషప్రభావం కూడా అధికారి వ్యక్తిత్వాన్ని బట్టి పని చేస్తుంది. తన కింద పని చేసేవారి గుణగణాలు తెలుసుకొని, అందుకు తగ్గట్టు వ్యవహరిస్తాడే తప్ప, వారూ, వీరూ చెప్పిన మాటలను విని నిజమని నమ్మేయడు. అందుకే అధికారి అయినవాడికి ఉత్తమవ్యక్తిత్వం, విచక్షణ ఉండాలి. అటువంటి వారే తమ చుట్టూ చేరే విషసర్పాలను గుర్తిస్తారు. వాటి కోరలు పీకుతారు. నిర్మలంగా, నిశ్చలంగా సక్రమమైన నిర్ణయాలు తీసుకుంటారు.

*పంకైర్వినా సరోభాతి సభః ఖలుజనైర్వినా,*
*కటువర్ణై వినా కావ్యం మానసం విషయైర్వినా ॥*

బురద లేకపోతే సరస్సు అందంగా ఉంటుంది. దురాత్ములు లేని సభ శోభిస్తుంది. మధురమైన శబ్దజాలం కావ్యానికి శోభనిస్తుంది. మనస్సు విషయవాంఛ లేక నిర్మలంగా ఉంటేనే ఆనందం ఉంటుంది.

## కాకి – కోకిల

రాముడు, కృష్ణుడే కాక మనకు మరో ఇద్దరు దేవతలు 'మేనేజర్' ఆదర్శానికి చక్కగా పనికి వస్తారు. పురాణాల ప్రకారం తండ్రీకొడుకులైన శివుడు, వినాయకుడు ఏ కోణం లోంచి చూసినా అత్యద్భుతమైన మేనేజర్లు. అయితే వీరి మార్గం అనితరసాధ్యం.

వీరి అనుకరణ కష్టం. కానీ వీరి పద్ధతులను, బలహీనతలను అర్థంచేసుకుంటే బోలెడంత విజ్ఞానం అందుతుంది. వ్యక్తిత్వవికాసానికి మార్గదర్శనం లభిస్తుంది.

గమనిస్తే, రామకృష్ణులకు పూర్తిగా భిన్నమైన 'మేనేజర్' పరమశివుడు. అత్యంత శక్తిమంతుడై, సృష్టి స్థితి లయలకు కారకుడై ఉండి కూడా శ్మశానాన్ని నివాసం చేసుకున్నవాడు శివుడు. బూడిద పూసుకునేవాడు శివుడు. పులిచర్మం ధరిస్తాడు. మెడలో సర్పహారం వేసుకునేవాడు శివుడు. అంత మాత్రంచేత శివుడి గౌరవానికి భంగం కలగలేదు. చులకనగా చూసినవారికి శిక్ష తప్పలేదు. మంచుకొండపై ఉన్నా, దట్టమైన అడవిలో ఉన్నా శివుడు శివుడే.

భక్తసులభుడు శివుడు. తపస్సు చేసినవారికి వెంటనే ప్రత్యక్షమౌతాడు. ఉచితాను చితాలు లెక్క చేయకుండా వరాలిచ్చేస్తాడు. శివుడి ఈ గుణాన్ని ఆసరాగా తీసుకుని దుష్టులనేకులు కోరకూడని వరాలు కోరారు. శివుడిని ఇబ్బంది పాలు చేశారు. ఆఫీసర్ స్థాయిలో ఉన్నవాడు అందరితో స్నేహంగా ఉన్నా 'వరాలు' ఇచ్చే సమయంలో మాత్రం విచక్షణను ప్రదర్శించాల్సి ఉంటుంది. శివుడిలా నిర్మోహంగా, ఆడంబరాలకు లొంగకుండా ఉండాలి. సర్వజగత్తునూ పాలించే శక్తి ఉన్నా, అన్ని సౌఖ్యాలూ వదలి బూడిద పూసుకుని శ్మశానంలో నివాసం ఏర్పరచుకునే నిబ్బరం ఉండాలి.

శివుడు గరళకంఠుడు. సాగరమథనసమయంలో వెలువడిన హాలాహలాన్ని గళంలో నిలుపుకుని నీలకంఠుడయ్యాడు. విషం గొంతు దిగిందంటే ప్రళయం. ప్రపంచం నాశనం అవుతుంది. అధికారంలో ఉన్న వ్యక్తికి అనేకవిషయాలు తెలుస్తూంటాయి. కొన్ని మంచివి. కొన్ని చెడ్డవి. అమృతంలాంటి మంచి విషయాలను అందరికీ పంచి ఇవ్వాలి. కానీ విషాలను తనలోనే దాచుకోవాలి. గొంతు దిగనివ్వకూడదు.

ఆఫీసర్ చుట్టూ అనేకులు చేరతారు. రకరకాల విషయాలు అతడికి చేరవేస్తారు. అతడి చుట్టూ ఉన్నవారి గురించి, సబార్డినేట్ల గురించి, పై అధికారుల గురించి రకరకాల విషయాలు చెప్తారు. వాటిని వినటమే తప్ప మళ్ళీ అతడి ద్వారా బయటకు రానీయకూడదు. గళంలోనే గరళంలా దాచుకోవాలి. ఆ మాటల ప్రభావానికి గురైతే అధికారి విలువ కోల్పోతాడు. అనవసరమైన వివాదాల్లో ఇరుక్కుంటాడు. ఇప్పుడు మన నాయకులు అనేకులు నోటికి వచ్చినట్టు మాట్లాడేసి, ఆరోపణలు చేసి ఆపై 'తప్పుగా అర్థం చేసుకున్నా'రని బుకాయించటం మనం చూస్తున్నాం. ఎప్పుడైతే బాధ్యతాయుతమైన

స్థానంలో ఉన్న వ్యక్తి గరళాన్ని గళంలో దాచుకోగలుగుతాడో, అప్పుడు ఇటువంటి సమస్యలెన్నో పరిష్కారమవుతాయి. ఎంతైనా చప్పట్ల నుండి శబ్దం రావాలంటే రెండు చేతుల అవసరం ఉంటుంది కదా! ఎప్పుడైతే వ్యక్తి చేదు నిజాలను తనలోనే దాచుకోగల శక్తిని సంపాదిస్తాడో, అప్పుడే మెడలో ఉన్న సర్పవిషం అతడినేమీ చేయలేకపోతుంది. ఎప్పుడైతే అధికారి విచక్షణతో 'మౌనం' పాటిస్తాడో, అదే అతడికి శ్రీరామరక్ష అవుతుంది. అతడి కిందివారికీ, పైవారికీ అతడంటే నమ్మకం కలుగుతుంది. అనవసరంగా నోరు పారేసుకోడన్న విశ్వాసం కలుగుతుంది.

శివుడి తలపై ఉన్న చంద్రుడు అధికారులకు మరో గొప్ప సత్యాన్ని చెప్తాడు. అధికారంలో ఉన్నవారు అర్హతను బట్టి వ్యక్తిని సత్కరించాలి. అర్హతను బట్టి వ్యక్తిని ఆదరించాలి. అలాకాక అర్హత లేనివాడిని నెత్తిన ఎక్కించుకుంటే అభాసుపాలు కావాల్సి ఉంటుంది. గణపతిని చూసి నవ్విన చంద్రుడి వక్రదృష్టి కథ జగద్విదితమే కదా!

*అతిసత్కృతా ఆపి శఠాః సహభువ*
*మజ్జన్తి జాతు న ప్రకృతిమ్*
*శిరసా మహేశ్వరేణాపి*
*నను ధృతో వక్ర ఏవశశీ ।*

ఎంత సత్కరించినా దుష్టులు తమ సహజస్వభావాన్ని విడవరు. మహేశ్వరుడంతటి వాడు తల పైన ధరించినా చంద్రుడు వక్రంగానే ఉంటాడు కదా!

పరమశివుడు తలపై గంగను ధరించటం ఓ అపూర్వమైన పాఠాన్ని నేర్పుతుంది. గంగానది భువి పైకి దూకుతుంటే, ఆ దూకుడును అదుపులోపెట్టి, ఒకోజట నుంచి కొద్దికొద్దిగా భూమి పైకి విడుస్తాడు శివుడు.

తన కింద పనిచేసేవారిలో అద్భుతమైన తెలివిగలవారుంటారు. కాని వారి తెలివి వారి దూకుడు స్వభావం కింద అణిగిపోతుంది. అటువంటివారిలో 'చెడు'ను గరళంలో ధరించి, వారి దూకుడును జటాజూటాల్లో చుట్టాలి. ఆపై వారిలోని ఉత్తమత్వాన్ని వెలికి తెచ్చి దాన్ని సరైన మార్గంలో పెట్టాలి. ఎలాగైతే శివుడు గంగానదిని పాయలుగా విడిచాడో, అలాగే ఈ తెలివిమంతుల తెలివిని 'ఛానలైజ్' చేయాలన్నమాట.

అయితే, అప్పుడప్పుడూ 'శివతాండవం' కూడా చేస్తూండాలి. ఈ శివతాండవానికి సరైన కారణం ఉండాలి. అప్పుడే శివతాండవానికి విలువ వస్తుంది. అప్పుడప్పుడు

శివుడిలా కోపగించుకుంటూండాలి. అటువంటప్పుడే ప్రమథగణాలు వీరభద్రులవుతారు. దక్షుడిలాంటి వారిపై విరుచుకుపడతారు. ఇది మరో ముఖ్యమైన సత్యాన్ని నేర్పుతుంది. అధికారంలో ఉన్నవాడి ఆవేశం, అతడి కిందివారిని ప్రతీకారానికి ప్రేరేపిస్తుంది. 'శివుడు' దేవుడు కాబట్టి అతడి ఆవేశం లోకకల్యాణకారకం అయింది.

గమనిస్తే, రాముడు, కృష్ణుడు, మానవావతారాలైనా దైవాల్లా ప్రవర్తిస్తారు. శివుడు దైవమై కూడా మానవుల ప్రవర్తనకు దగ్గరగా నడుచుకుంటాడు. అందుకే ఆయన బోళాశంకరుడయ్యాడు. ఆవేశాన్ని ఆపుకోలేకపోతాడు. పార్వతితో వివాహమైన తరువాత శృంగారకేళీవిలాసాల్లో మునిగి కర్తవ్యం మరచిపోతాడు. ఇతరదేవతలు గుర్తు చేస్తే కానీ ఆయనకు కర్తవ్యం గుర్తు రాదు. అయినా సరే, శివుడు అందరి మన్ననలనూ పొందగలుగుతున్నాడు. కాబట్టి, అధికారంలో ఉన్నవారు తమ బలహీనతలను గుర్తించాలి. ఆ బలహీనతలను తమ శక్తిగా మలచుకోవాలి అని సూచిస్తుంది శివుడి ప్రవర్తన. లోపాలుండటంలో తప్పు లేదు. కానీ లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దుకుని తన శక్తిగా మలచుకోవటంలోనే అసలు వ్యక్తిత్వం తెలుస్తుంది.

శివుడిలాగే వినాయకుడు సైతం రూపానికి ప్రాధాన్యం ఇవ్వడు. వినాయకుడి రూపం చూడగానే నవ్వు వస్తుంది. పైగా ఆయన వాహనం చిట్టెలుక, అయినా సరే, ఎవ్వరూ తేలికగా కొట్టిపారేయాల్సిన పని లేదు. వినాయకుడు విఘ్ననాయకుడు. పెద్ద పెద్ద చెవులుంటాయి. దాంతో ప్రతి చిన్న విషయాన్నీ వినగల శక్తి ఉంటుంది. ఏనుగు తొండం అత్యంతశక్తిమంతమైంది. నేలపై ఉన్న సూదిని కూడా గ్రహించగలుగుతుంది. అధికారి అలా ఉండాలి. పెద్ద చెవులతో వినటం, చిన్న కళ్ళతో అన్నీ చూడటమే కాదు, తొండంలా సూక్ష్మవిషయాలను కూడా గ్రహించగలిగి ఉండాలి. వినాయకుడిలాగే పైకి కనబడే దంతాలు వేరుగా ఉండాలి. అసలు దంతాలు వేరవ్వాలి. పైకి అందరితో మంచిగా వ్యవహరిస్తున్నా, ఎవరెవరు ఎటువంటివారో గ్రహించాలి. పైకి మెతకగానే ఉన్నా కఠినంగా ఉండాల్సిన సమయంలో కాఠిన్యం ప్రదర్శించాలి. అవసరమైతే తొండంతో ఎత్తి నేలపై పడేసి, కాలరాయగలిగి ఉండాలి. ఇతర సందర్భాలలో 'కరిమింగిన వెలగపండు'లా ఏమౌతుందో, ఏం జరుగుతోందో, ఎవరికీ తెలియకుండా చేయాలనుకున్నది చేసేయగలిగి ఉండాలి.

గమనిస్తే మనం ఉత్తమ అధికారానికి, ఉత్తమవ్యక్తిత్వానికి ఉదాహరణలుగా తీసుకుంటున్న వారంతా కష్టాలు పడి పైకి వచ్చినవారే. రాముడైనా, కృష్ణుడైనా, శివుడైనా,

వినాయకుడైనా అనేకబాధలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అనుభవించినవారే. ఉన్నతస్థానాన్ని అలంకరించేందుకు ఎటువంటి కుట్రలు, కుతంత్రాలు పన్నకుండా స్వయంశక్తితో పైకి వచ్చినవారే. వారు ఆ స్థానాన్ని అలంకరించటం పట్ల అందరికీ సంతృప్తి కలిగించినవారే. ఎవరికీ ఆక్షేపించే అవకాశం లేకుండా అర్హతలు పొందినవారే.

ఇందుకు భిన్నంగా, ఇతరుల ప్రాపకంతోటో, రకరకాల కుట్రలు పన్నో పైకి వచ్చేవారు ఎట్టి పరిస్థితులలో ఉత్తమవ్యక్తిత్వం ప్రదర్శించలేరు. సమాజం మెప్పు పొందలేరు. ఎంత ప్రయత్నించినా తగిన గౌరవం పొందలేరు.

*అన్యస్మా ల్లబ్ధ పదః ప్రాయో*
*నీచోపి దుఃసహో భవతి*
*రవి రపి న దహతి తాదృశా*
*దృగయం దహతి వాలుకా నిరకః*

ఇతరుల ప్రాపకంతో పైకి వచ్చి, ఉన్నతాసనాలు అలంకరించే అధముల వల్ల అందరికీ ఇక్కట్లు ప్రాప్తిస్తాయి. స్వశక్తితో పైకొచ్చినవారికి నీచప్రవర్తన ఉండదు. సూర్యుని వేడిమిని భరించగలం కానీ, సూర్యరశ్మిలో కాలుతున్న ఇసుక మీద కాలుపెట్టగలమా?

గమనిస్తే, ప్రస్తుతసమాజంలో పోటీ ఎంతగా పెరిగిందో, కుట్రలు, కుతంత్రాల ద్వారా పైకి ఎగబాకాలనే ఆత్రమూ అంతగా పెరిగింది. అటువంటివారు లక్ష్యాన్ని సాధిస్తుండటంతో సమాజానికి ఇక్కట్లూ పెరిగాయి. మన రాజకీయవ్యవస్థ ఈ నిజానికి దర్పణం పడుతుంది. వ్యక్తిగతంగా ప్రజలను ఆకర్షించగల శక్తి లేని నాయకుడు అధికారకేంద్రం ప్రాపు సాధించటం ద్వారా పైకి రావాలని ప్రయత్నిస్తాడు. శక్తి ఉన్న నాయకుడు, తను కోరింది లభించకపోతే, అధికారకేంద్రాన్ని దూషించి, తనదంటూ ఓ పార్టీ ఏర్పాటు చేసుకోవాలని చూస్తాడు. దాంతో రాజకీయవ్యవస్థ ఎంత అస్తవ్యస్త మౌతుందంటే దేశాన్ని మొత్తం ఏకం చేయగల నాయకత్వం కరవవుతోంది.

ప్రధాని పదవికి మెజారిటీ సభ్యులు సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్‌ను బలపరిచారు. కానీ గాంధీజీ నెహ్రూ పేరును సూచించాడు. ఆ నాటి నాయకుల వ్యక్తిత్వం ఎంత గొప్పదంటే, తమ వ్యక్తిగత నిరాశల ప్రభావాన్ని తమ కర్తవ్యంపై పడనివ్వలేదు. పార్టీ నీడలో ఒదిగి తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధిగా 'పటేల్' నిర్వహించటం మనం చూడవచ్చు. అంతే కానీ, వేరుపడి వేరే పార్టీ పెట్టి ఉన్నతాసనాల కోసం నీచచర్యలకు పాల్పడటం

కనబడదు. ఇక్కడే వ్యక్తిత్వం ప్రస్ఫుటమయ్యేది. స్వశక్తి మీద నమ్మకం ఉన్నవారి ప్రవర్తనకూ, అక్రమకార్యకలాపాలపై ఆధారపడేవారి ప్రవర్తనకూ తేడా తెలిసేది.

ఇదే రకమైన ఉత్తమప్రవర్తనను మనం వాజ్‌పేయి ప్రధాని అయిన సందర్భంలో చూడవచ్చు. స్వయంగా ప్రధాని పదవి నిర్వహించగలిగే శక్తి, మద్దతులుండి కూడా అద్వానీ, వాజ్‌పేయి నీడలో స్వచ్ఛందంగా ఉండిపోయాడు. ఇక్కడ వాజ్‌పేయి కానీ, అద్వానీ కానీ స్వశక్తితో ఆ స్థాయికి ఎదిగారు. తరువాత రాజకీయపరిణామాలేవైనా, ఆ సమయంలో వారి ప్రవర్తన నిర్ణయాలు ప్రజానీకలాభం దృష్టితో ఉన్నాయి తప్ప స్వలాభప్రసక్తి లేదు.

ఇందుకు భిన్నంగా మనం పార్టీలు వదలటం, నాయకత్వంపై తిరుగుబాట్లు చేయటం, కొత్త పార్టీలు పెట్టటం, వ్యక్తిత్వం లేకుండా ప్రవర్తించటం, అంత కాలం దూషించినవాడినే పదవి కోసం పొగడటం, అవసరమైతే, అధికారం కోసం వేర్పాటువాదాన్ని ప్రోత్సహించటం, ప్రజల నడుమ అడ్డుగోడలు నిలపటం వంటి చర్యలు మనం నిత్యం అనుభవిస్తూనే ఉన్నాం. ఇటువంటివారు అధికారానికి వచ్చినవారి వల్ల ప్రజలకు, సమాజానికి ఇక్కట్లు తప్ప మేలు జరగదు. ఎందుకంటే, శివుడి శిరస్సుపై ఉన్న చంద్రుడు వంకరగానే ఉన్నట్లు, అధికారానికి వచ్చినా వీరి వక్రబుద్ధి పోదు. కుట్రలు చేయటం, గోతులు తవ్వటం వంటి నీచప్రవర్తనలో మార్పు రాదు.

*పిశున! సమారోహసి కిం*
*సుజన సమాజ నభీష్ట సౌజన్యం*
*కరటః కి న సులభతే*
*కలకంఠ పదం రసాల మౌళి గతః*

మామిడి కొమ్మ మీదికెక్కి కూసినంత మాత్రాన కాకి కోకిల కాలేదు. కోకిల కంఠం దానికి రాదు. ఎంతమంది సజ్జనుల మధ్య కూర్చొని విద్వద్గోష్ఠులలో పాల్గొన్నా అపండితులకు పాండిత్యం అబ్బదు. దుర్జనత్వం వదలదు.

## అధికారికి గౌరవం

మనం 'దేవతల'ను ఆఫీసర్లు అనుకున్నాం. వారి ప్రవర్తనను బట్టి అధికారుల ప్రవర్తన ఎలా ఉండాలో, అధికారుల వ్యక్తిత్వం ఏ స్థాయిలో ఉంటే, పరిణామాలు ఎలా ఉంటాయో తెలుసుకుంటున్నాం. ఒకో దైవం, ఒకో రకమైన ఔన్నత్యానికి, సంపూర్ణత్వానికి

ప్రాతినిధ్యం వహిస్తూ, ఆయా స్వభావాలు కలవారికి మార్గదర్శనం చేయటం కూడా గమనిస్తున్నాం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ముగ్గురూ సర్వశక్తిసంపన్నులు. ముగ్గురూ ఒకరి కొకరు తీసిపోరు. సమానులు. కానీ ముగ్గురూ తమ తమ అధికారపరిధులను స్పష్టంగా నిర్ణయించుకున్నారు. సృష్టి బ్రహ్మ పని. దాని బాగోగులు చూడటం విష్ణువు పని. లయమొందించటం శివుడిపని. దీంట్లో అవసరాన్ని బట్టి ఒకరికొకరు సహాయం చేసుకుంటూ కొనసాగుతున్నారు తప్ప, వారి నడుమ అహాలు లేవు. ఆరాటాలు, పోరాటాలు లేవు. విష్ణువు వైకుంఠంలో సకలభోగాల నడుమ శయనిస్తాడన్న అసూయ శివుడికి లేదు. శివుడు వెండి కొండల నడుమ పులిచర్మం ధరించి, జటాజూటాలతో ఉంటాడని విష్ణువుకు చిన్న చూపు లేదు. వీరికి 'బ్రహ్మ'పట్ల అంతు లేని గౌరవం. ఒకరినొకరు గౌరవించుకుంటూ, అభిమానించుకుంటూ, ఒకరి శక్తిని మరొకరు గుర్తించి, సమన్వయం సాధించటం కనిపిస్తుంది. ఇది మనకు ఓ గొప్ప పాఠం నేర్పుతుంది.

మైత్రి కాని, శాంతి కానీ సమానబలశాలుల నడుమ మాత్రమే సాధ్యమౌతుంది. ఎప్పుడైతే బలాబలాల నడుమ వ్యత్యాసముంటుందో అక్కడ స్నేహం ఉన్నా, శాంతి ఉన్నా అది శాశ్వతం కాదు. ఓ సారి ఓ ఎలుక పిల్లిని ప్రాణాపాయం నుంచి కాపాడింది. దాంతో పిల్లీఎలుకల నడుమ స్నేహం ఆరంభమైంది. ఈ రెంటిలో పిల్లి ఎలుక కన్నా శక్తిమంతురాలు కాబట్టి వారి స్నేహం సమానమైంది కాదు. శాశ్వతమైంది కాదు. పిల్లికి ఆకలివేసినప్పుడో, ఆగ్రహం కలిగినప్పుడో, అది తన దగ్గరే నిశ్చింతగా ఉన్న ఎలుకను తినక తప్పదు. ప్రపంచంలో జరిగేదీ ఇదే.

బలవంతుడు, బలహీనుల మధ్యస్నేహం స్నేహం కాదు. అది బలవంతుడు, బలహీనుడి పట్ల చూపుతున్న దయ మాత్రమే. ఎప్పుడైతే ఇద్దరూ సమానశక్తి కలవారై ఉంటారో, అప్పుడు మాత్రమే వారి మధ్య స్నేహం నిలుస్తుంది. ఈ నిజాన్ని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల 'సమన్వయం' నిరూపిస్తుంది. అవసరమైనప్పుడు ముగ్గురూ కలిసికట్టుగా సంఘటితశక్తితో రాక్షసులను ఎదుర్కొన్నారు. లేనప్పుడు ఎవరి వ్యవహారాలు వారు చూసుకున్నారు.

ఇది అధికారులకే కాదు, దేశాలకు కూడా వర్తిస్తుంది. శక్తిమంతమైన దేశం, బలహీన దేశం వైపు స్నేహం కోసం చేయి చాస్తోందంటే అర్థం, ఆ స్నేహహస్తం వెనుక బలమైన దేశస్వార్థం ఏదో ఉందన్నమాటే. ఇది గ్రహించకుండా బలహీనమైన దేశం, అంత శక్తిమంతుడు తన స్నేహం కోసం అర్రులు చాస్తున్నాడని ఉబ్బితబ్బిబ్బ వుతుంది.

గర్వపడుతుంది. ఆ తరువాత అనుభవిస్తుంది. గతచరిత్రనే కాదు, వర్తమానం కూడా ఈ నిజాన్ని నిరూపిస్తుంది. 'రాజనీతి'లో 'దౌత్యా'నికి ఈ సూత్రం ఉపయోగ పడుతుంది. తమ శక్తియుక్తులను, శత్రువు మనసును గ్రహించగలిగిన దూత మాత్రమే సరైన రీతిలో దౌత్యం నెరపగలడు.

'దూత' కుండవలసిన లక్షణాలను మనువు స్పష్టంగా వివరించాడు.

*అనురక్తా శ్శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్।*
*వపుష్మాన్ వీత భీర్వాగ్మీ దూతా రాజ్ఞః ప్రశస్యతే॥*

ప్రజల పట్ల ప్రేమ కలవాడు, పరిశుద్ధుడు, జ్ఞాపకశక్తి కలవాడు, దేశకాలాదుల జ్ఞానం కలవాడు, నిర్భయుడు, వివిధభాషలు తెలిసినవాడిని దూతగా ఎంచుకోవాలి.

అవసరమైనప్పుడు మాత్రమే దూకుడు ప్రదర్శించి, మిగతా సమయాల్లో సందర్భాన్ని బట్టి స్నేహాన్ని ప్రదర్శించటం, లొంగి ఉండగలగటం తెలిసి ఉండాలి. లేకపోతే శక్తిమంతుడి శక్తిని చూసి బెదిరితే ఆ దూత వల్ల నష్టం తప్ప లాభం కలగదు.

*దూత ఏవహి సంధత్తే భినత్త్యేవ చ సంహతాన్।*
*దూత స్తత్కురుతే కర్మ భిద్యంతే యేన మానవా॥*

సంధికీ, యుద్ధానికీ నడుమ ఉండేది దూత. దూత వల్ల సంధి జరగవచ్చు. యుద్ధం రావచ్చు – వీటి నడుమ మధ్యవర్తి వంటివాడు దూత.

మైత్రి శక్తిమంతుల నడుమ మాత్రమే సాధ్యం అన్న విచక్షణను ప్రదర్శించక మన నేతలు అగ్రరాజ్యం ఉచ్చులో బిగుసుకునేందుకు పరుగెత్తటం చూస్తూంటే, గొప్ప సత్యాన్ని వివరిస్తూన్న త్రిమూర్తితత్త్వం బోధనను విస్మరించిన ఫలితం అర్థమౌతుంది.

త్రిమూర్తులే కాక ఇంకా మనకు దేవతలు అనేకులున్నారు. ఈ దేవతలందరూ ఒకో శక్తికి ప్రతీకలు. వాయుశక్తికి వాయుదేవుడు, అగ్నికి అగ్నిదేవుడు... ఇలా దేవతలున్నారు. వీరందరికీ రాజు ఇంద్రుడు. ఇక్కడే మన పూర్వీకులు ప్రతీకలను ఏర్పరచటంలోని ఆలోచన స్పష్టమౌతుంది.

ఇప్పుడేదైతే మనం 'డెలిగేషన్ ఆఫ్ పవర్' అంటూ ఓ వ్యవస్థను ఏర్పరుచుకున్నామో, మానవసమాజానికి ఆ వ్యవస్థ నమూనాను మన దేవతలు ప్రతీకాత్మకంగా ప్రదర్శించారు. ఓ ఆఫీసులో 'జనరల్ మేనేజర్' ఉంటాడు. అతడి కింద వివిధ 'డిపార్ట్‌మెంట్ హెడ్'

లుంటారు. వీరందరికీ 'జనరల్ మానేజర్' అధికారి. కానీ అతడే సర్వాధికారి కాడు. అతడిపై వేరే అధికారులుంటారు.

మన 'దైవవ్యవస్థ'లో కూడా బ్రహ్మవిష్ణుమహేశ్వరులు సకలశక్తులనూ తమలో లయించుకున్నవారు. ఆ శక్తుల వ్యక్తిగతప్రతిరూపాలు ఇతరదేవతలు. ఆ దేవతలపై 'జనరల్ మేనేజర్' లాంటివాడు ఇంద్రుడు. అయితే ఇంద్ర పదవి శాశ్వతం కాదు. ఆ శక్తి సాధించిన ఎవరైనా ఇంద్రపదవి పొందవచ్చు. ఎవరైనా వంద యజ్ఞాలు చేసి, తపస్సు చేసి ఇంద్రుడవవచ్చు. అయితే, ఇంద్రుడైనా, రాక్షసుల దాడిని ఎదుర్కోవాలి. ఎంత శక్తిమంతుడైనా శివకేశవుల రక్షణ అవసరం. వారిని అవసరమైనప్పుడు శరణు వేడాల్సిందే.

అందుకే దేవరాజైన ఇంద్రుడు, ఎవరెవరో చేసే తపస్సులను భగ్నం చేస్తూంటాడు. తన పదవికి ఎసరు పెట్టే యజ్ఞాల దారి మళ్ళిస్తూంటాడు. అధికారి అయినవాడికి కొన్ని భోగాలుంటాయి. అహం ఉంటుంది. అధికారం పోతే ఈ భోగాలు పోతాయన్న భయం ఉంటుంది. అధికారాన్ని పట్టుకు వేలాడాలనిపిస్తుంది. కాబట్టి, అధికారం నిలుపుకునేందుకు అడ్డదారులు తొక్కటానికైనా వెనుకాడని పరిస్థితి వస్తుంది. ఎలాగైనా అధికారం నిలుపుకోవాలని నానా గడ్డీ కరవటానికయినా సిద్ధపడతాడు. దేవుడే అయినా, దేవతల రాజైనా ఇంద్రుడు ఇలా ప్రవర్తించాడు. దేవతల రాజే అయినా 'దైవం' కాకుండాపోయాడు. ప్రజల పూజలు అందుకొనే అర్హత కోల్పోయాడు. 'గోవర్ధనగిరి' ఉదంతంతో శ్రీకృష్ణుడు ఇంద్రపూజకు తెర దించాడు. అంటే, దేవుడైనా తన స్థాయికి తగిన ప్రవర్తన, వ్యక్తిత్వం ప్రదర్శించకుంటే విలువ కోల్పోతాడన్న మాట, అందుకే అధికారం నిలుపుకొనేందుకు పడరాని పాట్లు పడేవారు ప్రజల గౌరవం కోల్పోతారు. తన కిందివాడు ఎక్కడ తన స్థానానికి భంగం కలిగిస్తాడోనని అనుచితంగా, అక్రమంగా ప్రవర్తించేవారు నిరాదరణకు గురవుతారు. వారి అధికారం తాత్కాలికంగా నిలబడినా, వారికి గౌరవం దక్కదు. ఆ అధికారస్థానచ్యుతి కలిగిన తరువాత అతడిని పట్టించుకునే వారుండరు.

ఎంతో సున్నితంగా, ప్రతీకాత్మకంగా ఈ విషయాన్ని మన పూర్వికులు పురాణాలలో దేవతల పాత్రల ద్వారా బోధించారు. ఈ నాడు అర్హత లేని అనేకులు నిర్ణయాత్మకస్థానాలు ఆక్రమిస్తున్నారు. వారికి ప్రతిభ ఉన్నవారిని చూస్తే భయం. తమ అధికారం పోతుందేమోనని  అనుక్షణం ఆత్రుత చెందుతూంటారు. కాస్త ప్రతిభ, నైపుణ్యం

ప్రదర్శించేవాడిని చూసి బెదురుతారు. వాడిని అణిచేస్తే కానీ సంతృప్తి చెందరు. దాని వల్ల తమకే కాదు, సమాజానికీ హాని కలుగుతోందన్న విషయం గమనించరు. ఇటువంటి వారు అధికారులైనా గౌరవం పొందరని 'ఇంద్రుడి' ద్వారా ప్రతిభావంతంగా మనకు మన పూర్వులు బోధిస్తున్నారు. గమనిస్తే, ఇక్కడే వ్యక్తిత్వవికాసంలోని మరో సూక్ష్మమైన అంశం బోధపడుతుంది.

ఇంద్రుడు తన పదవి నిలుపుకోవటం కోసం ఆరాటపడ్డాడు. ఎవరూ తన స్థాయికి ఎదగకూడదని తపనపడ్డాడు. ఎదుగుతున్నవాడిని అణిచేయాలని ప్రయత్నించాడు. ఇటువంటి ప్రవర్తన త్రిమూర్తులలో కనబడదు. శివుడు కైలాసాన్ని పట్టుకుని వేలాడలేదు. విష్ణువు వైకుంఠం కోసం పాకులాడలేదు. అవసరమైనప్పుడల్లా తమ నివాసాలను వదిలేశారు. విష్ణువు అనేక అవతారాల ద్వారా లోకకల్యాణం గావించాడు. అంటే, అర్హత కలవాడు. తన శక్తి పట్ల అవగాహన, ఆత్మ విశ్వాసాలు కలవాడు 'అధికారం' కోసం వెంపర్లాడడు. దాన్ని నిలుపుకోవటం కోసం అక్రమాలకు పాల్పడడు. పైగా కింద ఉన్నవారిని సైతం తన స్థాయికి ఎదిగేటట్టు చేయాలని ప్రయత్నిస్తాడు. లేకపోతే, నరావతారం ఎత్తి 'రాముడి'లా ఆదర్శవ్యక్తిత్వం ప్రదర్శించాల్సిన అవసరం విష్ణువుకు లేదు. శ్రీకృష్ణుడై 'భగవద్గీత'ను ప్రపంచానికి ఇవ్వాల్సిన అవసరమూ లేదు. 'నటరాజై' నృత్యకళను అందించి కళ ద్వారా భగవదర్చనమార్గం సూచించాల్సిన అవసరం శివుడికి లేదు. ఉత్తమవ్యక్తిత్వానికి ఇది నిదర్శనం. వీరెవరూ ఎవరి తపస్సులనూ భంగం చేయలేదు. తపస్సులను ప్రోత్సహించారు. అనుగ్రహించి ఆదరించారు. అందుకే ఈ త్రిమూర్తుల బలహీనతలు కూడా లోకకల్యాణ కారకాలయ్యాయి అధికారి మనస్సు ఉన్నతమై, నిజాయితీ ఉంటే అతడి ప్రతి చర్య సమాజానికి శ్రేయస్సు కలిగిస్తుంది.

*అయుక్తం స్వామినో యుక్తం యుక్తం నీచస్య దూషణమ్ ।*
*అమృతం రాహవే మృత్యుర్విషం శంకర భూషణమ్ ॥*

యుక్తం కానిది కూడా ప్రభువుకు యుక్తమే. యుక్తమైంది కూడా నీచునికి దోషమే. అమృతం రాహువుకు మృత్యుకారణం అయింది. మరో వైపున విషం కూడా శంకరుడికి కంఠాభరణం అయింది.

## పూలమాల

*కనకపు సింహాసనమున*
*శునకము గూర్చుండబెట్టి శుభలగ్నమునం*

*దొనరగ బట్టము గట్టిన*
*వెనుకటి గుణమేల మాను, వినరా, సుమతీ!*

*తిరుపతికిని బోవ తురక దాసరి గాడు*
*కాశికేగ పంది గజము కాదు*
*కుక్క సింహమగునె గోదావరికి బోవ*
*విశ్వదాభిరామ వినుర వేమ!*

సుప్రసిద్ధమైన ఈ రెండు పద్యాలూ అధికారస్థానంలో కూర్చునేవారికి గొప్ప 'మేనేజ్‌మెంట్' పాఠాలు చెప్తున్నాయి. ఇక్కడ అధికారి 'అర్హత' గురించిన ప్రశ్న వస్తోంది. అధికార స్థానంలో ఉండేవాడి 'అర్హత' ఎవరు నిర్ణయించాలి?

ప్రస్తుతసమాజంలో ఏదైనా స్థానం ఆక్రమించాలంటే పరీక్షలు, ఇంటర్వ్యూలు అలవాటుగా ఉన్నాయి. పరీక్షలలో జనరల్ నాలెడ్జ్ మొదలు కొన్ని కొన్ని అంశాల గురించి ప్రశ్నలుంటాయి. ఆ పరీక్షల్లో నెగ్గితే 'ఇంటర్వ్యూ' ఉంటుంది. పరీక్షకు తయారయ్యేందుకు పుస్తకాలున్నాయి. కోచింగ్ క్లాసులున్నాయి. ఇంటర్వ్యూలో అడుగుపెట్టినప్పటినుంచి అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం వరకూ కూడా రకరకాల పుస్తకాలు వివరిస్తాయి.

ఇటీవలి కాలంలో ఈ పద్ధతి మార్పు చెందింది. టెలిఫోన్ ఇంటర్వ్యూలు, నెట్ సంప్రదింపులతో ఉద్యోగాలు వచ్చేస్తున్నాయి. ఒకరి ముఖాలు ఒకరికి తెలియకుండా, ఒకరి గురించి మరొకరికి పరిచయం లేకుండా వ్యక్తుల ఎంపిక జరుగుతుంది. అంటే 'పద్ధతి' మారినా 'ఫలితం' మాత్రం అదే అన్నమాట.

'అర్హత' అన్నదాన్ని గుర్తించేందుకు ఎన్ని పథకాలు ఏర్పరచినా, మౌలికంగా వ్యక్తికి తనకు బాధ్యత నిర్వహించే అర్హత ఉందో, లేదో అన్నది తెలుస్తుంది. ఆశ ఉండటం వేరు. అర్హత ఉండటం వేరు. దాంతో మనసులో 'అర్హత' లేదని తెలుస్తున్న వ్యక్తి అర్హత లేని స్థానాన్ని సాధిస్తే అనేక సమస్యలు ఉత్పన్నమౌతాయి. మానసికంగా, సామాజికంగా ఈ స్థితి ఎంతో ప్రమాదకరమైంది.

మహాభారంతలో విరాటపర్వం ఉంది. పాండవులు అజ్ఞాతవాసంలో విరాటుడి రాజ్యంలో ఉంటారు. వారిని బయటపెట్టేందుకు కౌరవులు, విరాటుడి గోవులను తోలుకుపోతారు. ఆ సమయంలో సైన్యమంతా మరో వైపు ఉండటంతో 'ఉత్తరం' వైపు

గో[గ్రహణాన్ని ఛేదించేందుకు 'ఉత్తరకుమారుడు' మిగులుతాడు. గోవులను విడిపించేందుకు ఉత్తరుడు యుద్ధానికి వెళ్ళాలి. కాని ఒక్కడే ఎంత గొప్ప వీరుడైనా భీష్మ, ద్రోణ, కర్ణ, కృపాశ్వత్థామాది మహావీరులను ఎదుర్కోవటం కుదరదు. కానీ ఆ నిజాన్ని ఒప్పుకోవటానికి ఉత్తరుడి 'అహం' ఒప్పుకోలేదు. దాంతో మానవసహజమైన ప్రగల్భాలు పలుకుతాడు. అది చేస్తాను, ఇది చేస్తాను అని చెప్పి, చివరకి సారథి లేకపోవటం వల్ల యుద్ధానికి పోలేకపోతున్నానంటాడు.

*ఎత్తున గొందు గౌరవుల నెల్లను*
*మార్కొని రేని గోవులం*
*దెత్తు ముహూర్తమాత్రమున దేరికి సారథి*
*లేమి జేసి నా*
*చిత్తమునన్ విచారదశ చెందెదు నెవ్వడు*
*గల్గు నొక్కొ నా*
*కిత్తరి నే గదా కడప నెంతయు నేర్తు*
*రథం బనం బురిన్.*

ఈ కాలంలో సినిమా, టీవి రచయితలు 'నాటకీయత' సృష్టించడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఆ డ్రామాను అత్యంతసహజంగా అద్భుతంగా సృష్టించాడు. తిక్కన. తన శక్తికి మించి గొప్పలు పలుకుతాడు. ఉత్తరుడు. రథాన్ని నడిపిస్తానని బృహన్నల ముందుకు రావటంతో ఇరుకున పడతాడు. తన అర్హతను గుర్తించకుండా, సరైన అంచనా వేయకుండా అహంకారంతో బాధ్యతలను స్వీకరించే దూకుడు ప్రదర్శించేవారి గతి, ఉత్తర కుమారుడి గతి అవుతుంది. వారు అభాసు పాలవటమే కాదు, అందువల్ల వారు అధికారం నెరపే సంస్థకు కూడా నష్టం వాటిల్లుతుంది.

అందుకే 'అధికార' స్థానంలో ఉన్న వ్యక్తి తన శక్తియుక్తులను సరిగ్గా అంచనా వేసుకోవాలి. తన కిందివారిలో ప్రతిభను గుర్తించాలి. వారిని గౌరవిస్తూ, వారి నుండి ఉత్తమరీతిలో పనిని రాబట్టాలి. అలా కాక 'నేను అధికారిని కాబట్టి నన్ను అందరూ గౌరవించాలి' 'నా మాటకు ఎవరూ ఎదురు చెప్పే వీలు లేదు.' అన్నట్టు ప్రవర్తిస్తే మొదటికే నష్టం వస్తుంది. తన స్థాయికి తగ్గ గౌరవం లభించటం లేదన్న బాధ ప్రదర్శించి, 'అధికారం' ద్వారా ఆ గౌరవాన్ని పొందాలని ప్రయత్నిస్తే, కోరిన గౌరవం దక్కటం అటుంచి ఉన్న గౌరవం కూడా కోల్పోయే పరిస్థితి వస్తుంది.

ఇంద్రుడు దేవతల రాజు. అగ్ని, వాయువు, వరుణుడితో సహా పలువురు దేవతలు అతడి చెప్పుచేతల్లో ఉంటారు. ఇంద్రుడు తలచుకుంటే వర్షాలు పడతాయి. లేకపోతే వర్షాలు పడవు. కోపం వస్తే వరదలొస్తాయి. తుఫాను గాలులు వీస్తాయి. అందుకే అందరూ తనని పూజించాలి అనుకున్నాడు. తనని పూజించనివారిని శిక్షించి, లొంగదీసుకోవాలని అనుకున్నాడు. యాదవులపై విరుచుకుపడ్డాడు. తనని పూజించమని, గౌరవించమని ఒత్తిడి తెచ్చి, బలప్రయోగం చేసేవాడు ఎంత శక్తిమంతుడైనా ప్రజల గౌరవం పొందలేడు. అలా గౌరవాన్ని డిమాండ్ చేయటం వల్ల ఉన్న గౌరవాన్ని కోల్పోతాడు. ఇంద్రుడి విషయంలో అదే జరిగింది. గోవర్ధనగిరి నెత్తి శ్రీకృష్ణుడు ఇంద్రుడి గౌరవానికి గండికొట్టాడు. అర్హతారాహిత్యాన్ని గుర్తించకుండా, గౌరవం డిమాండ్ చేసే వారందరికీ తిరుగు లేని గుణపాఠాన్ని నేర్పించాడు.

ఇక్కడే మేనేజర్ స్థాయిలో ఉన్నవారు ఓ విషయం గమనించాలి. వారు తమ అర్హత గురించి స్పష్టమైన అవగాహనను ఏర్పరచుకోవాలి. తమ శక్తియుక్తులను సరిగ్గా బేరీజు వేసుకోవాలి. ఏ వ్యక్తి అయితే తన శక్తితో పాటు తన బలహీనతలను కూడా గుర్తిస్తాడో ఆ వ్యక్తి సగం విజయం సాధించినట్టే. ఆ తరువాత తన కింద పనిచేసేవారి ప్రతిభను అర్థం చేసుకోవాలి. ఆపైన వారి ఆధారంగా తన బలహీనతలను తన 'శక్తి'గా మలచుకోవాలి.

ఒక వ్యక్తి తనను గౌరవించమని, గుర్తించమని ఎవరినీ బతిమలాడనక్కరలేదు. మొదట, వ్యక్తి స్థానాన్ని బట్టి అతడికి గౌరవం లభిస్తుంది. ఆపై, ఆ గౌరవాన్ని నిలబెట్టుకోవటమా, లేదా అన్నది అధికారంలో ఉన్న వ్యక్తి ప్రవర్తనపై ఆధారపడి ఉంటుంది.

*కింఖలు రత్నై రేతైః*
*కింపునర భ్రాయతేస్న వపుషాతే*
*సలిల మపియన్న తావక నామ్*
*మర్ణవ వదనం ప్రయాతి తృషితా ॥*

సముద్రుడు ఎంత గొప్ప వాడైనా లాభం లేదు. ఎంతో విశాలంగా పరచుకుని ఉంటాడు. అపారమైన రత్నసంపద అతడిలో దాగుంటుంది. కానీ అవేవీ ఉపయోగపడవు. దాహం తీర్చలేవు. ఇక సముద్రుడెంత గొప్పవాడైనా లాభం ఏముంది? కాబట్టి, అధికారి

అయినవాడు బిగదీసుకు కూర్చుని గౌరవం పొందలేడు. అన్నీ తనకే తెలుస్తున్నట్టు ప్రవర్తించటం వల్ల తన క్రింది వారి మెప్పు పొందలేడు. అకారణంగా, అనవసరంగా కిందివారిని దూషించి, వారిలో తప్పులు వెతికి, వారిని బెదిరించి సాధించగలిగేదేమీ లేదు. తన కిందివారిపై అధికారం చలాయించి అహాన్ని సంతృప్తి పరచుకోవటం వల్ల అధికారికి ఒనగూడేదేమీ లేదు.

*కరోతు కరటశ్శబ్దమ్ సర్వదా ప్రాంగణే వసన్,*
*శశృణోతి బుధః ప్రీత్యా శృణోతి పిక భాషితమ్ ।*

కాకులు ఎప్పుడూ అరుస్తూంటాయి. అందరూ వాటిని చూసి విసుక్కుంటారు. కాకి గోల అని కొట్టేస్తారు. అదే కోయిల ఒక్కసారి కూయగానే, ఆనందిస్తారు. కోకిల స్వరం కోసం చెవులు రిక్కిస్తారు.

ప్రతి చిన్న విషయానికీ చిటపటలాడే అధికారి పరిస్థితి 'కాకి' పరిస్థితి అవుతుంది. అతడి మాటలను పట్టించుకోవటం మానేస్తారు. 'ఆ ఏదో అరుస్తాడులే' అని తీసిపారేస్తారు. అంటే, ఏ గౌరవం ఆశించి అధికారి తన ఆ అధికారాన్ని ప్రయోగిస్తాడో, ఆ గౌరవమే అధికారికి లభించటం లేదన్నమాట.

ఆ సందర్భంలో మరో విషయం ప్రస్తావించుకోవాలి. ఎప్పుడైతే వ్యక్తిలో అర్హత లేకున్నా, తాను ఉన్నతస్థానం ఆక్రమించాడన్న భావన కలుగుతుందో, అప్పుడు ఆ వ్యక్తిలో న్యూనతాభావం కలుగుతుంది. అందరూ తనని తక్కువగా చూస్తున్నారన్న ఆలోచన కలుగుతుంది. అందరూ తన గురించి మాట్లాడతున్నారని, హేళన చేస్తున్నారన్న భయం కలుగుతుంది. అటువంటప్పుడే అధికారి తన అధికారాన్ని ప్రదర్శించాలని ప్రయత్నిస్తాడు. భంగపడతాడు.

అధికారిలోని ఈ ఆత్మవిశ్వాసరాహిత్యాన్ని కిందివారు సులభంగా అర్థం చేసుకుంటారు. దాన్ని మరింత ఎగదోస్తారు. ఇంకొందరు ఈ ఆత్మవిశ్వాసరాహిత్యాన్ని తమ కనువుగా ఉపయోగించుకుంటారు. అతడిని పొగడుతూ, అతడి ఆశ్రయం సంపాదిస్తారు. పబ్బం గడుపుకుంటారు. కాబట్టి, అందరూ అన్ని విషయాల్లో నిష్ణాతులు కాలేరన్న విషయం అధికారి గ్రహించాలి. తన స్థానాన్ని, ఆ స్థానం ఇచ్చిన అధికారాన్ని సక్రమంగా ఉపయోగించే విచక్షణ ప్రదర్శించాలి. అప్పుడు అతడి అనర్హత కూడా అర్హతగా మారిపోతుంది. అతడికి అర్హత లేదని చులకనగా చూసేవారే, అతడి విచక్షణకు దాసోహం

అంటారు. అహంకారంతో, అధికార ప్రయోగంతో సాధించ లేనిదాన్ని విచక్షణతో, వినయంతో సాధించవచ్చు. గమనిస్తే, పూర్వకాలంలో రాజులు అవసరమైతే, అట్టడుగున ఉన్నవారి ముందు మోకరిల్లి విజ్ఞానాన్ని గ్రహించిన దృష్టాంతాలు అనేకం ఉన్నాయి. భృగుమహర్షి తన వక్షస్థలం మీద తన్నినా దాన్ని విష్ణుమూర్తి చిరునవ్వుతో స్వీకరించటం మనకు తెలుసు. తన శక్తిని అవగాహన చేసుకున్న వ్యక్తి ప్రవర్తన ఇలా ఉంటుంది. అందుకే అధికారి అన్నవాడు 'అర్హత' గురించి ఆలోచించటమూ, విచక్షణతో, వినయంతో 'నేర్చుకోవటమూ' నేర్చుకోవాలి. మంచి ఎక్కడ ఉన్నా గౌరవించటం నేర్చుకోవాలి.

*యథాపి రుచిరం పుష్పం నణ్ణవంతం అగస్థకం*
*ఏవం సుభాషితా వాచా న ఫలాహోతి కశ్చన ।*

పూలను రాసులుగా పోసినా వాటిలో మంచివాటిని, సువాసన కలవాటినే మాలగా గుచ్చుతాం. అలాగే అధికారి మంచి గుణాలనే ఎంచుకుని వాటిని పెంచుకోవాలి.

ఇవి కేవలం ఉద్యోగంలో అధికారంలో ఉన్నవారికేకాదు, నిత్యజీవితంలో సోదరుడిలా, మిత్రుడిగా, తండ్రిగా, భర్తగా రకరకాల పాత్రలు పోషించే ప్రతివ్యక్తికీ వర్తిస్తాయి.

## బుద్ధిమంతుడు

*అవిద్యాయా మంతరే వర్తమానా ః*
*స్వయం ధీరాః పండితం మన్యమానాః*
*దంద్రమ్యమాణాః పరియన్తి మూఢాః*
*అంధేనైవ నీయమానా యథాంధాః*

కఠోపనిషత్తులోని ఈ శ్లోకం అధికారంలో ఉన్నవాడు అంధుడైతే కలిగే పరిస్థితిని చక్కగా సూచిస్తుంది. గాఢమైన అజ్ఞానంలో కూరుకుపోయి ఉన్న మూర్ఖులు తామే ప్రజ్ఞావంతులూ, గొప్ప విద్వాంసులూ అనుకుంటూ గుడ్డివాళ్ల చేత నడిపించబడే గుడ్డివాళ్లలాగ తూలుతూ, తడబడుతూ సుడులు తిరుగుతుంటారు.

మన పూర్వికులలోని గొప్పతనం ఇదే. ఒక శ్లోకాన్ని రచిస్తారు. దాన్ని ఎవరు ఏ దృష్టితో చూస్తే అలా అర్థమౌతుంది. మౌలిక అర్థం ఒకటే అయినా, సందర్భాన్ని బట్టి వివరణకు వీలుంటుంది. ఏ సందర్భంలో ఎటువంటి సంశయాలు ఎదురైనా వాటికి

సమాధానం లభిస్తుంది. సరైన అధ్యాపకుడు లేని విద్యార్థి గతిని ఈ శ్లోకం సూచిస్తుంది. సరైన నాయకుడు లేని దేశం గతిని ఈ శ్లోకం వివరిస్తుంది. సరైన ఆదర్శం లేని జీవితాలను వర్ణిస్తుంది. సరైన అధికారి లేని కార్యాలయాన్ని కళ్ల ముందు నిలుపుతుంది.

'అధికారి' తన కిందివారికి దారి చూపాలి. వారికి మార్గదర్శనం చేయాలి. వారిలో ప్రతిభను గుర్తించాలి. ప్రోత్సహించాలి. పని చేయనివారికి పని చేసే ప్రేరణ ఇవ్వాలి. పని చేస్తున్న వారు మరింతగా పని చేసేటట్టు ఉత్సాహాన్నివ్వాలి. ఇంత చేస్తూ, అధికారి అన్నవాడు ఉత్తమ ప్రవర్తనకు ప్రతీకగా నిలవాలి. కామక్రోధ లోభ మోహావేశ పరవశుడవకూడదు. మదమాత్సర్యాలకు లొంగకూడదు. అధికారికి తన బాధ్యత తెలిసి ఉండాలి. నిర్ణయాత్మకస్థానంలో ఉండటం వల్ల అనేకప్రాధాన్యం కల నిర్ణయాలు తాను తీసుకోవాల్సి ఉంటుందని, వాటి ప్రభావం భవిష్యత్తు తరాలపై ఉంటుందన్న గ్రహింపు ఉండాలి. అందుకే క్షణికావేశాలకు, అసూయలకు, ద్వేషాలకు లొంగకూడదు.

ఎప్పుడైతే పై అధికారి సత్ప్రవర్తన కలవాడై ఉంటాడో, అప్పుడు అతడి కిందివారు కూడా భయంతోనైనా సత్ప్రవర్తన వైపు మళ్లుతారు. అలా కాక అధికారి అవినీతిపరుడై ఉంటే, కింది వారూ అవినీతి వైపు మళ్లుతారు. గుడ్డివాడు గుడ్డివాడికి తోవ చూపించి నట్టవుతుంది. అందరూ అధఃపాతాళానికి దిగజారిపోతారు. అందుకే, అధికారంలో ఉన్నవారు గ్రహించవలసిన ప్రధానాంశం. తాము భావితరాల వారికి జవాబుదారీ అన్న విషయం.

ఈ అధికారం కేవలం దేశం పైనే కానక్కర లేదు. ఓ కంపెనీ అధికారి అయినా, పాఠశాల ప్రిన్సిపాల్ ఐనా, పత్రిక సంపాదకుడైనా, ఇంటి పెద్ద అయినా అందరూ తమపై భగవంతుడుంచిన విశిష్టమైన బాధ్యత స్వరూపాన్ని అర్థం చేసుకోవాలి. తను కర్తవ్యతా నిర్వహణవల్ల భవిష్యత్తుపై తాము చూపే ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. ఇది జరగని నాడు, అంతా తమకే తెలుసని, తానే విద్వాంసుడు, ప్రజ్ఞావంతుడు అనుకుని అహంకారంతో ప్రవర్తిస్తే తనకు తానే కాదు, సమస్తసమాజానికీ అన్యాయం చేసిన వాడవుతాడు.

*న సాంపరాయః ప్రతిభాతి బాలం*
*ప్రమాద్యంతం విత్తమోహేన మూఢమ్!*
*అయం లోకోనాస్తి పర ఇతిమానీ*
*పునః పునర్వశ మాపద్యతే మే!!*

అజ్ఞానులు, అవివేకులైన మనుష్యులకు, ధనమదంతో మతిపోయినవారికీ శ్రేయోమార్గం ఎన్నటికీ కనిపించదు. ఉన్నది ఈ లోకమే, మరో లోకం లేదనుకునేవారు మళ్ళీ మళ్లీ చస్తూ పుడుతుంటారు. ఇక్కడ 'బాలుడు' అన్న సంస్కృతశబ్దానికి అర్థం బాల్యంలో ఉండే అవివేకాన్ని, అజ్ఞానాన్ని ఎదిగినా కొనసాగించేవారని అర్థం.

మనం అనేక అధికారులను, మేనేజర్లనూ చూస్తుంటాం. అసూయాద్వేషాలు కనబరుస్తూ, చిన్నపిల్లల్లా అలుగుతూంటారు. అటువంటి వారు సామాజికంగా ఉన్నతస్థాయికి ఎదిగినా, వారి మనసు వికసించలేదని అర్థం. ఎవడో ఏదో అన్నాడని తనని విమర్శించాడని, తన మాట వినలేదని, తనకు ఎదురు చెప్పాడని, తన కన్నా ఎక్కువ తెలివి ప్రదర్శిస్తున్నాడని ఇలాంటి వ్యక్తిగతకారణాల వల్ల అసూయ ప్రదర్శించే వారంతా చిన్నపిల్లలే. వయసు ఎంత వచ్చినా వారిలోని 'అజ్ఞానబాలుడు' అలాగే ఉన్నాడన్నమాట. అందుకే అనేక నేతలు పసిపిల్లలకన్నా కనాకష్టంగా పోరాడుకోవటం, అసూయాద్వేషాలు ప్రదర్శించడం మనం చూస్తున్నాం. ఓ నేత అధికారానికి రాగానే, పాత నాయకుడి నిర్ణయాలను రద్దుచేయడం, అవినీతి ఆరోపణలు చేయడం పైనే దృష్టి పెడతాడు. దాని వల్ల పాత నేత మీద కసి తీరుతుందేమో కానీ పాలన అడుగంటి పోతుంది.

అలాగే, ఇద్దరు వ్యక్తులు ఏదో మాటలనుకుంటారు. ఇంతలో వారిలో ఒకడి చేతికి అధికారం వస్తుంది. ఆ వెంటనే వాడు రెండవవాడిపై కక్ష సాధింపు చర్య తీసుకోవటం, మొదటివాడిలోని 'బాలుడి'ని చూపిస్తుంది. పసిపిల్లలు కాలుజారి పడతారు. పిల్లవాడిని ఓదార్చేందుకు పెద్దలు 'హమ్మా' అంటూ నేలను కొట్టినట్టు నటిస్తారు. బాధ మరచి పిల్లవాడు కిలకిల నవ్వుతాడు. గమనిస్తే, ఓ నేత అధికారానికి రాగానే, పాత నేత పదవులలో నియమించిన వారందరినీ కసికసిగా ట్రాన్స్‌ఫర్లు చేసేస్తాడు. వారి స్థానాల్లో తనవారిని నియమించుకుంటాడు. ఇంతలో వేరే నేత అధికారానికి వస్తే మళ్లీ ట్రాన్స్‌ఫర్ల పర్వం మొదలు. అంటే ఎప్పుడైతే అధికారంలో ఉన్నవాడు తన అధికారాన్ని వ్యక్తిగతకక్షసాధనకు ఉపయోగిస్తూ, పిల్లవాడిలా ప్రవర్తిస్తాడో అప్పుడు ఆ సంస్థ, సమాజం దెబ్బ తింటాయన్నమాట.

ఇక్కడ 'అవినీతి' అంటే కేవలం ధన సంబంధిత అక్రమవ్యవహారం మాత్రమే కాదు. నీతి బాహ్యమైన ప్రతీదీ అవినీతి కిందికే వస్తుంది. ప్రస్తుతసమాజంలో 'అవినీతి'కి సంకుచితార్థం ప్రచారంలో ఉంది. కానీ అధికారి నీతిబాహ్యమైన ప్రవర్తన సర్వం 'అవినీతి' కిందికి వస్తుంది. అధికారి సహృదయంతో, బాధ్యత నెరిగి ప్రవర్తిస్తే ఉత్తముడవుతాడు.

ఉత్తమ ఆదర్శం నిలిపిన వాడవుతాడు. తనకు నచ్చకున్నా, ప్రతిభ ఉంటే తననెదిరించి నిలిచినవాడిని సైతం గౌరవించి, ఆదరించి వాడి ప్రతిభను సమాజశ్రేయస్సుకు వాడుకునే విశాలహృదయం ప్రదర్శిస్తే సమాజానికి మేలు చేసినవాడవుతాడు. సమాజం ముందు ఉత్తమాదర్శం నిలిపినవాడవుతాడు. అలా కాక, వ్యక్తిగత కక్షలకు, ఆకాంక్షలకు, అసూయాద్వేషాలకు తావిస్తే అతడు 'అవినీతి'పరుడే అవుతాడు. చేసిన తప్పులే చేస్తూ తానూ దిగజారతాడు. నమ్మినవారినీ దిగజారుస్తాడు.

*శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేత*
*స్తౌసంపరీత్య వివినక్తి ధీరః*
*శ్రేయోహి ధీరోఽ భిప్రేయసో వృణీతే*
*ప్రేయో మందో యోగక్షేమాత్ వృణీతే*

శుభకరమైందీ, సుఖకరమైందీ రెండూ మానవుడిని సమీపిస్తాయి. బుద్ధిమంతుడు రెంటినీ విశ్లేషించి, వివేచించాలి. సుఖకరమైనదాని కంటే, శ్రేయస్కరమైందే మేలని ఎన్నుకుంటారు. కానీ బుద్ధిహీనుడు లోభం చేత, ఆసక్తి చేత, సుఖకరమైందాన్నే కోరుకుంటాడు. మేనేజర్లకు గొప్ప వ్యక్తిత్వవికాససూత్రం ఇది. విద్యార్థికి, విచక్షణ నేర్పే సూత్రమిది. ప్రతి వ్యక్తికీ మంచి, చెడుల నడుమ తేడా చూపి మంచిని ఎంచుకోమని నేర్పే సూత్రం ఇది. భారతంలో ద్రోణాచార్యుడి పాత్ర ఎన్నో అపోహలకు గురైన పాత్ర. కానీ విచక్షణకు పరాకాష్ఠ ఆ పాత్ర. అర్జునుడు ద్రోణుడి శిష్యుడు. ఏకలవ్యుడు ద్రోణుడి పరోక్షశిష్యుడు. అర్జునుడి కన్నా విలువిద్యలో ప్రావీణ్యం గురుసంస్మరణ మాత్రంతో సాధించినవాడు. అతడిని శిష్యుడుగా స్వీకరించి గొప్పతనాన్ని ఆపాదించుకోవటం సుఖకరం. ఎటువంటి కష్టం లేకుండా గొప్పతనం వచ్చేస్తుంది. కానీ అర్జునుడు ఉత్తమవిలుకాడుగా నిలవటం శుభకరం. ఎందుకంటే, అర్జునుడు ధర్మం వైపు నిలబడతాడు. ఏకలవ్యుడు కౌరవులకు సహాయం చేస్తాడు. అందుకని సుఖం కన్నా శుభానికి ప్రాధాన్యం ఇచ్చాడు ద్రోణుడు. శాశ్వతంగా 'పక్షపాతి' అన్న అపప్రథకు గురయ్యాడు. కానీ శుభానికి ప్రాధాన్యం ఇవ్వటం వల్ల లోకకల్యాణం జరిగింది. ఈ విచక్షణను అధికారంలో, నిర్ణయాత్మక స్థానాల్లో ఉన్నవారు అర్థం చేసుకోవాలి, ప్రదర్శించాలి.

సాధారణంగా అధికారంలో ఉన్నవారి దగ్గరకు అనేక ఆకర్షణలు వస్తాయి. అనేకులు అడగకుండానే వారికి సేవలు చేస్తారు. బహుమతులిస్తారు. అది సుఖమార్గం.

కష్టపడకుండా ఎన్నో ఎన్నెన్నో సంపాదించే సులభ మార్గం. ధనం నుంచి కీర్తి వరకూ అన్నీ వారిని వెతుక్కుంటూ వస్తాయి. కానీ ఇలాంటివి స్వీకరించటం 'అవినీతి'. ఎందుకంటే, ఇలా సేవలు చేసేవారికి స్వార్థం ఉంటుంది. కానీ పొగడ్తలు, వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు లొంగకుండా సమాజానికి శుభకారకమైనవాటి పైకి దృష్టి నిలపటం అధికారి వ్యక్తిత్వానికి నిదర్శనం. అటువంటి వారి వల్ల సమాజానికి సరైన ఆదర్శం లభిస్తుంది. సమాజం సక్రమదిశలో ప్రయాణిస్తుంది.

ఓ సారి వివేకానందుని వద్దకు ఓ వ్యక్తి వచ్చాడు. గోవుల రక్షణకు నిధులు సేకరించటంలో సహాయం చేయమన్నాడు. ఆ సమయంలో దేశంలో కరవుకాటకాలు సంభవించి ఉన్నాయి. ప్రజలు ఆకలితో మరణిస్తున్నారు. అతడికి వివేకానందుడి సమాధానం ఉత్తమ ఆదర్శానికి నిలువెత్తు దర్పణం. 'దేశంలో కరవు సంభవించింది. దానికి మీరేమైనా సహాయం చేస్తున్నారా?' అని అడిగాడు. 'కరువు మనిషి దుష్కర్మల ఫలితం. దానికి మనమేం చేయగలం?' అన్నాడా వ్యక్తి. 'సాటి మనిషి కష్టానికి స్పందించనివాడు మనిషి కాదు. మనుషులు కర్మ వల్ల కరవు బారిన పడితే, ఆవు కర్మ వల్ల కసాయి చేతిలో పడుతుంది పో'మ్మన్నాడు వివేకానంద. అంటే గోరక్షణ మన ధర్మంలో భాగమైనా, మనిషిని విస్మరించటం మానవత్వం కాదన్నమాట. ఈ విచక్షణను ప్రతి అధికారీ అర్థంచేసుకోవాలి. నియమాలు, నిబంధనలు, వ్యక్తిగత ఇష్టాయిష్టాలు, సూత్రాలు ఎన్నెన్ని ఉన్నా మనిషికి పెద్ద పీట వేయాలి. మనిషి ప్రతిభకు పట్టంగట్టాలి. కానీ వ్యక్తిత్వవికాసం లేనిదే విచక్షణ అలవడటం కష్టం. అందుకే ఈ నాడు తెలివైనవారు, ప్రతిభ కలవారు అనేకులు ఉన్నా అవి పరాయివారికి ఉపయోగపడుతున్నాయి. మనం రాళ్లు అని పారేసిన రత్నాలు, పొరుగుదేశాలను తమ ధగధగలతో కాంతిమయం చేస్తున్నాయి. ఇందుకు ప్రధాన బాధ్యత నిర్ణయాత్మకమైన స్థానాలలో ఉన్నవారిదే. ఎందుకంటే తమ అధికారం ప్రలోభంలో పడి, అధికారం ఇచ్చిన శక్తి మోహంలో పడి వారు విచక్షణను మరచిపోతారు. అందుకే అన్నిటి కన్నా గొప్ప మత్తు మందు 'అధికారం' అంటారు. దాని మత్తులో పడ్డవారికి రక్షణ లేదు. ఈ నిజాన్ని గ్రహించే మన పూర్వికులు అధికారం భగవద్దత్తం అని, అధికారి కేర్ టేకర్ లాంటివాడని, అధికారం ఇవాళ ఉంటుంది, రేపు పోతుంది, శాశ్వతంగా నిలిచేది ధర్మమేనని, అందరిలో భగవదంశ ఉంటుంది, హెచ్చుతగ్గులు లేవనీ బోధించారు. నిజానిజాలు నిక్కచ్చిగా చెప్పారు. అర్థం చేసుకున్నవారికి అమృతం లభిస్తుంది. లేనివారికి అమృతం కూడా విషమే అవుతుంది.

## కులంగరళం

*చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః ।*
*తస్య కర్తార మపి మాం విద్ధ్యకర్తార మవ్యయమ్ ॥*

గుణకర్మల ననుసరించి మనుషులను నాలుగు వర్ణాలుగా నేనే విభాగించాను. ఆ వర్ణ విభాగానికి కర్తను నేనే విభాగించాను. ఆ వర్ణవిభాగానికి కర్తను నేనే. అకర్తను నేనే. అంటే ఈ విభాగాన్ని చేసినా చేయనివాడనవుతాను.

భారతీయసమాజాన్ని, ప్రస్తుతం అతలాకుతలం చేస్తున్న సమస్య 'కులం'. 'కులం' ఆధారంగా ఒకే దేశప్రజల నడుమ ద్వేషభావనలు చెలరేగుతున్నాయి. 'కులం' ఆధారంగా సోదరులు శత్రువులు అవుతున్నారు. ఈ కులాల ఆధారంగా ఉత్తములు కూడా వ్యక్తిత్వం దెబ్బ తినే రీతిలో ప్రవర్తించే సందర్భాలు ఉత్పన్నమవుతాయి.

కారణం తెలియని విషయాలు భయాలను కలిగిస్తాయి. అజ్ఞానం విచక్షణను హరిస్తుంది. 'కులం' విషయంలో కూడా సరైన అవగాహన లేకపోవటం అనేక అపార్థాలకు దారి తీస్తుంది. ఒకే చోట కలిసి పని చేసేవారిలో, ఒకే తరగతిలో కూర్చునేవారిలో, ఇరుగుపొరుగున ఉండేవారిలో, ఇలా ప్రతివ్యక్తి మరో వ్యక్తితో సమన్వయం సాధించటంలో 'కులం' అనే అదృశ్యమైన అడ్డు గోడ నిలుస్తోంది. ఉన్నతస్థాయిలో ఉన్న అధికారులు, అత్యున్నతస్థాయిలో ఉన్న నాయకుల దగ్గర నుంచి అట్టడుగున ఉన్న వ్యక్తుల వరకూ, ఎవరినీ వదలటం లేదు 'కుల' భావన. ఎంత ప్రయత్నించినా ఏ వ్యక్తీ కులం 'ముద్ర'ను దాటలేకపోతున్నాడు. కానీ తనలోంచి కులభావనను సంపూర్ణంగా చెరిపేసుకుంటే కానీ ఏ వ్యక్తీ సంపూర్ణవ్యక్తిత్వవికాసాన్ని సాధించినట్టు కాదు. కాబట్టి ఇతర అంశాలలాగే కులభావన గురించి సైతం మనం నిర్మొహమాటంగా చర్చించుకోవాల్సి ఉంటుంది. సమన్వయం సాధించాల్సి ఉంటుంది.

'నాలుగు వర్ణా'లను గుణకర్మల ననుసరించి తానే సృష్టించానని భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఎటువంటి అపోహలకూ తావు లేకుండా స్పష్టంచేశాడు. శ్రీకృష్ణుడు జగన్నాథుడు. నిర్మోహి. రాగ ద్వేష, లోభ, మోహ, మద, మాత్సర్యాలన్నిటికీ అతీతుడు. సృష్టిలో ఏ పనీ తనది కాకున్నా, ఇతరులకు సరైన ఆదర్శాన్నిచ్చేందుకు తన కర్తవ్యాన్ని ఎటువంటి మోహం లేకుండా నిర్వహిస్తున్న వాడు.

*న మాం కర్మాణి లింపన్తి న మే కర్మఫలే స్పృహా ।*
*ఇతి మాం యోఽ భిజానాతి కర్మభి ర్న స బధ్యతే ॥*

స్వాభావికమైన ప్రకృతి గుణాలను అనుసరించి మానవులను నాలుగు వర్ణాలుగా విభజించానని చెప్పిన తరువాత శ్లోకం ఇది. ఆ శ్లోకం చివరలో 'కర్తనైనా తాను అకర్తనే' అన్నాడు. ఈ శ్లోకంలో 'కర్మలు నన్నంటవు. ఎందుకంటే కర్మల పట్ల నాకు అపేక్ష లేదు. ఈ రకంగా కర్మతత్త్వాన్ని అర్థం చేసుకుని నాగురించి తెలుసుకున్న వాడికి కర్మలు బంధన హేతువులు కావు' అంటాడు. అంటే, గుణం ఆధారంగా వర్ణవిభజన చేసిందీ దేవుడే. కానీ ఆ విభజన చేసినా కర్మఫలం దేవుడిది కాదన్నమాట.

కరుణామయుడు, మోహరహితుడు, కర్మఫలాసక్తి లేనివాడు చేసిన పనులలో ఎవరికో లాభం చేయాలని, ఎవరికో పెద్ద పీట వేయాలని, ఇంకొకరిని చిన్నబుచ్చాలనే పక్షపాతకుత్సితబుద్ధి ఉండదు. కాబట్టి శ్రీకృష్ణుడు చేసిన వర్ణవిభజనలోనూ ఎటువంటి అన్యాయాలు, అక్రమాలు, పక్షపాతాలు, వక్రధోరణులు ఉండే ప్రసక్తి లేదు. ఎవరికైనా అవి కనిపిస్తే, అది వారి దృష్టిదోషం తప్ప మరేమీ కాదు.

ప్రస్తుతం మన సమాజంలో అందరూ సమానమే. అందరికీ సమానావకాశాలు ఉన్నాయి. ఐనా సరే, గమనిస్తే, మనమూ మనకు తెలియకుండానే 'కుల' వ్యవస్థను ఏర్పరచుకున్నాం.

ఆఫీసుల్లో నాలుగు రకాల తరగతుల ఉద్యోగులుంటారు. పైస్థాయి ఆఫీసర్లు 'క్లాస్ వన్' ఉద్యోగులు. వారి కింది స్థాయివారు 'క్లాస్ టు' ఉద్యోగులు. క్లర్కులు 'క్లాస్ త్రీ' స్థాయివారు. అందరి కన్నా కింది స్థాయి ప్యూన్లు, బంట్రోతులు, స్వీపర్లు, 'క్లాస్ ఫోర్'కు చెందిన వారిది. దీంట్లో క్లాస్ 'ఫోర్' ఉద్యోగి 'క్లాస్ వన్' ఉద్యోగి ముందు నిలవాలంటేనే బెదురుతాడు. క్లాస్ త్రీకి, క్లాస్ టూ స్థాయి ఉద్యోగులంటే భయం. క్లాస్ వన్ జోలికి వెళ్లటం కష్టం.

ఇక, క్లాస్ ఫోర్, క్లాస్ వన్ అవటం కుదరదు. ఎంతో కష్టపడితే, క్లాస్ టూ కాగలడు. క్లాస్ ఫోర్ ఉద్యోగి సంతానం సాధారణంగా క్లాస్ ఫోర్ ఉద్యోగాలతో సంతృప్తి పడుతుంది. అదృష్టం బాగుంటే క్లాస్ త్రీ దొరికితే సంబరాలకు అంతుండదు.

క్లాస్ త్రీ ఉద్యోగి కూడా అంతే. అతని సంతానానికి క్లాస్ త్రీ ఉద్యోగం దొరికితే జన్మ ధన్యమైనట్టు భావించుకుంటాడు. అలాగే ఇతర క్లాసుల్లో కూడా. క్లాస్ వన్ ఉద్యోగి సంతానం దృష్టి అంత స్థాయి కన్నా తక్కువ ఉద్యోగాలపై పడదు.

మనం ఈ ఉద్యోగాలకు వ్యక్తులను పరీక్షల ద్వారా ఎంచుకుంటాం. ఆపై ఇంటర్వ్యూలు జరుపుతాం. దాన్ని బట్టి ఉద్యోగాలు ఇస్తాం. అంటే పరీక్షలు రాస్తున్నప్పుడే వ్యక్తి స్వచ్ఛందంగా ఓ స్థాయి ఉద్యోగాన్ని ఎంచుకుంటున్నాడన్నమాట. అతడి గుణకర్మలను బట్టి ఉద్యోగాలు ఇస్తున్నాం. అయినా సరే, ఈ ఉద్యోగాలు ఇవ్వటంలో బోలెడు అవకతవకలు జరుగుతున్నాయి. ఏ స్థాయి వారికి ఆ స్థాయి ఉద్యోగం వస్తోంది.

సినీనటుడి కొడుకు సినీనటుడవుతాడు. డాక్టరు కొడుకు డాక్టరవుతాడు. వాళ్లు తమ సంతానాన్ని ఇంజినీర్ చేస్తారు. ఇలా గమనిస్తూ పోతే మనకు తెలియకుండానే, మనం కొత్త వ్యవస్థ ఏర్పరచుకుంటున్నామనుకుంటున్నాం. కానీ శ్రీకృష్ణుడు సూచించిన పద్ధతిలోనే ఆ ఏర్పాటు జరుగుతోంది. తేడా అల్లా, ఒకప్పటి వ్యవస్థలోని శాంతిసౌఖ్యాలు ఇప్పటి వ్యవస్థలో కనబడటం లేదు.

ఏ వ్యవస్థలోనైనా 'పాలన' కోసం వ్యక్తులలో 'తరగతుల'ను ఏర్పరచటం తప్పనిసరి. అయితే వ్యక్తి ప్రతిభను బట్టి కిందితరగతివారు పైస్థాయిని చేరుకునే వీలుంటే ఆ వ్యవస్థలో వ్యక్తి అంతర్గతంగా, వ్యక్తికీ సమాజానికీ నడుమ సంఘర్షణ అవకాశాలు తక్కువ ఉంటాయి. గమనిస్తే, పూర్వకాలంలో సిద్ధాంతాల ఆధారంగా వాదాలు జరిగాయి. రాజ్యం కోసం పోరాటాలు జరిగాయి. కానీ కులాలు ఆధారంగా ఏ నాడూ ప్రజలు కొట్టుకోవటం జరగలేదు. ఎందుకంటే, అప్పటి కులవ్యవస్థ ఇప్పుడు మనం ఊహిస్తున్న తీరులో లేదు.

*బ్రహ్మార్పణం బ్రహ్మహవిః*
*బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ।*
*బ్రహ్మైవ తేన గన్తవ్యం*
*బ్రహ్మకర్మ సమాధినా ॥*

యజ్ఞం చేసేవాడు, హోమం చేసే ద్రవ్యాలు, వాటిని స్వీకరించే అగ్ని, అన్నీ పరబ్రహ్మ స్వరూపాలే. ఆ యజ్ఞఫలితం కూడా బ్రహ్మార్పణమే. ఇలా సర్వకర్మలూ యజ్ఞదృష్టితో చేయటమే బ్రహ్మ కర్మసమాధి నిష్ఠ, ఇలాంటి నిష్ఠ కలవాడే పరబ్రహ్మస్థితిని పొందుతాడు. ఈ శ్లోకానికి వేదాంత పరంగా అర్థం చెప్పుకోవచ్చు. యజ్ఞం అంటే మామూలు యజ్ఞాలుగా వివరణ ఇచ్చుకోవచ్చు. కానీ 'చాతుర్వర్ణ్యం' ప్రసక్తి వచ్చిన వెంటనే ఈ శ్లోకం చెప్పటంతో పైపై అర్థాన్ని విడిచి లోతుకు వెళ్లాల్సి ఉంటుంది. ఆ అర్థాన్ని నిత్యజీవితానికి అన్వయించుకోవాల్సి ఉంటుంది.

భారతీయతత్త్వం ప్రకారం యజ్ఞమంటే పలు అర్థాలు వస్తాయి. దాంట్లో మనిషి జీవితంలో 'ఊపిరి' పీల్చటం కూడా యజ్ఞమే. ఆహారం స్వీకరించటం యజ్ఞమే. దృశ్యాలు చూడటం యజ్ఞమే. మాట్లాడటం యజ్ఞమే. ఆలోచించటం యజ్ఞమే. చివరికి లైంగికచర్య కూడా యజ్ఞమే. 'ఓ సురవేణి నీ క్రతుహోమగుండమున నా జీవితమునే వ్రేల్చి' అంటాడు దేవరకొండ బాలగంగాధర తిలక్, 'అద్వితీయం' అనే కవితలో మార్మికంగా. దీన్ని బట్టి చూస్తే నిత్యజీవితంలో మనం సంకల్పితంగా, అసంకల్పితంగా చేసే ప్రతిచర్య కూడా యజ్ఞమే.

ఈ యజ్ఞంలో హోమం చేసే ద్రవ్యాలు, మన ఎదురుగా ఉన్న ముడిసరకులు. ఈ ప్రపంచంలో లభించే మట్టి, చెట్టు, గుట్ట, నీరు, గాలి – అన్నీ ఈ యుద్ధంలో హవిస్సులే. 'ఈశావాస్యం ఇదం సర్వం.' కాబట్టి అవన్నీ పరబ్రహ్మ స్వరూపాలే. వాటితో చేసే యజ్ఞఫలితం బ్రహ్మార్పణమే. కాబట్టి ఈ ప్రపంచంలో జీవి, ఏ పని చేసినా అది బ్రహ్మార్పణమే. దాంట్లో హెచ్చుతగ్గులు లేవు. ఉచ్చనీచాలు లేవు. సహ్యాసహ్యాలు లేవు. తాను చేస్తున్న పనిని బ్రహ్మార్పణంగా భావించి చేసే పనులలో హెచ్చుతగ్గులు ఉండే ప్రసక్తి లేదు.

ఈ విషయాన్నే ప్రతీకాత్మకంగా తరువాత రెండు శ్లోకాలలో వివరిస్తాడు. ఎవరి గుణాన్ని బట్టి, స్థాయిని బట్టి వారి కర్మలుంటాయి. కర్మలేవైనా కర్తృత్వభావన లేకుండా చేస్తే సత్ఫలితాన్నిస్తాయి. అలా కాక కర్తృత్వభావన ఉంటే అవి దుష్ఫలితాన్నిస్తాయి. అందుకే ఒకప్పుడు సమాజంలో ఉచ్చనీచాల భావనలుండేవి కావు. వ్యక్తిని కర్మల ఆధారంగా కాక గుణం ఆధారంగా గౌరవించేవారు. మహారాజులైనా అడవుల్లో ఆకులు, అలములు తింటూండే మునికి  సాష్టాంగ ప్రణామం ఆచరించేవారు. 'జ్ఞానం' ఉందని తెలిస్తే, రాజు మాంసం కొట్టేవాడి ముందు మోకరిల్లేవాడు. 'కులం'తో సంబంధం లేకుండా వ్యక్తులు తపస్సు చేసేవారు. జ్ఞానం సంపాదించి ప్రపంచానికి పంచేవారు. అవసరం వస్తే అందరూ కలిసికట్టుగా ఉండి ధర్మరక్షణ చేసేవారు. చరిత్రను గమనిస్తే, కులాల భేదభావాలు లేకుండా కలిసి దేశం కోసం పోరాడేవారు. ఈ నాటికీ భారతీయధర్మం సజీవంగా ఉందంటే, ఆ నాడు వ్యక్తులు కులభావనల కతీతంగా ధర్మం కోసం కలిసి పోరాడటం  వల్లనే!

అయితే, కాలక్రమేణా, అదీ గడచిన కొన్ని వందల ఏళ్లుగా, ముఖ్యంగా మధ్యయుగం తరువాత, దేశంలో కులవ్యవస్థ గట్టిపడింది. ఈ నాడు మనం అనుభవిస్తున్న 'కుళ్లు'

ఆరంభమైంది. సృష్టిలో ఏదైనా ఆరంభంలో ఉన్న స్వచ్ఛత తరువాతి కాలంలో ఉండదు. గంగానది సైతం హిమాలయాల పాదాల వద్ద ఉన్నంత స్వచ్ఛంగా తరువాత ఉండదు. అనేక ఉపనదుల కలయికతో, స్థానిక నైసర్గికపరిస్థితుల కనుగుణంగా మలినమౌతుంది. వీటి కన్నా ఎక్కువగా మనిషి దాన్ని మలినం చేస్తాడు. గంగానదికే ఆ గతి పడితే కులవ్యవస్థ గురించి వేరే చెప్పాలా? ఎలాగైతే కాలం చెల్లినదాన్ని పక్కన పడేస్తామో, అలా కులవ్యవస్థ స్వరూపాన్ని అర్థం చేసుకుని, అవసరం తీరిన మలినవస్త్రంలా సమాజం దాన్ని విసర్జించాలి. అసలు స్వరూపాన్ని గ్రహించక, చేసే దుర్వ్యాఖ్యానాలను, విపరీతార్థాలను వదిలేయాలి.

*అజ్ఞ శ్చాశ్రద్ధధానశ్చ సంశయాత్మావినశ్యతి ।*
*నాయం లోకోఽస్తి న పరో న సుఖం సంశయాత్మనః ॥*

స్వయంగా వస్తుతత్త్వం విచారించలేనివారు గురువాక్యంపై కానీ, శాస్త్రవాక్యంపై గాని నమ్మిక లేనివారు, అడుగడుగునా సంశయాలు కలిగితే నశిస్తారు. ప్రస్తుతం సమాజం తన పైన నమ్మకంలేని 'సంశయాత్మ స్థితి'లోకి జారుకుంటోంది. ఇటువంటి పరిస్థితులలో జ్ఞానమే సంశయాలను ఛేదించి నిష్కామకర్మకు దారి తీస్తుంది.

✣ ✣ ✣

# ఉపసంహారం

మానవుడిని ఇతరజీవుల నుంచి వేరు చేసేది ఆలోచన అని అందరికీ తెలుసు. ఈ ఆలోచన వల్లే ఇతర జంతువులకు లేని విచక్షణ మనిషికి ఉంది. అయితే ఈ ఆలోచన రెండు వైపులా పదునైన కత్తి వంటిది. ఒక వైపు మనిషిని విజ్ఞానార్జన వైపు మళ్ళిస్తూనే, మరో వైపు అతడిని పతనం వైపు తరుముతుంది. కాబట్టి ఆలోచనపై నియంత్రణ సాధిస్తే మనిషి విచక్షణతో ఉత్తముడవుతాడు. లేకపోతే పతనమై పశుప్రాయుడవుతాడు. మానవస్వభావంలోని ఈ వైచిత్రిని గమనించిన మన పూర్వీకులు వ్యక్తి తన జీవితాన్ని నియమబద్ధం చేసుకొని తాను సుఖంగా జీవిస్తూ, సమాజాన్ని సంతోషమయం చేసేందుకు కొన్ని ధర్మాలు ఏర్పరచారు. సూత్రాలను నిర్వచించారు. శాస్త్రాలను రచించారు. ప్రమాణాలు ఏర్పరచారు. జీవితాదర్శాలను ప్రకటించారు. ఆదర్శప్రాయమైన మార్గదర్శకాలను సూచించారు. అందుకే భారతదేశం ఉత్తమవ్యక్తిత్వానికి ప్రామాణికమై ఉన్నతవ్యక్తుల కాలవాలమైంది. అటువంటి సమాజం ఈ నాడు పాశ్చాత్యదేశాల నుండి దిగుమతి అవుతున్న వ్యక్తిత్వవికాస ఆదర్శాల వైపు వేలం వెర్రిగా ఆకర్షితమౌతోంది. ఆ ఆదర్శాలు ఆధారంగా విజయసూత్రాలను బోధించే వ్యక్తిత్వ డాక్టర్ల విలువ అధికమౌతోంది. వీధి వీధినా ఇటువంటి వ్యక్తిత్వవికాస డాక్టర్లు వెలుస్తున్నారు. విజయబోధన ఓ మహత్తరమైన వ్యాపారసాధనమైంది. కార్పొరేట్ ఉద్యోగులకు, జీవితంలో ఉన్నతస్థాయికి చేరాలనుకున్న వ్యక్తులకు, విద్యార్థులకు తమ విజయబోధనలు పెద్ద పెద్ద ఫీజులు తీసుకుని మరీ వినిపిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో, ఒక్క క్షణం ఆగి ఆలోచిస్తే, ప్రస్తుతపరిస్థితిలోని విషాదకరమైన చమత్కారం అర్థమౌతుంది.

చంకలో పిల్లనుంచుకుని ఊరంతా వెతుకుతున్నారన్న సామెత ఉంది. ప్రస్తుత పరిస్థితి ఆ సామెతను నిరూపిస్తుంది. భారతీయసమాజంలో వ్యక్తి శారీరకంగానో లేక మానసికంగా కూడా ఆరోగ్యవంతుడయ్యేందుకు ఓ పటిష్ఠమైన వ్యవస్థ ఉండేది. అడుగడుగునా వ్యక్తికి ఆరోగ్యకరమైన ఆలోచనలు కల్పించి, అతని జీవితాన్ని సరైన విధంగా తీర్చిదిద్దేందుకు దోహదపడే అంశాలను బాల్యం నుంచీ అందజేయటం జరిగేది.

మన పూర్వీకులు ధర్మానికి, నీతికీ నడుమ ఉన్న సున్నితమైన తేడాను స్పష్టంగా నిర్వచించారు. ధర్మం లేకున్నా నీతి, మానవుడికి మానవత్వం ఆపాదిస్తుందని గ్రహించి నీతికి పెద్ద పీట వేశారు.

ఆహారనిద్రా మైథునాలు జీవుల ధర్మాలు. అయితే పశువులను మానవుల నుండి వేరు చేసే అంశం నిగ్రహం అని స్పష్టంగా బోధించారు. ఈ నిగ్రహమే ధర్మంలో ప్రధాన పాత్ర వహిస్తుందని వివరించి నిగ్రహాన్ని ధర్మంలో భాగం చేశారు. ధర్మమన్నది మానవుడికి కుటుంబంతో, సంఘంతో, దేశంతో, జాతితో, ఇతరులతో గల సంబంధ బాంధవ్యాలను చక్కదిద్దుతుంది. ఇతరులను గౌరవిస్తూ, స్వార్థాన్ని తగ్గించుకుంటూ, త్యాగాన్ని పెంచి మానవజాతి అభ్యున్నతికి వలసిన గుణసంపద ధర్మం ద్వారా మానవుడికి లభిస్తుంది. అందుకే ధర్మావలంబన, నీతిపాలన మానవుడి కర్తవ్యాలు అని నిర్దేశించారు. పాశ్చాత్యులు నీతిని, ధర్మం నుంచి విడదీస్తారు. కానీ మన పూర్వీకులు ధర్మాన్ని, నీతిని వేర్వేరని సూచిస్తూ శబ్దానికి, అర్థానికి ఉన్న అవినాభావసంబంధం ధర్మానికీ, నీతికి ఉంటుందని, ఒకటి లేక మరొక దానికి మనుగడ లేదని, వ్యక్తి సంపూర్ణమానవుడుగా ఎదిగేందుకు ఈ రెండూ అత్యవసరమని గ్రహించారు. వ్యక్తి నీతిమయుడై, ధర్మనిష్ఠతో జీవితం గడిపేందుకు తోడ్పడే వ్యవస్థను సృజించారు. వివిధసంస్కారాలను నిర్దేశించారు. వ్యక్తిగతంగా, సామాజికంగా వ్యక్తి సమన్వయం సాధించి జీవితాన్ని శాంతిమయం చేసుకునేందుకు రాచబాటను సిద్ధపరచారు. అటువంటి సమాజం ఈ నాడు 'విజయం' నిర్వచనాన్ని మరచి, పూర్వీకులు అందించిన 'పసిడి'లాంటి ఆస్తిని విస్మరించి పాశ్చాత్యప్రభావంతో కృత్రిమమైన తళుకుబెళుకుల మోజులో పడుతోంది. ఇందుకు ప్రధాననిదర్శనం ఆధునికసమాజంలో చలామణిలో ఉన్న విజయసూత్రాలు.

వ్యక్తిత్వవికాసం, విజయసూత్రాలు, జీనియస్ అవటం ఎలా? ఆత్మవిశ్వాసం సాధించటం వంటి అంశాలను బోధించే ఆధునికపుస్తకాలను పరిశీలిస్తే, దాదాపుగా అన్నీ ఒకే అంశాన్ని విభిన్నరీతుల్లో బోధించడం కనిపిస్తుంది. స్ట్రెస్ మేనేజ్‌మెంట్ టెక్నిక్కులు, సుఖసాధన, ఆత్మవిశ్వాససాధన పుస్తకాలన్నీ ఒకే రకంగా కనిపిస్తాయి. ఈ పుస్తకాలన్నిటినీ విశ్లేషిస్తే అన్నిటిలో కనిపించేది ఒకటే అని అర్థమౌతుంది. ఓటమి గెలుపుకు తొలి మెట్టు అని, ఓటమితో నిరాశపడకూడదని బోధిస్తారు. మనసుని అదుపులో ఉంచుకోవాలని, ఆందోళనలు దాటాలని వివరిస్తారు. మాటలు మంత్రాల్లాంటివి కాబట్టి జాగ్రత్తగా మాట్లాడాలని సూచిస్తారు. మనస్సు అన్నిటికీ మూలం అని వివరిస్తూ, మనస్సును అదుపులో ఉంచుకొనేందుకు విధానాలను మన ముందుంచుతారు. లక్ష్యాన్ని

స్పష్టంగా నిర్ణయించుకొని ఆ లక్ష్యసాధన కోసం సరైన మార్గాన్ని ఎంచుకోవాలని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా క్రుంగిపోకుండా లక్ష్యం వైపు ప్రయాణించాలని ఉద్బోధిస్తారు. ఇందుకు పూర్తిగా చితికిపోయి పైకి వచ్చిన పాశ్చాత్య వ్యాపారవేత్తల జీవితాల నుండి ఉదాహరణలిస్తారు. అనేకపాశ్చాత్యుల కొటేషన్లిస్తారు. ఒక రకంగా చూస్తే వీళ్ళు చెప్పే ఏ అంశం కూడా తప్పు కాదు. ఏ అంశం కూడా మన జీవనవిధానానికి కొత్త కాదు. ఎందుకంటే ఈ నాడు ఈ వ్యక్తిత్వవికాసపుస్తకాలు, వ్యక్తిత్వవికాస డాక్టర్లు బోధిస్తున్నదంతా మన పూర్వికులు ఏర్పరచిన వ్యవస్థలో పొందుపరచి ఉంది.

భారతీయజీవనవిధానంలో వ్యక్తి ఎదుగుదల శిశువు గర్భంలో పిండరూపంలో ఉన్నప్పటి నుంచీ ఆరంభమౌతుంది. శిశువు గర్భంలో ఉన్నప్పుడు తల్లి ఆనందంగా ఉండాలి. సంతోషాన్ని అనుభవించాలి. ఆమెకు ఎటువంటి కష్టం రాకుండా చూసుకోవాలి. ఆమె అన్నీ మంచి మాటలే వినాలి. మంచి వాతావరణంలో ఉండాలి. మంచి ఆలోచనలు చేయాలి అని నిర్దేశించారు. ఈ అంశం సరిగ్గా అర్థమయ్యేందుకు పురాణాలలో రెండు కథలున్నాయి. ఒకటి రాక్షసుడి పుత్రుడైనా, గర్భంలో ఉన్నప్పుడే విష్ణుకథలు వింటూ జన్మించి విష్ణుభక్తుడైన ప్రహ్లాదుడి కథ. మరొకటి గర్భంలో పద్మవ్యూహఛేదనరహస్యాన్ని గ్రహించి జన్మించిన అభిమన్యుడి వృత్తాంతం. ఈ రెండు కథల్లో ఒక సూక్ష్మమైన తేడా ఉంది. విష్ణుభక్తుడైన ప్రహ్లాదుడు రాక్షసుడైనా చిరంజీవి అయి సత్క్రమపాలనతో ధర్మాన్ని నిర్వర్తించి ఆదర్శప్రాయుడయ్యాడు. అర్జునుడి పుత్రుడైన అభిమన్యుడు, యుద్ధవిశేషాలు వినటంతో చిన్న వయసులోనే యుద్ధంలో మరణించాడు. శిశువు వ్యక్తిత్వ వికాసమే కాదు, భవిష్యనిర్దేశం కూడా గర్భస్థదశ నుంచే ఆరంభమవుతుంది. ఇది గ్రహించి శిశువు ఆరోగ్యకరంగా ఈ లోకంలో అడుగిడేందుకు సరైన మార్గం సూచించారు మన పూర్వికులు. ఇక జన్మించినప్పటి నుంచీ శిశువు మానసికారోగ్యం సత్క్రమరీతిలో అభివృద్ధి చెందేందుకు పటిష్ఠమైన వ్యవస్థను నిర్మించారు.

ఆధునికమానసికశాస్త్రం ప్రకారం శిశువు జీవితంలో మొదటి సంవత్సరం అత్యంతప్రాధాన్యాన్ని వహిస్తుంది. భవిష్యత్తులో అతడి ఆలోచనను నిర్దేశించే అనేక అంశాలు ఈ వయసులో అతడి మెదడులో నిక్షిప్తమౌతాయి. ఆ తర్వాత అతని జీవితం మొత్తం బాల్యావస్థలో గ్రహించిన విషయాల నిగ్గు తేల్చుకుని ప్రతిస్పందించటమే ఉంటుంది. తల్లిదండ్రులపై పిల్లవాడి నమ్మకం అతడి ఆత్మవిశ్వాసమౌతుంది. వారి సఖ్యం అతని శాంతి అవుతుంది. వారు నేర్పిన అంశాలపై విశ్వాసం అతడి ఆత్మబలమౌతుంది. అలా కాక కుటుంబ వాతావరణంలోని, కలతలు, క్రోధాలు, ఆవేశాలు శిశువులో ఆందోళన

కలిగిస్తాయి. తెలియని అశాంతిని సృష్టిస్తాయి. అతడిలో అభద్రతాభావాన్ని కలిగించి, భవిష్యత్తులో అతడికి కలిగే అనేక అనర్థాలకు కారణమౌతాయి. ఇది గ్రహించే మన వ్యవస్థలో శిశువు జననం ఓ అద్భుతమైన ఘటనగా నిర్దేశించటం జరిగింది. శిశువు జననం సంబరాలకు దారి తీస్తుంది. బంధువులంతా సంతోషంగా కలిసేందుకు కారణమౌతుంది. ప్రతివారూ శిశువుపై వాత్సల్యం కురిపిస్తారు. ఎత్తుకుని ముద్దాడుతారు. లాలిస్తారు. పాటలు పాడి ఆనందం కలిగిస్తారు. శిశువును ఉయ్యాల్లో ఊపుతూ 'రామా లాలీ' అంటూ గానం చేస్తారు. అంటే తన తల్లిదండ్రుల జీవితంలో తానొక 'అద్భుతం' అన్న భావన శిశువుకు కలుగుతుంది. వారు పాడే పాటల వల్ల సంగీతజ్ఞానం కలుగుతుంది. సాహిత్యంపై మక్కువ కలుగుతుంది. బంధువులలో కలసిమెలసి తిరగటం, ఆడటం అతడికి సామాజికజీవనం నేర్పుతుంది. ఆపై బామ్మల దగ్గర, తాతయ్యల దగ్గర వినే పౌరాణికగాథలు అతడికి ఉత్తమాదర్శాలు నేర్పుతాయి. రావణాసురుడిలా చెడు పనులు చేసేవారు విలన్లని, చెడును నిర్జించి మంచిని పెంచే రాముడు 'హీరో' అని అర్థమౌతుంది. ఎవరైనా 'హీరో' కావాలని అనుకుంటారు కానీ విలన్ కావాలని అనుకోరు కదా! అందుకే పసితనంలోనే పిల్లలకు ఉత్తమ వ్యక్తులను పరిచయం చేసి, ఉత్తమాదర్శం నిలపటం జరుగుతుంది. కాస్త ఊహరాగానే జానపదగాథలు, మాయలు, మంత్రాల కథలు అతడి ఊహాశక్తికి పదును పెడతాయి. అతనిలో సాహసగుణం పెంచుతాయి. ఇదే సమయంలో తల్లి నేర్పే సుమతీ శతకాలు, వేమన పద్యాలు అతడికి నీతి నియమాలు నేర్పుతాయి. సామాజికమనస్తత్త్వాన్ని పరిచయం చేస్తాయి. 'ఎప్పుడు సంపద కల్గిన' 'వినదగు నెవ్వరు చెప్పిన', 'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' 'వేరుపురుగు చేరి వృక్షంబు చెరచును' వంటి అనేకపద్యాలు అతడికి సమాజంలో మనుషులను గుర్తించటం నేర్పుతాయి. మంచిచెడులపై అవగాహన కలిగిస్తాయి. తల్లి దండ్రి, గురువు దైవాలని, వారిని గౌరవించటం వ్యక్తి కర్తవ్యమని బోధిస్తాయి. అంటే శిశువు సామాజికజీవనం ఆరంభమై, అతని వ్యక్తిత్వం ఎదిగే లోపలే శిశువుకు అవసరమైన అనేక అంశాల బోధన జరిగిపోతోంది. పాఠశాల అన్నది 'అఆ'లు నేర్పే కర్మాగారం కాదు. వికసిస్తున్న వ్యక్తిత్వానికి దిశను కల్పించే దేవాలయం అన్న భావన పిల్లల్లో కలుగుతుంది. అంటే తీగకు పాకేందుకు సరైన పందిరి నిర్మాణం పిల్లవాడి మనసు ఎదిగే (ఫార్మాటివ్) సమయంలోనే జరుగుతోందన్న మాట.

వ్యక్తి తల్లిదండ్రుల సామాజికస్థాయితో సంబంధం లేకుండా విద్యాబోధన చేసే వ్యవస్థ మనది. వ్యక్తిలోని జిజ్ఞాసను గుర్తించి దాన్ని పెంచి ప్రోత్సహించే వ్యవస్థ ఉండేది. అందుకే ప్రజాపతి వద్ద విద్య నేర్చుకునేందుకు రాక్షసులు, దేవతలు వెళ్తే, ఇద్దరికీ

సమానంగా జ్ఞానబోధ చేశాడు గురువు. వాళ్ళు కూడా గురువు మాటలను పాటించారు. ఆత్మజ్ఞానం గ్రహించుకుని ఆదేశించిన గురువు ఆదేశాలను పాటించారు. దేవతలలో ఇంద్రుడు, రాక్షసులలో విరోచనుడు మిగతావారికి భిన్నంగా ఆలోచిస్తే, వారిలో మరిన్ని ఆలోచనలు ప్రేరేపించి సత్యదర్శనమార్గం సూచించాడు గురువు. వారికి ఆత్మ గురించి కొన్ని అంశాలు గ్రహింపుకు రాగానే సంతుష్టులై వెళ్ళిపోతూంటే 'అనుపలభ్యాత్మాన మన సువిద్య, వ్రజతో యతర ఏతదుపనిషదో భవిష్యన్తి దేవావాసురా వాతె పరాభవిష్యన్తి' అనుకుంటాడు. నీటిలో తమ ప్రతిబింబాన్ని చూసి అదే ఆత్మ అని సంతృప్తిపడి అసమగ్ర విజ్ఞానంతో వెళ్ళిపోతున్నవారు, దేవతలైనా పరాజితులవుతారు అన్నది సత్యం. అందుకే దేహమే ఆత్మ అని భావించి దేహాన్నే పూజించేవారు, దేహసౌఖ్యాలే సర్వమని భావించేవారు రాక్షసులయ్యారు. అలా కాక సగం దూరం వెళ్ళి 'దేహమే ఆత్మ ఎలా అవుతుం'దని తర్కించి తిరిగి వచ్చి జ్ఞానాన్ని మథించిన సాధించిన ఇంద్రుడు' దేవత అయ్యాడు. ఛాందోగ్యోపనిషత్తులోని ఈ కథ భారతీయజీవనవిధానంలో విజ్ఞానానికి, విజ్ఞాన సముపార్జనలో వ్యక్తినిష్ఠకు, గురువు పాత్రకు దర్పణం పడుతుంది. అంటే, గురువు అందరికీ ఒకేలా బోధించినా అతని సంస్కారాన్ని బట్టి విద్యార్థి విజ్ఞానాన్ని గ్రహిస్తాడని, సాధించిన విజ్ఞానంతో సంతృప్తి పడక, ప్రశ్నించి, శోధించేవాడు ఉత్తముడనీ మన అభిప్రాయం. అందుకే వ్యవస్థలో గురువుకు అంత ప్రాముఖ్యం. అందుకే మన చదువులలో 'ఓం భద్రం కర్ణేభి శ్రుణు మాయదేవా' (అన్ని శుభాలీయాలి), 'సహనావవతు' వంటి మంచి ఆలోచనలకు పెద్ద పీట వేశారు. మంచి వినాలి, మంచి చేయాలి, మంచి పనులు చేస్తూ నూరేళ్ళు బతకాలి, అందరూ శాంతిగా, హాయిగా బతకాలి, ప్రపంచమంతా ఈశ్వరమయం, నీది కాని దాని కోసం ఆశపడకు, అన్న ఆలోచనలు చిన్నప్పటి నుంచీ బోధిస్తూంటే పిల్లవాడికి అది జీవనవిధానం అవుతుంది. ఇదే సమయంలో అతడికి భగవద్గీత పరిచయమౌతుంది.

ప్రపంచంలోని పుస్తకాలన్నీ అదృశ్యమైపోయినా ఒక్క భగవద్గీత మిగిలితే చాలు. ఇంకేమీ అవసరం లేదంటాడు మహాత్మాగాంధీ. మానసికతత్త్వశాస్త్రం, ఆధ్యాత్మికం, నైతికవిలువలు....వెరసి ఒక మనిషి మనీషిగా, ఎదిగి ఉత్తమవ్యక్తిత్వంతో అలరారేందుకు అవసరమైన అంశాలన్నీ భగవద్గీతలో లభ్యమౌతాయి. జీవితానికి పునాది అయి, ప్రాణాధారం వంటి తత్త్వజ్ఞానం లభిస్తుంది. ఆ తత్త్వజ్ఞానాన్ని జీవితరంగంలో క్రియారూపంలో అనువర్తించే మార్గం లభిస్తుంది. నిత్యకృత్యాలలో ఎదురయ్యే చిన్న చిన్న సందేహాల నుండి క్లిష్టసమస్యల పరిష్కారం వరకూ అన్నీ భగవద్గీతలో లభిస్తాయి. అందుకే వ్యక్తి ఊహ ఎదిగి, వ్యక్తిత్వం స్థిరపడే సమయంలో గీతాపఠనం అతని ఎదుగుదల

కొక దిశ కల్పిస్తుంది. ప్రపంచంలో మనిషి జన్మకు అర్థం తెలిపి, ఆ జన్మను సార్థకం చేసుకునేందుకు మార్గం చూపిస్తుంది. తాత్కాలిక సత్యం, శాశ్వతసత్యాలను గుర్తించటం నేర్పుతుంది. క్షణికావేశాలు, ఆకర్షణలను గుర్తించి నిజమైన భావనలను గుర్తించే విచక్షణను నేర్పుతుంది. అంటే, శిశువు గర్భంలో ఉన్నప్పటి నుంచీ మంచి మాటలు నేర్పుతూ, జన్మించిన తరువాత మంచి ఆలోచననిస్తూ, ఎలాగైతే మొక్క ఎదిగి, తీగలా సరైన దిశలో పాకేట్టు సమాజం జాగ్రత్తలు తీసుకుంటూ వస్తుందో, ఇప్పుడు చెట్టు, వృక్షమయ్యే సమయంలో భగవద్గీత సరైన దిశాదర్శనం చేస్తుందన్నమాట. ఈ జ్ఞానంతో సమాజసాగరంలో అడుగిడిన వ్యక్తి ఆత్మవిశ్వాసంతో, విచక్షణతో తాను విజయుడవటమే కాక సమాజాన్ని విజయం దిశలో నడిపిస్తాడు. ఇది మన భారతీయ, వ్యవస్థలో వ్యక్తి విజయం కోసం స్వాభావికంగా ఏర్పరచిన బాట. అయితే ఈ బాటను విస్మరించి, ఈ జీవనవిధానాన్ని తృణీకరించటం వల్ల ఈ నాడు మనకు కృత్రిమ అవయవాల వంటి పాశ్చాత్యప్రభావిత వ్యక్తిత్వవికాస డాక్టర్ల ఆలోచనలు అవసరం అవుతున్నాయి.

ప్రస్తుతవ్యవస్థలో భార్యభర్తలిద్దరికే కలసి జీవనం సాగించే ఓపిక ఉండటం లేదు, ఇక పెద్ద బంధుగణంతో కలసి జీవించే సహనం ఉండే పరిస్థితి లేదు. దాంతో జన్మించటం తోటే పసిపిల్లవాడికి లభించే 'భద్రత కవచం' లేకుండాపోయింది. భార్యభర్త లిద్దరూ తప్పనిసరిగా ఉద్యోగాలు చేయాల్సి రావటంతో, చివరి క్షణం వరకూ గర్భవతి అయిన స్త్రీ ఉద్యోగానికి వెళ్ళాల్సి వస్తోంది. దాంతో వాతావరణం ప్రసక్తి రావటం లేదు. మామూలు ఉద్యోగాలు, చిరాకులు, ఉద్విగ్నతలు తల్లితో పాటు గర్భంలో పిల్లవాడూ అనుభవించాల్సి వస్తోంది. ఇక పిల్లవాడు పుడుతూనే ఓ 'సమస్య' అవుతున్నాడు. తల్లిదండ్రుల జీవితంలో 'అద్భుతం' కావాల్సిన పిల్లవాడి ఆలనపాలనలు బరువైపోవటంతో, పిల్లవాడు పని సమయాల్లో 'అనాథ'లా క్రచ్‌లలో ఉండాల్సి వస్తోంది. సుమతీ శతకాలు, లాలిపాటలు, జోలపాటలు పాడే ఓపిక, తీరికలు ఎవరికీ ఉండకపోవటంలో ఆశ్చర్యం లేదు. పైగా ఇది టీవీల యుగం కావటంతో, వ్యాపార విలువలే ప్రధానం కావటంతో పిల్లవాడికి సినీ పాటలే సుమతీ శతకాలవుతున్నాయి. రీమిక్స్‌లు జోలలవుతున్నాయి. కార్టూన్లు, క్రైమ్ నాటకాలు పురాణాలవుతున్నాయి. అంటే, జీవితమంటే ఏమిటో తెలియకనే, ఈ ప్రపంచంలో తన పాత్ర ఏమిటో ఆలోచన లేకుండానే, అత్యంత అశాంతితో, అభద్రతా భావంతో, పిల్లలు ప్రపంచంలోకి అడుగిడుతున్నారు. దీనికి తోడు విజయం అంటే 'డబ్బు సంపాదన' అన్న భావం సమాజంలో స్థిరపడింది. పాఠశాలల్లో నైతికవిలువల బోధన కొరవడింది. డబ్బును బట్టి చదువు లభ్యమౌతుంది. అదీ ఉద్యోగసంపాదన చదువు తప్ప, మనిషికి వ్యక్తిత్వాన్నిచ్చే చదువు కాదు. దాంతో విచక్షణ అన్నది అదృశ్యం

అవుతోంది. ఇటువంటి పరిస్థితులలో మనకు మానసిక డాక్టర్లు, వ్యక్తిత్వవికాస కౌన్సిలర్లు అవసరమౌతున్నారు. అంటే కోకిల కాకి అయ్యే ప్రయత్నాలు చేస్తూండటంతో, ప్రస్తుతం కాకి కోకిలకు 'పాట' నేర్పుతోందన్న మాట! ఎప్పుడైతే ఈ సత్యం అర్థమౌతుందో, భారతీయులు తమ అసలు స్వరూపాన్ని గ్రహిస్తారో, అప్పుడే వ్యక్తిత్వవికాసం ఓ కొనుక్కునే అంశం కాక జీవన విధానంలో భాగమౌతుంది. యువతీయువకులు మన సంస్కృతీ సంప్రదాయాల మీద గౌరవంతో సమాజాన్ని ఉచ్ఛస్థితి వైపు నడిపిస్తారు. అందుకే అంటారు – 'సింహం నిద్ర లేచేంత వరకే నక్కల ఆటలు' అని. కానీ ప్రశ్న అల్లా – సింహం నిద్ర లేచేదెప్పుడు? అని.

ఉత్తిష్ఠత జాగ్రత ప్రాప్యవరాన్‌నిబోధత

(లేవండి! మేల్కోండి! లక్ష్యం సాధించేవరకు విశ్రమించకండి!)

✣ ✣ ✣

## ఈ గ్రంథ రచనకు ఉపకరించిన గ్రంథాలు


1. ఋగ్యజుస్సామ వేదాలు
2. ఉపనిషత్తులు
3. వాల్మీకి రామాయణం
4. వ్యాస భారతం
5. బ్రహ్మ పురాణం
6. భగవద్గీత
7. మనుస్మృతి
8. కుమార సంభవం
9. రఘువంశం
10. మాళవికాగ్నిమిత్రం
11. భర్తృహరి సుభాషితాలు
12. సంస్కృత నీతి సూక్తులు
13. కవిత్రయ భారతం
14. పోతన భాగవతం
15. విప్రనారాయణ చరిత్ర (సారంగు తమ్మయ్య)
16. వేమన శతకం
17. సుమతీ శతకం
18. భాస్కర శతకం
19. శరత్‌జ్యోత్స్న (గుంటూరు శేషేంద్ర శర్మ)
20. అద్వితీయం (దేవరకొండ బాలగంగాధర్ తిలక్)
21. మహాప్రస్థానం (శ్రీశ్రీ)

ఇలా అనేక గ్రంథాలు, కొన్ని సినిమా పాటలు.

## రచయిత ఇతర రచనలు

**నవలలు**

అసిధార

అంతర్మథనం

మర్మయోగం

**కథలు**

4×5

జీవితం–జాతకం

కల్హణ కశ్మీర రాజతరంగిణి కథలు

షాడో యూనివర్స్ నీడలో (సైన్స్ ఫిక్షన్ కథలు)

రియల్ స్టోరీస్

**కాల్పనికేతర రచనలు**

తీవ్రవాదం

అక్షరాంజలి

పాప్ ప్రపంచానికి రారాజు – మైకెల్ జాక్సన్

భారతీయ తత్త్వ చింతన – ఒక లఘు పరిచయం

# భారతీయ వ్యక్తిత్వ వికాసము

కస్తూరి మురళీకృష్ణ

వేదాలు, ఉపనిషత్తులు,
పురాణాలు, భగవద్గీత, సుమతీ, భాస్కర,
వేమన శతకాల ఆధారంగా 'భారతీయ వ్యక్తిత్వ
వికాసా'న్ని విశ్లేషిస్తూ, వివరిస్తూ రచించిన వ్యాసాల
సంకలనం ఈ పుస్తకం. భారతీయ సాహిత్యం వ్యక్తిత్వ వికాస
సాగరం. ఆ సాగరంలో శోధించి సాధించిన కొన్ని మణుల
సంకలనం ఈ పుస్తకం. ఈ పుస్తక పఠనం ద్వారా భారతీయ
సాహిత్య సాగరం లోతులలో విహరించాలన్న జిజ్ఞాస
కనీసం ఆ సాగర జల ప్రవాహాన్ని స్పృశించాలన్న
కోరిక, ఆసక్తి ఏ ఒక్కరికి కలిగినా ఈ ప్రయత్నం
విజయవంతమైనదిగా భావిస్తాము.

ఎమెస్కో బుక్స్